# పొన్నియిన్ సెల్వన్
(Ponni's Beloved)

## భాగము - 3

## మారణ ఖడ్గం

# అధ్యాయము - 1

## కోడిక్కరైలో

**కడలిలో** వీచిన సుడిగాలి చోళనాడు సముద్రతీరంలోకి చొచ్చుకొని అతివేగంగా వెళ్ళింది. అది వెళ్ళిన దారంతా కల్లు తాగిన కోతి వెళ్ళే దారిలో అడవులు ఎలా ధ్వంసమవుతాయో అలా ఆ సుడిగాలి వెళ్ళిన దారి పొడుగునా అతి భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. కోడిక్కరై నుంచి కావేరి పట్నం వరకు చోళనాడు సముద్రతీరం వెంబడి వాయు భగవానుని లీలలు గోచరించాయి. ఎన్నో చెట్లు కూకటి వేళ్ళతో పెకలించుకొని కూలిపోయాయి. మరెన్నో చెట్ల కొమ్మలు విరిగాయి. కొన్ని చెట్లను సుడిగాలి అమాంతం ఎత్తి దూరంగా పడేసింది. గుడిసెలు నేలమట్టమయ్యాయి. కోడిక్కరై ప్రాంతంలో ఎక్కడ చూసినా వరదమయం. సముద్రం ఉప్పొంగి భూమిలోపలికి చొచ్చుకొని వచ్చేసిందా అన్నట్లు అనిపించింది. కానీ భూభాగానికి, సముద్రానికి మధ్యనున్న ఇసుక ప్రదేశం అది నిజం కాదన్న విషయాన్ని ఎత్తి చూపిస్తూంది. ఆ ఇసుక ప్రదేశంలో బురద/ఊబి ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడు ఎక్కువ నీరు నిలిచివుంది. అటువంటి చోట్ల ఇప్పుడు మనుషులు గాని, మృగాలు గాని కాలు పెడితే జీవసమాధే! ఏనుగులను కూడ ఆ ఊబులు మింగేసి త్రేన్చేస్తాయి!

సుడిగాలి వీచిన రెండురోజుల తర్వాత కోడిక్కరైకి పెద్ద పళువేట్టరయ్యర్ తన పరివారాలతో వచ్చి చేరారు. పల్లకి కూడ వెంబడే వచ్చింది. కానీ ఇప్పుడు ఆ పల్లకిలో యువరాణి నందినే ప్రయాణం చేస్తూంది. మధురాంతకుని రహస్యంగా తీసుకొని వెళ్ళవలసిన అవసరం ఇక లేదు. పైగా కొన్నిసార్లు ఆ పల్లకిలో యువరాణిని తీసుకొని వెళ్తేనే కద మళ్ళీ మధురాంతకుని తీసుకొని వెళ్ళడానికి వీలవుతుంది? ఇలా నందిని చెప్పగా పెద్ద పళువేట్టరయ్యర్ ఉత్సాహంగా ఒప్పుకొన్నారు. కామాంధకారంలో మునిగివున్న ఆ ముసలాయనకు తమతో ఆ భువన సుందరిని తీసుకొని వెళ్ళడంలో ఆసక్తి కనబరచడం సహజమే కద?

సుడిగాలికి ముందు వారు నాగపట్టణానికి వచ్చారు. అక్కడ ధనాధికారి మొదట తమ ఉద్యోగాన్ని నెరవేర్చారు.

~

నాగపట్టణం అనాటి తమిళదేశంలోని ముఖ్యమైన ఓడరేవుల్లో ఒకటి. విదేశాల్లోనుంచి ఎన్నెన్నో సరుకులు పెద్దపెద్ద ఓడల్లో వచ్చి అక్కడ దిగేవి. ఆ సరుకులను వేలకొద్ది చిన్న చిన్న పడవలు తీరానికి తీసుకొని వచ్చి చేర్చేవి. తీరంనుంచి మార్పిడి వస్తువులను/సరుకులను తీసుకొని వెళ్ళి ఆ ఓడల్లోకెక్కించేవి. వీటన్నిటిమీద సుంకం విధించి వసూలు చేసే అధికారులు పలువురు ఉండేవారు. వారు సరిగ్గా

పనిచేస్తున్నారో లేదో పర్యవేక్షించడం చోళదేశపు ధనాధికారి పళువేట్టరయ్యర్ హక్కు, బాధ్యత కూడాను కద?

ఆ పని పూర్తయిన తర్వాత నాగపట్టణంలో పేరుగాంచిన చూడామణి బౌద్ధవిహారానికి విజయం చేశారు. భిక్షువులు ఆయనను ఉచితరీతిన స్వాగతించి ఉపచారాలు చేశారు. విహారానికి ఏదైన కావలసివుందా, భిక్షువులకు ఏదైనా కొరతలున్నాయా అని విచారించారు. అటువంటిదేమీ లేదని వారు తెలియజేసి, సుందర చోళ చక్రవర్తికి తమ కృతజ్ఞతలను తెలియజేశారు.

కొన్నాళ్లకు మునుపు ఈ విహారానికి చెందిన ఇద్దరు భిక్షువులు చక్రవర్తిని చూసేందుకు తంజావూరుకు వచ్చారు. బుద్ధ సంఘం తరఫున చక్రవర్తి త్వరలో కోలుకోవాలని తమ దీవెనలను తెలియజేశారు. అప్పుడు యువరాజు అరుళ్మొళివర్మ లంకలో బౌద్ధధర్మానికి చేస్తున్న సేవలను గురించి తాము మెచ్చుకొని చెప్పుకోవడం గురించి తెలియజేశారు. విరిగిపడ్డ, పాడుపడ్డ,శిధిలమైన విహారాలను పునర్నిర్మించాలని ఆజ్ఞాపించడమేగాక దాన్ని నెరవేర్చుకొని రావడం గురించి లంకలోని బౌద్ధభిక్షువుల మహాసంఘానికి ఎనలేని సంతోషాన్ని కలుగజేసిందని కూడ తెలియజేశారు. "చక్రవర్తీ! ఇంకొక సంతోషకరమైన విషయం కూడ మేము వింటున్నాము. లంకారాజ్యపు పురాతన సింహాసనంపైన తమ చిన్న కుమారుని అధిష్టింపించి ఆయనకే లంకారాజ్య పట్టాభిషేకం చేయాలని బుద్ధసంఘంలో పలువురు భిక్షువులు చెబుతున్నారట! అలా తమలో తాము మాట్లాడుకొంటున్నారట! దీని కన్న మన యువరాజు గొప్పతనానికి ఇంకేం సాక్ష్యం కావాలి!" అన్నారు.

~

ఇది వింటున్న పెద్ద పళువేట్టరయ్యర్ మనసులో ఒక అపూర్వమైన ఆలోచన ఉదయించింది. భిక్షువులు వెళ్ళిన తర్వాత దాన్ని చక్రవర్తికి తెలియజేశారు.

"ముల్లోకాలనేలే దేవా! తమ అధికారం అష్టదిక్కులా విస్తరించింది. ఈ విశాల భూమండలంలో మీ ఆజ్ఞకు తలవొగ్గని వారు ఎవ్వరూ లేరు. కానీ తమ కుమారులు ఇద్దరు మాత్రం అందుకు బాహ్యంగానే ఉన్నారు. వారికి దుర్బుద్ధి నేర్పిస్తున్నవారే ఈ చోళసామ్రాజ్యంలో పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారు. ఆదిత్య కరికాలన్ మీ కోరిక ప్రకారం ఇక్కడికి రావడానికి బదులు తమరే కంచికి రావాలని తాళపత్ర సందేశాలు రాసి పంపిస్తున్నారు. ఆయనకు అలాంటి దుర్బుద్ధి నేర్పిస్తున్నవారు ఇంకెవరో కాదు; తమ మామగారైన తిరుక్కోవలూర్ మలైయమాన్ గారే. అలాగే లంక నుంచి తమ చిన్న కుమారుని తిరిగి రమ్మని చాలసార్లు చెప్పి పంపించారు. నేను కూడ మనుషులను పంపి, పంపి అలిసిపోయాను. మన మనుషులు యువరాజును కలవకుండ, మనం రాసి పంపుతున్న తాళపత్ర సందేశాలు ఆయనకు చేరకుండ ఆ కొడుంబాళూర్ వేళార్ చేస్తున్నారు. లేకపోతే తమ సుపుత్రుడు తమ కోరిక తెలిసికూడ ఇన్నాళ్ళు ఇక్కడికి తిరిగి రాకుండ ఉంటారా? ఆలస్యం చేస్తారా? ఈ పరిస్థితిలో నాకు ఒక ఉపాయం తోస్తోంది. మీరు ఆజ్ఞాపిస్తే దాన్ని తెలియజేస్తాను" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

చక్రవర్తి సమ్మతం తెలియజేయగా, ధనాధికారి ఇలా చెప్పారు: "లంకాసింహాసనాన్ని ఆక్రమించుకొని పట్టం కట్టుకోవడానికి కుట్ర చేస్తున్నట్లు నింద మోపి, యువరాజును చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞాపత్రం రాసి పంపుదాం. అటువంటి ఆజ్ఞను బూది విక్రమకేసరి అడ్డగించలేరు. ఎలాగైన ఆజ్ఞాపత్రాన్ని యువరాజుకు చేరవేసేస్తే, యువరాజు తప్పకుండ వచ్చి తీరుతారు!"

చక్రవర్తి పెదవులపైన ఒక చిరునవ్వు విరిసింది. విచిత్రమైన ఆలోచనే; కానీ ఒకసారి ఎందుకు ప్రయత్నించి చూడకూడదు? పొన్నియిన్ సెల్వన్ని చూడాలన్న ఆశ ఆయన మనసులో తరచూ బలంగా తలెత్తుతోంది. తమ అంతిమకాలం దగ్గరవుతోందని ఆయన గ్రహించారు. కాబట్టి తమ ప్రియపుత్రుని వద్ద తమ మనోరథాన్ని తెలియజేయాలుకొన్నారు. మధురాంతకునికే తంజావూరు సింహాసనాన్ని ఇవ్వాలన్న తమ కోరికను అరుళ్మొళి తెలుసుకొంటే బదులు చెప్పక ఒప్పుకొంటాడు. తర్వాత వాడి మూలంగా ఆదిత్య కరికాలన్ మనసు మార్చడం సులభమవుతుంది.

చక్రవర్తి ఇలా ఆలోచించి, ధనాధికారి ఉపాయానికి తమ ఆమోదాన్ని తెలియజేశారు. ఆవిధంగానే యువరాజు అరుళ్మొళి వర్మను చెరపట్టి బంధించి తీసుకొని రావాలని ఆజ్ఞ పంపబడింది. యువరాజుకు ఎటువంటి హాని కలగకూడదని నౌకాధిపతికి ఆజ్ఞ ఇవ్వడమైంది.

~

పైన వివరించినట్లు రెండు ఆజ్ఞాపత్రాలతో రెండు పెద్ద ఓడలు లంకకు బయలుదేరి వెళ్ళిన తర్వాత పళువేట్టరయ్యర్‌కి కాస్త దిగులు కలిగింది. యువరాజుకేమైనా అయితే తమమీద నింద పడుతుందని గ్రహించారు. కాబట్టి తామే నాగపట్టణం రేవుకు వెళ్ళి యువరాజును తగిన రీతిన ఆహ్వానించి తమ సొంత బాధ్యతమీద ఆయనను తంజావూరుకు తీసుకొని రావాలనుకొన్నారు.

ఈ ఆలోచనకు ఇంకా కొన్ని ఉపకారణాలు కూడ ఉన్నాయి. యువరాజు తంజావూరుకు వచ్చి చక్రవర్తిని చూసేందుకు మునుపు శెంబియన్ మహాదేవిని గాని, కుందవైని గాని చూసేందుకు అవకాశమివ్వకూడదు. ఆ స్త్రీలిద్దరూ యువరాజుమీద చాల ప్రభావం కలిగినవారు; పళువేట్టరయ్యరంటే అయిష్టపడేవారు. కాబట్టి యువరాజుకేమైన చెప్పి ఆయన మనసును చెడగొట్టేస్తారు. తగిన సమయం వచ్చేలోపు, అంటే సుందర చోళ చక్రవర్తి మరణించేలోపు, ఏదైనా అనుకోనిది జరిగి, కార్యం చెడిపోవచ్చు.

అయినా కూడ, బొక్కసపు నేలమాళిగ మార్గంలో కాపలాదారుని చేత గందమారన్ వెన్నుపోటు పొడవబడినప్పటినుంచి ధనాధికారి మనసులో ఏవేవో విపరీత సందేహాలు పుట్టనారంభించాయి. ఆ సొరంగ మార్గంలో ఎవరైనా దాక్కొని ఉండడానికి అవకాశముందా? అది ఎవరై ఉండవచ్చు? తంజావూరు కోట కాపలాదారుల చేతికి చిక్కకుండ తప్పించుకొన్న ఆ వాణర్ కుల వీరుడు కావచ్చా? అలాగైతే అతగాడింకా ఎన్నో రహస్యాలు తెలుసుకొని ఉండడం సాధ్యం కద?

చిన్న పళువేట్టరయ్యర్ చెబుతున్నట్లు నందినిని చూడడానికి తరచూ వచ్చే ఆ మాంత్రికునికి

ఇందులో ఏదైన సంబంధం ఉందా? అది కూడ తెలుసుకొనే తీరాలి!

యువరాకుమారి కుందవైదేవే వంతిదేవుని చేత యువరాజుకు తాళపత్రం పంపిందన్న విషయం ధనాధికారి మనసును కలతబారజేసింది. వంతిదేవుని ద్వారా ఏం సందేశం పంపింది? తాము, శంబువరయ్యర్ మొదలైన వారు చోళసింహాసనం గురించి చేసుకొన్న తీర్మానం ఆ ఆడపాముకు తెలిసివుంటుందా? దాని గురించి ఏదైన రాసి పంపించి ఉంటుందా?

ఏదెలా ఉన్నా, యువరాజు చోళదేశపు తీరం మీద అడుగు పెట్టిన వెంటనే మొట్టమొదట తామే ఆయనను కలవడం మంచిది. వంతిదేవుని కూడ యువరాజుతోబాటు చెరపట్టి తీసుకొని రమ్మని ఆజ్ఞ వేసినందువల్ల అతడిని కూడ తాము ముందు చూసి తీరాలి. అతడికి ఏమేం తెలుసు, ఎంత దూరం వరకు తెలుసు అని కనిపెట్టి ఆరా తీయాలి.

~

ఇలా ఆలోచించి పెద్ద పళువేట్టరయ్యర్ నాగపట్టణానికి వెళ్ళి వేచివుండ నిశ్చయించారు. ఆయనకున్న కారణాలకన్న ఎక్కువ కారణాలున్నాయి నందినికి. వంతిదేవుని మళ్ళీ కలిసి, కుందవై అతని చేత యువరాజుకు ఏం రాసి పంపిందని తెలుసుకోవాలని చాల ఆసక్తిగా ఉంది నందినికి. మాంత్రికుడు రవిదాసు వెళ్ళిన కార్యం ఎంతవరకు సఫలమైందని తెలుసుకోవాలని కూడ చాల ఉత్సుకతతో ఉంది కాబట్టి తాను కూడ నాగపట్టణానికి వస్తానంది. తీయని చెరుకు తినేందుకు జీతం/కూలి కావాలా? ముసలాయన అందుకు వెంటనే సమ్మతించారు. సముద్రతీరం వెంబడి నందినితో పడవలో ఉల్లాస ప్రయాణం చేయడం గురించి కలలు కనసాగారు. ఆయన మనసును, దేహాన్ని దహించేస్తున్న తాపం అందువల్ల తీరేందుకు దారి ఏర్పడగలదని ఆశపడ్డారు.

పళువేట్టరయ్యర్, నందిని నాగపట్టణంలో ఉన్నప్పడే సుడిగాలి వీచింది. దాని ఉగ్రలీలలను నందిని చాల ఆనందంగా చూసి అనుభవించింది. తీరం వెంబడి కొబ్బరిచెట్టెత్తు అలలు లేచి పడడాన్ని చూసి ఆనందించింది. కానీ సముద్రంలో పడవెక్కి ఉల్లాస ప్రయాణం చేద్దామన్న పళువేట్టరయ్యర్ మనోరధం నెరవేరనేలేదు.

సుడిగాలి అల్లోల కల్లోలం తర్వాత సముద్రంలో ఉన్న ఓడలకు, పడవలకు ఏదైన అపాయం కలిగిందా అని విచారించారు. తీరం వెంబడి ఉన్నవారు సుడిగాలి వీయబోతోందని తెలిసి, తగిన ముందు జాగ్రతలు తీసుకొన్నందువల్ల అధికనష్టం కలగలేదని తెలిసింది. కానీ, నడిసముద్రంలో లంకకు కోడిక్కరైకి మధ్య రెండు ఓడలు చిక్కుకొని కొట్టుమిట్టాడాయని, వాటిలో ఒకటి నిప్పంటుకొని కాలి మునిగిపోయిందని కొయ్య తెప్పల్లో చేపలు పట్టడానికి వెళ్ళిన కొందరు తెలియజేశారు. ఇది పళువేట్టరయ్యర్‌కి చాల దిగులు కలిగించింది. ఆ రెండు ఓడలూ యువరాజును చెరపట్టి తీసుకొస్తున్న ఓడలు కావచ్చు కద? అలాగైతే యువరాజు గతి ఇప్పుడేమైవుంటుంది? తమ మీద పెద్ద నింద పడుతుంది కద? చోళదేశపు ప్రజల అవ్యాజ

ప్రేమను చూరగొన్నారు కద యువరాజు? ప్రజలకు ఆయన గురించి ఏం చెప్పాలి? చక్రవర్తికి తాను ఏం ఉత్తరమివ్వగలడు? ఖచ్చితమైన వార్తను తెలుసుకోవాలన్న బలమైన ఆసక్తి కలిగింది ఆయనకు. ఒకవేళ కోడిక్కరైకి వెళితే వివరాలు తెలియవచ్చు. మునిగిపోయిన ఓడను బాగా చూసిన వాళ్ళు అక్కడ ఉండవచ్చు. అవును, వెంటనే కోడిక్కరైకి వెళ్ళవలసిందే!

ఈ ఆలోచనను నందినికి తెలియజేసిన వెంటనే ఆమె కుతూహలంతో ఒప్పుకొంది. 'కోడిక్కరైని నేనింతవరకు చూడలేదు. ఆ ప్రాంతం చాల అందంగా ఉంటుందని విన్నాను. ఈ సందర్భాన ఆ ప్రదేశాన్ని కూడ చూడవచ్చు అన్నది.

~

నాగపట్టణం నుంచి కోడిక్కరైకి రెండు మార్గాలున్నాయి. సముద్రతీరం వెంబడి ఉన్న పొడవైన కాలువ వెంబడి పడవలో వెళ్ళవచ్చు. లేదా, రాజబాట వెంబడి కూడ వెళ్ళవచ్చు. పళువేట్టరయ్యర్ పరివారజనం అధికంగా ఉండడం చేత రాజబాట వెంబడే వెళ్ళారు. పైగా నందిని కాలువ మార్గాన్ని ఇష్టపడలేదు. కాలువమార్గాన వెళితే పెద్ద పళువేట్టరయ్యర్ తమ ప్రేమ పురాణం విప్పుతారని నందిని జంకినది ఒక కారణం. అదీగాక, సముద్రతీరం వెంబడి రాజబాటలో వెళితే పడవ నడిపేవారిని, కొయ్య తెప్పలు నడిపేవారిని విచారించి సంగతులు తెలుసుకోవచ్చు కద?

దారిలో అలా విచారించినప్పుడు కొత్త విషయాలేమీ తెలియరాలేదు. నడిసముద్రంలో సుడిగాలి వీచినప్పుడు ఓడ ఒకటి నిప్పంటుకొని కాలి మునగడాన్ని చూసినట్లు ఇంకొందరు కూడ చెప్పారు.

~

కోడిక్కరై చేరిన వెంటనే దీపగృహపు కాపలాదారు త్యాగ విడంగర్ తమ ఇంటిని పళువేట్టరయ్యర్ దంపతుల కోసం ఖాళీ చేసి ఇస్తామన్నారు. అందుకు సమ్మతించమని బతిమాలుకొన్నారు. కోడిక్కరైలో విడిది చేయడానికి రాజమందిరం ఏదీ లేదు. కానీ నందిని దీపగృహం దగ్గరే గుడారం వేసుకొని విడిది చేయగోరుతున్నానని చెప్పింది.

అలాగే గుడారాలు వేయబడ్డాయి. కాస్త దూరాన పళువూర్ పరివారాలకు కూడ గుడారాలు వేయబడ్డాయి.

గుడారాలు వేసి ముగించిన వెంటనే వారికి సముద్రంలో ఒక పెద్ద ఓడ కనిపించింది. అది తీరానికి ఎంత దగ్గరగా రాగలదో అంత దగ్గరగా వచ్చి నిలిచింది.

దాన్ని చూడగానే పళువేట్టరయ్యర్ గారి ఆదుర్గా ఎక్కువైంది. తెరచాపలు ఛిన్నాభిన్నమై ఉన్న ఆ ఓడను చూడగానే అది సుడిగాలిలో చిక్కుకొందని అర్థమైంది. అందులో ఉన్నవారెవ్వరు? ఒకవేళ యువరాజు ఉండవచ్చా? పులిజెండా కనబడకపోవడంలో ఆశ్చర్యంలేదు. సుడిగాలిలో అది దూరంగా విసిరివేయబడివుండవచ్చు.

ఓడ దగ్గరకు వెళ్ళి విషయం తెలుసుకొని రావడానికి అక్కడున్న ఒకే ఒక పడవను పంపారు పళువేట్టరయ్యర్. ఓడలో ఉన్నవారు పడవ కోసమే వేచివున్నట్లనిపించింది. ఓడనుంచి ఇద్దరు వెంటనే పడవలోకి దిగారు. అందులో ఒకడు పార్థిబేంద్ర పల్లవుడు.

వంతిదేవుని కాపాడేందుకు ఓడనుంచి దిగివెళ్ళిన యువరాజు అరుళ్మొళి వర్మ ఓడకు తిరిగి రానేలేదు కద?

ఇందువల్ల పార్థిబేంద్రుడు ఎనలేని దిగులుతో కొట్టుమిట్టాడుతున్నాడు. గాలివేగం తగ్గి, పొద్దు పొడిచిన తర్వాత ఓడలో అటూ ఇటూ నలువైపులా వెళ్ళి వెతికి చూశాడు. పడవలో యువరాజుతోబాటు వెళ్ళిన ఇద్దరిలో ఒకడు మాత్రం కొనవూపిరితో చిక్కాడు. అతడు వంతిదేవుని యువరాజు అతి ధీరత్వంతో కాపాడిన తర్వాత ఆ ఓడకు పట్టిన గతి గురించి చెప్పాడు. ఇందువల్ల పార్థిబేంద్రుని దు:ఖం పదింతలైంది. ఒకవేళ కోడిక్కరైకి చేరుకొని బతికివుండవచ్చు కద అన్న ఆశ అతని గుండెల్లో కొట్టుకొంది.

అందుకనే కోడిక్కరైకి వెళ్ళి విచారించాలని తీర్మానించాడు. అందుకే ఓడను తీసుకొచ్చి అక్కడ నిలిపాడు. ఓడ నుంచి పడవలోకి దిగి తీరం వైపు వెళ్ళనారంభించిన వెంటనే పెద్ద పళువేట్టరయ్యర్ తమ యువరాణి సమేతంగా వచ్చి అక్కడ విడిది చేసివున్నట్లు తెలుసుకొన్నాడు. ఇది అతనికి చాల చిరాకు కలిగించింది.

~

పళువూర్ యువరాణి నందిని గురించి ఆదిత్య కరికాలన్ చెప్పిందంతా గుర్తుకొచ్చింది. అటువంటి మహావీరుని మనసును దోచుకొని పిచ్చివాడిని చేసిన ఆ మోహనాంగి ఎలా ఉంటుందో చూడాలన్న ఒక చపలమైన కోరిక కూడ అతని మనసులో ఒక మూల సన్నగా లేచింది. ఆ కోరిక త్వరలోనే పెరిగి పెద్దదైంది. ఒకవేళ ఆమెను చూడలేకపోతామేమోనన్న దిగులు కూడ కలిగింది.

కానీ ఆ దిగులు చాలసేపు నెలకొనలేదు. పడవనుంచి దిగగానే నేరుగా పళువేట్టరయ్యర్ గుడారానికి పార్థిబేంద్రుని పిలుచుకొని వెళ్ళారు. గుడారం వాకిట పళువేట్టరయ్యర్ గంభీరవదనంతో నిలబడివున్నారు. ఆజానుబాహువైన ఆ వీరాధివీరుని 'ముసలివాడు' అనడం ఎంతటి పొరబాటు అనుకొన్నాడు. అతను చూసిన ఎందరో యువవీరులకన్న దేహదారుఢ్యంలోను, మనోదారుఢ్యంలోను మేటి పురుషసింహంగా కనిపించారు.

ఇలా అతను ఆలోచిస్తుండగానే గుడారం నుంచి ఒక స్త్రీ బయటకు వచ్చింది. మబ్బులచాటునుంచి బయటకు వచ్చిన బంగారువన్నె పూవులాగ, కళ్ళు చెదిరే ప్రకాశవదనంతో ఆమె ముందుకు వచ్చింది. ఎత్తుగా పెరిగిన టేకు చెట్టుకల్లుకొన్న అందమైన పూలతీగలాగ పళువేట్టరయ్యర్ ముందు వచ్చి నిలబడింది. ఆ భువనమోహినిని చూసి అవాక్కై నిలబడ్డ పార్థిబేంద్రుని పైన తన చూపుల బాణాలను విసురుతూ, "నాథా! ఈ వీరపురుషుడెవ్వరు? ఈయనను నేనింతవరకు చూడలేదే?" అన్నది.

బంగారు గిన్నె నుంచి ఆరగించిన మధుపానం లాగ ఆమె చిలుక పలుకులు అతడికి మత్తెక్కించి పిచ్చివాడిని చేశాయి.

~~~
~~~

# అధ్యాయము - 2

## మోహపు వల

**వయసు** మళ్ళిన తర్వాత పడుచుపిల్లను పెళ్ళాడిన వారు ఎప్పుడూ సందేహమనే మాయలోకంలోనే జీవిస్తుంటారు. వారికి అన్యులెవరిని చూసినా చిరాకు, కోపమూను. పళువేట్టరయ్యర్‌కి అటువంటి చిరాకు ఏర్పడడానికి పెద్ద కారణమే వచ్చి ముందు నిలిచింది. నందిని తమ ముందు వచ్చి నిలబడి మాట్లాడడం ఆయనకు సుతరామూ నచ్చలేదు. అదే సమయాన నందినిని గద్దించేందుకు/ఖండించేందుకు కూడ వీలు పడలేదు.

కాబట్టి నందిని అడిగిన ప్రశ్నకు బదులుగా, "రాణీ! ఈ ప్రపంచంలో మనకు తెలియని వారు ఎందరో ఉన్నారు. అందరినీ మనం తెలుసుకోవడం సాధ్యం కాదు కద? అందువల్ల మనకు నష్టమేమీ లేదు!" అన్నారు.

ఇది విన్న పార్థిబేంద్రుడు, "చోళనాడు ధనాధిపతి పట్టమహిషికి నన్ను తెలియకపోవడం వల్ల నష్టమేమీ లేదు; నష్టం నాకే. కాబట్టి నన్ను నేనే పరిచయం చేసుకొంటాను. అమ్మా! నన్ను పార్థిబేంద్ర పల్లవుడు  అని పిలుస్తారు!" అన్నాడు.

"ఓ! అలాగా! మీపేరు నేను వినివున్నాను!" అన్నది నందిని.

"పార్థిబేంద్రా! ఎందుకు బిరుదులను వదిలేసి పేరును మాత్రం చెప్పుకొన్నావు? ఇంతటి వినయ విధేయతలు ఎప్పుడు అలవడ్డాయి? నందినీ! ఇతడు ఒట్టి పార్థిబేంద్రుడు కాడు. వేంగినాడు, కళింగనాడు గెలిచి **వీర పాండ్యుని తలను గెలిచిన** పార్థిబేంద్ర పల్లవుడు!" అని పళువేట్టరయ్యర్ కాస్త పరిహాసంగా అన్నారు.

నందిని ముఖం సుడిగాలికి ముందు కారు మబ్బులతో కమ్ముకొనే ఆకాశంలాగ ఒక్క క్షణం నల్లబారింది. ఆమె రెండు కళ్ళ నుంచి రెండు మెరుపులు మెరిసి మాయమయ్యాయి. మరుక్షణమే గలగల నవ్వింది.

"అయ్యా! వీర పాండ్యుని తలను గెలిచిన వాడన్న బిరుదును ఎందరో తమ పేరుకు తగిలించుకొంటున్నారు. అందుకేమైన ఒక లెక్క ఉందా?" అని అడిగింది.

"అమ్మా! ధనాధికారికి నాపైనున్న అభిమానం వల్ల అలా అన్నారు. నిజానికి ఆ బిరుదుకు అర్హుడు ఆదిత్య కరికాలన్ ఒక్కడే!"

"అదేమోయ్ అలా అంటున్నావు? చచ్చిన పామును కొట్టిన గొప్పతనంలో నీకు భాగం వద్దా?" అని పళువేట్టరయ్యర్ పరిహాసంగా అని చిరునవ్వు నవ్వారు.

'లేదు, ఏలికా/రాజా! లేదు! ఆదిత్య కరికాలన్ చచ్చిన పామును చంపలేదు. ఆయన కత్తిని

ఎత్తినప్పుడు వీరపాండ్యుడు పూర్తిప్రాణాలతోనే ఉన్నాడు. అతడి ప్రాణాన్ని కాపాడేందుకు దేవలోక మోహిని లాంటి ఒక స్త్రీ ముందుకు వచ్చి చేయి చాచి భిక్ష అడిగింది. కత్తిని ఎత్తిన వాడిని నేనైతే అప్పుడే కత్తిని దూరంగా విసిరేసి అలాగే ప్రాణభిక్ష ఇచ్చేవాడిని; వీరపాండ్యుడు బతికిపోయేవాడు!" అని పార్థిబేంద్రుడు పళువేట్టరయ్యర్‌కి బదులు చెప్పాడు. కానీ అతని కళ్ళేమో నందిని ముఖాన్ని గుచ్చి చూడసాగాయి.

~

నందిని అతడి మాటలు అపాయానికి దారి తీస్తుండడాన్ని గ్రహించింది. పళువేట్టరయ్యర్ వైపు చూసి, "నాథా! ఆ పాత కథ ఎందుకు? ఇప్పుడీయన ఇక్కడికొచ్చిన కార్యమేమని విచారించవచ్చు కదా?" అన్నది.

పళువేట్టరయ్యర్ వెంటనే, "అవును, తమ్ముడూ! పాత కథలు వద్దు! నీ కథ చెప్పు! కంచి నుంచి ఎప్పుడు బయలుదేరావు? ఎక్కడికి ప్రయాణం? ఇక్కడ దిగిన కారణమేమి?" అని అడిగారు.

"అయ్యా! నన్ను మన్నించండి! ఏవేవో మాటల్లో పడిపోయాను. నేనిప్పుడు అతిముఖ్యమైన వార్త తీసుకొని వచ్చాను. చోళసామ్రాజ్యాన్ని దు:ఖసముద్రంలో ముంచేయగల వార్త. లంకనుంచి నాతో ఈ ఓడలో బయలుదేరిన యువరాజు అరుళ్మొళి వర్మ సుడిగాలి వీచినప్పుడు సముద్రంలోకి దూకేశారు. ఆయన గతి ఏమైందని తెలియదు. ఒకవేళ కోడిక్కరైకి వచ్చి తలదాచుకొన్నారేమో అని విచారించేందుకే ఇక్కడ దిగాను!" అన్నాడు పార్థిబేంద్రుడు.

అతడా భయంకరమైన వార్త చెప్పి ముగించేలోపు, "ఆఁ! ఏమీ వార్త!" అని అరిచారు పళువేట్టరయ్యర్. సుడిగాలిలో కూకటివేళ్లతో పెకలించుకొని నేలకూలిన మహావృక్షం లాగ కుప్పకూలిపోయారు.

ఆయనను పట్టి లేవనెత్తేందుకు పార్థిబేంద్రుడు ముందుకు దూకాడు. నందిని అడ్డమొచ్చి అతడి చేతిని పక్కకు తోసేసి, ఆయన చెంతనే కింద కూర్చొని, ఆయన తలను తన ఒడిలో పెట్టుకొని, "నీళ్ళు! నీళ్ళు!" అని అరిచింది.

~

గుడారం నుంచి ఒక సేవకురాలు నీళ్ళు తెచ్చింది. ఇంకా పలువురు వీరులు, దీపగృహపు కాపలావాళ్ళు, వారి కుటుంబీకులు పరుగెత్తి వచ్చారు. నందిని గంభీరంగా వారందరినీ దూరంగా ఉండమని చెప్పింది. పళువేట్టరయ్యర్ ముఖం మీద నీళ్ళు చల్లి, "నాథా! నాథా!" అని మెత్తగా పిలిచింది. కాసేపటికల్లా ఆయన కళ్ళు తెరుచుకొన్నాయి. వెంటనే చటుక్కున లేచి కూర్చొన్నారు.

"నందినీ! కాసేపటికి మునుపు నేను విన్నది నిజమేనా? ఈ పల్లవుడు ఏం చెప్పాడు? పొన్నియిన్ సెల్వన్ని సముద్రం పొట్టనబెట్టేసుకొందన్నాడు కదా? ఆ వీరకుమారుడు చిన్న బిడ్డగా ఉన్నప్పుడు ఎత్తి భుజానవేసుకొని సంబరపడ్డాను. ఈ చేతులతోనే అతన్ని చెరపట్టి తీసుకొని రమ్మని

ఆజ్ఞాపత్రంమీద ముద్ర వేశాను. అయ్యో! చోళనాడు నాగురించి ఏమనుకొంటుంది?" అని తలబాదుకొన్నారు. వజ్రహృదయుడైన ఆ వీరవృద్ధుని అటువంటి దీన స్థితిలో, మనసు కలతబారిన స్థితిలో ఇంతవరకు నందిని చూడలేదు.

"నాధా! బెంబేలు పడకండి! ఈయన పూర్తి విషయం ఇంకా తెలియజెప్పలేదు కద? పూర్తిగా విన్న తర్వాత ఏం చేయాలన్నది ఆలోచించడం మంచిది కద?" అన్నది నందిని.

"అవును, నీవు చెప్పింది సరైనదే. పార్థిబేంద్రా! త్వరగా చెప్పు! పొన్నియిన్ సెల్వన్ సముద్రంలో మునిగి మరణించాడన్నావు కద? అది నిజమా? లేక ఏదో దురుద్దేశంతో కల్పించి చెబుతున్నావా? ఆకలిగొన్న పులితో ఆటాడకు! జాగ్రత్త!" అని ఆ వృద్ధుడు కళ్ళ నిప్పులు కురిపిస్తూ గర్జించారు.

"అయ్యా! క్షమించాలి! యువరాజు మరణించారని నేను చెప్పలేదు. అంతటి భయంకరమైన నష్టం ఈ తమిళనాడుకు కలిగివుంటుందని నేను నమ్మడం లేదు. సుడిగాలి తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు ఆయన నా ఓడనుంచి దూకారు - అని మాత్రమే చెప్పాను. దేవుని దయవల్ల ఒకవేళ బ్రతికివుండవచ్చు. ఈ సముద్రతీరానికి వచ్చి చేరివుండవచ్చు. ఆ ఆశతోనే నేనిక్కడికి వచ్చాను..."

"సుడిగాలి వీచినప్పుడు కడలిలో దూకారు! ఎందువల్ల? నీ ఓడలో ఆయనెందుకెక్కారు? ఆయన దూకినప్పుడు నీవేం చేస్తున్నావు?" అని పళువూర్ రేడు ప్రశ్నల వర్షం కురిపించారు.

నందిని అడ్డుపడి, " అయ్యా! ఈయన లంకకు ఎందుకు వెళ్ళారన్నది మొదలుకొని అంతా వివరంగా చెప్పనీ!" అన్నది.

"అవును! ఉన్నది ఉన్నట్లు చెప్పు! నిజం చెప్పకపోతే నీవు ప్రాణాలతో తప్పించుకోలేవు! నిన్ను..." అని పళ్ళు పటపట కొరికారు పళువేట్టరయ్యర్.

"అయ్యా! నిజం తప్ప ఇంకేమీ చెప్పే అలవాటు లేదు నాకు. నేను అబద్ధం చెప్పబోయినా నా నాలుక చెప్పదు. వినండి! మీరు, కడంబూర్ శంబువరయ్యర్ మొదలైన పలువురు చోళసామ్రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారని కంచికి వార్త చేరింది."

"అబద్ధం! అంతా అబద్ధం!"

"వార్త అబద్ధం కానివ్వండి. అదే నేనూ కోరేది. కంచికి చేరిన వార్తనే నేను చెప్పాను. అందుగురించి తిరుక్కోవలూర్ మలైయమాన్, ఆదిత్య కరికాలన్ నన్ను లంకకు పంపించారు. అరుళ్మొళి వర్మను వెంట తీసుకొని రమ్మని పంపారు..."

ఇలా ప్రారంభించి పార్థిబేంద్రుడు తాను లంకకు చేరినప్పటినుంచి జరిగినదంతా తనకు తెలిసినంతవరకు వివరంగా చెప్పాడు.

~

కథ ముగిసిన వెంటనే పళువేట్టరయ్యర్, "భగవాన్! చోళసామ్రాజ్యానికి పెద్ద కీడు వచ్చి పడింది!

ఈ పాపిష్ఠివాడి వల్లనే వచ్చింది! యువరాజును చెరపట్టి తీసుకొని రమ్మని నేనే కద ఆజ్ఞ వేశాను! నేనే కద ఒడలను పంపాను!" అని బావురుమన్నారు.

"రాజా! తమ నేరమేమీ లేదు. మీరు ఆజ్ఞ వేయకున్నా ఈయన ఒడెక్కి యువరాజు కంచికి వెళ్ళేవారే కద? ఊరకే బాధపడకండి. మన చేతల కన్న విధి లీల ఒకటుంది. పైగా..."

నందిని ఇలా పెద్దగొంతుతో మాట్లాడడాన్ని ఉన్నట్లుండి ఆపేసి, పళువేట్టరయ్యర్ చెవిలో ఏదో చెప్పింది.

పళువేట్టరయ్యర్ ముఖం కాస్త విప్పారింది. "అవునవును! అది నాకు తోచనే లేదు!" అన్నారు.

తర్వాత పార్థిబేంద్రుని చూసి, "పల్లవా! నీ ఒడకు వెళ్ళి పరిశోధించి రాబోతాను. అంతవరకు నీవిక్కడే ఉండాలి. తప్పించుకొని పారిపోజూడకు. అలా చేస్తే వెంటనే శూలాలు నీ మీదకు విసరబడతాయి! గుర్తుంచుకో! నీవు వీరపరంపరలో వచ్చినవాడివి!" అన్నారు.

"వందనమయ్యా! తప్పించుకొని పారిపోయే ఉద్దేశమే నాకు లేదు. అటువంటి ఉద్దేశముంటే మీవీరులెవ్వరూ నన్నాపలేరు. వెన్నుపోటు తినే ఉద్దేశం నాకు లేదు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"నాథా! వీరిగురించి మీరు దిగులు పడకండి. నేనే చూసుకొంటాను. తప్పించుకోజూస్తే, ఇదిగో ఈ చురకత్తి ఆయన గుండెల్లో దిగుతుంది! మీరు నిశ్చింతగా వెళ్ళి ఒడను పరిశోధించి రండి. కళాసీలను కూడ విచారించండి. వీరు చెప్పినదంతా నిజమేనా అని..." - ఇలా చెబుతూనే నందిని బొడ్లోంచి ఒక చురకత్తిని తీసింది.

"రాణీ! నీకెందుకీ బాధ్యత? నీ గుడారానికి వెళ్ళి విశ్రాంతి తీసుకో! లేదా త్యాగ విడంగర్ గారి ఇంటికి వెళ్ళు. ఇతన్ని మన వీరులే చూసుకొంటారు. లేదా, ఇతన్ని కూడ నాతో ఒడకు తీసుకొని వెళతాను..."

"నేను రానయ్యా! నేను వస్తే మళ్ళీ మీకు సందేహాలు పుడతాయి. కళాసీలు నా పక్షం సాక్ష్యం చెప్పినట్లు మీరనుకొంటారు. నేను ఈ చోటు విడిచి జరగను. మీరు నిశ్చింతగా వెళ్ళి రండి!"

"నాథా! మీరు ఒడకు వెళ్ళి తిరిగి వచ్చేవరకు నేను కూడ ఇక్కడే ఉంటాను. ఇక్కడినుంచే మిమ్మల్ని చూస్తుంటాను" అన్నది నందిని.

తర్వాత పళువేట్టరయ్యర్ చెవిలో, "ఇతడు ఇక్కడేమైనా రహస్య విషయాలు తెలుసుకోవడానికి వచ్చాడో, ఏమో! ఎవరికి తెలుసు? పైగా, యువరాజు గురించి మీరు తిరిగి వచ్చేవరకు ఎవరికీ తెలియకూడదు!" అన్నది.

పళువేట్టరయ్యర్ తలాడించేసి పడవెక్కారు. పడవ ఒడవైపు సాగింది.

~

పడవ కాస్త దూరం వెళ్ళేవరకు నందిని పడవనే చూస్తూంది. అదే సమయాన పార్థిబేంద్రుడు

కళ్ళార్పకుండ తన ముఖాన్నే చూస్తుండడాన్ని గ్రహించింది. చటుక్కున అతడి వైపు తిరిగింది. పార్థిబేంద్రుడు సిగ్గుపడి తలదించుకొంటాడనుకొంది. కానీ తేనెలూరే పూవును చూసిన భ్రమరం వెనుదిరుగుతుందా?

నందిని మళ్ళీ చురకత్తిని పైకెత్తి, "జాగ్రత్త! తప్పించుకొని పారిపోజూడకండి!" అన్నది.

"దేవీ! కత్తిని ఝుళిపించి భయపెట్టనేల? తప్పించుకోవడమేమి? పారిపోవడమా? వలలో పడ్డ చేప ఎలా తప్పించుకోగలదు? మీరు విసిరిన వలలో..."

"ఏమయ్యా చెబుతున్నారు? నేను చేపలు పట్టే కులానికి చెందిన అమ్మాయిననుకొంటున్నారా? ఇది పళువూర్ ఏలిక చెవిన పడితే..."

"అందు గురించి నేను దిగులు పడడం లేదు, దేవీ! కానీ చేపలు పట్టే వల గురించి కూడ నేను చెప్పలేదు; తమ నయనాలు విసిరే మోహపు వల గురించి చెప్పాను..."

"ఛీఛీ! ఎంత ధైర్యం మీకలా మాట్లాడేందుకు? చేపల పట్టేవారి కులం అమ్మాయన్నా బాధలేదు. మగవాళ్ళకు మోహపు వల విసిరే కన్యననా అంటున్నారు నన్ను?"

"మన్నించాలి! అటువంటి అపరాధం నేను చేయలేదు. మీరు కావాలని వల విసరాలా, ఏమి? సాలెపురుగు వల పన్నేది ఈగలను పట్టేందుకా? అది తాను నివసించేందుకు వల పన్నుతోంది. ఈగలు తమకు తామే వెళ్ళి ఆ వలలో చిక్కుపడుతున్నాయి..."

"నన్ను సాలెపురుగనా అంటున్నారు? అంత భయంకరంగా ఉందా నా రూపం?"

"తప్పు, తప్పు! నేను దీపాన్ని ఉపమానంగా చెప్పవలసింది. ఇంట్లో దీపం వెలిగేది పురుగుల కోసం కాదు. దీపం వెలుగుతూ తన చుట్టూ వెలుతురును ఇస్తోంది. వెధవ పురుగులు అది అమృతమనుకొని దగ్గరకు వెళ్ళి దాంట్లో పడి మాడిపోతున్నాయి...."

"చిన్న గాలి వీచినా ఆ దీపం ఆరిపోతుంది. నోటితో ఊపి కూడ ఆర్పేయవచ్చు. దాని శక్తి అంతే!"

"దీపం ఆరిపోతుంది; కానీ పూర్ణచంద్రుని ఎవరు ఆర్పగలరు? పూర్ణచంద్రుడు సముద్రరాజు కోసం ఉదయించడం లేదు. ప్రకృతి సహజంగా చంద్రుడు ఉదయిస్తున్నాడు. ఆ చంద్రుని చల్లని వెన్నెల భూమిని, ఆకాశాన్ని పులకింపజేస్తూంది. కానీ పాపం కడలిని చూడండి! పూర్ణచంద్రుని చూసి సముద్రమెందుకు ఉవ్వెత్తున లేవాలి? అందని పండు కోసం ఎందుకు తపించాలి?"

"పల్లవు రాజుల కవితా చాతుర్యం గురించి, కల్పనా శక్తి గురించి చాల విన్నాను. అదంతా నిజమేనని ఇప్పుడు తెలుస్తూంది..."

"పురాణాల్లోను, కావ్యాల్లోను చదివింది, విన్నది నిజమని నిన్నటి వరకు నమ్మలేదు. ఇప్పుడు నమ్మకం కలుగుతోంది...."

"దేని గురించి చెబుతున్నారు?"

"స్త్రీరూపంగొన్నవారు కొందరు భూమ్యాకాశాలను తమ పాదాక్రాంతం చేసుకోగలరని విన్నాను.

పాలసముద్రాన్ని చిలికి అమృతాన్ని తీసిన అసురులు ఆ అమృతాన్ని తాగే సమయానికి సరిగ్గా మోహిని చేత మోసపోయారు. సుందోపసుందులు ఒక స్త్రీవల్ల తుడిచిపెట్టుకుపోయారు/నాశనమైపోయారు. మేనక వల్ల విశ్వామిత్రుని తపస్సు భంగమైంది. కోవలన్ మాధవి మోహపు వలలో పడ్డాడు. దశరధుడు కైకేయి కోసం రాముని అడవులకు పంపాడు. ఈజిప్టు రాణివల్ల మహోన్నతమైన రోమన్ సామ్రాజ్యం పతనమైంది..."

"చాలయ్యా, చాలు! ఈ ఉదాహరణలన్నీ ఎందుకు చెబుతున్నారు?"

"తెలియలేదా, దేవీ? ఎవరికి ఉదాహరణగా చెబుతున్నానని ఇంకా అర్ధంకాలేదా?"

"నన్ను ఉదాహరణగా తీసుకొని చెబుతుంటే అంతకన్న పెద్ద పొరాబాటింకేమీ లేదు."

"పొరబాటేమీ లేదు. వారి శక్తికన్న మీ శక్తేమీ తక్కువకాదు."

"మీ నోటిమాటే మీకు శత్రువుగా మారుతోంది."

"ఎలా, దేవీ?"

"పళువూర్ రేడును నేను కావాలనే ఓడకు పంపాను, మిమ్మల్ని ఒక విషయం గురించి అడిగేందుకు."

"మీ ఉద్దేశాన్ని గ్రహించే నేను కూడ ఆయనతో వెళ్ళకుండ ఇక్కడే ఉండిపోయాను."

"వీర పాండ్యుని కాపాడేందుకు ఒక స్త్రీ ప్రయత్నించిందనీ, దాన్ని ఆదిత్య కరికాలన్ పట్టించుకోలేదని మీరన్నారు కద?"

"అవును, అన్నాను..."

"కాపాడ వచ్చిన ఆ పేద పిల్ల ఎవరో తెలుసా?"

"ఇప్పుడు పళువూర్ అంత:పురంలో వెలిగిపోతున్న యువరాణి నందినే"

"మీరు కాసేపటి క్రితం వర్ణించినట్లు నాకు అలాంటి శక్తే ఉంటే నేను కాపాడదలిచిన ఒక వ్యక్తిని కాపాడుకొని ఉండనా? అదెందుకు నాకు సాధ్యం కాలేదు?"

"ఆవేశంలో ఆదిత్య కరికాలన్ మీ కోరికను మన్నించలేదు, నిజమే, కానీ గత మూడేళ్ళుగా అందువల్ల ఆయన అనుభవిస్తున్న చిత్రవధ నాకు తెలుసు."

"మీకెలా తెలుసయ్యా? మీకు చెప్పారా?"

"మూడేళ్ళుగా మనసులోనే దాచుకొని బాధపడుతూ వచ్చారు. ఆయన మనసును ఏదో ఒక దు:ఖపూరితమైన విషయం బాధిస్తోందని మాత్రం గ్రహించాను. పది రోజులకు మునుపు, నేను లంకకు బయలుదేరేందుకు ఒకరోజు మునుపు - మనసు విప్పి నాతో చెప్పారు. అది మొదలు ...."

"అది మొదలు, ఏమి?"

"పళువూర్ యువరాణిని చూడాలన్న కోరిక నా మనసులో గూడుకట్టుకొంది."

"ఆదిత్య కరికాలన్ స్థానంలో నేనుండివుంటే వీరపాండ్యుని ప్రాణాలతో వదిలేసివుండేవారని మీరన్నారు, గుర్తుందా?"

"బాగ గుర్తుంది."

"అది నిజమేనా?"

"సత్యం దేవీ! తమరు నన్ను పరిశోధించి చూడండి."

"అయ్యా! నా మనసులో ఒక సందేహముంది. చెప్పనా?"

"మీరేం చెప్పినా నా చెవులకింపుగానే ఉంటుంది."

"మీరు నన్ను శోధించేందుకే ఇలా మాట్లాడుతున్నారని సందేహిస్తున్నాను. నేను మీకు మోహపు వల విసరడమలా ఉండనీ. మీరే నాకు వల విసరజూస్తున్నారు. నా అంతరంగాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు."

పార్థిబేంద్రుడు అదిరిపడ్డాడు. మాట్లాడ మొదలు పెట్టినప్పుడు ఆ ఉద్దేశంతోనే ప్రారంభించాడు. తర్వాత అది మరిచేపోయాడు. కపటంతో ప్రారంభించిన సంభాషణ నిజంగానే అతన్ని మోహసముద్రంలోకి తోసేసింది. మొదట ఆ ఉద్దేశంతో ప్రారంభించినందుకు సిగ్గుపడ్డాడు. దాన్ని బయటకు చూపించుకోకుండ, "దేవీ! అలా మిమ్మల్ని శోధించే రహస్య గూఢచారత్వం చేస్తే నా తలమీద పిడుగు పడుతుంది!" అన్నాడు.

"అయ్యో! ఏమలా అంటున్నారు?" అని అరిచింది నందిని.

"ఏం, దేవీ? ఎందుకు?"

"మీ మొదటి యువరాజు పంపిన దూత – అతడి పేరేమి?"

"వంతిదేవుడు."

"అవును, అతడే! నా మీద మంత్రతంత్రాలు ప్రయోగించి రహస్యాలు రాబట్టాలని ప్రయత్నించాడు. మీరు చెబుతున్నది చూస్తుంటే అతడి తలమీద పిడుగు పడనే పడ్డట్లుంది!"

"దురదృష్టవశాత్తు వాడి తలమీద పడలేదు కద? వాడున్న ఓడమీద కద పడింది? దాని వల్ల వాడికొచ్చిన ఆపద చిన్న యువరాజుకు కూడ వచ్చింది కద?"

"పాపం! పళైయార్రై యువరాణిని తలుచుకొంటే నాకు జాలేస్తూంది. ఆమెకు ఈ లోకంలో ప్రీతిపాత్రులైన ఇద్దరు ఏకకాలంలో చనిపోయారు! ఎంత దురదృష్టం!"

"దేవీ? ఇద్దరెవ్వరు?"

"మీరు చెప్పిన ఇద్దరే! యువరాకుమారికి తమ్మునిపైన అపారప్రేమ కద?"

"అది లోకవిదితమే. ఆమె ప్రేమకు పాత్రుడైన ఇంకొకరు..."

"ఇంకెవరు? మీ యువరాజు పంపిన దూతే!"

"ఛీఛీ! చోళసామ్రాజ్యాన్నే శాసించగల శక్తివున్న పళైయార్రై యువరాకుమారి అల్పుడు, గర్విష్ఠి,

అధికప్రసంగి అయిన ఆ యువకుని పైన ..."

"అవును! ఆ యువకుని పైన మోహంగొంది. అందుకే పళువేట్టరయ్యర్ విధించిన శిక్షనుంచి తప్పించేందుకు తాళపత్రమిచ్చి లంకకు పంపింది. పాపం! ఈ ముసలాయన యువరాజు గతికి తానే కారణమని విలవిల్లాడిపోతున్నారు. నిజానికి యువరాకుమారే కారణం. ఆమెగనక తాళపత్ర సందేశం రాసి పంపివుండకపోతే..."

"నిజం! నిజం! ఈ విపరీతం జరిగివుండదు..."

"నా పతి ఓడనుంచి తిరిగి రాగానే ఈ నిజాన్ని మీరే ఆయనకు నొక్కి, విడమరచి చెప్పాలి. చెబితే, నా కృతజ్ఞతకు పాత్రులవుతారు!"

"అమ్మా! తమ కృతజ్ఞతకు పాత్రుడిని కావడానికి ఇది ఒకటేనా దారి? మీరు నాకు పురమాయించగల కార్యాలింకేమీ లేవా?"

"అయ్యా! ఒక పేదపిల్ల కృతజ్ఞతకు పాత్రులు కావడానికి ఎన్నో దారులున్నాయి!"

"వాటిలో ఒకట్రెండు చెప్పండి. ఆదిత్య కరికాలన్ గారికి అటువంటి అవకాశం దొరికినా చేజారిపోనిచ్చారు. తర్వాత పశ్చాత్తాపపడ్డారు. నేనటువంటి పొరబాటు చేయను!"

"ఇది సత్యమేనా, అయ్యా! ఒక అమ్మాయి కోరిక నెరవేర్చేందుకు మీరేమైనా చేస్తారా?"

"ఆ స్త్రీ ఎవరన్నదానిమీద ఆధారపడివుంటుంది. నేను నిన్నటివరకు చూసిన ఏ స్త్రీ కోసమూ ఎటువంటి కార్యం కూడ చేసివుండేవాడిని కాను; చెబితే నవ్వేసేవాడిని. ఇప్పుడలా కాదు. మీరు చెప్పండి. నాకు వంద ప్రాణాలుంటే అన్నింటినీ మీ కోరిక నెరవేర్చేందుకు అర్పిస్తాను. వేయి సామ్రాజ్యాలు నా వశంలో ఉంటే వాటన్నిటినీ మీ కోరిక నెరవేర్చేందుకు త్యాగం చేస్తాను. క్రూర శత్రువులను క్షమించమంటే క్షమిస్తాను. ప్రాణస్నేహితుల తల తీసుకొని రమ్మన్నా, శిరసావహిస్తాను!"

ఇలా పార్థిబేంద్రుడు పూనకం వచ్చిన వాడిలాగ ఆవేశంతో అన్నప్పుడు అతడి శరీరం ఆపాదమస్తకం గడగడ వణికింది. పెదవులు వణికాయి. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి.

పార్థిబేంద్రుడు ఉన్నట్లుండి ఇలా మారిపోతాడంటే పాఠకులు నమ్మరు. అంతెందుకు? ఒకరోజు క్రితం, "నువ్విలా మారిపోతావు!" అని ఎవరైనా చెబితే అతడే నమ్మివుండేవాడు కాడు. తర్వాత తలుచుకొంటే తనకే ఆశ్చర్యం కలిగించే చర్య.

కానీ ఇది పార్థిబేంద్రుని విచిత్ర ప్రవర్తన కాదు. మనుష్య ప్రకృతే అలా ఉంది.

ఎందరో మేధావులు ఎంతోకాలం పరిశోధనలు చేసిన తర్వాత కూడ మానవ శరీర నిర్మాణ రహస్యాన్ని పూర్తిగా తెలుసుకోలేకపోతున్నారు. మరి మానవ మనోనిర్మాణ రహస్యాన్ని ఎంతవరకు తెలుసుకోగలరు?

ఇందుకు వ్యతిరేకంగ, జీవితకాలమంతా నిష్కళంకంగా బతికి, ఉన్నట్లుండి ఒకరోజు కాలుజారి

పడిపోతున్నారు. అలా పడేటప్పుడు ఏకంగా అధఃపాతాళానికే పడిపోతున్నారు.

పార్థిబేంద్రుని ఆవేశపూరితమైన మాటలను వింటూ వచ్చిన నందిని, "చాలయ్యా! చాలు! ఆపండి! అటువంటి భయంకరమైన కార్యమేమీ చేయమని ఏనాడూ కోరను. మీకూ నాకూ సంతోషం కలిగించే కార్యాన్నే చేయమని అడగబోతున్నాను!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 3

## గుడ్లగూబ కూత

**నందిని** సముద్రం వైపు చూసింది. పళువేట్టరయ్యర్ ఎక్కి వెళ్ళిన పడవ పార్థిబేంద్రుని ఒడను సమీపిస్తూంది.

నందిని పెద్దగా నిట్టూర్చింది. అది పార్థిబేంద్రుని మనసును సుడిగాలిలాగ కొట్టింది.

"దేవీ! చెప్పండి. నేను చేయవలసింది ఇదీ అని చెప్పండి. మీకు, నాకు సమ్మతమైనదని / ఆమోదయోగ్యమైనదని చెప్పారు. అలా చెప్పవలసిన అవశ్యకత లేదు. మీకు ఏది సముచితమో, అది నాకూ సముచితమే!" అన్నాడా పల్లవ వీరుడు.

ఆ సమయాన అతని మనసులో విచిత్రమైన ఆలోచనలు తలెత్తాయి. ఈమె ఆ కఠిన, క్రూర వృద్ధుని చేత చిక్కుకొని పంజరపు చిలకలాగ విలవిల్లాడుతూందనడంలో సందేహం లేదు. ఆ అడవి పిల్లినుంచి ఈమెను ఎందుకు విడుదల చేయకూడదు? ఈమే తన కోరికను తెలియజేస్తే ,,, వాడిని ఆ ఒడలోనే బంధించి ఖండాంతర దేశాలకు తీసుకొని వెళ్ళి వదిలేయవచ్చు! ఛండాలుడు! కూతురో, మనవరాలో కావలసిన ఈ లేతప్రాయపు పిల్లను పెళ్ళి చేసుకోవడానికి వీడికి మనసెలా వచ్చింది?

నందిని ఇంకా పడవను, ఒడను చూస్తూంది. పడవనుంచి పళువేట్టరయ్యర్ ఒడలోకి ఎక్కడాన్ని చూసింది.

"మంచిది! క్షేమంగా ఒడెక్కారు! ఎంతటి వీరులైనా, వయసు మళ్ళింది కదా? పడవ నుంచి ఒడకు ఎక్కేటప్పుడు తడబడకుండాలి కద అని నాకు చాల దిగులు కలిగింది!" అన్నది.

పల్లవుడు మోసపోయాడు. ఆ ముసలాడి పైన ఈమెకెందుకింత ప్రేమ? పడవ నుంచి వాడు సముద్రంలో పడి చస్తేనేమి? దేశానికే మంచిది! ఈమెకూ విడుదల! ఎందుకింత ప్రేమ చూపిస్తోంది ఆ ముసలాడి పైన?

"ముసలాయనకు చోళ వంశస్థులంటే ఎంత అభిమానమన్నది ఈ రోజే తెలిసింది నాకు. యువరాజుకు ఆపదంటే ఎంత విలవిల్లాడిపోయారు? - అయ్యా! యువరాజు ఆపద నుంచి తప్పించుకొని బతికివుండవచ్చు కదా? తప్పక మరణించేవుండాలని ఖచ్చితంగా తెలియదు కదా?" అని అడిగింది నందిని.

"నిశ్చయంగా తెలియదు. కానీ అటువంటి సుడిగాలిలో సముద్రంలో దూకిన వారు బతకడం అసాధ్యం! విధి వోకడకు/వైపరీత్యానికి మనమేం చేయగలం?" అన్నాడు పల్లవుడు.

"ఇందుకు విధి కారణం కాదు; ఆ పళైయార్రై రాక్షసి దురాశే కారణం. మీకు తెలుసా, అయ్యా? కుందవైదేవికి జ్యోతిష్కంలోను, హస్తసాముద్రికంలోను అపారమైన నమ్మకం. తమ్ముని జాతకాన్ని, చేతి

రేఖలను చూసి పెట్టుకొని, అతడు ముల్లోకాలనేలే చక్రవర్తి కాబోతాడని నమ్మకం పెంచుకొంది. అయ్యో, పాపం! తన ముద్దుల తమ్మునికి పట్టిన గతి తెలుసుకొన్నప్పుడు ఆమె ఎంత దు:ఖపడుతుందో కదా? ఆ సమయాన నేనామె చెంతవుండి ఓదార్చవలసి వస్తుందేమో!"

ఇలా అంటున్నప్పుడు నందిని గొంతులో కుతూహలం ధ్వనించింది. పల్లవుడు ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. తర్వాత తన చెవులే సరిగ్గా లేవని తీర్మానించుకొన్నాడు.

"రాణీ! మీరెందుకని ఓదార్చాలి? ఆమె దురాశవల్ల జరిగిన విపరీతమే కద ఇది? అందుకామె తగిన శిక్ష అనుభవించవలసిందే..."

"అదెలా, అయ్యా? ఆమె కంటి నుంచి ఒక్క కన్నీటి చుక్క జారిపడితే ఆమె కోసం విలవిల్లాడి పరితపించేవారు చోళదేశంలో వేలకొద్ది ఉన్నారు. ఆమె చక్రవర్తి ప్రియపుత్రిక. ముల్లోకాల్లోనే సాటిలేని సౌందర్యవతి!"

"నేనూ ఒకప్పుడు అలాగే అనుకొన్నాను. అంటే మిమ్మల్ని చూసేవరకు!"

"నన్ను చూసిన తర్వాత ఏమనుకొంటున్నారు?"

"కుందవై దేవి అందం మీ కాలిగోటికి కూడ సరికాదని!"

"ఇప్పుడలాగే అంటారు. రేపు ఆమెను చూసిన తర్వాత నేనొకతెను ఈ లోకంలో ఉన్నానన్న విషయమే మరిచిపోతారు!"

"ఏనాడూ మరువను, దేవీ! నన్ను శోధించి చూడండని చెప్పాను కదా? తమ ఆజ్ఞ ఇదీ అని తక్షణమే తెలియజేయండి...!"

"ఆజ్ఞాపించే అధికారం నాకు లేదయ్యా! విన్నవించికోగలనంతే. పెద్ద పళువేట్టరయ్యర్ని నేను పెళ్ళాడిన తర్వాత చాల దురంతాలు జరుగుతున్నాయని ఎన్నో అపోహలు, గాలివార్తలు లేస్తున్నాయి. అదంతా అబద్ధమని నిరూపించగోరుతున్నాను. అందుకు మీ సహాయాన్ని కోరుతున్నాను."

~

పార్థిబేంద్రుడు కాస్త ఖంగుతిన్నాడు. నందిని తన స్వార్థం కోసం ఏదో ఒక కష్టసాధ్యమైన కార్యాన్ని చేయమని అడుగుతుందని ఎదురుచూశాడు. దాన్ని నెరవేర్చి ఆమెను సంతోషపెట్టాలని తహతహలాడాడు. కానీ ఆమె ఏదో రాజకీయ కార్యం గురించి మాట్లాడుతోంది!

"చెప్పండి, రాణీ! మీ కోరిక ఏదైనా సరే, చెప్పండి!" అన్నాడు.

"అయ్యా! చోళదేశంలో ప్రశాంతత నెలకొనకుండ అడ్డుపడుతున్నది యువరాకుమారి కుందవై. ఆమె అహంభావం వల్ల చోళదేశపు చిన్నచిన్న రాజులు, సామంతులు, పెద్ద అధికారులు కోపంగొనివున్నారు. తమ్ముడు అరుళ్మొళి వర్మను ఎలాగైనా ఈ చోళసామ్రాజ్య సింహాసనం పైకెక్కించాలని ఆమె ఆశ. ఇందువల్ల, సామరస్యం ఏర్పడకుండ అడ్డగిస్తూంది. ఇప్పుడు ఆ కారణం తొలగిపోయింది. ఇకపైన సామరస్యం

నెలకొనడం సులభం. వినండయ్యా! మీరే చెప్పారు కద! మంత్రులు, పెద్ద అధికారులంతా సుందర చోళ చక్రవర్తి తర్వాత మధురాంతకులకే పట్టం కట్టాలని కోరుతున్నారు. చక్రవర్తి కూడ అందుకు ఒప్పుకొనేశారు!"

"అలాగా, దేవీ!?"

"అవునయ్యా! లేకపోతే యువరాజును చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించేవారా? అయినా కూడ అది సరికాదని నా అభిప్రాయం. సామరస్యంతో/సమరసంగా సమస్యను పరిష్కరించడానికి అవకాశముంది. పెన్నానదికి ఉత్తరాన ఉన్న భాగాన్ని ఆదిత్య కరికాలన్ గారికి, దానికి దక్షిణాన ఉన్న భాగాన్ని మధురాంతకులకు అని విభజించవచ్చు కద? తమ పూర్వీకులు తొండైమండలాన్ని ఏలడంతో తృప్తిపడలేదా? కిందటి చోళరాజులు రెండు నదుల మధ్య ఉన్న దేశంతో తృప్తి పడలేదా?"

"ఇదంతా నాకెందుకు చెబుతున్నారు? ఏరాజ్యం ఎలా పోతే నాకేమి? ఎవరు ఏ రాజ్యాన్ని ఏలితే నాకేమి..."

"అయ్యా! మీరు ఆదిత్యకరికాలన్ గారి విశ్వాసపాత్రులైన స్నేహితులనుకొన్నాను..."

"ఇతరుల విశ్వాసపాత్రత కోసం, ఇతరుల కీర్తి కోసం పోరాడి, ఇతరుల మేలు కోసం ఉడిగం చేసి, ఇన్ని రోజులు గడిపేశాను. ఇక నా కోసం నేను జీవించగోరుతున్నాను, రాణీ! ఇది వినండి! నేనీ లోకంలో పుట్టాను; ఎందుకింకా బతికున్నాను అని చాల సార్లు ఆలోచించాను. నా పూర్వీకులైన పల్లవరాజులు పెద్ద సామ్రాజ్యాలనేలారు. మహాబలిపురం (మామల్లపురం) వంటి లోకాలను సృష్టించారు. వారి గొప్పతనాన్ని మళ్ళీ నెలకొల్పడానికే నేను పుట్టానేమోనని అనుకొన్న సందర్భాలున్నాయి. కానీ అందులో నా మనసు నిమగ్నం కాలేదు; రాజ్యాలను సృష్టించడంలో ఉత్సాహంగొనలేదు. చోళదేశపు కీర్తిప్రతిష్ఠలకోసం పనిచేయడంతో తృప్తిపడ్డాను. ఆదిత్య కరికాలన్ స్నేహంతో సంతసించాను. ఇలాగే నా జీవితకాలమంతా గడిచిపోతుందని భావించాను, ఇప్పటివరకు. ఈరోజే నా కళ్ళు తెరుచుకొన్నాయి; కాసేపటికి మునుపే నేనెందుకు పుట్టానని తెలిసింది. ఇదిగో వినండి! ఆ కడలి అలల శబ్దం నా మాటలను "అవును! అవును!" అని ఆమోదిస్తూంది. అదిగో, అడవిలో నివసిస్తున్న పక్షులు 'సరే, సరే' అని కూస్తున్నాయి. దేవీ! చోళసామ్రాజ్యాన్ని భాగాలు చేసి పంచడం గురించి నాకు చెప్పకండి. ఇంకేదైనా చెప్పండి! సముద్రాలకవతల ఉన్న పగడాల దీవినుంచి వెల కట్టలేని పగడాలను తీసుకొని రమ్మనండి. మేరు పర్వత శిఖరాన్నెక్కి సంజీవని మూలికను తీసుకొని రమ్మనండి. మేఘమండలం కన్న పైకెగిరి వెళ్ళి నక్షత్రాలను కోసి తెచ్చి హారం కట్టి మీ మెడలో వేయమనండి. మీ ముఖాన్ని చూసుకోవడానికి పూర్ణచంద్రుని తెచ్చి ఇవ్వమనండి...!"

"చాలయ్యా! చాలు! ఇప్పటికే నన్నా పళైయారై రాకుమారి 'పిచ్చిది' అంటోంది. నిజంగానే నాకు పిచ్చి పట్టేటట్లు చేయకండి!" అన్నది నందిని.

~

పార్థిబేంద్రుడు కాస్త సిగ్గుపడ్డాడు. "పిచ్చి పట్టింది నాకే. మన్నించండి. తమ కోరికను మొదట తెలియజేయండి!" అన్నాడు.

"చోళదేశమంతటా - తమిళదేశమంతటా - నాకు వచ్చిన చెడ్డపేరును పోగొట్టుకోగోరుతున్నాను. అందుకోసమే మీ సహాయాన్ని కోరుతున్నాను. నేనీ ముసలాయనను పెళ్ళాడినందువల్ల చోళవంశానికే కీడు మూడిందని ప్రజలు మాట్లాడుకొంటున్నారట. మధురాంతకునికి రాజ్యకాంక్ష పుట్టించింది నేనేనంటున్నారట. చోళదేశపు సామంతరాజులను వారి పక్షానికి తిప్పింది కూడ నేనేనట. ఈ చెడ్డ పేరుతో చనిపోవడానికి నేనిష్టపడడం లేదు..." అన్నది నందిని.

"చనిపోవడం గురించి ఇప్పుడెందుకు మాట్లాడుతున్నారు? నన్ను బాధించేందుకా?"

"పల్లవకుమారా! మీకు రేఖాశాస్త్రం తెలుసా? అందులో మీకు నమ్మకముందా?" అని నందిని సంబంధం లేని ఒక ప్రశ్న అడిగింది.

పార్థిబేంద్రుడు దానికి తిన్నగా సమాధానం చెప్పక, "ఏదీ? చేయి చూపండి!" అన్నాడు.

నందిని కుడిచేతిని ముందుకు చాచింది. దాన్ని పార్థిబేంద్రుడు కాసేపు పరీక్షగా చూసి, "ఆశ్చర్యకరమైన రేఖలు! ఇలా ఉండడమే అపూర్వం! ఆ చేతిని కూడ కాస్త చూపండి!" అన్నాడు.

నందిని రెండో చేతిని కూడ చాచింది. పల్లవుడు ఆ చేతిని కూడ చూసిన తర్వాత, "దేవీ! ఇంతకు మునుపు ఎవరైనా మీ చేతులలో అద్భుతమైన రేఖలను చూసి, ఏమైనా చెప్పారా?" అని అడిగాడు.

"అవును; పళైయారై యువరాకుమారి నా చేతి రేఖలను చూసి చెప్పింది..."

"ఏం చెప్పింది?"

"నేను అల్పాయువునని, అకాల మరణం పొందుతానని..."

"అది నిజమే!"

"అయ్యో! మీరు కూడ అలా అంటున్నారా?"

"కానీ ఆమె రేఖాశాస్త్రాన్ని సరిగ్గా నేర్చుకోలేదని తెలుస్తోంది. ఈ రేఖల్లో ఒకటి అల్పాయుష్షును సూచిస్తోందన్నది నిజమే. కానీ ఇంకొక రేఖ ఆ గండాన్ని దాటి పునర్జన్మ పొందుతారని సూచిస్తోంది. ఆ పునర్జన్మ తర్వాత సముద్రాలు దాటి వెళ్ళే భాగ్యం కలుగుతుందనీ, రాజాధిరాజులకు అందని ఆనందజీవితం మీ సొంతమౌతుందని చెబుతోంది. ఇదంతా, సముద్రతీరాన కాకతాళీయంగా కలిసిన ఒక యవ్వనవంతుని నిజమైన ప్రేమవల్ల సాధ్యమవుతుందని కూడ చెబుతోంది. అతడు మీ చిన్నారి కోరికను నెరవేర్చేందుకు తన ప్రాణాన్ని కూడ అర్పించేందుకు సిద్ధమని స్పష్టంగా చెబుతున్నాయి ఈ రేఖలు ..."

ఇలా చెబుతూనే పార్థిబేంద్రుడు చటుక్కున ఆమె చాచిన చేతులను పట్టుకొని తన కళ్ళకద్దుకొన్నాడు.

నందిని తన చేతులను వెనక్కి లాగేసుకొని, "ఛీఛీ! ఇదేం పని?" అన్నది.

"మన్నించండి! ఇవి మీ చేతులని మరిచిపోయాను. రెండు ఎర్ర తామరపూలనుకొన్నాను" అన్నాడు.

"పళువేట్టరయ్యర్ చూసివుంటే మిమ్మల్ని ఈటెతో గుచ్చి ఎత్తేసేవారు!"

"దేవీ! మీకోసం ఇవ్వడానికి నాకున్నది ఒక ప్రాణమే కద అని దిగులుగా ఉంది..."

"ఆ ఒక్క ప్రాణాన్ని ఇలా బలివ్వనేల? ఈ అనాధ పిల్లకు సహాయం చేసేందుకు భద్రంగా ఉంచుకోండి!"

"ఏం చేయాలో చెప్పండి!"

"చోళ సామ్రాజ్యం దాయాదుల కలహం వల్ల నాశనం కాకుండ కాపాడాలి. అందుకు మీ సహాయం కావాలి."

"ఎలా?"

"మీ స్నేహితులు ఆదిత్య కరికాలన్ని కడంబూర్ శంబువరయ్యర్ మాళిగకు పిలుచుకొని రండి. శంబువరయ్యర్కి ఒక కూతురుంది. ఆమెను కరికాలన్‌కిచ్చి పెళ్ళి చేస్తే నా మనోరధం నెరవేరుతుంది..."

"ఇంత చిన్న పనికేనా ఇంత పెద్ద ఉపోద్ఘాతం/పీఠిక? ఆదిత్య కరికాలన్ గారిని తప్పక కడంబూర్ మాళిగకు పిలుచుకొని వస్తాను. తర్వాత...?"

"ఆయనకు శంబువరయ్యర్ కుమార్తెనిచ్చి పెళ్లి చేయించేస్తే సగం కలహం తీరిపోతుంది. ఆయనకు ఉత్తరార్ధ భాగాన్ని, మధురాంతకులకు దక్షిణార్ధ భాగాన్ని విభజించి ఇచ్చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారమయిపోతుంది."

"తర్వాత?"

"నాకొచ్చిన చెడ్డపేరు పోతుంది. తర్వాత నా తలవిధిని నేను నెరవేర్చుకొంటాను. నడి సముద్రంలో దూకి చనిపోతాను."

"నేను మీ వెనకే వచ్చి కాపాడుతాను. మన ఇద్దరి పునర్జన్మ ప్రారంభమౌతుంది. సముద్రాలను దాటి దూరదేశాలకు వెళదాం. అక్కడ మీకోసమే ఒక పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపిస్తాను."

"అయ్యా! ఇలా మాట్లాడకండి. దక్షిణ తమిళనాడు పత్నుల పరంపరలో వచ్చినదాన్ని. నేను పళువేట్టరయ్యర్ ధర్మపత్నిని..."

"దేవీ నాకు నిజం చెప్పండి. ఈ ముసలాయన్ను ఎందుకు పెళ్ళాడారు? ఈయన పైని ప్రేమతోనా? లేక, ఈయన బలాత్కారం వల్లనా?"

~

నందిని పెద్దగా నిట్టూర్చింది. ఆమె చూపులు పైకి వెళ్ళాయి. ఏవో దు:ఖపూరితమైన పాత జ్ఞాపకాలలో ఆమె కాసేపు మునిగిపోయినట్లు తోచింది.

"పాపం. ముసలాయన పైన నింద వేయకూడదు. మనసారా ఇష్టపడే ఈయనను పెళ్ళి చేసుకొన్నాను..."

"ఏల? ఎందుకని? ఈయనలో ఏం చూసి?"

"ఈయనలో ఏమీ చూడలేదు. అంతఃపురజీవితానికి, అధికారానికి ఆశపడి నేనే ఈయనను పెళ్ళాడాను."

"నేను నమ్మలేకున్నాను."

"నమ్మశక్యం కాని విషయమే ఇది. కానీ అది నిజం. చిన్నప్పటినుంచీ నేను పేదపిల్లనని, అనాధనని ఒకావిడ చెబుతూ వచ్చింది. రాజవంశపు పిల్లలతో ఆడే హక్కుకూడ లేదని చెప్పేది. ఆ అవమానాన్ని ఓర్చుకోలేక ఈ పొరబాటు చేశాను..."

"దేవీ! అలా మిమ్మల్ని అవమానించిన ఆ స్త్రీ పేరేమి?"

"తెలియలేదా? ఊహించుకోలేకపోయారా?"

"యువరాకుమారి కుందవై కద?"

"అవును."

"ఆమెకు నేనొకరోజు మంచి గుణపాఠం నేర్పుతాను."

"దేవుడే ఆమెకు తగిన శిక్ష విధించేశాడు. ముద్దుల తమ్ముడు, ప్రియుడు ఒకేసారి పోయారు. ఇప్పుడు ఆమె పరిస్థితి తలుచుకొంటే నాకే జాలేస్తూంది."

"ఈ శిక్ష ఆ అహంభావికి చాలనే చాలదు."

"కాసేపటికి మునుపు నేను మిమ్మల్ని అడిగిన సహాయం చేస్తే ఆమెకు పడవలసిన శిక్ష పూర్తవుతుంది. చోళసామ్రాజ్యానికి ఏకైక నాయకి కావాలన్న ఆమె ఆశ అడియాసవుతుంది / మట్టి కరుస్తుంది."

"మీ కోరికను నెరవేరుస్తాను. ఏం బహుమానమిస్తారు?"

"ఏదడిగినా ఇస్తాను. తమిళ కులస్త్రీల సంప్రదాయానికి విరుద్ధం కానిదేదైనా ఇస్తాను..."

"దేవీ! విదేశాల్లో ఒక కొత్త సంప్రదాయం పుట్టుకొస్తోందట. అరబ్బు దేశాలు, బాగ్దాద్, పారశీకం మొదలైన దేశాల్లో దంపతులు అంగీకరిస్తే విడిపోవచ్చుట. స్త్రీలు కూడ మరో పెళ్ళి చేసుకోవచ్చుట."

"అవును. నేను కూడ విన్నాను దాని గురించి."

"మనం కూడ ఆ దేశాలకు వెళ్లిపోదాం. వారి సంప్రదాయంలో చేరిపోదాం..."

"నేను కూడ అలా కొన్నిసార్లు పగటి కలలు కన్నాను. కానీ అది సాధ్యమయ్యే పనా?"

"దేవీ! ఎందుకు సాధ్యం కాదు? మీరొప్పుకొంటే జరుగుతుంది. మీతో ఓడెక్కి సముద్రాలు దాటి వెళతాను. ఈ చేతబట్టిన కత్తి బలంతో ఒక పెద్ద రాజ్యాన్ని స్థాపిస్తాను. నవరత్నఖచిత సింహాసనం మీద

మిమ్మల్ని కూర్చోబెడతాను! మీ శిరస్సున చూసేవారి కళ్ళు చెదిరిపోయేలాంటి మణిమకుటాన్ని పెడతాను. నేను పుట్టిందిందుకే; ఇందుకే ఇన్ని యుద్ధాల్లోను వీరమరణం పొందకుండ ఇంకా సజీవంగా ఉన్నాను..."

"అయ్యో! నా భర్త పడవలో తిరిగి వస్తున్నారు. పడవ తీరాన్ని సమీపిస్తోంది. మీ ఆవేశాన్ని కాస్త అదుపులో ఉంచండి. మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకొందాం...."

"తర్వాతెప్పుడు, దేవీ?"

"మాతో తంజావూరుకు రండి! అతిథిగా వచ్చేందుకు వీలు కాకపోతే బందీగా రండి!"

"మీ ఆహ్వానమే నాకు చాలు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

~

పళువేట్టరయ్యర్ ఎక్కివచ్చిన పడవ తీరం చేరుకొంది. ముసలాయన పడవ దిగి ఉద్రేకమే రూపుగొన్నట్లు వచ్చారు.

నందిని, పార్థిబేంద్రుడు లేచి నిలబడ్డారు. ఆయన వారిని చూసిన చూపులో నిప్పురవ్వలు ఎగిరాయి. పాపం! వారిద్దరూ అంతవరకు దగ్గరగా కూర్చొని మాట్లాడుతుండడమే వారి కోపానికి పెద్ద కారణం. దాన్ని వెళ్ళగక్కడానికి దారి లేదు. కాబట్టి ఆయన మనసులో కోపం మరింత ఉప్పొంగింది.

"నాథా! ఓడను బాగా శోధించారా? కళాసీలను బాగా విచారించారా? వీరు చెప్పిందంతా నిజమేనా?" అని నందిని కాస్త మెల్లగా అడిగింది.

ఆ స్వరం పళువూర్ రాజును కాస్త చల్లబరిచింది.

"అవును, రాణీ! ఇతడు చెప్పిందంతా నిజమేనని తెలిసింది. చోళదేశపు ప్రియపుత్రుడు, చోళవంశపు ముద్దుల కొడుకు, తమిళనాడు ప్రజల కంటిపాప ఇక లేడు!" అని చెప్పి, పార్థిబేంద్రుని చూసి, "అందుకు కారణం, ఇదిగో ఇక్కడ నిలబడ్డ ఈ హంతకుడే!" అని గర్జించారు.

"అయ్యో! అందుకు కారణం నేను కాదు; నామీద నింద మోపకండి! యువరాజును సముద్రం పొట్టనబెట్టుకోవడానికి, స్త్రీరూపం ధరించి చోళదేశాన్ని ఆడిస్తున్న (ఆ) మోహినీ పిశాచే!" అన్నాడు పార్థిబేంద్రుడు.

ముసలాయన కోపం ఇప్పుడు కట్టలు తెంచుకొంది. నందినిని ఉద్దేశించే అలా అంటున్నాడనుకొన్నారు. కింద పడివున్న ఈటెను తీసుకొని అతనివైపు గురిపెట్టారు.

"ఒరే పాపిష్ఠి వెధవా! ఏమన్నావు?"

నందిని ఆయన చేతిని పట్టి ఆపి, "నాథా! ఇదేం విపరీతం? ఎందరో శత్రువులను చంపిన మీ ఈటె ఈ అతిథి రక్తంతో అపవిత్రం కావచ్చా?"

"రాణీ! వీడా అతిథి? కాసేపటికి మునుపు వీడు నీ గురించి చెప్పింది వినలేదా?" అన్నాడు ముసలాయన, కోపంతో అదురుతున్న గొంతుతో.

“ఆయన నా గురించా చెప్పారు? బాగా అడిగి తెలుసుకోండి. అలాగైతే నా కత్తితోనే ప్రతీకారం తీర్చుకొంటాను. మీకు శ్రమ ఇవ్వను!” అన్నది నందిని.

“అయ్యా! నాకేమైనా పిచ్చా, పళువూర్ యువరాణి గురించి అలా చెప్పేందుకు? పళైయారైలో ఉన్న మోహినీపిశాచి గురించి కద చెప్పాను? యువరాకుమారి కుందపై వంతిదేవుడనే ఒక యువకుని చేత ఒక రహస్య తాళపత్ర సందేశం ఇచ్చి లంకకు పంపించింది. ఆ మొరటు యువకుని కాపాడేందుకే కద – నేనెంత అడ్డుపడి వారించినా కూడ వినకుండ – యువరాజు కల్లోలిత సముద్రంలోకి దూకారు? యువరాజు మరణానికి కుందపై కారణమని చెప్పాను" అన్నాడు పార్థిబేంద్రుడు.

పళువేట్టరయ్యర్ తమ తొందరపాటుకు సిగ్గుపడ్డారు. కానీ దాన్ని పైకి చూపించుకోకుండ, “ఊరకే నిజాన్ని దాచిపెట్ట ప్రయత్నించకు! యువరాజు అకాల మరణానికి నీవు కూడ బాధ్యుడివే. అటువంటి సుడిగాలి వీస్తున్నప్పుడు ఆయన పడవలోకి దిగేందుకు ఎలా సమ్మతించావు? - తొలగిపో! నా కళ్ళ ముందు నలబడకు!” అన్నారు.

నందిని అడ్డుపడి, “నాధా! ఈయనను కూడ తంజావూరుకు పిలుచుకొని వెళ్ళడం మంచిది కద? జరిగింది జరిగినట్లు ఈయనే చక్రవర్తికి చెప్పడం మంచిది కద? లేకపోతే మనపైన నింద మోపేందుకు కాచుకొని ఉన్నవారు దీన్ని కూడ చేర్చి చెబుతారు కద? మనమే యువరాజును సముద్రంలో ముంచేశామని జంకకుండ మనపైన నింద వేసేస్తారు కద?” అన్నది.

“అంటే అననీ! దానికంతా నేను బాధపడేవాడిని కాను. చెప్పేవారు నాలుక కోసేసుకొనేటట్లు చేస్తాను. కానీ ఇతడు మనతో రావడం ఒక విధంగా మంచిదే - పార్థిబేంద్రా! ఎందుకటూ ఇటూ చూస్తున్నావు? తప్పించుకోజూస్తున్నావా?” అని అంటూనే, దూరంగా నిలబడ్డ వీరులు నలుగురిని చేతులు చరిచి పిలిచారు.

“వీడిని పట్టి బంధించండి!” అని ఆజ్ఞాపించారు.

వీరులు నలుగురూ పార్థిబేంద్రుని సమీపించారు. వారు దగ్గరకు వచ్చేంతవరకు ఊరకున్నాడు. బాగా దగ్గరికి రాగానే వారిమీద తన హస్త లాఘవాన్ని ప్రయోగించాడు / చూపించాడు. నలుగురూ నాలుగు దిక్కులకు వెళ్ళి పడ్డారు.

“అయ్యా! నన్ను పట్టి బంధించేందుకు ఇంకెవరినీ పంపించకండి. ముప్పై మూడు యుద్ధాల్లో అరవై నాలుగు గాయాలు భరించిన వీరాధివీరులు పెద్ద పళువేట్టరయ్యర్ నన్ను బంధించేందుకు వస్తే నేనెప్పుడూ సిద్ధమే. తక్కినవారిని నా దరిదాపులకు కూడ రానివ్వను!” అన్నాడు.

పళువేట్టరయ్యర్ ముఖం కాస్త విప్పారింది. “నీవు వీర పల్లవ కులంలో పుట్టినవాడివి; సందేహం లేదు. తంజావూరుకు మాతో రావడానికి సమ్మతమేనని చెప్పు. నిన్ను పట్టి బంధించనవసరం లేదు!” అన్నారు.

"అదే నా కోరిక కూడాను; చక్రవర్తిని చూసి జరిగింది జరిగినట్లు చెప్పగోరుతున్నాను. నాపైన కూడ అనవసరమైన నింద పడకూడదు కద?" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అలాగైతే వెంటనే బయలుదేరుదాం!" అన్నారు పళువేట్టరయ్యర్.

~

ఆ సమయాన వారున్న చోటికి కాస్త దూరాన అడవిలో ఒక గుడ్లగూబ కూత వినిపించింది.

నందిని అటువైపు తిరిగి చూసింది. అందువల్ల ఆమె ముఖంలో వచ్చిన మార్పును తక్కిన ఇద్దరూ గమనించలేదు.

"ఈ కోడిక్కరై అడవి చాల విచిత్రమైనది. ఇక్కడ పట్టపగలే గుడ్లగూబ కూస్తూందే!" అన్నాడు పార్థిబేంద్రుడు.

మళ్ళీ రెండు సార్లు అదే విధమైన గూబ కూత వినిపించింది.

నందిని వారివైపు తిరిగి చూసి, "ఇప్పుడే బయలుదేరాలా? ఇంకా ఒక రోజు ఉండి చూడడం మంచిది కద? యువరాజు ఏదైనా కొయ్యదిమ్మెను పట్టుకొని తీరానికి వచ్చి గట్టెక్కి ఉండవచ్చు కద?" అన్నది.

"పార్థిబేంద్రా! యువరాణి దూరాలోచన చూశావా? మనకిది తట్టనే లేదు కద? అవును. ఇక్కడ ఇంకోరోజు విడిది చేయవలసిందే. ఉండడం మాత్రమే కాదు, సముద్రతీరం వెంబడి మనుషులను నిలబెట్టాలి. వెతికి చూడమని కూడ చెప్పాలి!" అన్నారు పళువేట్టరయ్యర్.

"నాకు అభ్యంతరం లేదయ్యా! కానీ యువరాజిక కనిపిస్తారన్న నమ్మకం నాకు లేదు. సుడిగాలి వీచినప్పుడు సముద్రాన్ని చూసివుంటే మీరు కూడ నాలాగే నిరాశ పడేవారు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

అయినా కూడ, ముసలాయన వినిపించుకోలేదు. తీరం పొడవునా ఒక కోసు దూరం వరకు తన మనుషులను నిలబెట్టించారు. ఆయన కూడ నెమ్మది వీడి సముద్రతీరం వెంబడి అసహనంగ పచార్లు చేయసాగారు.

~~~
~~~

# అధ్యాయము - 4

## మొగలి పొద

**నడిసముద్రంలో** పడవ ఊయలలాగ ఉల్లాసంగా ఊగుతూ సాగింది. రెండురోజులకు మునుపు అక్కడ కొబ్బరి చెట్టంత ఎత్తు అలలు ఉవ్వెత్తున లేచి అల్లకల్లోకం పుట్టించాయని ఊహించడం కూడ అసాధ్యం.

పడవలో పొన్నియిన్ సెల్వన్ వంతిదేవుడు, పూంగుళలితో వెళుతున్నారు.

పూంగుళలి చేత తెడ్డు పట్టుకొంది. కానీ తెడ్డు వేయక, పొన్నియిన్ సెల్వన్‌కి వంతిదేవునికి మధ్య నడుస్తున్న సంభాషణను శ్రద్ధగా వింటూంది.

వారు కూడ మాటల్లో పడి, పడవ వేగంగా వెళ్ళాలన్న ఆదుర్దా, ఆసక్తి కనబరచలేదు.

పడవ కోడిక్కరై చేరిన తర్వాత ఏం చేయాలన్న విషయం గురించే మాట్లాడుకొంటున్నారు. యువరాజు తంజావూరుకు వెళ్ళకూడదనీ, పళైయారైకు రావాలని వంతిదేవుడు వాదించాడు. అందుకు పలు కారణాలను ఎత్తి చూపాడు కూడాను.

"తమ సహోదరి అత్యవసరకార్యం మీద మిమ్మలి వెంటనే చూడగోరుతున్నారు. తమను నాతోబాటే పిలుచుకొని వస్తానని మాటిచ్చాను. దాన్ని నెరవేర్చే తీరాలి!" అన్నాడు వంతిదేవుడు.

"నీ మాటను నెరవేర్చేందుకోసం నా తండ్రి ఆజ్ఞను మీరమంటున్నావా?" అని యువరాజు కోపంగా అడిగారు.

"అది మీ తండ్రి ఆజ్ఞ కాదు; పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ కద?" అన్నాడు వంతిదేవుడు.

దానితోబాటు ఇంకొక విషయాన్ని కూడ ఎత్తి చూపాడు: "చక్రవర్తిని మీరు చూసేందుకు వెళుతున్నా కూడ, స్వతంత్రంగా వెళ్లడం మంచిది కద? పళువేట్టరయ్యర్ల బందీగా వెళ్ళడం మంచిదా? నేను చెబుతున్నాను వినండి. 'మిమ్మల్ని పళువేట్టరయ్యర్లు చెరబట్టారు  అన్న వార్త బయటికి పొక్కాలంతే. చోళదేశపు ప్రజలందరూ ఒక్కుమ్మడిగా వచ్చేస్తారు. తమ ప్రియతమ మాతృభూమి రణరంగంగా మారిపోతుంది. అది మంచిదా అని ఆలోచించండి! అటువంటి కీడు చోళనాడుకు కలగకూడదని దేవుడే ఆ సుడిగాలిని సృష్టించినట్లుంది. దేవుని కోరికకు విరుద్ధంగానైన మీరు చోళనాడులో కల్లోలం సృష్టించాలని కోరుకొంటున్నారా?" అని అడిగాడు వంతిదేవుడు.

ఇంతవరకు వంతిదేవుడు చేస్తూ వచ్చిన వాదాల్లో ఇది యువరాజు మనసును కాస్త మార్చింది. తమను పళువేట్టరయ్యర్లు బంధించారంటే చోళదేశంలో తప్పక కలవరం పుడుతుంది. ప్రజలకు తమపైనున్న అభిమానం ఎంతటి బలీయమైనదన్నది ఆయనకు తెలిసిన విషయమే. కాబట్టి యువరాజు దీర్ఘాలోచనలో

మునిగిపోయారు.

కాసేపటి తర్వాత, "అలా నేను నీ మాటను నెరవేర్చేందుకు ఒప్పుకొన్నా, అదెలా సాధ్యమవుతుంది? కోడిక్కరైలో పళువేట్టరయ్యర్ మనుషులు నాకోసం కాచుకొని ఉండరా?" అని అడిగారు.

"అందుకు సహాయం చేసేందుకు ఈ పడవ నడిపే పిల్ల ఉంది. తీరాన ఎంతమంది మీకోసం కాచుకొని ఉన్నా, వారి కళ్ళుగప్పి అడవిలోపలి దారి గుండా మనని తీసుకొని వెళ్ళి చేర్చగలదు - పూంగుళలి! నేను చెప్పింది నీ చెవిన పడిందా? అలా చేయగలవా?" అని అడిగాడు వంతిదేవుడు.

~

పూంగుళలి అప్పుడు ఏదో స్వర్గంలో ఉంది. యువరాజును కల్లోలిత సముద్రం నుంచి కాపాడి పడవలోకెక్కించుకొని తీసుకొని వచ్చిన విషయం ఆమెకు అపారమైన సంతోషాన్నిచ్చింది.

కోడిక్కరై చేరిన వెంటనే ఆయన నుంచి విడిపోవాలి కద అన్న ఆలోచన అప్పుడప్పుడు తలెత్తి ఆమెను బాధించసాగింది. పైగా, ఆయనకేవిధంగానైనా సహాయం చేయగలిగితే అంతకన్న ఇంకేముంది?

"కోడిక్కరైకి పశ్చిమంగా కాస్త ఎడంగా పడవను తీసుకొని వెళితే రెండువైపులా దట్టంగా అడవివున్న ఒక కాలువ ఉంది. దాని గుండా పడవ నడుపుకొంటూ వెళ్ళవచ్చు; ఇరువైపులా బురదనేల. ఎవరూ సులభంగా రాలేరు!" అన్నది పూంగుళలి.

"మమ్మల్ని అక్కడ వదిలిపెట్టి, కోడిక్కరైకి వెళ్ళి సమాచారమేమని విచారించి తెలుసుకొని రాగలవు కద?"

"అవుతుంది. పడవను ఎవరూ చూడలేనట్లు దాచిపెట్టేందుకు ఎన్నో చోట్లున్నాయి."

"యువరాజా! విన్నారు కద?" అన్నాడు వంతిదేవుడు.

"విన్నాను. అయ్యా! నా మాతృభూమిలోనే దొంగలాగ ప్రవేశించమంటున్నావు , దొంగలాగ దాక్కోమంటున్నావు" అన్నారు.

పడవలో కాసేపు మౌనం నెలకొంది. తర్వాత యువరాజు, "సముద్రకుమారీ! పడవనెందుకు పూర్తిగా ఆపేశావు?" అని అడిగారు.

పూంగుళలి వంతిదేవునొకసారి చూసి, మళ్ళీ తెడ్డు వేయనారంభించింది.

"పాపం! ఈ పిల్ల ఒక్కతే ఎంతసేపని తెడ్డు వేస్తుంది? నేను కాసేపు తెడ్డు వేసి చూస్తాను. ఏదీ ఇలా ఇవ్వమ్మా తెడ్డును!" అన్నాడు వంతిదేవుడు.

అతని ఉద్దేశాన్ని గ్రహించి యువరాజు చిరునవ్వు నవ్వారు.

"మిత్రమా! నీ పన్నాగమంతా వృధానే. నేను పళైయారైకి పోబోవడం లేదు; తంజావూరును చూసేందుకూ వెళ్ళడం లేదు. దేవుడు నన్ను కైలాసానికే తీసుకొని వెళతాడు లాగుంది!" అన్నారు.

వంతిదేవుడు, పూంగుళలి అదిరిపడి, భీతితో యువరాజును గుచ్చి చూశారు. ఆయన ఒళ్ళు

వణకనారంభించడాన్ని గమనించారు.

వంతిదేవుడు ఆయనను సమీపించి, “అయ్యా! ఇదేమి? మీ ఒళ్ళంతా ఎందుకు వణుకుతోంది?” అని గాభరాతో అడిగాడు.

“ఇది చలిజ్వరం. లంకలో ఇది విపరీతంగా వ్యాపించివుందని చెప్పాను, గుర్తులేదా? ఈ జ్వరం వచ్చినవారు బతకడం చాల అరుదు!” అన్నారు యువరాజు.

నడిసముద్రాన ఓడ తెరచాప స్తంభం మీద పిడుగు పడి నిప్పంటుకొన్నప్పుడు కూడ వంతిదేవుడు అంత కలతబారలేదు. యువరాజు ఇప్పుడు చెప్పిన విషయం అతన్ని అంతగా దిక్కు తోచనట్లు చేశాయి.

పూంగుళలి చేతినుంచి తెడ్డు జారిపోయింది. ఒంట్లో జీవశక్తి పూర్తిగా ఇంకిపోయింది. కళ్ళలో మాత్రం జీవశక్తి కనిపించింది. ఆ కళ్ళతో యువరాజును వెర్రిదానిలాగ చూడసాగింది.

యువరాజు ఒళ్ళు వణకడం అధికమైంది. కాసేపటికల్లా ఎగిరెగిరి పడసాగింది.

“అయ్యా! నేనేం చేయను? చెప్పండి! నాకేం చేయాలో తోచడం లేదు. పడవను ఎక్కడికి తీసుకొని వెళ్ళడం? పూంగుళలి! కోడిక్కరైలో వైద్యులున్నారు కదా?” అని వంతిదేవుడు ఆదుర్దాగా అడిగాడు.

పూంగుళలికేమో నోట మాట పెగలడం లేదు.

యువరాజు ఉన్నట్లుండి ఎగిరి లేచి నిలబడ్డారు. వణుకుతున్న ఒళ్ళిప్పుడు నిలబడలేక తడబడసాగింది.

“నన్ను నా అక్క దగ్గరకు తీసుకొని వెళ్ళండి! నన్ను వెంటనే యువరాకుమారి దగ్గరకు తీసుకొని వెళ్ళండి!” అన్న మాటలు ఆయన నోటినుంచి పలవరింతగా వెలువడ్డాయి.

ఇది విన్న వంతిదేవునికి గాభరా కలిగింది. దానితో ఏం చేయాలో తోచక అవాక్కై నిలబడ్డాడు.

గడగడ వణుకుతున్న యువరాజు మరుక్షణమే, “అక్కా! ఇదిగో వస్తున్నా! నిన్ను చూసేందుకు వస్తున్నా! ఎవరడ్డగించినా ఇక వినను!” అని గట్టిగా పలవరిస్తూనే పడవనుంచి సముద్రంలోకి దూకబోయారు.

మంచివేళగా, వంతిదేవుడు పరిస్థితి గ్రహించి, చటుక్కున యువరాజును పట్టుకొని ఆపాడు - ఎందుకంటే అప్పుడు యువరాజు తమ స్వీయ ప్రజ్ఞ కోల్పోయారు కాబట్టి.

సాధారణంగానే బలశాలియైన యువరాజు జ్వరతీవ్రత వల్ల ఇంకా పదిరెట్లు బలంగొన్నారు. వంతిదేవుని పట్టునుంచి జారుకోజూశారు. తానొక్కడే ఆయనను ఆపలేనని గ్రహించిన వంతిదేవుడు, “పూంగుళలీ! పూంగుళలీ! వెంటనే పరుగెత్తి రా!” అని అరిచాడు.

చేష్టలుడిగి బొమ్మలాగ నిలబడ్డ పూంగుళలి వెంటనే జీవం పోసుకొంది. ఒక్క దూకులో యువరాజు దగ్గరకు వచ్చి, అయన కడలిలో పడిపోకుండ ఒక చేతిని పట్టుకొంది. జ్వరతీవ్రత వల్ల

యువరాజుగొన్న బలం వెంటనే మటుమాయమైంది. చిన్న బిడ్డలాగ మారిపోయారు.

"అక్కా! నీవు చెప్పినట్లే మాట్లాడకుండ పడుకొంటాను. నాగురించి దిగులుపడకు. అక్కా! నీవు లేకపోతే నా గతేమి?" అని చెప్పేసి యువరాజు వెక్కి వెక్కి ఏడ్వసాగారు.

~

వంతిదేవుడు, పూంగుళలి యువరాజును మెత్తగా/మెల్లగా పడవలో పడుకోబెట్టారు.

తర్వాత పొన్నియిన్ సెల్వన్ మాట్లాడకుండ పడుకొన్నారు. ఆయన కళ్ళు ఎక్కడో దూరాన వెర్రిగా చూడసాగాయి. ఆయన నోటినుంచి ఏవేవో మాటలు అస్పష్టంగా రాసాగాయి. కొన్నేమో అర్థవంతంగా ఉన్నాయి. కానీ చాలవరకు అసంబద్ధమైన మాటలుగా తోచాయి.

~

యువరాజును ఇప్పుడు ఏం చేయాలన్న విషయం గురించి అడగడం వ్యర్థమని గ్రహించాడు వంతిదేవుడు. ఈ భయంకరమైన ఆపదనుంచి యువరాజును కాపాడే బాధ్యత కూడ తన భుజాలపైన ఉందని కూడ గ్రహించాడు. కానీ చాల తెలివైన ఈ పిల్ల తనతో ఉన్నప్పుడు తనలాగే యువరాజును కాపాడడం గురించి దిగులుపడి ఆలోచిస్తుంది. అంతేగాక ఎన్నో అపాయాలనుంచి తనను కాపాడిన దేవుని దయ, కరుణ ఉండనే ఉన్నాయి.

"పూంగుళలీ! ఇక పడవను తిన్నగా నడుపుకొని వెళ్ళాలి!" అన్నాడు వంతిదేవుడు.

అందాక శక్తి కోల్పోయివున్న ఆమె చేతులు మళ్ళీ బలం పుంజుకొన్నాయి. పడవ వేగంగా ముందుకు సాగింది.

వంతిదేవుడు ఇక యువరాజు దగ్గరే కూర్చొన్నాడు. మళ్ళీ జ్వరతీవ్రత అధికమై యువరాజు సముద్రంలోకి దూకజూస్తే ఏం చేయాలన్నది తెలియక అతని మనసు కల్లోలితమైంది. కాబట్టి అప్రమత్తంగా ఆయన్నే చూస్తూ కూర్చొన్నాడు. అదే సమయాన ఇక ముందు ఏం చేయాలన్న విషయం గురించి కూడ తీవ్రంగా ఆలోచించసాగాడు.

"అమ్మాయి! నీకేమనిపిస్తోంది? తెగించి కోడిక్కరైకి వెళదామా? యువరాజును కాపాడేందుకు నీ కుటుంబీకులు సహాయం చేస్తారు కదా?" అని అడిగాడు.

"అయ్యా! ఈ కాలంలో ఎవరిని నమ్మవచ్చు, ఎవరిని నమ్మకూడదని ఎలా చెప్పడం? నా అన్న భార్య ఒకతె ఉంది. అమెకు విపరీతమైన ధనాశ. నా తండ్రిని మించిన వాళ్ళు పళువేట్టరయ్యర్లు!" అన్నది పూంగుళలి.

"పైగా తమను పట్టుకోవడానికి వచ్చిన పళువూర్ మనుషులు ఇంకా కోడిక్కరైలో ఉండవచ్చు. యువరాజు రాకను ఎదురుచూసి ఇంకొంత మందిని కూడ అక్కడ నియమించి ఉండవచ్చు!" అని ఇంకా చెప్పకొచ్చింది.

ఆమె ముందాలోచనకు వంతిదేవుడు ఆశ్చర్యపోయాడు. ఈ ఇక్కట్టైన పరిస్థితిలో తనకామె సహాయం దొరికినందుకు సంతోషించాడు.

"అలాగైతే తిన్నగా కోడిక్కరైకి వెళ్ళడం అపాయకరమైనదని నీవు కూడ భావిస్తున్నావా?" అన్నాడు.

"అదిగో చూడండి!" అని వేలెత్తి చూపించింది పూంగుళలి.

ఆమె చూపించిన దిక్కున ఒక ఓడ నిలిచివుంది. దానికవతల కోడిక్కరై దీపస్తంభ గృహపు శిఖరం కనిపించింది.

"ఆహా! పెద్ద పడవ ఒకటి నిలబడివుందే! అది ఎవరిదో ఏమో! ఒకవేళ పార్థిబేంద్రుని ఓడ కావచ్చు. అలాగైతే ఈ పరిస్థితిలో యువరాజును కంచికి తీసుకొని వెళ్ళడమే మంచిది కదా?"

"పళువేట్టరయ్యర్ల ఓడైనా కావచ్చు. అయ్యా! ఓడకు వెనక ఏమైనా కనిపిస్తోందా?"

"కోడిక్కరై దీప గృహపు శిఖరం కనిపిస్తోంది."

"దానిలో ఏదైనా విచిత్రంగా కనిపిస్తోందా?"

"నాకేమీ విచిత్రంగా కనిపించడం లేదే?"

"నాకు కనిపిస్తోంది. ఆ శిఖరాన మనుషులు గుంపుగా నిలబడి సముద్రాన్ని పరీక్షగా చూస్తున్నట్లు అనిపిస్తోంది."

"అక్కడినుంచి చూసేవారికి ఈ పడవ కనిపిస్తుందా?"

"కనిపించదు. తీరానికి ఇంకాస్త దగ్గరగా వెళితే కనిపిస్తుంది."

"దేనికీ మనం ముందు జాగ్రతలు తీసుకోవడం మంచిది. నీవింతకు మునుపు చెప్పావే, కోడిక్కరైకి పడమరగా ఒక కాలువ ఉందని? పడవను అక్కడికే నడుపుకొని వెళదామా?"

"అలాగే చేయాలి. చీకటి పడేటప్పటికి అక్కడికి వెళ్ళి చేరుదాం. అయ్యా! మీరొక రోజు చీకటి మంటపంలో దాక్కొన్నారు కదా? దానికతి సమీపాన ఆ కాలువ ఉంది. యువరాజుతోబాటు మీరక్కడ కాసేపు వేచివుంటే నేను వెళ్ళి అంతా విచారించి తెలుసుకొని వేగంగా తిరిగి వచ్చేస్తాను."

"పూంగుళలీ! కాలువ అక్కడే అంతమవుతుందా? లేక ముందుకు సాగుతుందా?"

"కాలువ నాగపట్టణందాక వెళుతుంది" అన్నది పూంగుళలి.

~

ఆ సమయాన యువరాజు పెద్దగా తనలోలోను మాట్లాడుకోవడం వినిపించింది.

"అవునక్కా, అవును! నాగపట్టణపు బౌద్ధ భిక్షువులు చెప్పారన్నావే? అలాగే జరిగింది. అనురాధపురంలో బౌద్ధ మహాసంఘ భిక్షువులు లంకా సింహాసనాన్ని, మణిమకుటాన్ని నాకివ్వడానికి ముందుకు వచ్చారు. నేనే తిరస్కరించాను. అక్కా! రాజ్యమంటే నాకు ఆశ లేకపోవడం వల్లనే వద్దని

నిరాకరించాను. నీవింకేం చెప్పినా చేస్తాను. రాజ్యమేలే భారం మాత్రం వద్దు! దానికన్న సముద్రంలో పడవ నడుపుకొంటూ ఎంతో ఆనందంగా జీవితం గడపవచ్చు. వినక్కా! కోడిక్కరైలో పడవ నడిపే పిల్ల ఒకతె ఉంది..."

ఇది విన్న పూంగుళలి ఒళ్ళంతా పులకరించింది. వంతిదేవునికేమో చిరాకు ముంచుకొచ్చింది. ముందుకేం చెబుతారోనని ఇద్దరూ ఆపలేని ఉత్సుకతతో వినసాగారు. కానీ ఉన్నట్లుండి యువరాజుకు కాస్త తెలివి వచ్చినట్లు తోచింది.

చుట్టూ కళ్ళప్పగించి చూసి. "ఇంకా కోడిక్కరై రాలేదా?" అని హీనస్వరాన అడిగారు.

వంతిదేవుడు "అదిగో తీరం కనిపిస్తోంది!" అన్నాడు. యువరాజును ముందేం చేయాలో అడుగుదామా, వద్దా? అని అతడు ఆలోచించేలోపు యువరాజు మళ్ళీ ప్రజ్ఞ కోల్పోయి జ్వరభ్రాంతి లోకంలోకి జారిపోయారు.

~

యువరాజు చివరగా పడవ నడిపే పిల్లను గురించి చెప్పిన మాటలు ఆమె మదిలో లజ్జాతరంగాలుగా లేచాయి. ఆమె సిగ్గుతో వంతిదేవుని వైపు, యువరాజు వైపు తలెత్తి చూడలేకపోయింది. కాబట్టి పడవ వెళుతున్న వైపే చూపులు సారించి తెడ్డు వేయసాగింది. అంతవరకు ఓడ నిలబడ్డ దిశగా వెళుతున్న పడవ ఇప్పుడు దిశ మారి నైఋతి (దక్షిణ – పశ్చిమ) దిశగా వెళ్ళనారంభించింది.

చీకటి పడే సమయానికి కడలి నుంచి భూమి లోపలికి చొచ్చుకొని వచ్చిన కాలువ లోపలికి ప్రవేశించింది.

పూంగుళలి చెప్పినట్లే అక్కడ గట్లు రెండువైపుల ఎత్తుగా ఉన్నాయి. ఆ ఎత్తైన గట్లమీద రెండువైపుల చెట్లు ఎత్తుగా, దట్టంగా పెరిగివున్నాయి.

పడవను ఒడ్డు వారగా ఆపి, మెల్లగా, "అయ్యా! పడవను కాస్త చూసుకోండి!" అని చెప్పి పడవనుంచి ఒడ్డున దిగింది పూంగుళలి. గట్టుమీద ఎత్తుగా ఎదిగిన ఒక చెట్టెక్కి చుట్టూ పరికించి చూసింది. తర్వాత తొందరగా దిగింది. "మంచివేళ! ఇక్కడికి వచ్చాము. సముద్రతీరం వెంబడి సుమారు ఒక కోసు దూరం వరకు మనుషులు వరుసగా నిలబడివున్నారు. దీప గృహం దగ్గర చాల కోలాహలంగా ఉంది!" అన్నది.

"ఎవరై ఉండవచ్చని ఏమైన తెలుస్తోందా?" అని వంతిదేవుడు ఆసక్తితో అడిగాడు.

"సరిగ్గా తెలియలేదు. కానీ పళువేట్టరయ్యర్ మనుషులే అయివుండాలి. మరింకెవరై ఉండ సాధ్యం? ఎలా వున్నా, మొదట నేను చెప్పిన చోటికి వెళ్ళి చేరుదాం. రాత్రి రెండో జాము లోపల నేను మా ఇంటికి వెళ్ళి అంతా తెలుసుకొని వస్తాను!" అన్నది.

"అమ్మాయి! నిన్నెవరైనా చూసి కనిపెట్టేస్తే ఏం చేయడం? ఈ సమయాన నీకేమైనా అయితే మా

గతి అధోగతే!" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యో! నా ప్రాణం గురించి నేనిన్నాళ్ళు పట్టించుకోలేదు. ఈ రోజే దిగులు పుడుతోంది. యువరాజుకు అపాయం తొలగే వరకు నాకే ప్రాణాపాయం రాదు!"

పడవ కాలువ వెంబడి నెమ్మదిగా సాగింది. ఏమాత్రం శబ్దం రాకుండ తెడ్డు వేస్తూ వెళ్ళింది పూంగుళలి.

కాలువ ఇరువైపులా చిమ్మ చీకటి. కాబట్టి కాలువ గట్టు వెంబడి ఎత్తుగా పెరిగిన చెట్ల నీడలు కాలువ నీటిపైన పడి ఆ నల్లని కాలువ నీటిని ఇంకా నల్లబర్చాయి.

ఆకాశం నుంచి చుక్కలు తొంగి చూశాయి. నక్షత్రాలు కూడ వంతిదేవుని లాగనే ఆ పడవ గమనాన్ని గమనిస్తున్నట్లు తోచింది.

నీట ప్రతిఫలించిన నక్షత్రాలు, ఒడ్డునున్న చెట్లు గాలికి ఆడినప్పుడల్లా, వాటి నీడలు కూడ కదలాడగా, తరచు చలించసాగాయి. వంతిదేవుని మనసులో అప్పుడు చెలరేగిన సంచలనాన్ని అవి బాగ ప్రతిబింబించాయి.

ఒక యుగం లాగ అనిపించిన ఒక ఘడియ కాలంపాటు పడవ కాలువలో వెళ్ళిన తర్వాత, పూంగుళలి పడవను గట్టు వారగా అపింది.

~

పూంగుళలి గట్టెక్కి అడవి దారిన దూరి వెళ్ళింది. అంటే ఆమె శరీరం వెళ్ళింది. ఆమె ప్రాణం మాత్రం కాలువ గట్టున విడిచి వచ్చిన పడవలోనే ఉంది.

ఆ సంధ్యాసమయపు చీకటిలో ముళ్ళ చెట్లు, మిట్టపల్లలు, అడవి జంతువులు వేటినీ లెక్కచేయక అతివేగంగా ముందుకు సాగింది. ఆటంకాలు లేని చోట పరుగెత్తి కూడ వెళ్ళింది. తిన్నగా కోడిక్కరై కుళకర్ గుడిని గురిగా పెట్టుకొని వెళ్ళింది. ఆమె కోవెల వాకిట చేరడానికి, పూజారి స్వామి సన్నిధి తలుపుకు తాళం వేసేందుకు సరిగ్గా సరిపోయింది.

చుట్టుపక్కల పరికించి చూసి, ఇంకెవ్వరూ లేరని దృఢపరుచుకొంది. తలుపుకు తాళం వేసి ఇటు తిరిగిన పూజారి ముందు వెళ్ళి నిలబడింది.

పూజారి ఆమెనాసమయాన చూసి కాస్త ఆశ్చర్యపోయారు. ఆమె స్వభావం బాగా తెలిసినవారైనా, కాస్త ఉలిక్కిపడ్డారు.

"నీవా, పూంగుళలీ! ఇంకెవరో అనుకొన్నాను. కోడిక్కరై అంతటా ఒకటే కోలాహలంగా ఉంది. ఎక్కడమ్మా, నీవు కొన్ని రోజులుగా కనిపించడం లేదే? ఇంతటి గడబిడలో కూడ నీగురించి సమాచారమే లేదని ఈ రోజు సాయంత్రం కూడ అనుకొన్నాను" అన్నారు.

"పై ఊళ్ళకు వెళ్ళాను. స్వామీ! ఏదో కోలాహలంగా ఉందనే, మిమ్మల్ని విచారించి

తెలుసుకొందామని వచ్చాను. సముద్రతీరం వెంబడి నిలబడ్డ వారెవ్వరు?" అని అడిగింది పూంగుళలి.

"నీకేమీ తెలియదా, అమ్మా? ఇంటికి వెళ్ళనే లేదా?"

"ఇంటివైపు వెళ్ళాను. అక్కడ ఎవరెవరో గుంపుగా ఉండడం చూసి వెనుదిరిగాను. కొత్త మనుషులను చూస్తే నాకు నచ్చదని మీకు తెలుసు కద? వచ్చిన వారెవరు?"

"పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చారు. ఇంకా ఇక్కడే ఉన్నారు. ఆయనతోబాటు యువరాణి కూడ వచ్చింది. వారి పరివారాలు వచ్చి దిగారు. ఇంకా, కాంచీపురపు పార్థిబేంద్ర పల్లవుడట! అతడు కూడ వచ్చివున్నాడు. ఊరకే రాలేదు. భయంకరమైన వార్త తోటి వచ్చారు. నీకు అది కూడ తెలియదా, పూంగుళలీ?"

"అదేమా భయంకరమైన వార్త? నాకేమీ తెలియదే!"

""ఆ పాపిష్టివాడి ఓడలో పొన్నియిన్ సెల్వన్ కూడ వచ్చారట. దారిన సుడిగాలి వీచిందట. ఎవరినో కాపాడేందుకు యువరాజు సముద్రాన దూకేశారట. తర్వాత కనిపించనేలేదట! ఒకవేళ ఈ కోడిక్కరై సముద్రతీరాన ఒడ్డుకు చేరుకొని తలదాచుకొన్నారేమోనని వెతికేందుకే పళువేట్టరయ్యర్ మనుషులు తీరమంతటా తిరుగాడుతున్నారు. పళువేట్టరయ్యర్ కూడ తిరుగాడుతున్నారు. అంతెందుకు, ఆయన యువరాణి కూడ తిరుగాడుతోంది. ఆ తల్లి కాసేపటికి మునుపు ఇక్కడికి కూడ వచ్చింది. పూంగుళలీ! పళువూర్ యువరాణి గురించి ప్రజలంతా ఏవేవో మాట్లాడుకొంటున్నారు కద! అదంతా శుద్ధ తప్పు! మన యువరాజుకు పట్టిన గతి గురించి ఆమె ఎంత విలవిల్లాడిపోయిందో తెలుసా?"

"అలాగా, అయ్యగారూ! పళువూర్ యువరాణి మంచి గుణం గురించి మీరు చెప్పింది నాకు చాల సంతోషంగా ఉంది. కానీ ఆమె ఇక్కడికెందుకు వచ్చిందట?"

"యువరాజు ఎలాగైనా సజీవంగా దొరకాలని కుళక్కర్ స్వామిని ప్రార్థించేందుకే వచ్చిందట. నీలాగ అందరూ రాతిగుండె కలిగివుంటారా? యువరాజును గురించిన అంతటి భయంకరమైన వార్త వినికూడ నీవు కించిత్తు కలతబారలేదేమి?"

"మనం దిగులు పడి, గాభరా పడి ఏం ప్రయోజనం, స్వామీ? అంతా విధి ప్రకారం జరుగుతుందని మీరే ఎన్నోసార్లు చెప్పారు కద? అదలా ఉండనీ! అంత పెద్ద మనుషులు వచ్చివున్నప్పుడు నేను నా ఇంటికి వెళ్ళడానికి ఇష్టపడడం లేదు. మీ చేతవున్న ప్రసాదాన్ని నాకిచ్చి వెళ్ళండి. నేనిక్కడే భోంచేసి గుడిలోనే ఉంటాను."

"నీవొక విచిత్రమైన వ్యక్తివి, పూంగుళలీ! పెద్ద మనుషులు వస్తే అందరూ వారిని వెళ్ళి చూసేందుకు, పరిచయం చేసుకోవడానికి ఇష్టపడతారు. నీకు కొత్త వారంటేనే ఇష్టం లేదు. అందులోను, పెద్ద మనుషులంటే భలే భయం. వాళ్ళు నిన్ను నమిలి మింగేస్తారా? ఎందుకని ఈ అడవిలో ఒంటరిగా ఉండాలి?"

"పూజారయ్యా! ప్రసాదాన్ని ఇచ్చేందుకు మీకిష్టం లేకపోతే ఇవ్వకండి. నన్ను ఊరకే తిట్టకండి."

“శివశివా! నేను నిన్నెందుకు తిడతాను? ఈ ప్రసాదం నీ ఆకలికి చాలదే అని చూస్తున్నానంతే. ధారాళంగా తీసుకో!” అని పూజారి బట్టలో మూట కట్టిన ప్రసాదాన్ని పూంగుళలికిచ్చారు.

పూంగుళలి ప్రసాదం మూట తీసుకొని, విప్పి చూసి, “నా ఆకలికి ఇది చాలదు, నిజమే! అంత పెద్ద స్వామికి ఇంత తక్కువగా నైవేద్యం పెట్టారేమి? ఇది న్యాయమా, స్వామీ? పోతే పోనీ! ఆ కలశంలో ఏముంది? తీర్థజలమా?”

“కాదు. స్వామికి అభిషేకం చేసిన పాలు! బిడ్డకోసం తీసుకొని వెళుతున్నాను.”

’ఈ రోజు నేనే మీ బిడ్డను. దాన్ని కూడ నాకే ఇచ్చి వెళ్ళండి. మీకు పుణ్యముంటుంది!”

“భలే అమ్మాయివమ్మా, నీవు! పోనీ, కలశాన్నైనా జాగ్రత్తగా తీసివుంచు.”

ఇలా చెప్పి కోవెల పూజారి కలశాన్ని కూడ పూంగుళలికిచ్చారు.

ఆ సమయాన దూరాన ఎక్కడో గుడ్లగూబ కూత వినిపించింది.

పూంగుళలి ఉలిక్కిపడి, “అయ్యో! అదేం శబ్దం?” అని అడిగింది.

“తెలియలేదా, అమ్మా? గుడ్లగూబ కూస్తోంది. ఈ కోడిక్కరై అడవిలో గుడ్లగూబలకా కొరత?” అన్నారు పూజారి.

మళ్ళీ ఆ కూత వినిపించింది.

“అవును; గుడ్లగూబ కూతలాగే ఉంది!” అన్నది పూంగుళలి,

“నిన్ను ఏ గుడ్లగూబా ఏమీ చేయదు. కోవెల ప్రాకారం తలుపుకు గొళ్ళెం పెట్టి పడుకోమ్మా!” అని చెప్పేసి పూజారి వెళ్ళిపోయారు.

~

పూజారి మరుగైన వెంటనే పూంగుళలి కూడ బయలుదేరింది. ప్రసాదాన్ని ఒడిలో కట్టుకొని, కలశాన్ని చేత పట్టుకొని నడిచింది.

గుడ్లగూబ కూత వినిపించిన వైపు నడిచింది.  కాస్త దూరం వెళ్ళగానే ఒక సన్నటి కాలువ అడ్డం వచ్చింది. దాని ఇరువైపులా మొగలి పొదలు, అడవిలాగ పెరిగివున్నాయి.

ఆ కాలువ వెంబడే వెళ్ళింది పూంగుళలి. మొగలి పొదల ముళ్ళు కొన్నిసార్లు ఆమెను గుచ్చాయి. ఆమె దాన్ని పట్టించుకోలేదు.

మొగలి పూలు విరిసి తమ పరిమళాన్ని వెసజల్లుతున్నాయి. ఆ సువాసన తక్కినవారికి మైకమెక్కేలా చేసేది. కానీ పూంగుళలి దాన్ని పట్టించుకోనే లేదు.

కాలువ గట్టు వెంబడి కాలి చప్పుడు వినిపించనట్లు మెల్ల మెల్లగా నడిచి వెళ్ళింది. ఆమె చెవులు అతిశ్రద్ధగా రిక్కించి వినసాగాయి. అడవి ప్రదేశంలో రాత్రిపూట ఎన్నో రకరకాలైన శబ్దాలు వినిపిస్తాయి కద? కానీ ఆమె వాటిని పట్టించుకోనేలేదు.

మరి, ఆమె ఏ శబ్దాన్ని ఎదురు చూసింది? ఇదిగో!

ఇద్దరు మెల్లగా మాట్లాడుకోవడం వినిపించింది.

ఒకటి మగ గొంతు. ఇంకొకటి ఆడ గొంతు. వాళ్ళు ఏం మాట్లాడుకొంటున్నారో తెలుసుకోవడానికి చెవులు రిక్కించి వినసాగింది.

"మంత్రవాదీ! యువరాజు సముద్రంలో పడి చనిపోయారనే నీలాగ అందరూ అనుకొంటున్నారు. పళువేట్టరయ్యర్ దానికి సాక్ష్యం వెతుకుతున్నారు! కానీ నేనది నమ్మడం లేదు!" అన్నదా ఆడగొంతు.

~~~
~~~

# అధ్యాయము - 5

## రాక్కమ్మ

పళువేట్టరయ్యర్, పార్థిబేంద్రుడు సముద్రతీరం వెంబడి పచార్లు చేసేందుకు వెళ్ళిన తర్వాత నందిని కాసేపు ఒంటరిగా ఉంది. కడలి అలలను చూస్తూ ఆలోచనల్లో పడింది.

"రాణి అమ్మా!" అన్న పిలుపు విని తిరిగి చూసింది.

దీప గృహపు కాపలాదారైన త్యాగ విడంగర్ గారి కోడలు అక్కడ నిలబడివుంది.

"నీవా?" అన్నది నందిని.

"నా పేరు రాక్కమ్మా(ళ్)!"

"ఏమిటిలా వచ్చావు?"

అందుకు బదులు చెప్పక రాక్కమ్మ నందిని ముఖాన్నే గుచ్చి చూస్తూ నిలబడింది.

"ఏమే అలా చూస్తున్నావు? నా ముఖంలో కోతులాడుతున్నాయా?"

రాక్కమ్మ అదిరిపడి, "మన్నించాలమ్మా! తమను చూస్తూనే ఇంకొక ముఖం గుర్తుకొచ్చింది. కానీ అదేనాడూ సాధ్యం కాదు!" అన్నది.

"ఏమిటే వదరుతున్నావు? ఏది ఎలా ఉండడానికి సాధ్యం కాదు?"

"ఆ మూగ పిచ్చిదానికి, మీకు ఎలాంటి సంబంధమూ ఉండ సాధ్యం కాదు."

"ఎవరా మూగది?"

"లంకలో ఉంది; నా మామగారి పెదనాన్న కూతురు. అప్పుడప్పుడు ఇక్కడిక్కాడ వస్తూంటుంది."

"ఆమెకు, నాకు ఏమిటి సంబంధం?"

"అదే చెప్పాను కద? ఆమెకు, మీకు చుట్టరికమేమీ ఉండడానికి వీల్లేదని."

"మరెందుకు నన్ను చూడగానే ఆమె గుర్తుకు వచ్చింది?"

"నా దృష్టిదోషమే. మీ ముఖం..."

"ఆమె ముఖం లాగుందా?"

"మొదట అలాగే అనిపించింది."

"రాక్కమ్మా! ఆ మూగది ఇప్పుడిక్కడుందా?"

"లేదమ్మా! ఆమె ఇక్కడికి రావడం చాల అరుదు."

"మళ్ళీ వచ్చినప్పుడు నా దగ్గరకు తీసుకొస్తావా?"

“ఎందుకు, రాణి అమ్మా?”

“నా ముఖాన్ని పోలిన ముఖం ఉన్న ఆమెను చూడాలనుంది.”

“అది నా భ్రమే అని చెప్పాను కద?”

“ఎలా అంత ఖచ్చితంగా చెబుతున్నావు?”

“రాణీ! తమరు పాండ్యనాడుకు చెందినవారు కద?”

“అవును. నీవు?”

“నేను కూడ పాండ్యనాడుకు చెందినదాన్నే. ఆ మూగది చోళదేశపు వనిత. కాబట్టి...”

“అయినా కూడ అడ్డులేదు; నీలాగే ఇంకొందరు ఆమె గురించి నాకు చెప్పారు. ఆమెను నా దగ్గరకు తీసుకొనివస్తే నీకు తగిన బహుమానమిస్తాను.”

“రాణీ! ఆమెను తీసుకొని రావడం సుడిగాలిని పట్టి తీసుకొని రావడం కన్న కష్టం. ఆమె ఉన్న చోట ఉండదు. ఇతరులు చెప్పేది వినదు కూడాను. పిచ్చిది అని చెప్పాను కద?”

“సరే! నీవిక్కడికెందుకు వచ్చావో చెప్పు!”

“కొన్నాళ్ల క్రితం ఇద్దరు మనుషులు ఇక్కడికి వచ్చారు. మీపేరు చెప్పారు.”

“నా పేరెందుకు చెప్పారు?”

“మీ కార్యంమీదే లంకకు తొందరగా వెళ్ళాలన్నారు. నా భర్తను వారికోసం పడవ నడిపేందుకు పంపించాను.”

“తిరిగి వచ్చేశాడా?”

“ఇంకా తిరిగి రాలేదు; అదే దిగులుగా ఉంది. ఆయనకు ఏమైనా అయితే...”

“ఏమీ కాదు. దిగులు పడకు! అలా ఏమైనా జరిగివుంటే నిన్ను నేను చూసుకొంటాను. పడవలో వెళ్ళిన మనుషుల గురించి ఏమైనా తెలుసా?”

“వాళ్ళు తిరిగి వచ్చేశారు. కాసేపటికి మునుపు గుడ్లగూబ కూత వినిపించింది కద? అది మీరు గమనించలేదా?”

“గమనించాను. అందువల్లనేమి?”

“అది మాంత్రికుని కూత అని తెలుసుకోలేదా?”

“అది నీకెలా తెలుసు? నీవు మంత్రవాది/మాంత్రికుని కూటమికి చెందిన మనిషివా?”

“అవును, రాణీ!” అని చెప్పి, చేత్తో ఒక ముగ్గు (గాలిలో) వేసి చూపించింది.

నందిని ఆమెను ఆశ్చర్యంతో చూసి, “ఇప్పుడు వాళ్ళెక్కడున్నారు? నీకు తెలుసా?” అని అడిగింది.

“మంత్రవాది మిమ్మల్ని చూసేందుకు వేచివున్నాడు.”

"నన్ను వచ్చి చూడవచ్చు కద? ఎందుకు పేచివుండాలి?"

"ఇప్పుడిక్కడికి వచ్చిన పల్లవుని మంత్రవాది కలవడానికి ఇష్టపడడం లేదు. లంకలో అతన్ని చూశాడట. మీవారిని కూడ చూడనిష్టపడడం లేదట."

"మంత్రవాదిని నీవు చూశావా?"

"కాసేపటి క్రితం గుడ్లగూబ కూత వినిపించగా, వెళ్ళి చూశాను. మిమ్మల్ని పిలుచుకొని రమ్మన్నాడు. కుళకర్ గుడి దగ్గర కొలను గట్టున దాక్కొని ఉంటాడట. వస్తారా, రాణీ?"

"నేనెలా రాగలను?"

"కుళకర్ గుడికి వెళ్తున్నానని చెప్పేసి రావచ్చు."

"మంచి ఉపాయమే. ఇంకే తోడు అవసరం లేదా?"

"అవసరం లేదు. కావాలంటే సేందన్ అముదన్ని వెంట పిలుచుకొని వెళ్ళండి."

"అదెవరు?"

"తంజావూరు మూగదాని కొడుకు."

"శివశివా! ఎంతమంది మూగవాళ్ళు?"

"ఈ కుటుంబం శాపగ్రస్తమైన కుటుంబం. కొందరు పుట్టు మూగవారు. కొందరు నోరుండికూడ మూగవాళ్ళు. నా భర్త కూడ ఎంతో తీయగా మాట్లాడుతారు. నేనే మాట్లాడవద్దని కట్టడి చేసివుంచాను."

"లంకలోని మూగదానికి పిల్లలున్నారా? నీకు తెలుసా?"

"ఒకసారి కవలల్ని కన్నదట. పిల్లలేమైనారో ఎవరికీ తెలియదు. నేను ఆ రహస్యాన్ని తెలుసుకోవడానికి ఎన్నాళ్ళగానో ప్రయత్నిస్తున్నాను. ఇంతవరకు ఫలితం దక్కలేదు."

"తంజావూరతను ఇక్కడికెందుకు వచ్చాడట?"

"వాడి మామ కూతురు పూంగుళలిని వెతుక్కొంటూ వచ్చాడు. ఆమె లేదు. కాబట్టి పేచివున్నాడు."

"ఆమె ఎక్కడికి వెళ్ళింది?"

"నేనే చెప్పాలనుకొన్నాను - మంత్రవాదిని నా భర్త పడవలో తీసుకొని వెళ్ళిన మర్నాడు ఇంకా ఇద్దరు మనుషులు వచ్చారు. వారిని పట్టుకోవడానికి పళువూర్ మనుషులు వెన్నంటి వచ్చారు. వారిద్దరిలో ఒకడిని నా మరదలు (పూంగుళలి) రాత్రికి రాత్రే పడవలో ఎక్కించుకొని వెళ్ళింది."

"ఆమెకు పడవ నడపడం వచ్చా?"

"పడవ నడపడమే ఆమె పని. పడవ నడపనప్పుడు కోడిక్కరై అడవుల్లో తిరుగాడుతుంటుంది. ఈ అడవుల్లో ఆమెకు తెలియని చోటు లేదు."

"ఆమె ఇంకా తిరిగి రాలేదంటే, దాన్ని ఆధారం చేసుకొని నీవేం ఊహిస్తున్నావు?"

"ఎవరో సముద్రంలో మునిగిపోయారని వీళ్ళు నెత్తీనోరూ కొట్టుకొంటున్నారే, అది నిజం కాదని నేనంటున్నాను. పూంగుళలి తిరిగి వచ్చిన తర్వాతే అది నిశ్చయమవుతుంది."

"ఆ పిల్ల కూడ మునిగిపోయివుండవచ్చు కద?"

"అది మునగదు. సముద్రం దానికి ఊయల లాంటిది..."

"ఇంకా ఏం సంగతులు?"

"కాసేపటికి మునుపు దీపగృహశిఖరాన్నెక్కి చూశా. దూరంగా ఒక పడవ కనిపించింది."

"తర్వాత?"

"అది తీరం వైపు రాసేలేదు."

"ఏమైందది మరి?"

"ఇక్కడ ఇంత మంది మనుషులు గుమిగూడి ఉండడం చూసి ఇంకోవైపున్న బురదనీటి కాలువలో పడవను నడుపుకొని వెళ్ళివుండవచ్చు."

"అది కూడ సాధ్యమా?"

"పూంగుళలికి అసాధ్యమైనదేమీ లేదు. తంజావూరతను కూడ నాతోబాటు దీపగృహం పైకి వచ్చి చూశాడు. అతడికీ అలాగే తోచిందట."

"సరే; అదలా ఉండనీ. మనమిప్పుడు కుళకర్ గుడికి వెళదాం, రా!"

"తోడుకు సేందన్ అముదన్ని పిలవనా?"

"వద్దు! అతడు తన మామ కూతురిని వెతుక్కోనీ. మనం అందుకు అడ్డు రావద్దు."

ఇద్దరూ కుళకర్ గుడివైపు బయలుదేరారు. పూంగుళలి లాగే, రాక్కమ్మకు కూడ కోడిక్కరై చెట్లు, పుట్టలు కొట్టిన పిండే. నందినికి జాగ్రత్తగా దారి చూపుతూ తీసుకొని వెళ్ళింది.

ఇద్దరు గుడికి చేరారు. గుడి పూజారి ఇద్దరినీ చూసి ఆశ్చర్యపోయాడు.

"రాణీ! ఇదేమి ఈ సమయాన ఒంటరిగా వచ్చారు? పరివారం ఏది? ముందుగా నాకు చెప్పి పంపకూడదా? మిమ్మల్ని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండేవాడిని!" అన్నారు.

"దానికంతా ఇదేనా సమయం, స్వామీ? చోళనాడుకు ఒక పెద్ద అపాయం ముంచుకొచ్చింది కద? యువరాజును కడలి తీసుకొని వెళ్ళిపోయిందని చెబుతున్నారు కద? యువరాజును కాపాడమని ప్రార్థించేందుకు వచ్చాను." అన్నది నందిని.

"అలా ఏమీ జరగదు, తల్లీ! మీరు దిగులు పడకండి. మన పొన్నియిన్ సెల్వన్‌కి సముద్రరాజు వల్ల ఎలాంటి అపాయమూ రాదు!" అన్నారు పూజారి.

"ఎలా అంత దృఢంగా, నమ్మకంగా చెబుతున్నారు?"

"యువరాజు పుట్టిన నక్షత్రమూ, లగ్నమూ అలాంటివమ్మా! లోకాన్నేలేందుకు పుట్టినవారిని

కడలి పొట్టనబెట్టుకొంటుందా? మీరు దిగులు పడకండి! కుళకర్ స్వామిని ప్రార్థించండి. తప్పక యువరాజును కాపాడుతారు!" అన్నారు పూజారి.

తర్వాత స్వామికి దీపారాధన చేసి తీర్థమిచ్చారు. "అమ్మణీ! మీరు ఇంత పై అంతస్తులో ఉండడం చాల సంతోషం!" అన్నారు.

"నన్ను మీకింతకు మునుపే తెలుసా, స్వామీ?"

"తెలుసమ్మా. పళైయారైలో చూసివున్నాను. వైగై నదీ తీరాన ఉన్న గుడిలో కూడ చూశాను. మీ అన్న – తిరుమలై - ఇప్పుడేం చేస్తున్నాడు?"

"ఆళ్వార్ ప్రబంధాలు పాడుతూ ఊరూరూ తిరుగుతున్నాడు. వాడిని నేను చూసి చాల కాలమైంది."

"అతడికి కూడ అందు గురించి కొరతగా ఉంది, తల్లీ! మీరు పళువూర్ రాణి అయిన తర్వాత చూడనే లేదని చెప్పుకొని వాపోయాడు."

"అందుకు నేనేం చేయనయ్యా! నేను పుట్టిన చోట అందరూ పరమ శైవులు. వాడేమో వీరవైష్ణవుడు. 'ఆళ్వార్ కట్టియాన్' అని తనకు తానే పేరు పెట్టుకొని శైవులతో దెబ్బలాడుతుంటాడు. వాడిని నేనెలా చేరదీయను? మెట్టినింటి వారి మనసు నొచ్చుకోకుండ నేను నడుచుకోవాలి కద?"

"నిజమేనమ్మా! మీవారి మనసు నొచ్చుకోకుండ నడుచుకోవడమే ముఖ్యం. ఆళ్వార్ కట్టియాన్ ఎలాగైనా పోనీ!"

ఇద్దరూ పూజారి వద్ద సెలవు తీసుకొని బయలుదేరారు.

"ఒంటరిగా వెళుతున్నారే! కాసేపాగితే నేను కూడ వస్తాను!"

"వద్దయ్యా! నాకోసం తొందర తొందరగా గుడి పూజలు ముగించి రాకండి. ఈ అమ్మాయికి ఈ చుట్టుపక్కలంతా బాగ పరిచయమే. అదీగాక కోడిక్కరై అంతా సందడిగా ఉంది కద! భయమేమీ లేదు. మేము వెళతాము." అన్నది నందిని.

ఇద్దరు స్త్రీలూ ఆలయం నుంచి బయటకు వచ్చారు. భట్టుగారు కనుమరుగైన వెంటనే రాక్కమ్మ నందిని చేయి పట్టుకొని గుడి వెనక వైపుకు తీసుకొని వెళ్ళింది. కాసేపటికల్లా మొగలి పొదలున్న కొలను గట్టును చేరుకొన్నారు. చుక్కల వెలుతురులో కొలను గట్టు వెంబడి నడిచి వెళ్ళారు.

~~~
~~~

# అధ్యాయము - 6

## పూంగుళలి దిగులు

**మొగలి** పొదల మరుగున పూంగుళలి ఊపిరి బిగబట్టి నిలబడింది. నందిని, మంత్రవాది ఎంత మెల్లగా మాట్లాడుకొన్నా వారి మాటలు ఒకింత వరకు ఆమె చెవిన పడ్డాయి.

యువరాజును సముద్రం పొట్టనబెట్టుకొన్నదనడంలో తనకు నమ్మకం లేదని నందిని అన్నప్పుడు, మంత్రవాది, "రాణీ! నా మాటలో మీకెప్పుడూ నమ్మకం లేదు. ఇప్పుడెందుకు అపనమ్మకం మీకు?" అని అడిగాడు.

"యువరాజు జాతక ఫలం గురించి నీవు వినలేదా? కాసేపటి క్రితం కుళకర్ గుడి పూజారి కూడ అదే చెప్పారు."

"వెర్రితనమే అది. గ్రహాల, నక్షత్రాల శక్తి కన్న నా మంత్రశక్తి బలమైనది. ప్రశాంతంగా ఉన్న సముద్రంలో మంత్రం జపించి సుడిగాలి తెప్పించానన్నది మీకు తెలుసా? మొదట ఆ కాంచీపురపు గూఢచారి కూడ అది నమ్మలేదు. తర్వాత కడలిలో మునిగి చచ్చేటప్పుడు తప్పక నమ్మివుంటాడు!"

"అతడు, కడలిలో మునిగి చావడం నీవు చూశావా?"

"నేను చూడకపోతేనేమి? వాడున్న ఒడకు నిప్పంటుకొని కాలడం చూశాను."

"వెళ్ళినవారు తిరిగి వచ్చారా?"

"మళ్ళీ పల్లవుని ఒడకు తిరిగి రాలేదు..."

"మరి?"

"ఇద్దరు పగవారూ ఒకేరోజున బలికావడం కోసమే వంతిదేవుని ప్రాణాలతో వదిలిపెట్టి వచ్చాను..."

"నీవేం చెప్పినా నాకు నమ్మకం కలగడం లేదు. వారిద్దరూ ఇంకా బతికే ఉన్నారని మనసులో ఏదో ఒక వాణి చెబుతోంది. పూంగుళలి నీకు తెలుసా?"

"బాగా తెలుసు. ఆ పిల్ల లంకలో మమ్మల్ని చాల ఇబ్బందులకు గురిచేసింది. ఆ పిల్ల కూడ సుడిగాలిలో చచ్చిపోయివుండవచ్చు."

"అదేం కాదు. కాసేపటికి మునుపు దూరాన ఒక పడవ కనిపించింది. దీపగృహ శిఖరం నుంచి రాక్కమ్మ చూసిందట. ఉన్నట్లుంది అది మరుగైందట. పడవలో ఇద్దరు ముగ్గురున్నట్లనిపించిందట."

"అలాగైతే మీరు ముసలాయన్ను వెంట తీసుకొని బయలుదేరండి. నేనిక్కడే ఉండి ఏ విషయమూ తెలుసుకొని వస్తాను."

"మేముంటే ఏమి?"

"ముసలాయన ఉంటే యువరాజుకు రాజమర్యాదలు చేసి పిలుచుకొని వెళ్ళజూస్తారు. కార్యం చెడతుంది."

"మంత్రవాదీ! తెలీకడుగుతాను - ఆయన (యువరాజు) మరణించవలసిన అవసరమేమి? మధురాంతకునికి పట్టం కట్టేందుకు అందరూ ఒప్పుకొంటే..."

"అమ్మా! ఆడబుద్ధి చూపించకండి. ఆ కాంచీపురపు గూఢచారికి మన రహస్యాలన్నీ తెలుసు. బహుశ యువరాజుకు కూడ చెప్పేవుంటాడు. పొద్దు పొడిచేలోపు మీరు బయలుదేరి వెళ్ళండి. రాక్కమ్మా! పూంగుళలి వారిని తీసుకొని వస్తే ఎక్కడ దాచిపెడుతుంది?"

"మరుగ్గా ఒక మంటపమొకటుంది. అదే ఆమె రహస్య నివాస స్థలం. కంచి గూఢచారిని ఒకసారి పగలంతా అక్కడే దాచి పెట్టింది. తర్వాత దాన్ని నేను కనిపెట్టేశాను."

"మంచిది. ఆ మరుగ్గా వున్న మంటపం ఉన్న చోటు నాక్కూడా తెలుసు. నేను అక్కడికి వెళ్ళి దాక్కొనివుంటాను. రాణీ! చక్రవర్తి ఎలా ఉన్నారు? ఏమైనా సమాచారం ఉందా?"

"ఏ చక్రవర్తి గురించి అడుగుతున్నావు?"

"రోగిష్టైన ఆ సుందర చోళుని 'చక్రవర్తి అని నా నోరు ఏనాడూ పిలవదు. 'మన' చక్రవర్తి గురించే అడుగుతున్నాను."

"క్షేమంగా ఉన్నట్లు పదిరోజుల క్రితం సమాచారం అందింది. ఆహా! ఎన్నాళ్ళైంది చూసి?"

"సరే, సరే! త్వరగా బయలుదేరండి. ఆ మూర్ఖ పల్లవుడు ఏం చేయబోతున్నాడట?"

"అతన్ని కూడ తంజావూరుకు వెంట పిలుచుకొని వెళ్ళబోతున్నాను."

"వాడితో జాగ్రత్తగా ఉండండి."

"అతడి గురించి దిగుల్లేదు. నేను కాలితో చెప్పింది తలతో చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు!"

"కానీ జాగ్రత్తగా ఉండడం మంచిది. కాంచీపురం గూఢచారి వంతిదేవుని చేత కూడ మీరు కాస్త మోసపోయారు కద?"

"అది నిజమే; అందుకే అతన్ని ప్రాణాలతో చూడగోరుతున్నాను."

"ఆ ఆశను పూర్తిగా వదులుకోండి, రాణీ!"

ఇలా ప్రస్తుత పరిస్థితిని గురించి మాట్లాడుతూనే వారక్కడినుంచి కదలనారంభించారని తెలిసింది. పూంగుళలి వారు తమను చూడ వీలుకానట్లు మొగలిపొదల్లో బాగా దాక్కొంది. అదృష్టవశాత్తు వారు ఆమె ఉన్నవైపు రాలేదు. ఇంకోవైపుగా వెళ్ళిపోయారు.

~

పూంగుళలి అనుకోకుండ/కాకతాళీయంగా విన్న విషయాలు ఆమెకు చాల దిగులు కలిగించాయి. పొన్నియిన్ సెల్వన్ని ఎన్ని విధాల అపాయాలు చుట్టుముట్టివున్నాయని తలుచుకొన్నప్పుడు

ఆమె కాళ్ళు చేతులు వణికాయి. కళ్ళు మసకబారాయి. గొంతెండిపోయింది. మనసు కల్లోలపూరితమైంది. తాను వదిలిపెట్టి వచ్చిన పడవను వెంటనే వెళ్ళి చేరుకోవాలన్న ఆలోచన బలంగా లేచింది. పడవను విడిచి వచ్చిన దిశగా వేగంగా సాగింది.

యువరాజు క్రూరమైన విషజ్వరంతో బాధపడుతున్నారు. ఆయనను బంధించి తీసుకొని వెళ్ళడానికి పళువేట్టరయ్యర్ కాచుకొని ఉన్నారు. ఆయనను హతమార్చేందుకు హంతకులు పొంచివున్నారు. వారికి తోడు స్త్రీరూపం దాల్చిన ఈ మోహినీ పిశాచి ఉంది. పార్థిబేంద్రుడు కూడ ఆమె మాయవలలో పడిపోయాడు. యువరాజును తాను తీసుకొని వెళ్ళి భద్రంగా, రహస్యంగా ఉంచదలుచుకొన్న ఆ మంటపం కూడ వీరికి తెలిసిపోయింది.

ఇన్ని అపాయాలనుంచి యువరాజును కాపాడే బాధ్యత తన తలపైనుందని పూంగుళలి గ్రహించింది. అందుకనే ఆమె బుర్ర గందరగోళమైంది. ఇంతవరకు ఆమెకు జీవితంలో ఎన్నడూ లేని ఒక అనుభవం ఎదురైంది. తిరిగి తిరిగి బయలుదేరిన చోటికే మళ్ళీ వస్తున్నానా అన్న సందేహం కలిగింది. అలా చుట్టు తిరిగి వస్తున్నప్పుడు యువరాజు విరోధులెవరైనా ఎదురుపడితే ఏం చేయాలి? వారికి ఏం బదులివ్వాలి? ఎలా వారినుంచి తప్పించుకోవాలి?

లేదు, లేదు! సరైన దారిలోనే వచ్చాము. ఇదిగో కాలువ కనిపిస్తోంది. పడవను అదిగో ఆ మూల విడిచిపెట్టి వచ్చాము. పూంగుళలి అటువైపుగా పరుగెత్తింది. ఆమె గుండె ఆగిపోయినట్లనిపించింది. ఎందుకంటే, ఆమె పడవ విడిచి వచ్చిన చోట లేదు! అయ్యో! పడవ ఎక్కడికి వెళ్ళివుంటుంది?

ఒకవేళ తాను లేని సమయాన పళువేట్టరయ్యర్ మనుషులు ఇక్కడికి కూడ వచ్చివుంటారా? అలా జరిగినా కూడ ఫరవాలేదు. అంతకన్న భయంకరమైన సంఘటన జరిగివుంటుందా? వంతిదేవుడు యువరాజునెత్తుకొని ఆ రహస్య మంటపానికి వెళ్ళివుంటాడా? అలాగైతే అక్కడ హంతకులు పొంచివుంటారు కదా? అయ్యో! ఎంత పెద్ద పొరబాటు చేసేశాం...!

ఆ మంటపానికి వెంటనే వెళ్ళి చూడాలన్న ఉద్వేగం పూంగుళలి మనసులో లేచింది. అడవి దారిన పరుగు లంకించుకొంది. మళ్ళీ ఆ పాత సందేహం - దారి తప్పామో అన్న సందేహం. తిరిగి తిరిగి అదే చోటికే వస్తున్నామన్న భ్రమ.

అదేమి? అయ్యో! కాలి చప్పుడు లాగుందే? ఎవరో తనను వెన్నంటి వస్తున్నట్లుందే? ఎవరై ఉండవచ్చు? ఎందుకు? ఒకవేళ ఆ భయంకరమైన మంత్రవాదా? అలాగైతే ఎందుకు భయపడాలి? బొడ్లో దోపుకొన్న చురకత్తిని చేతికి తీసుకొంటే చాలు కదా? ఎవరైతేనేమి? ఎందుకు పరుగెత్తాలి...?

లేదు, లేదు! పరుగెత్తవలసిందే! ఇప్పుడెవరితోను పోరాడేందుకు సమయం లేదు. సందర్భమూ కాదు. చేతిలో బలం లేదు. కత్తికూడ గురి తప్పిపోతుంది. ప్రాణాలను ఎన్ని అవస్థలు పడైనా కాపాడుకోవాలి. మనకు ఈ సమయాన ఏదైనా అయితే యువరాజు గతేమి? ఇప్పటికే ఆ వంతిదేవుడు హెచ్చరించాడు కదా?

ప్రాణాలను జాగ్రత్తగా కాపాడుకొని రమ్మని! దాన్ని నెరవేర్చాల్సిందే!

పూంగుళలి ఇంకా ఇరుకైన అడవిదారి వెంబడి పరుగెత్తింది. కానీ తరుముకొని వస్తున్నవాడు ఇంకా వెన్నంటే వస్తున్నాడు. పూంగుళలి వెళ్ళిన దారిలో చెట్ల పైనున్న పక్షులు అదిరిపడి అరుస్తూ ఎగిరిపోయాయి. డొంకల్లోనుంచి నక్కలు లేచి పరుగెత్తాయి. నిద్రపోతున్న అడవి పందులు లేచి పారిపోయాయి. జింక ఒకటి గిర్రున పరుగెత్తి వచ్చి ఆమెకే ఢీకొట్టుకొని పారిపోయింది. ఇన్నిటికీ మధ్య వెన్నంటి వస్తున్న వాడు వదిలిపెట్టినట్లు లేదు. వాడి కాలి చప్పుడు, పరుగెత్తడం వల్ల గట్టిగా ఊపిరి పీలుస్తున్న శబ్దం వినిపిస్తూనే ఉన్నాయి.

పూంగుళలి పరుగెత్తి, పరుగెత్తి అలిసిపోయింది. ఆ అలసట అలవిలేనంత కోపంగా మారింది. వస్తున్నవాడు ఎవడైనా, వాడిని ఒక చేయి చూసేయాలని నిశ్చయించుకొంది.

~~~
~~~

# అధ్యాయము - 7

## అడవిలో వినిపించిన గీతం

**పూంగుళలి** కోపంతో పరుగునాపి నిలబడి తిరిగిన అదే సమయాన ఆ అడవిలో ఒక ఇంపైన గీతం లేచింది:

"బంగారు వన్నె మేనుగలవాడా!

...పులితోలు నడుం చుట్టూ చుట్టి

....

"

ఆ గొంతు సేందన్ అముదన్‌ది అని పూంగుళలి వెంటనే గ్రహించి, గలగల నవ్వింది. కాలి చప్పుడు వచ్చిన దిశ వేరు అనికూడ అప్పుడామె మరిచిపోయింది.

"బావా! నీవేనా?"

"అవును, పూంగుళలీ!"

"ఎక్కడున్నావు? ఇలా రా!"

"ఇదిగో వచ్చేశా!" అంటూనే సేందన్ అముదన్ వచ్చి ఆమె ముందు నిలబడ్డాడు.

"నన్ను భలే భయపెట్టేశావు! ఎందుకని ఇలా నన్ను వెన్నంటి వచ్చావు?"

"పూంగుళలీ! నిన్ను చూసేందుకు, నీ ఇంపైన గానాన్ని వినేందుకు తంజావూరు నుంచి చాలరోజులు ప్రయాణం చేసి వచ్చాను. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడ నీవు కనబడక ఇన్నాళ్ళు వేచివున్నాను! కాకతాళీయంగా నీవు కనిపించావు. అంతే! నీ వెంబడే పరుగెత్తి వచ్చాను. ఏదీ! ఒక గీతం పాడు విందాం!"

"భలే చోటు, పాట పాడేందుకు; భలే సందర్భం కూడాను!"

"నీవు పాడకపోతే నేనే పాడుతాను. ఈ అడవిలో నిద్రపోతున్న మృగాలన్నిటినీ లేపి పరుగెత్తిస్తాను, చూడు!"

<< ఇంకొక శివభక్తి గీతం >>

"బావా! చాలు, ఆపు పాటను!"

"అలాగైతే నీవు పాడూతావా?" అని పెద్దగా చెప్పేసి, తర్వాత మెల్లగా, "పూంగుళలీ! నిన్ను ఇంకొకడు వెన్నంటి వస్తున్నాడు. నిన్ను హెచ్చరించేందుకే పెద్దగా పాడాను. వాడికి, నీ అన్న భార్యకు మధ్య ఈ రోజు సాయంకాలం ఏదో రహస్య సంభాషణ జరిగింది. వాడెవడని నీకు తెలుసా?" అని అడిగాడు.

తర్వాత పెద్దగా, "ఏమంటావు? నీవు పాడుతావా? నేను పాడనా? శివపరమాత్మ శ్మశానంలో ఆడారు. నీవు ఈ అడవిలో పాడకూడదా?" అన్నాడు.

"ఇదిగో పాడుతున్నా! కోపగించుకోకు!" అని చెప్పి, పూంగుళలి పాడింది.

<< ఒక ఇంపైన అడవి గీతం >>

ఇలా పాడిన తర్వాత మెల్లని స్వరంతో, "అముదా? నేనొచ్చింది నీకెలా తెలుసు?" అని అడిగింది.

"పూంగుళలీ! దీపగృహ శిఖరం నుంచి పడవ రావడాన్ని చూశాను. నీవే కావచ్చని ఊహించి ఇక్కడ నిన్ను వెతుక్కొంటూ వచ్చాను. అదే సమయాన పళువూర్ మనుషులు కొందరు కూడ ఇటువైపు వచ్చారు. పడవలో నీవు కనిపించలేదు. కానీ నా మిత్రుడు వల్లవరయ్యన్‌కి పళువూర్ మనుషులు వస్తూండడం గురించి చెప్పాను. తర్వాత మేమిద్దరము యువరాజును మోసుకొని వెళ్ళి మరుగైన మంటపంలో దాచాము..."

"అయ్యో! ఎంతటి పొరబాటు చేశారు? పడవేమైంది?"

"పడవను ఎవరైనా చూస్తే సందేహిస్తారని కొలనులో బోర్లించేశాము! ఏం పూంగుళలీ! పాటనెందుకు ఆపేశావు?" అని చివరి వాక్యాన్ని పెద్దగా ఉఛ్చరించాడు.

"మరిచిపోయాను, అముదా! ఈ కోడిక్కరై కుళకర్ గురించి ఒక పాట ఉంది కద! అది నీకు గుర్తుందా? గుర్తుంటే పాడు!"

"ఓ! గుర్తుందే!" అని పెద్దగా చెప్పి, సేందన్ అముదన్ ఆ పాటను పాడాడు:-

<< కోడిక్కరై కుళకర్ మీద ఒక పాట >>

పాట ముగిసిన వెంటనే పూంగుళలి, "బావా! నన్ను వెన్నంటి వచ్చినవాడు తొలగిపోయాడా? చుట్టుపక్కల దాక్కొని ఉన్నాడా?" అని మెత్తని గొంతుతో అడిగింది.

"మనం ఇక్కడ ఆగిన తర్వాత కాలిచప్పుడు వినిపించలేదు; వాడు ఇక్కడే ఎక్కడో మరుగ్గా దాక్కొని ఉండాలి. వాడెవడని నీకు తెలుసా?"

పూంగుళలి పెద్దగా, "తెలియకేం? బాగా తెలుసు. కోడిక్కరై గుడ్లగూబల గురించి సుందరమూర్తి పాడారు కద? ఇదిగో విను!"

<< సుందరమూర్తి కోడిక్కరై గుడ్లగూబల గురించి పాడిన పాట >>

"చూశావా, అముదా! సుందరమూర్తి కాలంలో కూడ గుడ్లగూబలు ఈ అడవిలో కూస్తుండేవి. కానీ ఇప్పుడు ఈ అడవిలో మనుషులు కూడ గూబల్లాగ కూస్తున్నారు. కాసేపటికి మునుపు అలాంటి కూత ఒకటి వినిపించింది. ఆ కపటి ఎవరై ఉండవచ్చని నీకు తెలుసా?" - ఇలా పెద్దగానే అడిగింది పూంగుళలి. అడిగేసి "నాకు అలా కూత వేయనవుతుందా అని ప్రయత్నించి చూస్తాను. గుడ్లగూబ కూత లాగ ఉందా అని వినేసి చెప్పు!" అన్నది.

తర్వాత గూబలాగే మూడుసార్లు కూసింది.

"అచ్చం గూబ కూతలాగే ఉంది! తేనెలొలికే ఇంపైన దైవ గీతాలు పాడుతావు కద? ఆ పాడు కూత ఎక్కడ నేర్చుకొన్నావు?" అని సేందన్ అముదన్ అడిగాడు.

"ఒక మంత్రవాది దగ్గర నేర్చుకొన్నాను. మంత్రం ఫలించడానికి ఇలా కూయడం నేర్చుకోవాలట!"

"నీకు మంత్రవిద్య కూడ తెలుసా, ఏమి?"

"ఏదో కాస్త తెలుసు. నా మంత్రశక్తిని పరీక్షించి చూస్తావా?"

"ఎలా పరీక్షించడం?"

"ఇప్పుడు మనం మాట్లాడుతున్నదంతా ఒకడు రహస్యంగా దాక్కొని వింటున్నాడు. కావాలంటే వెతికి చూడు!"

~

ఇలా పూంగుళలి చెప్పి నోరు మూసేలోపు అడవిలో గలగల శబ్దం వినిపించింది. మంత్రవాది రవిదాసు దాక్కొన్న చోటునుంచి బయటకు వచ్చాడు. "హహ్హాహ్హా" అని వికటాట్టహాసం చేస్తూ వచ్చాడు.

"అమ్మాయ్! అలాగా సంగతి? నీకు తంత్రం మాత్రమే తెలుసనుకొన్నాను; మంత్రం కూడ తెలుసా?" అని అడిగాడు.

"ఒరే పాపి! నీవేనా?"

"అమ్మాయ్! నేనెవరని నీకు తెలుసా?"

"లంకలో యువరాజును చంపజూసినవాడివి నీవు! అది నీవల్ల కాలేదు. కాబట్టి నడిసముద్రంలో మంత్రం వేసి సుడిగాలి తెప్పించి యువరాజును, ఆయన స్నేహితుడిని సముద్రంలో ముంచేశావు!"

"వారు మునిగిపోయారని నీకు నిశ్చయంగా ఎలా తెలుసు? నీవు చూశావా?"

"ఇద్దరి దేహాలూ సముద్రపుటొడ్డుకు కొట్టుకు వచ్చాయి. భూతాల దీవిలో గుంట తవ్వి పూడ్చిపెట్టి వచ్చాను. ద్రోహి! నీ మంత్రంలో పిడుగు పడ!"

"అమ్మాయ్! నన్ను మోసపుచ్చేందుకు ప్రయత్నించకు! నా మంత్రానికి ప్రతిమంత్రం వేసి నీవు వారిని బతికించలేదా?"

"అయ్యో! అది నీకెలా తెలుసు?"

"ఈ రవిదాసుకు బాహ్యనేత్రంతో బాటు అంతర్నేత్రం కూడ ఉంది. నూరు కోసుల దూరంలో జరుగుతున్న విషయాన్ని నా మంత్రశక్తి వల్ల తెలుసుకోగలను."

"అలాగైతే నన్నెందుకడుగుతున్నావు?"

"నిన్ను పరిశోధించేందుకే అడిగాను. వారిని ఎక్కడ దాచావో చెప్పేసెయి! లేకపోతే మిమ్మల్నిద్దరినీ కాల్చి బూడిద చేసేస్తాను!" అన్నాడు రవిదాసు.

అతడి కళ్ళప్పుడు నిప్పు కణికల్లాగ జ్వలించాయి.

"ఏం? నిజం చెబుతావా, లేదా? ఓం హ్రీం హ్రాం వషట్! - ఇదిగో నా మంత్ర శక్తిని చూపించబోతున్నాను!"

పూంగుళలి భయంతో గడగడ వణుకుతూ సేందన్ అముదన్ని గట్టిగా పట్టుకొంది. అతనితో మెల్లని స్వరంతో, "నేనిప్పుడు పరుగెత్తబోతున్నాను. నీవు వాడిని అడ్డగించేందుకు ప్రయత్నించు!" అన్నది.

మంత్రవాదిని చూసి, పెద్దగా, "నన్ను నీవేమీ చేయవద్దు. వారున్న చోటు చూపిస్తాను!" అన్నది.

"నాతో రా! చూపిస్తాను!" అనేసి ఆ పాడుబడ్డ మంటపం ఉన్నచోటుకు వ్యతిరేకదిశగా నడిచింది.

మంత్రవాది ఆమె వెంట వెళ్ళాడు.

సేందన్ అముదన్ అతన్ని వెనక నుంచి పట్టుకొని ఆపజూశాడు.

పూంగుళలి పరుగు లంకించుకొంది.

మంత్రవాది ఒక్కతోపుతో అముదన్ని తలకిందులుగా పడదోసి పూంగుళలి వెన్నంటి పరుగెత్తాడు.

మంత్రవాది జింకను తరిమే వేటగాడిలాగ ఆమెను పట్టుకోవడానికి పరుగెత్తాడు. కానీ ఆమెను పట్టుకోవడం అంత తేలిక కాదు.

మంత్రవాది ఆమెను తరుముకొని వెళ్ళడాన్ని విడిచిపెట్టేద్దామా అని అనుకొన్నప్పుడు ఆమె అలిసిపోయిన దానిలాగ ఆగింది. మంత్రవాది మళ్ళీ ఆమెను తరుముకొంటూ వెళ్ళాడు.

~

ఇద్దరికీ వెనక సేందన్ అముదన్ తడబడుతూ, పడుతూ లేస్తూ పరుగెత్తసాగాడు. పరుగెత్తేటప్పుడు, ఆ రహస్య మంటపానికి వెళ్ళి అక్కడున్న యువరాజును, వంతిదేవుని హెచ్చరిద్దామా అని చాలసార్లు అనుకొన్నాడు. అదే సమయాన పూంగుళలిని మంత్రవాదితో ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళేందుకు మనసొప్పలేదు.

పూంగుళలి ఒక మిట్టపైన ఎక్కి నిలబడింది. అక్కడ కాసేపు నిలబడి వేచివుండడమేగాక మంత్రవాదిని చప్పట్లు కొట్టి పిలిచింది. మంత్రవాది ఎగఊపిరి దిగఊపిరిగా ముక్కుతూ మూలుగుతూ వెళ్ళి ఆమె దగ్గర నిలబడ్డాడు. ఆమెను గట్టిగా పట్టుకొని చెంపలు వాయించాలనుకొన్న సమయాన, పూంగుళలి, "అదిగో చూడు నా ప్రేమికులు!" అన్నది.

అమె వేలెత్తి చూపించిన వైపు చూశాడు మంత్రవాది.

మునుపొకసారి వంతిదేవుడు దృశ్యాన్ని అతడూ చూశాడు.

బురద ప్రదేశంలో అక్కడక్కడా మంటలు గుప్పగుప్పమని లేవడం, మళ్ళీ మాయమైపోవడం కనిపించింది. రవిదాసుకు ఆ భీతిగొలిపే దృశ్యానికి కారణమేమని తెలిసినా, ఆ సమయాన అతడి వెంట్రుకలు

నిక్కబొడుచుకొన్నాయి.

"మంత్రవాదీ! నీకు మంత్రాలు తెలుసంటే, ఈ కొరివి దెయ్యాలను పారదోలేందుకు ఒక మంత్రం వెయ్యి, చూద్దాం! అవి నన్ను పడరాని పాట్లు పడేటట్లు చేస్తున్నాయి!" అన్నది.

రవిదాసుకు పట్టలేని కోపం ముంచుకొచ్చింది.

"అమ్మాయ్! నన్ను ఏమార్చేందుకు చూస్తున్నావా?" అని గర్జించాడు.

"నిన్ను నేనెందుకు ఏమార్చాలి?"

"యువరాజు, వంతిదేవుడు ఉన్న చోటు చూపిస్తానని చెప్పి, నన్ను లాక్కొని రాలేదా?"

"వారు చనిపోయారని నేను చెబితే నీవు నమ్మలేదు. మరి నేనేం చేయను?"

"యువరాజు మరణించారన్నది నిజమేనా? ప్రమాణం చేసి చెప్పు!"

"ప్రమాణమెందుకు? అదిగో, ఆకాశాన్ని చూడు!"

రవిదాసు ఆకాశాన్ని చూశాడు. తోకచుక్క కనిపించింది.

"తోకచుక్క కనిపిస్తే రాజవంశంలో మరణం సంభవిస్తుందని నీకు తెలియదా? అలాగే జరిగింది!" అన్నది పూంగుళలి,

"అమ్మాయ్! నీ చేతిలో ఉన్న మరచెంబిలా ఇవ్వు! అందులో ఇంకా ఏదైనా మిగిలివుందా? నీ వెంట పరుగెత్తి రావడంతో నాకు దాహం వేస్తోంది...!"

~

పూంగుళలి మళ్ళీ పరుగు లంకించుకొంది, మిట్టపైనుంచి ఒక్కదూకుతో కిందకు వచ్చి కొరివి దెయ్యాలు కనిపించిన బురద ప్రదేశంవైపు పరుగెత్తింది.

రవిదాసు ఆవేశం వల్ల వివేకాన్ని కోల్పోయాడు. పూంగుళలిని పట్టుకొని ఆమె గొంతు పిసికి చంపేయాలన్న పిచ్చి ఆవేశం కలిగింది. తలాతోకా తెలియక ఆమె వెంట పరుగెత్తాడు.

కాస్త దూరం వెళ్ళాక పూంగుళలి ఉన్నట్లుండి ముందుకు వంగి నాలుగైదడుగులు ఒక వారగా నడిచి వెళ్ళింది.

అతివేగంగా పరుగెత్తి వచ్చిన రవిదాసు అమె ఆగిన చోట ఆగలేకపోయాడు. ఆమెను దాటి నాలుగైదడుగులు ముందుకు వెళ్ళి ఆగాడు. మళ్ళీ ఆమెను పట్టుకోవాలని ముందుకు దూకజూశాడు. సాధ్యం కాలేదు. ఉన్నట్లుండి కాళ్ళకేమైంది? అవి ఇప్పుడు ఎందుకు కదలడం లేదు? అవి ఎందుకు చల్లబడుతున్నాయి?

ఇదేమి? అరికాలి చల్లదనం పైపైకి వస్తోందేమి? లేదు, లేదు! కాళ్ళు కద కిందికి పోతున్నాయి!

రవిదాసు వంగి చూశాడు. అవును! తన కాళ్ళు ఊబిలో కూరుకుపోతున్నాయి. ఒక్కొక్క అంగుళం చొప్పున అతని కాళ్ళు బురదలో కూరుకుపోసాగాయి.

రవిదాసు అపాయాన్ని గ్రహించాడు. ఊబినుంచి బయటపడేందుకు ప్రయత్నించాడు. కాళ్ళను విదిలించి పైకెత్తజూశాడు. అతని ప్రయత్నం ఫలించలేదు.

బురద లోపల అడుగున ఏదో ఒక భూతం అతన్ని లాగుతున్నట్లనిపించింది.

పూంగుళలి గలగలమని నవ్వింది.

"మంత్రవాదీ! ఏం అలా కళ్ళప్పగించి చూస్తున్నావు? భూతం నోట చిక్కుబడ్డావా? మంత్రం వేసి చూడాల్సింది కదా?" అన్నది.

మంత్రవాది ఒకవైపు భీతి వల్ల, మరొకవైపు కోపం వల్ల గడగడ వణికాడు.

"ఒసే, పాపి! నీపనేనా ఇది?" అని చేయి ఝుళిపించాడు.

"నా గొంతు పిసికి చంపాలనుకొన్నావు కదా? అందుకు బదులు నీ చేతులే పిసుక్కో!"

రవిదాసు కోపాన్ని అదిమి పట్టుకొని, "అమ్మాయి! సత్యప్రమాణంగా చెబుతున్నాను. నిన్ను నేనేమీ చేయను. కాస్త చేయూతనిచ్చి నన్ను ఈ ఊబినుంచి గట్టెక్కించు!" అన్నాడు.

పూంగుళలి హ-హ్హా-హ్హా అని నవ్వి, "నిన్ను గట్టెక్కించడం నా వల్లకాని పని. నీ మంత్రానికి కట్టుబడివున్న పిశాచాలన్నిటినీ పిలు!" అన్నది.

రవిదాసు ఇంతలో తొడల వరకు ఊబిలో కూరుకుపోయాడు.

అతడి ముఖం చూడ భయంకరంగ తోచింది. అతడి కళ్ళు కొరివి కట్టెల్లాగ ఎర్రగా జ్వలించాయి.

చేతులు చాచి బురదకు అవతలి గట్టున ఎత్తుగా పెరిగిన కోరంగి పొదల అడుగు భాగాన్ని పట్టుకొన్నాడు. మళ్ళీ బురద ఊబినుంచి బయటపడజూశాడు. కానీ కూరుకుపోయిన కాళ్ళను ఏమాత్రం కదిలించలేకపోయాడు.

"అమ్మాయి! నీకు పుణ్యముంటుంది! నన్ను కాపాడు!" అని పూంగుళలిని బ్రతిమాలుకొన్నాడు.

~

ఇంతలో సేందన్ అముదన్ అక్కడికి వచ్చి చేరాడు. రవిదాసు పరిస్థితి ఇదీ అని ఒక్కక్షణంలో గ్రహించాడు. అతడి కళ్ళలో కాస్త జాలి పొడజూపింది.

పూంగుళలి అతన్ని చూసి, "రా! పోదాం!" అన్నది.

"అయ్యో! వీడిని ఇలాగే వదిలిపోవడమా?"

"ఏం? వీడు బురదలో పూర్తిగా కూరుకుపోయేవరకు ఆగి చూడాలనుకొంటున్నావా?"

"లేదు, లేదు! వీడినిలాగే వదిలిపోతే నా జీవితకాలమంతా ఈ దృశ్యం నా కలలోకొస్తూంటుంది. వీడిని గట్టెక్కించి వెళదాం."

"బావా! వీడు నా గొంతు పిసికి చంపాలనుకొన్నాడు."

"వాడి ఉద్దేశానికి దేవుడు వాడిని తగిన విధంగా శిక్షిస్తాడు. మనం కాపాడేసి వెళదాం."

"అలాగైతే నీ పైకండువా ఇవ్వు!" అన్నది పూంగుళలి.

అముదన్ తన పైబట్టనిచ్చాడు. దాని ఒక కొసను పూంగుళలి బురద గుంటకు దగ్గరున్న ఒక పొద అడుగుభాగానికి గట్టిగా కట్టింది. ఇంకొక కొసను రవిదాసుకిచ్చింది.

"మంత్రవాదీ! ఇదిగో చూడు! ఈ బట్ట చివరను పట్టుకో. బలంగా లాగితే ఆ పొద కూకటివేళ్ళతో పెకలించుకొని వచ్చేస్తుంది. కాబట్టి మెత్తగా పట్టుకో. నీకై నీవే గట్టెక్క ప్రయత్నించకు. పొద్దు పొడవగానే ఎవరైనా ఇటువైపు వస్తారు. వారు నిన్ను గట్టెక్కిస్తారు!" అన్నది.

"అయ్యో! రాత్రంతా ఇలాగే ఉండాలా? నావల్ల కాదు. దానికన్న నన్ను చంపేసి వెళ్ళు!"

పూంగుళలి అతడి అరుపులను పట్టించుకోలేదు. సేందన్ అముదన్ చేయి పట్టుకొని లాగి, వచ్చిన దారినే పరుగెత్తనారంభించింది. వారు మిట్ట పైకెక్కి అవతల అడవిలో దిగేవరకు మంత్రవాది ఎలుగెత్తి అరుస్తుండడం వినిపిస్తూనే ఉంది.

~

ఆ గొంతు మరుగైన తర్వాత, "బావా! మంచి సమయానికి వచ్చి చేరావు! నీవిక్కడికెలా వచ్చావు? ఎందుకు?" అని అడిగింది పూంగుళలి.

"పాతాళ చెరసాల అనుభవం తర్వాత నాకు తంజావూరులో ఉండడానికి ఇష్టం కాలేదు. తరచూ పళువూర్ వీరులు, గూఢచారులు వచ్చి ఇబ్బంది పెట్టసాగారు. కాబట్టి పళైయారైకి వెళ్ళాను. కుందవైదేవి నన్నిక్కడికి పంపించారు. యువరాజుకు అపాయాలెక్కువవుతున్నాయని, కాబట్టి ఆయనను నాగపట్టణపు చూడామణి విహారానికి తీసుకొని వెళ్ళి వదిలిపెట్టి రమ్మని చెప్పి పంపించారు. నాకూ నిన్ను చూడాలని, నీ పాట వినాలని ఆశ కలిగింది..."

"పాట వినేందుకు మంచి సమయం చూసే వచ్చావు! యువరాకుమారి చెప్పింది నిజమే. యువరాజుకు ఏర్పడుతున్న గండాలు అలాంటివిలాంటివి కావు. పగవారి కుట్రలకు తోడు చలిజ్వరం కూడ పట్టుకొంది...."

"అవును. నేను కూడ చూశాను. మేమిద్దరమూ ఆయనను ఎత్తుకొని వెళ్ళి ఆ మరుగైన మంటపంలో చేర్చాము. దానికి చాల కష్టపడ్డాము. పూంగుళలీ! నాగపట్టణపు చూడామణి విహారంలోని బౌద్ధ భిక్షువులు వైద్యం బాగా ఎరిగినవారు. యువరాజుకు నయం చేసేస్తారు."

"నాగపట్టణానికి ఎలా చేర్చడం?"

"కాలువదారి వెంబడే!"

"కాలువ గుండా ఎలా తీసుకొని వెళ్ళడం? పడవను పోగొట్టేశారు కదా?"

"పడవ నీట్లో మునిగి ఉందంతే కదా? తిరిగి లేవదీస్తే సరి!"

"అలాగైతే ఈ రాత్రే బయలుదేరవలసిందే. ఆ చిన్న పడవలో మనమందరమూ వెళ్ళలేం కదా?"

“అవసరం లేదు, పూంగుళలి! అదంతా మేము మాట్లాడి ఒక ముగింపుకొచ్చేశాము. వల్లవరయ్యన్ ఇక్కడినుంచి తిన్నగా పళైయారైకి వెళతాడు. నేను, నీవు యువరాజును పడవలో నాగపట్టణానికి తీసుకొని వెళ్ళి చేర్చాలి.”

పూంగుళలి పులకరించింది. మళ్ళీ యువరాజుతో ప్రయాణం! కాలువ వెంబడి, పడవలో నాగపట్టణం దాకా యువరాజుతో - దారిలో ఏ అపాయాలూ రాకుండ ఉండాలి.

ఇద్దరూ మరుగైన మంటపానికి చేరుకొన్నారు. మంటపం దగ్గరపడగానే అముదన్ గట్టిగా చప్పట్లు తట్టాడు.

“ఎవరక్కడ?” అని వంతిదేవుని గొంతు కఠినంగా ధ్వనించింది.

“నేనే, సేందన్!”

“ఇంకా ఎవరు?”

“నా మామ కూతురు!”

వంతిదేవుడు మంటపం వాకిటినుంచి తొంగి చూశాడు.

“ఇంకెవరూ లేరు కద?”

“లేరు! ఎందుకు సందేహం?”

“మెల్లగా మాట్లాడండి. యువరాజు నిద్రపోతున్నారు. కాసేపటికి మునుపు ఇక్కడికి ఎవరో ఒకడొచ్చాడు. నీవేననుకొని బయటకు వచ్చాను. నీవు కాదు. మంత్రవాదిలాగనిపించింది.”

“తర్వాత?”

“ఆ సమయాన నీ పాట వినిపించనారంభించింది. పాడేందుకు మంచి సమయం ఎంచుకొన్నావనుకొన్నాను.. మంచివేళగా మంత్రవాది అది విని వెనుదిరిగి వెళ్ళాడు. అతన్ని మీరు చూశారా?”

“చూశాము.”

“అతన్నేం చేశారు?”

“నేనేం చేయలేదు. ఈ పిల్లే వాడిని ఊబిలో నడుం వరకు పాతేసి వచ్చింది!”

“ఈమె గొంతు కూడ వినిపించిందే!”

“అవును; ఈమె కూడ ఒక పాట పాడింది.”

“అది వినగానే యువరాజుకు స్పృహ వచ్చినట్లై 'ఎవరా పాడుతున్నది?' అని అడిగారు. 'పడవ నడిపే అమ్మాయి!' అన్నాను. పాట వింటూ నిద్రపోయారు.”

పూంగుళలికి మళ్ళీ ఒళ్ళు పులకరించింది.

“ఈమె పాట మాత్రమేనా పాడింది? గుడ్లగూబలాగ కూడ కూసింది కద?”

"అది కూడ నా చెవిన పడింది. అడవిలో ఏదో ఒక విచిత్రం జరుగుతోందనుకొన్నాను. మీరు - బావామరదళ్ళు - ఏదో ఒక విచిత్రం జరుపుకొంటున్నారేమో అనుకొన్నాను."

"ఇదేం అప్రస్తుత ప్రసంగం?" అన్నది పూంగుళలి.

"మరేం చేయడం? ఈ రాత్రిని ఎలాగైనా గడిపితీరాలి కద?" అన్నాడు వంతిదేవుడు.

"లేదు; పొద్దు పొడిచే వేళకు మననిక్కడుంటే బతికి బయటపడలేము. రాత్రికి రాత్రే బయలుదేరాలి."

అప్పుడు ఎక్కడో చాల దూరాన నక్కలు ఊల వేయనారంభించాయి. ఆ ఊలల శబ్దానికి మధ్య గుడ్లగూబ కూత కూడ వినిపించింది.

సేందన్ అముదన్ వణికాడు. అతని మనోనేత్రం ముందు మంత్రవాది బురదలో కూరుకొని ఉండడమూ, అతని చుట్టూ నక్కలు ఊలవేస్తూ అతన్ని సమీపిస్తుండగా, అతడు గుడ్లగూబ లాగ కూతవేసి వాటిని తరమజూడడమూ కనిపించింది.

~

వంతిదేవుడు, సేందన్ అముదన్ యువరాజును నిద్ర చెడిపోకుండ మెత్తగా ఎత్తుకొన్నారు. పూంగుళలి వారి వెంట నడిచింది.

వారు కాలువ గట్టు చేరేటప్పటికి చంద్రుడు పైకొస్తున్నాడు.

యువరాజును తీరాన ఒక చెట్టుకానించి పడుకోబెట్టారు. పూంగుళలిని ఆయన పక్కనుండమని చెప్పి ఇద్దరూ నీట దిగారు. మునిగివున్న పడవను అతిప్రయాస పడి లేవదీసి తీరానికి లాక్కొచ్చారు.

యువరాజు కళ్ళు తెరిచారు. అతి మెల్లని స్వరంతో, "దాహంగా ఉంది!" అన్నారు.

పక్కనుండి ఆయన్ను చూసుకొంటున్న పూంగుళలి మరచెంబులోని పాలను ఆయన నోట కాస్త పోసింది.

పాలు కాస్త తాగిన తర్వాత, "పూంగుళలి! నీవేనా? స్వర్గలోకంలో ఎవరో దేవకన్య నా నోట అమృతం పోసినట్లనిపించింది!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 8

## "అయ్యో! పిశాచి!"

**కల్ప** వృక్షం పూంగుళలి పైన పూల వర్షం కురిపించింది. కిన్నెర వాద్యాలు మధురగీతాలను వినిపించాయి. అంతెందుకు? పూంగుళలి నరాలే వాద్య తంత్రులై దైవగీతాలను వినిపించాయి. యువరాజు ఇంపైన మాటలు ఆమెనలా మైమరపింపజేశాయి.

"యువరాజా! నేను దేవలోక కన్యను కాను; పడవ నడిపే ఒక పేద పిల్లను. మీరు గ్రోలింది కూడ దేవామృతం కాదు; కుళకర్ గుడి పాలామృతం మాత్రమే!" అన్నది.

"నీవు దేవలోక కన్యవు కానంటే నేను నమ్ముతానా? వరుణుని ముద్దుల కుమారివి కద నీవు? సముద్రకుమారీ! నీవెన్నిసార్లు నాకు ప్రాణదానం చేశావు? నీకు నేను ఏం ప్రత్యుపకారం చేయబోతున్నాను?" అన్నారు యువరాజు.

"అయ్యో! ఇంకా ఒకరాత్రి, ఒక పగలు మీతో ఉండేందుకు ఈ పేదపిల్లకు అనుమతినివ్వాలి" అన్నది పూంగుళలి.

"అదెలా సాధ్యం? నేను వెంటనే పళైయారైకి వెళ్ళాలి కదా?"

"లేదు; తమను వెంటనే నాగపట్టణానికి తీసుకొని వెళ్ళాలని సందేశం వచ్చింది."

'ఎవరి వద్దనుంచి?"

"యువరాకుమారి కుందవై దేవి వద్దనుంచే!"

"ఎవరక్కడ, వంతిదేవునితోబాటు పడవలాగుతున్నది?"

"నా అత్త కొడుకు సేందన్ అముదన్. యువరాకుమారి అతని ద్వారానే ఈ విషయం చెప్పి పంపించారు - తమను నాగపట్టణపు చూడామణి విహారానికి తీసుకొని రమ్మని..."

"ఆహా! నా అక్క మనసు మారిపోయిందా! నాకు పట్టం కట్టే ఆశ వదులుకొందా? చాలా కాలంగా నాకు బుద్ధ సంఘంలో చేరాలని ఆశ. బుద్ధ సంఘంలో చేరి బౌద్ధ భిక్షువునౌతాను. దూరదేశాలకు యాత్ర వెళతాను! శావకం - గడారం - మాయిరుడింగం - మాబప్పాళం - చీనం (చైనా)! ఆహా! నా భాగ్యమే భాగ్యం! పూంగుళలీ! రా, పోదాం!" అని చెప్పి యువరాజు లేచి నిలబడ్డారు.

ఆయనకు ఇంకా పూర్తి స్పృహ రాలేదు. జ్వరతీవ్రతలోనే ఇంకా పలవరిస్తున్నారని సందేహించింది పూంగుళలి.

అదే సమయాన దూరాన ఎవరో/ఏదో ఎలుగెత్తి కూసిన శబ్దం వినిపించింది.

యువరాజు ఉలిక్కిపడి, "పూంగుళలీ! అదేమి?" అని అడిగారు.

"గుడ్లగూబ కూస్తోందయ్యా!" అన్నది పూంగుళలి.

"కాదు! అది మనిషి గొంతు! ఏదో పెద్ద అపాయంలో చిక్కుకొన్న ఒకడి ఆర్తనాదం! అతన్ని కాపాడేసి వెళదాం. బుద్ధసంఘంలో చేరే మునుపు ఒక పుణ్యకార్యం చేద్దాం!" అని చెప్పేసి యువరాజు ముందుకు దూకి పరుగెత్త ప్రయత్నించారు. పూంగుళలి ఆయన్ను అడ్డుకొంది.

పడవను లేవనెత్తి గట్టుకు చేర్చిన ఇద్దరూ పరుగెత్తి వచ్చారు. మళ్ళీ స్పృహ తప్పిన యువరాజును భద్రంగా తీసుకొని వెళ్ళి పడవలో పడుకోబెట్టారు.

~

కాలువలో పడవ వెళ్ళనారంభించింది. యువరాజు తప్ప తక్కిన ముగ్గురూ ఇరుగ్గా కూర్చొన్నారు.

వంతిదేవుడు, "పూంగుళలి! నలుగురినీ ఈ పడవ భరించడం కష్టం. నేనెలాగూ మీదగ్గర సెలవు తీసుకోవాలి. నేనిక్కడే దిగేస్తాను. యువరాజును భద్రంగా తీసుకొని వెళ్ళి చేర్చే బాధ్యత నీది. మీకు నేను నొక్కి చెప్పనవసరం లేదు!" అన్నాడు.

అతడి గొంతు జీరవోయింది. వెన్నెల అతడి ముఖం మీద పడ్డప్పుడు అతడి కళ్ళలో ఉబికిన కన్నీళ్ళు చంద్రకిరణాలు పడి మెరిశాయి.

"కోడిక్కరై అడవి దాటిన తర్వాత దిగిపోవచ్చు కదా? నా గుర్రాన్ని కూడ అక్కడే కట్టిపెట్టి వచ్చాను. ఆ చోటు గుర్తుంది కదా?" అన్నాడు అముదన్.

"వద్దు; నేనిక్కడే దిగేస్తాను. కుళకర్ గుడి ప్రాంగణం లోపల కాసేపు పడుకొని నిద్రపోయి పొద్దునే బయలుదేరుతాను. లేకపోతే రేపు ప్రయాణం చేయలేను! దారిలో ఎన్ని అడ్డంకులెదురవుతాయో!" అన్నాడు వంతిదేవుడు.

అందాక మౌనంగా ఉన్న పూంగుళలి అప్పుడు తన నడుమున భద్రంగా కట్టివుంచిన మూటను తీసిచ్చి, "ఇదిగో! స్వామి ప్రసాదం. ఇది తినేసి పడుకో!" అన్నది.

"మీరు కూడ ఏం తినలేదు కదా? మీకు వద్దా?"

"కోడిక్కరై నుంచి ఒక కోసు దూరం దాటి వెళితే ఎన్నో గ్రామాలు. నేనో, సేందన్ అముదనో వెళ్ళి భోజనం సంపాదించుకొని రాగలం. నీ విషయమలా కాదు. నీవెవ్వరి కంటబడకుండ పళైయారై వెళ్ళి చేరాలి కదా?"

"పడవలో యువరాజున్నారన్న సంగతి మీరూ మరువకూడదు."

"ఈ పడవలో ఉన్నది యువరాజని ఎవరు నమ్ముతారు? అందుగురించి దిగులు పడకు! అది మా బాధ్యత. ఈ పడవను ఎవరూ గమనించరు."

"సరే; అలాగైతే నేనిక్కడే దిగిపోతాను."

ఆ సమయాన మళ్ళీ ఆ ఆర్తనాదం వినిపించింది. “ఆఁ! అదేమి?” అని అడిగేసి యువరాజు మళ్ళీ స్పృహ కోల్పోయారు.

పూంగుళలి లేచి నిలబడింది.

“కాదు; నా వల్ల కాదు. యువరాజుకు తెలిస్తే నన్ను మన్నించరు. ఇంకాసేపు పడవలో ఉండు. మంత్రవాదిని ఊబినుంచి బయటకు లాగేసి వస్తాను. ఇక్కడినుంచి ఆ చోటు దగ్గరే!” అని చెబుతూనే పడవనుంచి కాలువ గట్టుపైకి దూకింది.

“అలాగైతే నేనూ నీతో వస్తాను. ఆ పాతకుడితో నిన్ను ఒంటరిగా విడవను" అన్నాడు సేందన్ అముదన్.

“లేదు, అముదా! నీవు పడవలో ఉండి యువరాజును జాగ్రత్తగా చూసుకో. నేను పూంగుళలితో వెళ్ళి వస్తాను. నాక్కూడ ఆ మంత్రవాదిని చూడవలసిన అవసరముంది!” అని చెప్పేసి పూంగుళలి వెంట వేగంగా పరుగెత్తాడు వంతిదేవుడు.

~

పూంగుళలి మనోనేత్రం ముందు మంత్రవాది రొమ్ములదాక కూరుకుపోగా, నక్కలు నలువైపుల నుంచి చుట్టుముట్టి అతన్ని సజీవంగ పీక్కు తినడానికి ప్రయత్నిస్తున్న భయంకర దృశ్యం గోచరించింది. అది చాలదన్నట్లు, యువరాజామెను చూసి, “అమ్మాయీ! నీవు హంతకురాలివి!” అని నిందారోపణ చేస్తున్న దృశ్యం కూడ అగుపించింది! ఈ దృశ్యాలు అమె కాళ్ళకు అపార బలాన్నిచ్చాయి. మంత్రవాది కూరుకొనిపోయిన ఊబిని అతి త్వరగా చేరుకొంది. కానీ అక్కడ మంత్రవాది కనిపించక చాల నిరాశ చెందింది.

వెనకే వస్తున్న వంతిదేవుడు ఆమె పక్కకు వచ్చి నిలబడగానే, ఆమె ఎందుకు ఆగిపోయిందో అడిగి తెలుసుకొన్నాడు.

“ఇంకొక బురదగుంట కావచ్చు. కోడిక్కరైలో ఎన్నో బురదగుంటలున్నాయి కద? నీవు మరిచిపోయివుంటావు!” అన్నాడు.

పొదకు కట్టిన సేందన్ అముదన్ పైబట్టను వేలెత్తి చూపించింది. పాపం! ఆమె మాట్లాడలేకపోయింది.

“బురదలో పూర్తిగా కూరుకుపోయాడనుకొంటున్నావా? లేదు, లేదు! రవిదాసును అంత సులభంగా చంపడం సాధ్యమా? వాడికి నూరు ప్రాణాలు కద? తప్పించుకొనివుంటాడు!” అని చెబుతూనే వంతిదేవుడు పొదకు కట్టివున్న పైకండువాను విప్పి తీసుకొన్నాడు. పూంగుళలికి ఓదార్పుగా అలా చెప్పాడే తప్ప, అతని మనసులో, 'రవిదాసు చచ్చిపోయేవుంటాడు. వాడికి ఈ ఘోరమరణం తగిన శిక్షే!' అన్న భావం కలిగింది.

ఇద్దరూ అక్కడ నిలబడ్డం వల్ల ఫలితం లేదని ఒకేసారి గ్రహించారు. మళ్ళీ కాలువ వైపు నడక సాగించారు.

కాలువగట్టును ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్లు మరుగుపరుస్తున్నాయి. ఒక చెట్టుకొమ్మను పట్టుకొని రెండు ఆకారాలు తొంగి చూడడం కనిపించింది.

వాటిలో ఒకటి పురుషాకారాం, రెండవది స్త్రీ ఆకారం.

“అదిగో!” అని చూపించింది పూంగుళలి.

“వారెవరని తెలుస్తోందా?”

“ఒకరు మంత్రవాది; ఇంకొకరు నా అన్న భార్య. నా కన్న ముందు వచ్చి మంత్రవాదిని తప్పించింది,”

“మంచిదైంది!”

“మంచిదేం కాదు. కాలువలో వస్తున్న పడవను వారు పరీక్షగా గుచ్చి చూస్తున్నారే!”

ఆ సమయాన ఆ రెండు ఆకారాల్లో ఒకటి వీరు వస్తున్న వైపు తిరిగి చూసింది. వెంటనే రెండు ఆకారాలూ పొదల మాటున మరుగైనాయి.

“అయ్యో! వారు మనిద్దరిని కూడ చూసేశారు!”

“మాట్లాడక నాతో రా! నేనొక యుక్తి పన్నుతాను. నేనేం చెప్పినా ఆశ్చర్యపడకు. నాతోబాటే అదేవిధంగా మాట్లాడు!” అన్నాడు వంతిదేవుడు.

~

ఇద్దరూ పైన సూచించిన ఆకారాలున్న చోటును సమీపించారు. ఆ చోటును దాటి కాస్త అవతలగా వెళ్ళి కాలువ గట్టున కూర్చొన్నారు.

వెనక పొదల చాటున దాక్కొన్న వారికి తమ మాటలు బాగా వినబడుతాయని వంతిదేవుడు రూఢి చేసుకొన్నాడు.

“పూంగుళలీ! ఇలా చూడు! ఎందుకు దిగులుపడతావు? మంత్రవాది చచ్చి తొలగిపోయాడు. అదే క్షేమం!” అన్నాడు వంతిదేవుడు.

“అయ్యో! నేనా చంపాను?”

“మరి వాడిని బురదలో పడేటట్లు చేసింది నీవే కద? తర్వాత ఉన్నట్లుండి నీకు పశ్చాత్తాపం కలిగింది. కాపాడుదాం అని వచ్చావు! కానీ అంతలో ఊబి మింగేసింది. తప్పించేందుకే వచ్చావో, లేక చచ్చిపోయాడా లేదా అని చూసేందుకే వచ్చావో, ఎవరికెరుక?”

“నిన్నెవరు నావెంబడి రమ్మన్నారు?”

“వచ్చినందువల్లే కద నీవు చేసిన హత్యాచారాన్ని తెలుసుకోగలిగాను? ఒసే పాతకీ!”

"నేనా హంతకురాలిని?"

"అవును! నీవే ఆ పాతకివి! నేను మాత్రం యోగ్యుడిని/గుణవంతుడిని అని చెబుతున్నానా? అదీ లేదు. నేను యువరాజును సముద్రంలో ముంచి చంపేశాను. నీవు మంత్రవాదిని బురదలో కూరి చంపావు. దానికీ, దీనికీ సరి. నేను చేసింది ఎవరికీ చెప్పకుంటే, నీవు చేసింది కూడ నేనెవరికీ చెప్పను!"

"యువరాజును చంపింది నీవేనా? కాసేపటికి మునుపు ఆయనను చూడనే లేదన్నావు?"

"కావాలనే అలా చెప్పాను. ఇక నీదగ్గర అలా అబద్ధం చెప్పవలసిన అవసరం లేదు. నేను చెప్పిన దానికి ఒప్పుకొంటావా, లేదా?"

"ఒప్పుకోనంటే?"

"వెంటనే నందినీదేవి దగ్గరకు వెళ్ళి నీవు మంత్రవాదిని బురదలో కుక్కి చంపేశావని చెబుతాను. నేను చేసిన హత్యకు సాక్ష్యం లేదు; కానీ నీవు చేసిన హత్యకు సాక్ష్యం ఉంది..."

"నందిని నన్నేం చేసేస్తుంది?"

"ఇంకేమీ చేయదు. నిన్ను గొంతుదాక భూమిలో పూడ్చేసి ఏనుగుతో తొక్కిస్తుంది!"

"అయ్యో! ఎంత భయంకరమైన శిక్ష!"

"వద్దంటే నేను చెప్పినట్లు చేసేందుకు ఒప్పుకో!"

"ఏం చేయాలి?"

"అదిగో, నీ బావ తీసుకొస్తున్న పడవలోకెక్కు. ఇద్దరూ తిన్నగా లంకకు వెళ్ళిపోవాలి. అక్కడికి వెళ్ళి నీ యువరాజును తలుచుకొని ఏడు!"

"నేనెందుకు లంకకు వెళ్ళాలి? నేనిక్కడుంటే నీకేమి?"

"ఆఁ! నీవెళ్ళి నాగురించి పళువేట్టరయ్యర్లకు చెప్పేస్తే! - వారికి ఎలాగూ యువరాజంటే అభిమానం. నాపైన పగ తీర్చుకోజూస్తారు. నాకు ఈ లోకంలో ఇంకాస్త పని బాకీ ఉంది."

"పాపీ! యువరాజునెందుకు చంపావు? అదైనా చెప్పు!"

"చెప్పడానికేం? ధారాళంగా చెబుతాను విను. యువరాజు, ఆయన అక్కగారు కూడబలుక్కొని ఆదిత్య కరికాలన్ రాజ్యాన్ని లాగేసుకోవడానికి కుట్ర పన్నారు. ఆదిత్య కరికాలన్ నా యజమాని. ఆయన విరోధి నా విరోధి. అందుకే యువరాజును చంపాను. తెలిసిందా?"

"ఈ మహాపాపానికి నీవు మంచి శిక్ష అనుభవిస్తావు!"

"దాని గురించి నీవు దిగులు పడకు! నేను చెప్పినట్లు నీవు చేయబోతావా, లేదా?"

"చేయకపోతే వేరే దారేది? అదిగో పడవ వస్తోంది. వెళ్ళి ఎక్కుతాను."

"ఇదిగో, బాగా విను! పడవెక్కిన వెంటనే సముద్రంవైపు వెళ్ళాలి. కోడిక్కరైవైపు తిరిగావో, నీ గతి అధోగతే! నేనిక్కడే నిలబడి నీ పడవను చూస్తూంటాను. పడవ సముద్రం చేరిన తర్వాతే నేనిక్కడినుంచి

కదులుతాను.”

“సరే, సరే! ఇక్కడే ఉండు! నిన్ను వంద నక్కలు పీక్కు తిన!”

వంతిదేవుడు చేసిన సైగను చూసి పూంగుళలి వేగంగావెళ్ళి పడవెక్కింది.

పడవ ముందుకు సాగింది.

వంతిదేవుడు ఆమెకు చెప్పినట్లే అక్కడే కూర్చొన్నాడు.

అర్ధ గడియ గడిచింది.

పడవ కాలువలో చాలదూరం వెళ్ళి మరుగైంది.

ఉన్నట్లుండి వంతిదేవుని వెనక "హహ్హాహ్హా" అన్న ఒక భయంకరమైన అట్టహాసం వినిపించింది.

వంతిదేవుడు అదిరిపడ్డవాడిలాగ నటించి, చటుక్కున లేచి నిలబడి చూశాడు.

మంత్రవాది పొదల మధ్య నుంచి లేచి నిలబడి పిశాచిలాగ భయంకరంగా నవ్వాడు.

“అయ్యో! పిశాచి!” అని అరుస్తూ అక్కడినుంచి పరుగు లంకించుకొన్నాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 9

## పడవలో ముగ్గురు

**పొద్దు** పొడిచింది. రాత్రి అనే నల్లటి అందమైన దేవి లోకనాథుని విడిచి వెళ్ళవలసిన సమయం ఆసన్నమైంది. నాయకుని చుట్టిన ఆమె హస్తాలు నెమ్మదిగా పైదొలగాయి. జీవితంలోనే చివరి ముద్దు ఇచ్చేదానిలాగ ముద్దిచ్చి రాత్రి అనే దేవి ఇంకాస్త జంకుతూ నిలిచింది. 'సాయంత్రం మళ్ళీ కలుద్దాం. నాలుగు జాములసేపే కద ఈ విరహం? సంతోషంగా వెళ్ళి రా!' అన్నది లోకం. రాత్రి వెళ్ళలేక, వెళ్ళలేక తిరిగి చూస్తూ వెళ్ళింది.

మనసులో నిజమైన ప్రేమలేని కపటప్రేమిలాగ రాత్రి విడివడి వెళ్ళగానే లోకం సంతోషంతో పులకరించింది. "ఆహా! విడుదల!" అని వేలకొద్ది పక్షులు కూసి/పాడి సంతోషించాయి. చెట్లమీద, మొక్కల్లో మొగ్గలు పూలై విరిశాయి. ఎక్కడినుంచో మందలుగా తుమ్మెదలు వచ్చి ఆ విరిసిన పూలచుట్టూ ఝుంకారం చేస్తూ ఇంపైన పాటలు పాడాయి. రంగురంగుల రెక్కలతో సీతాకోకచిలుకలు నలువైపులా ఆనందంగా ఎగురుతూ....

తూరుపు ఎర్రబారింది. ఆకాశంలో చుక్కలు ఒక్కొక్కటే కాంతి తగ్గి మసకబారి మాయమైనాయి. ఇంతవరకు ఆకాశవీధిలో చల్లగా కాంతులీనుతున్న నెలవంక "ఉండనా? వెళ్ళనా?" అని అడుగుతున్న వైనం.

కాలువలో పడవ నెమ్మదిగా వెళుతూంది. పక్షుల గానంతోబాటు తెడ్లు నీటిని తోస్తున్న శబ్దం కూడ నిద్రిస్తున్న పూంగుళలి చెవిన పడింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఒక కొమ్మలో మొలిచిన రెండు అందమైన నీలిరంగు మొగ్గలు ఒకేసారి విచ్చుకొన్నట్లు ఆమె కనురెప్పలు తెరుచుకొన్నాయి. ఎదురుగా యువరాజు ముఖం కనిపించింది. ఆయన ఇంకా నిద్రపోతున్నారు. నిద్రా? లేక జ్వరతీవ్రత వల్ల ఇంకా స్పృహలేని స్థితిలో ఉన్నారా? తెలియడం లేదు. కానీ ఆయన దివ్యమైన ముఖం ఎంతగా ప్రకాశిస్తోంది!

అవతల సేందన్ అముదన్ తెడ్లు వేస్తున్నాడు.

"పూంగుళలి! ఎందుకంతలోపల లేచావు? ఇంకాసేపు నిద్రపోవచ్చు కదా?" అన్నాడు.

పూంగుళలి చిరునవ్వు నవ్వింది. ఆమె ముఖారవిందం మాత్రమే కాదు, ఆమె శరీరమే పూవై విరిసింది.

అడవిలో పుట్టి పెరిగిన పిల్ల పూంగుళలి. కానీ పక్షుల గానమూ, తుమ్మెదల ఝుంకారగీతమూ ఇంత ఇంపుగా ఎన్నడూ అనిపించలేదామెకు.

"బావా! ఉదయరాగంలో ఒక పాట పాడు!" అన్నది పూంగుళలి.

"నీవున్న చోట నేను నోరు తెరుస్తానా? నీవే పాడు!" అన్నాడు అముదన్.

"రాత్రి చీకటి కమ్ముకొన్న అడవిలో పాడావేం మరి?"

"కార్య నిమిత్తం పాడాను. ఇప్పుడు నీవు పాడు!"

"నాక్కూడా పాడాలని ఆశగా ఉంది. కానీ యువరాజుకు ఇబ్బందవుతుంది కద?"

"నాకు ఇబ్బందేం లేదు. ఇద్దరూ చేరి పాడండి!" అన్నారు అరుళ్మొళి వర్మ.

పూంగుళలి సిగ్గుతో తలవంచుకొంది.

"పడవ ఎక్కడికి వెళుతోంది?" అని అడిగారు యువరాజు.

"నాగపట్టణపు చూడామణి విహారానికి!" అన్నది పూంగుళలి.

"అలాగైతే నేను నిన్న రాత్రి చూసింది, విన్నది నిజమేనా? కల కాదా?"

"అవునయ్యా! ఇదిగో, ఇతడే తమ అక్కగారి వద్దనుంచి ఆ సందేశాన్ని తీసుకొని వచ్చాడు."

"యువరాకుమారి చెప్పిందంతా వివరంగా చెప్పు. అముదా! నన్ను బుద్ధ సంఘంలో చేర్చేటట్లు కద నా అక్కగారు చెప్పి పంపించారు?"

ఇందుకు ఏం సమాధానం చెప్పాలని అముదన్ కాస్త జంకినప్పుడు గుర్రపు డెక్కల శబ్దం వినిపించింది. పూంగుళలి, సేందన్ అముదన్ అదిరిపడ్డారు. యువరాజు ముఖంలో ఏ మార్పు కలగలేదు.

"నా మిత్రుడెక్కడ? ఆ వాణర్ కులవీరుడు?" అని యువరాజడిగారు. అడిగేసి కళ్ళు మూసుకొన్నారు.

కాసేపటికల్లా గుర్రంపైన వంతిదేవుడు ప్రత్యక్షమయ్యాడు

పడవ ఆగింది.

వంతిదేవుడు కూడ గుర్రం పైనుంచి దిగి వచ్చాడు.

"విశేషమేమీ లేదు. మీరు భద్రంగా ఉన్నారా అని చూసి వెళ్ళేందుకు వచ్చాను. ఇక అపాయం ఏమీ లేదు" అన్నాడు వంతిదేవుడు.

"మంత్రవాది?" అని అడిగింది పూంగుళలి.

"ఈ పడవలో యువరాజున్నారన్న సందేహమే కలగలేదతడికి. నేను చెప్పింది అలాగే నమ్మేశాడు."

"వాడిని చూశావా?"

"చూశాను. కానీ వాడి పిశాచాన్ని చూసి భయపడినట్లు నటించాను."

"నీలాగ అబద్ధాలు చెప్పగలిగినవాడిని నేను చూడనే లేదు."

"అబద్ధం అనకు. కల్పనాశక్తి అను. యువరాజు ఎలా ఉన్నారు?"

"మధ్యమధ్య కళ్ళు తెరిచి రెండు మాటలు మాట్లాడుతున్నారు. మళ్ళీ స్పృహ కోల్పోతున్నారు."

“ఈ జ్వరమే అలాంటిది.”

“ఎన్నాళ్ళుంటుంది?”

“ఒక్కోసారి ఒక నెల కూడ ఉంటుంది. జాగ్రత్తగా చూడామణి విహారానికి చేర్చేయండి. భిక్షువులు వైద్యం చేస్తే రెండు వారాల్లో నయమైపోతుంది. పూంగుళలి! నిన్ను నమ్మి యువరాజును నీకు ఒప్పజెప్పి వెళ్తున్నాను. నీ బావ ఎక్కడైనా గుళ్ళు గోపురాలు కనిపిస్తే దైవగీతాలు పాడుకొంటూ స్వామి దర్శనానికి వెళ్ళిపోతాడు!”

“నీతో సహవాసం చేసిన తర్వాత అలా చేయను. శివకైంకర్యం చేసే ఆశ కూడ తగ్గిపోయింది!” అన్నాడు సేందన్ అముదన్.

“నా వల్ల తగ్గిపోయిందా? లేక, ఈ అమ్మాయి వల్లనా? నిజం చెప్పు!”

సేందన్ అది చెవిలో వేసుకోక, “గుర్రాన్ని నేను చెప్పిన చోట కనిపెట్టావా?” అని అడిగాడు.

“గుర్రం నన్ను కనిపెట్టింది. ఇది నేను తంజావూరులో నీ దగ్గర విడిచిపెట్టి వెళ్ళిన గుర్రం కదా?”

“చీకటి కమ్ముకొన్న దట్టమైన అడవిలో ఇది నన్ను చూసి సకిలించింది. అరబ్బుల చేత చిక్కుకొన్నప్పుడు నేను ఒక విషయం తెలుసుకొన్నాను. అముదా! గుర్రాలను ఒట్టి కాళ్ళతో పరుగెత్తించడం పాపం! డెక్కల అడుగుభాగాన ఇనుప కమానులు బిగించి నడిపించాలి. మొట్ట మొదట నాకు కనిపించే కొలిమిలో దీనికి కాలి కవచాలు వేయిస్తాను. సరే! సరే! అదంతా మాట్లాడేందుకు సమయం లేదు. మళ్ళీ మిమ్మల్ని, యువరాజును చూస్తానో, లేదో తెలియదు. యువరాజుకు మళ్ళీ స్పృహ వస్తే నేను పళైయారైకు వెళుతున్నానని చెప్పండి. అక్కడినుంచి త్వరలో వార్త పంపించేటట్లు కూడ చెప్పండి. అప్పుడే ఆయన మనసు నెమ్మదిగొంటుంది...”

వంతిదేవుడు గుర్రాన్ని తిప్పాడు. అతివేగంగా వీరి కనుచూపుమేర దాటి మరుగైనాడు.

~

రెండువైపులా దట్టంగా మొగలి పొదలు పెరిగిన కాలువ వెంబడి పడవ వెళుతూంది. బంగారు వన్నె మొగలి పూలు, దంత వర్ణపు తెల్లని మొగలి పూలు ఇరువైపులా కనిపించాయి. వాటి సువాసన మైకం కలిగిస్తోంది. కొన్ని చోట్ల కాలువ గట్టున పొన్న చెట్లు కనిపించాయి. ఇంకొన్ని చోట్ల కదంబ చెట్లు కనిపించాయి. ముత్యపు రంగు పొన్న పూలు, కుంకుమ వర్ణం కదంబ పుష్పాలు కాలువ వెంబడి వెదజల్లబడి కనిపించాయి.

భూలోకంనుంచి పుణ్యాత్ములు స్వర్గానికి వెళ్ళే దారంటూ ఒకటుంటే అది ఇలాగే ఉంటుందనిపించింది పూంగుళలికి.

మధ్య మధ్య గ్రామాలు కనిపించిన చోట సేందన్ అముదన్ వెళ్ళి యువరాజుకు పాలు, పూంగుళలికి అన్నం తీసుకొచ్చాడు.

యువరాజు కళ్ళు తెరిచినప్పుడల్లా పూంగుళలి కాస్త పక్కకు తొలగి నిలబడేది. ఆయనకెదురుగా నిలబడి కళ్ళెత్తి ఆయనను చూడలేకపోయింది - ఆయన స్పృహ కోల్పోయినప్పుడల్లా ఆయన ముఖాన్నే చూస్తూ కూర్చొనేది. సేందన్తో చాల విషయాల గురించి మాట్లాడింది. కొన్నిసార్లు ఇద్దరూ కలిసి పాడుకొని ఆనందించారు.

సేందన్ ఆహారం కోసం గ్రామాలకు వెళ్ళినప్పుడల్లా పూంగుళలి యువరాజు తల నిమిరి, వెంట్రుకలు దువ్వి ఉపచారాలు చేసింది. అప్పుడల్లా ఆమె మనసు ఉప్పొంగి, ఒళ్ళు పులకరించి, పరవశించింది.

ఇలా తాను ఎన్నెన్నో పూర్వజన్మల్లో యువరాజుకు ఉపచారాలు చేసినట్లనిపించిందామెకు. రూపం తెలియని వేలకొద్దీ జ్ఞాపకాలు రెక్కలు విప్పుకొని ఆమె మనసులో దూరి మళ్ళీ ఎగిరిపోయాయి.

ఒక పగలు, ఒక రాత్రి వారా కాలువ వెంబడి ప్రయాణించారు. సేందన్ అముదన్, పూంగుళలి వంతులు వేసుకొని అప్పుడప్పుడు కాస్త నిద్రపోయారు. కళ్ళు మూసుకొని నిద్రపోతున్నప్పుడు కూడ గుర్తు తెలియన కమ్మని కలలు కంది పూంగుళలి.

~

మరునాడు సూర్యోదయ సమయానికి, లోకమే బంగారు వన్నెతో ప్రకాశిస్తున్నప్పుడు, పడవ నాగపట్టణం చేరింది. నాగపట్టణం సమీపాన ఆ కాలువనుంచి ఒక శాఖ బయలుదేరి తిన్నగా చూడామణి విహారంవైపే వెళుతోంది. ఆ పిల్లకాలువ వెంబడి పడవను నడుపుకొంటూ వెళ్ళారు. బుద్ధవిహారం వెనుకవైపు పడవను తీసుకొని వెళ్ళి ఆపారు.

ఆ సమయాన ఆ ప్రఖ్యాత బుద్ధవిహారంలో ఏదో అలజడి/గడబిడ లేచినట్లు తోచింది. విహారం వాకిట ప్రజల గుంపు చేరి పెద్దగా అరుస్తుండడం వినిపించింది. భిక్షువులు అటూ ఇటూ పరుగెడుతుండడం కనిపించింది.

పడవనుంచి ముగ్గురూ ఒడ్డుకు దిగారు. సేందన్ అముదన్, తాను విహారానికి వెళ్ళి ఆ అలజడికి కారణమేమని తెలుసుకొని వస్తానని వెళ్ళాడు.

~~~
~~~

# అధ్యాయము - 10

# చూడామణి విహారం

**పూంపుహార్** అనబడే కావేరి పట్టణాన్ని సముద్రం మింగేసింది కద/సముద్రంలో మునిగిపోయింది కదా? ఆ తర్వాత చోళదేశపు సారవంతమైన ప్రదేశపు ముఖ్యమైన రేవు పట్టణంగా నాగపట్టణం అంతే పేరుగాంచింది. పొన్నినది పారి సారవంతంగా సహజ సంపదలతో తులతూగుతున్న ఆ చోళనాడుతో వర్తక వ్యాపారాలు చేసేందుకు ఎన్నో విదేశాలు ఉవ్విళ్ళూరేవి. పెద్ద పెద్ద ఓడల్లో వర్తక సరుకులు వచ్చి దిగేవి. ముత్యాలు, రత్నాలు, వజ్రవైఢూర్యాలు, సుగంధ ద్రవ్యాలు కుప్పతెప్పలుగా వచ్చి దిగేవి. వాటితోబాటు అరబ్బు దేశం గుర్రాలు కూడ విక్రయానికి వచ్చి దిగేవి.

సుందరమూర్తి నాయనార్ కాలంలో నాగపట్టణం ప్రసిద్ధిగాంచిన మణిమయ నగరంగా ఉండేది. ఆ నగరాన్ని చూసిన నంబి ఆరూర్ ఇలా పొగిడారు:

<< నాగపట్టణపు వీధుల్లో సముద్రతీరంలోని రేవుదాక కుప్పలుగా పోసివున్న మణిమాణిక్యాల గురించి పొగడుతూ ఒక కవిత ... >>

ఆ రేవు పట్టణంలో విలసిల్లిన పెరుమాళ్ళను ఏం కావాలని సుందరమూర్తి అడిగారో తెలుసా? తక్కిన ఊళ్ళలోలాగ మణి మాణిక్యాలతో బాటు, ఒక మేలుజాతి గుర్రం కూడ అడిగి పొందారు! వాటిని పొందిన తర్వాత తిరువారూర్ నగరానికి తిరిగి వెళ్ళారని పెద్ద పురాణం చెబుతోంది.

నాగపట్టణపు నదీముఖద్వారంలో వచ్చి దిగిన అరబ్బు దేశపు గుర్రాలను చూసిన వెంటనే నాయనార్‌కి కూడ గుర్రమెక్కి సవారి చేయాలని ఆశ పుట్టింది కాబోలు!

~

నాగపట్టణం గురించిన పురాణ వర్ణనలు ఒకవైపుండగా, చారిత్రాత్మకమైన శిలాశాసనాలు, తామ్రపత్రాలు ఆ నగరం గురించి ఇలా చెబుతున్నాయి:

**"పలుదేవాలయాలు, సత్రాలు, జలాశయాలు, తోపులు, మేడలతో నిండిన నగరం నాగపట్టణం"** అని ఆనైమంగలపు తామ్రపత్రాలు ఆ నగరాన్ని వర్ణిస్తున్నాయి.

అదే ఆనైమంగలం తామ్రపత్రాలు ఆ రోజుల్లో నాగపట్టణంలో పేరుగాంచిన చూడామణి విహారం అనే బౌద్ధవిహారం గురించి, దాని వృత్తాంతం గురించి చెబుతున్నాయి.

~

మలేషియా అని మనం ఇప్పుడు పిలిచే ద్వీపకల్పం ఆ రోజుల్లో శ్రీవిజయం అన్న పేరుతో పిలవబడి ప్రసిద్ధిగాంచింది. ఆ నాడులో ఒక ముఖ్యనగరం గడారం (కటారం?). ఆ మహానగరం రాజధానిగా

నలుదిశలా విస్తరించిన శ్రీవిజయ మహాసామ్రాజ్యాన్ని ఏలిన వారు శైలేంద్ర వంశంవారు. ఆ వంశపు రాజుల్లో మకరధ్వజ చూడామణి వర్మ అనే రాజు చాల కీర్తి ప్రతిష్ఠలతో విరాజిల్లాడు. ఆ రాజు "**రాజ తంత్రాలలో నిపుణుడు; జ్ఞానంలో దేవతల గురువైన బృహస్పతికి సాటి; జ్ఞానార్తులకు తామర పూలకు సూర్యుని వంటివాడు; దానార్తులకు కల్పవృక్షం వంటివాడు**" అని ఆనైమంగలం తామ్రపత్రాలు వేనోళ్ళ పొగడుతున్నాయి.

అటువంటి మహారాజు కుమారుడైన విజయోత్తుంగ వర్మ తన తండ్రి పేరు చిరకాలం నిలిచేటట్లు "**మేరు పర్వతాన్ని పోలిన చూడామణి విహారాన్ని నాగపట్టణంలో కట్టించాడు**" అని ఆ తామ్రపత్రాలు చెబుతున్నాయి.

~

గడారం రాజైన విజయోత్తుంగ వర్మ నాగపట్టణానికి వచ్చి బౌద్ధ విహారాన్ని కట్టనేల అని పాఠకులు అడగవచ్చు.

చోళదేశపు సారవంతమైన, సిరిసంపదలతో తులతూగుతున్న ప్రదేశంతో దీర్ఘకాలపు వర్తక సంబంధం కలిగిన విదేశాల్లో శ్రీవిజయం ముఖ్యమైనది. ఆ దేశప్రజలు పలువురు నాగపట్టణానికి వచ్చి శాశ్వతంగా అక్కడే స్థిరపడిపోయారు. ఇంకొందరు తరచూ వచ్చి వెళ్ళేవారు. గడారం రాజు, అతని కుటుంబీకులు బౌద్ధ మతస్థులు. వారు బౌద్ధమతాన్ని పాటించేందుకు అనుకూలంగా ఉండాలనే ఆ రాజు నాగపట్టణంలో చూడామణి విహారాన్ని కట్టించాడు. బౌద్ధమతపు మాతృదేశం భారతదేశం కద అన్న కారణం కూడ అతని మనసులో ఉండి ఉండవచ్చు.

తమిళనాడు రాజులందరూ ఎప్పుడూ మతసామరస్యం కలిగినవారే (translator's note: it's not true. There is historical evidence to show that several kings before and after Rajaraja Chola persecuted followers of religions other than what they patronised.) కాబట్టి వారు నాగపట్టణంలో చూడామణి విహారం కట్టేందుకు అనుమతినిచ్చారు. అనుమతి మాత్రమేనా? ఆ బౌద్ధ విహారాన్ని నిర్వహించేందుకు మాన్యం భూమిని కూడ ఇచ్చారు.

[ఈ కథ జరిగిన తర్వాత రాజరాజ చోళుడు నాగపట్టణపు చూడామణి విహారానికి ఆనైమంగలం గ్రామాన్ని, దాని చుట్టు పట్ల ఉన్న ఇంకొన్ని గ్రామాలను విరాళంగా, అంటే ఎటువంటి పన్ను కట్టవలసిన అవసరం లేనట్లు, రాసిచ్చాడు. ఈ భూదానాన్ని రాజరాజచోళుని కుమారుడు, చరిత్రలో ప్రసిద్ధిగాంచిన రాజేంద్ర చోళుడు, తామ్రపత్రాలమీద రాయించి ధృవీకరించాడు. ఇవే 'ఆనైమంగలం తామ్రపత్రాలు' అని పిలవబడుతున్నాయి. మొత్తం 22 తామ్ర పత్రాలు. ఒక్కొక్కటి నాలుగు అంగుళాల పొడవు, ఐదు అంగుళాల వెడల్పుగలిగి, ఒక పెద్ద రాగి వలయంలో గుచ్చి కూర్చబడివున్నాయి. ఈ తామ్రపత్రాలు సమీపకాలంలో (అంటే కల్కి ఈ కథ రాసిన 1950' దశకంలో) ఓడలో కడలిదాటి యూరప్‌లోని హాలండ్ దేశపు లెయిడన్

నగరంలో ఒక పురావస్తు ప్రదర్శన శాలలో ప్రదర్శించబడివున్నాయి. కాబట్టి వీటిని 'లెయిడన్ శాసనం' అని కూడ కొందరు చరిత్ర పరిశోధకులు పిలవడం కద్దు.]

విజయాలయ చోళుని కాలంనుంచి చోళరాజులు శివభక్తిపరాయణులైనారు. అదిత్య చోళుడు, పరాంతక చోళుడు, గండరాదిత్య చోళుడు మిక్కిలి శివభక్తి కలిగివుండేవారు. అనేక శివాలయాలకు కైంకర్యం చేశారు. కానీ వారు ఇతర మతాలను ద్వేషించలేదు. తమ రాజ్యంలోని ప్రజలు ఏ మతానికి చెందినవారైనా ఆదరిస్తూ వచ్చారు. సుందర చోళ చక్రవర్తి తమ పూర్వీకుల కన్న రెండడుగులు ముందుకు వెళ్ళారు. బుద్ధ విహారాలకు, పాఠశాలలకు ప్రత్యేక స్థాయినిచ్చి ఆదరించారు. కాబట్టి ఆయన కాలంలో చోళ సామ్రాజ్యంలోని బౌద్ధ మతస్థులందరూ చాల ఉత్సాహంతోను సంతోషంతోను జీవించేవారు. లంకలో అరుళ్మొళి వర్మ ధ్వంసమైన బౌద్ధ విహారాలను పునర్నిర్మించేందుకు ఏర్పాట్లు చేయించడంతో వారి ఉత్సాహం, సంతోషం ఇంకా అధికమైంది.

అదలా ఉండగా, ఆ రోజు ఆ ప్రసిద్ధ చూడామణి విహారంలో లేచిన కలవరానికి కారణమేమి? భిక్షువులు అస్థిమితంగా అటూ ఇటూ కలవరపాటుతో ఎందుకు పరుగెడుతున్నారు? విహారం వాకిట ఎందుకంత జనసందోహం, అలజడి? - సరే; మనం కూడ సేందన్ అముదన్‌తోబాటు వెళ్ళి చూద్దాం.

~

సేందన్ అముదన్, తక్కిన ఇద్దరూ కాలువ మార్గాన పడవలో చూడామణి విహారం వెనుకభాగానికి చేరారని చెప్పాము. అక్కడ ఎవరూ కనబడకపోవడంతో సేందన్ అముదన్ గాభరాపడి, ఎలాగో విహారం ముందుభాగానికి చేరాడు. అక్కడే ప్రజలు వచ్చి దర్శించి పూజించేందుకు బుద్ధ భగవానుని 'చైత్యం' అనబడే ఆలయం ఉంది. భక్తులు పలువురు తామరపూలు, చంపకపూలు, ఇతర పూజ సామగ్రితో నిండిన పళ్ళాలతో వచ్చివున్నారు. కానీ వారు వచ్చిన పని మరిచినట్లుంది. భక్తులు చైత్యాన్ని చేరేందుకు ఏర్పరచిన మెట్లమీద బౌద్ధ భిక్షువులున్నారు. వారిని చూస్తూ కింద నిలబడ్డ ఒకతను ఏదో చెబుతున్నాడు. అది అముదన్ గమనించాడు. భిక్షువులు కొందరి కంట నీరు పెట్టుకోవడం కూడ సేందన్ అముదన్ చూశాడు. కింద నిలబడ్డ భక్తులు అలవాటు ప్రకారం "సాధు! సాధు!" అని ఘోషించడానికి బదులు, "ఆహా!", "అరెరె!", "అయ్యో!" అని హాహాకారాలు చేయడాన్ని కూడ గమనించాడు.

దగ్గరకు వెళ్ళి కాసేపు నిలబడి విన్న తర్వాత విషయం ఇదీ అని తెలిసింది. భిక్షువులతో మాట్లాడుతున్నవాడు పార్థిబేంద్రుని ఓడలో ఉండిన కళాసీలలో ఒకడు. ఓడ కిందటి రోజు రాత్రి నాగపట్టణానికి వచ్చేసింది. కళాసీలు ఓడనుంచి దిగిన వెంటనే యువరాజును సముద్రం తీసుకొని వెళ్ళిపోయిందని కొందరితో చెప్పగా, అది నగరమంతా వ్యాపించింది. ఆ వార్త నిజమేనా అని తెలుసుకోవడానికి చూడామణి విహారపు ప్రధమ భిక్షువు ఆ కళాసీలలో ఒకతన్ని పిలుచుకొని రమ్మని చెప్పి పంపించారు. అతడు తనకు తెలిసింది తెలిసినట్లు చెప్పాడు. "సుడిగాలి వీచినప్పుడు యువరాజు

సముద్రంలోకి దూకారు. తిరిగి రానేలేదు" అని గద్గద స్వరంతో చెప్పాడు.

అప్పుడు ఆ కూటమిలో వెక్కివెక్కి ఏడుస్తున్న గొంతులు చాల వినిపించాయి.

ప్రధమ భిక్షువు కళ్ళనుంచి అశ్రువులు ధారగా ప్రవహించసాగాయి.

ఆయన వంచిన తల ఎత్తకుండ మెట్లెక్కి చైత్యాన్ని దాటి విహారంలోపలికి వెళ్ళారు. తక్కిన భిక్షువులు కూడ ఆయన వెంటే వెళ్ళారు. సేందన్ అముదన్ కూడ వారితోబాటు లోపలికి రావడాన్ని ఎవరూ గమనించలేదు.

ప్రధమ భిక్షువు తక్కిన భిక్షువులను చూసి ఇలా అన్నారు:- "బుద్ధ భగవానుని కరుణ ఇలా ఉందా? నేనెన్నో ఆశాహర్మ్యాలు కట్టుకొన్నాను కదా? చక్రవర్తిని చూసేందుకు ఇటీవలే తంజావూరుకు వెళ్ళాను. ఆ సమయాన లంకలో అరుళ్మొళి వర్మ జరిపిస్తున్న అద్భుత కార్యాలను గురించి చెప్పాను. అదంతా యువరాకుమారి కుందవైదేవి కూడ వింటూ వచ్చారు. తర్వాత నన్ను ఏకాంతంగా పిలిపించి, ఈ విహారంతో చేరినట్లు ఒక వైద్యశాలను కట్టించాలని, దానికి కావలసిన వసతులను తాను ఏర్పాటు చేస్తానని చెప్పారు. అది మాత్రమేనా? 'ఆచార్యా! దేశం నలుమూలలా ప్రజలు మాట్లాడుకొంటున్న పలురకాల వార్తలు మీరు వినేవుంటారు. బహుశ యువరాజు కొన్నిరోజులపాటు చూడామణి విహారంలో అతిథిగా ఉండేందుకు రావచ్చు. అతన్ని చూసుకొంటారా?' అని కుందవైదేవి అడిగారు. 'దేవీ! అటువంటి భాగ్యం మాకు కలగాలే గాని, ఆయన్ను కంటికి రెప్పలా చూసుకొంటాం  అన్నాను. ఏం ప్రయోజనం? యువరాజు కడలిలో మునిగిపోయారు! ఈ నాడులోని మంచివారి మనోరథాలన్నీ మునిగిపోయాయి! సముద్రరాజు ఎలా ఇంతటి పెద్ద కష్టాన్ని మనకివ్వడానికి తెగించాడు? ఆ కష్టాన్ని వినేవారే లేరా?" అని ఏడ్చారు.

తక్కిన భిక్షువులందరూ మౌనంగా కన్నీళ్ళు విడిచారు.

ప్రధమ భిక్షువు మాట్లాడి ముగించిన తర్వాత అక్కడ కాసేపు మౌనం నెలకొంది.

సేందన్ అముదన్ అదే మంచి సమయమని ఎంచి బౌద్ధ భిక్షువుల మధ్య దూరి ప్రధమ భిక్షువును సమీపించ ప్రయత్నించాడు. కానీ పలువురు అతన్ని అడ్డుకొన్నారు.

"అయ్యా! ఈ దాసుని పేరు సేందన్ అముదన్. తంజావూరుకు చెందిన వాడిని. మీ ప్రధమ ఆచార్యులకు ఒక ముఖ్యమైన వార్త చెప్పాలి!" అన్నాడు.

"చెప్పు! చెప్పు!" అన్నారు పలువురు.

అతను జంకుతుండడాన్ని గమనించిన ఆచార్యులు, వీరికి తెలియకూడని రహస్యమేమీ లేదు. చెప్పు!" అన్నారు.

"అయ్యా! జబ్బుపడ్డ ఒక వ్యక్తిని తీసుకొచ్చాను!" అన్నాడు అముదన్.

"ఎవరా అనారోగ్యగ్రస్తుడు? ఏం జబ్బు? ఎక్కడ విడిచిపెట్టి వచ్చావు?"

"విహారం వెనకవైపు..."

"అక్కడికెలా వచ్చావు?"

"కాలువగుండా పడవలో తీసుకొచ్చాను. గడగడ వణికించే చలిజ్వరం. మీరు వెంటనే..."

"భగవాన్! వణికించే చలిజ్వరం అంటువ్యాధి కదా? ఇక్కడికి ఆ రోగినెందుకు తీసుకొచ్చావు? అందులోను ఈ సమయం చూసి...."

"ఆచార్యా! అశోక చక్రవర్తి బౌద్ధ మతాన్ని పాటించినవాడని ఇప్పటివరకు భావించాను. ఇప్పుడు కాదని తెలుస్తోంది...."

"అదేం అలా అంటున్నావు?"

"అశోక స్తంభాన్నొకదాన్ని కంచి సమీపాన చూశాను. దానిమీద వ్యాధిగ్రస్తులకు వైద్యం చేయడం ప్రధమ కర్తవ్యమని చెప్పబడివుంది. మీరేమో ఇలా తరిమికొడుతున్నారు!" అన్నాడు అముదన్.

ఆచార్యులు తక్కిన వారిని చూసి, "కాస్త ఓపిక పట్టండి! నేను వెళ్ళి చూసి వస్తాను!" అని చెప్పేసి, "రా, అబ్బాయ్!" అని సేందన్ అముదన్ని పిలుచుకొని వెళ్ళారు.

~

విహారపు లోగిలిలో కాలువ సమీపాన ఒక యువతి, ఒక యువకుడు ఉండడాన్ని గమనించి ఆచార్యులు అదిరి పడ్డారు. "ఇదేం కార్యం చేయ తెగించారు? ఈ విహారం లోపల స్త్రీలు రానేకూడదు కద? భిక్షుణిలకు కూడ వేరొక ప్రత్యేకమైన మఠం కద కట్టబడింది?" అన్నారు.

కానీ దగ్గరకు వెళ్ళి ఆ యువకుడిని చూసిన వెంటనే ఆచార్యులు ఆశ్చర్యానికి లోనయ్యారంటే చాలదు! ఆశ్చర్యంతోను, ఆనందంతోను ఆయన నోట మాట పెగల్లేదు.

సందేహ నివృత్తి కోసం, "యువరాజు అరుళ్మొళి వర్మేనా?" అని సేందన్ అముదన్ని అడిగారు.

ఇది యువరాజు చెవిన పడింది. "లేదు, ఆచార్యా! లేదు! నేను యువరాజును కాను, ఏమీ కాను. ఈ అమ్మాయి, ఈ అబ్బాయి కూడబలుక్కొని నన్ను పిచ్చివాడిని చేయజూస్తున్నారు. నేనొక పడవ నడిపేవాడిని. కాసేపటికి మునుపు ఈ అమ్మాయిని చూసి, 'అమ్మాయి! నన్ను పెళ్ళి చేసుకొంటావా? ఇద్దరం పడవలో దూరదేశాలకు వెళదాం!' అన్నాను. ఇతడు ఏవేవో పేలాడు. నేను లోకాన్ని ఏకఛత్రం కింద ఏలేందుకు పుట్టానట! చేపలు పట్టే కులానికి చెందిన ఈ పేదపిల్ల నన్ను పెళ్ళాడదట. ఈమెకు నేను సుఖంగా ఉంటే చాలట. నా మహత్తరమైన విజయాలను విని ఈమె సంతోషపడబోతూందట. ఎలా ఉంది కథ? నిజానికి చిత్తభ్రమ నాకా? వీరికా?" అన్నారు.

సేందన్ అముదన్ ఆచార్యుల చెవిన మెల్లగా ఏదో చెప్పాడు. అంతకు మునుపే జ్వరతీవ్రత వల్ల యువరాజు మతి తప్పి మాట్లాడుతున్నారని ఆచార్యులు గ్రహించారు. యువరాకుమారి కుందవైదేవి యువరాజుకు తమవద్ద ఆశ్రయమివ్వమని అడిగిన విషయం కూడ గుర్తుకొచ్చింది.

తక్కిన భిక్షువులను చూసి, "ఈ అబ్బాయికి సోకింది విషజ్వరమే. బయటకు పంపిస్తే ఇంకా

వేలకొద్ది ప్రజలకు సోకుతుంది. లంకలో ఎన్నో వేలకొద్ది ప్రజలు ఇది సోకి చనిపోయాయి. కాబట్టి ఈ యువకుని నేనే నా గదికి తీసుకొని వెళ్ళి ఉపచారమూ, వైద్యమూ చేయబోతున్నాను. మధ్యమధ్య జ్వరతీవ్రత వల్ల ఈ అబ్బాయి ఏదైన పేలితే పట్టించుకోకండి!" అన్నారు.

~

వెంటనే ప్రధమ భిక్షువు (ఆచార్యులు) యువరాజు దగ్గరకు వచ్చి ఒక చేత్తో ఆయనను హత్తుకొని ఎత్తారు. సేందన్ అముదన్ ఇంకొక వైపు పట్టుకొని సహాయం చేశాడు. అందరూ మెట్లెక్కి పైకి వెళ్ళారు.

ఇదిగో, ఇంకొన్ని క్షణాల్లో మెట్లన్నీ ఎక్కి వెళ్ళి తలుపు తీస్తారు. వెంటనే లోపలికి ప్రవేశించి తలుపు మూసేస్తారు. తర్వాత యువరాజును చూడలేము. ఇవీ పూంగుళలి మదిలో పరుగెట్టిన ఆలోచనలు.

పూంగుళలి అనుకొన్నట్లే జరిగింది. మెట్లెక్కిన వెంటనే తలుపు తెరుచుకొంది. సేందన్ అముదన్ని మాత్రం బయటే నిలబెట్టి ప్రధమ భిక్షువు ఏదో చెప్పారు. తర్వాత తెరిచిన వాకిలి గుండా అందరూ లోపలికి ప్రవేశించారు.

తలుపు ధడేల్మని మూసుకొంది. అది పూంగుళలి హృదయద్వారాన్నే మూసినట్లనిపించింది.

ఇక ఈ జన్మలో యువరాజును చూడలేము. మరు జన్మలోనైనా చూసే భాగ్యం కలుగుతుందా? - ఇలా ఆలోచిస్తూ యువరాజు కనుమరుగు కావడాన్ని చూస్తూ నిలబడింది పూంగుళలి.

~~~
~~~

# అధ్యాయము - 11

## కొలిమి

**వంతిదేవుడు** గుర్రాన్ని పళైయార్రై వైపు పోనిచ్చాడు. పళైయార్రైనుంచి వచ్చిన దారి గుర్తుండడం వల్ల ఎవరినీ దారి అడగకుండ ఆ దిశలో ముందుకు సాగాడు. మొదట కాసేపు అడవి దారిన వెళ్ళాడు. గుర్రం ఇందువల్ల చాల కష్టపడుతుండడాన్ని గమనించాడు. తాను కూడ అప్పుడు చాల అలిసిపోయివున్నాడు. కాసేపైన ఆదమరిచి నిద్రపోయి చాల రోజులైంది. అప్పుడప్పుడు కళ్ళు మూసుకొని కాసేపు కునుకు తీయడమే తప్ప నెమ్మదిగా ఒక చోట పడుకొని నిద్రించి చాల రోజులైంది. పళైయార్రైకి వెళ్ళి యువరాకుమారికి సంగతి తెలియజేస్తే తన బాధ్యత తీరిపోతుంది. నెమ్మదిగా నిద్రపోవచ్చు. అంతేకాదు, గడచిన రోజులన్నిటికీ చేర్చి రోజులకొద్ది నిద్రపోవాలనుకొన్నాడు.

యువరాకుమారి వద్ద, "మీరు చెప్పిన కార్యాన్ని నెరవేర్చేశాను" అని చెప్పేటప్పుడు తాను పొందబోయే సంతోషాన్ని తలుచుకొన్నాడు. దేవి ముఖం అది విని ఎలా విప్పారుతుందని ఊహించుకొన్నాడు. ఆ తలపులు అతని ఒళ్ళు పులకరింపజేశాయి.

ఇంకొక విషయం కూడ అతడికి గుర్తుకొచ్చింది. కంచి నుంచి బయలుదేరినప్పటినుంచి తను ఎన్ని అబద్ధాలు, కట్టుకథలు చెప్పివున్నాడు? అవసరం వచ్చింది కాబట్టి చెప్పాడు. కానీ అదంతా ఇప్పుడు తలుచుకొంటే అతడి మనసు, శరీరం కుంచించుకుపోయాయి. యువరాజు అరుళ్మొళి వర్మతో కొంతకాలమే కలిసి స్నేహం చేసినా కూడ అతడి మనోదృక్పథమే మారిపోయింది. రాజకీయ కార్యాలలో పని చేస్తున్నవారు చాణక్యనీతి ఎరిగివుండాలని భావించేవాడు. అటువంటి రాజకీయ తంత్రాలనుపయోగించి తన పూర్వీకులు పోగొట్టుకొన్న రాజ్యాన్ని తిరిగి పొందవచ్చన్న ఆశకూడ ఉండేదతడికి. ఆ అభిప్రాయాలన్నీ ఇప్పుడు మారిపోయాయి. యువరాజు అరుళ్మొళి వర్మ ఋజుప్రవర్తన, సత్యసంధత చూసిన తర్వాత అతడికి అబద్ధాలు, కట్టుకథలంటేనే విసుగు, విరక్తి, అసహ్యమూ పుట్టాయి. ఆయనను కాపాడే ఉద్దేశంతో తాను నిన్న రాత్రి మంత్రవాది చెవిన పడేటట్లు చెప్పిన అబద్ధాలన్నీ గుర్తుకొచ్చాయి. దానివల్ల ఏమైనా విపరీతం జరిగితే ఏం చేయాలని అతడు ఆలోచించినప్పుడు, ఒకవేళ దాన్ని ఇంకెవరైనా చెవిన వేసుకొని, తిన్నగా వెళ్ళి కుందవైదేవికే చెప్పేస్తే? - యువరాకుమారి నమ్మదు! కానీ ఎంత పెద్ద విపత్తు?

ఇకముందు, లేనిపోని కట్టుకథలు కల్పించి చెప్పడం పూర్తిగా విడిచిపెట్టేయాలి. నిజాన్నే చెప్పాలి. అందువల్ల కష్టాలొస్తే వాటిని ఎదుర్కోవాలి. ఆ వీరవైష్ణవునిలాంటి వారు, రవిదాసు వంటివారు గూఢచారి పని చేయనీ. మనకెందుకు ఆ తంటా? కత్తి సహాయంతో మనకు దొరికే గెలుపు దొరకనీ. అదే చాలు. అందువల్ల ప్రాణం కోల్పోయినా సరే. మంత్ర తంత్రాలన్నిటినీ ఇక వదిలిపెట్టేయాలంతే.

~

ఇలా ఆలోచిస్తూ వెళుతుండడంతో గుర్రం వేగం తగ్గిన విషయం అతడు కాసేపు గమనించలేదు. అంతేకాదు, గుర్రంపైన కూర్చొని అలాగే కళ్ళు మూసుకొనిపోగా, ఇంచుమించు నిద్రలోకి జారిపోయాడు. గుర్రం ఒకచోట తడబడి వంగినప్పుడు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. గుర్రం తన ముంగాళ్ళలో ఒకదాన్ని నేలకు ఊని నడవలేకపోవడాన్ని గమనించాడు. వెంటనే కిందికి దిగి గాయపడ్డ కాలిని తన చేతిలోకి తీసుకొని చూశాడు. ఆ కాలి అడుగుభాగాన ఒక పదునైన రాయి గుచ్చుకొనివుంది. దాన్ని లాఘవంగా తీసి పారేశాడు. మంచివేళగా, గాయం పెద్దదేమీ కాదు. మళ్ళీ గుర్రాన్ని తట్టి ఉత్సాహంగా దానిపైకెక్కి కూర్చోన్నాడు. ఒడలో అరబ్బులు చెప్పింది గుర్తుకొచ్చింది.

**"తమిళదేశస్థులు క్రూరులు; బుద్ధి, వివేకం కూడ లేనివారు! గుర్రాల డెక్కలకు కమాను వేయించక ఒట్టి కాళ్ళతోనే తోలుతారు. అలా పరుగెత్తే గుర్రాలు ఎన్నాళ్ళు బతికుంటాయి?"**

ఇది తలుచుకొంటూనే వంతిదేవుడు గుర్రాన్ని నడుపుకొంటూ వెళ్ళాడు. వీరులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు కవచం ధరిస్తారు. గుర్రాల డెక్కలకు ఇనుప కవచం వేయించడం విచిత్రమైన సంగతే. కానీ అలా ఇతర దేశాలలో చేస్తారని ఇప్పటికే విన్నాడు. తనకు కనిపించే మొట్టమొదటి కొలిమిలో దీని గురించి విచారించవలసిందే. వీలైతే ఈ గుర్రం డెక్కలకు ఇనుప కవచాలు వేయిద్దాం. లేకపోతే ఇది పళైయారై వెళ్ళి చేరడమే కష్టం. దారి మధ్య ఇది పడిపోతే ఇంకో గుర్రాన్ని సంపాదించుకోవాలి. ఎలా? ఎవరి దగ్గరైనా దొంగిలించాల్సిందే.  ఛీఛీ! ఆ ఆలోచనే వంతిదేవుని సిగ్గుపడేలా చేసింది.

అడవి దారినుంచి గుర్రాన్ని దిశమార్చి రాజబాటను చేరాడు. వచ్చేది రానీ. ఇకమీదట రాజబాట వెంబడే వెళ్ళాలి. తననెరిగిన వారు ఈ ప్రాంతంలో ఉండ సాధ్యం లేదు. పళువేట్టరయ్యర్ల పరివారాలు వెనకే వస్తాయి. మంత్రవాది కూడ అంతే. కాబట్టి అపాయమేమీ లేదు. పైగా రాజబాట వెంబడి వెళితే ఏదైనా కొలిమి దొరకవచ్చు. అక్కడ గుర్రం డెక్కలకు కవచాలు వేయించడానికి వీలవుతుందేమో చూడాలి.

వంతిదేవుని ఆశ నిరాశ కాలేదు. కాస్త దూరం వెళ్ళగానే ఒక గ్రామం తగిలింది. గ్రామంలో ఏదో సందడి, కోలాహలంగా ఉంది. ఒకవైపు వీధుల్లోను, ఇళ్ళల్లోను పూలతోరణాలు కట్టబడివున్నాయి. ఒకవేళ పెద్ద పళువేట్టరయ్యర్ ఇటువైపుగా వెళతారని తెలిసి ఇలా ఊరంతా అలంకరిస్తున్నారేమో! పళువేట్టరయ్యర్, ఆయన పరివారం వచ్చేలోపు తాను చాల దూరం వెళ్ళిపోవచ్చన్నది ఖాయం.

ఇంకొక వైపు గ్రామ ప్రజలు - స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు అందరూ అక్కడక్కడా గుంపులుగా నిలబడి మాట్లాడుకొంటున్నారు. విషయం ఏమైవుండవచ్చని అతడు ఊహించలేకపోయాడు. వారిలో కొందరు గుర్రం పైన వస్తున్నవాడిని చూడగానే, అతన్ని ఆపే ఉద్దేశంతో సమీపించారు. వంతిదేవుడు అందుకు చోటివ్వక గుర్రాన్ని తట్టి వేగంగా పోనిచ్చాడు. అనవసరమైన తంటాల్లో, తగాదాల్లో చిక్కుపడడానికిష్టపడలేదు.

~

గ్రామాన్ని దాటిన వెంటనే దారి పక్కన ఒక కొలిమి కనిపించింది. దాన్ని దాటి ముందుకు వెళ్ళడానికి అతని మనసొప్పలేదు. గుర్రాన్ని ఆపి కొలిమి లోపలికి వెళ్ళాడు.

కొలిమిలో ఒక కమ్మరి పని చేస్తుండడాన్ని గమనించాడు. ఒక చిన్న పిల్లాడు కొలిమి మంటను ఊదుతున్నాడు. ఇంకొక మనిషి కొలిమి వెనక మరుగు కావడాన్ని గమనించాడు వంతిదేవుడు. కానీ దీని పైనంతా అతని చూపు, శ్రద్ధ మళ్ళలేదు. కమ్మరి చేత ఉన్న కత్తి అతని కళ్ళను, మనసును ఒకేసారి ఆకట్టుకొంది. అది ఒక అపూర్వమైన ఖడ్గం; కమ్మరి దాన్ని కొలిమిలో పెట్టి పదును చేస్తున్నట్లు తోచింది. దాని ఒక పక్క భాగం వెండిలాగ తళతళ మెరుస్తోంది.  ఇంకొక భాగం అప్పుడే నిప్పునుంచి తీసినందువల్ల బంగారంలాగ జ్వలిస్తోంది.

"కత్తి అంటే, ఇది కద కత్తి!" అనుకొన్నాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 12

## "నిప్పులోకి తొయ్యి!"

**కమ్మరి** కాసేపు తన పనిలో నిమగ్నమైవున్నాడు. వంతిదేవుడు రెండు మూడు సార్లు గొంతు సవరించుకొన్న తర్వాత తలెత్తి చూశాడు.

"ఎవరు బాబూ, నీవు? నీకేం చేసిపెట్టాలి? కత్తి, శూలం ఏదైనా కావాలా? కత్తికి, శూలానికి ఇప్పుడల్లా అవసరం లేకుండపోయింది కద? నీవు కత్తి కోసం వచ్చివుండవులే!" అన్నాడు కమ్మరి.

"ఏమయ్యా, ఇలా చెబుతున్నారు? మీ చేత కత్తి పెట్టుకొని దాన్ని పదును చేస్తూనే, కత్తికి ఇప్పుడు పనిలేకుండపోయిందంటున్నారేమి?" అన్నాడు వంతిదేవుడు.

"ఇదేదో అపూర్వంగా వచ్చిన పని; పాతకత్తిని పదును చేయించేందుకు తెచ్చారు. కొన్నేళ్ళ క్రితం పాండ్యనాడు పోరు, ఉత్తర పెన్న పోరు జరుగుతుండేటప్పుడు ఈ కొలిమిలో గుట్టలు గుట్టలుగా కత్తులు, శూలాలు పడివుండేవి. లంకయుద్ధం మొదలైన కొత్తలో కూడ ఆయుధాలకు గిరాకీ ఉండేది. ఇప్పుడు కత్తి, శూలం అడిగేవారే లేరు. పాత కత్తులు, శూలాలను నా దగ్గర అమ్మేందుకు తీసుకొస్తున్నారు. నీవు కూడ అందుకోసమే వచ్చావా, ఏమి?" అని అడిగాడు కమ్మరి.

"లేదు, లేదు! ఇంకొంతకాలం పాటు నాకు కత్తికి, శూలానికి అవసరం ఉంది. ఒప్పుకొన్న కార్యాన్ని ముగించేస్తే, చేత చిడతలు పట్టుకొని శివస్థలయాత్రలకు బయల్దేరుతాను. అప్పుడు కావాలంటే నా ఆయుధాలను మీ దగ్గరికే తీసుకొచ్చి ఇచ్చేస్తాను."

"మరి, ఇప్పుడు నన్నెందుకు వెతుక్కొంటూ వచ్చావు?"

"నా గుర్రాన్ని కొండలు, గుట్టలు, అడవుల వెంబడి నడుపుకొంటూ వచ్చాను. ఇంకా చాల దూరం వెళ్ళాలి. గుర్రం కాలి డెక్కలకు లాడాలు వేస్తారట! అది మీరు చేయగలరా?"

"అవును. అరేబియా దేశంలో అలాగే చేయడం ఆనవాయితీ. ఇక్కడ కూడ కొంతమంది గుర్రాల కాలి డెక్కలకు ఇనుప లాడాలు బిగించడం మొదలుపెట్టారు. నాకు కూడ ఆ పనిలో కాస్త అనుభవముంది."

"నా గుర్రానికి లాడాలు వేస్తారా?"

"దానికి చాలసేపు పడుతుంది. చేతిలో ఉన్న పనిని పూర్తి చేసిన తర్వాతే నీ పనిని చేబట్టగలను."

వంతిదేవుడు కాస్త ఆలోచనలో పడ్డాడు. అతడికి చాల అలసటగా ఉంది. గుర్రం కూడ చాల అలిసివుంది. కాసేపాగి, దాని డెక్కలకు ఇనుప కవచాలు బిగించేసుకొన్న తర్వాతే బయల్దేరడమని నిశ్చయించుకొన్నాడు.

"మే చేతి పని ముగిసేవరకు వేచివుంటాను. ఆ తర్వాతైనా నా పని చేసి పెడతారు కద?"

"అలాగే, కానివ్వు!"

వంతిదేవుడు కాసేపు కొలిమిలో అప్పుడే పదును చేసిన ఆ కత్తిని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు.

"ఈ కత్తి అపూర్వమైన పనితనంతో చేయబడినట్లుంది కదా? రాజవంశపు ఖడ్గంలాగ కద ఉంది? ఎవరిదీ కత్తి?" అన్నాడు.

"అబ్బాయీ! ఇక్కడినుంచి కాస్త దూరాన హరిశ్చంద్రనది అని ఒక నది ప్రవహిస్తోంది..."

"నేనూ విన్నాను. అందువల్లనేమి?"

"నేను తరచు ఆ నదికి వెళ్ళి తలమునక వేసి రావడం అలవాటు."

"చాల మంచి పని. వెళ్ళే చోటికి పుణ్యం."

"కాబట్టి, వీలైనంతవరకు నిజాన్నే చెప్పాలని, అబద్ధాలు చెప్పకూడదని ఒక నియమం పెట్టుకొన్నాను."

"దానికేం ఆక్షేపణ? మిమ్మల్ని ఎవరబద్ధం చెప్పమన్నారు? నేనలా చెప్పలేదే?"

"నీవు ఈ కత్తి గురించి ఏమీ అడగకుంటే, నేను కూడ అబద్ధం చెప్పవలసి రాదు!"

'ఓహో! అదా సంగతి?' అని వంతిదేవుడు మనసులో అనుకొన్నాడు.

"నేను ప్రశ్నా అడగను. మీరు వ్రతభంగం చేయనవసరమూ లేదు. మీ చేతనున్న పనిని త్వరగా ముగించి, నేనడిగిన పనిని చేసి ఇస్తే చాలు!"

వంతిదేవుడు కత్తిని కాసేపు నిశితంగా చూస్తూన్నాడు. దాని పిడి పక్కన చేప చిహ్నం చెక్కబడివుండడాన్ని చూసి విస్తుపోయాడు. చేప చిహ్నం ఎందుకు? దాని అర్థం ఏమి? ఒట్టి అలంకారం కోసం మాత్రమేనా, లేక....

కమ్మరి చేప చిహ్నం ఉన్న భాగాన్ని మళ్ళీ కొలిమిలో పెట్టి బాగా కాల్చి సుత్తితో కొట్టాడు. చేప చిహ్నం కనబడకుండ చేయడమే అతడి ఉద్దేశమని తోచింది. ఎందుకలా చేశాడని వల్లవరయ్యన్ ఆలోచించాడు. అలా ఆలోచిస్తుండగానే కళ్ళు మూసుకుపోసాగాయి. చాలరోజులుగా అతడి చేత తరిమివేయబడుతున్న నిద్రాదేవి ఇప్పుడు తన మోహమాయవలను అతడిమీదికి బలంగా విసిరింది. వంతిదేవుడు ఆ వలనుంచి తప్పించుకోలేకపోయాడు. కాసేపు కూర్చొన్న పళంగానే కునుకు తీస్తూ తూలి పడసాగాడు. తర్వాత కమ్మరి పొయ్యి పక్కనే పడుకొని నిద్రలోకి జారిపోయాడు.

నిద్రలో వల్లవరయ్యన్ చాల భయంకరమైన కలలు కన్నాడు. కత్తి గురించే ఒక కల. ఒకడు వచ్చి కమ్మరిని కత్తిని తిరిగి ఇమ్మన్నాడు. కమ్మరి ఆ విధంగానే కత్తిని తిరిగి ఇచ్చాడు. "ఎంత కూలి కావాలి?" అని ఆ మనిషి అడిగాడు. "కూలి ఏమీ వద్దు. పళువూర్ రాణికి నేనిచ్చే కానుకగా ఉండనీ"

అన్నాడు కమ్మరి.

"జాగ్రత్త! ఈ విషయం ఎవరికీ తెలియకూడదు. ముఖ్యంగా, పళువూర్ రాణి పేరే ఎత్తకు! చెబితే ఏం చేస్తానో తెలుసా...?"

"నేనెందుకయ్యా పళువూర్ రాణి పేరు చెప్పబోతాను? ఎవరి దగ్గరా ఆ పేరెత్తను."

"ఇదిగో ఇక్కడ ఎవరో ఒక యువకుడు నిద్ర పోతున్నాడు కద? ఎందుకలా పెద్దగా మాట్లాడుతున్నావు?"

"వాడు గాఢనిద్రలో ఉన్నాడు. పిడుగు పడ్డా వినపడదు."

"ఒకవేళ వాడికి తెలిసిపోయిందని తోస్తే, ఇదిగో ఈ కొలిమిలోనే వాడిని తోసి ముగించేయి!"

ఈ సంభాషణ చివరలో కమ్మరి, కత్తి యజమాని కూడబలుక్కొని వంతిదేవుని లాక్కొని వెళ్ళి కొలిమిలో వేసినట్లు కలగన్నాడు. తర్వాత ఆ కల మారిపోయింది.

వంతిదేవుని యమదూతలు నరకానికి తీసుకొని వెళ్ళారు. యమధర్మరాజు భూలోకంలో వంతిదేవుని నడవడిక గురించి విచారించాడు. "అబద్ధాలు చెప్పడంలో వీడు నిపుణుడు. వీడు ఎన్ని అబద్ధాలు చెప్పాడనడానికి లెక్కలేదు!" అన్నాడు చిత్రగుప్తుడు చేతనున్న తాళపత్రాన్ని తిరగేసి.

"లేదు, లేదు! అంతా చక్రవర్తి కుటుంబీకుల సేవలో చెప్పినవే. చేబట్టిన కార్యాన్ని నెరవేర్చేందుకు కొన్ని అబద్ధాలు చెప్పాను."

"ఎందుకు చెప్పినా, అబద్ధం అబద్ధమే. తోయండి వీడిని నరకంలోని అతి పెద్ద అగ్నిగుండంలోకి!" అన్నాడు యముడు. వెంటనే నరకం లోపలినుంచి వేవేల గొంతులు గగ్గోలు పెట్టాయి.

యమదూతలు అతన్ని పిలుచుకొని వెళ్ళారు. భయంకరంగా కాలుతున్న అగ్నిగుండంలో తోసేందుకు సిద్ధం చేయసాగారు. ఆ ఇద్దరు యమదూతల ముఖాలను చూస్తే, పళువేట్టరయ్యర్ల ముఖాల్లాగ అగుపించాయి. అది చూసి అతడదిరిపడగా, కుందవైదేవి అక్కడికొచ్చిందప్పుడు. "నా ఆజ్ఞను పరిపాలించేందుకే ఆయన అబద్ధాలు చెప్పారు. కాబట్టి ఆయనకు బదులు నన్ను నిప్పులో వేయండి!" అన్నది.

ఈ సమయాన నందినీదేవి కూడ ఎలాగో అక్కడికి వచ్చి చేరింది. "ఇద్దరినీ చేర్చి నిప్పుల్లో పడవేయండి!" అన్నదా పుణ్యవతి. యమదూతలు వారిద్దరినీ పట్టి నిప్పులో పడవేయబోయారు. "అయ్యో, వద్దు!" అని అరుస్తూ వంతిదేవుడు అటూ ఇటూ దొర్లాడు; వెంటనే మెలకువొచ్చి కళ్ళు తెరిచి లేచి కూర్చొన్నాడు. కన్నది కలేనని తెలిసి రాగానే అది కాస్త ఓదార్పునిచ్చింది. కానీ నిజంగానే జరిగినట్లు తోచినందువల్ల అతడి ఒళ్ళు ఇంకా వణుకుతూంది.

ఛీఛీ! ఇక మీదట ఏ కారణం వల్లనూ అబద్ధం చెప్పకూడదని నిశ్చయించుకొన్నాడు.

"ఎంతసేపు నిద్రపోయాను?" అని కమ్మరిని చూసి అడిగాడు.

"అలా ఏమీ చాలసేపు నిద్రపోలేదులే. రెండుజాములంతే. అబ్బాయీ! నీవు కుంభకర్ణుని వంశానికి చెందినవాడివా? పట్టపగలే ఇలా నిద్రపోతున్నావే! రాత్రి ఇంకెంతసేపు నిద్రపోతావు?" అన్నాడు కమ్మరి.

"అయ్యయ్యో! రెండుజాములసేపు నిద్రపోయానా? మరి, గుర్రం లాడాల పని పూర్తి చేసేశావు కద?"

"ఇకమీదటే మొదలుపెట్టాలి. కానీ నీలాంటి నిద్రముఖానికి అందువల్ల ఉపయోగమేమి? నీవు గుర్రాన్నే తాకట్టు పెట్టేస్తావు! నిన్నే తాకట్టు పెట్టేస్తావు!"

వంతిదేవుడు అదిరిపడ్డాడు. ఏదో ఆలోచన తోచి, ఎగిరి దూకి లేచి వాకిలివైపు పరుగెత్తి చూశాడు. గుర్రం తాను నిలబెట్టిన చోట లేదు!

"అయ్యో! గుర్రమెక్కడ?" అని కేకలేస్తూనే నడుమునున్న కత్తి పిడిమీద చేయి వేశాడు.

"భయపడకు! గుర్రం భద్రంగా ఉంది. పెరటివైపు వెళ్ళి చూడు!"

వంతిదేవుడు పెరటివైపు వెళ్ళి చూశాడు. అక్కడ మూడువైపుల ఎత్తైన దడికలున్న కొట్టంలో అతడి గుర్రం నిల్చొనివుంది. కమ్మరి పొయ్యి ఊదే చిన్న పిల్లాడు దానికి గడ్డి తినిపిస్తున్నాడు. వంతిదేవుని చూడగానే అది ఒళ్ళు విదిలించుకొని సకిలించింది.

"అయ్యా! కాస్త ఇక్కడికొచ్చి మీ గుర్రాన్ని చూసుకోండి. దీని డెక్కలకు లాడాలు చేసేందుకు కొలతలు తీసుకోవాలి" అన్నాడు పిల్లాడు.

వంతిదేవుడు గుర్రం దగ్గరకు వెళ్ళి దాన్ని నిమురుతూ నిలబడ్డాడు. పిల్లాడు గుర్రం డెక్కల కొలతలు తీసుకొన్నాడు.

"దీన్ని ఎవరిక్కడికి తీసుకొని వచ్చి కట్టారు?" అని అడిగాడు వంతిదేవుడు.

"నేనే తీసుకొచ్చి కట్టాను" అన్నాడు పిల్లాడు.

"ఎందుకు?"

"నాన్న చెప్పాడు."

"అదెందుకు?"

"ఈ ఊరి దారి వెంబడి పళువేట్టరయ్యర్, వారి పరివారం వెళ్ళారు. గుర్రాన్ని చూసివుంటే తప్పక తీసుకొని వెళ్ళిపోయేవారే."

వంతిదేవునికి పాత జ్ఞాపకం - వీరనారాయణపురం జ్ఞాపకం - వచ్చింది. తాను చేసిన పొరబాటును తలుచుకొని సిగ్గుపడ్డాడు. మనసులోనే కమ్మరిమీద, అతడి కొడుకు మీద కృతజ్ఞతాభావంగొన్నాడు. గుర్రపు డెక్కల కొలతలు తీసుకొన్న తర్వాత ఇద్దరూ కొలిమి దగ్గరికొచ్చారు.

కమ్మరి ఒక ఇనుపముక్కను తీసుకొని లాడాలాగ దాన్ని వంచనారంభించాడు..

"నా గుర్రాన్ని కాపాడారు కద? అందుకు చాల కృతజ్ఞతలు!" అన్నాడు వల్లవరయ్యన్.

"నన్ను వెతుక్కొని వచ్చేవారి వస్తువులను కాపాడాలి కద? అది నా కర్తవ్యం."

"పళువేట్టరయ్యర్ పరివారం ఇటుగా వెళ్ళి ఎంతసేపైంది?"

"రెండు ఘడియలపైగానే అయ్యింది. అంత ఆర్భాటంలోనూ నీవు నిద్రనుంచి లేవలేదు కద, దాన్ని తలుచుకొంటేనే నాకు చాల ఆశ్చర్యంగా ఉంది!"

"నేనేమో నిద్రపోయాను. ఇంతసేపు కాలాన్ని మీరు వృధా చేశారు కద? వాళ్ళు వెళ్ళిన తర్వాతైనా పని మొదలుపెట్టివుండవచ్చు కద?"

"ఎలా మొదలుపెట్టడం? వాళ్ళు తీసుకొనివచ్చిన వార్త వినగానే, ఎవరికి పని చేయడానికి మనసొప్పుతుంది? నీకోసం మనసు దిటవు చేసుకొని ఈ పని చేస్తున్నాను. నీవెక్కడినుంచి వస్తున్నావబ్బాయ్?"

వారు తీసుకొని వచ్చిన వార్త ఏమైవుండవచ్చని ఆలోచిస్తూనే, "లంకనుంచి వస్తున్నాను" అని బదులు చెప్పాడు.

కమ్మరి అతడి ముఖాన్ని ఎగాదిగా చూశాడు. తర్వాత గొంతు తగ్గించి, "లంకలోవున్నప్పుడు యువరాజు అరుళ్మొళివర్మగారిని చూశావా?" అని అడిగాడు.

నిజాన్నే చెప్పడమని కాసేపటి క్రితం సంకల్పం తీసుకొన్న వంతిదేవుడు, "చూశాను" అన్నాడు.

"చివరిగా ఆయన్ను నీవెప్పుడు చూశావు?"

"ఈరోజు పొద్దున చూశాను."

కమ్మరి వంతిదేవుని కోపంగా చూశాడు.

"ఏం, పరాచికాలాడుతున్నావా?"

"లేదయ్యా! నిజాన్నే చెబుతున్నాను."

"యువరాజిప్పుడు ఎక్కడున్నారన్నది కూడ చెబుతావులాగుందే?"

"ఓ! అడిగితే చెబుతాను!"

"యువరాజెక్కడున్నారు? చెప్పు చూద్దాం!"

"నాగపట్టణపు చూడమణి విహారంలో ఉన్నారు!"

"అబ్బాయీ! నేను కూడ చాలమంది అబద్ధాల కోరుల్ని చూశాను. నీలాగ కట్టుకథలు చెప్పేవారిని చూసిందే లేదు."

వంతదేవుడు మనసులోనే నవ్వుకొన్నాడు. కల్పించి చెప్పే కట్టు కథలను, అబద్ధాలను నమ్మేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. నిజాన్ని చెబితే నమ్మమంటున్నారు. ఇది మన జాతకవిశేషం కాబోలు!

"తమ్ముడూ! నీవు లంకనుంచి ఎప్పుడు బయలుదేరావు?"

"నాలుగు రోజుల క్రితం!"

"అందుకే నీకు వార్త తెలియలేదు!"

"ఏం వార్త?"

"పొన్నియిన్ సెల్వన్‌గారిని కడలి పొట్టన పెట్టేసుకొందని."

వంతిదేవుడు కష్టపడి అదిరిపడ్డట్లు నటించాడు.

"అయ్యో, అలాగా! ఎవరు చెప్పారు?"

"నిన్న పొద్దుటినుంచి ఇక్కడల్లా అలా మాట్లాడుకొంటున్నారు. ఈరోజు పళువేట్టరయ్యర్ ఈ దారిన వెళ్ళినప్పుడు ఊరిపెద్దలు ఆయన్ను అడిగారు. ఆ వార్త నిజమేనని పళువేట్టరయ్యర్ చెప్పారు. ఆ ఛండాలుని తల మీద పిడుగు పడ!"

"ఎందుకా ముసలాయన్ను తిడుతున్నారు?"

"ఆయన వల్లేకద ఇది జరిగింది? ఏదో కుట్ర పన్ని ఆయనే యువరాజును కడలిలో ముంచేశారని ఊళ్ళో అందరూ చెప్పకొంటున్నారు. కాబట్టి ఆయన కోసం ఏర్పాటు చేసిన ఉపచారాలను కూడ ఆపివేశారు."

"యువరాజుమీద ఈ ఊరిప్రజలకు అంత అభిమానమా?"

"అడగాలా? ఇప్పుడు ఈ ఊరిప్రజలంతా కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు. ఈ ఊరివాళ్ళు మాత్రమేమి? చోళనాడంతా ఎలుగెత్తి ఏడ్వబోతూంది. పళువేట్టరయ్యర్ని శపించబోతూంది. చక్రవర్తేమో జబ్బుపడివున్నారు. ఈ వార్త వింటే ఎంత వేదన పడుతారో, కద? ఇంకా ఏమేమి విపరీతాలు జరుగుతాయో తెలియదు. కొన్నాళ్ళుగా ఆకాశంలో ధూమకేతువు కనిపిస్తోంది కద? అందుకు ఏదైన జరిగే తీరాలి కద?"

జరగగల విపరీతాలు ఏమైవుండవచ్చని ఆలోచించి చూశాడు వంతిదేవుడు. తాను చెప్పింది ఈ కమ్మరి నమ్మనిదే మంచిదైంది. తానిక అబద్ధం చెప్పకపోయినా కూడ, యువరాజు గురించిన నిజాన్ని చెప్పనవసరం లేదు. యువరాకుమారి ఏదో ఒక ముఖ్యకారణం వల్లనే కద ఆయన్ను చూడామణి విహారంలో ఉండమని చెప్పారు! యువరాకుమారిని చూసి మాట్లాడిన తర్వాత, వారి ఆలోచన ప్రకారం నడుచుకోవాలి.

"తమ్ముడూ! ఏమాలోచిస్తున్నావు?" అని అడిగాడు కమ్మరి.

"నడిసముద్రాన సుడిగాలిలో నేను కూడ చిక్కుబడ్డాను. దేవుని దయవల్ల తప్పించుకొని బతికి బయటపడ్డ విషయాన్ని తలుచుకొని దేవునికి కృతజ్ఞత చెప్పకొంటున్నాను."

"దేవుని దయ అంటూ ఒకటుందా, ఏమి?"

"అయ్యా! ఏమిటిలా అంటున్నారు?"

"దేవుని దయంటూ ఉంటే పళువేట్టరయ్యర్ల అక్రమాలు ఇంకా కొనసాగుతుంటాయా?

పొన్నియిన్ సెల్వన్ సముద్రంలో మునిగిపోయివుంటారా?"

"అయ్యో! పళువేట్టరయ్యర్లు అధికారంలో ఉన్నవాళ్ళు. వారి గురించి ఇలా మాట్లాడవచ్చా? ఎవరి చెవిలోనైనా పడితే? కాస్త జాగ్రత్తగా ఉండండి."

"నాకన్న నీవే జాగ్రత్తగా ఉండాలి. నేనేమో మెలకువగా ఉన్నప్పుడు మాత్రమే మాట్లాడుతున్నాను. నీవు నిద్రలో కూడ పేలుతున్నావు."

"అయ్యయ్యో! ఏం పేలాను నిద్రలో?"

"పళువేట్టరయ్యర్లను యమదూతలన్నావు. పళువూర్ రాణిని ఆడదెయ్యమన్నావు. నీవు చెప్పిందేమో నిజమే. కానీ నా చెవిలో తప్ప ఇంకెవరి చెవిలోనైన పడితే నీ గతేమి? నీవలా పేలుతున్నప్పడే ఆ దారి వెంబడి పళువేట్టరయ్యర్ల పరివారాలు వెళ్ళాయి. నాకు చాల దిగులైంది."

"మీరేం చేశారు?"

"వాకిలి దగ్గరకు వెళ్ళి నిలబడి, ఈ కొలిమి తలుపు కూడ మూసేశాను. అంతకు మునుపే నీ గుర్రాన్ని తీసుకొని వెళ్ళి పెరట్లో కట్టిపెట్టడమైంది."

"నిద్రలో నేనింకేమైనా పలవరించానా?"

"దానికేం కొరత లేదు."

"అయ్యో! ఏం వదరాను?"

"నీవు యువరాజును పళైయారైకి రమ్మని నొక్కి చెప్పావు. ఆయన పళువేట్టరయ్యర్ ఆజ్ఞ ప్రకారం చెరపట్టబడుతానన్నారు. ఇంకా ఏవేవో అన్నావు. తమ్ముడూ! పళైయారై యువరాకుమారి గురించి కూడ ఏమేమో చెప్పావు. జాగ్రత్త, తమ్ముడూ! జాగ్రత్త!"

వంతిదేవుడు సిగ్గుపడి తలవంచుకొన్నాడు. యువరాకుమారి గురించి ఏదైన అనుచితంగా పలవరించానేమో అని భయపడ్డాడు. ఇకమీదట నిద్రపోయేటట్లయితే, ఒంటరిగా ఒక గదిలో తలుపుకు గొళ్ళెం వేసుకొని నిద్రించాలి. లేక మనుష్యసంచారం లేని అడవిలోనో, ఎడారిలోనో, కొండగుహలోనో నిద్రపోవాలి.

"తమ్ముడూ! సుడిగాలిలో నీవెలా చిక్కుబడ్డావు? ఎలా తప్పించుకొన్నావు?"

"నేనెక్కి వచ్చిన ఓడమీద పిడుగుపడి ముక్కలైపోయింది. విరిగిన తెరచాప స్తంభాన్ని పట్టుకొని చాలసేపు తేలాను. తర్వాత పడవ నడిపే పిల్ల ఒకతె సహాయంతో తప్పించుకొని గట్టెక్కాను."

"ఒకవేళ యువరాజు కూడ అలా తప్పించుకొని బతికివుండవచ్చు కద?"

"దేవుని చిత్తం అలావుంటే తప్పించకొని బతికివుండవచ్చు."

"నిన్న రాత్రి నీవెక్కడ బస చేశావు?"

"కోడిక్కరైలోనే. సముద్రతీరాన పళువేట్టరయ్యర్ల మనుషుల సంచారం చాల ఎక్కువగా

కనిపించింది. కాబట్టి కుళకర్ (=విష్ణువు) కోవెలలో కాసేపు పడుకొని నిద్రపోయాను. పొద్దు పొడవగానే బయల్దేరాను."

"అందుకే నీకు యువరాజు గురించిన సమాచారం తెలియలేదు కాబోలు."

"మీరు తెలియజేసినందుకు చాల కృతజ్ఞతలయ్యా! నేను పళైయారైకి వీలైనంత త్వరగా వెళ్ళాలి. పళువేట్టరయ్యర్ల పరివారం చేత చిక్కుబడకుండ వెళ్ళాలి. ఏ దారిన వెళితే మంచిది?"

"పళువేట్టరయ్యర్ తంజావూరు రాజబాట వెంబడి వెళుతున్నారు. నీవు ముల్లై నదీతీరం వెంబడి వెళితే పళైయారై వెళ్ళి చేరవచ్చు."

"మీరు కాస్త వేగంగా గుర్రం డెక్కలకు ఇనుపకవచాలు వేసిస్తే మంచిది."

"ఇదిగో!" అనేసి వంచిన ఇనుపముక్కను కొలిమిలో పెట్టి కొట్టనారంభించాడు.

"ఇది పెద్ద పళువేట్టరయ్యర్కి! ఇది చిన్న పళువేట్టరయ్యర్కి! ఈ దెబ్బ శంబువరయ్యర్కి! ఇది మళవరయ్యర్కి!" అంటూ చెబుతూ కొట్టసాగాడు కమ్మరి. దానిమూలంగా ఈ దేశప్రజలు ఆ చిన్నరాజుల మీద ఎంతగా కోపంగొనివున్నారన్నది అర్థం చేసుకొన్నాడు వంతిదేవుడు.

గుర్రపు డెక్కలకు లాడాలు కొట్టి ముగించడమైంది. చేసి ఇచ్చిన పనికి కమ్మరికి డబ్బు ఇవ్వడానికి ముందుకొచ్చాడు వంతిదేవుడు. కమ్మరి దాన్ని తిరస్కరించేశాడు.

"నీవు మంచబ్బాయి కాబట్టి చేసిచ్చాను. డబ్బు కోసం చేయలేదు అన్నాడు.

వంతిదేవుడు మళ్ళీ కమ్మరికి కృతజ్ఞతలు/ధన్యవాదాలు తెలియజేసి బయలుదేరాడు. బయలుదేరేటప్పుడు కమ్మరి, "తమ్ముడూ! నీవు పళైయారైకి ఎందుకు వెళుతున్నావు?" అని అడిగాడు.

"అయ్యా! మీరు దానిగురించి ఏమీ అడగకుంటే, ఆ విషయంలో నేను అబద్ధం చెప్పే పరిస్థితి రాకుండ ఉంటుంది" అన్నాడు వల్లవరయ్యన్. కమ్మరి నవ్వేసి, "అబ్బాయీ! నీవు త్వరితంగా తెలివిమంతుడైపోతున్నావు! నిద్రలో కూడ ఇంత జాగ్రత్తగా ఉండు!" అని చెప్పి సెలవిచ్చి పంపించాడు.

వంతిదేవుడు మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టేటప్పటికి సూర్యాస్తమయం కావచ్చింది. కాసేపటికల్లా చీకటి కమ్ముకోసాగింది. అంతలోపల ముల్లై నదీతీరం చేరుకొన్నాడు వంతిదేవుడు. ఆ తర్వాత నదీతీరం వెంబడి వెళ్ళవలసింది. దారి అడిగి తెలుసుకోవలసిన అవసరం కూడ లేదు.

ఇంకా తొలిజామే. కానీ అప్పటికే ఆకాశంలో వేలకొద్ది చుక్కలు మెరుస్తున్నాయి. ముల్లై నది గట్ల మీద చెట్లంతగా లేవు. చిన్నచిన్న పొదలు మాత్రమే ఉన్నాయి. కాబట్టి దారి కనిపెట్టి ముందుకు వెళ్ళడానికి నక్షత్రాల వెలుతురే చాలనిపించింది.

ఆకాశాన మెరుస్తున్న చుక్కలతో పోటీపడుతున్నట్లు వేలకొద్ది మిణుగురు పురుగులు నది గట్ల వెంబడివున్న పొదల చుట్టూ తిరుగుతూ చాల వినోదంగా అగుపించింది.

వంతిదేవుని మనసులో ఉత్సాహం పొంగింది. అందుకు చాల కారణాలున్నాయి. దేశమంతా

యువరాజు గురించి దు:ఖసముద్రంలో మునిగివున్నప్పుడు అతడికి మాత్రం యువరాజు క్షేమంగా ఉన్నారన్న విషయం తెలుసు - ఇంకెవ్వరికీ తెలియదు కద? చోళనాడు ప్రజలు యువరాజు మీద ఎంతటి ప్రేమాభిమానాలు కలిగివున్నారన్నది కొంతవరకు తెలుసుకోగలిగాడు. మాంత్రికుడు రవిదాసును తాను మళ్ళీ ఏమార్చిన విషయం తలుసుకొంటే భలే నవ్వొచ్చింది. వీటన్నిటికన్న కుందవైదేవిని తాను త్వరలోనే చూడబోతామన్న ఆలోచన ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది.

ఊరకే చూడబోతున్నాడా? యువరాకుమారి ఒప్పజెప్పిన కార్యాన్ని ముగించేసి కద చూడబోతున్నాడు! ఆ కార్యానికి ఎదురైన ఆటంకాలన్నిటిని తలుచుకొని, వాటిని తాను దాటుకొని కార్యాన్ని నెరవేర్చిన విషయాన్ని తలుచుకొని చాల గర్వపడ్డాడు. రేపు సాయంత్రం ఈసేపటికల్లా యువరాకుమారిని కలుస్తామన్నది నిస్సందేహం. ఆహా! ఆ కలయికను తలుచుకొంటేనే అతడికి ఒళ్ళు పులకరించింది.

చుక్కల వెలుతురు వల్ల ప్రకాశంగా ఉన్న ఆకాశం, మిణుగురుల వల్ల ప్రకాశవంతమైన నేల, గలగలమని పారుతున్న ముల్లైనది వెల్లువ, మెల్లమెల్లగా వీస్తున్న పిల్లగాలి - ఇవన్నీ కలిసి వంతిదేవుని మైమరపింపజేశాయి. భూమ్యాకాశాలు చాల ఆనందమయంగా అగుపించాయి. పాత ప్రేమగీతమొకటి గుర్తుకొచ్చింది అతడికప్పుడు. తాను నోరు తెరిచి పెద్దగా పాడదగిన చోటే ఇది. చుట్టుపక్కల ఎక్కడా మనుష్యాసంచారమే లేదు. పక్షులు కూడ గూళ్ళకు చేరుకొన్నాయి. అతడు పాడేందుకు ఇక అడ్డేమి? ఇదిగో అతడు పాడిన ప్రేమగీతం. ఎవరిని మనసులో తలుచుకొని పాడాడన్నది చెప్పనవసరం లేదు కద?

<< వంతిదేవుని ప్రేమగీతం >>

వంతిదేవుడు ఈ పాటను పాడి ముగించాడో లేదో, అతడితో పోటీ పడుతున్నట్లు దూరాన నక్కలు ఈల వేయనారంభించాయి.

అదే సమయాన గలగలమని ఒక మనిషి నవ్వడం వినిపించింది. వంతిదేవుడు ఉలిక్కిపడి చుట్టుపక్కల పరికించి చూశాడు. అతడి చేయి నడుంలో ఉన్న కత్తిమీదికి వెళ్ళింది.

ఒక పొన్నచెట్టు నల్లటి నీడనుంచి ఒక ఆకారం బయటికొచ్చింది.

"తమ్ముడూ! నీ పాట భేష్షుగా ఉంది! నక్కల పోటీ గానం దానికన్న గొప్పగా ఉంది!" అని చెప్పేసి దేవరాళన్ మళ్ళీ నవ్వాడు.

~~~
~~~

# అధ్యాయము - 13

## విష బాణం

**ఈ** చోట, ఆ సమయాన దేవరాళన్ని చూడగానే వంతిదేవుడు కాస్త ఉలిక్కిపడ్డాడు. కడంబూర్ మాళిగలో అతడు పూనకం వచ్చినట్లు ఆడిన ఆట, అన్న మాటలు గుర్తుకొచ్చాయి. నడిసముద్రాన సుడిగాలి కమ్ముకొస్తున్నప్పుడు రవిదాసు, దేవరాళన్ చెప్పిన వార్తలు కూడ గుర్తుకొచ్చాయి. వాటిలో నిజమెంతో, కల్పన ఎంతో కనిపెట్టడం కష్టం. కానీ వారు ఒక మర్మ భయంకరమైన కుట్రలో భాగస్వాములన్నది నిశ్చయం. వారిలో ఒకడి దగ్గర, అదీ ఇప్పుడు, ఈ నిర్మానుష్యమైన ప్రదేశంలో చిక్కుకొన్నాం కద అనుకొన్నాడు. వాడి దగ్గరినుంచి తప్పించుకోవడానికి గుర్రాన్ని వేగంగా పోనిద్దామా అని ఒక క్షణం అనుకొన్నాడు. ఆ ఉద్దేశంతో చుట్టుపక్కల పరికించి చూశాడు. దూరాన ఒక మంట వెలుతురు కనిపించింది. అది స్మశానమే అయివుండాలి. ఏదో ఒక మృతశరీరం అగ్నికి ఆహుతి అవుతూంది. ఆ శరీరం సజీవంగా ఉన్నప్పుడు ఎన్నెన్ని ఆశలను, ఊహలను, కోరికలను పెంచుకొందో కద? ఎన్ని సుఖాలు, కష్టాలు అనుభవించిందో కద? - ఇక ఒక అరఘడియలో మిగలబోయేది పిడికిలి బూడిద మాత్రమే! ఈ లోకంలో పుట్టినవారందరూ ఒకరోజు పొందబోయే గతి అదే. రాజాధిరాజులైనా సరే, ఏమీ లేని బిచ్చగాడైనా సరే, ఒకనాడు అగ్నికి ఆహుతై, పిడికెడు బూడిద కావలసిందే కద?

దిగులు వచ్చినట్లే ఉన్నట్లుండి తొలగిపోయింది. ఈ కపట వంచకుడికి భయపడి మనమెందుకు పరుగెత్తాలి? వీడు మనకేదో చెప్పేందుకే వచ్చినట్లున్నాడు. అదేమిటో వినుకొంటే సరి. ఒకవేళ కొలిమి లోపల తాను ప్రవేశించినప్పుడు వెనక వెళ్ళి దాక్కొన్నది వీడేనేమో! ఆ అపూర్వమైన కత్తి కూడ వీడిదే కావచ్చు. దాని పిడి దగ్గర చేప చిహ్నం ఉంది కద? వీడిన కాస్త మాటల్లోకి దింపితే కొత్త సంగతులేమైనా తెలుసుకోవచ్చు!

కాబట్టి గుర్రాన్ని మెల్లగానే నడుపుకొంటూ వెళ్ళాడు. మొట్టమొదటగా డెక్కలకు లాడాలు కొట్టబడిన ఆ గుర్రం కూడ నడిచేందుకు కాస్త కష్టపడుతున్నట్లనిపించింది. దాన్ని గదమాయించి వేగంగా తోలేందుకు మనసొప్పలేదు.

"ఇక్కడెలా ఉన్నట్లుండి ప్రత్యక్షమయ్యావు?" అని అడిగాడు వల్లవరయ్యన్.

"నేను కద ఆ ప్రశ్న అడగవలసింది? నిన్ను నడి సముద్రాన ఓడ తెరచాప స్తంభానికి కట్టేసి వచ్చాం కద? ఎలా తప్పించుకొన్నావు?" అని అడిగాడు దేవరాళన్.

"నీకు మాత్రమే మంత్రతంత్రాలు తెలుసనుకొన్నావా? నాకూ కొంచెం తెలుసు!"

"మంత్రశక్తిలో నీకు నమ్మకమేర్పడడం గురించి సంతోషం. నా మంత్రశక్తి వల్ల నీవిక్కడ ఒంటరిగా వెళుతుంటావని తెలుసుకొన్నాను. అందుకే ముందుగా వచ్చి వేచివున్నాను."

"ఎందుకు? నాతో నీకేం పని?"

"నీవే ఆలోచించి చూడు! లేక మంత్రశక్తి వల్ల తెలుసుకో!"

"మీ రహస్యాలను నడిసముద్రంలో నాకు చెప్పేశారు. అందులో ఎంత నిజం, ఎంత కల్పన అని నాకు తెలియదు. అయినా కూడ ఆ రహస్యాలను మరిచిపోవాలని నిశ్చయించుకొన్నాను. ఎవరికీ చెప్పను..."

"అందు గురించి నేను కూడ దిగులుపడడం లేదు. ఎప్పుడైనా ఆ రహస్యాలను ఎవరికైనా చెప్పాలనుకొంటే, అప్పుడు నీ నాలుక తెగగోయబడుతుంది. నీవు మూగవాడివైపోతావు!"

~

వంతిదేవునికి ఒళ్ళు జలదరించింది. తంజావూరులోను, లంకలోను తాను చూసిన మూగస్త్రీలు గుర్తుకొచ్చారు. కాసేపు ఊరకే మౌనంగా ముందకు సాగాడు. ఈ పాపి మనసెందుకు వెన్నంటి వచ్చాడు? వీడి నుంచి ఎలా తప్పించుకోవడం? కోడిక్కరైలో ఉన్నట్లు ఇక్కడ కూడ బురద ఊబి ఉంటే ఎంత ఉపయోగపడేది? లేక నదిలోకి తోసేద్దామా? దాని వల్ల ప్రయోజనం లేదు. నదిలో నీళ్ళంతగా లేదు. ఇంకే దారి లేకపోతే/తోచకపోతే, ఉండనే ఉంది కద ఒరలో కత్తి - దాన్ని తీయాల్సిందే.

"తమ్ముడూ! నీవేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. కానీ అది కాని పని. వృధా శ్రమ!"

వంతిదేవుడు మాట మార్చదలుచుకొన్నాడు. వీడి దగ్గరినుంచి తప్పించుకోవడానికి కాస్త అవకాశం కావాలి. అంతవరకు ఏదైనా మాట్లాడుతుండాలి.

"నీ తోటివాడైన రవిదాసు ఏడి?"

దేవరాళన్ ఒక పిశాచి నవ్వు నవ్వేసి, "అది నీకు కద తెలియాలి? రవిదాసు ఎక్కడ?"

వంతిదేవుడు అదిరిపడ్డాడు. రవిదాసు గురించిన మాట తాను ఎత్తివుండకూడదు. వీడు రవిదాసును కలిసి, మాట్లాడి, విషయాలన్నీ తెలుసుకొని, ఇప్పుడు తన లోతును అంచనా వేస్తున్నాడా? లేక...

"ఏం తమ్ముడూ! ఊరకుండిపోయావు? రవిదాసు ఎక్కడని చెప్పనా? అదలా ఉండనీ! ఆ పడవ నడిపే పిల్ల, పూంగుళలి, ఆ పిల్ల ఎక్కడ? అదైనా చెప్పు!"

వంతిదేవుడు పామును పట్టుకొన్నవాడిలాగ అదిరిపడ్డాడు. ఆ పైన మాట్లాడేందుకే జంకాడు.

"ఆ పిల్ల గురించి కూడ నీవేమీ చెప్పవులాగుంది. ఆమెను నీవు కాపాడేందుకు తగిన కారణం ఉండవచ్చు. తమ్ముడూ! కాసేపటికి మునుపు ఒక ప్రేమ గీతం పాడావు కద? ఆమెను తలుచుకొనే పాడావా?"

"లేదు, లేదు! నిజంగా లేదు!" అని వంతిదేవుడు గాభరాగా చెప్పాడు.

"ఎందుకు నీకింత గాభరా?"

"సరె, సరే! అదంతా ఇప్పుడు మాట్లాడుతూ కూర్చోవడానికి తీరిక లేదు. ఎందుకు నా గుర్రం ముక్కుతాడును పట్టుకొన్నావు? వదులు! నేను వెళ్ళాలి. అత్యవసరమైన కార్యం ఉంది."

"నేనొచ్చిన కార్యం గురించి నీవింకా అడగలేదు, వినలేదు?"

"చెబితేనే కద వినేందుకు?"

"ఈ ముల్లై నదీతీరానికి ఒక విచిత్రమైన శక్తి ఉంది. ఇక్కడ ఎవరు ఏం కోరుకొన్నా, అది వారికి వెంటనే సిద్ధిస్తుంది."

"నేనేమీ కోరుకోవడం లేదు కద?"

"అది అబద్ధం! నీవు ఎవరిని తలుచుకొని ప్రేమగీతం పాడావో, ఆమె కూడ నిన్ను చూడగోరుతోంది. నీవిష్టపడితే చూడవచ్చు."

"ఎప్పుడు?"

"ఈ రాత్రే చూడవచ్చు."

"ఇదేం కట్టుకథ?"

"కట్టుకథ కాదు, తమ్ముడూ! అదిగో చూడు!" అని దేవరాళన్ వేలెత్తి చూపించాడు. వారు వెళుతున్న దారిలో కాస్త దూరాన ఏదో ఒక వస్తువు మసకగా కనిపించింది. వంతిదేవుడు పరీక్షగా గుచ్చి చూశాడు. అది ఒక పల్లకి - మూసిన పల్లకి - అని గ్రహించాడు.

ఆహా! ఆ పల్లకి! ఎక్కడ చూశాడు? అది, అది - పళువూర్ రాణి పల్లకి కద? ఒకవేళ అందులో నందిని ఉందా, ఏం? అది తెలుసుకోవాలన్న ఉత్సుకతను ఆపుకోలేకపోయాడు.

గుర్రాన్ని ఆ పల్లకి సమీపంగా తీసుకొని వెళ్ళి ఆపాడు. తాటి చిహ్నం ముద్రించిన పల్లకి తెర కనిపించింది. ఆ తెర మెల్లగా కదిలినట్లు కూడ అనిపించింది.

వెంటనే వంతిదేవుడు గుర్రం మీదినుంచి కిందకు దూకాడు.

అదే సమయాన దేవరాళన్ గొంతునుంచి ఒక విచిత్రమైన శబ్దం వెలువడింది.

మరుక్షణం చుట్టుపక్కలనున్న పొదలమాటు నుంచి ఏడెనిమిది మంది ముందుకు వచ్చి వంతిదేవుని పైకి దూకారు. అతను ఏమాత్రం కదలలేనట్లు గట్టిగా పట్టుకొని, కాళ్ళు చేతులను బట్టతో కట్టారు. ఒకడు కళ్ళకు కూడ బట్టను కట్టాడు. నడుమునున్న కత్తిని ఇంకొకడు బలవంతంగా లాగేసుకొన్నాడు. తర్వాత వంతిదేవుని ఆ పల్లకిలో ఎత్తి పడేశారు. కొందరు ఆ పల్లకిని వెంటనే ఎత్తుకొని వేగంగా ముందుకు నడిచారు. ఇంకొందరు దాని ముందు, వెనకగా వెళ్ళారు. దేవరాళన్ ముందు దారి చూపుతూ వెళ్ళాడు. ఒకడు గుర్రాన్ని పట్టుకొని నడిచాడు.

~

అంతా ఒక్క తృటిలో జరిగిపోయింది. వంతిదేవుడు తనను పలువురు వచ్చి ముట్టడించగానే అవాక్కై దిగ్భ్రమించి నిలబడిపోయాడు. అలా అటకాయించబడతాడని ఎదురుచూడలేదు. పల్లకిలో అతన్ని ఎత్తి పడేసి, పల్లకి ముందుకు నడిచేంతవరకు అతడు ఏమీ ఆలోచించలేకపోయాడు - అతడి మెదడు ఆ ఆకస్మిక సంఘటనతో అంతగా స్తంభించిపోయింది. ఏం జరుగుతోందని కూడ గ్రహించలేకపోయాడు.

కానీ పల్లకి ముందుకు సాగనారంభించగానే మొద్దుబారిన అతడి మెదడు కొద్దికొద్దిగా పనిచేయనారంభించింది. కళ్ళకు కట్టిన బట్టకూడ సులభంగానే జారిపోయింది. కట్టబడివున్న చేతులతోనే తెరను కాస్త తొలగించి అటూ ఇటూ చూశాడు. నది గట్టునుంచి అడ్డంగా దిగి ఏదో పల్లంలో పడి వెళుతోంది పల్లకి అని గ్రహించాడు.

తన కాలి కట్లను, చేతి కట్లను విప్పదీసుకొని విడుదల పొందడం అంత కష్టమేమీ కాదు. పల్లకి నుంచి దూకడం కూడ అంత కష్టం కాదు. గుర్రమేమో వెనకే వస్తూంది. ఆ ఏడెనిమిది మందిని విదిలించేసి గుర్రమెక్కి ముందుకు వేగంగా పారిపోవడం కూడ అతడికి అసాధ్యమైన పని కాదు. అలా చేద్దామా అని ఆలోచించాడు. కానీ ఏదో ఒకటి అడ్డు పడి ఆపింది. ఆ పల్లకిలో ఏదో ఒక అపూర్వమైన సుగంధం అలుముకొని ఉంది. అది మొదట అతనికి ఉత్సాహాన్నిచ్చింది. దాని కట్టు నుంచి విడిపించుకొని వెళ్ళడానికి మనసంత సులభంగా ఒప్పడంలేదు. ఈ పల్లకి తనని ఎక్కడికి తీసుకొని వెళ్ళి చేర్చబోతోంది? నందిని వద్దకే అని ఊహించుకోవడానికి అనేక కారణాలున్నాయి. అమెను చూడాలన్న ఆశ అతడి మనసు లోతులనుంచి చిన్నగా తలెత్తింది. రాను రాను అది పెరిగి పెద్దదైంది. అందుకు ఎన్నో ఆక్షేపణలు తోచాయి. కానీ ఆ ఆక్షేపణలన్నిటినీ మీరి ఆమెను చూడాలన్న ఆశ విశ్వరూపం దాల్చింది. ఆమె తననేం చేసేయగలదు? ఎందుకు తనను పిలిపించిందో తెలుసుకొందాం! ఏదైనా తెలుసుకోవడానికి వీలైతే తెలుసుకొందాం. యుక్తికి ప్రతియుక్తి తాను పన్నలేడా? మళ్ళీ ఆమెను చూసే సందర్భం దొరుకుతుందన్నది సందేహమే. ఇక తంజావూరు వెళ్ళవలసిన అవసరం రాదు. అక్కడికి వెళ్ళడమూ అపాయకరం. దాని కన్న దారిలోనే చూసి మాట్లాడడమే సులభం, మంచిది. ఇంకొక సారి ఆమెను చూద్దాం...

అవును, అవును! నందినిని చూసేందుకు ఇంకొక ముఖ్యమైన కారణం ఉంది.

లంకలో తను చూసిన మూగరాణి; - ఆమె నందినిని పోలివుందని తాననుకొన్నది సరేనా? అది తెలుసుకోవాలి కద?

ఇలా వంతిదేవుడు ఆలోచిస్తుండగానే అతడి తల తిరిగింది. నిద్ర వస్తున్నట్లనిపించింది. కాదు, కాదు; ఇది నిద్ర కాదు. పగలే అంతసేపు నిద్రపోయాడు కద! ఇదేదో మత్తు. ఈ పల్లకిలో అలుముకొన్న ఆ సువాసనే మనకలా మత్తు/మైకం కలిగిస్తోంది. అయ్యో! ఇదేం భయంకర అపాయం! పల్లకినుంచి దూకేయాల్సిందే!

వంతిదేవుడు చేతి కట్లను విప్పుకోజూశాడు. అది కూడ సాధ్యం కాలేదు. కాళ్ళను కదిలించి చూశాడు. కాళ్ళు కూడ కదలమని మొరాయించాయి. అంతే! కనురెప్పలు మూసుకొన్నాయి. వేగంగా తెలివి తప్పాడు. మైకం అతన్ని పూర్తిగా ఆక్రమించుకొంది.

~

వంతిదేవునికి తెలివి వచ్చి కళ్ళు తెరిచినప్పుడు, పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చి పల్లకినుంచి దూకబోయాడు. కానీ, ఆశ్చర్యం! తానిప్పుడు పల్లకిలో లేడు! విశాలమైన ఒక గదిలో ఉన్నాడు. ఆ గది దీపాలతో ప్రకాశవంతంగా ఉంది. ఇక్కడ కూడ ఏదో ఒక వాసన అలుముకొంది గాని, మునుపటి వాసన కాదు. మైకం కలిగించే వాసన కాదు. అగరొత్తుల సుగంధంలాగుంది. ముందు అతడు అనుభవించింది తెలివి పోగొట్టే మైకం వాసన. ఇది తెలివిని తేట పరిచే వాసన. పడుకొన్న ఆసనంలోనే లేచి కూర్చొన్నాడు; చుట్టుపక్కల పరికించి చూశాడు.

తెరిచిన వాకిలి గుండా నందిని వచ్చింది. వస్తున్న ఆమెను కళ్ళార్పకుండ చూశాడు. అతని ఆశ్చర్యానికి, అదిరిపాటుకు చాల కారణాలున్నాయి. వర్ణనాతీతమైన ఆమె సౌందర్యం ఒక ముఖ్య కారణం. ఎదురు చూడని సమయాన ఆమెను చూడడం ఇంకొక కారణం. లంకలో తాను చూసిన మూగవనితకు, ఈమెకు ఎంత దగ్గరి పోలిక ఉంది కద అన్న భావం మరొక కారణం. రూపాలు ఒకటిగా కనిపిస్తున్నాయా? లేక ఆ మూగవనితే పెద్ద కుటుంబపు వస్త్రాభరణాలు ధరించడం వల్ల ఇలా కనిపిస్తోందా?

ఇంపైన కింకిణి నాద స్వరంతో, “అయ్యా! మీరు చాల మంచివారు!” అన్నది నందిని.

వంతిదేవుడు, “వందనం" అన్నాడు.

“మంచివాళ్ళకు గుర్తు - చెప్పకుండ వెళ్ళిపోవడమే కద? తంజావూరు అంతఃపురం నుంచి నాకు చెప్పకనే వెళ్ళిపోయారు కద!” అన్నది.

వంతిదేవుడు నవ్వాడు.

“తంజావూరు కోట లోపలికి రావడానికి నేను మీకు సహాయం చేశాను. నా చేతి వేలినుంచి తాటి చెట్టు ముద్ర ఉన్న ఉంగరాన్ని తీసిచ్చాను. దాన్ని నాకు తిరిగి ఇచ్చేసైనా వెళ్ళివుండవచ్చు కద?”

వంతిదేవుడు సిగ్గుపడి మౌనంగా నిలబడ్డాడు.

“ఏదీ? ఇప్పుడైనా ఆ ఉంగరాన్ని నాకు తిరిగి ఇవ్వవచ్చు కద? దాని ఉపయోగం తీరిపోయింది కద? మళ్ళీ తంజావూరు కోటకు వచ్చే ఉద్దేశం లేదు కద మీకు?” అని చెబుతూ తన అందమైన చేతిని చాచింది నందిని.

“దేవీ! ఆ ఉంగరాన్ని లంకలో సేనాధిపతి బూది విక్రమకేసరి స్వాధీనం చేసుకొన్నారు. కాబట్టి దాన్ని తిరిగి ఇవ్వలేకపోయాను. మన్నించాలి!” అన్నాడు వంతిదేవుడు.

“నా జన్మ శత్రువుకు నేను మీకిచ్చిన నా ఉంగరాన్నిచ్చారు కద? చాల మంచి పని చేశారు!

చాల కృతజ్ఞత కలిగిన వారు మీరు!"

"నేనే ఇవ్వలేదు. బలవంతంగా నా దగ్గరనుంచి లాక్కొన్నారు."

"వాణాదిరాయర్ కులంలో పుట్టిన వీరాధివీరులు, బలవంతానికి లోనై ఇలా చేశారంటే నమ్మలేకపోతున్నాను!"

"అమ్మా! నేనిక్కడికి వచ్చింది కూడ బలవంతంగానే కదా? మీ మనుషులు...."

"నిజం చెప్పండయ్యా! బాగా ఆలోచించి చెప్పండి! బలవంతంగా మాత్రమే మీరు ఇక్కడికి రప్పించబడ్డారా? ఇష్టపడి రాలేదా? పల్లకిలో ఎక్కించబడ్డ తర్వాత కిందకు దూకి పారిపోయేందుకు మీకు అవకాశం దొరకలేదా?" అని నందిని అడిగిన ప్రశ్నలు పదునైన బాణాల్లాగ వంతిదేవుని మనసును గుచ్చాయి.

"అవును! ఇష్టపడే వచ్చాను" అన్నాడు చివరికి.

"ఎందుకు వచ్చారు?"

"మీరు నన్నెందుకు రప్పించారు?"

"నా ఉంగరాన్ని తిరిగి ఇమ్మని అడిగేందుకు!"

"అది మాత్రమేనా?"

"ఇంకా ఒక కారణం ఉంది. నా భర్త రక్షణలో ఉన్న బొక్కసంలో మీరు ఆ రాత్రి దాక్కొన్నారు కదా?"

వంతిదేవుడు అదిరిపడ్డాడు.

"నాకు తెలియదనుకొన్నారా? భలే బాగుంది! నాకు తెలియకపోతే మీరు ఆ రాత్రి తప్పించుకొని వెళ్ళగలిగేవారా?"

"దేవి...!"

"అవును; నాకు తెలుసు. పెద్ద పళువేట్టరయ్యర్‌కు కూడ తెలుసు. మిమ్మల్ని అక్కడే చంపేయమని సొరంగమార్గ రక్షక భటునికి ఆజ్ఞ వేశారు. ఆయన అవతలికి వెళ్ళగానే నేను ఆ ఆజ్ఞను మార్చేశాను. అందువల్ల మీరు బతికిపోయారు. మీ ప్రియ స్నేహితుడు ఆపదకు గురయ్యాడు. లేకపోతే, ఆ బొక్కసపు నేలమాళిగలో ముత్యాల కుప్పలకు పక్కన మీ ఎముకలు కుప్పగా ఉండేవి!"

~

వంతిదేవుడు ఆశ్చర్య కడలిలో మునిగిపోయాడు. ఆమె చెప్పిందంతా నిజమని అతడు నమ్మలేకపోయాడు. నిజం కాకపోతే తానా రాత్రి అక్కడ దాక్కొన్న విషయం ఎలా తెలిసిపోయింది? సంప్రదాయం కోసమైనా తన కృతజ్ఞతను తెలుపులోవాలని ఎంచి, "అమ్మణీ...!" అని ఏదో చెప్పబోయాడు.

"వద్దు! మనసులో లేనిది నోటితో ఎందుకు చెప్పజూస్తున్నారు? నాకు కృతజ్ఞత చెప్ప

ప్రయత్నించకండి!"

"లేదు, దేవీ..."

"మీ ప్రాణాలను ఆ రోజు కాపాడిన విషయం ఇప్పుడెందుకు చెప్పానో, తెలుసా? మీ కృతజ్ఞతను ఎదురుచూసి కాదు. మళ్ళీ ఆ సొరంగ మార్గాన్ని ఉపయోగించ ప్రయత్నించకండి అని హెచ్చరించేందుకే. అక్కడ ఇప్పుడు చాల గట్టి కాపలా వేయబడివుంది!"

"మళ్ళీ అటువైపు వెళ్ళే ఉద్దేశమే లేదు నాకు."

"అదెలా ఉండబోతుంది? సహాయం చేసిన వారిని మళ్ళీ తలుచుకొనే అలవాటు మీకు లేదు కద? మీవల్ల మీ స్నేహితుడు ఆపదకు గురైనాడు. అతన్ని నా అంతఃపురానికే రప్పించి వైద్యం చేయించి నయం చేయించాను. దాని గురించి మీకు తృప్తే కద? లేక నమ్మక ద్రోహంతోబాటు మిత్రద్రోహం కూడ మీతోనే పుట్టిందా?"

~

నందిని మాటలొక్కొక్కటి విషబాణాల్లాగ వంతిదేవుని మనసులోకి దూసుకు వెళ్ళాయి. దానితో అతడు విలవిల్లాడి మౌనందాల్చాడు.

"మీతో కోడిక్కరైకి వచ్చిన వైద్య కుమారుని మీకు బదులు పట్టిచ్చేశారు. అతడిప్పుడేమైనాడో విచారించారా?"

"మిమ్మల్ని అడగాలనుకొన్నాను."

"చెబుతాను. కానీ, మీతో లంకనుంచి బయలుదేరిన యువరాజు అరుళ్మొళి వర్మ ఏమైనారు? అది చెబితే మీకు వైద్యకుమారుని గురించి చెబుతాను."

వంతిదేవుడు మళ్ళీ అదిరిపడ్డాడు. యువరాజు గురించి తెలుసుకోవడానికే ఈమె తననిలా ఇక్కట్లు పెడుతోందేమోనన్న సందేహం కలిగింది. ఈసారి మోసపోకూడదని తీర్మానించుకొన్నాడు.

"రాణీ! ఆ ఒక్కటి మాత్రం నన్ను అడక్కండి!" అన్నాడు.

"అవును! అదొక్కటి మాత్రం అడగకూడనిదే. అడిగినా మీవద్దనుంచి ఉత్తరం రాదని నాకు తెలుసు. మీ ప్రేయసి ఎలా ఉంది? అదైనా నాకు చెప్పవచ్చా?"

వంతిదేవుని కళ్ళు నిప్పులుగక్కాయి. "ఎవరి గురించి మాట్లాడుతున్నారు? జాగ్రత్త!" అన్నాడు.

"ఆహా! నేను జాగ్రత్తగానే ఉన్నాను. ఆ పళైయారై మహారాణి గురించి మాట్లాడుతున్నాననుకోకండి. ఆమె మిమ్మల్ని కన్నెత్తి కూడ చూడదు. తన కాలికంటుకొన్న ధూళితో సమానంగా చూస్తుంది మిమ్మల్ని. మిమ్మల్ని లంకకు పడవలో తీసుకొని వెళ్ళి, మళ్ళీ తిరిగి తీసుకొని వచ్చింది కద, ఆ పడవ నడిపే పిల్ల గురించి అడుగుతున్నాను. పూంగుళలి మీ ప్రేయసి కాదా?"

"కాదు, కానే కాదు! ఆమె తన ప్రేమికులను తానే నాకు చూపించింది. మధ్యరాత్రి కోడిక్కరై

బురదనేలలో లేచే కొరివిదెయ్యాలను చూపించింది. అవే తన ప్రేమికులని చెప్పింది."

"ఆమె భాగ్యశాలి. ఎందుకంటే ఆమె ప్రేమికులు కాంతిరూపంలో ప్రకాశవంతంగా కంటి ముందు కనిపిస్తారు. నా ప్రేమికులేమో నిశారూపులు; ఆకారం తెలుసుకోలేనివారు. చీకటి కమ్ముకొన్న పాడుపడ్డ మంటపంలో మీరెప్పుడైనా మధ్యరాత్రి పడుకొన్నారా? గబ్బిలాలు, గుడ్లగూబలు రెక్కలు టపటపా కొట్టుకొంటూ ఆ మంటపంలో రూపం తెలియని చిత్రాలలాగ ఎగురుతూ తిరుగాడుతుండడాన్ని గమనించారా? అటువంటి రూపాలు నా మనసనే మంటపంలో ఎడతెరపి లేకుండ తిరుగాడుతున్నాయి. నా చెంపలను రెక్కలతో తాకేసి వెళుతున్నాయి! ఆ నిశారూపాలు ఎక్కడినుంచి వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? ఎందుకు నా చుట్టు తిరిగి తిరిగి వస్తున్నాయి? అయ్యో! మీకు తెలుసా" - ఇలా చెబుతూ నందిని వెర్రెక్కిన కళ్ళతో అటూ ఇటూ చూసింది.

అది చూసి వజ్రహృదయం కలిగిన వంతిదేవుడే కలతబారాడు. ఒక వైపు జాలి, ఇంకొక వైపు ఇదీ అని తెలియని భయం అతని మనసులో గూడు కట్టుకొన్నాయి.

"దేవీ! వద్దు! కాస్త శాంతించండి!" అన్నాడు.

"నన్ను శాంతించమనడానికి మీరెవ్వరు?"" అన్నది నందిని.

"నేను వాణర్ కులానికి చెందిన ఒక పేద యువకుడిని. తమరెవ్వరు దేవీ?"

"నేనెవరనా అడుగుతున్నావు? అదే నాకూ తెలియడం లేదు. అది కనిపెట్టడానికే ప్రయత్నిస్తున్నాను. నేనెవర్ని? మానవ స్త్రీనా? లేక దెయ్యమా, పిశాచా అని అడుగుతున్నావా?"

"లేదు, లేదు! దేవలోకం నుంచి పొరబాటున భూలోకానికి వచ్చిన దేవకన్యగా కూడ ఉండవచ్చు కదా? దైవ శాపం వల్ల,,,"

"అవును; నాపైన దైవ శాపమేదో ఉంది. అదేమని మాత్రం తెలియడం లేదు. నేనెవరిని, ఎందుకు పుట్టానని ఎరుగను. ఇంతవరకు ఒకే ఒక్క సూచనను నాకు దైవమిచ్చింది. ఇదిగో చూడు!" అని చెప్పి దగ్గరున్న కత్తిని తీసి చూపించింది. ఇటీవలే కొలిమిలో వేడి చేసి పదును చేయబడ్డ ఆ పదునైన ఖడ్గం దీపకాంతిలో తళతళ మెరుస్తూ కళ్ళు చెదరగొట్టింది.

~

వంతిదేవుడు ఆ కత్తిని చూశాడు. చూసిన వెంటనే కొలిమిలో తాను చూసిన కత్తి అదేనని గ్రహించాడు. ఇంతవరకు విషబాణాల్లాంటి నందిని మాటల వల్ల విలవిల్లాడాడు. ఇప్పుడు ఉక్కుతో చేసిన ఆయుధాన్ని చూడగానే అతడి మనసు కుదుటపడింది. ఎందుకంటే కత్తులు, శూలాలు మొదలైన ఆయుధాలు అతనికి సుపరిచితమే. పుట్టినప్పటి నుంచి వాటితో పెరిగినవాడు. కాబట్టి భయం లేదు. నందిని ఆ కత్తిని తనపైన ప్రయోగించినా, భయం లేదు!

"దేవీ! చూశాను. ఖడ్గాన్ని చూశాను. చాల పనితనంతో చేసిన కత్తి; రాజకులానికి తగిన ఖడ్గం.

వీరాధివీరుల చేతికి తగిన ఖడ్గం. అది సున్నితమైన మీ చేతిలోకి ఎలా వచ్చింది? దాని మూలంగా దైవం మీకిచ్చిన సూచన ఏమి?" అని అడిగాడు.

~~~
~~~

# అధ్యాయము - 14

## ఎగిరే (రెక్కల) గుర్రం

**నందిని** తళతళ మెరుస్తున్న ఆ కత్తిని చేతికెత్తుకొని ఆశతో తన హృదయానికి హత్తుకొంది. తర్వాత ముఖానికి ఒత్తి పట్టుకొని తన ఎర్రని పెదవులతో ముద్దాడింది. ఒక క్షణం నిప్పు కణికను ఎర్రతామర ముద్దాడుతున్నట్లు తోచింది. మరుక్షణం రక్తవర్ణమేఘం పూర్ణచంద్రుని అడ్డుకొంటున్నట్లు అగుపించింది. అప్పుడు నందిని ముఖం కాపాలికులు పూజించే, రక్తబలి కోరే కాళి ఘోర సౌందర్యంలాగ కనిపించింది. కత్తిని తీసి పక్కన పెట్టిన వెంటనే ఆమె ముఖం మునుపటిలాగ వశీకరణశక్తిగొంది.

"అవును! దైవం నాకిచ్చిన సూచన ఈ ఖడ్గం. కానీ ఆ సూచనకు అర్థం ఇదీ అని నేనింకా ఎరుగను. ఈ కత్తిని నేను తరచూ కొలిమికి పంపి తుక్కు వదలగొట్టి మళ్ళీ కొత్తగా పదును చేయిస్తూ వస్తున్నాను. తల్లి పులి తాను కన్న పులి పిల్లలను కాపాడేటట్లు నేను దీన్ని కాపాడుకొంటూ వస్తున్నాను. యుక్తప్రాయం వచ్చేలోపు పులి పిల్ల పొడవైన కొమ్ములున్న అడవి దున్నలకు చిక్కకూడదు కదా? అరబ్బులు తమ గుర్రాలను ఎంత ప్రేమతో చూసుకొంటారో, నేను ఈ కత్తిని అంత ప్రేమతో చూసుకొంటున్నాను. జబ్బుపడ్డ సుందర చోళ చక్రవర్తికి వాణమహాదేవి ఉపచారాలు చేస్తున్నట్లు నేను కూడ ఈ కత్తికి ఉపచారాలు చేస్తున్నాను. దీనితో నేనేం చేయాలో దైవం నాకింకా చెప్పలేదు. పూలమాలలు అలంకరించిన ఈ చేతులతోనే ఈ ఖడ్గాన్ని తీసి ఏ క్రూరుని గుండెల్లోనో పొతాలని దైవాజ్ఞనో, లేక నా ఎదలోనే దీన్ని దించి, గుప్పగుప్పమని ఉబికే నా రక్తాన్ని నా బట్టలకు పూసుకొని చావాలన్నది దైవేచ్ఛో ఇంకా తెలియలేదు. ఈ కత్తిని నాకొసగిన దైవమే సమయం వచ్చినప్పుడు అది కూడ తెలియజేస్తుంది. ఆ సమయం ఎప్పుడు వస్తుందని తెలియనందువల్ల రాత్రింబగళ్ళు అప్రమత్తంగా ఉంటున్నాను. అవును; అందానికి పేరుగాంచిన పళువూర్ యువరాణికి వస్త్రాభరణాలంటే మిక్కిలి ప్రేమ అన్నది అందరూ ఎరిగిన విషయమే. రాత్రింబగళ్ళు అలంకరించుకొన్న ఈ శరీరాన్ని సుందరంగా ఉంచుకొంటున్నాను. పాపం! పెద్ద పళువేట్టరయ్యర్ నేను తమ కోసమే ఇలా సర్వాలంకారాలతో విలసిల్లుతున్నాననుకొని సంతోషపడుతున్నారు! నా మనసులోని దావానలాన్ని ఆయనెరుగరు!"

ఇదంతా భ్రమించినట్లు వింటున్న వల్లవరయ్యన్ కాస్త సంభాళించుకొని, "అమ్మణీ! పెద్ద పళువేట్టరయ్యర్ ఎక్కడ?" అని అడిగాడు.

"ఏం? ఆయన్ను చూస్తే మీకు భయమా?" అని అడిగింది నందిని.

"లేదు, అమ్మణీ! తమను చూసే నేను భయపడడం లేదు కదా! మరి ఆయన్ను చూసి నేనెందుకు భయపడతాను?" అన్నాడు వంతిదేవుడు.

"ఆహా! మీరు నాకు నచ్చడానికి కారణమదే. ఎందుకో నన్ను చూసి అందరూ భయపడుతున్నారు. వీరాధివీరులు, ఎన్నో యుద్ధాల్లో పాల్గొని ఒంటిమీద అరవైనాలుగు గాయాలు భరించిన పెద్ద పళువేట్టరయ్యర్ కూడ నన్ను చూసి భయపడుతున్నారు. చిన్నపళువేట్టరయ్యర్ - కాలయముని కూడ గతి తప్పించగల కాలాంతక గండరు - నా ముందు భయపడి వణుకుతున్నారు. ఈ చోళసామ్రాజ్యాన్ని ఏక ఛత్రం కింద ఏలేందుకు ఆశపడుతున్న మధురాంతకులు, నా సమక్షానికి వచ్చేటప్పుడు భయభక్తులతో వస్తున్నారు. యమలోకాన్ని తొంగిచూస్తున్న సుందర చోళ చక్రవర్తి కూడ నేను దగ్గరకు వెళితే వణుకుతున్నారు. ఒక్కొక్కసారి ఆయన నన్ను చూసి మూర్ఛపోతున్నారు. ఈ రోజు వచ్చాడే, పార్థిబేంద్ర పల్లవుడు - అతని నిర్భయ హృదయం గురించి, వీరత్వం గురించి చాల విన్నాను. ఆదిత్య కరికాలన్‌కి ప్రాణస్నేహితుడని ఎరుగుదును. కానీ నా సమక్షానికి వచ్చిన అరఘుడియలోనే ఎలా అణగి, మణిగి ఒదిగిపోయారు? ఆదిత్య కరికాలన్ వద్దకు వెంటనే వెళ్ళవలసిన ముఖ్యమైన కార్యాన్ని కూడ మరిచిపోయి నా వెంబడి నాతో వస్తున్నాడు. నేను కాలితో చెప్పిన కార్యాన్ని తలతో నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. దాన్ని చూస్తున్నప్పుడు నాకు ఒకటి జ్ఞాపకం వస్తోంది. చిన్న బిడ్డగా ఉన్నప్పుడు నిప్పును చూసేందుకు చాల ఇష్టపడేదాన్ని. నిప్పు దగ్గరకు వెళ్ళేదాన్ని. నిప్పు కణికలను తాకేందుకు ఆశతో వేలిని చాచేదాన్ని. కానీ అందుకు ధైర్యం చాలేదికాదు. చటుక్కున వేలిని వెనక్కి లాగేసుకొనేదాన్ని. ఇలా ఎన్నోసార్లు చేశాను. పార్థిబేంద్రుడు నన్ను సమీపించడం, మళ్ళీ వెనక్కు తగ్గడం చూస్తే ఆ పాత అనుభవం గుర్తుకొచ్చింది. ఆ పల్లవుడు మాత్రమేమి? మీరు ఎవరినుంచి తాళపత్రాన్ని తీసుకొని కంచినుంచి ఇటు వచ్చారో ఆ ఆదిత్య కరికాలన్ కూడ అంతే. మేము చిన్న పిల్లలుగా ఉన్నప్పటినుంచే ఆయనకు నా పట్ల ఎనలేని వాంఛ; దానికి తోడు ఒక భయం. దానివల్ల నా బతుకు ఎంతెంతగా మారిపోయింది! అయ్యో! మీ యజమానులను మీరు మళ్ళీ కలిసినప్పుడు నాకోసం ఒక సందేశం అందిస్తారా? 'జరిగిందంతా నేను మరిచిపోయాను. నేను ఇప్పుడు ఆయనకు నాయనమ్మ స్థానంలో ఉన్న పళువూర్ రాణిని. నన్ను చూసేందుకు ఏమాత్రం భయపడనవసరం లేదు. ఆయనను నేను కొరికి మింగేయను!' అని చెబుతారా?"

"దేవీ! నేను ప్రాణాలతో తిరిగి వెళ్ళి ఆదిత్య కరికాలన్‌గారిని మళ్ళీ చూస్తానన్నది అనిశ్చితం. అలా నేనాయన్ను చూసేటట్లే జరిగితే చెప్పేందుకు ఎన్నో సంగతులు/వార్తలున్నాయి. మీ సందేశాన్ని ఆయనకు తప్పక అందజేస్తానని చెప్పలేను. దయచేసి మన్నించాలి!"

"అవును; నేను చూసినవారిలో మీరొక్కరే ధైర్యశాలి. మనసులో ఉన్నది దాచకుండ మాట్లాడుతున్నారు. అందుకనే మీరు నాకు నచ్చారు. వాణర్ కులవీరా! నేను చాలమందిని చూసి ఎరుగను. పళైయారై యువరాకుమారిలాగ రధమెక్కి ప్రయాణం చేయడం లేదు. ఎక్కడికైనా వెళ్ళవలసివస్తే మూసిన పల్లకిలోనే వెళుతున్నాను. నాకెవరి మూలంగానైన ఏదైన పని జరగవలసివుంటే వారిని మాత్రమే కలుస్తున్నాను. వారు చాలవరకు పిరికివారుగా ఉన్నారు - మనసులో ఉన్నది చెప్పేందుకు ధైర్యం చేయడం

లేదు. మీరు మనసులో ఉన్నది దాచకుండ చెబుతున్నారు..."

"దాచడంవల్ల ప్రయోజనం లేదని నేనెరుగుదును. రాణీ! మీ కంటిచూపుకానని రహస్యం ఏ మనిషి మనసులోను ఉండ సాధ్యం కాదు."

"అది నిజం కావచ్చు. కానీ మీ మనసులో ఉన్నది నేనింకా తెలుసుకోలేకున్నాను. అదలా ఉండనీ. పళువేట్టరయ్యర్ గురించి అడిగారు. ఆయన, పార్థిబేంద్రుడు పొరుగూరికి వెళ్ళారు. అక్కడ కణ్ణగి ఆట, వేలన్ ఆట జరుగుతున్నాయి. చిన్న యువరాజు గురించి పూనకం వచ్చి ఆడేవాడినుంచి ఏదైనా తెలుసుకోవచ్చేమో చూసేందుకు వెళ్ళారు. వెర్రివాళ్ళు! ఎవరిని పట్టుకొని అడగాలో వారిని అడగక, జోస్యులను అడుగుతున్నారు. వారు వచ్చేందుకు చాలసేపు పడుతుంది. అందుకే నేను మిమ్మల్ని పిలుచుకొని రమ్మని పంపించాను. అయ్యా! మళ్ళీ అడుగుతున్నాను. యువరాజును గురించిన నిజం మీకు తెలుసుకద? అది మీరు నాకు చెప్పరు కద?"

"లేదు, దేవీ! చెప్పేందుకు వీలుకాదు! ఇకపైన ఏ కార్యం కోసమూ కట్టు కథలు చెప్పనని, నిజాన్నే చెబుతానని ఈరోజే తీర్మానించాను. కాబట్టి యువరాజు గురించి చెప్పలేను. కాసేపటికి మునుపు కూడ నా తీర్మానాన్ని మరిచిపోయాను. మన్నించాలి!" అని చేబుతూనే వంతిదేవుడు తన నడుం చుట్టూ కట్టుకొన్న బట్టను విప్పి దానిలోపలనున్న తాటి ముద్ర ఉన్న ఉంగరాన్ని తీశాడు.

"అమ్మణి! ఇదిగో, మీరిచ్చిన ఉంగరం. లంకలో సేనాధిపతి బూది విక్రమకేసరి వీరులు దీన్ని నా దగ్గరనుంచి బలవంతంగా లాక్కొన్నారన్నది నిజమే. కానీ సేనాధిపతి తిరిగి ఇచ్చేశారు. ఇదిగో మీకు చేరుస్తున్నాను; స్వీకరించి కరుణించండి!" అని ఆ ఉంగరాన్ని చాచాడు.

~

నందిని ఆ ఉంగరాన్ని ఒక క్షణం పరికించి చూసి అది తానిచ్చిందేనని తెలుసుకొంది.

"అయ్యా! ఇచ్చినదేదీ తిరిగి తీసుకొనే అలవాటు నాకు లేదు. మీ ఋజుప్రవర్తనను పరీక్షించేందుకే అడిగాను. ఆ పరీక్షలో మీరు నెగ్గారు. నా మనుషులను పిలిపించి మిమ్మల్ని శోధించవలసిన్ పరిస్థితి నాకు కలిగించలేదు. ఉంగరాన్ని నా జ్ఞాపకార్థం మీదగ్గరే పెట్టుకోండి!" అన్నది.

"అమ్మణి! ఆలోచించి చెప్పండి. ఇది నా దగ్గరుంటే మళ్ళీ అవసరం వచ్చినప్పుడు ఉపయోగించవలసి వస్తుంది..."

"అందు గురించి దిగుల్లేదు. దాన్ని ఏ విధంగానైన ఉపయోగించుకోవచ్చు. మిమ్మల్ని మళ్ళీ కళ్ళకు గంతలు కట్టి పల్లకిలో ఎక్కించుకొని తిరిగి తీసుకొని వెళ్ళి విడిచిపెట్టమని నా మనుషులకు చెప్పబోతున్నాను. మిమ్మల్ని పట్టుకొన్న చోటే విడిచి రమ్మని చెప్పబోతున్నాను..."

"నేనందుకు ఒప్పకోకపోతే....?

"ఈ పాడుబడ్డ అంతఃపురంనుంచి, కోట నుంచి మీ అంతట మీరే బయటపడలేరు. మళ్ళీ మళ్ళీ

బయలుదేరిన చోటికే వస్తుంటారు..."

"దేవీ! ఈ కోట....? ఈ పాడుబట్ట అంత:పురం...?"

"అవును; ఒకప్పుడు ఈ చోళనాడు పల్లవుల పాలనలో ఉండేది - చాలకాలం వరకు. అప్పుడు పల్లవ చక్రవర్తులు ఈ కోటను, అంత:పురాన్ని కట్టించారు. తర్వాత చోళనాడు పాండ్యుల వశమైంది. పాండ్యరాజులు కొన్నిసార్లు ఈ అంత:పురంలో వసించారు. విజయాలయ చోళుని కాలంలో ఇక్కడ ఒక పెద్ద యుద్ధం జరిగింది. అంత:పురం కూడ సగభాగం నాశనమైంది. మిగిలిన, నాశనంకాని, సగభాగంలో మనమిప్పుడున్నాము. ఈ కోటను కొందరు పల్లవుల కోట అని, ఇంకొందరు పాండ్యరాజుల కోట అని అంటారు. రెండింటిలోను నిజముంది. కానీ బాగా దారి తెలిసిన వారు మాత్రమే దీని లోపలినుంచి మళ్ళీ బయటకు వెళ్ళగలరు! ఏమంటారు? నా మనుషులను మిమ్మల్ని బయటకు తీసుకొని వెళ్ళి విడిచిపెట్టమని చెప్పనా? లేక మీరే దారి తెలుసుకొని...."

"లేదు, దేవీ! నేనే దారి తెలుసుకొని వెళ్ళేందుకు నాకిప్పుడు సమయం, తీరిక లేదు. నన్ను తీసుకొచ్చినవాళ్ళే నన్ను మళ్ళీ తీసుకొని వెళ్ళి విడిచిపెట్టనీ. కానీ వెళ్ళేందుకు మునుపు.... నన్ను తీసుకొచ్చిన కారణమింకేమీ లేదా? నేను మీకు చేయగలిగిన సహాయమింకేమీ లేదా? అలా ఏదైనా ఉంటే చెప్పండి!"

"మంచిది; మీరు అడుగుతున్నందువల్ల చెబుతున్నాను. ఎగిరే గుర్రమొకటి నాక్కావాలి. మీకు సాధ్యమైతే దాన్ని సంపాదించి తీసుకొచ్చి ఇవ్వండి."

"ఏమిటి? ఎగిరే గుర్రమనా అన్నారు?"

"అవును; ఎగిరే గుర్రమే!"

"ఎగురుతున్నట్లు అతివేగంగా పరుగెత్తే అరబ్బు దేశపు గుర్రం గురించి చెబుతున్నారా?"

"లేదు, లేదు! నేనలాంటి గుర్రంపైకి ఎక్కనేలేను. భూమి పైన కాలూని పరుగెత్తే గుర్రం గురించి నేను చెప్పడం లేదు. పక్షుల్లాగ రెక్కలు విప్పుకొని ఆకాశంలో ఎగురుతూ వెళ్ళే గుర్రం గురించి చెబుతున్నాను. అటువంటి విచిత్రమైన గుర్రాలు ఈ భూలోకంలో ఎక్కడో ఉన్నాయని కథల్లో చదివాను. అటువంటి రెక్కలున్న గుర్రమే నాక్కావాలి!"

"ఎందుకని? స్వర్గలోకానికి ఎగిరి వెళ్ళేందుకా?"

"నన్ను చూస్తే స్వర్గానికి వెళ్ళగలదానిలాగ అనిపిస్తోందా? అటువంటి పుణ్యం చేసినదాన్ని కాను నేను. క్రూరమైన పాపాలు చేసినదాన్ని...."

"స్వర్గంలో ఉన్నవారు ఒట్టి పుణ్యం మాత్రం చేసినవారా? అక్కడ కూడ పాపాలు చేస్తున్నారు. పరిహారం వెతుక్కొంటూ మళ్ళీ భూలోకానికి వస్తున్నారు. వచ్చిన కార్యం ముగియగానే మళ్ళీ స్వర్గానికి తిరిగి వెళుతున్నారు."

"లేదు; నాకు స్వర్గానికి వెళ్ళాలనే ఆశ లేదు. పాండ్యనాడులో ఒక ఎడారి ఉంది. దాని మధ్య కొన్ని గుండ్రాళ్ళున్నాయి. వాటి మధ్య ఉన్న గుహల్లో దిగంబర జైన మునులు తపస్సు చేశారు. ఇప్పడు పాములు, నక్కలు వాటిలో నివసిస్తున్నాయి. దేవలోకపు అమరావతికన్న పాండ్యనాడులో ఉన్న ఆ ఎడారి గుండ్రాళ్ళే నాకు ఎక్కువ ఇష్టం..."

"దేవీ! తమ కోరిక చాల విచిత్రమైనదే."

"ఎగిరే గుర్రం దొరికితే నేనా ఎడారికి వెళతాను. తర్వాత అక్కడినుంచి లంకాద్వీపానికి ఎగిరి వెళతాను. లంకలో ఆకాశాన్నంటే పర్వతాలు, వాటిని మరుగుపరిచేటంత ఎత్తైన చెట్లున్న అడవులు ఉన్నాయట. ఈ చోళనాడులో కనిపించే గేదెల మందల్లాగ లంకలోని అడవుల్లో ఏనుగుల మందలు తిరుగాడుతుంటాయట. అదంతా చూడాలి. ఇంకా, ఈ లోకంలో మంచుతో కప్పబడ్డ శిఖరాలున్న ఎత్తైన పర్వతాలున్నాయట. ఉదయసూర్యుని కిరణాలు సోకి అవి వెండికొండల్లాగ మెరుస్తాయట. ఎగిరే గుర్రమెక్కి ఆ కొండలను చూడాలని ఆశపడుతున్నాను. ఇంకా వాటికవతల పాండ్యదేశపు ఎడారి కన్న పదహారు వేల రెట్లు పెద్దదైన ఎడారి, తెల్లని ఇసుక ఎడారి ఉందట. పగటి పూట నిప్పల మధ్య ఉన్నట్లుంటుందట అక్కడ. ఇంకా దాటి వెళితే, విపరీతమైన చలివల్ల గడ్డకట్టిన మంచుతో కప్పబడ్డ సముద్రంపైన మనుషులు, మృగాలు నడిచి వెళ్ళేటట్లు ఉంటుందట. ఎగిరే గుర్రం పైన ఆ స్థలాలన్నీ వెళ్ళి చూడాలని ఆశపడుతున్నాను...."

'దేవీ! నేనటువంటి గుర్రాన్ని తీసుకొని వచ్చి ఇవ్వలేను. కానీ మీరు చెప్పిన కొన్ని చోట్లకు సులభంగా వెళ్ళే దారులున్నాయి. ఒక మంచి పడవెక్కి వెళితే అర్ధరోజులో లంకకు వెళ్ళవచ్చు. ఓడెక్కి వెళితే..."

"అయ్యో! అది నాకు తెలియని దారికాదు. కాని నాకు సముద్రాన్ని చూస్తే భయం. ఓడెక్కడమంటే భయం. పడవెక్కి నది దాటేటప్పడు ఆ పడవ ఊగితే భయం. కాబట్టి మీ ఆలోచన నాకెంత మాత్రం ఉపయోగపడదు. మీరు వెళ్ళి రావచ్చు!" అని చెప్పి నందిని లేచింది.

"దేవీ! మీరు నాకు చెప్పేందుకు ఇంకేమీ లేదా?"

"లేదు; మీరే ఏదో చెప్పదలిచినట్లుంది."

"ఒక ప్రశ్న అడగాలని కోరుకొంటున్నాను. దానికి మాత్రం తప్పక జవాబు చెప్పాలి. కొన్నిరోజుల క్రితం మీరు లంకకు రాలేదా? అనురాధపురం వీధుల్లో క్రీనీడల్లో నిలబడి ఉండలేదా?"

"లేనే లేదు. పళువేట్టరయ్యర్ అంతఃపురాన్ని, కాపలాను దాటి నేనేనాడూ వెళ్ళలేదు. మీకలాంటి సందేహం ఎందుకొచ్చింది?"

"అమ్మణి! కొన్నిరోజుల క్రితం లంకలో మిమ్మల్ని చూశాను. లేదా, మీలాంటి ఒక మాయారూపాన్ని చూశాను. 'ఎగిరే గుర్రం  అని చెబుతున్నారు కద? ఒకవేళ అటువంటి గుర్రం మీదగ్గర ఉందేమో, దాన్ని ఎక్కి మీరు లంకకు వచ్చారేమో అనుకొన్నాను. కానీ ఇప్పటిలాగ వస్త్రాభరణాలు ధరించి

అలంకరించుకోలేదు. సాధారణమైన చీర ఒకటి ధరించి, ఏ విధమైన ఆభరణాలు ధరించక, జుట్టు విరబోసుకొని నిలబడ్డారు. ఆ స్త్రీ మీరు కాదా?"

"కాదు, నేను కానే కాదు! అయ్యా! మీరు చెబుతున్న ఆ స్త్రీ నోరు తెరిచి ఏదైనా మాట్లాడిందా?"

"లేదు. సైగలతోనే మాట్లాడింది. కానీ మీకు మాంత్రికులతో పరిచయం ఉంది. ఒకవేళ అటువంటి మంత్రశక్తి వల్ల సూక్ష్మరూపంలో అక్కడికి వచ్చివుండవచ్చు కద?"

"నేను గాని, నా సూక్ష్మరూపంగాని కాకపోతే...."

"అచ్చం మీ పోలికే ఉండి, మాటలు రాని మూగవనితై ఉండాలి."

నందిని చూపులు ఎక్కడో దూరాన ఉన్నాయి. ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

"అయ్యా! కాసేపటికి మునుపు మీరు నాకేదైనా సహాయం చేస్తానన్నారు కద?"

"అవును!"

"అది మీరు నిజంగా చెప్పిన మాటే కద?"

"సందేహం లేదు."

"అలాగైతే ఇది వినండి. ఎప్పుడైనా ఆ మూగవనితను మీరు మళ్ళీ చూస్తే నా దగ్గరకు తీసుకొని రండి. అది వీలుకాకపోతే నన్నైనా ఆమె దగ్గరకు పిలుచుకొని వెళ్ళండి!" అన్నది నందిని.

~

అరగడియకల్లా వంతిదేవుడు మళ్ళీ ముల్లై నది గట్టున నిలబడ్డాడు. అతని గుర్రం కూడ అతని పక్కనే నిలబడివుంది. అతన్ని తీసుకొచ్చిన వాళ్ళు ఒక్క క్షణంలో మరుగైనారు. దేవరాళన్ కూడ కనిపించలేదు.

ముల్లై నదీతీరం వెంబడి గుర్రాన్ని మెల్లగా నడుపుకొంటూ రాత్రంతా ప్రయాణం చేశాడు వంతిదేవుడు. మూడో జాములో తోకచుక్క తన పూర్తి పరిమాణానికి పెరిగి ఆకాశాన్ని చాలవరకు ఆక్రమించుకొంది. ప్రజల మనస్సుల్లో భీతిని పుట్టించిన ఆ ధూమకేతువు వల్ల నిజంగానే ఏదైనా విపరీతం జరుగుతుందా, లేక ఇదంతా ఒట్టి మూఢనమ్మకమేనా అని అతడు తరచూ ఆలోచించాడు. నందిని జ్ఞాపకం కూడ మధ్య మధ్య వస్తోంది. ఆమె చెప్పిన మాటలన్నీ అతడి మనసులో బాగ పదిలమైనాయి. మొదటిసారి తంజావూరు అంతఃపురంలో చూసినప్పుడు కలిగిన జుగుప్స ఇప్పుడు మాయమైంది. ఏదో ఒక భయంకరమైన కష్టాలలో చిక్కుకొందన్న భావం వల్ల ఒక విధమైన జాలి కలిగింది ఆమె పట్ల. కానీ ఆమె ఉద్దేశం ఏమి, ఆ నిజ జీవిత వృత్తాంతం ఏమి అన్నవి ఇంకా మర్మభూయిష్టంగా ఉన్నందువల్ల ఒకవైపు కోపంకూడ కలిగింది. సాటిలేని సౌందర్యంతోబాటు ఏదో ఒకవిధమైన మాయాశక్తి కలదని కూడ తోచింది. కాబట్టి ఇక ఆమెతో ఎటువంటి సంబంధం పెట్టుకోకుండడమే మేలని తోచింది. తాటి ముద్ర కలిగిన ఆ ఉంగరాన్ని ఆమె తిరిగి తీసేసుకొనివుంటే ఎంతో మంచిదై ఉండేది. దాన్ని తీసుకోవడానికి నిరాకరించేసింది కద? నదిలో

విసిరేద్దామంటే దానికీ మనసొప్పడం లేదు. ఈ అపాయకరమైన కాలంలో అది మళ్ళీ పనికి రావచ్చు. ఎందుకు విసిరేయాలి?

పళైయారైకి వెళ్ళి యువరాకుమారికి చెప్పవలసిన సమాచారాన్ని చెప్పేస్తే తర్వాత దాన్ని విసిరేయవచ్చు. ఇటువంటి ఇక్కట్టైన కార్యాల్లో మళ్ళీ తలదూర్చకూడదు.

రాత్రి నాలుగో జామున తూర్పున తెల్లవారసాగింది. శుక్రునికెదురుగా ప్రయాణం చేయకూడదని వంతిదేవుడు వినివున్నాడు. కాబట్టి గుర్రాన్ని ఒక చెట్టుకు కట్టేసి తాను కూడ నేల మీద పడుకొని ఒక కునుకు తీశాడు.

~~~
~~~

# అధ్యాయము - 15

## కాలా ముఖులు

**ఉదయసూర్యుని** అరుణ కిరణాలు వంతిదేవుని ముఖంమీద పడి చుర్రుమనిపించి అతన్ని నిద్రలేపాయి. మెలకువ రాగానే అతనికి లేవ మనసు రాలేదు. కళ్ళు తెరిచి చూశాడు. కాస్త దూరాన భయంకర స్వరూపులైన ఇద్దరు స్వాములు వస్తుండడం కనిపించింది. వారి పురితిప్పి కట్టుకొన్న జడ, ఒక చేతబట్టిన త్రిశూలం, ఇంకొక చేతబట్టిన అగ్ని గుండం - వీటన్నిటిని చూసి వారు కాలాముఖ వీరశైవులని వంతిదేవుడు గ్రహించాడు. వీరితో వాగ్యుద్ధం చేసేందుకు ఆళ్వార్ కట్టియాన్ ఇప్పుడిక్కడ లేడు కద అన్న ఆలోచన వచ్చింది వంతిదేవునికి. ఆ కాలాముఖులు తనని దాటి వెళ్ళేవరకు నిద్రిస్తున్నట్లు నటించాలని తీర్మానించుకొన్నాడు.

వారు తన పక్కనే వచ్చి నిలబడ్డారని గ్రహించినప్పుడు కూడ కళ్ళు తెరవలేదు. వారిలో ఒకాయన దగ్గరకు వచ్చి కాస్త దగ్గినప్పుడు కూడ కళ్ళు తెరవలేదు.

“శివోహం! అబ్బాయి మంచి కుంభకర్ణుడిలాగున్నాడు" అన్నారు ఒకాయన.

“శివోహం! ఇలాంటి యువకుడు మనకు దొరికితే ఎంత బాగుంటుంది!” అన్నారు రెండో స్వాములు.

“శివోహం! మనిషిని చూసి ముఖం మంచి కళగా ఉంది కద అంటున్నావు! ఇతనివల్ల మనకు ప్రయోజనమేమీ లేదు. అతిత్వరలోనే ఇతడికి ఒక పెద్ద ఆపద రాబోతోంది!” అన్నారు మొదటి వీరశైవులు.

ఇంకా నిద్రపోతున్నట్లు నటించబోగా, ఊపిరి సలపనట్లైంది వంతిదేవునికి. కాబట్టి అప్పుడు లేస్తే తన నాటకం బయటపడిపోతుంది. అదీగాక వారు మళ్ళీ ఏమైనా మాట్లాడుకొంటే దాన్ని రహస్యంగా వినే అవకాశం చేజారిపోతుంది. తనకు ఎలాంటి ఆపద రాబోతోందని వారు చెబుతారేమో కద....?

కానీ అతడి కోరిక నెరవేరలేదు.

“శివోహం! ఎవరి తలరాత వారిది! నీవు రా, పోదాం!” అని ఒక స్వాములు అనగా, ఇద్దరూ అక్కడినుంచి ముందుకు సాగారు.

వారు కాస్త దూరం వెళ్ళేందుకు అవకాశమిచ్చి, వంతిదేవుడు లేచాడు. “త్వరలో వీడికి పెద్ద ఆపద రాబోతోంది!” అన్న మాటలు ఇంకా అతడి చెవిన మారుమోగుతున్నాయి.

~

పాతకాలపు కాపాలికుల పరంపరలో వచ్చినవారే కాలాముఖు;లు. కాపాలికులలాగ వీరు నరబలి ఇవ్వడం లేదు. అది తప్ప కాపాలికుల సంప్రదాయాలను, అలవాట్లను పాటిస్తూ వస్తున్నారు

కాలాముఖులు. వారు స్మశానంలో ఘోరతపస్సు చేసి ముందు జరగబోయే సంఘటనలను తెలుసుకోగలిగే శక్తి పొందినవారని పలువురు నమ్మేవారు. శాపం ఇవ్వగల శక్తి కూడ కలిగిన వారని పామరజనాలు నమ్మేవారు. కాబట్టి కాలాముఖ వీరశైవుల కోపానికి గురికాకుండ ఉండేందుకు వారికి కావలసిన ఉపచారాలను చేసేందుకు పలువురు సిద్ధంగా ఉండేవారు. చిన్నరాజులు పలువురు కాలాముఖులకు దేవాలయాల్లో భోజనసౌకర్యం చేసివుంచేవారు. ఇంతవరకు చోళవంశరాజులెవ్వరూ కాలాముఖులకు ఎటువంటి ఆదరమూ చూపలేదు.

ఈ వివరాలన్నీ తెలిసిన వంతిదేవుడు, "వారేమైనా వాగనీ. ఇంతవరకు రాని ఆపద మనకు కొత్తగా కలగబోతోందా?" అని తనకు తానే చెప్పుకొన్నాడు. కానీ రాబోయే కాలం గురించి తెలుసుకోవాలన్న ఆశ అతని మనసు నుంచి పూర్తిగా తొలగిపోలేదు.

~

వంతిదేవుడు లేచి నిలబడి చూసినప్పుడు ఆ కాలాముఖులు ఒక పాడుబడ్డ మంటపాన్ని సమీపిస్తుండడాన్ని గమనించాడు. దాని పక్కన ఒక కృత్రిమమైన గుట్ట; దానిలో ఒక గుహ, సింహం తెరిచిన నోరులాగ కనిపించేది, ఉన్నాయి. పాతకాలంలో దిగంబర జైన మునులు అటువంటి గుహలు కట్టుకొని వాటిలో తపస్సు చేసేవారు. ఇప్పుడు కాలాముఖులు ఆ గుహలను కైవసం చేసుకొన్నారు.

అక్కడికి వెళ్ళి వారిని కాసేపు మాట్లాడించి చూడాలన్న కుతూహలం కలిగింది వంతిదేవునికి. గుర్రాన్ని కట్టిన చోటే విడిచిపెట్టి ఆ మానవ నిర్మితమైన గుట్టవైపు నడిచాడు. మంటపాన్ని సమీపించినప్పుడు కాలాముఖులు గుహకు అవతలివైపు నిలబడి మాట్లాడుకొంటుండడం మెల్లగా వినిపించింది.

"ఆ అబ్బాయి దొంగ నిద్రపోతుండడం లేదు. నిజంగానే నిద్రిస్తూండాలి" అన్నారు ఒక స్వాములు.

"అదెలా నిర్దుష్టంగా చెప్పగలవు?" అని రెండవ స్వాములు అడిగారు.

"తనకు అపాయం రాబోతోందన్న మాటను విన్న తర్వాత, దాని గురించి కుతూహలం కనబరచని మనిషిని నేనింతవరకు చూడలేదు."

"అబ్బాయి మంచి ధీరునిలాగ కనిపిస్తున్నాడు. మనతో చేర్చుకొంటే బాగానే ఉంటుంది. నీవేమంటావు?"

"ఇతడిలాంటి యువకులు మనకెందుకు? ఇంకొన్ని రోజుల్లో చోళసామ్రాజ్య సింహాసనాన్ని ఎక్కబోయే యువకుడే కాలాముఖులతో చేరబోతున్నాడు..."

"ఎవరిని చెబుతున్నావు?"

"ఇంకెవరు? మధురాంతకునే చెబుతున్నాను! ఇది కూడ నీకు తెలియదా?"

"అదెలా? తక్కిన ఇద్దరు?"

"ఒకడేమో సముద్రంలో మునిగి చనిపోయాడట. ఇంకొకడి కాలం దగ్గర పడుతోంది...."

~

వంతిదేవుడు కాలాముఖుల మాటలను ముందుకు ఏమాత్రం వినగోరలేదు/విననిష్టపడలేదు. వారితో మాట్లాడేందుకు కూడ ఇష్టపడలేదు.

వీలైనంత త్వరలో పళైయారైకి వెళ్ళి యువరాకుమారికి సమాచారాన్ని అందజేసేసి కంచికి వెళ్ళాలనుకొన్నాడు. అందరికన్న ఎక్కువగ తాను ఆదిత్య కరికాలన్‌కి కద బాధ్యుడు? ఆయనను ఎన్నో రకాల అపాయాలు చుట్టుముడుతున్నాయన్నది నిజం. పార్థిబేంద్రుడు కూడ పళువూర్ రాణి మాయవలలో పడిపోయాడు. ఆదిత్య కరికాలన్ ఎప్పుడు, ఏ కార్యంలో తొందరపడి కాలుపెట్టి అపాయానికి గురౌతారో తెలియదు. ఆయన దగ్గరకు వెళ్ళి, ఆయన పక్కన నిలబడి ఆయనను కాపాడడం తన మొదటి కర్తవ్యం. దారిలో ఊరక పొద్దుపుచ్చడం తప్పు. ఈ క్షణమే వెళ్ళిపోవాలి.

వంతిదేవుడు చప్పుడు కాకుండ తిరిగి వెళ్ళి గుర్రమెక్కాడు. గుర్రాన్ని గట్టిగా అదిలించి ముందుకు తోలాడు. కాలాముఖుల గుహ పక్కగా వెళ్ళినప్పుడు వారు తనను వెర్రిగా చూడడాన్ని గమనించాడు. ఒక ముఖాన్ని తానెప్పుడో చూసినట్లనిపించింది. కానీ ఆగి చూసేందుకు ఇష్టపడక ముందుకు సాగాడు.

~

దారిలో జనసందోహం ఎక్కువగా ఉన్న పలుగ్రామాలనతడు చూశాడు. ఆక్కడక్కడ యువరాజు సముద్రంలో మునిగిపోయారన్న వార్త ప్రజలకింకా తెలియలేదని గ్రహించాడు. ఎందుకంటే ప్రజలు తమతమ పనుల్లో పూర్తిగా నిమగ్నమైవున్నారు. అంతవరకు మంచిదే. యువరాజు గురించిన సంగతి పళైయారై వరకు చేరేలోపు తానక్కడికి చేరుకోవాలి; యువరాకుమారికి నిజాన్ని తెలియజెప్పేయాలి. కుందవైదేవి చెవిన ఇంకేదైనా వార్త పడితే ఏదైనా విపరీతం జరగవచ్చు కద? యువరాకుమారి నమ్మేందుకు సందేహపడవచ్చేమో. ఆ కొడుంబాళూర్ రాకుమారి ప్రాణాలు విడిచినా ఆశ్చర్యపడనవసరం లేదు....! ఈ ఆలోచన రాగానే వంతిదేవుడు చాల గాభరా పడ్డాడు. కానీ అతడి తొందర అతడి గుర్రానికి తెలియలేదు. డెక్కలకు కొత్తగా కొట్టిన లాడాల వల్ల మామూలుకన్న నిదానంగా పరుగెడుతుండడం వల్ల సూర్యుడు అస్తమించేందుకు రెండు ఘడియలు మునుపు మాత్రమే పళైయారై పెద్ద కోట గోడను చూడగలిగాడు.

అదిగో కోట వాకిట దుర్గాదేవి గుడి కనిపిస్తోంది. కోట లోపల ఎలా ప్రవేశించాలన్న విషయం గురించి అతని తలలో మెరుపుల్లాగ ఎన్నెన్నో ఆలోచనలు తలెత్తాయి. కానీ ఏ ఒక్కటీ కార్యసాధ్యంగా తోచలేదు. తాటిముద్ర ఉంగరమేమో ఇక్కడ పనిచేయదు. ఎందుకంటే ఆ ఉంగరంతో ఒకడు వస్తాడని కోట కాపలాదారులకు హెచ్చరిక ఇవ్వబడింది. ఉంగరాన్ని చూసిన వెంటనే ఇంకే విచారణ చేయకుండ పట్టి

బంధించేస్తారు, చిన్న పళువేట్టరయ్యర్ వద్దకు తనను పంపించేస్తారు. కుందవై దేవిని చూసేలోపల అలా పట్టుబడడానికి అతడేమాత్రమూ ఇష్టపడలేదు.

ఇలా అలోచిస్తూనే గుర్రం వేగాన్ని తగ్గించి కోట వాకిలిని సమీపించాడు. అప్పుడు ఇంకొక వైపు నుంచి ఒక గుంపు రావడాన్ని గమనించాడు. శూలాలు చేతబట్టిన వీరులు, వందిమాగధులు, అశ్వారూఢులు - ఇంత మంది మధ్య తామరపూవు ఆకారంలో ఒక స్వర్ణ రథం. ఆహా! ఆ రథంలో ఆసీనులైన వారెవరు? కడంబూర్ అంతఃపురంలోను, తంజావూరు బొక్కసపు నేలమాళిగలోను చూసిన అదే యువరాజు! - కోట లోపల ప్రవేశించేందుకు ఒక యుక్తి అతని మనసులో ఉదయించి అతనికి ఉత్సాహాన్ని పుట్టించింది.

“ఆపద కలగబోతుందన్న వార్తను విన్న వెంటనే అది తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరని వాడిని నేనింత వరకు చూడలేదు" - ఇలా కాలాముఖుల్లో ఒకరన్న మాటలు అతని మనసులో గట్టిగా పదిలమైనాయి. తానే అటువంటి అపాయానికి చోటిచ్చేశాడు కద? ఇప్పుడు దాన్నే యుక్తిగా తన వైపు మళ్ళించుకొని ప్రయోగించి చూడవలసిందే!

పద్మాకారపు స్వర్ణరథం వైపు అలిసిపోయిన తన గుర్రాన్ని వేగంగా పరుగెత్తించాడు వంతిదేవుడు.

మధురాంతక దేవుల పరివారంలో ఎవ్వరూ అలా ఒకడు చేయగలడని ఊహించను కూడ లేదు. కాబట్టి అతన్ని అడ్డగించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. గుర్రం రథాన్ని సమీపించేసింది. వంతిదేవుడు గుర్రం పైన లేచి నిలబడ్డాడు. మధురాంతకులను పరీక్షగా చూశాడు. చూసేసి, “ఓ! అయ్యయ్యో!” అని కేక వేశాడు. వెంటనే గుర్రం పైనుంచి ధడేల్మని కింద పడి దొర్లాడు.  గుర్రం కొన్ని అడుగులు ముందుకు వెళ్ళి నిలబడింది.

~

ఇదంతా కొన్ని క్షణాల్లో జరిగిపోయింది. మధురాంతకుల పరివారంలోని అందరు వీరులు అతని గుర్రం రథం వైపు వెళ్ళడం చూసి గాభరా పడి కత్తులు దూశారు. కొందరు శూలాలు గురి పెట్టారు. అంతలోపల అతడు గుర్రంపైన నిలబడజూసి కింద పడిపోవడంతో వారి దిగులు తొలగింది.

తర్వాత కింద పడినవాడిని చూసి అందరూ నవ్వారు. మధురాంతకులు కూడ నవ్వారు. అంతలోపల రథం అపివేయబడింది. అయన చేతితో సైగ చేయగానే ఇద్దరు వీరులు కిందపడ్డ వంతిదేవుని లేవనెత్తేందుకు ముందుకు వచ్చారు. అంతలోపల అతడే లేచి కూర్చొన్నాడు. వీరుల సహాయం తీసుకోకనే ఎగిరి లేచి నిలబడ్డాడు. తాను కిందపడ్డ విషయం గురించి ఏ మాత్రం పట్టించుకోనట్లు మధురాంతకులనే పరీక్షగా చూడసాగాడు.

“వాడినిలా దగ్గరకు తీసుకురండి!” అన్నారు యువరాజు. వీరులిద్దరు వంతిదేవుని చేయి

పట్టుకొని తీసుకువెళ్ళి రథం పక్కన నిలబెట్టారు. అప్పటికీ అతని కళ్ళు యువరాజు పైనుంచి పైదొలగలేదు.

"అబ్బాయ్! నీవెవరు?" అని యువరాజు అడిగారు.

"నేను ... నేనే! చక్రవర్తి! నేనెవరో తెలియడం లేదా?" అన్నాడు వంతిదేవుడు.

"ఏం వాగుతున్నావు? అరె! మీరు కాస్త పక్కకు తొలగండి!" అన్నారు మధురాంతకులు తక్కిన వీరులను చూసి. ఆ వీరులు పక్కకు తొలగారు.

"నన్ను ఎవరని అనుకొంటున్నావు?" అని మళ్ళీ అడిగారు మధురాంతకులు.

"క్షమించాలి, యువరాజా! పొరబాటుగా అన్నాను. మీరు ఇంకా ... ఇంకా ..." అని తడబడ్డాడు.

"ఇంతకు మునుపెప్పుడైనా నన్ను చూశావా?"

"చూశాను...లేదు...చూడలేదు..."

"నన్ను చూసివున్నావా? లేదా? నిజం చెప్పు!"

"నిన్నటి నుంచి నేను నిజమే చెప్పాలని తీర్మానించుకొన్నాను. అందుకే నిర్దుష్టంగా చెప్పలేకపోతున్నాను!"

"ఓహో! నిన్నటినుంచి నీవు నిజం మాట్లాడేవాడివా? మంచి చోద్యమే!" అని చెప్పేసి మధురాంతకులు నవ్వారు.

"అందువల్ల నిర్దుష్టంగా ఏం చెప్పలేకపోతున్నావు?" అని మళ్ళీ అడిగారు యువరాజు.

"ఈ రోజుల్లో ఏది నిర్దుష్టంగా చెప్పగలుగుతున్నాము? ఒకరిని పోలి ఇంకొకరుంటున్నారు. ఒకరోజు మూసిన పల్లకిలో ప్రయాణం చేసినవారు ఇంకొక రోజు రథంలో ప్రయాణం చేస్తున్నారు...."

"ఏమన్నావు?" అని ఉలిక్కిపడి కాస్త గొంతు తగ్గించి అడిగారు మధురాంతకులు.

"ఒకరిలాగ ఇంకొకరుంటున్నందువల్ల ఏదీ నిశ్చయంగా చెప్పలేకపోతున్నాను అని చెప్పాను!"

"నేను ఎవరిని పోలివున్నాను?"

"రెండుసార్లు నేను మిమ్మల్ని చూశాను. లేదా, మిమ్మల్ని పోలిన వారిని చూశాను. మీరు, మీరేనా, అంటే నేను చూసిన వారేనా అని సందేహంగా ఉంది. అది తెలుసుకోవడానికే కాసేపటికి మునుపు..."

"గుర్రం పైకెక్కి అలా చూశావా?"

"అవునయ్యా!"

"ఏం తెలుసుకొన్నావు?"

"మీరు నేను చూసిన వారైనా కావచ్చు, కాకుండాను పోవచ్చు - అని తెలుసుకొన్నాను."

మధురాంతకులకు కోపం వస్తూందని ఆయన ముఖమూ, గొంతూ తెలియజేశాయి,

"నీవు శుద్ధ పోకిరివి. నిన్ను...."

"యువరాజా! కోపించుకోకండి. నేను తమరినో, తమరిని పోలిన వారినో ఎక్కడ చూశానో చెబుతాను. తర్వాత మీరే తీర్మానించుకోండి."

"అలాగైతే త్వరగా చెప్పు!"

"ఒక పెద్ద కోట. నలువైపులా ఎత్తైన ప్రాకారపు గోడ. వీరాధివీరులు పలువురు ఆ కోటలో నివసిస్తున్నారు. మధ్యరాత్రి గోడకు తగిలించిన ఒక పెద్ద ప్రమిద నుంచి వస్తున్న మసక వెలుతురులో, వారు ఉద్రేకంగా మాట్లాడుకొంటున్నారు. గోడ వారగా ఒక పల్లకి నిలపబడివుంది. ఆ వీరుల నాయకుడిని తక్కినవారు ఏవో ప్రశ్నల మీద ప్రశ్నలు అడిగారు. ఆయనకు కోపం వచ్చేసింది. వేగంగా వెళ్ళి పల్లకి దగ్గర నిలబడ్డారు. పల్లకిని మూసివున్న తెరను తొలగించారు. పల్లకి లోపలినుంచి ఒక సుందర పురుషులు బయటికి వచ్చారు. ఆయనను చూడగానే అక్కడ సమావేశమైన వీరులందరూ "దీర్ఘాయు! దీర్ఘాయు!" అని ఘోషించారు. "పట్టపు యువరాజుకు జై!" అని కూడ కొందరు ఘోషించారు. "చక్రవర్తికి జై!" అని ఘోషించునట్లు కూడ జ్ఞాపకం అయ్యా! అప్పుడు పల్లకినుంచి బయటికి వచ్చినతని ముఖం మీ ముఖంలాగే ఉంది. నేనేదైనా పొరబాటుగా చెప్పివుంటే దయచేసి మన్నించాలి..."

~

ఇంతసేపూ అడ్డుపడకుండ వింటూన్న మధురాంతకుల నుదురు చెమర్చింది. ఆయన ముఖం మీద భయపు క్రీనీడలు పాకాయి.

"నిన్నటి నిజం చెబుతున్నవాడా! ఆ వీరుల గుంపులో నీవున్నావా?"

"లేదయ్యా! ప్రమాణం చేసి చెబుతున్నాను!"

"మరెలా పక్కనుండి చూసినట్లు చెబుతున్నావు?"

"నేను చూసిన దృశ్యం కలలో చూసిందా, లేక నిజమా అని నాకే తెలియడం లేదు. ఇంకొక దృశ్యం కూడ చెబుతాను, వినండి! చీకటి కమ్ముకొన్న ఒక నేల మాళిగ. అందులో ఒక సొరంగ మార్గం. వంపులు తిరిగి, కిందకు దిగి పైకెక్కి వెళ్ళవలసిన దారి. ఆ దారి గుండా ముగ్గురు వస్తున్నారు. ముందు ఒకడు దివిటీ పట్టుకొని వెళుతున్నాడు. వెనక ఒకడు కాపలా కాస్తూ వచ్చాడు. మధ్య ఒక సుందర పురుషులు - రూపంలో మన్మధుని వంటి రాజకుమారుడు - వస్తున్నారు. దివిటీ వెలుతురు ఆ నేలమాళిగ మూలలకు వ్యాపించినప్పుడు, అక్కడ బంగారం, మణి మాణిక్యాలు, వజ్ర వైఢూర్యాలు మిరుమిట్లుగొలుపుతూ కనిపించాయి. అది రాజాధిరాజుల రహస్య నిధులను దాచిపెట్టే నేలమాళిగ కావచ్చనిపించింది. స్తంభాలపైన భయంకరంగా అగుపించే భూతాల రూపాలు చెక్కబడివున్నాయి. అటువంటి రహస్య సొరంగ మార్గంలో వస్తున్న ముగ్గురిలో మధ్య ఉన్నవారి ముఖం మీ ముఖంలాగే తోచింది. అది నిజమా, కాదా అని మీరే చెప్పాలి...."

యువరాజు మధురాంతకులు, "ఆపు! ఆపు!" అని అరిచారు. ఆయన స్వరంలో భీతి

ధ్వనించింది.

వంతిదేవుడు ఆగాడు.

"నీవు నిమిత్తకారుడివా[1]? "

"లేదయ్యా! అది నా వృత్తి కాదు. కానీ జరిగిందీ చెబుతాను; ఇక మీదట జరగబోయేది కూడ చెబుతాను."

మధురాంతకులు కాసేపు ఆలోచించిన తర్వాత, "గుర్రంపైన నిలబడ్డప్పుడు ఏదో కేక వేశావు కద, అదేమి?" అని అడిగారు.

"అపాయం అని అరిచాను."

"ఎవరికి అపాయం?"

"మీకే!"

"ఏం అపాయం?"

"ఎన్నో అపాయాలు మిమ్మల్ని చుట్టుముట్టివున్నాయి. అదే విధంగా పెద్ద పదవులు కూడ వేచివున్నాయి. వాటి గురించి తీరిగ్గా చెప్పాలి. నా కత్తిని కూడ మీ వీరులు లాగేసుకొన్నారు కద? తమతో నన్ను కోట లోపలికి తీసుకొని వెళితే..."

"అలాగే కానీ. నాతో రా! తీరిగ్గా మాట్లాడుకొందాం!"

మధురాంతకులు తమతో వచ్చిన వీరుల నాయకుని చేత్తో సైగ చేసి పిలిచారు. వంతిదేవుని చూపించి అతన్ని తమతోబాటు కోటలోపలికి పిలుచుకొని రమ్మని ఆజ్ఞాపించారు. ఆ ఆజ్ఞ ఆ వీరుల నాయకునికి అంతగా ఉత్సాహాన్నివ్వలేదు. కానీ ఆజ్ఞకు లోబడి వంతిదేవుని తనతో పిలుచుకొని వెళ్ళాడు.

కాసేపటికల్లా పళైయార్రై కోట వాకిలి తెరవబడింది. మధురాంతక దేవులు, ఆయన పరివారం, వంతిదేవుడు కోట లోపల ప్రవేశించారు.

~~~

1 నిమిత్తకారుడు = జ్యోతిష్కులలాగ భూతభవిష్యత్తులు చెప్పేవారు
~~~

# అధ్యాయము - 16

## మధురాంతక దేవరు

**ఈ** కథలో ఒక ముఖ్యమైన పాత్ర అయిన మధురాంతకులను, కథారంభంలో కడంబూర్ మాళిగలో కలిశాము. ఇంకొకసారి పళువేట్టరయ్యర్ పాతాళ చెరసాల సొరంగ మార్గం గుండా అంత:పురానికి వెళుతుండగా చూశాము. అప్పుడల్లా ఆ ప్రసిద్ధిగాంచిన యువరాజును - పిదప కాలంలో పరకేసరి ఉత్తమ చోళుడు అన్న బిరుదుతో తంజావూరు సింహాసనాన్ని అధిష్టించబోయే ఆయనను - తగిన రీతిలో పాఠకులకు పరిచయం చేయలేదు. ఆ కొరతను ఇప్పుడు నివృత్తి చేయగోరుతున్నాము.

మధురాంతకులను గురించి చెప్పబోయేముందు ఆయన పరంపరను పాఠకులకు కాస్త జ్ఞప్తి చేయాలి.

సుందర చోళ చక్రవర్తికి ముందు చోళదేశాన్ని చాలకాలం పరిపాలించినవారు ఆయన పెదనాన్న గారైన గండరాదిత్య చోళులు. ఆయన, ఆయన ధర్మపత్ని మళవరయ్యర్ కూతురైన శెంబియన్ మహాదేవి పరమ శివభక్తులు. శివాలయ కైంకర్యంలోనే తమ జీవితకాలమంతా గడిపారు.

తమిళదేశమంతటా చెదరివున్న శివ స్తోత్రాలు [తిరుప్పదిగంగళ్] అన్నిటినీ సేకరించి కూర్చాలని గండరాదిత్యులు ఆశపడ్డారు. ఆ ఆశ ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. కానీ కొన్ని పాటలను సేకరించారు. దేవారాల శైలిలో తాము కూడ కొన్ని పాటలను రచించారు. ఆయన చిదంబరం గురించి రచించిన గీతం ఇప్పటికీ పాడబడుతోంది.

గండరాదిత్యులు తమ తండ్రిగారైన పరాంతక చోళులు తిల్లై దేవాలయ గోపుర విమానానికి బంగారు తొడుగు చేయించిన విషయమై ఒక గీతాన్ని రచించారు.

<< ఆ గీతాన్ని అనువదించవలసి ఉంది >>

ఆ పాటలో తమ తండ్రి పాండ్యనాడును, లంకను గెలిచారని సూచించారు. గీతం చివరి పాదంలో తమ పేరును సూచించడంతోబాటు చోళుల రాజధాని తంజావూరని కూడ సూచించారు.

గండరాదిత్యులకు యుద్ధాలు చేసి రాజ్యాన్ని విస్తరించడంలో నమ్మకముండేది కాదు. యుద్ధంవల్ల మనుషులకు కలిగే దు:ఖాలను చూసినవారైనందువల్ల యుద్ధాలను సాధ్యమైనంతవరకు దూరంగా ఉంచారు; శాంతిని, సహనాన్ని, సమరసాన్ని కోరుకొన్నారు. ఈ కారణాలవల్ల ఈయన కాలంలో చోళసామ్రాజ్యం చాలవరకు కుంచించుకుపోయింది.

~

గండరాదిత్యులు తమ వృద్ధాప్యకాలంలో మళవరయ్యర్ కుమార్తెను పెళ్ళాడారు. ఆయన

కుమారుడైన మధురాంతకుడు, ఆయన అంతిమకాలంలో చిన్నారి బిడ్డ. రాజ్యం చుట్టూ శత్రువులు తలెత్తుతున్న సమయం. అదే సమయాన గండరాదిత్యుల తమ్ముడు అరింజయుడు యుద్ధంలో మరణించాడు. అరింజయుని కుమారుడైన సుందర చోళుడు అప్పటికే పలుయుద్ధాలలో పోరాడి, విజయ శంఖం పూరించి, మహావీరుడన్న పేరు పొందడం వల్ల, గండరాదిత్యులు తమ తర్వాత సుందరచోళుడే పట్టానికి అర్హుడని తమ కుటుంబీకులకు చెప్పేశారు. మున్ముందు సింహాసనం గురించి కలహాలు రాకూడదన్న ఉద్దేశంతో సుందర చోళుని సంతతే సింహాసనానికి అర్హులని కూడ అందరికీ చెప్పేశారు.

తమ కుమారుడు మధురాంతకుని శివభక్తునిగా పెంచి శివకైంకర్యంలో జీవితకాలం సేవ చేయాలని తమ పత్నికి కూడ చెప్పి ఒప్పించారు. ఇవన్నీ ఆ కాలంలో దేశమంతటా విదితమైన విషయాలుగా ఉండేవి.

శెంబియన్ మహాదేవి తమ భర్తకిచ్చిన మాటను నెరవేర్చారు. మధురాంతకుని చిరుప్రాయం నుంచే అతని మనసులో శివభక్తిని, లౌకిక విషయాలపైన వైరాగ్యాన్ని కలిపించి పెంచుతూ వచ్చారు.

ఇంచుమించు ఇరవైయేళ్ళ ప్రాయం వరకు మధురాంతకుడు తల్లి వాక్కే వేదవాక్కుగా శిరసావహిస్తూ వచ్చాడు. రాజ్య వ్యవహారాలలో అతడికి ఏమాత్రం ఆసక్తి పుట్టలేదు. చోళ సింహాసనానికి తాను అర్హుడనన్న ఉద్దేశమే అతని మనసులో ఉదయించలేదు.

~

రెండేళ్ళ క్రితం చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెను పెళ్ళాడినప్పటి నుంచి ఆయన మనసులో మార్పు కానరాసాగింది. మొట్టమొదట చిన్నగా తలెత్తిన ఆ ఆశకు పళువూర్ యువరాణి నందిని ధూపం వేసి పెంచి పెద్దది చేసింది. చిన్న నిప్పురవ్వ అతిత్వరలో దావానలమైపోయింది. పలుకారణాల వల్ల చోళసామ్రాజ్యపు పలువురు సామంతరాజులు, పెద్ద అధికారులు మధురాంతకుని ఆదరించి కుట్ర చేయడానికి ముందుకు రావడాన్ని మనమిప్పటికే చూశాము. మధురాంతకుని సింహాసనమెక్కించేందుకు సుందర చోళ చక్రవర్తి కన్ను మూసే సమయంకోసం వారు ఎదురుచూడసాగారు. కానీ మధురాంతకుడేమో అంతవరకు వేచివుండేందుకు ఇష్టపడడం లేదు. సుందర చోళులకు సింహాసనం పైన హక్కు లేదని, తనకే సింహాసనం వచ్చివుండాలని అతడు భావించనారంభించాడు. అదీగాక, సుందర చోళ చక్రవర్తి జబ్బుపడి మంచం పట్టేసి రాజ్యాన్ని చూసుకొనే పరిస్థితిలో లేరు కద? కాబట్టి తానెందుకు వెంటనే సింహాసనాన్నెక్కి రాజ్యాన్నేలకూడదు?

ఇలా మధురాంతకునికి ఏర్పడ్డ నడమంత్రపు అధికారదాహాన్ని అదుపులో ఉంచే బాధ్యత పెద్ద పళువేట్టరయ్యర్ భుజాల మీద పడింది. తొందరపడి కార్యాన్ని చెడగొట్టడం ఆయనకు ఇష్టం లేదు. సుందర చోళుల ఇద్దరు కుమారులు కూడ వీరాధివీరులు. వారు వీరకృత్యాల వల్లను, గుణసంపన్నత వల్లను ప్రజల అభిమానాన్ని చూరగొన్నవారు. కొడుంబాళూర్ వేళార్, తిరుక్కోవాలూర్ మలైయమాన్ అనే ఇద్దరు

మహానాయకులు సుందర చోళ చక్రవర్తి ఇద్దరు కుమారులను ఆదరించి వారికి అండగా నిలబడివున్నారు. సైన్యంలోకూడ చాలమంది వీరులు సుందరచోళుల కుమారులనే కోరుకొంటున్నారు. కాబట్టి సుందరచోళ చక్రవర్తి ప్రాణాలతో ఉన్నంతవరకు ఓపిక పట్టాలని ఇద్దరు పళువేట్టరయ్యర్లు తీర్మానించారు. ఇంతలోపల చక్రవర్తి మనసు కూడ కాస్త మారివుండడాన్ని వారు గమనించారు. తమ తర్వాత మధురాంతకునికే పట్టం కట్టాలని సుందర చోళ చక్రవర్తే చెప్పేస్తే ఆ తర్వాత ఏ తంటా లేదు. ఆడ్డుపడి అది జరగకుండ చేయగలవారు ఇద్దరు మాత్రమే - యువరాకుమారి కుందవైదేవి, శెంబియన్ మహాదేవి. యువరాకుమారి యుక్తులకు ప్రతియుక్తి పన్ని గెలిచేయవచ్చు. కానీ తమిళదేశమంతా దైవాంశసంభూతురాలని పేనోళ్ల పొగడబడుతున్న శెంబియన్ మహాదేవి అడ్డుపడి నిలబడితే, ఆ ఆటంకాన్ని దాటడం సులభంకాదు. ఆ మహారాణి తాను కన్న కుమారుడు సింహాసనమెక్కాలని కోరుకోవడం లేదని దేశమంతటా తెలిసిన విషయమే. తల్లి మాటను మీరి కొడుకు సింహాసనమెక్కడాన్ని దేశప్రజలు ఎలా ఒప్పుకొంటారు? దీనికి పరిష్కారం వెతకాలంటే రెండే మార్గాలు - ఒకటి, ఆ అమ్మ కూడ తమ పతి వెంబడే కైలాసానికి వెళ్ళాలి; లేదా ఆమె మనసును మార్చాలి. కన్నతల్లి మనసు మార్చే శక్తి, కన్న కొడుకుకు తప్ప ఇంకెవరికుంటుంది?

కాబట్టి తల్లి మనసును మార్చమని మధురాంతకుని పళువేట్టరయ్యర్లు తరచూ ఎగదోయసాగారు. మధురాంతకులు ఈ కార్యంలో మాత్రం ఉత్సాహం చూపలేదు. రాజ్యమేలాలనే ఆశ ఆయన మనసులో వెర్రిగా పెరిగి పాతుకొంది. కానీ తల్లి దగ్గర దాని గురించి మాట్లాడేందుకు జంకారు. ఆ మహారాణితో మాట్లాడేందుకే ఆయన ఇష్టపడలేదు.

ఇప్పుడు శెంబియన్ మహాదేవిగారే తంజావూరుకు సందేశం పంపించారు. తమ భర్త కోరికల్లో ఒక ముఖ్యమైన కోరికను నెరవేర్చేందుకు తీర్మానించారని, అందుకు తమ కుమారుడు తమ వద్ద ఉండాలని సందేశం పంపారు. అలాగేనని చిన్న పళువేట్టరయ్యర్ మధురాంతకులను పళైయారైకి వెళ్ళి రమ్మని చెప్పారు. ఈ సందర్భాన తంజావూరు సింహాసనంపై తమకున్న హక్కు గురించి తల్లితో వాదించి వారి మనసును మార్చమని కూడ చెప్పి పంపారు.

~~~
~~~

# అధ్యాయము - 17

## తిరునారయ్యూర్ నంబి

**మధురాంతక దేవరు** తమ పరివారం, వంతిదేవుని సమేతంగా పళైయార్తై నగరంలో ప్రవేశించారు. యుద్ధవీరులు నివసించే ఇళ్ళ వీధుల గుండా ఊరేగింపు వెళ్ళింది. తర్వాత అంగడి వీధులు, ఊరి ప్రజలు నివసించే వీధులు, ఆలయాలు, ఆలయాల చుట్టూ ఉన్న సన్నిధి వీధుల గుండా వెళ్ళింది. అక్కడక్కడ ఊరి ప్రజలు తమ ఇంటి వాకిట నిలబడి ఊరేగింపును చూశారు. కానీ ప్రజల్లో ఎటువంటి ఉత్సాహమూ లేదని వంతిదేవుడు గమనించాడు. ఇంతకు మునుపు అతడు ఈ నగరానికి వచ్చినప్పుడు చాల సందడిగా ఉండేది. ఇప్పుడు వీధుల్లో జనసంచారమే లేదు. పళైయార్తై పాడుబడ్డ నగరమా అన్నట్లుంది. పళైయార్తై ప్రజలకు మధురాంతకుల మీద ఏమంతగా ప్రీతి, అభిమానం లేదని తేటతెల్లగా తెలిసిపోతోంది. వంతిదేవునికి ఇది ఒక విధంగా అనుకూలమైంది. తన ముఖం తెలిసిన వారెవరైనా తనను చూడడం, అందువల్ల లేనిపోని ఇక్కట్లు రావడం జరగదు కద?

వారు చోళరాజుల పురాతన అంతఃపుర వీధిని సమీపిస్తున్నప్పుడు ఇంకొకవైపు నుంచి మరొక పెద్ద ఊరేగింపు వస్తుండడాన్ని గమనించాడు. ఆ ఊరేగింపు మధ్య ఒక తెరచిన పల్లకి వస్తుండడాన్ని గమనించారు. అందులో వస్తున్నవారెవరని తెలియకపోయినా, వారు శివభక్తులని, లేతప్రాయంవారని తెలిసింది. పల్లకి ముందు, వెనుక కూడ ప్రజల గుంపు అధికంగా ఉంది. చేతనున్న చిడతలను, తాళాలను వీనుల విందుగా వాయిస్తూ, కమ్మగా పాడుతూ పల్లకి ముందు, వెనక నడుస్తూ వస్తున్నారు వారు.

మధ్య మధ్య "తిరు చిట్టంబలం", “హరహర మహాదేవ్" అన్న ఘోషలు, “తిరునారయ్యూర్ నంబి చిరకాలం జీవించాలి!”, “పొల్లా పిళ్ళైయార్ ప్రియ పుత్రునికి జయహో!” అన్న ఘోషలు కూడ వినవచ్చాయి.

మధురాంతకులు ఆ ఊరేగింపును అసూయ నిండిన కళ్ళతో చూశారు. పక్కనున్న వీరుని చూసి ఏదో అడిగారు. “అవునయ్యా! పల్లకిలో వస్తున్నవారే తిరునారయ్యూర్ నంబి!” అని ఆ వీరుడు సమాధానమిచ్చాడు.

“అయినా కూడ, ఏమా అట్టహాసం! ఈ ఊళ్ళో మనని అడిగేవారు, చూసేవారే లేనట్లుంది! ఈ నంబి చుట్టూ చేరి జనాలింత ఆర్భాటం చేస్తున్నారేం?” అన్నారు మధురాంతకులు.

ఆ ఊరేగింపు వీరున్న చోటికి కాస్త దూరంగానే వెళ్ళింది. కానీ, పల్లకి సమీపాన నడిచి వెళుతున్న ఒకాయన, ఇంతకు మునుపు ఒకసారి తాను కొళ్ళిడం నదిని పడవలో దాటుతున్నప్పుడుఅదే పడవలో ఆళ్వార్ కట్టియాన్‌తో దెబ్బలాడిన వీరశైవులేనని గ్రహించాడు వంతిదేవుడు.

~

మధురాంతక దేవరు, వారి పరివారం అంత:పుర వీధిలో ప్రవేశించి శెంబియన్ మహాదేవి అంత:పురాన్ని చేరుకొన్నారు. అంత:పురం వాకిటనే ఆ మహారాణి నిలబడివున్నారు. ఎవరినో ఆహ్వానించేందుకే ఆయత్తమైవున్నారని తోచింది. మధురాంతకులు రథం దిగి తల్లి చెంతకు వెళ్ళి నమస్కరించారు. నమస్కరించిన మధురాంతకుల తల నిమిరి ఆశీర్వదించారు శెంబియన్ మహాదేవి. తర్వాత, "బిడ్డా! మంచి సమయానికి వచ్చి చేరావు! తిరునారయ్యూర్ నంబి వస్తున్నారు. అవసరమైతే కాస్త సేదదీరి త్వరగా సభామంటపానికి వచ్చేయి!" అన్నారు.

మధురాంతకుల ముఖం కాంతిహీనం కావడాన్ని వంతిదేవుడు గమనించాడు. పాపం! తమను ఆహ్వానించేందుకే ఆ మహాతల్లి అంత:పురం వాకిట నిలబడ్డారని మధురాంతకులు భావించారు కాబోలు! ఎంత నిరాశ! పల్లకిలో వస్తున్న శివభక్తుని ఆహ్వానించేందుకే వారు వేచివున్నారని తెలిసిన వెంటనే మధురాంతకులకు, - రేపు చోళ సింహాసనమెక్కుదాం అని ఆశ పడుతున్నాయనకు - ఆశాభంగం కావడం సహజమే కద?

అంత:పురంలో మధురాంతకులకని ప్రత్యేకించబడిన భాగానికి అందరూ వెళ్ళారు. మధురాంతకులు బట్టలు మార్చుకోవడం వగైరా చాల నిదానంగానే చేసుకోసాగారు. సభామంటపానికి వెళ్ళేందుకు అంతగా కుతూహలపడుతున్నట్లు కనిపించలేదు. తల్లి దగ్గరనుంచి ఒకరి తర్వాత మనుషులు వస్తున్నారు, ఆయనను పిలుచుకొని వెళ్ళేందుకు. చివరకు, మధురాంతకులు సిద్ధమై బయలుదేరారు. బయలుదేరేటప్పుడు, "ఆ నిమిత్తకారుడెక్కడ?" అని మెల్లగా సణిగారు. ఆయనతోబాటు సభామంటపానికి వెళ్ళేందుకు ఉవ్విళ్ళూరుతున్న వంతిదేవుడు, "ఇదిగో, సిద్ధంగా ఉన్నాను!" అన్నాడు. అతన్ని, ఇంకొందరు పరివారజనాన్ని వెంట తీసుకొని మధురాంతకులు సభామంటపానికి వెళ్ళారు.

మంటపంలో అప్పటికే సభ ప్రారంభమైంది. ఒకవైపు శెంబియన్ మాదేవి, కుందవై రాకుమారి, ఇంకొందరు అంత:పురస్త్రీలు ఆసీనులై ఉన్నారు. సభ మధ్య అమర్చిన ఒక పీఠంపైన ఒక యువకుడు ఆసీనుడైవున్నాడు. ఆయన చిరుప్రాయపువారు. విభూతి, రుద్రాక్షలు ధరించారు. ఆయన ముఖం కళకళలాడుతూ, తేజోవంతంగా ఉంది. ఆయన ముందు కొన్ని తాళపత్ర గ్రంధాలున్నాయి. చేతగూడ ఒక తాళపత్ర గ్రంధముంది. ఆయన సమీపాన పెద్దాయన ఒకరు (విభూతి, రుద్రాక్షలు ధరించినవారు) పరవశించి నిలబడివున్నారు. ఇంకా, సభామంటపంలో ప్రజలు పలువురు సమావేశమైవున్నారు. ఆయనతోబాటు పల్లకి పక్కన వచ్చినవారు, ఇప్పుడు ఆయన పక్కన నిలబడ్డాయన, తాను ఇంతకు మునుపు కొళ్ళిడంలో చూసిన వీరశైవులేనని వంతిదేవుడు గ్రహించాడు. అతని కళ్ళు సభామంటపంలో అటూ ఇటూ తిరుగాడినా, చివరికి పెద్దరాణి పక్కన కూర్చొన్న కుందవైదేవి దివ్యవదనం పైన నిలిచాయి. ఆమె కళ్ళేమో అతన్ని మొదటిసారి చూస్తున్నట్లు ఆశ్చర్యాన్ని కనబరిచాయి. తర్వాత ఆమె కళ్ళు అతనివైపు మళ్ళినట్లే కనిపించలేదు. తనను ఒకవేళ గుర్తుపట్టలేదేమో అన్న సందేహం కూడ కలిగిందతనికి.

~

మధురాంతకులు సభలో ప్రవేశించగానే, స్త్రీలు తప్ప తక్కినవారందరూ గౌరవసూచకంగా లేచి నిలబడ్డారు. ఆయన తమ పీఠంపైన ఆసీనులు కాగానే తక్కినవారందరూ తమతమ స్థలాల్లో కూర్చొన్నారు.

శెంబియన్ మహాదేవి మధురాంతకుని చూసి, "కుమారా! ఈ చిరుప్రాయపు నంబి తిరునారయ్యూరుకు చెందినవారు. ఆ ఊరిలోని పొల్లా పిళ్ళైయార్ (గణపతి) సంపూర్ణ అనుగ్రహాన్ని పొందినవారు. ఇది వరకు ఎవరికీ దొరకని దేవారాలు (దైవగీతాలు) వీరికి లభించాయి. పూర్వకాలంలో మన చోళవంశంలో ఉదయించిన ఒక స్త్రీమణి పాండ్యనాడుకు మహారాణిగా విరాజిల్లింది. ఆ రాణి ఆహ్వానించగా జ్ఞాన సంబందర్ మదురై మహానగరానికి వెళ్ళారు. అక్కడి జైనులను వాగ్యుద్ధంలో ఓడించారు. అప్పుడు జ్ఞాన సంబందర్ పాడిన కొన్ని గీతాలు ఈయనకు చిక్కాయి. వాటిలో సంబందర్ మన చోళవంశపు స్త్రీమణి గురించి పాడిన పాట కూడ ఈయనకు దొరికింది. ఆ పాటలను వినేటప్పుడల్లా నా ఒళ్ళు పులకరిస్తుంది. నీ తండ్రి ఉంటే విని ఎంతో ఆనందపడేవారు. నీవైనా విను!" అన్నారు.

మధురాంతకులు, "వింటాను, తల్లీ! గీతాన్ని ప్రారంభించనీ!" అన్నారు. కానీ ఆయన ముఖం అంతగా విప్పారలేదు. ఆయన మనసు ఇంకెక్కడో ఉంది. విభూతి, రుద్రాక్షలు ధరించిన ఒక సాధారణ యువకుని ఒక పెద్ద పీట పైన కూర్చోబెట్టి ఆర్భాటం చేయడం కూడ ఆయనకు అంతగా రుచించలేదు. తల్లిని సంతృప్తి పరచడం కోసం ఓర్పుతో కూర్చొన్నారు.

~

పొల్లా పిళ్లైయార్ అనుగ్రహం పొందిన తిరునారయ్యూర్ నంబియార్ నంబి తమ చేతనున్న తాళపత్రం నుంచి చదవనారంభించారు. జ్ఞాన సంబందర్ మదురై మహానగరాన్ని చూసి, "శివభక్త శిఖామణియైన మంగైయోర్కరసి (= స్త్రీ/మహిళా శిరోమణి) నివాసం కద ఇది" అని ఆశ్చర్యపడి పాడిన పాటలను ఆయన మొదట పాడారు.

ఆ పాటలను విన్నప్పుడు శెంబియన్ మహాదేవి కళ్ళనుంచి ఆనంద బాష్పాలు ధారగా స్రవించాయి. అటువంటి వనితా శిరోమణి పుట్టిన చోళవంశంలో తాను కూడ పుట్టి మహారాణిగా విరాజిల్లుతుండడం తమ పూర్వజన్మ సుకృతమని తలిచి మురిసిపోయారు.

మధురాంతకులకేమో ఆ పాటలో 'మణిమకుటం' గురించిన పాదం మాత్రమే చెవికెక్కి మనసులో పదిలమైంది. అటువంటి ప్రసిద్ధిగాంచిన చోళసామ్రాజ్యపు మణిమకుటం తన శిరస్సును అలంకరించక ఇంకొకరి శిరస్సును అలంకరించి ఉండడాన్ని తలుచుకొన్నప్పుడు ఆయనకు ఉక్రోషం పొంగుకొచ్చింది.

~

సంబందర్ ఆ చోళవంశపు మహారాణిని వెళ్ళి చూస్తారు. పాండ్య మహారాణి ఆ బాలకుని చూసి,

“అయ్యో! ఈ బాలకుడెక్కడ? బ్రహ్మరాక్షసుల వంటి ఆ జైనులెక్కడ? ఈ చిన్నారి వారిని వాగ్యుద్ధంలో ఎలా గెలవగలడు?” అని దిగులుపడ్డారు. అది గ్రహించిన సంబందర్ పాండ్య మహారాణిని చూసి ఇలా అంటారు :-

<< సంబందర్ ఆ మహారాణికి తాను గెలవగలనని చెప్పిన పద్యం >>

ఆ పద్యాన్ని తిరునారయ్యూర్ నంబియార్ నంబి పాడినప్పుడు, తమనే ఆ చోళవంశపు మహారాణిగాను, పద్యాన్ని పాడిన నంబినే తిరుజ్ఞాన సంబందర్‌గాను ఊహించుకొని పరశించిపోయారు.

మధురాంతకులేమో, “అవును; నేను లేతప్రాయపు చిన్నవాడినే! కానీ తిరుక్కోవలూర్ మలైయమాన్‌కి, కొడుంబాళూర్ బూది విక్రమకేసరికి వారి ఆదరణను పొందిన సుందర చోళ చక్రవర్తి కుమారులకు భయపడను. సంబందర్‌కి ఆలవాయన్ అనుగ్రహం కలిగినట్లే నాకు పళువేట్టరయ్యర్ల అండ ఉంది!” అని మనసులో అనుకొన్నారు.

వంతిదేవుని చెవిలో ఈ పాటలేవీ దూరనేలేదు. అతని కళ్ళు, మనసు కుందవై దేవి మీదే లగ్నమై/నిమగ్నమై ఉన్నాయి. యువరాకుమారి ఒకవేళ తనను గుర్తుపట్టలేదా, గుర్తుపట్టి కూడ తెలియనట్లు నటనా, లేక ఒప్పజెప్పిన పని నెరవేర్చిన తర్వాత వచ్చి చెప్పలేదని కోపమా? - అతని మనసిలా పలువిధాలుగా ఆలోచించసాగింది. దానికి తోడు యువరాకుమారిని ఏకాంతంగా ఎప్పుడు, ఎక్కడ కలవాలి, అదెలా సాధ్యమయ్యేలా చేయడం, చూసి సంగతిని ఎలా తెలియజెప్పడం అని అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

~

పాటలు ముగియగానే శెంబియన్ మహాదేవి నంబితో వచ్చిన పెద్దాయనను చూసి, “అయ్యా! ఈ బాలకుని చూస్తుంటే జ్ఞాన సంబందరే మళ్ళీ అవతరించినట్లుంది. ఈయనను పిలుచుకొని తమిళనాడంతా ఊరూరా వెళ్ళండి. అక్కడక్కడ దొరికే దేవార గీతాలను సేకరించి తీసుకొని రండి. అప్పర్ పద్యాలను, సంబందర్ పద్యాలను, సుందరమూర్తి పద్యాలను వేర్వేరుగా కూర్చాలి. శివాలయాలన్నింటిలోను ప్రతి దినమూ పాడాలి. ఇది నా భర్త కోరిక. దాన్ని నా జీవితకాలంలో నెరవేర్చి చూడాలని నా ఆశ. మీరు ఊరూరా వెళ్ళేందుకు కావలసిన పల్లకీలు, మనుషులు, పరివార సాధనాలు, - అన్నీ ఏర్పాటు చేయిస్తాను. చక్రవర్తి అనుమతి కోరుతూ నా కుమారుని చేతనే నా విన్నపాన్ని రాసి పంపిస్తాను!” అన్నారు. అప్పుడు ఆ సభామంటపంలో లేచిన జయఘోషలు మధురాంతకుల చెవులకు ఏ మాత్రం రుచించలేదు.

~~~
~~~

# అధ్యాయము - 18

## నిమిత్త కారుడు

**నంబియార్** నంబిని స్వాగతించేందుకు సమావేశమైన సభ ముగిసేటప్పుడు పెద్ద మహారాణి తమ కుమారుని చూసి, "కుమారా! నేను వీరిని అంత:పురం వాకిటి వరకు సాగనంపి వస్తాను. అంతలోపల నీవు నీ గదికి వెళ్ళి విశ్రాంతి తీసుకొని రా! నేను నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి!" అన్నారు.

"అలాగేనమ్మా!" అని చెప్పి మధురాంతకులు అంత:పురంలో తాను విడిది చేసిన గదికి వెళ్ళారు. ఆయన మనసులో కోపం, అసూయ భగ్గున లేచాయి. ఎవరో దారిన పోయే దానయ్యకు ఎంతటి ఆర్భాటపు ఉపచారం! రాజవంశ గౌరవానికే తమ తల్లి వల్ల భంగం కలుగుతుంది కాబోలు! పళువేట్టరయ్యర్లు తమ తల్లి గురించి తరచూ లోకువగా మాట్లాడడంలో ఆశ్చర్యం లేదు. పెద్ద మహారాణికి ఒంటిమీద విభూతి రాసుకొని, మెడలో రుద్రాక్షలు వేసుకొని ఎవరొచ్చినా చాలు! వాడు పద్యమొకటి పాడుకొంటూ రావాలి! లేదా, గుళ్ళు, గోపురాలు, కైంకర్యాలు అని చెబుతూ వస్తే చాలు! ఇటువంటి వారికి చేతిలో ఎముక లేనట్లు దానాలు చేసి రాజ్యం ఖజానానే గుల్ల చేసేస్తారు కాబోలు! అది చాలదన్నట్లు యువరాకుమారి కుందవై ఎప్పుడూ పక్కనే ఉంటూంది. వాళ్ళకిచ్చి ఏమైనా మిగిలితే దాన్ని వైద్యశాలలు కట్టించేందుకు ఖర్చు చేస్తుంది. వీరికి ఇలా ఖర్చు చేయడానికి చోటిస్తే రేపు తమ మనోరథం నెరవేరేదెలా? చోళ సైన్యాన్ని నలుదిశలా పంపించి ఈ భూమండలాన్నంతటినీ ఒకే ఛత్రం కింద ఏలడం ఎలా సాధ్యమవుతుంది?

మళ్ళీ పెద్ద మహారాణి తమ కుమారునితో అంతరంగంగా మాట్లాడాలట! అష్టాంగ యోగం, నియమ నిష్టలు మొదలైనవాటిని గురించి మాట్లాడేందుకు మొదలు పెట్టేస్తారేమో. కంటి చూపును ముక్కు కొనపైన నిలిపి, కుండలిని పైకి చూస్తూ రావడం వల్ల అరవై నాలుగు కళలను నేర్చుకోకుండానే ఎలా నేర్చుకోవచ్చో ఉపదేశిస్తారు! లేక, నటరాజు చేసే ఆనంద నృత్యం అంతరార్థం గురించి, ఆయన జటామకుటం గురించి చెప్పడానికి మొదలు పెడతారు. ఇలాగల్లా ఉపదేశించడంవల్లనే, లోకం తమను సగం పిచ్చివాడని పరిహసించే స్థితికి తీసుకొని వచ్చేశారు. అటువంటి మాటలకు, ఉపదేశాలకు ఇక అవకాశమివ్వకూడదు. మాట్లాడే తీరుతానంటే, మనం చెవిన వేసుకోకూడదు....

ఉండనీ; తల్లి తమకోసం మళ్ళీ కబురు పంపించే లోపు ఆ నిమిత్తకారునితో మాట్లాడాలి; తన భవిష్యత్తు గురించి అడగాలి. ఇంకెవ్వరికీ తెలిసేందుకు అసాధ్యమైన రెండు నిగూఢ విషయాలు అతడికెలా తెలిశాయి? అది తలుచుకొంటే అమితాశ్చర్యంగా ఉంది! అతడి దగ్గర ఏదో ఒక విచిత్రమైన శక్తి ఉండి తీరాలి. జరిగిన సంఘటనలను తెలుసుకొని చెప్పినట్లే, జరగబోయే సంఘటనలు కూడ అతడు చెప్పగలడా? -

అతన్నే అడిగి చూడాలి.

~

సభనుంచి తాము బయలుదేరేటప్పుడు ఆ నిమిత్తకారుడు అటూ ఇటూ చూస్తూ జంకుతూ నిలబడ్డాన్ని మధురాంతకులు గమనించారు. అతన్ని తమతో రావలసిందిగా సైగతో ఆజ్ఞాపించారు. వంతిదేవుడు యువరాకుమారితో కనుసైగలతో మాట్లాడేందుకు ఆదుర్దా పడసాగాడు. కానీ యువరాకుమారి అతన్ని తిరిగి కూడ చూడక, పెద్ద మహారాణితో వెళ్ళిపోయింది.

ఇదేమి? యువరాకుమారి తనను పూర్తిగా మరిచిపోయిందా? అలాగే ఉండాలి. ప్రతిరోజు ఆమె ఎందరినో చూస్తూంటుంది. ఒకటి రెండు సార్లు మాత్రం చూసిన తనను గుర్తుంచుకోవడం కష్టమే మరి. తానొక వెర్రివాడు; రాత్రింబగళ్ళూ ఎన్నెన్నో విపరీత సంఘటనలు, అపాయాల మధ్య యువరాకుమారి దివ్య వదనాన్నే గుర్తు తెచ్చుకొనేవాడు. ఆమె ఎందుకు తనను జ్ఞప్తికి తెచ్చుకోవాలి? తేనెటీగ తేనె కోసం పూవు చుట్టూ తిరుగుతూంటుంది. పూవుకు తేనెటీగ గురించి దిగులేల? ఆ పూవు సూర్యుని చూసి చిరునవ్వు నవ్వుతోంది. కుందవై దేవి ముఖారవిందాన్ని విప్పారించే సూర్యదేవుడేవరో...?

కానీ తనను ఎందుకు పంపించిందో ఆ సంగతి తెలుసుకోవడానికి కూడ ఆమెకు ఆసక్తి లేదా, ఏమి? తనకన్న ముందు ఎవరైనా వచ్చి చెప్పేశారా? అదెలా సాధ్యం? లేదు, లేదు! వారు ఏదో దిగులులో మునిగిపోయినట్లు వారి ముఖం బాగా తెలియజేసింది. అంతరంగ తాళపత్ర సందేశాన్ని తీసుకొని లంకకు వెళ్ళిన దూత, మధురాంతకుల పరివారంలో ఒకడుగా తిరిగివస్తే ఎలా గుర్తుపట్ట సాధ్యం? ఆహా! యువరాకుమారిని కలిసి, తాను ఈ నగరం లోపల ప్రవేశించేందుకు పన్నిన యుక్తిని వివరించి చెబితే ఎంత ఆశ్చర్యపోతారో కద? కానీ కలవడమెలా?

"నిమిత్తకారుడా! ఏమాలోచనలో మునిగిపోయావు?" అన్న మధురాంతకుల గొంతు విని వంతిదేవుడు ఉలిక్కి పడ్డాడు. అంతలో వారు మధురాంతకుల ఏకాంతమందిరాన్ని చేరుకొన్నారు.

~

ఆ కాలంలో జ్యోతిష్కులు, హస్త సాముద్రికులు, రేఖాశాస్త్రజ్ఞులు, నిమిత్తకారులు అని రాబోయే కాలం గురించి చెప్పేవారు పలువురుండేవారు. జ్యోతిష్కులు జాతకాన్ని చూసి, గ్రహాలు, నక్షత్రాల గతిని చూసి జ్యోతిష్కం చెప్పేవారు. రేఖాశాస్త్రమేమో, ఆ రోజుల్లో ఎలా ఉండేదో ఇప్పుడు కూడ అలాగే ఉంది.

~

నిమిత్తకారులు జ్ఞానదృష్టి కలిగిన మునిపుంగవులు అంతర్నేత్రంతో చూసి చెప్పగల శక్తి కలిగినవారు. వారు ఏకాగ్రదృష్టితో తమ అంతర్నేత్రం ముందు నిజంగా జరుగుతున్నట్లు భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను చూసి చెబుతారు. కొందరు బాహ్యానేత్రాలను మూసి, ధ్యానంలో మునిగి, భవిష్యత్తు గురించి చెబుతారు; ఇంకొందరు దీపకాంతిని చూస్తూ జరిగినవి, జరగబోయేవి చెబుతారు.

ఇంకొందరికి ఎదురుపడ్డ వారి ముఖం చూడగానే వారి గత వృత్తాంతము, భవిష్యత్కాల వృత్తాంతమూ తెలిసిపోతాయి. ఇటువంటి అద్భుత శక్తులు పొందినవారేగాక, కాకి కుడివైపు వెళ్ళిందా, ఎడమ వైపు వెళ్ళిందా అని శకునాలు చూసి వాటి ఆధారంగా ఫలితాలు చెప్పే సాధారణ నిమిత్తకారులు కూడ ఉండేవారు.

వంతిదేవుడు మధురాంతకులు తమను "నిమిత్తకారుడా!" అని పిలవగానే అదిరిపడ్డాడు. యువరాజు ఇంకా తననేం ప్రశ్నలు అడగబోతారో తెలియదు. వాటికన్నిటికీ సమర్థవంతంగా సమాధానాలిచ్చి నిభాయించుకోవాలి. దైవమా! ఇక్కడినుంచి తప్పించుకోవడమెలా? యువరాకుమారిని ఏకాంతంగా కలిసి మాట్లాడడమెలా?

“ఇంకేమీ ఆలోచనలు లేవయ్యా! నేను నిమిత్తకారుడనైనందువల్ల సభలో చూసిన ఆ అబ్బాయిలాగ నాలుగు పద్యాలు నేర్చుకొనివుంటే ఎంతో బాగుండేది. నాక్కూడ ఎన్నెన్నో ఉపచారాలు, మర్యాదలు జరిగేవి కద అని ఆలోచిస్తున్నాను!” అన్నాడు.

“ఎవరు వద్దన్నారు? నీవు కూడ దేవారాలు, భక్తి గీతాలు నేర్చుకొని పాడవచ్చు కద?”

“ఎవరు ఏం చేయాలని రాసిపెట్టివుంటే అలాగే కద జరుగుతుంది, యువరాజా? ఊరకే ఆశపడి ఏం ప్రయోజనం?”

“పద్యాలు పాడిన ఆ అబ్బాయి గురించి నీకేమనిపిస్తోంది? వాడి యోగం....”

“ఉన్నతమైన యోగం. శివయోగం, రాజయోగం కలిసిన యోగం. రాజులు, రాణులు అతనికి మర్యాదలు చేస్తారు. మహానుభావుల పేర్లతో చేర్చబడి అతని పేరుకూడ ఈ భూలోకంలో చాలకాలం విరాజిల్లుతుంది.”

వల్లవరయ్యన్ ఇలా ఏదో గుడ్డిగా చెప్పాడు. కానీ మధురాంతకుల మనసులో అతడి మాటలు పెద్ద దుమారాన్నే లేపేశాయి.

“నా యోగం ఎలా ఉందో చెప్పు, చూద్దాం!”

“అతడి యోగం లాంటిదే మీది కూడాను; శివయోగం, రాజయోగం కలిసిన యోగం. కానీ ఇంకా మేలైనది.”

“కాస్త వివరంగా చెప్పు!”

వల్లవరయ్యన్ ఏం చెప్పాలని ఆలోచించేందుకు కాస్త వ్యవధి కావాలని కోరుకొన్నాడు. కాబట్టి, “ఇలా తొందరపడితే వీలవుతుందా? దీపం వెలిగించి, అగరు వత్తి పొగవేసి చూడాలి. మీరు దీపం వెనక కూర్చోవాలి. అప్పుడు జరగబోయే సంఘటనలను చూసి చెబుతాను.”

~

మధురాంతకులు ఆదుర్దాతో దీపం వెలిగించి, ధూపం వేయమని ఆజ్ఞాపించారు.

దీపానికి ముందు, వెనుక రెండు పీటలు వేయబడ్డాయి. మధురాంతకులు ఒక పీట మీద

కూర్చోగానే వంతిదేవుడు ఇంకొక పీట మీద కూర్చొన్నాడు. కళ్ళు మూసుకొని కాసేపు ధ్యానంలో మునిగాడు. అతడి నోరు ఏవో మంత్రాలను జపిస్తున్నట్లు మెల్లగా కదలుతూంది.

తర్వాత అతడు ఒంటిని ఒక్కసారి విదిలించుకొని పూనకం వచ్చినవాడిలాగ నటించాడు.

తర్వాత కళ్ళను వెడల్పుగా తెరిచాడు. ఎదురుగా ఉన్న దీపాన్ని పరీక్షగా చూశాడు.

కాసేపలా చూసి, తర్వాత మధురాంతకులను చూస్తూ, "అయ్యా! తమ గురించి నేనేమైనా నిర్లక్ష్యంగా చెప్పివుంటే మన్నించాలి. తమ యోగం సాధారణ యోగం కాదు. అక్కడ సభలో కూర్చొని పద్యాలు పాడిన అబ్బాయి యోగానికి, మీ యోగానికి ఎటువంటి సంబంధమూ లేదు. ఆ అబ్బాయి యోగం రాజవంశస్థుల ఆదరణ వల్ల కలిగే రాజయోగం; తమ యోగం గురించి నేనీ దీపంలో చూస్తున్నది - ఆహా! నన్నే భ్రమింపజేస్తూంది!" అన్నాడు.

"అలా ఏం కనిపిస్తూంది? త్వరగా చెప్పు!" అన్నారు మధురాంతకులు.

"ఆహా! ఎలా చెప్పను? చెప్పేందుకు మాటలు దొరకడం లేదు! అదిగో కనుచూపు మేరదాక మణి మకుటాలు ధరించిన రాజులు బారులు తీరి నిలబడ్డారు. మంత్రులు, సామంతులు, అధికారులు వరుసగా నిలబడ్డారు. వారికవతల, ఎల్లల్లేని సముద్రంలాగ సేనావీరులు క్రిక్కిరిసి నిలబడ్డారు. వారు చేతబట్టిన శూలాలు, ఖడ్గాలు, వక్షస్సుపైన ధరించిన కవచాలు, కళ్ళు చెదిరిపోయేలా మెరుస్తున్నాయి. దూరాన ఉన్న మేడలపైన నిలబడి ప్రజలు జయజయధ్వానాలు చేస్తున్నారు. కోట గోడల పైన ప్రజలు గుంపులు గుంపులుగా నిలబడివున్నారు. వారు...వారు...ఏదో ఘోషిస్తున్నారు....!"

"చెప్పు, చెప్పు! ప్రజలు ఏం ఘోషిస్తున్నారు?"

"యువరాజా! వేలాది ప్రజలు ఘోషిస్తున్నందువల్ల స్పష్టంగా వినిపించడం లేదు! 'చోళకుల దీపం వర్ధిల్లాలి! రాజాధిరాజు చిరకాలం వర్ధిల్లాలి! త్రిభువన చక్రవర్తి చిరకాలం వర్ధిల్లాలి!' అని ఏవేవో వినిపిస్తున్నాయి..."

"తర్వాత?"

"ప్రజలు గుంపులు, గుంపులుగా ముందుకు వస్తున్నారు. శూలాలు, కత్తులు పట్టిన వీరులు వారికడ్డుపడి ఆపుతున్నారు. కాసేపు అక్కడ ఒకటే కేకలు, గందరగోళంగా ఉంది..."

"సరే, సరే! జనాలు ఎందుకు కేకలు వేస్తున్నారు?"

"దాన్నే నేను కూడ ఇప్పుడే చూడబోతున్నాను. గుంపు పక్కన పులిజెండా ఆకాశాన్నంటుతూ ఎగురుతోంది. దాని కింద చేప జెండా, సింహం జెండా, వృషభ ధ్వజం, వరాహ ధ్వజం మొదలైన జెండాలు తక్కువ ఎత్తులో ఎగురుతున్నాయి. మయసభ వంటి సభామంటపం మధ్యన నవరత్నఖచిత సింహాసనమొకటి అమర్చబడివుంది. పక్కనే ఒక పీఠం మీద కోటిసూర్యుల కాంతులీనే వజ్రవైడూర్యఖచిత మకుటం ఉంది. సింహాసనానికి పైభాగాన దేవకన్యలవంటి స్త్రీలు వింజామరలతో వేచివున్నారు.

పలుపుణ్యతీర్థాలనుంచి తీసుకొని వచ్చిన జలంతో నిండిన బంగారు బిందెలు వరుసగా అమర్చబడివున్నాయి. యువరాజా! పట్టాభిషేకానికి అంతా సిద్ధంగా ఉంది...!"

"ఎవరికి పట్టాభిషేకం? అది చెప్పు, స్వామీ!" అన్నారు మధురాంతకులు.

"ఇదిగో అది కూడ తెలిసిపోతుంది. సభామంటపం ప్రధాన ద్వారం తెరిచివుంది. స్తోత్రాలు చదువుతూ కొందరు లోపలికొస్తున్నారు. వీర గంభీర వదనంతో ఒక వృద్ధులు వస్తున్నారు. వారి వెనక మన్మధుడివంటి రాకుమారుడు వస్తున్నాడు..."

"అదెవరు? ఎవరు?"

వంతిదేవుడు మధురాంతకులను ఒకసారి పరీక్షగా చూసి, మళ్ళీ దీపాన్ని చూశాడు.

"అయ్యా! ఆయన మీలాగే ఉన్నారు! మీలాగేమిటి? మీరే! ముందు వచ్చిన ఇద్దరూ మిమ్మల్ని సింహాసనంవైపు తీసుకొని వెళుతున్నారు. 'జయీభవ! విజయీభవ!' అన్న ఘోష సముద్రఘోషలాగ లేస్తూంది. మీమీద పుష్ప, ధాన్య వర్షాలు కురుస్తున్నాయి. ఇదిగో, మీరు సింహాసనానికి అతి దగ్గరగా వచ్చేశారు! అరెరే! ఇదేమి? అపశకునంలాగ ఎవరడ్డం వస్తున్నారు? తలవిరబోసుకొన్న ఒక స్త్రీ తమకు, సింహాసనానికి మధ్య నిలబడి, 'వద్దు  అని తమను అడ్డుకొంటూంది. మీరు ఆ స్త్రీని పక్కకు తోస్తున్నారు...! అరెరే! మంచి సమయాన పొగ వచ్చి కప్పేస్తోందే! ఏమీ కనిపించడం లేదు!"

"ఎవరు? ఎవరు? బాగా పరీక్షగా చూడు! తర్వాత ఏం జరుగుతోంది?"

"యువరాజా! మన్నించాలి! పెద్ద పొగ వచ్చి అంతటినీ కప్పేసింది...!"

"చూడయ్యా, బాగా చూడు! ఆ స్త్రీ ఎవరన్నదైనా కాస్త చూసి చెప్పు! ఆమెను నీవింతకు మునుపు చూశావా?"

"యువరాజా! ఆ స్త్రీ కూడ మరుగైపోయింది. మీరు మాయమైపోయారు. సభ, కిరీటం, సింహాసనం, ... అన్నీ మాయమైపోయాయి. ఈ అంత:పురంలో మంత్రశక్తి ఉన్నవారెవరో ఉండాలి. కావాలనే మంత్రం వేసి అడ్డు పడ్డట్లనిపిస్తోంది. ఆయ్యా! నా ముఖమంతా కాలుతున్నట్లు మండుతోంది!"

ఇలా చెప్పేసి వంతిదేవుడు తన ముఖాన్ని చేతులతో కప్పుకొన్నాడు. అలాగే కాసేపున్న తర్వాత కళ్ళు తెరిచాడు.

~

మధురాంతకుల ఒంటి నరాలన్నీ బిగదీసుకుపోయాయి. ఆయన ముఖం కోపంతో ఎర్రబారింది. కళ్ళు నిప్పుకణికల్లాగ జ్వలించాయి. వంతిదేవునికి నిజంగానే కాస్త భయం కలిగింది. యువరాజుకు ఆశామోహాన్ని మితిమీరి రేగించేశామా అన్న భయం పట్టుకొంది.

"మళ్ళీ చూడు! బాగా చూసి చెప్పు!" అన్నారు మధురాంతకులు.

"యువరాజా! అందువల్ల ప్రయోజనం లేదు. ఒకసారి మాయమైపోయిన దృశ్యం మళ్ళీ

కనిపించదు. కనిపించినా, చాల రోజుల తర్వాత కనిపిస్తుంది. దీపాన్ని చూసి, ఇంకేదైనా దృశ్యం కావాలంటే చెబుతాను..."

"చెప్పు, చెప్పు! ఏ దృశ్యం కనిపించినా చెప్పు!"

"ప్రజలు ఏదో గందరగోళంలో పడ్డారు. దు:ఖంతోను, కోపంతోను కూడ ఉన్నారు. దూత ఒకడు వచ్చి వారికి ఏదో వార్త చెబుతున్నాడు. రాజ కుటుంబానికి చెందినవారెవరో సముద్రంలో మునిగిపోయారని చెబుతున్నారు. అయ్యా! పాపం! ఆ దూతను కొట్టడానికి వెళుతున్నారు ప్రజలు. యువరాజా! అలా ఏమైనా జరిగితే మీరు ప్రజల మధ్యకు వెళ్ళకండి! వెళ్ళినా జాగ్రత్తగా వెళ్ళండి!"

"సముద్రంలో మునిగినవారెవరో పేరు చెప్పలేదా?"

"కేకల మధ్య పేరు వినపడలేదు. ఆ దృశ్యం మరుగైపోయింది. ఇప్పుడు మెడలో పుర్రెల మాలలు వేసుకొని భయంకరంగా కనిపిస్తున్న మనుషుల గుంపొకటి నా కళ్ళ ముందు కనిపిస్తోంది. కాపాలికులు కాళాముఖుల్లాగ కనిపిస్తున్నారు. వారిలో ఒకడు భయంకరమైన కత్తి చేతబట్టుకొనివున్నాడు. అతడికెదురుగా బలిపీఠమొకటుంది. యువరాజా! ఇక్కడ కూడ ఒక రాకుమారుడొస్తున్నాడు. కాళాముఖులు ఆయన చుట్టూ చేరి కేరింతలు కొడుతున్నారు. అయ్యా! పొరబాటున కూడ మీరటువంటి గుంపు మధ్యకు వెళ్ళకండి...!"

ఇది వినగానే మధురాంతకుల ముఖాన ముచ్చెమటలు పోశాయి. ఒళ్ళు వణికింది.

వంతిదేవుడు అది గమనించాడు. తర్వాత, "యువరాజా! ఇక ముందు నాకేమీ కనిపించడంలేదు. మన్నించాలి. నా తల తిరుగుతోంది. ఎవరో మంత్రం వేసి అడ్డుపడుతున్నారు. ఇంకొకసారి, ఇంకొకచోట చూసి చెబుతాను!" అని చెప్పేసి, తలను రెండు చేతులతోను పట్టుకొన్నాడు.

ఆ సమయాన పురసేవకుడొకడు వచ్చి పెద్ద మహారాణి యువరాజును పిలుచుకొని రమ్మన్నారని చెప్పాడు.

మధురాంతకులు తన మనసులో పొంగుతున్న కోపాన్ని తల్లిపైన కక్కేయాలని తీర్మానించుకొన్నారు.

"అయ్యా! తలనెప్పి తట్టుకోలేకపోతున్నాను. అంత:పురం బయటకు వెళ్ళి కాస్త ఈ నగరాన్ని చూసి వస్తాను!" అని వంతిదేవుడు యువరాజుకు చెప్పి ఆయన అనుమతి తీసుకొన్నాడు.

~

పళైయారై వైద్యుల కుమారుడైన పినాకపాణికి జీవితంలో ఒక కొత్త మోజు పుట్టుకొచ్చింది. కొన్నిరోజుల క్రితం వరకు తన తండ్రి వద్ద వైద్యశాస్త్రం నేర్చుకోవడంతో తృప్తిపడ్డాడు. కోడిక్కరై ప్రయాణంలో వంతిదేవుడు అతడికి బయటి ప్రపంచం గురించి అనేక విషయాలు చెప్పాడు. అది మాత్రమే కాదు. కొత్తగా ప్రేమవలలో పడ్డవారు దాని గురించి ఎవరితోనైనా చెప్పుకోవాలని ఆశపడ్డం సహజం. వైద్యకుమారుడు ఒట్టి

పెర్రిపెధవ అని గ్రహించిన వంతిదేవుడు వాడితో ఆడవాళ్ళను ప్రేమించడం వల్ల కలిగే అపాయాల గురించి చెప్పాడు. తానలా ఒక అమ్మాయి ప్రేమలో పడి అందువల్ల అనుభవిస్తున్న కష్టాలను గురించి కూడ చెప్పాడు.

వైద్యకుమారుడు పినాకపాణికి ఈ మాటలు మొదట అంతగా రుచించలేదు. మెల్లమెల్లగా అతడి మనసు మారసాగింది. వంతిదేవుని పైన ఇదీ అని చెప్పలేని కోపం, అసూయ కూడ పుట్టుకొచ్చాయి. అతడి మనసు దోచుకొన్న ఆ యువతి ఊరు, పేరు ఏమని అడిగాడు. వంతిదేవుడు చెప్పనిరాకరించాడు. అందువల్ల పినాకపాణికి వంతిదేవుని మీది కోపం ఇంకా ఎక్కువైంది. కోడిక్కరై చేరేలోపు వైద్యకుమారుడు వంతిదేవుని తన శత్రువనే నిర్ధారించుకొన్నాడు.

అతడి మనసులో సన్నగా రాజుకొంటున్న నిప్పు పూంగుళలిని చూడగానే పెద్దదైంది. పూంగుళలి అతన్ని తిరస్కరించడమేగాక పరిహాసం కూడ చేసింది. పూంగుళలి తనకన్న వంతిదేవునే ఎక్కువగా పరిగణిస్తోందని  తెలిసిన వెంటనే పినాకపాణి పిచ్చికోపం ఇంకా ముదిరిపోయింది. వంతిదేవుని వెన్నంటి వచ్చిన పళువూర్ వీరులకు అతన్ని పట్టి ఇచ్చేందుకు కూడ జంకలేదు.

పళువేట్టరయ్యర్ల మనుషులు వంతిదేవుని పట్టుకోలేక పినాకపాణిని పట్టి బంధించి తంజావూరుకు తీసుకొని వెళ్ళారు. ఇంతవరకు అతడు పాతాళ చెరసాలలో వసించవలసివచ్చింది. వీటన్నిటివల్ల అతడికిప్పటికే వంతిదేవుని పైనున్న కోపం ఇంకా హెచ్చింది.

యువరాకుమారి కుందవై అతన్ని చూసి మాట్లాడి విడుదల చేయించే లోపల అతడు విడుదల చేయబడ్డ విషయం మనం చూశాం. విడుదల చేయించింది పళువూర్ యువరాణి నందినే. తన వద్ద చెప్పి సెలవు తీసుకోకుండ వంతిదేవుడు తంజావూరు అంతఃపురం నుంచి తప్పించుకొన్న విషయమై అతడిపైన ఆమెకు కోపం, సందేహమూ కలిగాయి. అతడు పళైయారైకి వెళ్ళి, ఆ తర్వాత లంకకు తప్పించుకొని వెళ్ళిన విషయం తెలుసుకొన్న తర్వాత ఆమె సందేహం బలపడింది. ఎలాగూ పళైయారైకి తిరిగి రానే వస్తాడు. వచ్చి కుందవైదేవిని కలిసేందుకు ప్రయత్నిస్తాడని ఊహించింది. అది కనిపెట్టి తనకు సమాచారాన్ని అందించేందుకు పళైయారైలో తనకు ఒక నమ్మకస్తుడైన మనిషి ఉండాలని తీవ్రంగా ఆలోచించింది.

వైద్యకుమారుడు పినాకపాణిని చూసి మాట్లాడిన తర్వాత అతడా పనికి తగిన వాడన్న నిశ్చయానికొచ్చింది. అతడికా పెద్ద బాధ్యతనప్పగించింది.

"నీకు ద్రోహం చేసి తప్పించుకొన్న ఒకతడు త్వరలోనే పళైయారైకి తిరిగి వస్తాడు. నీవు కళ్ళలో వత్తులేసుకొని కనిపెట్టుకొని చూస్తుండాలి. అతడెక్కడికి వెళుతున్నాడు, ఏం చేస్తున్నాడు అన్న సంగతి నాకు వెంటనే చెప్పి పంపించాలి. అలా చేస్తే నీకు తగిన బహుమానమిస్తాను" అన్నది.

తర్వాత చిన్న పళువేట్టరయ్యర్ కూడ అతన్ని పిలిపించి వంతిదేవుని గురించి ఇలా ఆజ్ఞాపించారు: "ఆ రాజ ద్రోహి తిరిగి వచ్చినప్పుడు పట్టిస్తే నీకు మా గూఢచారి దండులో పెద్ద పదవి ఇచ్చి

సత్కరిస్తాను" అని అతడికి ఆశ చూపించారు.

అది మొదలు పినాకపాణి వైద్యవృత్తిలో ఆసక్తి కోల్పోయాడు. ఏవేవో గాలిమేడలు కట్టుకొంటూ పళైయారై వీధుల్లో తిరగసాగాడు. ఉన్నట్లుండి సందేహం వచ్చి వీధిలో వెళుతున్న వారి దగ్గరకు పరుగెత్తుకు  వెళ్ళి వారి ముఖంలో ముఖం పెట్టి చూసి, "కాదు, కాదు!" అని గొణుక్కొంటూ అవతలికి వెళ్ళేవాడు. ఇది చూసిన పలువురు వైద్యకుమారునికి పిచ్చి పట్టిందనుకోసాగారు.

కానీ పినాకపాణి తన ప్రయత్నాలను వదల్లేదు.

మధురాంతకులు, వారి పరివారం పళైయారైలో ప్రవేశించినప్పుడు పినాకపాణి వారినంత నిశితంగా గమనించలేదు. వారి మధ్య వంతిదేవుడు ఉండవచ్చు అని ఊహించలేదు. తిరునారయ్యూర్ నంబి పల్లకి చుట్టూ గుమిగూడిన ప్రజలనే చుట్టు తిరిగి తిరిగి చూడసాగాడు. అప్పుడు కాస్త దూరాన మధురాంతకుల పరివారం వెళ్ళడం కనిపించింది. మధురాంతకుల పక్కన గుర్రం పైనున్న తను ఒకసారి తిరిగి చూసినప్పుడు పినాకపాణికి సందేహం కలిగింది. కానీ అతడు వేగంగా అంతఃపురం లోపలికి వెళ్ళిపోవడం వల్ల తన సందేహాన్ని నివృత్తి చేసుకోలేకపోయాడు.

~~~
~~~

# అధ్యాయము - 19

## సమయ సంజీవి

**నంబియార్** నంబికి ఉపచారాలు జరిగినప్పుడు పినాకపాణి ఆ సభామంటపం లోపల ప్రవేశించలేకపోయాడు. వాకిలి బయట నిలబడ్డ జనాలతో చేరి నిలబడి సభాకార్యక్రమాన్ని చూస్తున్నాడు. వంతిదేవుని ధ్యానం ఇంకొక చోట ఉందని మనం ఇంతకు మునుపే చూశాము. పినాకపాణేమో వంతిదేవుని ముఖాన్నే గుచ్చి చూడసాగాడు. ఇదంతా గమనిస్తున్నాడు ఇంకొకడు. అతడే మన పాత స్నేహితుడు ఆళ్వార్ కట్టియాన్.

యువరాజు మధురాంతకులకు భవిష్యత్తు గురించి ధూపం వేసి చెప్పి, ఆయన మనసును కలతబారజేసి అంతఃపురం నుంచి బయటకు వచ్చాడు వంతిదేవుడు. అక్కడ కాస్త దూరాన నిలబడ్డ వైద్యకుమారుడు అతన్ని సమీపించి, "అయ్యా! నీవెవరు?" అని అడిగాడు. వంతిదేవుడు పినాకపాణిని చూసి అదిరిపడ్డాడు. దాన్ని బయటకు చూపించుకోక, "ఏమడిగావు?" అన్నాడు.

"నీవెవరని అడిగాను."

"నేనెవరనా అడుగుతున్నావు? ఏ 'నేను ను గురించి అడుగుతున్నావు? గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశం అనే పంచభూతాలతో సృష్టించబడ్డ దేహాన్ని అడుగుతున్నావా? ఈ దేహం లోపల దాగిన ప్రాణాన్ని అడుగుతున్నావా? ప్రాణానికి ఆధారమైన ఆత్మను అడుగుతున్నావా? ఆత్మకు ఆధారమైన పరమాత్మను అడుగుతున్నావా? బాబూ! ఇదేం ప్రశ్న? నేవు లేవు; నేనూ లేను. అంతా దైవమాయ! లోకమన్నది మాయ. నిజానిజాల గురించి తిరునారయ్యూర్ నంబిలాంటి మేధావులను అడిగి తెలుసుకో!" అని చేప్పేసి అంతఃపురం వాకిట నిలబడ్డ తన గుర్రం పైకి ఎగిరి కూర్చొన్నాడు వంతిదేవుడు. గుర్రాన్ని కాసేపు వేగంగా నడిపించి, తర్వాత వైద్యకుమారుడు తనని వెన్నంటి రావడం లేదని రూఢి చేసుకొన్న తర్వాత మెల్లగా నడుపుకొంటూ వెళ్ళాడు.

~

కానీ వైద్యకుమారుడు అంత సులభంగా మోసపోతాడా? అతడి సందేహం ఇప్పుడు బలపడింది. నగరం కాపలా అధికారి వద్దకు వెళ్ళి ఈ వార్తనందించాడు. అధికారి పంపిన ఇద్దరు వీరులతోబాటు నగరమంతా తిరిగాడు. అతడు ఎదురుచూసినట్లే వంతిదేవుని ఒక నాలుగు వీధుల కూడలిలో చూశాడు.

"వీడే గూఢచారి! వీడే గూఢచారి!" అని అరిచాడు.

"ఏమయ్యా! నీకేమైనా పిచ్చి పట్టిందా?" అన్నాడు వంతిదేవుడు.

"ఎవరికి పిచ్చి అని అడుగుతున్నావు? ఈ దేహాన్నా, లేక దీని లోపలి ప్రాణాన్నా, ఆత్మనా,

పరమాత్మనా? ఎవరిని అడుగుతున్నావు?" అన్నాడు వైద్యకుమారుడు పినాకపాణి.

"నీవిప్పుడిలా పేలుతుండడం చూస్తూనే తెలుస్తోంది నీకే పిచ్చని!"

"నాకు పిచ్చి పట్టలేదు; నీతోబాటు కోడిక్కరై వరకు వచ్చిన వైద్యకుమారుడిని! కావలా వీరులారా! తంజావూరు కోట నుంచి తప్పించుకొని పారిపోయిన గూఢచారి వీడే! వెంటనే పట్టి బంధించండి!"

కావలా వీరులు వంతిదేవుని సమీపించారు.

"జాగ్రత్త! వీడి మాటలు విని మోసపోకండి! నేను యువరాజు మధురాంతకులతో వచ్చిన నిమిత్తకారుడిని!" అన్నాడు వంతిదేవుడు.

"లేదు, లేదు! వీడు పెద్ద అబద్ధాలకోరు! వెంటనే బంధించండి!" అని అరిచాడు వైద్యకుమారుడు.

~

ఇంతలో వారిచుట్టూ ఒక పెద్ద గుంపు కూడింది. గుంపులో కొందరు వంతిదేవుని పక్షం మాట్లాడారు. ఇంకొందరు వైద్యకుమారుని పక్షం మాట్లాడారు.

"వీడిని చూస్తే నిమిత్తకారుడిలాగ లేడు" అన్నాడొకడు.

"గూఢచారిలాగ కూడ కనిపించడంలేదు" అన్నాడింకొకడు.

"నిమిత్తకారుడు ఇంత చిన్న వయసువాడై ఉండగలడా?"

"ఎందుకు సాధ్యం కాదు? గూఢచారి గుర్రమెక్కి బహిరంగంగా వీధుల్లో తిరుగుతాడా?"

"నిమిత్తకారుడు ఎందుకు ఖడ్గం ధరించాలి?"

"గూఢచారి అంటే ఎవరి గూఢచారి? పళైయారైలో ఏం చేసేందుకు వచ్చాడు?"

దీని మధ్య వైద్యకుమారుడు, "వీడిని పట్టి బంధించండి! పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ!" అని అరిచాడు.

పళువేట్టరయ్యర్ల పేరు వినగానే గుంపులో కొందరికి వంతిదేవుని మీద జాలి కలిగింది. అతన్నెలాగైనా తప్పించి కాపాడే దారి ఉందా అని ఆలోచించసాగారు.

ఇంతలో ఆళ్వార్ కట్టియాన్ వచ్చి ఆ గుంపులో ఒక వారగా నిలబడ్డాడు.

"ఇదిగో, ఉన్నాను!" అన్నాడు వంతిదేవుడు.

"లేదు, లేదు! వీడు గూఢచారి!" అని పినాకపాణి మళ్ళీ అరిచాడు.

"ఇదేం తంటా? నీవు మధురాంతకులతో వచ్చిన నిమిత్తకారుడివైతే నాతో రా! నిన్ను యువరాకుమారి పిలుచుకొని రమ్మని చెప్పి పంపించారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

వంతిదేవుని మనసు తుళ్ళి గంతులేసింది. "ఆ నిమిత్తకారుడిని నేనే! ఇదిగో వస్తున్నా!" అన్నాడు.

"వదలకండి! గూఢచారిని వదిలేయకండి!" అని మళ్ళీ అరిచాడు పినాకపాణి.

ఆళ్వార్ కట్టియాన్, "నీవు నిమిత్తకారుడివని నిరూపిస్తేనే నాతో రావచ్చు! కాబట్టి నీవు

నిమిత్తకారుడివని నిరూపించు!" అని చెబుతూనే కళ్ళతో సైగ చేశాడు.

"ఏ విధంగా నిరూపించాలంటున్నావు?" అని వంతిదేవుడు అతన్నడిగాడు.

"అదిగో రెండు గుర్రాలు వేగంగా వస్తున్నాయి కద? వాటిపైన వస్తున్నవారు ఏదో అతిముఖ్యమైన సమాచారాన్ని తీసుకొస్తున్నట్లుంది. అదే నిజమైతే, ఆ వార్త ఏమిటో చెప్పు!"

వంతిదేవుడు ఆ రౌతులను పరీక్షగా చూసి, "ఓ! చెబుతున్నాను, విను! రాజవంశానికి చెందిన వారొకరికి జలగండం సంభవించింది! ఆ దు:ఖవార్తనే వారు మోసుకొస్తున్నారు!" అన్నాడు.

అతడలా చెప్పి ముగించగానే ఆ గుర్రాలు గుంపు దగ్గరకొచ్చేశాయి. జనాలు వాటిని ముందుకు వెళ్ళనివ్వనందువల్ల గుర్రాలు ఆగాయి.

"మీరు దూతల్లాగున్నారు. ఏం వార్త తీసుకొని వచ్చారు?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"అవును. మేము దూతలమే. ఒక దు:ఖవార్తను తీసుకొస్తున్నాము! యువరాజు అరుళ్మొళి వర్మ ఎక్కి వచ్చిన ఓడ సుడిగాలిలో చిక్కుకొందట. యువరాజు ఎవరినో కాపాడేందుకు సముద్రంలో దూకి మునిగిపోయారట!"

గుర్రమెక్కి వచ్చిన ఆ దూతల్లో ఒకతను ఇలా చెప్పగానే, "అయ్యో!", "అయ్యయ్యో!" అన్న విచార ఘోషలు లేచాయి.

ఎక్కడినుంచి అంతమంది ప్రజలు వచ్చారో తెలియదు. అతి త్వరగా ఎలా వచ్చి చేరారో కూడ తెలియదు. పురుషులు, స్త్రీలు, వృద్ధులు, పిల్లలు ఆ దూతల చుట్టు గుమిగూడారు. పలువురు ఆ దూతలను పలువిధాలైన ప్రశ్నలడిగారు. చాలమంది ఏడ్వనారంభించారు.

~

పళువేట్టరయ్యర్లు అరుళ్మొళి వర్మను అంతగా ఇష్టపడలేదని ఆ నగర ప్రజలు పలువురికి అప్పటికే తెలుసు. యువరాజును పట్టి బంధించి తీసుకొని వచ్చేందుకు వారు మనుషులను లంకకు పంపారన్న వార్త కూడ వారి చెవులకందింది. కాబట్టి గుంపులో పలువురు పళువేట్టరయ్యర్ల గురించి గొణగనారంభించారు. తర్వాత పెద్దగానే శాపనార్థాలు పెట్టనారంభించారు. "పళువేట్టరయ్యర్లు కావాలనే యువరాజును సముద్రంలో ముంచేసివుండాలి!" అని ఒకరికొకరు చెప్పకొన్నారు. ఆ ప్రజల మాటలు, శాపాలు అన్నీ కలిసి సముద్రఘోషలాగ లేచింది.

ఈ గుంపులో చిక్కుకొన్న దూతలు అంత:పురానికి వెళ్ళలేక అవస్థపడ్డారు. ప్రజల మధ్యనుంచి ఇవతలికి రావడానికి వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. "ఎలా?" "ఎక్కడ?" "ఏరోజు?" "నిజమేనా?" అని ప్రజలు ఆ దూతలపైన ప్రశ్నల వర్షం కురిపించి ముందుకు వెళ్ళనివ్వక అడ్డుపడ్డారు.

వైద్యకుమారునితో వచ్చిన కాపలా వీరులను చూసి ఆళ్వార్ కట్టియాన్, ""మీరెందుకు ఊరక నిలబడ్డారు? జనాలను పక్కకు తొలగించి దూతలను అంత:పురానికి తీసుకొని వెళ్ళండి!" అన్నాడు.

కాపలావీరులు కూడ ఆ వార్త విని మనసు కలతబారివున్నారు. వారిప్పుడు ముందుకు వచ్చి దూతలకు దారి ఏర్పరచేందుకు ప్రయత్నించారు. దూతలు మెల్లమెల్లగా అంతఃపురంవైపు ముందుకు సాగారు. ప్రజలు వారిని విడవకుండ వారి వెన్నంటి వెళ్ళారు. ప్రజల గుంపు ఇంకా పెద్దది కాసాగింది.

అంత పెద్ద గుంపులో, ప్రజలందరూ ఏకమనస్కులై దుఃఖిస్తున్నప్పుడు, ఒకే ఒక్క ప్రాణి మాత్రం, "అయ్యో! ఇదేదో కుట్ర! గూఢచారిని తప్పించేందుకు పన్నిన కుట్ర!" అని కేకలేసింది. అలా అరుస్తున్న వైద్య కుమారుని ఎవరూ పట్టించుకోలేదు. అతడి కేకలు ఎవరి చెవుల్లోను దూరలేదు. మహానది వరదలో కొట్టుకుపోయే పూచిక పుల్లలాగ ఆ ప్రజల వరద అతన్ని కూడ తీసుకొని ముందుకు సాగింది.

జనాలు గుమిగూడనారంభించగానే వంతిదేవుడు గుర్రంమీదినుంచి కిందకు దిగేశాడు. జనాలు ముందుకు జరగనారంభించగానే ఆళ్వార్ కట్టియాన్ అతన్ని సమీపించి అతని చేయి పట్టుకొన్నాడు. "గుర్రాన్ని వదిలేయి. తర్వాత దాన్ని వెతికి పట్టుకోవచ్చు. వెంటనే నాతో రా!" అని అతని చెవిలో చెప్పాడు.

"అయ్యో! సమయ సంజీవిగా వచ్చావు! లేకపోతే నా పరిస్థితి ఏమయ్యేదో తెలియదు!" అన్నాడు వంతిదేవుడు.

"ఇదే నీ వృత్తి కాబోలు! ఏదైనా ఒక పెద్ద ఇక్కట్టులో చిక్కుకోవడం! ఎవరైనా వచ్చి ఆ చిక్కునుంచి నిన్ను విడిపించడం!" అని ఎగతాళి చేశాడు ఆళ్వార్ కట్టియాన్.

ఇద్దరూ జనసముద్రంలో కొట్టుకుపోకుండ వీధి వారగా ఒదిగి నిలబడ్డారు. గుంపు వెళ్ళిన తర్వాత ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చేయి పట్టుకొని ఇంకొక దిక్కుగా పిలుచుకొని వెళ్ళాడు.

అంతఃపురాలున్న వీధిలో, మనం మునుపొక సారి చూసిన, తాళం వేసిన వీధి చివరి ఇంటి లోపలికి ఇద్దరూ దూరారు. పెరట్లో ఉన్న నందనవనంలో ప్రవేశించి లతామార్గం గుండా వెళ్ళారు. కాసేపటికల్లా నీలవర్ణపు కొలను కనిపించింది. అందులో ఒక పడవ తేలుతోంది. పడవలో ఒక రాచవనిత కూర్చొనివుంది. ఆమెను చూడగానే వంతిదేవుని మనసు ఎగిరి గంతులేసింది.

~~~
~~~

# అధ్యాయము - 20

## తల్లీకొడుకులు

**తల్లిగారు** పిలుచుకొని రమ్మని చెప్పి పంపించగా మధురాంతకుడు శెంబియన్ మహాదేవిని చూడ వెళ్ళారు. శివభక్తశిఖామణియైన ఆమె పేరు ప్రఖ్యాతులు దేశమంతటా వ్యాపించింది. ఒకప్పుడు మధురాంతకుడు కూడ తల్లిపైన ఎనలేని భక్తిగొనివుండేవాడు. ఆ భక్తి ఇప్పుడు పిచ్చికోపంగా మారింది. కన్న కొడుకుకే ద్రోహం చేసి దాయాదుల పక్షం మాట్లాడిన తల్లి గురించి కథల్లో కూడ వినివుండలేదు కదా! తనకు ఇటువంటి తల్లా...? ఇదంతా తలుచుకొని అతని మనసులోని ప్రేమ ద్వేషంగా మారి, పోను పోను పెరిగి పెద్దది కాసాగింది.

అపూర్వమైన శాంతం నెలకొన్న తల్లి ముఖం చూడగానే అతడి కోపం కాస్త తగ్గింది. మునుపటిలాగనే నమస్కరించి లేచి నిలబడ్డాడు. "నీ శివభక్తి సంపద వర్ధిల్లనీ!" అని అతన్ని ఆశీర్వదించి కూర్చోమన్నారు.

ఆ ఆశీర్వాదం మధురాంతకుని మనసులో బాణంలాగ గుచ్చుకొంది.

"మధురాంతకా! నా కోడలు సౌఖ్యమా? మీ మామగారి ఇంట్లోను, ధనాధికారి ఇంట్లోను అందరూ సౌఖ్యమా?" అని విచారించారు.

"అందరూ సౌఖ్యంగానే ఉన్నారు. దాని గురించి మీకెందుకు దిగులు?" అని గొణిగాడు మధురాంతకుడు.

"తంజావూరు నుంచి బయలుదేరే ముందు నీవు చక్రవర్తిని చూశావా? ఆయన ఆరోగ్యం ఇప్పుడెలా ఉంది?" అని మహారాణి అడిగారు.

"చూసి సెలవు తీసుకొనే బయల్దేరాను. చక్రవర్తి ఆరోగ్యం రోజురోజుకు క్షీణించిపోతోంది. దేహానారోగ్యం కన్న ఆయన మనోవేదనే అధికంగా ఉంది!" అన్నాడు మధురాంతకుడు.

"అదేమి, బిడ్డా? చక్రవర్తికి మనోవేదన కలిగేందుకు ఏమలా జరిగింది?"

"తప్పు చేసిన వారు - అవినీతికి పాల్పడ్డవారు - ఇతరుల ఆస్తిని దోచుకొన్నవారు - మనోవేదనకు గురికావడం సహజమే కదా?"

"ఇదేం చెబుతున్నావు? చక్రవర్తి అటువంటి తప్పు, అవినీతి ఏం చేశారు?"

"ఇంకేం చేయాలి? నేనుండవలసిన సింహాసనం మీద ఆయన కూర్చొని ఇన్నేళ్ళుగా రాజ్యాన్నేలడం లేదా? అది నేరం కాదా? అవినీతి కాదా?"

"బిడ్డా? పాలలాగ స్వచ్ఛంగా ఉండే నీ మనసులోకి ఈ విషం ఎలా వచ్చింది? ఎవరు నీకీ

దుర్బోధ చేసినవారు?" అని జీరవోయిన గొంతుతో అడిగింది తల్లి.

"నాకెవ్వరూ దుర్బోధ చేయలేదు. మీకుమారుని ఎందుకంత మూర్ఖుడిగా భావిస్తున్నారు? నాకు స్వంత బుద్ధి లేదని మీ ఉద్దేశమా?"

"ఎంతటి బుద్ధిమంతులకైనా దుర్బోధలవల్ల మనసు చెడిపోవడం సహజం. కరిగించేవారు కరిగిస్తే రాయి కూడ కరుగుతుందని సామెత. మంథర దుర్బోధలవల్ల కైకేయి మనసు చెడిపోలేదా?"

"స్త్రీల మనసును అలా దుర్బోధలవల్ల చెడగొట్టవచ్చని నేనుకూడ ఎరుగుదును."

"మధురాంతకా? ఎవరిని గురించి అంటున్నావు?"

"అమ్మా! నన్నెందుకు పిలిపించారు? అది చెప్పండి!"

"కాసేపటి క్రితం జరిగిన వైభవంలో నీవు సంతోషంగా పాల్గొన్నావు కద?"

"అవును. ఎవరో దారిన పోయే పిల్లాడిని పల్లకిలో రప్పించారు. సింహాసనమెక్కించి ఉపచారాలు చేశారు. వాడు చాల తలబిరుసు కలవాడని తెలిసింది...."

"అయ్యో! అపచారం! అలా మాట్లాడకు, బిడ్డా! వచ్చినవారు వయసులో చిన్నవారైనా శివజ్ఞానం పరిపక్వంగా పొందిన మహానుభావులు!"

"ఆయన మహానుభావులై ఉండనీ. నేను లోకువగా మాట్లాడితే ఆయన పెద్దతనం తరిగిపోదు కద? ఆ మహానుభావునికి మీరు రాజ మర్యాదలు చేయడం గురించి కూడ నాకభ్యంతరం లేదు. నన్నెందుకు పిలిపించారో చెప్పండి!"

శెంబియన్ మహాదేవి పెద్దగా నిట్టూర్చి ఇలా చెప్పనారంభించారు:- "నీ గుణంలో, ప్రవర్తనలో కలిగిన మార్పు నాకు దిగ్భ్రమను కలిగిస్తోంది. పళువేట్టరయ్యర్ల మాళిగలో రెండేళ్ళ నివాసం నిన్నలా మార్చేస్తుందనుకోలేదు. పోనివ్వు. నా కర్తవ్యాన్ని నేను నెరవేర్చాలి. నీతండ్రికి నేనిచ్చిన మాటను నెరవేర్చేందుకు నావల్ల వీలైనంతవరకు ప్రయత్నించాలి. కుమారా! నిన్ను పిలిపించిన కారణం చెప్పేముందు, నా కథను - నేను నీ తండ్రిని పెళ్ళాడిన వృత్తాంతాన్ని చెప్పాలి. కాస్త ఓపికగా విను!"

మధురాంతకుడు ఓపికగా వినేందుకు సూచనగా కాళ్ళు మడిచి కూర్చొని, చేతులను పీటమీద ఊని బాగా కూర్చొన్నాడు.

"నేను పుట్టిన ఊరైన మళపాడికి నీవు చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడు ఒకటి రెండుసార్లు నాతోబాటు వచ్చావు. ఆ ఊరిలో ఉన్న దేవాలయాన్ని కూడ చూసివున్నావు. కోచ్చంకర చోళరాజు కట్టించిన అరవైనాలుగు శివాలయాల్లో అదికూడ ఒకటని పెద్దలు చెప్పగా విన్నాను. నీ తాతగారు, అంటే నా తండ్రి, మళపాడిలో పెద్ద ఇంటికి చెందినవారు. మాకులం మంచి పేరున్న కులం. ఒకప్పుడు వారు మంచి పలుకుబడి కలిగిన సామంతరాజులుగా ఉండేవారు. విజయాలయ వర్మ కాలంలో జరిగిన యుద్ధంలో పాండ్యరాజుల పక్షాన పోరాడారు. కాబట్టి చోళులు గెలుపొందిన తర్వాత మళవరయ్యర్ల పలుకుబడి

తగ్గిపోయింది. నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు దాని గురించి అంతగా పట్టించుకోలేదు. నా మనసు మళపాడిలో ఉన్న శివాలయంలోని నటరాజస్వామిపైనే కేంద్రీకృతమైంది. మళపాడి చరిత్రలోని ఒక సంఘటన నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఒక పెద్దాయన నాకు చెప్పారు. ఒకసారి సుందరమూర్తి తమ శిష్యులతోబాటు మా ఊరిపక్కనుంచే వెళుతున్నారు. మళపాడి ఆలయం చుట్టూ ఏపుగా పెరిగిన పూలచెట్లు ఆ గుడిని పూర్తిగా కప్పేశాయట. కాబట్టి గుడిని గమనించక సుందరమూర్తి ముందుకు సాగారట. 'సుందరం! నన్ను మరిచిపోయావా, ఏమి?" అన్న గొంతు ఆయన చెవిన పడ్డదట. సుందరమూర్తి చుట్టు పక్కల పరికించి చూసేసి, 'మీరెవరైనా ఏదైనా చెప్పారా?' అని తమ శిష్యులను అడిగారట. వారు 'లేదు' అన్నారట. తమకు ఏమీ వినిపించలేదని కూడ అన్నారట. సుందరమూర్తి వెంటనే మరుగుపడ్డ ఆలయమేదైనా చుట్టుపక్కల ఉందా అని విచారించారట. పొన్న చెట్ల మధ్య దాగిన శివాలయాన్ని కనిపెట్టి, పరుగెత్తి వచ్చి స్వామి సన్నిధిలో 'పొన్నార్ మేనియనే! (= బంగారు వన్నె మేను గలవాడా!)' అన్న పద్యాన్ని పాడారట.

అది విన్న నా మనసులో ఆ వృత్తాంతం గట్టిగా పదిలమైంది. ఆ గుడికి తరచూ వెళ్ళేదాన్ని. నటరాజమూర్తి ముందు నిలబడి ఎడతెరపి లేకుండ ఆ పద్యాన్ని పాడేదాన్ని. రోజులు గడిచేకొద్దీ నా మదిలో మళపాడి దేవుడు స్థిరంగా గూడుకట్టుకొన్నాడు. శివపరమాత్మనే నేను పెళ్ళాడుతానని నా మనసులో కోటలు కట్టేదాన్ని. నన్ను నేను ఉమగాను, పార్వతిగాను, దాక్షాయణిగాను ఊహించుకొనేదాన్ని. వారు శివపరమాత్మను పతిగా పొందేందుకు తపస్సు చేసినట్లు, నా పెళ్ళిమాట వచ్చినప్పుడల్లా నిరాసక్తి చూపేదాన్ని. ఇలా బాల్యం గడిచిపోయింది. యుక్త వయస్సు వచ్చినప్పుడు నా మనసు మునుపటికన్న ఎక్కువగా శివభక్తిలో నిమగ్నమైంది. ఇంటివాళ్ళు, ఊరివాళ్ళు కూడ నన్ను 'పిచ్చిది' అని పిలవనారంభించారు. అదంతా నేను పట్టించుకోలేదు. ఇంట్లో తిని, నిద్రపోయే సమయం తప్ప, మిగిలిన సమయమంతా గుడిలోనే గడిపేదాన్ని. పూజకు కావలసిన పూలను కోసి, రకరకాలుగా మాలలు కట్టి వాటిని శివపరమాత్మకు అలంకరింపజేసి ఆనందించేదాన్ని. చాలసేపు కళ్ళుమూసుకొని ధ్యానంలో మునిగిపోయేదాన్ని. ఒకరోజు కళ్ళు మూసుకొని ధ్యానంలో ఉన్నప్పుడు ఉన్నట్లుండి గలగలమన్న శబ్దం వినిపించగా కళ్ళు తెరిచి చూశాను. నా ఎదురుగా ఐదారు మంది నిలబడివున్నారు. వారిలో ముందుగా నిలబడ్డ ఒకరిపైనే నా చూపులు నిలిచాయి. నేను ధ్యానిస్తున్న శివపరమాత్మ తన పరివారంతో నన్ను పాలించ వచ్చేశారా అనుకొన్నాను. లేచి నిలబడి తలవంచి నమస్కరించాను. నా కళ్ళనుంచి అశ్రువులు ధారగా ప్రవహించసాగాయి. అది ఆయన గమనించివుండాలి. "ఈ అమ్మాయి ఎవరు? ఎందుకు ఏడుస్తోంది?" అన్న గొంతు వినిపించింది. అందుకు నా తండ్రి గొంతు, "ఈమె నా కూతురు. పిందెలోనే పండైనట్లు ఈమెకు ఇప్పుడే శివభక్తి పుట్టుకొచ్చేసింది. ఎప్పుడూ శివాలయానికి వచ్చి కూర్చొని కళ్ళుమూసుకొని ధ్యానం చేయడం, పద్యాలు పాడడం, కన్నీళ్ళు విడవడమూను!" అని జవాబు చెప్పడం నా చెవిన పడింది. మళ్ళీ నేను తలెత్తి చూసినప్పుడు నా ముందు నిలబడ్డవారు శివపరమాత్మ కాదని, ఎవరో రాజవంశానికి

చెందినవారని తెలిసింది. నేనా అవమానాన్ని సహించలేకపోయాను. అక్కడినుంచి ఒక్కపరుగుతో ఇంటికి చేరుకొన్నాను. కానీ నన్ను చూసినవారు నన్ను వదల్లేదు. నాతండ్రితోబాటు మా ఇంటికే వచ్చేశారు. కుమారా! ఆయనే నా భర్త, నీ తండ్రి గండరాదిత్య దేవరు!"

~

ఇలా చెప్పి పెద్ద మహారాణి కాసేపాగారు. పాత జ్ఞాపకాలతో ఆమె కళ్ళు మళ్ళీ చెమర్చాయి. కళ్ళు తుడుచుకొని మళ్ళీ ముందుకు చెప్పసాగారు:-

"తర్వాత నీ తండ్రిని గురించిన వివరాలు తెలుసుకొన్నాను. ఆయన అప్పుడే చోళ సింహాసనాన్ని అధిష్టించారు. పలు శివ క్షేత్రాలకు వెళ్ళి ఆలయ దర్శనం చేసుకొంటూ వచ్చారు. ఆయన వయసప్పుడు నలభైయేళ్ళు. చిన్న వయసులో ఆయన పెళ్ళాడిన రాచవనిత కాలమైపోయారు. మళ్ళీ పెళ్ళి చేసుకొనే ఉద్దేశమే లేకపోయిందాయనకు. మళ్ళీ పెళ్ళాడనని వ్రతం పూనారట. కానీ ఆయన పునీతమైన మనస్సు ఈ పేదరాలిని చూసి కదిలిపోయింది. నా తండ్రి సమక్షంలోనే ఆయన నాకిష్టమేనా అని నన్నడిగారు. నేనేమో శివపరమాత్మే మనుష్యరూపంలో నన్నేలుకోవడానికి వచ్చారని పరవశించిపోయాను. ఆయనను పెళ్ళాడేందుకు సంపూర్ణ సమ్మతాన్ని తెలియజేశాను. మా వివాహం త్వరలోనే జరిగిపోయింది. దానివల్ల మీ తాతగారు కోల్పోయిన పలుకుబడిని మళ్ళీ పొంది, 'మళవరయ్యర్' అన్న బిరుదును పొందారు.

"కుమారా! నాకు, మీ తండ్రికి వివాహం జరిగిన తర్వాత మేమిద్దరం మనసు విప్పి మాట్లాడుకొని ఒక తీర్మానానికి వచ్చాము. శివపరమాత్మ సేవకే మా జీవితాలను అంకితం చేయాలని, సంతానం కోరుకోకూడదని తీర్మానించుకొన్నాం. అందుకు ఒక ముఖ్యమైన కారణం ఉంది. బిడ్డా! ఇదంతా ఒకరోజు నీకు చెబుతానని కలలో కూడ అనుకోలేదు. కానీ అటువంటి పరిస్థితి వచ్చింది కాబట్టి చెబుతున్నాను. కాస్త శ్రద్ధగా విను!"

మధురాంతకుడు కూడ మునుపటికన్న ఎక్కువ శ్రద్ధతో వినేందుకు సిద్ధంగా కూర్చొని వినసాగాడు.

~~~
~~~

# అధ్యాయము - 21

## 'నీవూ ఒక తల్లివేనా?'

**శివభక్తే** రూపుదాల్చినట్లున్న శెంబియన్ మహాదేవి తమ కధను ఇలా ముందుకు కొనసాగించారు:-

"కుమారా! నీ తండ్రి గండరాదిత్యులు చోళ సింహాసనాన్నెక్కినప్పుడు చోళదేశం ఒక సంకట పరిస్థితిలో చిక్కుకొనివుంది. నీ తాతగారు పరాంతక చక్రవర్తి గొప్పతనాన్ని నీవెరుగుదువు. ఆయన పరిపాలనలో చోళసామ్రాజ్యం దక్షిణాన లంకవరకు, ఉత్తరాన కృష్ణానది వరకు విస్తరించింది. కానీ ఆయన అంతిమ కాలంలో రాజ్యానికి, రాజవంశానికి పలు విపత్తులు కలిగాయి. రావణేశ్వరుని మూలసైన్యంలాగ రెట్టైమండలపు సైన్యాలు దండెత్తి రాసాగాయి. పరాంతక చక్రవర్తి జ్యేష్టపుత్రుడు, సాటిలేని వీరాధివీరుడైన రాజాదిత్యులు (నీ పెదనాన్న) ఆ మహాసైన్యాన్ని ఎదిరించి పోరాడేందుకు బయలుదేరారు. ఉత్తరాన తక్కోలం అన్న చోట కురుక్షేత్ర యుద్ధంలాంటి మహాయుద్ధం జరిగింది. లక్షలసంఖ్యలో వీరులు మరణించారు. రక్తపుటేరులు పారాయి. రెట్టైమండలపు సైన్యం చెదరి, పారిపోయింది. కానీ ఆ యుద్ధంలో రాజాదిత్యులు మరణించారు. నీ చిన్నాన్న అరింజయులు కూడ ఆ యుద్ధంలో పాల్గొని తీవ్రంగా గాయపడ్డారు. కానీ వారిగురించి అప్పుడు ఏ వివరాలూ తెలియరాలేదు. అరింజయుల మొదటి కొడుకైన సుందరచోళులు - చిరుప్రాయపు బాలకుడు - లంకలో యుద్ధానికి వెళ్ళివున్నారప్పుడు.. అప్పుడు తంజావూరు అంతఃపురంలో పరాంతకుల పక్కన ఉన్నది నీ తండ్రి మాత్రమే.

కానీ నీ తండ్రేమో చిన్న వయసునుంచే రాజ్యవ్యవహారాలలో విరక్తిగొని, శివపరమాత్మకే తన మనసునంకితం చేశారు. ఆయనకు యుద్ధమంటేనే ఇష్టంలేదు. రాజుల రాజ్యకాంక్షకు సాధారణ ప్రజలు ఎందుకు బలికావాలని ఆయన విచారించారు. తండ్రితోను, సహోదరులతోను అందుగురించి వాదించారు. శివజ్ఞాన సంపన్నులైన పెద్దల సహవాసంలోను, పుణ్యక్షేత్రయాత్రల్లోను, ఆలయాల కైంకర్యాల్లోను కాలం గడిపారు. శూలం, కత్తిలాంటి ఆయుధాలను చేత్తోకూడ తాకేందుకు అయన ఇష్టపడలేదు. యుద్ధతంత్రాల్లోను, యుద్ధవ్యూహాల్లోను కూడ ఆయన శిక్షణ తీసుకోలేదు. అబద్ధాలు, కట్టుకధలు, వంచన, మోసం, కుట్రలూ మొదలైన వాటితో నిండినది రాజకీయం అని ఆయన నమ్మకం. 'దొంగ ఇంకొకరి వస్తువును దొంగిలించేందుకు, ఒక రాజు ఇంకొక రాజు రాజ్యాన్ని కబళించేందుకు ఏం తేడా?' అని ఆయన వాదించేవారు.

"కుమారా! విధివశాత్తు అటువంటి మహోన్నతమైన విలువలున్న నీ తండ్రి ఈ చోళసామ్రాజ్యభారాన్ని మోయవలసివచ్చింది.

"పరాంతక చక్రవర్తి రాజ్యానికి కలిగిన పలువిపత్తుల వల్లను, రాజాదిత్యుల మరణం వల్లను మనస్సు కుంగిపోయివున్న సమయాన, నీ తండ్రిని పిలిచి, 'రాజ్యభారాన్ని నీవే తీసుకోవాలి' అన్నారు. నీ తండ్రి మరణోన్ముఖులైన నీ తాతగారి మనసునింకా నొప్పించనిష్టపడక, అలాగే ఒప్పుకొన్నారు. నీ తండ్రిని నా కన్న ముందు పెళ్ళాడిన భాగ్యవతి వీరానారాయణీ దేవి అప్పటికే కైలాసం చేరుకొంది. నేనేమో నీ తండ్రినింకా చూడనేలేదు. కాబట్టి నీ తండ్రి తర్వాత చోళసామ్రాజ్యం గతి ఏమన్న విచారం మీ తాతగారికి పట్టుకొంది.

"అదృష్టవశాత్తు మీ చిన్నాన్న కుమారుని వెతికేందుకు లంకకు వెళ్ళిన మనుషులు అక్కడ ఒక దీవిలో ఆయనను (సుందర చోళులు) కనిపెట్టి పిలుచుకొని వచ్చారు.

"పరాంతకులు సుందరచోళుల పైన ఎనలేని ప్రీతిగొనివుండేవారు. మనుమడు చిన్నబిడ్డగా ఉన్నప్పటినుంచే ఒళ్ళో వేసుకొని లాలించి ముద్దుచేసేవారు. పెద్దలు పలువురు సుందర చోళుల వల్ల చోళ వంశం మహోన్నత స్థితిని చేరుకోబోతోందని చెప్పేవారు.

ఇటువంటి కారణాలవల్ల నీ తాతగారికి సుందరచోళుల పైన అపారమైన ప్రేమ ఉండేది. కాబట్టి మీ నాన్నగారు సింహాసనమధిష్టించేటప్పుడు సుందర చోళులకు యువరాజ పట్టాభిషేకం చేసేయాలని, ఆయన సంతతే చోళ రాజ్యాన్ని ఏలాలని చెప్పేసి కైలాసం చేరుకొన్నారు.

"ఈ వివరాలన్నీ నీ తండ్రి నాకు చెప్పారు. పరాంతక చక్రవర్తి తన మరణసమయంలో వెలిబుచ్చిన కోరికను నెరవేర్చేందుకు ఆయన నిశ్చయించుకొన్నారు. సుందర చోళులు, ఆయన సంతతి పట్టానికి వచ్చేందుకు ఏ అడ్డంకులు రాకూడదని ఆయన ఎంచారు. నీ తండ్రికి రాజ్యమేలే ఆశ లేదు; రాజకీయ కార్యాలలో పట్టింపు కూడ లేదు; ఆయన పుణ్యపురుషులు. ఆయన మనసు సదా నటరాజస్వామి పాదాల చుట్టే సంచరిస్తుండేది. కాబట్టి ఆయన తమ తమ్ముడైన అరింజయులకు, ఆయన కుమారుడైన సుందరచోళులకు రాజ్య కార్య నిర్వహణంతా ఒప్పజెప్పేసి, తాము శివకైంకర్యంలో నిమగ్నమైనారు. ఇంతకు మునుపు చెప్పాను కద – ఆయనకు పెళ్ళిచేసుకొనే ఆసక్తే లేదు. కానీ ఆయన దృఢసంకల్పాన్ని కదిలించేందుకు నేనొకతెను వచ్చి చేరాను. నేను కూడ శివభక్తి 'పిచ్చి' పట్టినదాన్నని తెలుసుకొన్నందువల్లే ఆయన నాపైన ప్రీతిగొని నన్ను పెళ్ళి చేసుకొన్నారు. ఆయనను పతిగా పొందిన నేను భాగ్యశాలిని. ఎన్నెన్నో జన్మల తపస్సు ఫలమో, నేనాయనను పతిగా పొందాను. ఆయనను తండ్రిగా పొందిన నీవూ భాగ్యశాలివే. శివపరమాత్మ వృషభారూఢులై నీ తండ్రికి దర్శనమిచ్చి ఈ భూలోకంనుంచి తీసుకొని వెళ్ళారు. నేను నిన్నిప్పుడు నా బాహ్యనేత్రాలతో చూస్తున్నట్లు నీ తండ్రి శివపరమాత్మను దర్శించారు. అటువంటి పుణ్యపురుషుని కోరికను నెరవేర్చడం మనిద్దరి బాధ్యత...!"

~

తల్లి ఇలా చెప్పి ఆపినప్పుడు, కొడుకు ఒళ్ళు వణుకుతూంది. అతని మనసు (కోపంతో)

ఉడికిపోతూంది.

"అదెలా తల్లీ! నా తండ్రి నాకేమీ చెప్పలేదు కద? నేనే కర్తవ్యం నెరవేర్చవలసివుంది? ఏ విధంగా?" అన్నాడు మధురాంతకుడు.

"కుమారా! విను! నీ తండ్రి పరమదించినప్పుడు నీవు చిన్నారి పిల్లవాడివి. కాబట్టి ఆయన నీకేదీ తెలియజెప్పలేకపోయారు. కానీ నాకు చెప్పి వెళ్ళారు. మా పెళ్ళైన కొత్తలో బిడ్డలు వద్దని నిర్ణయించుకొన్నాము. కానీ నాకు ఆ నిర్ణయాన్ని నెరవేర్చే శక్తి తగ్గిపోయింది. కన్యగా ఉన్నప్పుడు నేను శివుని పైగొన్న ప్రేమ పెళ్ళి తర్వాత నీ తండ్రిమీదికి మళ్ళింది. రోజులు గడిచేకొద్దీ, పాలిచ్చి నా ఒడిలో వేసుకొని ముద్దాడే బిడ్డ నాకు కావాలనే కోరిక బలపడసాగింది. తక్కిన స్త్రీల చేతుల్లోను ఒళ్ళోను (వారి) బిడ్డలను చూసినప్పుడు నా మనసు విలవిల్లాడేది. చిన్న వయసులో నన్ను పాలించిన దైవాన్ని వరం కోరుకొన్నాను. దేవుడు కూడ ఈ పేదరాలి కోరికను మన్నించి తీర్చాడు. నిన్ను నాకిచ్చాడు. ఒకవైపు నిన్ను కన్నందుకు నా మనసు, శరీరం ఉప్పొంగాయి; ఇంకొకవైపు నీ తండ్రి కోపానికి గురవుతానేమోనన్న భయం. కానీ ఆయన మాటను నెరవేర్చాల్సిన బాధ్యతను మాత్రం నామీద పెట్టేసి ఆయన వెళ్ళిపోయారు.

"కుమారా! నిన్ను ఈ లౌకిక జీవితంలో చిక్కుబడకుండ శివభక్తశిఖామణిగా పెంచుతానని నీ తండ్రికి మాటిచ్చాను. అది నెరవేర్చాననే కొంతకాలం క్రితం వరకు భావించాను.

"కానీ, నా ప్రాణానికి ప్రాణమైన కుమారా! నా కంటిపాపైన ముద్దుల కుమారా! కొన్నాళ్ళుగా నేను ఏవేవో వింటున్నాను. అటువంటి మాటలు విన్నప్పుడల్లా నా మనసు పుండైపోతూంది. నేను వింటున్నదంతా అబద్ధమని తేల్చి చెప్పి నా మనసుకు కలిగిన గాయాన్ని మాన్చవా?" అని తల్లి శెంబియన్ మహాదేవి బతిమాలారు.

"అమ్మా! మీ మర్మభూయిష్టమైన మాటలు నా మనసును కూడ గాయపరుస్తున్నాయి. మీరేం విన్నారు? నానుంచి ఏం ఎదురు చూస్తున్నారు? నన్ను ఏం భరోసా అడుగుతున్నారు?" అని మధురాంతకుడు చిటపటలాడాడు.

"బిడ్డా! నా మనసులోని మాటను గ్రహించే శక్తిని నీవు కోల్పోయావు కాబోలు. నా మనసులోని మాటను నోరు తెరిచి చెప్పవలసిందే కాబోలు. సరే చెబుతున్నాను, విను. నీ మనసు శివభక్తి అనే గంగానదినుంచి రాజ్యకాంక్ష అనే కుంటలో పడిపోయిందని విన్నాను. చోళ సింహాసనాన్ని అధిష్టించాలని ఆశపడుతున్నావని విన్నాను. నీ పునీతమైన మనసును మన విరోధులు అలా చెడగొట్టారని విన్నాను. నేను విన్నది నిజం కాదని నీవు చెబితే, నా మనసు చల్లబడుతుంది!" అన్నారా మహాతల్లి.

మధురాంతకుడు ఇంతవరకు కూర్చొన్నా పీఠంనుంచి లేచి నిలబడ్డాడు. అతని ఉద్రేకం చూసి తల్లి కూడ లేచి నిలబడింది.

"నా మనసును విరోధులెవ్వరూ చెడగొట్టలేదు. నేను సింహాసనమెక్కాలని కోరుకొనేవారు నా

విరోధులా? నాకోసం తమ ప్రాణాలను కూడ ఇచ్చేందుకు సిద్ధమై ముందుకు వచ్చినవారు నా విరోధులా? ఏనాడూ కాదు. నిజానికి నా జన్మ విరోధి ఎవరు? నన్ను కన్న నీవే...!" అని మధురాంతకుడు అరిచాడు.

~

ఆవేశం, ఉద్రేకం, ఉక్రోషం వల్ల అతగాడప్పుడు మర్యాద మరిచాడు; చిన్న పళువేట్టరయ్యర్ మంచిమాటలతో తల్లి మనసు మార్చమని చెప్పి పంపించిందంతా మరిచి నిప్పులుగక్కాడు.

"అవును. నీవే నా జన్మ శత్రువు. ఇంకెవరూ కాదు. నీవూ ఒక తల్లివేనా? నీవూ ఒక స్త్రీవేనా? లోకంలో తల్లులు తమ పిల్లల హక్కుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కథల్లోను, కావ్యాల్లోను విన్నాను. నా జీవితంలోను చూశాను. తల్లి స్వభావానికే/ప్రకృతికే విరుద్ధంగా ఉన్న నీవు మానవస్త్రీవేనా? లేక మానవరూపంగొన్న రాక్షసివా? నేను నీకేం ద్రోహం చేశాను? ఎందుకని నీవు నాకీ ద్రోహాన్ని చేస్తున్నావు? అన్ని విధాల న్యాయ, ధర్మాల ప్రకారం నాకు చెందవలసిన రాజ్యాన్ని లాగేసుకొని ఇంకొకరికివ్వడంలో నీకెందుకింత శ్రద్ధ? నా తండ్రి కోరిక అంటున్నావు. ఆయనకు నీవు మాటిచ్చానని అంటున్నావు. దానికి ఋజువేమి? నేను నమ్మను. నాకెవరో దుర్బోధలు చేశారంటున్నావు. లేనే లేదు. నీకే ఎవరో దుర్బోధలు చేసి నీ మనసును చెడగొట్టేశారు. తల్లిని కొడుక్కి విరోధిగా మార్చేశారు. న్యాయంగా నాకు చెందవలసిన చోళసామ్రాజ్యాన్ని నేనేనాడూ చేజారిపోనివ్వను. నీవు చెప్పినా వదిలిపెట్టను. కైలాసం చేరుకొన్న నా తండ్రే తిరిగి వచ్చి చెప్పినా వినను. ఈ చోళ సామ్రాజ్యం నాది; ఈ పురాతన సింహాసనం నాది; కరికాల్ పెరువళత్తాన్ ధరించిన ఈ మణిమకుటం నాకు చెందాలి. వాటిని నేను పొందే తీరుతాను. ఇదిగో నా మెడలో ఉన్న రుద్రాక్ష మాల, నీవు నాకిచ్చింది; తల్లి అన్న గౌరవం వల్ల ఇన్నాళ్ళు ధరించాను; నన్ను పేడివాడిని చేసి దేశమంతా నన్ను చూసి నవ్వేటట్లు చేసిన ఈ రుద్రాక్షమాల ఇదిగో ఇప్పుడే తీసేస్తున్నాను; నీవే దాన్ని మెడలో వేసుకో!"

ఇలా పిచ్చి పట్టినవాడిలాగ పేలుతూ తన మెడలోని రుద్రాక్షమాలను తీయనారంభించాడు మధురాంతకుడు. విప్పలేక దాన్ని తెంచేందుకు ప్రయత్నించాడు; కానీ అది గొంతు నులిమేసిందేగాని మాల తెగిపోక అలాగే నిలిచిపోయింది.

~

మధురాంతకుడు స్ఫురద్రూపి; సుందరచోళుల కుమారులకన్న సుందరుడని చెప్పవచ్చు. అటువంటి అందగాడి ముఖం ఇప్పుడు కోపం వల్లనూ, ఆవేశం వల్లనూ వికారంగా కనిపించింది. అది చూసి సహించలేక శెంబియన్ మహాదేవి కళ్ళు మూసుకొన్నారు.

అతడు కేకలేసి ఆపేసిన తర్వాత ఆమె కళ్ళు తెరిచారు. ఎప్పటిలాగ శాంత స్వరంతో, "కుమారా! కాస్త నెమ్మదిగా ఉండు. నేను వంచక రాక్షసినైనా నా మాటలను కాస్త శ్రద్ధతో విను!" అన్నారు.

మధురాంతకుడు ఆ శాంత స్వరం విని కాస్త తగ్గాడు. "బాగా వింటున్నాను. విననని చెప్పలేదే?"

అన్నాడు.

"తల్లి ప్రకృతి గురించి నీవు వక్కాణించావు. అతి చెడ్డదైన రాక్షసి కూడ తన బిడ్డకు ద్రోహం చేయదు. క్రూర మృగాలు కూడ తమ పిల్లలను తక్కిన క్రూర మృగాల నుంచి కాపాడేందుకు ప్రయత్నిస్తాయి; అలాగే నేను కూడ నిన్ను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాను. నీవు రాజ్యానికి ఆశపడవద్దని నీకు నేనింతకు మునుపు చెప్పిందేగాక, ఇంకొక కారణం కూడ ఉంది. రాజ్యకాంక్ష వల్ల నీ ప్రాణానికే ఆపద వస్తుంది. కని పెంచిన తల్లి తన కొడుకు సజీవంగా ఉండాలని కోరుకోవడం నేరమా? నీవు రాజ్యానికి ఆశపడితే సుందర చోళ చక్రవర్తి కుమారులకు విరోధివౌతావు. ఆదిత్య కరికాలన్, అరుళ్మొళి వర్మ వీరాధివీరులు. నీవేమో ఆయుధమెత్తి ఎరగనివాడివి. చోళసామ్రాజ్యపు సైన్యమంతా వారివైపే ఉంటుంది. సేనాధిపతులు కూడ వారివైపే ఉంటారు. ఇరుగు పొరుగు రాజ్యాలలో కూడ వారికి స్నేహితులున్నారు. నీకు తోడెవరు? ఎవరిని నమ్మి నీవు వారిని ఎదిరించగలవు? కుమారా! కొన్నాళ్ళుగా ఆకాశంలో ధూమకేతువు కనిపిస్తుండడం నీవెరుగుదువు. తోకచుక్క ఆకాశంలో అగుపిస్తే రాజవంశస్థులకు అపాయమన్న విషయం జగద్విదితమే. అలా కలిగే అపాయం నీకు కలగకూడదనే నేను దిగులుపడుతున్నాను. బిడ్డా! నా ఏకైక పుత్రుడు సజీవంగా ఉండాలని కోరుకోవడం నేరమా? అది నేను నీకు చేసే ద్రోహమా?"

ఈ మాటల వల్ల మధురాంతకుని ఆవేశం కాస్త తగ్గింది. అతడి మనసు కాస్త నెమ్మదిగొంది.

"అమ్మా! మన్నించండి! మీ దిగులు ఇదీ అని ముందే చెప్పివుండవచ్చు కదా? ఒక్క క్షణంలో మీ దిగులు పోగొట్టేవాడిని కదా? నేనలా తోడు లేని అనాధను కాను! చోళ సామ్రాజ్యంలో చాల పలుకుబడి కల చిన్నరాజులు, ఉన్నతాధికారులు నావైపు ఉన్నారు. పళువేట్టరయ్యర్లు నా పక్షాన ఉన్నారు. కడంబూర్ శంబువరయ్యర్ నావైపు ఉన్నారు. తమ సహోదరుడు, నా మామగారైన మళవరయ్యర్ నావైపున్నారు. ఇంకా పలువురు సామంతరాజులు తమ పూర్ణ బలగంతో నాకండగా ఉన్నారు. అలాగని సత్య ప్రమాణం చేశారు..."

"కుమారా! వీరు చేసే సత్య ప్రమాణంలో నాకు నమ్మకం లేదు. సుందర చోళ చక్రవర్తికి, ఆయన సంతతికి విశ్వాసంతో సేవ చేస్తామని ఒకప్పుడు సత్యప్రమాణం చేసినవారు వీరంతాను. వారిప్పుడు నీకు విశ్వాసపాత్రులుగా నడుచుకొంటారని అనుకొన్నా కూడ, వీరి దగ్గరున్న సైన్యం అతి చిన్నదని నీకు తెలుసా? ఉత్తరాన ఉన్న సైన్యం ఆదిత్య కరికాలన్ నేతృత్వంలో ఉంది. దక్షిణ సైన్యమేమో కొడుంబాళూర్ వేళార్ నాయకత్వంలో ఉంది."

"అమ్మా! నాకు ఆదరణ చూపే రాజులందరూ తలా పదహారువేల సైన్యాన్ని తీసుకొని రాగలవారు."

"సైన్యం మాట అలా ఉండనీ. ప్రజల మాటేమి? చోళదేశ ప్రజలు సుందర చోళ చక్రవర్తి కుమారుల మీద ఎంతటి అభిమానం కలవారో నీకు తెలియదా? ఇవాళ నీవే చూశావు. ఈ పళైయారై నగరానికి ఆదిత్య

కరికాలనో, అరుళ్మొళి వర్మనో వస్తే ప్రజలు ఎలా తండోపతండాలుగా వచ్చి స్వాగతం పలికేవారు? ఈ ఊరి ప్రజలు ఒకప్పుడు నీపైన కూడ అభిమానం కలిగివుండేవారు. నీవు పళువేట్టరయ్యర్లతో బంధుత్వం కలుపుకొన్న తర్వాత నీపట్ల విముఖత్వం పెంచుకొన్నారు...."

"అమ్మా! ప్రజల అభిమానం గురించి నేను కించిత్తు కూడ దిగులుపడను. ప్రజల అభిమానం వల్ల ఏం ప్రయోజనం? ప్రజలు పరిపాలించబడేవారు. సింహాసనం పైన ఎవరు కూర్చొనివుంటే వారిపైన భక్తి కలిగి ఉండవలసిన వారు!"

"కుమారా! నీకు బోధ చేసినవారు రాజనీతిలో మొదటి పాఠాలను కూడ నేర్పలేదు. ప్రజల అభిమానం లేకుండ ఏ రాజు కూడ చాల కాలం పాలించలేడు. అలా రాజ్యమేలడంలో పుణ్యం కూడ లేదు...!"

ఇలా ఆ మహారాణి చెబుతున్నప్పుడు అంతఃపురం వాకిట ఏదో ఒక పెద్ద కోలాహలం వినిపించింది. ఎలుగెత్తి ఏడుస్తున్న గొంతులు, శాపనార్థాలు, కోపపూరిత స్వరాలు, ప్రశ్నిస్తున్న గొంతులు వేలకొద్ది ప్రజలనుంచి సముద్రపుటలలాగ లేచి రాసాగాయి.

"కుమారా! చోళసామ్రాజ్యానికి ఏదో ఒక పెద్ద విపత్తు మూడింది. దాని ఆనవాలే ఇది. నేను అంతఃపురం బయటకు వెళ్ళి అదేమని తెలుసుకొని వస్తాను. అందాక నీవిక్కడే ఉండు!" అన్నారా తల్లి.

~~~
~~~

# అధ్యాయము - 22

## 'ఏమా శబ్దం?'

**కొలను** దగ్గరకు రాగానే పడవలో ఉన్నది కుందవై దేవే అని గ్రహించాడు వంతిదేవుడు. ఆళ్వార్ కట్టియాన్ అక్కడ ఆగగానే వంతిదేవుడు జంకుతూ నిలబడ్డాడు.

"అబ్బాయీ! ఎందుకీ జంకు? యువరాకుమారి నీకోసం చాలసేపటినుంచి వేచివున్నారు. పడవెక్కిన వెంటనే 'యువరాజు వచ్చేశారు. క్షేమంగా ఉన్నారు' అన్న శుభవార్తను అందించు. నీ వీరప్రతాపాలను చెప్పుకొంటూ ఊరకే కాలం వ్యర్థం చేయకు! నేనిక తిరిగి వెళతాను. పళైయారైలో మనమిప్పుడు కలవర పిశాచిని విప్పి వదిలిపెట్టాము. దాన్ని మళ్ళీ పట్టి పంజరంలో బంధించ సాధ్యమా అని చూస్తాను. నీ గడబిడ సాహసాలవల్ల ఎన్ని ఇబ్బందులు చూడు!" అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ వచ్చిన దారినే వేగంగా తిరిగి వెళ్ళాడు.

వంతిదేవుని ఆశ్చర్యానికంతులేకపోయింది. నోరు విప్పి తనను ఏమీ అడగకనే అన్ని విషయాలు ఎలా తెలుసుకొన్నాడు? లేక ఒట్టి ఊహా? లేక అన్నీ ఎరిగినవాడా? ఇల్లూ వాకిలి లేని సన్యాసులు ఒక పరంపర, బిచ్చానికి ఇంకొకరు అని రెండు రకాలున్నారు కాబోలు. నేను అవసరం వచ్చి గూఢచారినైనాను. కాబట్టి తరచూ ఇక్కట్లలో చిక్కుకొంటున్నాను. ఈ వైష్ణవుడు గూఢచారుల పరంపరకు చెందినవాడు కాబోలు. అందుకే ఎటువంటి ఆదుర్దా, గాభరా లేకుండ నెమ్మదిగా తన పని తాను చేసుకొంటూ వెళుతున్నాడు. కానీ ఇతడు ఎవరికి పని చేస్తున్నాడు? ఇతడి యజమాని ఎవరు? ఇతడు తన గురించి చెప్పిందంతా నిజమేనా?

ఇలా ఆలోచిస్తూనే కొలను గట్టు దగ్గరకు వచ్చిన వంతిదేవుడు పడవలో ఉన్న యువరాకుమారి ముఖాన్ని చూశాడు. తాను వెళ్ళి వచ్చిన కార్యాన్ని కూడ మరిచిపోయాడు. లోకాన్నే మరిచాడు. తననే మరిచాడు. ఆహా! ఈమె ముఖం తనను విడిచి ఒక్క క్షణం కూడ ఉండడం లేదు. కలలోను, ఇలలోను, సుడిగాలిలోను, జడివానలోను, కడలి మధ్యను తనతోనే వస్తూంది. కానీ ఏమీ వింత? ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడు ఆమె ముఖం ఎందుకు మరింత అందంగా కనిపిస్తోంది? ఎందుకు తన మనసులో పులకరింత? ఎందుకు నా గొంతు పూడుకుపోతూంది? మనసులో ఎందుకీ గాభరా?

~

తన్ను తాను మరిచి వంతిదేవుడు నీట దిగి కొన్ని అడుగులు ముందుకు వేసి పడవెక్కాడు. యువరాకుమారి పడవనడిపేవాడిని చూసి సైగ చేసింది. పడవ ముందుకు సాగింది. వంతిదేవుని మనసు కూడ.

"నిమిత్తకారుడా! యువరాజులకు మాత్రమే నీవు జోస్యం/నిమిత్తం చెబుతావా? లేక నాకూ చెబుతావా? ఎలా చెబుతావు? ఆకాశంలోని గ్రహాలను, నక్షత్రాలను చూసి చెబుతావా? లేక, కాకులను, పిచ్చుకలను చూసి చెబుతావా? హస్తరేఖలను చూసి చెబుతావా? ముఖం చూసి చెబుతావు లాగుంది. లేకపోతే నా ముఖాన్నే ఎందుకలా వెర్రివాడిలాగ చూస్తున్నావు? ఇలా నడుచుకొంటే ఉన్నత వంశానికి చెందిన అమ్మాయిలెవరూ నిన్ను జోస్యం అడిగేందుకు ముందుకు రారు!" అని యువరాకుమారి అన్న మాటలు వంతిదేవుని చెవులకు మధుర కింకిణి నాదంలాగ వినిపించాయి.

"అమ్మణీ! జోస్యం చెప్పేందుకు మీ ముఖారవిందాన్ని చూడలేదు. ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుంది కద అని గుర్తుచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను....!"

"తెలుసు, తెలుసు! మీకు మరుపెక్కువని తెలుసు. ఇంచు మించు నలభై రోజుల క్రితం కుడందై జ్యోతిష్కుల ఇంట మొట్టమొదట చూశారు. తర్వాత ఆ రోజే అరిసిలా నదీతీరాన చూశారు..."

"అమ్మణీ! ఆపండి! మీమాటలను నేను నమ్మలేకున్నాను. నలభై రోజుల క్రితమేనా నేను మిమ్మల్ని చూశాను? నలభైవేల ఏళ్ళకు మునుపు చూడలేదా? నూరు జన్మల్లో, నూరు వేలసార్లు నేను మిమ్మల్ని చూడలేదా? పర్వత పాదాలవద్ద చూడలేదా? గుండ్రాళ్ళ కొండ శిఖరాన చూడలేదా? దట్టమైన అడవి మధ్య పులి మిమ్మల్ని తరుముకొని రాగా, నేను మిమ్మల్ని కాపాడలేదా? శూలం విసిరి నేనా పులిని చంపలేదా? అప్పుడు నేనా అడవిలో వేటగాడినై తిరుగాడుతుండేవాడిని. రంగురంగుల రెక్కలున్న చిలకలను వలవేసి పట్టుకొచ్చి మీకిచ్చాను. మీరు వాటిని నా దగ్గరనుంచి తీసుకొని ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరేందుకు వదిలి, గలగలా నవ్వారు. ఒకసారి నేను చేపలు పట్టే బెస్తవాడిగా ఉన్నాను. దూరాన ఉన్న చెరువులకు, వంకలకు వెళ్ళి వెండి చేపలు, బంగారు చేపలు, మరకత చేపలు పట్టి తీసుకొచ్చి ఇచ్చాను. మీరు వాటిని మళ్ళీ పారే నీటిలో వదిలి,  అవి తుళ్ళి ఈదుతూ వెళ్ళడాన్ని చూసి మురిసిపోయారు. అతిదూరాన ఉన్న సముద్రాలకు వెళ్ళి వాటిలో దూకి ఊపిరి బిగబట్టి సముద్రపు లోతులకు వెళ్ళి ముత్యాలను, పగడాలను సేకరించి తీసుకొని వచ్చి మీకిచ్చాను. మీరు వాటిని దోసిట తీసుకొని చిన్న పిల్లలకు ఆడుకోవడానికిచ్చేశారు. దేవలోకానికి వెళ్ళి అక్కడి మందార పూలను, పారిజాత పుష్పాలను కోసి తీసుకొచ్చి మీ ముందు పోశాను. 'మా ఇంటి పెరట్లో పూసే మల్లె పూల సువాసనకు, అందానికి ఇవి సాటి వస్తాయా?' అనేశారు మీరు. దేవేంద్రుడు ధరించే అనుపమాన రత్నహారాన్ని తీసుకొని వచ్చి ఇచ్చాను. 'గుణం, నీతి లేని ఇంద్రుడు ధరించిన హారాన్ని నేను చేత్తోకూడ తాకను!' అనేశారు. కైలాసానికి వెళ్ళి పార్వతీదేవి ముందు తపస్సు చేసి, దేవిని ప్రసన్నం చేసుకొని ఆమె కాలి గజ్జె తీసుకొని వచ్చి, మీ కాలికి తొడుగుతానన్నాను. 'అయ్యయ్యో! పార్వతీమాత కాలి గజ్జెలు నేను తొడగవచ్చా? అపచారం! అపచారం! వెంటనే తిరిగి వెళ్ళి ఇచ్చేసి రా!' అన్నారు. యుద్ధరంగంలో అరవైనాలుగు దేశాల రాజులను ఓడించి, వారి మణిమకుటాలను సేకరించి తీసుకొని వచ్చి మీకు కానుకలుగా సమర్పించాను. వాటిని మీరు కాలితో తన్ని

పక్కకు తోసేశారు. 'అయ్యో! మీ మెత్తని పాదాలు నొప్పెడతాయే!' అని దిగులుపడ్డాను. యువరాకుమారీ! ఇవన్నీ నిజమా? కాదా? లేక నలభై రోజుల క్రితం మిమ్మల్ని నేను మొట్టమొదట చూసిందే నిజమా?" అన్నాడు వంతిదేవుడు. అతడింకా మాట్లాడి ముగించినట్లు తోచలేదు.

"దేవీ! ఇంకొక సంగతి గుర్తుకొస్తోంది. ఒకసారి మనమిద్దరం వెండి పడవెక్కి బంగారు పిడి వేసిన తెడ్లను వేస్తూ ఆకాశ సముద్రంలో వెన్నెల అలలపైన ప్రయాణం చేశాం..." అని మళ్ళీ మొదలెట్టాడు.

"అయ్యయ్యో! ఈ నిమిత్తకారునికి బాగా పిచ్చిపట్టినట్లుంది. పడవను వెనక్కు తిప్పి తీరానికి తీసుకొని వెళ్ళాల్సిందే!" అన్నది యువరాకుమారి.

"లేదు, దేవీ! లేదు! కాసేపటికి మునుపు, ఈ కొలను తీరం చేరేవరకు నా మతి తేటగానే ఉంది. లేకపోతే ఈ పళైయారై నగరంలో ప్రవేశించేందుకు నేను ఉపాయం కనిపెట్టగలిగేవాడినా? మధురాంతకులను నేను నిమిత్తకారుడని నమ్మించి, అంతఃపురం లోపలికి రాగలిగేవాడినా? వైద్యకుమారుని అంత సులభంగా వదిలించుకొని రాగలిగేవాడినా? ఈ పడవెక్కి మీ దివ్య ముఖారవిందాన్ని చూసిన తర్వాతే మధువు గ్రోలినవాడిలాగ మతి పోగొట్టుకొన్నాను!" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యో! అలాగైతే మీరు నా ముఖాన్ని చూడకండి. ఈ కొలను నీటిని చూడండి. నీలాకాశాన్ని చూడండి. కొలను గట్టున ఏపుగా పెరిగిన చెట్లను చూడండి. అంతఃపుర మేడలను చూడండి. పాలరాతి మెట్లను చూడండి. మందార పూలను, చంపక పుష్పాలను చూడండి. అదీ వద్దంటే, ఈ చెవిటి పడవ నడిపేవాడి ముఖాన్ని చూడండి. అలా చూస్తూనే, మీరు వెళ్ళిన కార్యం ఏమైంది? కాయా, పండా అని చెప్పండి. యువరాజును తీసుకొచ్చారా? క్షేమమేనా? ఎక్కడ విడిచిపెట్టి వచ్చారు, ఎవరి దగ్గర, - ఇది మొదట తెలియజేయండి. తర్వాత ఇక్కడినుంచి బయలుదేరినప్పటినుంచి జరిగిందంతా వివరంగా చెప్పండి!" అన్నది యువరాకుమారి.

అందుకు వంతిదేవుడు, "దేవీ! మీవద్ద ఒప్పుకొన్న కార్యాన్ని విజయవంతంగా నెరవేర్చివుండకపోతే, మళ్ళీ తిరిగి వచ్చి మీ ముఖాన్ని చూసేవాడినా? యువరాజును లంకనుంచి భద్రంగా తీసుకొని వచ్చాను. దారిలో ఎదురైన అనేక అపాయాలను, అడ్డంకులను దాటుకొని ఆయనను తీసుకొని వచ్చాను. యువరాజు సుఖంగా ఉన్నారని నేను చెప్పలేను. నేను ఆయనను విడిచి వచ్చినప్పుడు ఆయనకు తీవ్రమైన చలిజ్వరం. కానీ భద్రమైన చేతుల్లోనే ఆయనను ఒప్పగించి వచ్చాను. పడవ నడిపే పిల్ల పూంగుళలి, పూలబ్బాయి సేందన్ అముదన్ చేతుల్లో యువరాజును ఒప్పగించి వచ్చాను. వారు యువరాజు ప్రాణాలను కాపాడేందుకు వందసార్లైనా తమ ప్రాణాలను ఒడ్డేందుకు వెనుకాడరు!" అన్నాడు.

అప్పుడు దూరాన వేలకొద్ది ప్రజల క్రోధ, భీతావహస్వరాలు ఒక్కటిగా ఎలుగెత్తినట్లు వినిపించాయి. ఆ శబ్దం వచ్చిన దిక్కువైపు యువరాకుమారి, వంతిదేవుడు భయంతోను, దిగులుతోను చూశారు.

“అదేం కలకలం? కోపోద్రిక్తులైన ప్రజల హాహాకారంలాగ కద ఉంది?”

“అవును; అలాగే అనిపిస్తోంది!” అన్నాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 23

## వాణతి

[అనువాదకుని మాట: ఈ అధ్యాయం పూర్తిగా వాణతి గుణగణాలను వర్ణించేందుకు తమిళ మూల రచయిత అంకితం చేశారు. అంతకన్న కథ ఇంకేం లేదు. కాబట్టి ఈ అధ్యాయాన్ని అనువాదం చేయలేదు.]

# అధ్యాయము - 24

## గుర్తొచ్చింది

**వాణతి** మళ్ళీ స్పృహ కోల్పోయింది. ఆమె కళ్ళు కూడ మూసుకుపోయాయి. తర్వాత కొద్దికొద్దిగా స్పృహ రాసాగింది. తాను నాగలోకంలోనో, దేవలోకంలోనో పెళ్ళాడినది ఒట్టి భ్రమ అని గ్రహించింది. యువరాజు గురించి ఆ దుర్వార్త వినగానే కొలను గట్టున తల తిరిగి పడిపోయిన విషయం గుర్తు తెచ్చుకొంది. ఈ జ్ఞాపకాలు ఆమెకు ఎనలేని దు:ఖాన్ని, నిరాశను కలిగించాయి; గుండెలో చురుక్కున ఈటె దూసినట్లు బాధించాయి. కళ్ళు తెరవజూసింది. కానీ సాధ్యం కాలేదు. తనను నీటినుంచి తీసి, గట్టుకు తెచ్చింది ఎవరు కావచ్చు? యువరాకుమారే ఉండాలి. తనను వారు ఎందుకు కాపాడి ఉండవచ్చు? ఒక్కసారిగా తనను ఎందుకు మునిగిపోనివ్వలేదు? కళ్ళు తెరిచేందుకు వీలు కాగానే, "నన్ను ఎందుకు కాపాడారు?" అని యువరాకుమారిని అడగాలి! తమ ముద్దుల తమ్ముని పైన వారి ప్రీతి ఇంతేనా...?

ఇదిగో యువరాకుమారి మాట్లాడుతున్నారు. ఏమంటున్నారు? ఎవరితో?

"మైకంలో ఏమేమో పేలుతూంది/వాగుతూంది! ఇంత మటుకు బతికి బయట పడిందే గొప్ప విషయం! మన పడవ ఇంకా దూరంగా ఉండివుంటే? ఈమె కొలనులో పడిపోయిన విషయం మన కంట పడివుండకపోతే? అది తలుచుకొంటేనే నాకు మతి పోతోంది!"

"మనం చూడక విడిచిపెట్టివుంటే ఒక విధంగా మంచిదైవుండేది. ఈ పిల్ల జీవితం మధురంగా ముగిసివుండేది. మనవల్ల బతికి బయటపడ్డ కొడుంబాళూర్ రాకుమారి జీవితంలో ఎంతో మనోవేదన పడవలసి వస్తుంది..."

ఆహా! ఎవరది, మన గురించి అంతటి కారుణ్యంతో మాట్లాడుతున్నారు? అవును, ఆ యువకుడే! కుడంద్దై జ్యోతిష్కుల ఇంట, తర్వాత అరిసిలా నదీతీరాన చూసిన ఆ వీర యువకుడే! యువరాజు కడలిలో మునిగిపోయిన వార్తను కూడ ఆయనే తీసుకొని వచ్చివుండాలి. ఇంకా వీరేం మాట్లాడుకొంటున్నారు? విందాం. కళ్ళు తెరవలేకపోయినా మాటలు వినిపిస్తున్నాయి కదా?

"ఇదేమి? ఇంత నిర్దయగా మాట్లాడుతున్నారు? మగవాళ్ళ గుండె రాతిగుండెగానే ఉంటుంది కాబోలు!" అన్నది కుందవై దేవి.

"అలా పాషాణహృదయుడనని తీర్మానించేందుకు నేనిప్పుడేమన్నాను?"

"ఈ అమ్మాయి చచ్చిపోయివుంటేనే మంచిదన్నారు కదా? అది చాలదా? ఎంత కష్టపడి నేనీ పిల్లను పెంచుకొస్తున్నానో, తెలుసా?"

"ఈమె పిచ్చి ప్రేలాపనలు మీరు విన్నారా?"

"మీ చెవిన ఏం పడింది?"

"యువరాజును పెళ్ళాడడం గురించి ఏదో వినిపించింది..."

"అవును; స్పృహ లేనప్పుడు కూడ ఆమె నోరు అలా జపం చేస్తూంటుంది. యువరాజు పైన ఆశ ఆమె మనసులో అంతగా పేళ్ళూనింది."

"ఆ ఆశ ఆమెకు అంత మంచిది కాదు. అందువల్ల దు:ఖమూ, నిరాశే మిగులుతుంది."

"ఎందుకలా అంటున్నారు? ఈమె కన్న యువరాజుకు తగిన ఉన్నత కుల యువతి ఇంకెవరున్నారు? పురాతనమైన కొడుంబాళూర్ వీరవంశం గురించి మీకు తెలియదా?"

"బాగా తెలుసు. నేననుకొంటున్నదొకటి. మీరంటున్నది ఇంకొకటి. ఈ అమ్మాయి ఎంతటి ఉన్నతకుల సంజాత అయితేనేమి? ఈమె మనసులోని కోరిక నెరవేరదు..."

"తప్పక నెరవేరే తీరుతుంది. అది ఈమె మనసులోని కోరిక కాదు. నా మనోరథం; నేను చేసిన తీర్మానం."

"మీ తీర్మానమైనా ఈ విషయంలో నెరవేరదు."

"ఎందుకు మళ్ళీ అలా అంటున్నారు? యువరాజు నాగపట్టణపు చూడామణి విహారంలో క్షేమంగా ఉన్నారని మీరు కాసేపటి క్రితం చెప్పిన మాట నిజమే కద?"

ఆహా! ఇదెంతటి ఇంపైన వార్త? యువరాజు క్షేమంగా ఉన్నారా? నాగపట్టణపు చూడామణి విహారంలో ఉన్నారా? ఈ వార్త వినేందుకు ఈ చెవులు ఎంతటి భాగ్యం చేశాయి! కొలనులో మునిగి చనిపోకుండ బతికి బయటపడ్డది ఎంత మంచిదైంది! యువరాకుమారికి తాను ఎన్నో విధాల ఋణపడివుంది. ఇప్పుడు ఇది కూడ చేరింది. కానీ, అయ్యో! ఇదేమిటి వీరు ఇంకా ముందుకు చెబుతున్న సంగతి? చెవిలో సీసాన్ని కరిగించి పోసినట్లుందే!

"అమ్మణీ! యువరాజు క్షేమంగా ఉన్నారన్నది నిజమే. అబద్ధం కాదు. అందువల్ల ఈ అమ్మాయి ఆశ/ఆశయం నెరవేరుతుందని ఏం నిశ్చయం? యువరాజు ఈ అమ్మాయిని పెళ్ళాడుతారని నేననుకోను..."

"మీరేమైనా అనుకోవచ్చు. ఈ లోకంలో నేను గీచిన గీటు దాటక, నేను చెప్పిన మాటను శిరసావహించే మగపిల్లాడొకడున్నాడు. వాడే నా తమ్ముడు అరుళ్మొళి వర్మ!"

"యువరాకుమారీ! అటువంటి వాడిని నేనొకడిని కూడ ఉన్నాను..."

"మరి నాకేం కొరత? నా మనోరథం నెరవేరేందుకు ఏం అడ్డు? పళువేట్టరయ్యర్లు ఇందుకు కూడ అడ్డు వస్తారా, ఏం....?"

"అది నాకు తెలియదు. మీపైన యువరాజుకు ఎనలేని ప్రీతి ఉందని నేనెరుగుదును. ఇంకే విషయంలోనైనా మీ మాట వింటారు. ఆయనకు రాజ్యమేలడంలో ఏమాత్రం ఆసక్తి, ఇష్టం లేదు. నా కళ్ళ ముందే లంకారాజ్యపు మణిమకుటాన్ని తిరస్కరించారు. కానీ మీరు ఆజ్ఞాపిస్తే రాజ్యమేలేందుకు

సమ్మతిస్తారు. కానీ ఈ అమ్మాయిని పెళ్ళాడేందుకు...”

“సమ్మతించడనా మీరు చెబుతున్నారు? అలా నా సెచ్చెలిని నిరాకరించేందుకు వాడు ఈమెలో ఏం కొరత చూశాడు/కన్నాడు? మీరేం చూశారు?”

“అమ్మణీ! నాకీ అమ్మాయిలో ఏ లోపమూ కనిపించలేదు. చూసినా నమ్మను. యువరాకుమారి అంతఃపురంలో పనిచేసే పనిపిల్లకూడ నాకు దేవకన్యలాగే కనిపిస్తుంది. యువరాకుమారి తోటలో పరుగెడుతుండే కుందేళ్ళు కూడ దేవేంద్రుని ఐరావతం కన్న మిన్నగా కనిపిస్తాయి. యువరాజుకు కూడ ఈ అమ్మాయిలో ఏ లోపమూ కనిపించలేదు. కానీ ఆయన మనసు ఇంకొక అమ్మాయి పైకి మళ్ళివుండవచ్చు కద...?”

అయ్యో! ఎంత కఠినమైన మాటలు! ఈ యువకుడెందుకు గాయపడ్డ హృదయాన్ని ఇంకా గాయపరుస్తున్నాడు?

“వాణర్ కులవీరా! మీరు చెబుతున్నది నాకర్థం కావడం లేదు. నా తమ్ముని గురించి ఎందుకిలా మాట్లాడుతున్నారు?”

“అపనింద వేయడం లేదు, యువరాకుమారీ! నిజాన్నే చెబుతున్నాను. కళ్ళతో చూసి, చెవులతో విన్నదే చెబుతున్నాను...”

“ముందుకు చెప్పండి. ఎంతటి కఠినమైన, కష్టమైన విషయమైనా సరే, వింటాను. ఇప్పుడు నేను సిద్ధంగా ఉన్నాను.”

“పడవ నడిపే అమ్మాయి పూంగుళలి గురించి మీకు చెప్పాను కద? లంకకు నన్ను తీసుకొని వెళ్ళి చేర్చింది కూడ ఆమే. యువరాజును, నన్ను నడిసముద్రంలో మునిగిపోకుండ కాపాడింది కూడ ఆమే. పడవలో యువరాజును చూడామణి విహారానికి తీసుకొని వెళ్ళింది కూడ ఆమే. నేను సేందన్ అముదన్ని మాత్రం నమ్మి యువరాజును ఒప్పజెప్పి వచ్చేవాడిని కాను. పూంగుళలిని నమ్మే యువరాజునామెకు ఒప్పజెప్పి వచ్చాను. ఆ అమ్మాయికి వేయి ప్రాణాలుంటే అన్నిటినీ యువరాజుకు అర్పిస్తుంది...”

“అందువల్లనేమి? పడవ నడిపే పిల్ల, పడవ నడిపే పిల్లే కద? ముల్లోకాలేలేందుకు పుట్టిన వాడిని గురించి ఆమె కలలు కనదగునా? నేలపై కుప్పిగంతులేసే పిచ్చుక/ఉడత ఆకాశంలో ఎగిరే గరుడుని కన్నెత్తి చూడదగునా?”

“ఎందుకు వల్ల కాదు? పిచ్చుక/ఉడత కూడ గరుడుని తలెత్తి చూడవచ్చు; గరుడుడు కూడ వంగి పిచ్చుకను/ఉడతను చూడవచ్చు; చూసి ఆశపడవచ్చు కూడ.”

“నా తమ్ముని మనసులో అలాంటి ఆలోచన ఉదయిస్తే, దాన్ని తుడిచేయడానికి నేనున్నాను. కూడనే కూడదు. ఎన్నో అపాయాలనుంచి అరుళ్మొళిని నేను కాపాడాను. ఈ పడవ నడిపే పిల్ల మోహాపు వలనుంచి కూడ నేనే వాడిని తప్పిస్తాను...”

"పడవ నడిపే పిల్లంటే అంత చులకనా/లోకువా? ఆమె ఒంట్లో పారేదీ రక్తమే కద? కులగోత్రాలు అంత ముఖ్యమా? ఆమె మనసు కూడ అంతఃపురంలో పుట్టిన యువరాజు మనసులాగ స్పందించదా? చూడబోతే యువరాజు ప్రేమలో రాజ్యకాంక్షలాంటివి కలిసివుండవచ్చు. కానీ ఆ పడవ పిల్ల ప్రేమ స్వచ్ఛమైనది/మచ్చలేనిది; పునీతమైనది. యువరాజు కూడ అలాగే నమ్మారు. తక్కినవారు ఎందుకు అడ్డుపడాలి? ఇప్పుడు, ఉహుం - నా విషయమే తీసుకోండి. నా హృదయాన్ని చీల్చి అందులో ఏముందో మీకు చూపడం సాధ్యమైతే..."

"వద్దు, వద్దు! మీ హృదయంలో ఏముందో అది అలాగే భద్రంగా ఉండనీ. అదే మంచిది. ఆప్యాయత, ఆశ, పాశం, ప్రేమ, మమత మొదలైనవన్నీ ఇతరులకు తగును. కానీ రాజ్యమేలేందుకు పుట్టినవారి సంగతి వేరు. వారు రాజకులంలోనే వివాహం చేసుకోవాలి. చపలచిత్తులు కాకూడదు. అలా జరిగితే దానివల్ల చాల అవాంతరాలు, అపాయాలు వస్తాయి. మా కుటుంబంలోనే అందుకు తగిన ఉదాహరణ ఉంది. నా తండ్రి యుక్త వయసులో - రాజ్యం ఆయనకొస్తుందన్న ఆలోచనే లేనప్పుడు - ఇలాగే అడవిలో పెరిగిన పిల్లనొకదాన్ని...! కానీ నేను మీకిప్పుడిదంతా ఎందుకు చెప్పాలి? ఈ పిల్లకు స్పృహ వచ్చేస్తుంది. కనురెప్పలు కదులుతున్నాయి. ఇంకేమీ చెప్పడానికి లేదా? లంకలో మీరు ఇంకెన్నో అపాయాలను ఎదుర్కొన్నారని చెప్పారు కద? అవి వివరించండి."

"అవును, యువరాకుమారీ! యువరాజు లంకా సింహాసనాన్ని, మణిమకుటాన్ని తిరస్కరించి తిరిగి వస్తున్న ఆ రాత్రి, అనురాధపురం వీధుల్లో మేము నడుస్తూ వస్తున్నప్పుడు, ఉన్నట్లుండి ఒక కట్టడపు ముందు భాగం విరిగి పడింది. మేమక్కడ ఒక్క క్షణం ఆలస్యం చేసివుంటే సమాధైవుండేవాళ్ళం. ఆ సమయాన ఒక స్త్రీమణి ఉన్నట్లుండి అక్కడ ప్రత్యక్షమైంది. సైగ చేసి యువరాజును పిలిచింది..."

"దైవమా! అక్కడ కూడ ఒక స్త్రీనే కాపాడాలా మిమ్మల్ని? ఎవరామె?"

"ఆమె ఎవరో నాకు తెలియదు. కానీ యువరాజుకు ఇంతకు మునుపు పరిచయమైనట్లుంది. అనవసర సందేహాలకు లోను కాకండి, రాకుమారీ! ఆమె తల్లి ప్రాయపు ప్రౌఢవనిత..."

"ఎంత వయసుండవచ్చు?"

"యువరాజుకు తల్లి కాదగిన వయస్సు. దానికి తోడు మూగది, చెవిటిది కూడాను!"

"ఏమేమి? ఇంకొకసారి చెప్పండి!"

"పుట్టుకతో మూగది, చెవిటిది అయిన ఆమె ఒక మూగవనిత. వయసు సుమారు నలభైయైదు ఏళ్ళకు పైబడి ఉండవచ్చు...."

"అయ్యో! అటువంటి ఒక మూగవనితను మీరు లంకలో చూశారా? ఆమె గురించి ఇంకా చెప్పండి. ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించి ఏమీ తెలియదా? ఆమె ఎక్కడిది?"

"లంకకు పక్కనే ఉన్న ఇంకొక దీవిలో పుట్టిన వనిత..."

యువరాకుమారి కుందవై ఎనలేని ఆతురతతో, "అయ్యా! ఇంకా చెప్పండి! చూసేందుకు ఆమె ఎలా ఉంటుంది?" అని అడిగింది.

"అమ్మణీ! ఆమె రూపంలో ఒక వైచిత్ర్యం చూశాను. అది చెప్పేందుకే నాకు ధైర్యం చాలడం లేదు."

"జంకవద్దు. వెంటనే చెప్పండి."

"చోళదేశంలో నేను చూసిన ఒక స్త్రీలాగే ఆమె అగుపించింది. వయసు మాత్రమే అధికం. వస్త్రాభరణాలేవీ ధరించక తల విరబోసుకొనివుంది. అది తప్ప నేనిక్కడ చూసిన స్త్రీని అచ్చం పోలివుంది. అదే ముఖం. అదే రూపం. నిజానికి నేను ఒక క్షణం మోసపోయాను."

"అయ్యా! అలాంటి స్త్రీ - ఇక్కడున్న స్త్రీ - ఎవరు?"

"రాకుమారీ! మీరు ఊహించి తెలుసుకోలేకున్నారా?"

"నేనా? ఈ వాణతినా? తంజావూరు అంతఃపురంలో ఉన్న నా తల్లా?"

"మీరు సూచించినవారెవ్వరూ కారు."

"పళువూర్ యువరాణి నందినా?"

"అవును, నందినే!"

"దైవమా! అలాగైతే నేను సందేహించింది నిజమే!"

"ఏం సందేహించారు?"

"విషనాగం కన్న క్రూరురాలైన ఆమె నా అక్క కావచ్చా అని సందేహించాను. అది నిజమని మీరు చెబుతున్న విషయం వల్ల తెలుస్తోంది. విధి బలీయమైనది. ఇందునుంచి కులగోత్రాలు తెలియని ఒక పిల్లను ఒక రాజవంశీయుడు పెళ్ళాడడం ఎంత పెద్ద పొరబాటో తెలుస్తూంది."

"అమ్మణీ! నేను కులగోత్రాలు తెలియనివాడిని కాను. నా పూర్వీకులు మూడువందలేళ్ళు తమిళనాడును ఏలినవారు. చేర, చోళ, పాండ్యులను చెరలో వేసినవారు. ఇప్పుడు నాకు రాజ్యం లేకపోయినా నా చేతిలో ఖడ్గం ఉంది; నా భుజంలో బలముంది; నా గుండెలో ధైర్యముంది..."

"మీ గొప్పలు ప్రస్తుతానికి కాస్త పక్కన పెట్టండి. వెంటనే చేయవలసిన ముఖ్యమైన కార్యాలు చాలానే ఉన్నాయి. మీ సహాయం నాకు ఇంకా కావలసివుంది. సహాయం చేస్తారు కద?"

"నాకు వేయి ప్రాణాలుంటే వాటన్నిటినీ మీకోసం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను!"

"ఆ పడవ నడిపే పిల్ల పూంగుళలికి మీరు తోడబుట్టినవారు లాగుంది. మంచిది; ఆ మాట ఇప్పుడు వద్దు. ఇదిగో, ఈ అమ్మాయి కళ్ళు తెరుస్తోంది..."

అవును; ఇంతలో వాణతికి పూర్తిగా తెలివి వచ్చేసింది. ఒంట్లో శక్తికూడ వచ్చింది. మనసులో అనేక రకాలైన ఆలోచనలు పుట్టాయి. యువరాజు ముందు ఆ పడవ నడిపేపిల్ల ప్రేమ కన్న తన ప్రేమే

గొప్పదని నిరూపించేవరకు తాను సజీవంగా ఉండాలి అని తీర్మానించుకొంది. అంతేగాక, ఒకరోజు రాత్రి తంజావూరు అంత:పురంలో చూసిన దృశ్యం, విన్న దీనాలాపనలు గుర్తుకొచ్చాయి. వాటి అర్థం ఇప్పుడు ఒకింత తెలియవస్తూంది.

వాణతి కళ్ళు తెరవగానే యువరాకుమారి, "చిన్నా! నీవిప్పుడెలా ఉన్నావు?" అని అడిగింది.

"నాకేమీ కాలేదక్కా! మీకిబ్బంది కలిగించాను కద అని బాధపడుతున్నాను" అన్నది.

ఆ సమయాన ఆళ్వార్ కట్టియాన్ ప్రవేశించి, "నేనూ మీకిబ్బంది ఇవ్వడానికే వచ్చాను, దేవీ! అంత:పురం వాకిట ఓ పెద్ద గుంపు గుమిగూడివుంది. యువరాజు కడలిలో మునిగిపోయిన వార్త విన్న ప్రజల చాల కోపంగా ఉన్నారు. మీరు వెంటనే వచ్చి వారిని సమాధనపరచకపోతే చాల విపరీతాలకు దారి తీయవచ్చు" అన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 25

## ముఖ్యమంత్రి వచ్చారు

**పళైయారై** నగరవీధులు మునుపెన్నడూ చూడనంతటి అల్లకల్లోలంగా ఉన్నాయి. ఆ మహానగరంలో రాజగృహాలున్నవైపు ప్రజలు తండోపతండాలుగా వెళుతున్నారు. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు - అందరూ ఏకంగా రాజగృహాలున్నవైపు వేగంగా వెళ్ళసాగారు. శైవులు, వైష్ణవులు, జైనులు, బౌద్ధులు - అందరూ ఆ గుంపులో కనిపించారు. కఠినవ్రతాలు పూనిన కాలాముఖవీరశైవులు కొందరు కూడ ఆ గుంపులో అక్కడక్కడ కనిపించారు. ప్రజల్లో చాలమంది ఏడుస్తున్నారు. కొందరు పళువేట్టరయ్యర్లను నోరార/బాహాటంగ శపించసాగారు.

యువకులు కొందరు అక్కడక్కడ చేత తప్పెట్లు పట్టుకొని నిలబడివున్నారు. వారు ఒకరి తప్పెటనింకొకరు తట్టి శబ్దం చేస్తూ ముందుకు నడవసాగారు. తప్పెట శబ్దంతోబాటు, “పళువేట్టరయ్యర్ల తలమీద ఒక దెబ్బ వేయి" అని కొందరు మెల్లగా అన్నారు. అలా అంటున్నవారిలో కాలాముఖులు ప్రముఖంగా ఉన్నారు.

పళైయారైలోని రాజమాళిగల ముందు భాగాలు చంద్రవంక ఆకారంలో నిర్మించబడివున్నాయి. వాటి ముందు భాగాలు చేర్చి విశాలమైన, వేవేల ప్రజలు సమావేశం కాగల బయలు ప్రదేశం ఉంది. ప్రాంగణం చుట్టూ ఎత్తైన ప్రాకారపు గోడ కట్టబడివుంది. ఆ ప్రాకారంలో మూడు వాకిళ్ళు. ఒక్కొక్క వాకిట అంతఃపుర భటులు పలువురు కాపలా ఉన్నారు.

~

గుంపులు గుంపులుగా వస్తున్న ప్రజలు ఆ అంతఃపుర ప్రాంగణ ప్రాకారపు మూడు ద్వారాల దగ్గరకు వచ్చి చేరసాగారు. క్షణక్షణానికి కూటమి అధికం కాసాగింది. వార్త తీసుకు వచ్చిన దూతలను, వారిని పిలుచుకొని వచ్చిన నగరసేవకులను మాత్రమే అంతఃపుర కాపలా భటులు లోపలికి వదిలారు. తక్కినవారిని (అంటే సాధారణ ప్రజలను) అక్కడే ఆపారు. కానీ ఆ జనసందోహాన్ని చాలసేపు అడ్డుపడి ఆపలేకపోయారు. గుంపులో ఎక్కడినుంచి వస్తున్నాయో తెలియనట్లు కొన్ని గొంతులు, “లోపలికి వెళ్లండి! లోపలికి వెళ్ళండి!” అని కేకలు వేయసాగాయి. వెనుకనున్నవారు ముందున్న వారిని తోశారు. కడలిలో అలలు ఒకదాన్నొకటి తోసుకొని చివరికి ఒక పెద్ద అల తీరాన్ని వచ్చి గుద్దుతోంది కద? అలాగే ఈ జనసముద్రంలోను జరిగింది.

ముందున్నవారు వెనకున్నవారిచేత తోయబడి, ద్వారపాలకులను తోసుకొని లోపలికి దూరారు. అంతే! కావేరి నది గట్టుకు గండిపడ్డట్లు ఆ ప్రజాసమూహం/ప్రజాప్రవాహం అంతఃపురప్రాంగణంలో

ప్రవేశించారు. కాసేపటికల్లా ఆ ప్రాంగణం నిండిపోయింది. వేలకొద్దీ ప్రజలు అక్కడ గుమిగూడిపోయారు.

ఇంకా ప్రజలు కాపలావారిని దాటుకొని ప్రాంగణంలోకి చొరబడినప్పుడు ఏర్పడ్డ కోలాహలాన్నే శెంబియన్ మహాదేవి మధురాంతకునితో మాట్లాడుతున్నప్పుడు విన్నారు. కొడుకుతో వాదించడం అంతటితో ఆపేసి, అంతఃపురం మేడ ముందుభాగానికి వచ్చారు. జోడించిన చేతులతో, దైవకళ ఉట్టిపడే ముఖంతో నిలబడ్డ ఆ మహారాణిని చూసి ప్రజల కోలాహలం తగ్గింది.

"తల్లీ! మా యువరాజెక్కడ? పొన్నియిన్ సెల్వన్ ఎక్కడ? మీ కంటికి రెప్పలాంటి అరుళ్మొళి వర్మ ఎక్కడ?" అని ఆ కూటమినుంచి అనేక స్వరాలు లేచాయి. అంతే! ఆ జనసముద్రంలో మునుపటికన్న పదిరెట్లు బలంగా హాహాకారాలు లేచాయి.

శెంబియన్ మహాదేవి ఏమీ అర్థంకాక అవాక్కై నిలబడ్డారు. పళైయారై ప్రజల హృదయాన్ని చూరగొన్న పొన్నియిన్ సెల్వన్‌కి ఏదో ఆపద వచ్చిందని మాత్రం అర్థం చేసుకొన్నారు. అదేం ఆపద? ఎలా జరిగింది? పళువేట్టరయ్యర్లు ఏదైనా విపరీత కార్యం చేసి చోళకులానికి, మధురాంతకునికి మాసిపోని అపకీర్తిని కలిగించారా?

ఆ సమయాన తంజావూరు దూతలు ఎలాగో జనాలను తోసుకొని ముందుకు వచ్చారు. వారిని పిలుచుకొని వచ్చిన సేవకులలో ఒకడు, "మహారాణీ! వీరు తంజావూరునుంచి ఒక ముఖ్యమైన వార్తను తీసుకొచ్చారు!" అన్నాడు. శెంబియన్ మహాదేవి ప్రజలను చూసి శాంతంగా ఉండమని సైగ చేసి, దూతలను చూసి, "ఏం వార్త తీసుకొని వచ్చారు?" అన్నారు.

"తల్లీ! అతి దుఃఖకరమైన వార్తను తీసుకొచ్చిన అభాగ్యులం మేము. చక్రవర్తి ఆజ్ఞ మేరకు యువరాజు అరుళ్మొళి వర్మ లంకనుంచి ఓడలో కోడిక్కరైకి వస్తున్నప్పుడు ఓడ సుడిగాలిలో చిక్కుకొంది. తోడు వచ్చిన ఓడ విరిగి ముక్కలైపోయింది. దానిలో ఉన్నవారిని కాపాడేందుకు యువరాజు కడలిలోకి దూకారు. తర్వాత కనిపించనేలేదు. సముద్రాన, సముద్రతీరాన యువరాజును వెతికేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. చక్రవర్తి, మలైయమాన్ కుమార్తె (చక్రవర్తిని) దుఃఖసముద్రంలో మునిగిపోయారు. మిమ్మల్ని, మధురాంతకులను, యువరాకుమారి కుందవైదేవిని వెంటనే రమ్మని మా ద్వారా సందేశం పంపించారు!"

ఇలా దూతలు చెప్పిన వార్త శెంబియన్ మహాదేవి చెవిన, ప్రజల చెవుల్లోను ఒకేసారి పడింది.

మహారాణి కళ్లనుంచి అశ్రుధారలు ప్రవహించసాగాయి. అది చూసిన ప్రజలు 'ఓ' అని ఏడ్వసాగారు.

~

గుంపులో ముందున్నవారిలో ఒకాయన, "తల్లీ! మీరు తంజావూరుకు వెళ్ళకూడదు! రాకుమారి కూడ వెళ్ళకూడదు. చక్రవర్తినే ఇక్కడికి రప్పించేటట్లు చేయాలి!" అన్నారు.

"పొన్నియిన్ సెల్వన్ కడలిలో మునిగిపోయారన్నది అబద్ధం. పళువేట్టరయ్యర్లే ఆయనను

చంపేసివుంటారు!" అన్నారింకొకరు.

"మధురాంతకులు కూడ ఇక తంజావూరుకు వెళ్ళకూడదు. ఇక్కడే ఉండాలి!" అన్నదింకొక గొంతు.

"యువారాకుమారి ఎక్కడ? వారిని మేము చూడాలి!" అని పలువురు (ఎలుగెత్తి) అడగసాగారు.

శెంబియన మహాదేవి తమ సమీపానున్న ఒక సేవకురాలిని చూసి యువరాకుమారిని పిలుచుకొని రమ్మన్నారు.

కింద గుంపులో చేరి నిలబడ్డ ఆళ్వార్ కట్టియాన్ అదే సమయాన జరిగి పక్కకు వెళ్ళాడు. మునుపటిలాగనే అడ్డదారిన వేగంగా వెళ్ళి కుందవైదేవి వాణతికి శైత్యోపచారాలు చేస్తున్న లతామంటపాన్ని చేరుకొన్నాడు. కుందవైదేవి వంతిదేవునితో చెబుతున్న చివరి వాక్యాలను వింటూనే అంతఃపురం ముందు గుమిగూడిన ప్రజల కలవరాన్ని తెలియజేశాడు.

కుందవైదేవి వాణతికి శైత్యోపచారాలు చేసే పనిని చెలికత్తెలకు అప్పగించి తొందరతొందరగా బయలుదేరింది.

~

యువరాకుమారి కుందవైదేవి అంతఃపురపు మేడ ముందుభాగాన శెంబియన్ మహాదేవిని సమీపించినప్పుడు ఆమె కళ్ళనుంచి ధారగా కన్నీళ్ళు ప్రవహిస్తుండడాన్ని గమనించింది. ఆ దృశ్యం కుందవైదేవి కళ్ళలో కూడ నీళ్ళు తెప్పించింది. ఇది చూసిన జనసమూహం దుఃఖసాగరంలో ఇంకా మునిగింది.

"పొన్నియిన్ సెల్వన్ కడలిలో మునిగిపోయేరు. పళువేట్టరయ్యర్లు చంపేశారు. వారిపైన పగ తీర్చుకోవాలి!"

"చక్రవర్తిని పళువేట్టరయ్యర్లు చెరలో పెట్టారు. ఆయనను విడిపించి పిలుచుకొని రావాలి. యువరాకుమారి ఆజ్ఞాపిస్తే మేమిప్పుడే బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్నాము!"

ఇలా ఆ జనసమూహంలోని పలువురు కుందవైదేవినుద్దేశించి అన్నారు.

కుందవైదేవి మనసు తీవ్రంగా, వేగంగా ఆలోచించింది. యువరాజు సజీవంగా ఉన్నారన్న విషయాన్ని ఇప్పుడు బయటపెట్టకూడదు. కానీ ప్రజల్ని కూడ సమాధానపరిచి/శాంతపరిచి పంపాలి. అందుకు ఒకదారి కనిపించింది.

కళ్ళలో ఉబుకుతున్న నీళ్ళను తుడుచుకొని జనసమూహంలో ముందు వరుసలో ఉన్నవారిపైన తన చూపు సారించింది. అంతలో ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు కూడ అక్కడికి వచ్చి నిలబడ్డారు. ఆళ్వార్ కట్టియాన్ని చూసి యువరాకుమారి మేడపైకి రమ్మని సంజ్ఞ చేసింది. ఆళ్వార్ కట్టియాన్ అలాగే మెట్లెక్కి మేడపైకి వచ్చాడు. అతనితో కుందవై మెల్లగా ఏదో చెప్పింది.

ఆళ్వార్ కట్టియాన్ ప్రజలను చూసి శాంతంగా ఉండమని చేతులతో సైగ చేశాడు. తర్వాత పిడుగులాంటి గొంతుతో ఇలా చెప్పాడు: "పొన్నియిన్ సెల్వన్ మరణించివుంటారని యువరాకుమారి నమ్మలేకున్నారు. మునుపొకసారి కావేరిమాత ఆయనను కాపాడినట్లే ఇప్పుడు సముద్రరాజు కాపాడివుంటారని నమ్ముతున్నారు. నిమిత్తకారుని అడగగా, అతడు కూడ అలాగే చెబుతున్నాడట. యువరాజును వెతికి కనిపెట్టేందుకు యువరాకుమారి తగిన ఏర్పాట్లు చేస్తారు. మిమ్మల్నందరినీ నెమ్మదిగా ఇంటికి తిరిగి వెళ్ళమని కోరుకొంటున్నారు!"

ఇది వినగానే ప్రజాసమూహంనుంచి ఒక పెద్ద నిట్టూర్పులాంటిది వెలువడింది.

"ఆ నిమిత్తకారుడెక్కడ? అతడి నోటినుంచి మేము కూడ ఆ మంచి మాట వినాలి" అన్నారొకరు.

ఇదే మంచి అవకాశమని వంతిదేవుడు ఒక్కదూకుతో పైమేడకు వెళ్ళి చేరాడు.

ఆళ్వార్ కట్టియాన్ చెంతకు వెళ్ళి నిలబడి, "యువరాజుకు పెద్ద గండం వచ్చింది, నిజమే. కానీ ఆయన ప్రాణాలకేమీ అపాయం లేదు. త్వరలోనే మనకు దొరుకుతారు!" అన్నాడు.

"నీకెలా తెలుసు?" అని గుంపునుంచి ఒకరడిగారు.

"నేనే నిమిత్తకారుడిని. గ్రహాలను, నక్షత్రాలను చూసి అన్నీ తెలుసుకొంటాను."

"అబద్ధం! నీవు చెప్పేదంతా అబద్ధం! నీవు నిమిత్తకారుడివి కావు! నీవు గూఢచారివి!" అన్నది అదే గొంతు.

వంతిదేవుడు ఎవరది అని పరీక్షగా చూశాడు. అతడు వైద్యకుమారుడని గ్రహించాడు.

"పిచ్చివాడా! నన్నా గూఢచారి అంటున్నావు? నేను గూఢచారినే అయితే, ఎవరి గూఢచారిని?" అన్నాడు.

"పళువేట్టరయ్యర్ల గూఢచారివి!" అని ఢంకా కొట్టినట్లు బదులు చెప్పాడు వైద్యకుమారుడు పినాకపాణి.

"ఏమన్నావు?" అని గర్జించాడు వంతిదేవుడు.

ప్రజలు నిలబడ్డ బయలు ప్రాంగణం నుంచి పైమేడ సుమారు పదిహేను అడుగుల ఎత్తున ఉంది. దాన్ని అతడు పట్టించుకోక పైనుంచి అలాగే వైద్యకుమారుని మీదకు దూకాడు.

ఇద్దరి మధ్య ద్వంద్వ యుద్ధం మొదలైంది. దెబ్బలాట చూడడమంటే అప్పుడూ, ఇప్పుడూ చాలమందికి సంబరమే కద?

వారిద్దరూ దెబ్బలాడుతున్న చోటు చుట్టూ కాస్త చోటు వదిలి వర్తులాకారంగా నిలబడి చోద్యం / వినోదం చూడసాగారు జనం.

పైన మేడనున్నవారు దాన్ని దిగులుతో చూడసాగారు.

ప్రజల్లో చాలమంది విషయమిదీ అని తెలుసుకోకుండానే మునుపటికన్న పెద్దగ కేకలు

వేయసాగారు.

ఆ సమయాన ప్రాంగణం వాకిలి దగ్గర ఒక శంఖానాదం వినిపించింది.

"ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు వేంచేస్తున్నారు! దారి వదలండి!" అన్న ఘోష వినిపించింది.

ఆ జనసముద్రంలో తానంతటదే ముఖ్యమంత్రికి దారి ఏర్పడింది.

~~~
~~~

# అధ్యాయము - 26

## అనిరుద్ధ బ్రహ్మరాయల ప్రార్థన

**ముఖ్యమంత్రి** అనిరుద్ధ బ్రహ్మరాయలు అధిరోహించిన పల్లకి అంతఃపురం ముందు ప్రాంగణంలో గుమిగూడిన ప్రజాసమూహాన్ని చీల్చుకొని ముందుకు వచ్చింది. రెండువైపుల పక్కకు ఒదిగి నిలబడ్డ ప్రజలు ఆయనకు గౌరవపూర్వకంగా నమస్కరించారు. పలువురు యువరాజును గురించిన తమ విచారాన్నికూడ వెలిబుచ్చారు. ముఖ్యమంత్రికూడ అదే దిగులుతో ఉన్నట్లు కనిపించారు. ఆయన కూడ రెండు చేతులను పైకెత్తి ప్రజలకు ఓదార్పును, ఆశీర్వాదాన్ని కూడ చెబుతున్నట్లు సంజ్ఞ చేసుకొంటూ వెళ్ళారు. అంతఃపుర భవనాల ముందు భాగానికి చేరగానే పల్లకి కిందకు దించబడింది. ముఖ్యమంత్రి బయటకు వచ్చి తలెత్తి పైకి చూశారు. పెద్ద రాణి, యువరాకుమారి అక్కడ ఉండడం గమనించి వారికి నమస్కరించారు. తర్వాత ద్వంద్వ యుద్ధం జరుగుతున్న వైపు చూశారు. ఇంతవరకు తమ చుట్టూ జరుగుతున్నదేదీ పట్టించుకోకుండ వంతిదేవుడు, పినాకపాణి తమ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ఇంతలో ఆళ్వార్ కట్టియాన్ కిందకు దిగివచ్చి ముఖ్యమంత్రి చెవిలో ఏదో చెప్పాడు. ఆయన తమ ముందు నిలబడ్డ సేవకులను చూసి, "అంతఃపురం ముందు గలాటా చేస్తున్న ఈ ఇద్దరినీ వెంటనే పట్టి బంధించి చెరలో వేయండి!" అని ఆజ్ఞాపించారు. సేవకులతోబాటు ఆళ్వార్ కట్టియాన్ కూడ ప్రజల వెంట వెళ్ళాడు. దెబ్బలాడుతున్న ఇద్దరినీ సేవకులు పట్టి బంధించి వారి చేతులను పగ్గాలతో కట్టారు. ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చూసి సైగ చేయగా, అతడు సేవకులు బంధించేటప్పుడు ఎదిరించక ఊరకున్నాడు.

~

అనిరుద్ధులు మేడపైకి వెళ్ళారు. అక్కడ నిలబడి ప్రజలనుద్దేశించి, "మీ దిగులు, కోపమూ నేనెరుగుదును. చక్రవర్తి, రాణులు కూడ మీలాగే దుఃఖంలో మునిగివున్నారు. వారి దుఃఖాన్నధికం చేసే కార్యమేదీ చేయకండి. యువరాజును వెతికేందుకు అన్ని ఏర్పాట్లూ చేయబడ్డాయి. మీరందరూ ప్రశాంతంగా ఇళ్ళకు తిరిగి వెళ్ళండి!" అన్నారు.

"చక్రవర్తిని మేము చూడాలి. చక్రవర్తి పళైయారైకి తిరిగి రావాలి" అని గుంపులో ఒకరన్నారు.

"లంకలో ఉన్న మా ఊరి వీరుల గతి ఏమి?" అని ఇంకొకరడిగారు.

"చక్రవర్తి తంజావూరు అంతఃపురంలో క్షేమంగా ఉన్నారు. ఆయన మాళిగను వేళక్కార దండు రాత్రింబగళ్ళు కాపలా కాస్తున్నారు. వీలైనంత త్వరలో నేనే చక్రవర్తిని పళైయారైకి పిలుచుకొని వస్తాను. లంకలో ఉన్న మన వీరుల గురించి కూడ మీరు దిగులు పడనవసరం లేదు. లంకపై యుద్ధంలో మనం పూర్ణవిజయం పొందాము. మన వీరులు త్వరలోనే తిరిగి వచ్చేస్తారు!" అని ముఖ్యమంత్రి తెలియజేయగానే

కూటమిలో ఉత్సాహం ఉప్పొంగింది. చక్రవర్తిని, ముఖ్యమంత్రిని దీవిస్తూ ఇళ్ళకు తిరిగి వెళ్ళారు.

~

ముఖ్యమంత్రి పెద్దరాణిని చూసి, “దేవీ! మీతో అతి ముఖ్యమైన విషయాలు చర్చించాలి. అంతఃపురంలోకి వెళదామా?” అన్నారు. తర్వాత యువరాకుమారిని చూసి, “అమ్మా! నీ వద్దకు తర్వాత వస్తాను" అని చెప్పగానే కుందవై తన అంతఃపురంవైపు బయలుదేరింది. ఆమె మనసులో ఇప్పుడు పలువిధాలైన దిగుళ్ళు గూడుకట్టుకొన్నాయి. చోళసామ్రాజ్యంలో కుందవై ఎవరినైనా చూసి భయపడుతుందంటే అది ముఖ్యమంత్రి మాత్రమే. గ్రద్దలాంటి చూపులుగలవారాయన. బాహ్యనేత్రాలతో చూసి తెలుసుకోవడమేగాక, ఎదుటివారి మనసులో ఏముందో సూక్ష్మదృష్టితో చూసి తెలుసుకోగల శక్తి కలవారాయన. ఆయనకు ఎంతవరకు తెలుసు, ఏది తెలియదు, ఏది చెప్పవచ్చు, ఏది చెప్పకుండ వదిలేయవచ్చో తెలియక యువరాకుమారి మనసు ఒకటే గందరగోళమైంది. వాణర్ కులవీరుడిని, పినాకపాణిని ఒకటిగా చేర్చి బంధించమని ఆయన ఆజ్ఞాపించడం గురించి ఆమెకు చాల కోపం వచ్చింది. దాన్ని బయటకు చూపించుకోవడానికి కూడ సాధ్యం కాలేదు. ఆ మహాజన సమూహం ముందు వంతిదేవుని పక్షం మాట్లాడడం కూడ సాధ్యం కాదు, సబబు కాదు కూడాను. “నాతో తర్వాత మాట్లాడుతారా? రానీ; నేను ఆయన పని పట్టిస్తాను!” అని మనసులో అనుకొంటూ కుందవై వేగంగా వెళ్ళింది.

~

శెంబియన్ మహాదేవి చోళసామ్రాజ్యంలో అందరి భయభక్తి మర్యాదలు చూరగొన్నవారు. అనిరుద్ధ బ్రహ్మరాయలు కూడ అందుకతీతం కారు. కానీ ఆ మహారాణి ఇప్పుడు ఏదో ఒక భయంతో నడుచుకొంటున్నారు. అనిరుద్ధులు ఆసీనులైన తర్వాతే తాము ఆసీనులైనారు.

“అయ్యా! కొంతకాలంగా నా తలమీద పిడుగుమీద పిడుగు పడుతోంది. మీరుకూడ అటువంటి వార్త ఏదైనా తెచ్చారా? లేక ఓదార్పు మాటలు చెప్పబోతున్నారా?” అని వాపోయింది.

“అమ్మణి! మన్నించండి! మీ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతున్నాను. నేను తీసుకొచ్చిన వార్తను మీరెలా తీసుకొంటారో దానిమీద ఆధారపడి ఉంటుంది!” అన్నారు చతుర సంభాషణలో ఆరితేరిన ముఖ్యమంత్రి.

“పొన్నియిన్ సెల్వన్ గురించిన వార్త నిజమేనా, అయ్యా! నేను నమ్మలేక పోతున్నాను! అరుళ్మొళి వర్మ గురించి మనం ఎన్నెన్నో కలలు కన్నాం కదా? ఈ లోకాన్నే ఒక ఛత్రం కింద ఏలేందుకు పుట్టినవాడని మనం ఎన్నిసార్లు అనుకొన్నాం...?”

“మహారాణీ! జ్యోతిష్కులు అలా చెప్పారని మీరు నాతో చెప్పింది నిజమే. ఈ దాసుడు ఆ మాటను వ్యతిరేకించలేదు; ఒప్పుకొని మాట్లాడను కూడ లేదు!”

"అదలా ఉండనీ. ఇప్పుడు చెప్పండి. పొన్నియిన్ సెల్వన్ని సముద్రరాజు పొట్టనబెట్టుకొన్నది నిజమేనా?"

"రూఢిగా ఎవరు చెప్పగలరు తల్లీ! అలా వార్త దేశమంతటా వ్యాపించివుండడం నిజమే."

"అది నిజమని రూఢియైతే ఈ చోళరాజ్యం గతి ఏమి? ఎటువంటి విపరీతాలు జరుగుతాయి?"

"విపరీతాలు అది నిజమని రూఢి అయ్యేవరకు వేచివుంటాయనిపించడంలేదు..."

"అవునవును. విపరీతాలు జరగడానికి వదంతులే చాలు కదా? ఈ పళైయారై నగర ప్రజలు ఇంత కోపోద్రిక్తులై అంతఃపుర ప్రాంగణంలోకి ఇలా చొరబడిరావడం నేనింతవరకు చూడలేదు..."

"పళైయారైలో మాత్రం ఇలా జరుగుతుందనుకోకండి. తంజావూరు నగరం నిన్నటినుంచి అల్లకల్లోలంగా ఉంది. వేళక్కార దండు వీరులు చక్రవర్తి అంతఃపురం వదిలి ఇవతలికి రానిరాకరించారు. ప్రజలు తండోపతండాలుగా కోట లోపలికి చొరబడి పళువేట్టరయ్యర్ల మాళిగలను చుట్టుముట్టారు. మదించిన ఏనుగులను ప్రజల గుంపులో వదిలిపెట్టి వారిని చెదరగొట్టవలసివచ్చింది..."

"అయ్యో! ఇదేం విపరీతం! ఎంతటి భయంకరమైన వార్త?"

"మధురాంతకులు పళైయారైకి వచ్చేసిందే మంచిదైంది. లేకపోతే ఆ భయంకరమైన నింద ఆయనపైకి కూడ నోకివుండేది..."

"అయ్యా! మధురాంతకుడెంత మారిపోయాడని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు!"

"ఆశ్చర్యపడను, తల్లీ! అవన్నీ కొంతకాలంగా నాకు తెలిసిన విషయాలే."

"తెలిసికూడ వాడి మనసును మార్చేందుకు మీరు ప్రయత్నం కూడ చేయలేదు! ఇప్పుడైనా ఆలోచించి సహాయం చేయండి!"

"తల్లీ! మధురాంతకుని మనసును మార్చే అవసరం ఉందని నాకు అనిపించలేదు. ఆయన పక్షం మాట్లాడేందుకే నేనిక్కడికి వచ్చాను."

"అంటే?! నాకర్థం కావడం లేదు. కాస్త విడమరచి చెప్పండి."

"అమ్మణీ! మధురాంతకులు ఈ చోళసింహాసనం తమకు చెందాలని భావిస్తున్నారు. చక్రవర్తి తర్వాత ఈ రాజ్యాన్ని తాము ఏలాలని ఆశపడుతున్నారు. అది న్యాయమైన ఆశే. ఆయన మనసులో బాగా వేళ్ళూనిన ఆశ. దాన్ని అడ్డగించేందుకో, మార్చేందుకో ప్రయత్నించడం వల్ల చోళసామ్రాజ్యానికి మేలు జరగదు. దాన్ని నెరవేర్చడమే ఉచితం..."

"అయ్యో! ఇదేం మాట? మీరు కూడానా చక్రవర్తికి ద్రోహం చేయ తెగించారు? ఇదేం విపరీత కాలం?"

"మహారాణీ! చక్రవర్తికి ద్రోహం చేయాలని నేను కలలో కూడ అనుకోను. చక్రవర్తి ఆజ్ఞ మేరకే వచ్చాను. ఆయన మీకు విన్నవించమన్నదే నేను విన్నవించాను. చక్రవర్తి తమ తర్వాత మధురాంతకులే

సింహాసనమధిష్టించాలని కోరుతున్నారు. పళువేట్టరయ్యర్లు అందుకు కుట్ర పన్నుతున్నారు. కానీ చక్రవర్తి ఇప్పుడే మధురాంతకునికి పట్టం కట్టి తాము అధికారం నుంచి వైదొలగాలని కోరుకొంటున్నారు. ఇందుకు తమ సమ్మతాన్ని తీసుకొని రమ్మని నన్ను పంపించారు..."

"అయ్యా! బుద్ధిచాతుర్యం మెండుగా/నిండుగా ఉన్న మంత్రిగారూ! నాకు తోబుట్టువులు, బంధువులు ఎవరూ లేరు. పశ్చిమాన కొండదేశంలో ఉదయించిన శంకరుల గురించి మీరు వినేవుంటారు. ఆ మహానుభావుడు:

"మాతాశు పార్వతీదేవి
పితా దేవో మహేశ్వరహా
బాంధవా శివభక్తాస్య"

అన్నారు. నా తల్లి పార్వతీదేవి; తండ్రి పరమశివుడు; నా బంధువులు, తోబుట్టువులు శివభక్తులు. ఈ లోకంలో వేరే బంధువులు నాకు లేరు..."

"అమ్మణీ! అదే శ్లోకంలో శంకరులు చెప్పిన నాలుగో పాదాన్ని మీకు గుర్తు చేస్తాను:

"స్వదేశో భువనం తరయ"

అనికూడ ఆయనే చెప్పారు. మనం పుట్టిన దేశమే మనకు మూడు లోకాలూను. తమ స్వంతనాడు అంతర్యుద్ధాలవల్ల సర్వనాశనం కావడాన్ని మీరు చూస్తూ ఊరకుంటారా?"

"నా స్వంతదేశం నాకు మూడులోకాలకన్న ప్రియమైనదే. కానీ ఈ జానెడు చోళనాడే మన దేశమా? ఏనాడూ కాదు. ఉత్తరాన హిమగిరి వరకున్న దేశం నా దేశం. చోళదేశంలో తావు లేకపోతే కాశీక్షేత్రానికి వెళతాను. కాశ్మీరానికి, కైలాసానికి వెళతాను. అలా తీర్థ యాత్రలు చేయాలని చాలరోజులుగా అనుకొంటున్నాను. అందుకు సహాయం చేయండి..."

"తల్లీ! దక్షిణాన త్రికోణమలైనుంచి ఉత్తరాన హిమగిరివరకు విస్తరించినది మన విశాల దేశం. ఈ విశాల భారతదేశానికి ప్రస్తుతం మహాపాయం కలగబోతోంది. పఠాన్లు, మొగలాయిలు, తురుష్కులు, అరబ్బులు మొదలైన జాతులవారు దండెత్తివచ్చి మన భారతదేశాన్ని కబళించవచ్చని/ఆక్రమించవచ్చని అంటున్నారు. వెయ్యేళ్లకు మునుపు యవనులు, కుషానులు దండెత్తివచ్చినట్లు, ఈ కొత్తమతంవారు అంచెలంచెలుగా మనదేశంపైన దండెత్తేందుకు బయలుదేరి వస్తున్నారు. వీరి మతం విచిత్రమైన మతం. గుళ్ళను పడగొట్టడం, విగ్రహాలను విరగగొట్టడం పుణ్యకార్యమని నమ్ముతారట. అమ్మణి! వీరిని అడ్డగించి ఆపగల బలమైన రాజులెవ్వరూ ఇప్పుడు ఉత్తరదేశంలో లేరు. చోళనాడు వీరులు గంగానది వరకు, దానికవతల ఉన్న శివపర్వతం వరకు మహాభారత సామ్రాజ్యాన్ని స్థాపించబోతున్నారని, గుళ్ళను పడగొట్టే గుంపులను అడ్డగించబోతున్నాడని ఈ దాసుడు కలగంటున్నాడు. మధురాంతకునికి పట్టంగట్టి చోళదేశంలో దాయాది యుద్ధం జరగకుండ ఆపేందుకు సహాయం చేయండి!"

ఇది విన్న శెంబియన్ మహాదేవి కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయారు.

"అయ్యా! ఈ పేదరాలికి అర్థంకాని ఏవేవో పెద్ద విషయాలను చెప్పి నన్ను కలవరపరుస్తున్నారు. ఈ పుణ్యభారత దేశానికి అటువంటి ముప్పే వస్తే దాన్ని ఆ పరమేశ్వరుడే ఆపాలిగాని, ఈ అబల ఏం చేయగలదు? నా భర్త భగవానుని సన్నిధికి చేరబోయే సమయాన, నాకు చెప్పి వెళ్ళిన విషయం నేనేనాడూ మరువను. అందుకు విరుద్ధంగా నేనే కార్యమూ చేయను!" అన్నారు.

“అలాగైతే ఇంతవరకు మీకు తెలియని ఒక నిజాన్ని ఇప్పుడు మీకు చెప్పేతీరాలి!” అన్నారు అనిరుద్ధులు.

ఈ సమయాన మధురాంతకుడు అక్కడికి ఆదరా బాదరాగా ప్రవేశించి, “అమ్మా! ఇదేమి నేను వింటున్నది? అరుళ్మొళి వర్మను సముద్రం తీసుకొని వెళ్ళిపోయిందా?” అని అడిగాడు.

“మహారాణీ! తమ ప్రియపుత్రుని ఓదార్చండి. నేను చెప్పదలచిన విషయాన్ని ఇంకొకప్పుడు చెబుతాను!” అని చెప్పి ముఖ్యమంత్రి బయలుదేరారు.

ఆయన వాకిలి దాటగానే మధురాంతకుడు, “ఇదిగో వెళుతున్నారే, ఈయనే నా ప్రధాన శత్రువు. నేనిక్కడున్నప్పడే మీకు దుర్బోధలు చేసేందుకు వచ్చేశారు కద?” అని యువరాజు మధురాంతకుడన్నది ముఖ్యమంత్రి చెవిన కూడ పడింది.

~~~
~~~

# అధ్యాయము - 27

## కుందవై పొందిన ఆశ్చర్యం

**ముఖ్యమంత్రి** అనిరుద్ధులు కుందవైదేవి అంత:పురానికి వెళ్ళారు. కుందవై ఆయనను చూసిన వెంటనే లేచి నమస్కరించింది.

"వీరత్వంలోను, గుణంలోను గొప్పవాడైన భర్తను పొంది చిరకాలం జీవించమ్మా!" అని ముఖ్యమంత్రి అనిరుద్ధులు ఆమెను దీవించారు.

"అయ్యా! ఇటువంటి పరిస్థితిలో ఇలాంటి ఆశీర్వాదం చేస్తున్నారేమి?" అన్నది యువరాకుమారి.

"ఏదో ఈ ముసలాడికి తోచిన ఆశీర్వాదాన్ని చేశాను. ఇంకే ఆశీర్వాదాన్ని కోరుకొంటున్నావు తల్లీ?"

"నా ప్రియమైన తండ్రి ఆరోగ్యం గురించి అందరమూ దిగులుతో ఉన్నాము. అరుళ్మొళి వర్మ గురించి దేశమే దు:ఖంలో మునిగివుంది..."

"కానీ నీ దివ్యవదనంలో అందుగురించిన దిగులేమీ నాకు కనిపించడం లేదు కదమ్మా?"

"వీర వంశంలో పుట్టినదాన్ని నేను. అందరిలాగ అపాయమనగానే ఏడుస్తూ కూర్చోమంటారా?"

"ఏనాడూ అలా చెప్పను. నాలాంటి వీరత్వం లేని ప్రజలను ఓదార్చమనే చెబుతాను."

"ఆచార్యా! మిమ్ములనా నేను ఓదార్చాలి? లోకమే తలకిందులైనా స్థితప్రజ్ఞత కోల్పోని వజ్రహృదయం కలవారు కద మీరు?"

"అటువంటి నన్ను కూడ ఒక కుదుపు కుదిపేశావు కద, తల్లీ! అంత:పురంలో ఆటపాటలతో ఆనందంగా కాలం గడపవలసిన నీవు రాజ్యాంగ విషయాల్లో తల దూర్చడం వల్ల ఎటువంటి విపరీతాలు జరిగాయో చూశావా, తల్లీ?"

"అయ్యో! ఇదేం లేనిపోని నింద? ఏ రాజ్యాంగ విషయాల్లో నేను తలదూర్చాను? నా నుంచి ఏం విపరీతం జరిగింది?"

"ఇంకొంత కాలం పొన్నియిన్ సెల్వన్ లంకలో ఉండాలని నేను చెప్పేసి వచ్చాను. అందుకు విరుద్ధంగా వెంటనే బయలుదేరి రమ్మని నీ తమ్ముడికి తాళపత్రం రాసి పంపించావు. నీ కోరికకు వ్యతిరేకంగా ఈ ముసలాడి మాట ఎవరు వింటారు? అందువల్ల జరిగిన విపరీతాన్ని చూశావా? చోళదేశ ప్రజల కంటికి రెప్పలాంటి యువరాజును సముద్రం పొట్టనబెట్టుకొంది. కాసేపటికి మునుపు ఈ అంత:పురం ముందు ఈ నగర ప్రజలందరూ గుమిగూడి లేపిన కల్లోలాన్ని నీవు చూశావు ఇలా దేశమంతటా అల్లకల్లోలమవుతోంది. దీనికి నీవు కాదా కారణం, తల్లీ?"

"నా తాళపత్ర సందేశాన్ని చూసి అరుళ్మొళి లంకనుంచి బయలుదేరాడని ఎందుకంటున్నారు? పళువేట్టరయ్యర్లు రెండు ఓడల నిండా వీరులను పంపి యువరాజును చెరపట్టి తీసుకురమ్మని పంపించిన విషయం మీకు తెలియదా?"

"తెలుసు, తల్లీ! తెలుసు! అంతటితో ఆగివుంటే ఇప్పుడు పొన్నియిన్ సెల్వన్‌కి పట్టిన గతికి పళువేట్టరయ్యర్లను బాధ్యులుగా చేసే వీలుండేది. వారు పంపిన ఓడలు రెండూ నాశనమైపోయాయి. నీ తాళపత్ర సందేశం వల్లనే యువరాజు అక్కడినుంచి బయలుదేరాడని ఎవరైనా అంటే దాన్ని ఎవరు కాదని చెప్పగలరు?"

"అయ్యా! నేను తాళపత్రం పంపించిన విషయం మీకెలా తెలుసు? పళువేట్టరయ్యర్లకు ఎలా తెలిసింది?"

"భలే ప్రశ్న, తల్లీ! నాకు మాత్రమేనా తెలుసు? లోకానికంతటికీ తెలుసు. నీవు పంపిన దూత మొదట లంకలో మన వీరులచేత బంధించబడ్డాడు. అందువల్ల లంకలో ఉన్న వారందరికీ తెలుసు. అతనితో కోడిక్కరై వరకు వెళ్ళిన వైద్యకుమారుని వల్ల ఈ నాడంతటికీ తెలుసు. రహస్యంగా చేసిన ఈ కార్యం ఇంత దూరం బట్ట బయలైంది! అందుకనే స్త్రీలు రాజ్యాంగ విషయాలలో తల దూర్చకూడదని మన పెద్దలు చెప్పారు."

~

కుందవై కాసేపు అవాక్కై నిలిచిపోయింది. ముఖ్యమంత్రికి ఏం బదులు చెప్పాలో తోచలేదు. ముఖ్యమంత్రి తనని బాగా ఇరికించేశారు. ఆయన చెప్పిన మాటలో నిజముంది. ఇది గ్రహించగానే ఆమెకు ఆ వాణర్ కులవీరుని పైన కోపం ముంచుకొచ్చింది. అతడు సాహస వీరకృత్యాలు చేయగలవాడే. కానీ రహస్యమైన కార్యాన్ని బట్టబయలు చేసేశాడు కదా? అతన్ని బాగా చివాట్లు పెట్టాలి / దండించాలి. ఇలా అనుకోగానే అతడు ముఖ్యమంత్రి ఆజ్ఞ మేరకు బంధించబడి చెరలో వేయబడివుండడం గుర్తుకొచ్చింది. తాను ఏవేవో ఇక్కట్లలో చిక్కుకొని తనను కూడ ఎలాంటి ఇక్కట్లకు లోను చేస్తున్నాడు కదా? కాసేపు ఊరకుండకూడదా? వైద్యకుమారుడు ఏదో పేలితే అందుకు పైమేడ నుంచి దూకి దెబ్బలాటకు దిగాలా?

"అయ్యా! ఒక కోరిక విన్నవించుకొంటున్నాను. పెద్ద మనసు చేసి నెరవేర్చాలి."

""దేవీ! ఆజ్ఞాపించు! ఈ రాజ్యంలో నీమాటకు ఎదురేది?"

"మీరు అంతఃపురం వాకిలిని సమీపించినప్పుడు ఇద్దరు దెబ్బలాడుకొంటున్నారు. వారిని బంధించి చెరలో వేయమని మీరు ఆజ్ఞాపించారు."

"వారు చేసింది పెద్ద నేరం. అంతఃపురంలో మహారాణి కళ్ళముందు వాళ్ళు దెబ్బలాట మొదలు పెట్టింది పెద్ద తలనొప్పి. అది కూడ ఎటువంటి సమయంలో? మహాజనసందోహం కోపోద్రిక్తులై ఉన్నప్పుడు, ప్రజలు కారణం తెలియక వారు కూడ ఆ దెబ్బలాటలో చేరివుంటే, అది ఎటువంటి విపరీత పరిణామాలకు

దారి తీసేది? చిన్న నిప్పురవ్వ పెద్ద అడవినే తుడిచిపెట్టేసేటట్లు, నాడు, నగరం అల్లకల్లోలమైపోయేది కద?"

"అవునయ్యా! వారు చేసింది పెద్ద నేరమే. కానీ వారిద్దరిలో ఒకరిని విడుదల చేయమని ప్రార్థిస్తున్నాను."

"యువరాకుమారి కరుణకు నోచుకొన్న ఆ భాగ్యశాలి ఎవరు?"

"నేను లంకకు పంపిన దూత."

"పండు జారి పాలలో పడ్డట్లయింది!"

"ఎందుకని అలా అంటున్నారు?"

"ఆ దూతను నేనే బంధించి చెరలో వేయాలనుకొన్నాను. ఇక్కడ తనకు తానే సులభంగా పట్టుబడిపోయాడు."

"ఎందుకని? ఏ నేరం వల్ల?"

"తల్లీ! అతడిపైన ఒక భయంకరమైన నింద మోపబడివుంది."

"అదేమి?"

"పొన్నియిన్ సెల్వన్‌నిఅతడే సముద్రంలో ముంచేశాడని."

"ఎంతటి ఏహ్యమైన/నీచమైన మాటలు? ఎవరలా నింద మోపింది?"

"పలువురలా నింద మోపుతున్నారు. యువరాజును ఓడలో ఎక్కించుకొని వచ్చిన పార్థిబేంద్రుడలా అంటున్నాడు. పళువేట్టరయ్యర్లు 'కావచ్చు అంటున్నారు. నేనూ సందేహిస్తున్నాను!"

"ఆచార్యా! జాగ్రత్త! నేనొక హంతకుని పంపి నా తమ్ముడిని చంపించాననా సందేహిస్తున్నారు?"

"ఏనాడూ కాదు, తల్లీ! అతను నీ విశ్వాసానికి పాత్రుడైన దూత అని ఎంచే నీవు పంపించావు. అది పొరబాటు కావచ్చు కద? అతడు మన శత్రువుల గూఢచారి కావచ్చు కద?"

"ముమ్మాటికీ కాదు. నా అన్న ఆదిత్య కరికాలన్ నా సహాయం కోసం పంపించాడు. అతన్ని పూర్తిగా నమ్మవచ్చని రాసి పంపించాడు."

"ఆదిత్య కరికాలన్ కూడ మోసపోయివుండవచ్చు కద, రాకుమారీ? దారిలో అతడు మారిపోయివుండవచ్చు కద? నేనిక్కడికి వచ్చినప్పుడు 'గూఢచారి అన్న నిందారోపణ నా చెవిన పడింది. పైన నిలబడ్డ వాడిని చూసి కింద నిలబడ్డవాడు 'గూఢచారి అని నిందారోపణ చేశాడు. అదేమిటమ్మా?"

"మేడ పైన నిలబడ్డవాడే నా అన్న పంపిన వాణర్ కులవీరుడు వల్లవరయ్యన్ వంతిదేవుడు. కింద నిలబడ్డవాడే వైద్యకుమారుడు పినాకపాణి. వంతిదేవుని పళువేట్టరయ్యర్ల గూఢచారి అని వైద్యకుమారుడు నిందారోపణ చేయడం ఎంత బుద్ధిహీనత?"

"ఎందుకు కాకూడదు, తల్లీ?"

"ఏనాడూ సాధ్యం కాదు. పళువేట్టరయ్యర్ల కాపలా నుంచి తప్పించుకొని వచ్చినవాడు. అతన్ని

మళ్ళీ పట్టుకోవడానికి ఎందరో మనుషులను పంపి మరో బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నారు…”

“అతనికి పళువూర్ రాజముద్ర ఉన్న ఉంగరం ఎలా, ఎవరినుంచి దొరికింది, తల్లీ?”

“ఆ వంచక రక్కసి, మాయమోహిని, విషనాగు - దయచేసి మన్నించండి - పళువూర్ యువరాణి ఇవ్వడం వల్లనే ఆ ఉంగరం అతడి వద్దకొచ్చింది.”

“అది నీకు తెలిసివుండడం గురించి సంతోషిస్తున్నాను. నేను చెబితే నమ్మేదానివి కావు. ఆ వల్లవరయ్యన్ పళుపేట్టరయ్యర్ల గూఢచారి కాకపోతే, పళువూర్ యువరాణి గూఢచారి కావచ్చు కద?”

“అదెలా సాధ్యం?”

“ఎలా సాధ్యమని చెబుతాను. వంతిదేవుడు - నీవు లంకకు పంపిన దూత – తంజావూరు కోట బయట పళువూర్ యువరాణి పల్లకిలో వస్తుండగా కలిశాడు. అప్పుడా ముద్రవున్న ఉంగరాన్ని ఆమె వద్ద నుంచి పొందాడు. తర్వాత కోట లోపల, పళువూర్ అంతఃపురంలో ఆమెను కలిశాడు. అతన్ని పళువూర్ యువరాణి బొక్కసపు నేలమాళిగలో దాచి పెట్టి తర్వాత బయటకు పంపింది. నీ దగ్గరనుంచి తాళపత్ర సందేశం తీసుకొని రాబోతాడని ఆమెకు తెలుసు. లంకనుంచి తిరిగివచ్చేటప్పుడు హరిశ్చంద్రనదీ తీరాన పాడుబడ్డ పాండ్యుల అంతఃపురంలో మధ్యరాత్రి వారిద్దరూ కలిసి, మాట్లాడుకొన్నారు. ఆ తర్వాత కూడ పళువూర్ ముద్ర ఉన్న ఆ ఉంగరం వంతిదేవుని దగ్గరే ఉంది. వీటన్నిటి గురించి నీ అభిప్రాయమేమిటమ్మా? నీ దూత మీద ఇంకా పరిపూర్ణమైన నమ్మకం కలిగివున్నావా?”

కుందవై మనసిప్పుడు నిజంగానే కల్లోలితమైంది.

~~~
~~~

# అధ్యాయము - 28

## గూఢచారికి తోడు గూఢచారి

**మౌనంగా** ఉన్న యువరాకుమారిని చూసి ముఖ్యమంత్రి అనిరుద్ధులు, "తల్లీ! ఎందుకు మాట్లాడకున్నావు? వంతిదేవుని నీవింకా నమ్ముతున్నావా?" అని అడిగారు.

"ఆచార్యా! అమాత్యశేఖరా! నేనేం చెప్పను? మీరింకాసేపిలా మాట్లాడుతూ వెళితే నన్ను నేనే సందేహించే పరిస్థితి వచ్చేలాగుంది!" అన్నది కుందవై.

"కాలమలా ఉంది తల్లీ! ఎవరిని నమ్మవచ్చు, ఎవరిని నమ్మకూడదు అని ఖచ్చితంగా తీర్మానించలేకపోతున్నాం ఈ రోజుల్లో. నలువైపులా శత్రువులలా పొంచివున్నారు. అతి నిగూఢమైన కుట్రలు జరుగుతున్నాయి!" అన్నారు ముఖ్యమంత్రి.

"కానీ మీకు తెలియని మర్మం, మీరెరుగని కుట్ర ఉండవని నేననుకొంటున్నాను. నేను పంపిన దూత గురించిన అన్ని వివరాలూ ఎలా తెలుసుకోగలిగారు?" అని అడిగింది కుందవై దేవి.

"అమ్మా! నేను వేయి కళ్ళు, రెండువేల చెవులు కలవాడిని. దేశమంతటా అవి విస్తరించివున్నాయి. పళువూర్ అంతఃపురంలో నా మనుషులున్నారు. పళువూర్ యువరాణి అంగరక్షకులలో నాకు రహస్య సమాచారాలు పంపేవాడొకడున్నాడు. ఆళ్వార్ కట్టియాన్ లాగ ఊరూరా తిరిగి సమాచారం సేకరించి తీసుకొని వచ్చేవారు పలువురున్నారు. చోళనాడులోగాని, చుట్టుపక్కల దేశాలలోగాని నాకు తెలియకుండ ఏ కార్యమూ జరగదు, జరగలేదు అని అనుకొంటున్నాను. కానీ ఎవరు చూడవచ్చారు? నన్ను కూడ ఏమార్చగల సమర్థులుండవచ్చు. నేనెరుగని మర్మాలు కూడ జరగవచ్చు!"

ముఖ్యమంత్రి ఇలా అన్నప్పుడు, పొన్నియిన్ సెల్వన్ ఇప్పుడు చూడామణి విహారంలో ఉన్న విషయం కూడ ఈ గడుగ్గాయి ముఖ్యమంత్రికి తెలుసా అని సందేహపడింది కుందవై. దాన్ని అతికష్టం మీద బయటకు వెలిబుచ్చక అదిమిపెట్టింది.

"అయ్యా! మీరు చెప్పేదంతా నిజమే కావచ్చు. కానీ ఆ వాణర్ కులవీరుడు పళువూర్ యువరాణి గూఢచారి కావచ్చని నేను నమ్మలేకపోయాను. అతన్ని దయచేసి విడుదల చేయండి!" అన్నది కుందవై.

"బాగా ఆలోచించి చూడమ్మా! ఆ నందిని దగ్గర ఏదో మాయ మంత్రశక్తి ఉంది. శివభక్తుడైన మధురాంతకుడు ఆమె వలలో పడి రాజ్యకాంక్షగొన్నాడు. శంబువరయ్యర్ కొడుకు గందమారన్ ఆమె ఇచ్చిన తాళపత్రాన్ని తీసుకొని ఆదిత్య కరికాలన్ వద్దకు వెళ్ళివున్నాడు. పళువేట్టరయ్యర్లను తన పరమవిరోధులుగా ఎంచిన పార్థిబేంద్రుడు ఈనాడు ఆమె పాదాక్రాంతుడైనాడు. చోళరాజ్యాన్ని రెండుగా

విభజించి ఒక భాగాన్ని మధురాంతకునికి, ఇంకొక భాగాన్ని ఆదిత్య కరికాలన్‌కి పంపిణీ చేసి రాజీ కుదిర్చేందుకు అతడిప్పుడు ముందుకొచ్చాడు...."

"ఇదేం అక్రమం? రాజ్యాన్ని రెండుగా విడగొట్టడమా? మా కుల పూర్వీకులు ఎంత కష్టపడి స్థాపించి, విస్తరించిన సామ్రాజ్యమిది?"

"రాజ్యాన్ని విడగొట్టడం నీకిష్టం లేదు, నాకూ ఇష్టం లేదు, తల్లీ! పదిరోజుల క్రితం ఈ విషయాన్ని వినివుంటే పార్థిబేంద్రుడుకూడ కోపంతో ఎగిరిపడేవాడు. కానీ ఇప్పుడు అతడే ఆ ఏర్పాటుకు ముందుకు వచ్చాడు."

"ఇదేం వింత? ఆ పళువూర్ యువరాణి దగ్గర అలాంటి మాయశక్తి ఏముంది?"

"యువరాకుమారీ! నేనే నిన్ను ఆ విషయాన్నడగాలనుకొంటున్నాను. నీవే నన్ను అడుగుతున్నావు. పోనీ, వంతిదేవుడు మాత్రం ఆమె మాయ శక్తికి లోనుకాడని నీవంత ఘంటాపథంగా ఏ ఆధారంతో చెబుతున్నావు?"

"అయ్యా! కారణమడిగితే నేను చెప్పలేను. మనసుకు మనసే సాక్షి అంటారు. ఆ వాణర్ కులవీరుడు అలాంటి ద్రోహం చేయడని నా మనసు చెబుతోంది."

"అలాగైతే దాన్ని పరీక్షించి చూసేద్దామమ్మా!"

"ఎలా? ఏం పరీక్ష?"

"కంచికి మనం ఒక దూతను వెంటనే పంపించి తీరాలి. ఆదిత్య కరికాలన్‌కి చాల నమ్మకమైన దూతద్వారా ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపించాలి."

"ఏ విషయం గురించి?"

"కాసేపటికి మునుపు నందినిని విషనాగమని పిలిచి, అందుకు నన్ను క్షమాపణ కోరావు. నిజానికి విషనాగంకన్న ఆమె పదిరెట్లు క్రూరురాలు. ఈ చోళవంశాన్ని సమూలంగా నాశనం చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తూంది...!"

"భగవాన్! ఎంతటి భయంకరమైన వార్త!" అన్నప్పుడు కుందవై మనసు ఎన్నెన్నో ఆలోచనలతో కల్లోలితమైంది.

"నీ అన్న ఆదిత్య కరికాలన్‌ని కడంబూర్ మాళిగకు ఆహ్వానించేటట్లు శంబువరయ్యర్లను ఎగదోసింది / పురికొల్పింది. శంబువరయ్యర్ కూతురును, పళువేట్టరయ్యర్ల కూతురొకతెను కరికాలన్‌కిచ్చి పెళ్ళిచేసి అంటగట్టాలని వారితో మాట్లాడుతోంది. రాజ్యాన్ని రెండుగా విభజించే విషయాన్ని కూడ అక్కడే మాట్లాడి ముగించేందుకు చర్చలు జరుపుతోందట. కానీ ఇదంతా పైకి తెలిసిన మాటలు. అమె మనసులోని నిజమైన ఉద్దేశమేమని ఎవరికీ తెలియదు. అన్నీ తెలుసని గర్వంగా చెప్పకొనే నేను కూడ ఆమె ఉద్దేశాన్ని తెలుసుకోలేకపోయాను."

"దాని గురించి నేనేం చేయాలయ్యా?"

"ఆదిత్య కరికాలన్ని ఎలాగైనా కడంబూర్ మాళిగకు వెళ్ళకుండ అడ్డగించాలి. అందుకోసమే మనమిద్దరం తాళపత్రం రాసి వంతిదేవుని చేత ఇచ్చి పంపించాలి. మన కోరికను మీరి ఆదిత్య కరికాలన్ కడంబూర్ మాళిగకు బయలుదేరే పక్షాన, వంతిదేవుడు కూడ అతనితోబాటు వెళ్ళాలి. అతన్ని నీడలాగ విడవకుండ కాపలా కాయాలి. నందినిని ఏకాంతంగా కలిసేందుకు కూడ తావివ్వకూడదు."

కుందవై పెద్దగా నిట్టూర్చింది. ముఖ్యమంత్రి చెబుతున్న కార్యం ఎంత ముఖ్యమైనదో ఆమె గ్రహించింది. అన్ని వివరాలు తెలిసే మాట్లాడుతున్నారా, లేక రాజకీయ కార్యం మాత్రం గురిగా పెట్టుకొని మాట్లాడుతున్నారా అని ఆమె తేల్చుకోలేకపోయింది.

"అయ్యా! వారు కలవడాన్ని అడ్డుకోవడం అంత ముఖ్యమైన కార్యమని ఎందుకంటున్నారు?" అని అడిగింది.

"అమ్మణీ! వీర పాండ్యుని ఆపత్కాల సహాయకులు కొందరు చోళవంశాన్ని సమూలంగా నాశనం చేసేందుకు శపథం పూనివున్నారు. వారికి పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసం నుంచి కొత్త బంగారు నాణాలు పంపిణీ అవుతున్నాయి. ఇంతకన్న నేనేమైన చెప్పాలా, తల్లీ?"

"వద్దు" అని గొణిగింది కుందవై. చూడామణి విహారంలో జ్వరంతో మంచం పట్టివున్న తమ్ముడు గుర్తుకొచ్చాడు. పొన్నియిన్ సెల్వన్‌ని కూడ అపాయాలు చుట్టుముట్టివుండవచ్చు కద?

"అయ్యా! చోళనాడుకు ఆపద మీద ఆపద వస్తున్నప్పుడు మీరు ముఖ్యమంత్రిగా ఉండడం అదృష్టమే! నా తమ్ముని విషయంలో ఏం ఏర్పాట్లు చేశారు?" అని అడిగింది.

"చోళదేశంలోని అన్ని శివ, వైష్ణవాలయాలలోను యువరాజు క్షేమం కోసం అర్చనలు చేయమని పురమాయించాను. అలాగే బౌద్ధ విహారాలలోను, జైన విహారాలలోను ప్రార్థనలు చేయబోతున్నారు. నాగపట్టణపు చూడామణి విహారంలో బౌద్ధభిక్షువులు ఒక మండలంపాటు విశేష ప్రార్థన చేయబోతున్నారు. ఇంకేం చేయవచ్చని నీవంటున్నావమ్మా?"

చూడామణి విహారం గురించి చెబుతున్నప్పుడు ఆయన ముఖంలో ఏదైనా మార్పు కనిపిస్తుందేమోనని గమనించింది కుందవై. ఏమీ కనిపించలేదు.

"అయ్యా! చూడామణి విహారం అన్న వెంటనే ఒక విషయం గుర్తుకొచ్చింది. ఆ విహారం మీద పెద్ద పళువేట్టరయ్యర్ ఎందుకో కోపంగొనివున్నారట. లంకలోని బౌద్ధభిక్షువులు యువరాజుకు పట్టంకట్టాలని అనుకొంటున్న వార్త తెలియవచ్చినప్పటినుంచి వారి కోపం ఇంకా ముదిరిందట. యువరాజు కనిపించకుండ పోయినందుకు వారిమీద నింద మోపినా మోపవచ్చు. అందుకు తగిన రక్షణ ఏర్పాట్లు మీరే చేయాలి" అన్నది కుందవై.

"వెంటనే చేస్తానమ్మా! చక్రవర్తి ఆజ్ఞ సమేతంగా చూడామణి విహారాన్ని రక్షించేందుకు ఒక చిన్న

సైన్యాన్ని కావాలంటే పంపిస్తాను. వంతిదేవుని కంచికి పంపడం గురించి ఏమంటావు?"

"అంత ముఖ్యమైన కార్యానికి ఇంకెవరినైనా పంపడం మంచిది కద?"

"నీకు మటుకు అతనిపైన నమ్మకముంటే అతన్నే పంపగోరుతాను. అతడి వీర సాహస కృత్యాల గురించి కూడ తెలుసుకొన్నాను. దేనికీ జంకని అసహాయ శూరునికే మనమీ కార్యాన్ని ఒప్పజెప్పాలి. ఇవాళ నేను కళ్ళారా అంత:పురం ముందు చూశాను కద? నేను అడ్డుపడి ఆపకుంటే ఆ వైద్యకుమారుడు యముడికి వైద్యం చేసేందుకు పయనం చేసేవాడే...."

యువరాకుమారి ఇది విని పొంగిపోయింది. కానీ కాస్త జంకుతూ, "వీరుడైతే మాత్రం చాలా? తొందరపాటు మనిషిగా ఉంటే? ఎంత తొందరపాటుగా దెబ్బలాటకు దిగాడు?"

"అందుకు కావాలంటే నా శిష్యుడు తిరుమలైని కూడ తోడు పంపుతాను. నెమ్మదిగా ఆలోచించి చేయడంలో పేరుగాంచినవాడు ఆళ్వార్ కట్టియాన్!" అన్నారు అనిరుద్ధులు. యువరాకుమారి మనసులో, "ఈయన మనసులో ఏముందో ఆ దేవుడికైనా తెలుసో, తెలియదో! గూఢచారికి తోడు ఇంకొక గూఢచారిని పంపగోరుతున్నారు కాబోలు!" అనుకొంది.

~~~
~~~

# అధ్యాయము - 29

## వాణతిలో మార్పు

**కుందవై** వంతిదేవుని చెరసాలనుంచి విడుదల చేసి మళ్ళీ ప్రయాణం మీద పంపించేందుకు బయలుదేరుతుండగా, వాణతి ఎదురొచ్చింది. అణకువతో, ఒద్దికగా నిలబడింది.

"నా ముద్దూ! నిన్ను వదిలిపెట్టి వచ్చేశాను. ఇంకా రాజ్యాంగ సంబంధమైన పని ఉంది. నీవెళ్ళి తోటలో ఉండు. అది ముగించుకొని వచ్చేస్తాను. కొలనువైపు మాత్రం వెళ్ళకు" అన్నది కుందవై.

"అక్కా! ఇక మీకు ఇబ్బంది కలిగించను. కొడుంబాళూరుకు వెళ్ళగోరుతున్నాను. అనుమతి ఇవ్వండి" అన్నది వాణతి.

"అదేమి? నీవు కూడానా నా తలపైన ఇంకో పిడుగు వేస్తున్నావు? నీకు నాపైన ఏం కోపం? నీ పుట్టింటిపైన ఉన్నట్లుండి ఏమింత ప్రేమ?"

"మీపైన కోపంగించుకొంటే, తర్వాత నాలాంటి కృతఘ్నులెవరూ ఉండరు. నా పుట్టింటిపైన కొత్తగా ఏమీ ప్రేమ పుట్టుకొని రాలేదు. తలిదండ్రులు లేని నాకు పుట్టిల్లేది? మావూరి పక్కనున్న కాళి గుడిలో పూజ చేయిస్తానని మా అమ్మ ఒకసారి మొక్కుకొందట. అది నెరవేర్చకుండానే ఆమె కన్నుమూసింది. నాకప్పుడప్పుడు మైకం వస్తోంది కదా? ఒకవేళ ఆ మొక్కుబడి తీర్చనందువల్లనే కావచ్చు కదా?"

"అందుకోసం నీవంత దూరం పోనవసరం లేదు. నేనే చెప్పి పంపించి ఆ మొక్కు తీర్చమని చెబుతాను."

"అది మాత్రం కాదక్కా! నా పెద తండ్రి లంకనుంచి తిరిగి వస్తున్నారట. ఆయన తంజావూరు దాటి పళైయారైకి రారు. ఆయన వచ్చేలోపల కొడుంబాళూరు చేరుకోవాలని కోరుకొంటున్నాను. ఆయన దగ్గర లంకలో జరిగిందంతా నేరుగా వినాలనుకొంటున్నాను!"

"లంకలో జరిగింది తెలుసుకోవడంలో నీకెంత ఆసక్తి!"

"అదేం అలా అంటున్నారు? నా తండ్రి లంకలో జరిగిన యుద్ధంలో వీరస్వర్గం పొందిన విషయం మరిచారా?"

"మరువలేదు. అందుకిప్పుడు పగ తీరింది..."

"పూర్తిగా పగ తీర్చినట్లు నాకనిపించడం లేదు. యుద్ధం ముగిసేలోపే తొందరపడి పెద్ద వేళార్ తిరిగి వస్తున్నారు..."

"అందుకని, ఆయన్ని మళ్ళీ లంకకు వెళ్ళి యుద్ధం చేయమని చెప్పబోతున్నావా? అందుకేనా కొడుంబాళూరుకు వెళ్ళాలంటున్నావు?"

"అంత పెద్ద విషయాల గురించి మాట్లాడేందుకు నేనెవరిని? జరిగింది విని తెలుసుకోవాలనే నేను వెళ్ళగోరుతున్నాను..."

"ఆహా! నీ మనసులో ఏముందో నాకిప్పుడు  తెలిసింది. పొన్నియిన్ సెల్వన్ లంకలో చేసిన వీరకృత్యాలను మీ పెదనాన్న నోటినుంచి వినాలని కద నీ కోరిక?"

"అది తప్పా, అక్కా?"

"అది తప్పు కాదు. కానీ ఇటువంటి సమయంలో నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళాలనుకొంటున్నావు కద? అదే పెద్ద తప్పు!"

"అక్కా! నేనా మిమ్మల్ని ఒంటరిగా వదిలి వెళుతున్నాను? నాలాగ మీకెందరో చెలికత్తెలున్నారు. మీ మనసెరిగి కార్యం నెరవేర్చేందుకు ఎందరో వేచివున్నారు..."

"నీవు కూడ ఇలా మాట్లాడ మొదలు పెట్టేశావా, వాణతీ! నా తమ్ముని గురించిన వార్త విని నీ మనసు చాల బాధపడ్డట్లుంది. అందు గురించి నీవెక్కువగా దిగులుపడకు..."

"మీ తమ్ముని గురించి మీకు లేని దిగులు నాకెలా ఉంటుందక్కా?"

"నిజం చెప్పు! కొలనులో నీవే కావాలని పడిపోయావా? లేక, నిజంగానే మైకమొచ్చి పడిపోయావా?"

"కావాలని ఎందుకు కొలనులో పడాలి? స్పృహ తప్పి అలా కొలనులో పడిపోయాను. మీరు, ఆ వాణర్ కులవీరుడు నన్ను కాపాడారు."

"కాపాడినందుకు కృతజ్ఞత ఉన్నదానిలాగ కనిపించడం లేదే?"

"ఈ జన్మలో మాత్రం కాదు, ఏడేడు జన్మలకు ఋణపడివుంటాను."

"ఈ జన్మ ఇంతటితో ముగిసిపోయినట్లు మాట్లాడుతున్నావే? నేను చెబుతున్నాను, విను వాణతీ! ఊరక దు:ఖపడకు! అరుళ్మొళి వర్మకు ఏ అపాయమూ కలిగివుంటుందని నేను నమ్మడంలేదు. కాసేపటి క్రితం అంత:పురం ముందు గుమిగూడిన ప్రజలకు చెప్పిందే నీకూ చెబుతున్నాను. ఒకప్పుడు కావేరి మాత నా తమ్ముడిని కాపాడింది. అదే విధంగా సముద్రరాజు కూడ వాడిని కాపాడివుంటాడు. త్వరలోనే మనం మంచి వార్తను వినబోతున్నాము."

"దేన్ని ఆధారంగా చేసుకొని ఇంత రూఢిగా చెబుతున్నారక్కా?"

"నా మనసులో ఏదో ఒక వాణి చెబుతోంది. నా ముద్దుల తమ్మునికి ఏదైనా అపాయం కలిగేవుంటే నా మనసుకు తెలిసేవుండేది. నేనిలా నెమ్మదిగ మాట్లాడుతుండేదాన్ని కాను."

"మనసు చెప్పేదాంట్లే నాకంతగా నమ్మకం లేదక్కా!"

"అదెలా నీవు మాత్రం అంత ఘంటాపథంగా చెబుతున్నావు?"

"నా మనసులో కొంతకాలంగా ఒక భ్రమ అగుపిస్తూ వస్తూంది. కలలో కూడ అగుపించేది;

మెలకువగా ఉన్నప్పుడు కూడ కొన్నిసార్లు ఆ భ్రమ అగుపించేది....”

“ఏమది, వాణతీ?”

“నీటిలో మీ తమ్ముని ముఖం తరచూ కనిపించేది; నన్ను పిలిచేలాగ కూడ అనిపించేది. కలలో కూడ ఈ భ్రమ తరచూ కనిపించేది...”

“దాన్ని భ్రమ అని ఎందుకంటున్నావు? మనకు వచ్చి చేరిన వార్తకు, నీ మనోభావానికి చాల పోలిక ఉంది కదా?”

“ఇంకా పూర్తిగా వింటే అది ఎంతటి పిచ్చిదైన భ్రమ అని మీకే తెలుస్తుంది. మైకం కమ్మి కొలనులో పడిపోయాను కదా? అప్పుడు నేను తిన్నగా నాగలోకానికే వెళ్ళిపోయాను. అక్కడ ఒక వివాహ వైభవం జరిగింది...”

“ఎవరెవరికి పెళ్ళి?”

“అది చెప్పనిష్టపడ్డం లేదక్కా! మొత్తంమీద మనసులో తోచింది, కలలో కనిపించేదీ నమ్ముతున్నాను. కంటికి కనిపించేది, చెవులకు వినిపించేది మాత్రమే ఇక మీదట నమ్మబోతున్నాను...”

“వాణతీ! నీవు చెప్పేది పూర్తి తప్పు. కంటికి కనిపించేది, చెవులకు వినిపించేది కొన్నిసార్లు అబద్ధంగా ఉంటుంది. మనసులో తోచేదే నిజమైవుంటుంది. కథలు, కావ్యాలనుంచి ఇందుకు నేనెన్నో ఉదాహరణలు చెప్పగలను....”

“ఇంకోసారెప్పుడైనా అవన్నీ వింటానక్కా! ఇప్పుడు నాకు సెలవివ్వండి!” అన్నది వాణతి.

యువరాకుమారి కుందవైకి చాల ఆశ్చర్యం కలిగింది. ఈ అమ్మాయికి ఉన్నట్లుండి ఇంత ధైర్యమూ, మంకు పట్టూ ఎలా వచ్చాయి అని ఆశ్చర్యపడింది.

“వాణతి! ఇదేం తొందరపాటు? అలా నీవు తప్పక ఊరికెళ్ళాలన్నా కూడ, కొన్నిరోజుల తర్వాత వెళ్ళకూడదా? ఇప్పుడు దేశమంతటా అల్లకల్లోలంగా ఉంది కదా? నిన్ను తగిన రక్షణతో పంపాలి కదా?”

“నాకేం భయం అక్కా? కొడుంబాళూర్ నుంచి నన్ను తీసుకొచ్చిన పల్లకి బోయీలు ఇన్ని రోజులుగా పనిలేక ఊరకే నిద్రపోతున్నారు. వారే నన్ను మళ్ళీ తీసుకొని వెళ్ళి చేర్చుతారు...”

“బాగుంది! నేను నిన్నలా పంపిస్తాననా అనుకొంటున్నావు?”

“మిమ్మల్ని చాల వేడుకొంటున్నాను. అక్కా! నాకు భయమేమీ లేదు. కొడుంబాళూర్ వాణతిని ఈ నాడులో ఎవరూ ఏమీ చేయ తెగించరు. అందులోను యువరాకుమారి ప్రీతికి పాత్రురాలైన చెలికత్తె అన్న విషయం ఎవరికి తెలియదు? ఒకే ఒక్క కార్యానికి మాత్రం అనుమతినివ్వండి. ఆ కుడందై జ్యోతిష్కుల ఇంటికి వెళ్ళి ఆయనను కొన్ని ప్రశ్నలడుగాలనుకొంటున్నాను. అందుకు మీ అనుమతి ఉందా?”

“ఆయనను చూసి కొన్ని ప్రశ్నలు అడగాలని నేను కూడ అనుకొంటున్నాను. కానీ నీవింత తొందరపడుతున్నావు కదా?”

“లేదక్కా! ఈసారి ఆయనను ఒంటరిగా కలిసి జోస్యం అడగాలనుకొంటున్నాను.”

కుందవై ముక్కుపైన వేలేసుకొని ఆశ్చర్యపడింది. ఈ పిల్ల ఒక్కరోజులో, ఒక్క జాము సమయంలో ఎలా ఇంత మొండిపట్టు పట్టేదిగా మారింది అని యువరాకుమారికి అర్థం కాలేదు. ఆమె ప్రయత్నాన్ని అడ్డగించి ఆపలేమని గ్రహించింది.

“సరే, వాణతి! నీ ఇష్టప్రకారమే చేద్దాం. నీవు ప్రయాణానికి కావలసినవి సిద్ధం చేసుకో. అంతలోపల చెరలోవున్న ఆ వాణర్ కులవీరుని విడుదల చేసేసి వస్తాను!” అన్నది కుందవై.

~~~
~~~

# అధ్యాయము - 30

## రెండు చెరసాలలు

**వాణతిని** వదిలివచ్చిన వెంటనే యువరాకుమారి తిన్నగా పళైయార్రై చెరసాలకు వెళ్ళింది. తన రక్షకభటులను బయటే ఉండమని చెప్పి తాను మాత్రం వంతిదేవుడు బంధించబడివున్న గదివద్దకు వెళ్ళింది. అతడు మాత్రం ఒంటరిగా ఒక గదిలో పెట్టి బంధించబడివున్నాడు. గది కప్పును చూస్తూ ఉత్సాహంగా జానపదగీతాలు పాడుకొంటున్నాడు.

"ఆకాశదీపాలన్నీ, ఓ జింకా! నిన్ను చూసి

ఒడలు పులకరించి మైమరచి నిలిచివున్నాయి!"

కుందపై దగ్గరకొచ్చి కాస్త గొంతు సవరించుకొన్న తర్వాతే ఆమెను తిరిగి చూశాడు. వెంటనే లేచి నిలబడి, "రండి! రండి! రాకుమారీ! రండి! ఆసీనులు కండి!" అని స్వాగతించాడు.

"ఏ ఆసనం మీద కూర్చోవాలి?" అని అడిగింది యువరాకుమరి.

"ఇది మీ అంతఃపురం; ఇక్కడ నడిచేది మీ పాలన, మీ ఆజ్ఞ. ఇక్కడున్న ఏ సింహాసనంమీదనైనా మీరు కూర్చోవచ్చు!" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యా! మీ పూర్వీకులు ముల్లోకాలను ఏలినప్పుడు వారి అంతఃపురం అలాగే ఉండేది కాబోలు. మా నగరంలో దీన్ని చెరసాల అంటారు!" అన్నది యువరాకుమారి.

"అమ్మణి! మా ఊళ్ళో ఇప్పుడు అంతఃపురమూ లేదు, చెరసాలకూడ లేదు. పలుదేశాల రాజులు కూడబలుక్కొని మా అంతఃపురాలను, చెరసాలను పడగొట్టి నేలమట్టం చేసేశారు. వందేళ్ళ క్రితం..."

"ఎందుకు? ఎందుకు? వల్లపు అంతఃపురాలపైన, చెరసాలలపైన వారికెందుకంత కోపం వచ్చింది?"

"అంతా ఒక కవి వల్ల వచ్చిన చేటు!"

"ఆఁ! అదెలా?"

"నా కులపూర్వీకులు దక్షిణదేశాన్ని రారాజులుగా ఏలారు. ఆ రోజుల్లో నిర్ణీత సమయానికి కప్పం కట్టని సామంత రాజులను అధికారులు బంధించి తీసుకొని వచ్చేవారు. అంతఃపురం ముందుభాగానికి ఇరుపైపులా ఆ రాజులను బంధించి పెట్టేందుకు చెరసాలలుండేవి. చక్రవర్తి తమపైన ఎప్పుడు కరుణ చూపుతారు, ఎప్పుడు విడుదల చేస్తారని వేచివుండేవారు. రారాజును చూసే అవకాశం వారికి అంత సులభంగా దొరకదు. వారి కళ్ళముందే కవులు, పండితులు చక్రవర్తి ఆస్థానానికి వెళ్ళేవారు. పద్యాలు, పాటలు పాడి రారాజును మెప్పించి బహుమతులు తీసుకొని తిరిగి అదేదారిన వెళ్ళేవారు. అప్పుడు చెరలో

ఉన్న సామంత రాజులు, 'అరెరె! ఈ కవులకు, పండితులకు పట్టిన యోగం చూడు! వీరు తీసుకొని వెళుతున్న బహుమతులు చూడు!' అని చెప్పుకొని ఆశ్చర్యపడేవారు. 'ఓహో! ఈ పండితుడు తీసుకొని వెళుతున్నది నా వెండి గొడుగు కద!' అనేవాడొక రాజు. ఇంకొక రాజు, 'అయ్యో! నా పట్టుపుటేనుగును తీసుకొని వెళ్ళిపోతున్నాడే ఈ కవి!' అని ఏడ్చేవాడింకొక రాజు. 'ఇది నా గుర్రం! ఈ కవిని నా గుర్రం ఒకరోజు తప్పక కింద పడేస్తుంది!' అని చెప్పుకొని సంబరపడేవాడు ఇంకొక రాజు. అందరు కవిపండితుల తర్వాత చివరగా ఒక కవి వచ్చాడు. అతడు చెరలోని సామంతరాజుల మాటలు విన్నాడు. విని, వారిని ఎగతాళి చేసేటట్లు ఒక వ్యంగ్య కవితను ఆశువుగా చెప్పి చక్రవర్తిని అందరికన్న ఎక్కువగా మెప్పించాడు.

"ఆ కవి పాడిన కవిత తమిళనాడులోనే కాక, విదేశాలకు కూడ విస్తరించింది. ప్రజలు ఆ పాటను తరచూ పాడి ఆనందించేవారు. కానీ, దానివల్ల మా రాజ్యానికే ముప్పొచ్చింది. అందరు రాజులు కూడబలుక్కొని ఒక్కుమ్మడిగా దండెత్తివచ్చి మా ఊరిని, అంతఃపురాన్ని, చెరసాలలనన్నింటినీ ధ్వంసం చేసి తుడిచిపెట్టేశారు...."

"అన్నిటినీ నాశనం చేసినా, ఆ కవి చెప్పిన పాటను తుడిచిపెట్టలేకపోయారు కద? మీ కులం మహాభాగ్యం చేసిన కులమే! ఆ కులం గొప్పతనం, కీర్తి ఎన్నటికీ నిలిచివుంటుంది!"

"వాణర్ కులగౌరవాన్ని చెడగొట్టడానికి నేనొకడిని పుట్టాను కద..."

"ఆహా! ఆ నిజాన్ని మీరే ఒప్పుకొనేశారు కద?"

"ఒప్పుకోక ఇంకేం చేయను? లోకువతనాల్లో స్త్రీకి లోకువ కావడం అతి నీచమైనది. ఒక స్త్రీ మాట వినబోయి, మా పూర్వీకుల కీర్తికి మచ్చ కలిగేలాగ ప్రవర్తించవలసి వచ్చింది. పరుగెత్తి దాక్కొని, నా ప్రాణాలు కాపాడుకోవలసి వచ్చింది. నా కోపాన్నంతా ఆ వైద్యకుమారుని చంపి తీర్చుకొందామనుకొన్నాను. అంతలో ఒక ఆటంకం కలిగింది..."

"అయ్యా! వైద్యకుమారుని మీద మీకెందుకంత కోపం?"

"కోపానికి కావలసినన్ని కారణాలున్నాయి. భలేవాడిని నాతో కోడిక్కరైకి పంపించారు. వాడు నా కార్యాన్నే చెడగొట్టబోయాడు. అది పోతే పోనీ. కాసేపటి క్రితం ఈ నగరవీధిలో నన్ను గూఢచారి అని నేరారోపణ చేసి పళువేట్టరయ్యర్ల మనుషులకు పట్టివ్వజూశాడు. అక్కడినుంచి తప్పించుకొని రాగా, అంతఃపురం ముందు, వేలకొద్ది ప్రజల ముందు నేను పళువూర్ యువరాణి గూఢచారి అని నామీద నింద మోపాడు..."

"వల్లవరయ్యా! అది నిజం కాదా?"

"ఏది నిజం కాదు?"

"మీరు పళువూర్ యువరాణి నందిని గూఢచారి అని పినాకపాణి మోపిన నింద గురించి అడుగుతున్నాను. నిజం చెబుతారా?"

"నేను నిజం చెప్పనని వ్రతం పూనాను, దేవీ!"

"ఆహా! అదేం వ్రతం? హరిశ్చంద్ర నదీ తీరాన పళువూర్ రాణిని చూసినప్పటినుంచి అటువంటి వ్రతం చేబట్టారా?"

"లేదు, లేదు! అంతకు మునుపే అలా తీర్మానించాను. నేను నిజానికి వ్యతిరేకంగా ఉన్నది చెబుతున్నంత వరకు నన్నందరూ నమ్ముతూ వచ్చారు. ఒక చోట నోరుజారి యువరాజు నాగపట్టణంలో క్షేమంగా ఉన్నారని చెప్పాను. ఎవ్వరూ నమ్మలేదు. విన్నవారందరూ నవ్వారు..."

'ఎంతటి పొరబాటు చేశారు? మీమాటలను వారు నమ్మనిదే మంచిదైంది. నమ్మివుంటే ఎంత పెద్ద ప్రమాదం కలిగేది?"

"ఇకపైన ఇటువంటి పొరబాట్లు జరగనే జరగవు..."

"మీరిచ్చిన ఆ మాటకు చాల కృతజ్ఞురాలను."

"ఏం మాటిచ్చాను?"

"ఇకపైన పొరబాట్లేవీ చేయకుండ నేను ఒప్పజెప్పిన కార్యాన్ని నెరవేర్చుతారని..."

"ఆఁ! నేనలా మాటివ్వనేలేదు! చాలు, చాలు! నన్నీ చెరసాలనుంచి విడుదల చేయండి! నా దారిన నేను వెళతాను..."

"అలాగైతే మీకు విడుదల లేదు. మీరు ఈ చెరసాలలో ఉండవలసిందే!" అన్నది యువరాకుమారి.

వంతిదేవుడు గలగలా నవ్వాడు.

"మీరెందుకు నవ్వుతున్నారు? నేను చెప్పింది మీకు నవ్వులాటగా ఉందా?"

"లేదు, దేవీ! మీరు నన్నీ చెరసాలనుంచి విడుదల చేయకపోతే నేను తప్పించుకోలేనా?"

యువరాకుమారి ఒక క్షణం తన విప్పారిన కళ్ళతో వంతిదేవుని పరీక్షగా చూసి, "అయ్యా! మీరు సమర్థులు. అందులోను చెరసాలనుంచి తప్పించుకోవడంలో మీరు చాల సమర్థులు.  పళువేట్టరయ్యర్ల బొక్కసపు నేలమాళిగ నుంచి తప్పించుకొన్నవారికి ఇదొక లెక్కా?" అన్నది.

"అలాగైతే మీరే తలుపు తెరిచి నన్ను విడుదల చేయండి."

"నేనే ఈ చెరసాలనుంచి మిమ్మల్ని విడుదల చేయవచ్చు. లేదా మీరే తప్పించుకోవచ్చు. కానీ ఇంకొక చెరసాలనుంచి తప్పించుకోలేరు..."

"చిన్న పళువేట్టరయ్యర్ పాతాళ చెరసాల గురించా చెబుతున్నారు?"

"కాదు; అది కూడ మీకంత కష్టంకాదు. పాతాళ చెరసాల వాకిట కాచుకొనివుండే పులుల్ని కూడ ఓడించి తప్పించుకోగలరు..."

"మరి, ఏ చెర గురించి చెబుతున్నారు?"

"నా హృదయమనే చెరసాల గురించే చెబుతున్నాను..."

"దేవీ! నేను ఇల్లు, వాకిలి లేని అనాధను. నా కులం గొప్పలన్నీ పాత కవుల కల్పన. మీరేమో ముల్లోకాలను ఒకే ఛత్రం కింద ఏలే చక్రవర్తి ముద్దుల కుమార్తె...."

"ఎవరు చూడొచ్చారు? ఈ చోళకులం గొప్పతనం కూడ ఒకరోజు పాతకథైపోవచ్చు...."

"అయినప్పటికీ ఈ రోజు మీరు ఈనాడులో తిరుగులేని అధికారం కలిగినవారు. చక్రవర్తి, ముఖ్యమంత్రి, పళువేట్టరయ్యర్లు కూడ మీ మనోరథానికి విరుద్ధంగా నడుచుకోవడానికి ధైర్యం చేయరు.."

"ఇదంతా నిజమైతే, మరి మీరు మాత్రం నా అధికారాన్ని ఎలా మీరగలరు?"

"రాజ్యాంగ అధికారం వేరు; మీ హృదయాధికారం గురించి కద మీరు సూచిస్తున్నారు?"

"అందులో తప్పేమి?"

"మనిద్దరి అంతస్తుల మధ్య ఉన్న తేడానే తప్పు..."

"ప్రేమకు అంతస్తులు అడ్డా?"

"ఆ మాట పొన్నియిన్ సెల్వన్‌కి, ఆ పడవ నడిపే పిల్లకి కూడ వర్తిస్తుంది కద?"

"అవును; ఆ మాట వారికి కూడ వర్తిస్తుంది. నా తమ్ముడు లోకాలేలేందుకు పుట్టినవాడనుకొన్నాను. కాబట్టి వాడి హృదయానికి కూడ తాళం వేయగోరాను..."

"నేను కూడ యువరాజు గురించి ఎన్నెన్నో విని ఇక్కడికి వచ్చాను. ఆయనతో నలుదిక్కులా యుద్ధాలకు వెళ్ళి వీరకృత్యాలు చేసి పేరు ప్రఖ్యాతులు పొందాలనుకొన్నాను..."

"ఇప్పుడా ఆశ కొట్టుకుపోయింది కద?"

"అవును; పొన్నియిన్ సెల్వన్ ఇప్పుడు రాజ్యాధికారం కన్న ప్రశాంత జీవితం కోరుకొంటున్నారు. యుద్ధరంగంలో ఖడ్గచాలనం కన్న దేవాలయ కైంకర్యాలలోను, కాయకష్టం చేయడంలోను అధికంగా ఆసక్తి చూపుతున్నారు..."

"మధురాంతకుడేమో రాజ్యమేలేందుకు తీవ్రంగా ఉవ్విళ్ళూరుతున్నాడు. మేక పులిగా మారుతోంది; పులి మేకగా మారుతోంది. నక్కను గుర్రంగాను, గుర్రాన్ని నక్కగాను చేసినట్లు శివపురాణం చెబుతోంది..."

"దేవీ! మీ దయవల్ల నేనొక నక్కనైనాను. దాక్కొని, మరుగున ఉండి, ఉన్నవి, లేనివి కల్పించి చెప్పి పగవారినుంచి తప్పించుకొని రావలసివచ్చింది. రాకుమారీ! ఇలాంటి పనులు నేనిక చేయలేను. సెలవివ్వండి..."

"అయ్యో! నా ప్రాణస్నేహితురాలని ఎంచిన వాణతి నన్ను విడిచి వెళ్ళజూస్తూంది. మీరు కూడ నన్ను విడిచి వెళతానంటున్నారా?"

"దేవీ! మీకు, కొడుంబాళూర్ రాకుమారికి మధ్యనున్న వ్యవహారం నేనెరుగను. కానీ నేనెలా మీ

చేయి పట్టగలను? రాజాధిరాజులు మీ దివ్యహస్తాన్ని గ్రహించేందుకు తపస్సు చేస్తున్నారు. నేనేమో ఒక చిన్న పని చేసిపెట్టేందుకు వచ్చినవాడిని..."

~

అప్పుడు యువరాకుమారి తన కరకమలాన్ని ముందుకు చాచింది. ఇది కలో, నిజమో తేల్చుకోలేని వంతిదేవుడు ఆ దివ్యహస్తాన్ని తన రెండు చేతులతో పట్టుకొని తన కళ్ళకద్దుకొన్నాడు. అతన మనసూ, దేహమూ పరవశంతో ఉప్పొంగాయి.

"వాణర్ కులవీరా! శీలాన్నే కులధనంగా ఎంచే పురాతన చోళవంశ పరంపరలో వచ్చినదాన్ని నేను. మా కులస్త్రీలు కొందరు సతీసహగమనం కూడ చేశారు. పతిదేహాన్ని దహిస్తున్న అగ్నినే చల్లని వెన్నెలగా భావించి అందులో దూకారు వారు..."

"విన్నాను, దేవీ!"

"మీరు గ్రహించిన నా ఈ హస్తం ఇంకొక పురుషుని హస్తాన్ని ఏనాడూ తాకదు..."

~

వల్లవరయ్యన్ మాటలుడిగి, చేష్టలుడిగి, కన్నీళ్ళుబుకుతున్న కుందవైదేవి కళ్ళనే చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

"అయ్యా! మీ దుస్సాహసాలవల్ల మీ ప్రాణాలకేదైనా అపాయం కలిగితే నా గతి ఏమౌతుందోనని కాస్త ఆలోచించండి."

"దేవీ! మీ హృదయసింహాసనంలో స్థానం పొందిన ఈ భాగ్యశాలి ప్రాణాపాయాలకు భయపడే పిరికిపంద కాగలడా?"

"అయ్యా! పిరికితనం వేరు, జాగ్రత్తగా మసలుకోవడం వేరు! ముఖ్యమంత్రి అనిరుద్ధులకు కూడ మీ శౌర్యం గురించి సందేహం లేదు!"

"మరి, దేని గురించి ఆయన సందేహిస్తున్నారు?"

"మీరు పళువూర్ యువరాణి గూఢచారి కావచ్చని సందేహిస్తున్నారు...."

"అలాగైతే, వైద్యకుమారుడు పినాకపాణికి ఇచ్చిన జవాబే ఆయనకూ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. చెరసాల తలుపులు తెరవండి. ఆ మనిషి ఎక్కడున్నాడో చెప్పండి!"

"వైద్యకుమారుడు కాస్త ముష్ఠియుద్ధం తెలిసినవాడిలాగున్నాడు. పాపం ముఖ్యమంత్రి వాగ్యుద్ధం చేయగలరేగాని, ముష్ఠియుద్ధం చేయలేరు. బుద్ధికుశలతే ఆయన ఆయుధం. కత్తిని ఆయన ఏనాడూ తోడుగా తీసుకోరు..."

"అయితే నా కత్తి పదునే మొదటిసారిగా రుచి చూడనీ!"

"అయ్యా! ఈ రాజ్యంలో చక్రవర్తి తరువాత రెండవ స్థానం అనిరుద్ధులది. ఆయనను బహిరంగంగా

ఎదుర్కొనేందుకు పళువేట్టరయ్యర్లు కూడ జంకుతారు...”

“పళువేట్టరయ్యర్లు మనసులో నేరం మోస్తున్నవారు. వారు భయపడే తీరుతారు. నేనెందుకు భయపడాలి?”

“చిన్నప్పటినుంచి నా తండ్రికి ప్రాణస్నేహితులాయన.. ముఖ్యమంత్రికి చేసే అమర్యాద చక్రవర్తికి, నాకు కూడ చేసినట్లవుతుంది.”

“అలాగైతే ఆయన నమ్మకాన్ని చూరగొనేందుకు దారైనా చూపండి.”

“ముఖ్యమంత్రి అతినమ్మకస్తుడొకరిని కంచికి పంపగోరుతున్నారు. మిమ్మల్ని నమ్మి పంపవచ్చని నేనాయనకు భరోసా ఇచ్చాను.”

“దేవీ! నన్ను కంచికి పంపించకండి! నా మనసులో ఏదో ఒక గొంతు 'కంచికి వెళ్ళకు!' అని హెచ్చరిస్తోంది.”

“అది ఒకవేళ పళువూర్ యువరాణి గొంతే కావచ్చు కదా?”

“ముమ్మాటికీ కాదు! మీమాటకు వ్యతిరేకంగా ఆ విషనాగం మాట వింటానా?”

“అయ్యో! పళువూర్ యువరాణి గురించి ఇక ఎప్పుడూ అలా మాట్లాడకండి!”

“ఇదేమి? ఉన్నట్లుండి ఈ మార్పు?”

“అవును. నా మనసు ఆమె విషయంలో పూర్తిగా మారిపోయింది - మీరు లంకనుంచి తీసుకొని వచ్చిన వార్త విన్న తర్వాత...”

“అలాగైతే నేనిక పళువూర్ యువరాణితో కూడ భయభక్తులతో నడుచుకోవాలా?”

“అవును!”

“ఆమె భక్తితో పూజ చేసే కత్తిని నా చేతికిచ్చి ఫలానావాడి తల నరికి తీసుకొని రమ్మాన్నా కూడ, అలా చేయవలసిందేనా?”

~

కుందవైదేవి ఒళ్ళు గడగడ వణికింది. బదులు చెప్పినప్పుడు ఆమె గొంతుకూడ వణుకుతూంది.

“పళువూర్ రాణికి గౌరవ మర్యాదలిచ్చి నడుచుకోవలసిందే. కానీ ఆమె మాట విననవసరం లేదు. ఆమె ఎటువంటి కార్యం తలపెట్టిందని ఆమెకే తెలియకపోవచ్చు కదా?”

“ఆమె కూడ అలాగే అంది. 'నేనీ కత్తికి ఎందుకు పూజ చేస్తున్నానో నాకే తెలియదు  అని."

ఇది విన్న యువరాకుమారి మరింతగా వణుకుతున్న స్వరంతో, “ఈ చోళవంశాన్ని ఆ దేవుడే కాపాడాలి!” అన్నది.

“కాపాడే దైవం ఈ పేదవాడిని సాధనంగా ఉపయోగించుకొని కాపాడుతుంది" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యో! నేనూ అలాగే నమ్ముతున్నాను. మీరు కంచినుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్ళీ లంకకు వెళ్ళాలి. ఆ మూగతల్లిని ఎలాగైనా ఇక్కడికి పిలుచుకొని రావాలి..."

"ఆమెను పిలుచుకొని రావడం సుడిగాలిని బిందెలో పట్టి తీసుకొని రావడంలాంటిది. అలాగని ఎవరో ఒకసారి అన్నారు. అవును, ఆ వీరవైష్ణవుడే. ఒకవేళ అతడే ఆమెను తీసుకొని వస్తాడేమో..."

"లేదు. అతడికా పని అసాధ్యం. మీవల్లనే జరగాలి..."

"అలాగైతే నన్ను కంచికి పంపకండి, దేవీ!"

"ఎందుకు?"

"అక్కడ నా యజమాని ఉన్నారు. ఆయన అడిగితే నేనన్నీ వివరాలూ చెప్పే తీరాలి. పళువేట్టరయ్యర్లు, తక్కిన చిన్నరాజులు చేస్తున్న కుట్ర తెలిస్తే, వెంటనే దండెత్తి వస్తారు. చక్రవర్తిని చెరసాలలో బంధించినట్లు ఉంచారని తెలిస్తే తప్పక దండెత్తి వస్తారు. పొన్నియిన్ సెల్వన్ గురించిన విషయం ఆయనకు అందివుంటే ఇప్పటికే ఒకవేళ బయలుదేరి వస్తుంటారేమో..."

"అందుకనే మిమ్మల్ని పంపాలనుకొంటున్నాను. ఆయన కంచిని వదిలి బయలుదేరకుండ ఎలాగైనా ఆపాలి."

"నేను కంచికి చేరేలోపే ఆయన బయలుదేరివుంటే..?"

"దారిన అతడు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్ళి చేరండి. అన్నిటికన్న ముఖ్యంగా మీరు చేయవలసిన అత్యవసరమైన కార్యం ఒకటుంది..."

"చెప్పండి!"

"పెద్ద పళువేట్టరయ్యర్ పళువూర్ రాణి సమేతంగా కడంబూర్ మాళిగకు బయలుదేరారని వార్త అందింది...."

"నిజంగా యువరాణి వెళుతోందా, లేక యువరాణి పల్లకిలో...."

"లేదు. యువరాణే వెళుతోంది. నా చిన్నాన్న ఇంకా ఇక్కడే ఉన్నాడు కదా?"

"ఎందుకు వెళుతున్నారట?"

"ఆదిత్య కరికాలన్‌ని కూడ కడంబూర్ మాళిగకు రమ్మని ఆహ్వానించారు. పెళ్ళిమాటలన్నది బయటి కారణం. రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించి రాజీ కుదర్చాలని మాటలు జరుగుతున్నాయి."

"నా యజమాని అందుకు ఎన్నడూ సమ్మతించరు."

"అందుగురించి నాకు ఇప్పుడు దిగులే లేదు."

"మరేం దిగులు, దేవీ?"

"ఇదీ అని చెప్పలేని భయం నా మనసులో గూడుకట్టుకొంది. గుండె దడదడ కొట్టుకొంటోంది. నిద్రలో గుర్తు తెలియని భయంకర దృశ్యాలు నన్ను చుట్టుముడుతున్నాయి. మంచినిద్రలో ఉన్నట్లుండి

ఘోరమైన కలలు దిగ్గున నిద్రలేపుతున్నాయి తర్వాత చాలసేపటి వరకు నా ఒడలు గడగడ వణుకుతూంది."

"ఈ పరిస్థితిలో మిమ్మల్ని విడిచిపెట్టి ఎందుకు వెళ్ళమంటున్నారు? మీకు ఎటువంటి అపాయం కలిగినా, నా ప్రాణాలొడ్డి..."

"అయ్యా! నా భయం నా గురించి కానే కాదు. నా అన్న గురించే నా భయమంతాను. పళువూర్ యువరాణి గురించినది. వారిద్దరూ కలిస్తే ఏం విపత్తు జరుగుతుందోనని భయపడుతున్నాను. వారిద్దరు ఏకాంతంగా కలవకుండ మీరడ్డుకోవాలి..."

'దేవీ! వారు ఏదైనా ఒకటి చేయదలుచుకొంటే ఎవరాపగలరు?"

"అయ్యా! నా అన్నను కాపాడే ఇనుప కవచంలాగ మీరుండాలి. అవసరమైతే నందిని ఎవరన్నది నా అన్నకు చెప్పేయాలి..."

"దాన్ని ఆయన నమ్మాలి కద?"

"అతన్ని నమ్మించడం మీ బాధ్యత. ఎలా చేస్తారన్నది నాకు తెలియదు. వారిద్దరు ఏకాంతంగా కలవకుండ చేస్తే చాల మేలవుతుంది..."

"దేవీ! నాకు సాధ్యమైనంతవరకు ప్రయత్నించి చూస్తాను. ఓటమి కలిగితే నా పైన నింద మోపకండి" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యా! మీరు ఓడినా, గెలిచినా, నా హృదయమనే చెరసాలనుంచి మీకు విడుదల లేదు!" అన్నది యువరాకుమారి.

~~~
~~~

# అధ్యాయము - 31

## పచ్చని వస్త్రం

**మరునాడు** ఉదయం వంతిదేవుడు ముఖ్యమంత్రి అనిరుద్ధులు ఇచ్చిన తాళపత్ర సందేశం తీసుకొని అరిసిలా నదీతీరం వెంబడి వెళుతున్నాడు. గుర్రాన్ని మెల్లగా నడుపుతూ ఇరువైపులా కనిపిస్తున్న కమనీయ దృశ్యాలను చూసి ఆనందిస్తూ ముందుకు సాగాడు.

ఆశ్వయుజ మాసం ఆరంభంలో చోళదేశపు పంట భూములు కళకళలాడుతూ కనిపించాయి. ప్రకృతి వస్త్రం ధరించి నవయవ్వన సౌందర్యంతో కనిపించింది. ఆ పచ్చని ప్రకృతి వస్త్రంలో ఎన్నెన్ని వన్నెలు! కంకులు వస్తున్న వరి పంట పచ్చదనం ఒక వైనం, లేత పైర్లు ఇంకొక పచ్చదనం; అప్పుడే కోతకొస్తున్న పంట బంగారు వన్నె ఇంకొక వైనం! మర్రిచెట్టు కిందనున్న ఆకుల పచ్చదనం ఒక వన్నె; ఆ చెట్టు ఆకులు ఇంకొక వన్నె; కొలనుల్లో దట్టంగా పెరిగిన తామరాకుల ఆకు పచ్చదనం ఇంకొక వైనం; అరిటాకుల పచ్చదనం మరొక వన్నె; నేలపైన తివాచీలాగ పరుచుకొన్న గడ్డి పచ్చదనం ఇంకొక వన్నె; కొలను నీటిలో అక్కడక్కడా దూకుతూ, ఎగురుతున్న కప్పల పచ్చదనం ఇంకొన వన్నె.

ఇన్నెన్ని రకాల వన్నెలను ఎత్తి చూపేందుకే అన్నట్లు చుక్కలను పొదిగినట్లు అక్కడక్కడా కలువపూలు, ఎర్రతామరలు, కుముదపుష్పాలు కొలనుల్లో కళ్ళకింపుగా కనిపించాయి.

ఈ ప్రకృతి అందాలనన్నిటినీ రెండు కళ్ళతో ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించాడు వంతిదేవుడు. ఆషాఢమాసాన అదే దారిన వెళ్ళినప్పుడు కనిపించిన దృశ్యాలకు, ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యాలకు ఉన్న తేడాలను అతడు గ్రహించాడు. ఆషాఢమాసంలో నదిలో కొత్తనీరు పొంగి పొర్లి ప్రవహించింది. ఇప్పుడేమో ఆ ప్రవాహవేగం తగ్గి, ఎర్రని నీరు ఇప్పుడు తేటతెల్లని పాలరాతి వన్నెతో ఉల్లాసంగా ప్రవహిస్తూంది. కొత్తనీటి హోరు, గాలిజోరు అమిత కోలాహలంగా ఉండేదప్పుడు. ఇప్పుడేమో చల్లని మందమారుతంలో ఆకులు మెల్లగా కదులుతున్న శబ్దం, పిల్లకాలువల్లో జలజల పారుతున్న నీటి శబ్దం, వర్షాన్నెదురు చూస్తున్న మండూకాల బెకబెకలు, తుమ్మెదల ఝుంకారాలు కలగలిసి ప్రకృతి రాణి సంగీత బాణిలాగ ధ్వనించాయి.

వంతిదేవుని మనసులో ఇప్పుడు ఏదో గుర్తు తెలియని శోకం గూడు కట్టుకొంది. దానికి కారణమేమని ఎంత ఆలోచించినా తెలియలేదు. నిజానికి అతడు అపరిమిత ఉత్సాహంగొనడానికి అనేక కారణాలున్నాయి. రెండుమూడు నెలలకు మునుపు తానీ దారిన వెళుతున్నప్పుడు అనుకొన్న మనోరథాలన్నీ ఇప్పుడు నెరవేరాయి. అతడు కలలో కూడ జరుగుతాయనుకోని కార్యాలు జరిగాయి. సుందర చోళ చక్రవర్తిని దర్శించడమైంది. తంజావూరు, పళైయారై, మామిడితోపు, అనురాధపురం మొదలైన మహానగరాలను దర్శించాడు. చోళదేశపు కంటిపాపగా విరాజిల్లిన పొన్నియిన్ సెల్వన్ స్నేహానికి

పాత్రుడైనాడు; ఆ వీరకుమారునికి సహాయం చేసే భాగ్యం కూడ కలిగింది. తమిళదేశపు సౌందర్యదేవత, చోళవంశ కులదీపమైన రాకుమారి కుందవైదేవిని ఒక్కసారి చూసేందుకే ఎంతో తపస్సు చేయాలి. అటువంటప్పుడు ఆమె స్వచ్ఛమైన హృదయంలో చోటు దొరకడం ఎంతటి మహాభాగ్యం? అది తలుచుకొన్నప్పుడు అతడి హృదయం గర్వంతో ఉప్పొంగింది. కానీ అలా పొంగిన ఉత్సాహంతోబాటు ఏదో ఒకవిధమైన వేదన కూడ తోడుగా వచ్చింది. అంతటి మహాభాగ్యానికి తాను అర్హుడేనా? అది చిరస్థాయిగా నిలుస్తుందా? చేతికందింది నోటికందేలోపు ఎన్నో ఆటంకాలు రావచ్చు కద?

ఆహా! ఆటంకాలకు ఏం కొరత? లోకమే ఆటంకాల మయం! రవిదాసులాంటి మాయ మాంత్రికులు, నందిని వంటి మాయ మోహినులు, పళువేట్టరయ్యర్ల వంటి కుట్రదారులు, గందమారన్, పార్థిబేంద్రునివంటి మిత్రద్రోహులు, వాణతి వంటి పిరికి అమ్మాయిలు, వీరవైష్ణవ గూఢచారులు, కాలాముఖ శైవులు, కొరివి దెయ్యాలు, లోతు తెలియని బురద గుంటలతో నిండిన లోకం కద ఇది? దేవుడా! ఇన్ని అపాయాలనుంచి ఇప్పటివరకు తప్పించుకొన్నాను! వాటన్నిటికన్న పెద్ద అపాయకరమైన కార్యాన్ని ముఖ్యమంత్రి అనిరుద్ధులు తనకు అప్పజెప్పారు కద! ఒకవైపు సులభంగా మూర్ఖావేశం పొందగల ఆదిత్య కరికాలన్; ఇంకొకవైపు పెద్ద పళువేట్టరయ్యర్ని తోలుబొమ్మలాగ ఆడించగల, ఆడిస్తున్న మాయ మోహిని, - వీరి ఉద్దేశానికి అడ్డుగా నిలబడి తాను విజయం సాధించాలట! ఇది కాగల కార్యమేనా? ఆ బ్రహ్మరాయల మనసులో ఏముందో ఆ బ్రహ్మదేవునికే ఎరుక! రాకుమారినుంచి నన్ను విడదీయడమే ఆయన ఉద్దేశంలాగుంది! ఆళ్వార కట్టియాన్ దారిలో వచ్చి కలుస్తాడని ఇద్దరూ చెప్పారు! మరి ఇంతవరకు కనిపించనే లేదు! ఆ వీరవైష్ణవుడు ఎటువంటివాడైనా, తనకింతవరకు ఏ కీడూ చేయలేదు; చాలాసార్లు సహాయమే చేశాడు. అతనితోబాటు ప్రయాణం చేస్తే ఏదైనా ఉత్సాహకరంగా మాట్లాడుతుంటాడు. ప్రయాణం అలసట తెలియకుండ సాగుతుంది. ఇంతవరకు తనను కలుసుకోలేదంటే, ఇకమీదట సాధ్యమా? అతని కోసం ఇంకెంతసేపు తాను గుర్రాన్ని మెల్లమెల్లగా నడుపుతుండడం?

ఆహా! అదిగో ఆ చెట్ల గుంపు! నది పెల్లువలో మొసళ్ళలాగ పరుచుకొనివున్న వాటి వేర్లు! ఇక్కడే కద తాను తోలుబొమ్మ మొసలిపైన శూలం విసిరింది! వాణతి, తారక, చంద్రిక, మందాకిని ఇక్కడే కద తన వీర కృత్యాన్ని చూసి ఫక్కున నవ్వింది! యువరాకుమారి తనను వెనకేసుకొచ్చి ఆ అమ్మాయిలను గద్దించింది కూడ ఇక్కడే! ఇక్కడ కాసేపాగి చూద్దాం...!

~

వంతిదేవుడు గుర్రంపైనుంచి కిందకు దిగి నది ఒడ్డున నిలబడ్డాడు. చెట్ల వేర్ల చుట్టూ సుడులు తిరిగి పారుతున్న నదీప్రవాహాన్ని కాసేపలాగే పరీక్షగా చూస్తూ నిలబడ్డాడు. ఆహా! ఆ సుడిలో ఒక ముఖం కనిపిస్తూంది! అది ఎవరి ముఖం? ఇంకా విశదంగా చెప్పాలా? రాకుమారి దివ్య మోహన వదనమే...!

"చూశాను చూశాను చూశాను

కంటికింపైన వాడిని చూశాను!"

అని పాడిన గొంతును విని వంతిదేవుడు ఉలిక్కిపడి వంతిదేవుడు తలెత్తి చూశాడు. ఎత్తైన ఒక చెట్టు చిటారు కొమ్మన ఆళ్వార్ కట్టియాన్ కూర్చొనివుండడం కనిపించింది.

"ఓహో! వీర వైష్ణవా! నేను మీ దివ్య నేత్రాలకు అంత ఇంపుగా కనిపిస్తున్నానా? నేను కూడ మిమ్మల్ని కాస్త బాగా చూడాలి. కిందకు దిగి రండి!" అన్నాడు వంతిదేవుడు.

ఆ వీర వైష్ణవుడు చెట్టు పైనుంచి కిందకు దిగుతూ, "నేను నీ గురించి చెప్పలేదబ్బాయ్! ఒరలో కత్తితోను, చేత శూలంతోను ఉన్న నీవు నాకు భయంకరంగా కద కనిపిస్తున్నావు?" అన్నాడు.

"మరెవరి గురించి అలా చెప్పారు, వైష్ణవా?"

"ప్రప్రధమ దైవమైన పెరుమాళ్ళు (విష్ణువు) వామనావతారమెత్తి వచ్చి ఆకాశాన్ని కొలిచేందుకు తన పాదాన్ని ఎత్తినప్పుడు మీ శివుని కళ్ళకు..."

"వైష్ణవా! ఆపండి! ఇలా శివుని గురించి లోకువగా మాట్లాడడం ఆపండి. లేకపోతే పెద్ద అపాయానికి గురౌతారు!"

"ఏం అపాయం, తమ్ముడూ? మొసలిని చంపి గజేంద్రుని కాపాడిన చక్రం ఉన్నప్పుడు నన్నెవరేం చేయగలరు?"

"నేను చెప్పవలసింది చెప్పేశాను. ఆ తర్వాత మీ ఇష్టం."

"నాకే అపాయం కలగబోతోందో చెప్పు, తమ్ముడూ!"

"పళైయారైలో జనం గగ్గోలెత్తి అంతఃపురం వాకిట గుమిగూడారు కద? అప్పుడు నేను కొందరు కాలాముఖుల మాటలు విన్నాను."

"ఏం మాట్లాడుకొన్నారు వారు?"

"చోళదేశంలో పెచ్చు పెరిగిపోతున్న వైష్ణవులను మహాకాళికి బలిచ్చి, వారి పుర్రెలను పేర్చి పెట్టి వాటిపైన ఆనంద తాండవం చేయాలని మాట్లాడుకొన్నారు!"

ఆళ్వార్ కట్టియాన్ తన బుర్రను తడిమి చూసుకొని, "ఇది గట్టిగానే ఉంది! కాలాముఖుల తాండవాన్ని తట్టుకోగలదు!" అన్నాడు.

"నేను విన్నందుకు తగినట్లు దారి పొడుగునా కాలాముఖులు పుర్రెలను, శూలాలను ధరించి తిరుగాడుతున్నారు. మీరు శివా అనుకొంటూ ఈ ముందు పిలక వేషం మార్చుకొని...."

"వల్లకాదు!"

"ఎందుకు వల్లకాదు?"

"నీవు చెప్పావు కద, ఆ పేరును నేను ఉచ్చరించలేను. 'విష్ణుదేవా!' అని జపిస్తూనైనా వేషాన్ని మార్చుకొంటాను... అదిగో చూడు!"

నది వెంబడి వెళుతున్న రహదారిలో అప్పుడు ఒక పల్లకి వెళుతుండడం కనిపించింది. అందులో ఒక స్త్రీ ఉండడం కూడ తెలియవచ్చింది. కానీ అది ఎవరని స్పష్టంగా తెలియరాలేదు. ఎవరో రాజవంశ వనిత అయివుండాలి. ఎవరై ఉండవచ్చు? పల్లకి బోయీలుగాక, ఒకే ఒక్క దాది మాత్రం పల్లకి పక్కన నడుచుకొంటూ వెళుతూంది. ఒకవేళ యువరాకుమారి కావచ్చా? ఊహుఁ; అది సాధ్యం కాదు.

"వైష్ణవా! ఆ పల్లకిలో వెళుతున్నదెవరో తెలుసా?" అని వంతిదేవుడు అడిగాడు.

"తమ్ముడూ! నేను చెప్పేది బాగా విను. నీకు సంబంధంలేని విషయాలలో తల దూర్చకు! అందువల్ల నీవిప్పటికే చాల ఇబ్బందులకు, ఇక్కట్లకు గురయ్యావు కద? దారిన ఎంతో మంది వెళుతుంటారు; నీకెందుకు వారి గురించి? గుర్రమెక్కి బయలుదేరు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఓహో! అలాగా! వీర వైష్ణవులిప్పుడు పెద్ద వైరాగ్యవాదిగా మారిపోయినట్లున్నారు. వీర నారాయణపురంలో జరిగింది మరిచిపోయారా? అక్కడ మూసిన పల్లకిలో వెళుతున్న ఒక స్త్రీమణికి ఒక తాళపత్ర సందేశం చేర్చమని మీరు నన్ను అడగలేదా?"

"అదంతా పాత కథ! ఇప్పుడెందుకా ఊసెత్తుతున్నావు?"

"పోతే పోనీ. మీరు నన్ను దారిలో వచ్చి కలుసుకొంటానని చెప్పారు. మీ కోసమే ఇంతసేపూ గుర్రాన్ని మెల్లగా నడుపుకొంటూ వచ్చాను. ఇక మీదైనా నాతో రాబోతున్నారా, లేదా?"

"నీవు గుర్రంపైన వెళుతున్నావు! నేను కాలినడకన వస్తున్నాను. మనిద్దరం ఎలా కలిసి ప్రయాణం చేయగలం? నీవు కొళ్ళిడం నదీ తీరానికి వెళ్ళి అక్కడే ఉండు. రేపు పొద్దున వచ్చి నిన్నక్కడ కలుస్తాను."

~

ఆళ్వార్ కట్టియాన్ ఇంకొక రహస్య కార్యం మీద వెళుతున్నాడని, తనతో రాడని గ్రహించాడు వంతిదేవుడు. "సరే, మీ ఇష్టం!" అని చెప్పి గుర్రంపైకి ఎగిరి కూర్చొని తాను వెళ్ళవలసిన దిశగా చూశాడు. వాయవ్యదిశలో మబ్బులు కమ్ముకొస్తుండడాన్ని చూసి, "వైష్ణవులుగారూ! ఈరోజు వర్షమొస్తుందా?" అని అడిగాడు.

"అబ్బాయీ! నాకేం జోస్యమా తెలుసు? ఆశ్వయుజ మాసం మొదలైంది కద? వాన ఎప్పుడైనా రావచ్చు. ఎందుకూ మంచిది, నీవు గుర్రాన్ని వేగంగా నడుపుకొని వెళ్ళు! రాత్రి బస చేసేందుకు ఏదైనా సత్రమో, చావడో చూసుకో!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

వంతిదేవుడు అలాగే గుర్రాన్ని తట్టి వదిలాడు. "నాకేం జోస్యమా తెలుసు?" అని ఆళ్వార్ కట్టియాన్ అన్నమాట అతడికి కుడందై జ్యోతిష్కులను గుర్తుకు తెచ్చింది. ఈ దారినే ఆయన ఇల్లుంది. ఆయనను ఇంకోసారి చూసి వెళదామా? చోళసింహాసనాన్ని అధిష్టించడానికి ఆశ పడుతున్నవారిలో ఎవరికా అదృష్టం పడుతుంది? పొన్నియిన్ సెల్వన్ ధృవనక్షత్రాన్ని పోలినవారని కుడందై జ్యోతిష్కులన్నారు కద?

ఆయనేమో రాజ్యమేలడానికి ఇష్టపడడం లేదు! లంక సింహాసనాన్ని, మణిమకుటాన్ని ఎంత సునాయాసంగా, తేలిగ్గా త్రోసిపుచ్చారు! ఆయనకు చాల గండాలున్నాయని జ్యోతిష్కులన్న మాట ఒకింత ఫలించింది. అలాగే ఆయన మహోన్నతస్థితిని చేరుకొని విరాజిల్లబోతున్నారని చెప్పినమాట కూడ నిజమవుతుందా? అదెలా సాధ్యమవుతుంది? నేను కంటున్న కలలు ఎంతవరకు ఫలించబోతాయి? నా పూర్వీకులు పోగుట్టుకొన్న రాజ్యం మళ్ళీ లభిస్తుందా? తానిప్పుడు చేబట్టిన కార్యం ఎంతవరకు నెరవేరబోతుంది? ఆదిత్య కరికాలన్, నందిని, - వీరిద్దరి మధ్య అడ్డు నిలబడి తానే కార్యమైనా సాధించగలడా? ఇది వరకు నందిని చేత చిక్కుబడి ఎలాగో తప్పించుకొన్నాం! మళ్ళీ అది సాధ్యమా? పళువూర్ యువరాణిని తలుచుకొన్నప్పుడు వంతిదేవుని మనసులో ఒక దిగులు పుట్టింది. అతడు ఆమెపట్ల మిక్కిలి ప్రీతి, గౌరవాలతో నడుచుకొన్న మాట నిజమే. కానీ ఆమె మనసు లోతుల్ని తెలుసుకోలేకపోయాడు. ఏదో ఒక ముఖ్యమైన కార్యాన్ని తన చేత చేయించుకోవడానికే తనను ప్రాణాలతో వదిలి పెట్టినట్లు అనిపిస్తోంది. అందుకనే ఆమె వంతిదేవుని పట్ల అంత ఓరిమితో ఉంది. ఆ ముఖ్యమైన కార్యం ఏం కావచ్చు?

~

వంతిదేవుని గుర్రం కాసేపటి క్రితం ఆ దారిన వెళ్ళిన పల్లకిని దాటి ముందుకు వెళ్ళింది. ఈ సారి వంతిదేవుడు పల్లకిని గుద్దేందుకు ఇష్టపడలేదు. కానీ గుర్రం పల్లకి పక్కగా వెళ్ళినప్పుడు పల్లకి తెర కాస్త పక్కకు జరిగింది. లోపల ఆసీనురాలైవున్నది కొడుంబాళూర్ రాకుమారి అని గ్రహించాడు. గుర్రాన్ని ఆపుదామా అని ఒక క్షణం ఆలోచించాడు. తర్వాత ఆ ఆలోచనను మార్చుకొని ముందుకు సాగాడు. వాణతి గురించి యువరాకుమారి కుందవై చెప్పింది గుర్తుకొచ్చింది. నలువైపులా అపాయాలు చుట్టుముట్టిన ఈ కాలంలో కొడుంబాళూర్ రాకుమారి ఎక్కడకు బయలుదేరింది? తగిన రక్షణ కూడ లేదే? దానికి తోడు ఇంకొక విచిత్రాన్ని కూడ గమనించాడు వంతిదేవుడు. కాస్త దూరంనుంచి భయంకర రూపంగొన్న ఇద్దరు కాలాముఖశైవులు వాణతి పల్లకినే పరీక్షగా చూస్తున్నారు. వాళ్ళెందుకలా చూస్తున్నారు? వారిద్దరూ ఎవరు? హరిశ్చంద్ర నదీతీరాన తాను పడుకొని నిద్రిస్తున్నప్పుడు తన సమీపానే నిలబడి మాట్లాడుకొన్నవారే కద?

వాణతి పట్ల వంతిదేవునికి అంతగా ఆర్ద్రతాభావం లేదన్నది నిజమే. పొన్నియి సెల్వన్ హృదయంలో పూంగుళలి పొందవలసిన స్థానాన్ని ఈ వాణతి అపహరిస్తూందనే అతడు భావించాడు. అందువల్ల ఆమెపైన కోపంగొనివున్నాడు. అయినాకూడ యువరాకుమారి ఆమెపైన ఎనలేని ప్రేమగొనివుందన్న విషయాన్ని అతడు మరువలేకపోయాడు. కాబట్టి వాణతికి ఏదైనా అపాయం కలిగితే, యువరాకుమారి కుందవైదేవికి ఎనలేని దు:ఖం కలుగుతుంది. కానీ అపాయం ఎందుకు కలగాలి? “సంబంధంలేని విషయాల్లో తలదూర్చకు! నీ పని చూసుకొని నీవు నీ దారిన వెళ్తూండు!” అని ఆళ్వార్ కట్టియాన్ బుద్ధి చెప్పింది సరిగానే ఉంది. కానీ వాణతి పల్లకిని ఆ ఇద్దరు కాళాముఖులు మరుగ్గా దాక్కొని చూస్తూండడం అతడికి మళ్ళీ మళ్ళీ గుర్తుకు రాసాగింది.

అదిగో కుడంద్దై జోస్యుల ఇల్లు వచ్చేసింది! అన్నిటికీ ఆయనను అడిగి చూద్దాం...అరెరె! ఇంతసేపు ఆ విషయం తన బుర్రకు తట్టనే లేదు కద! వాణతి కూడ కుడంద్దై జ్యోతిష్కుల ఇంటికే వస్తూంది కాబోలు! పండు జారి పాలలో పడింది! వాణతి వచ్చి చేరేలోపు మన పని ముగించుకొందాం. ఇలా ఎంచి వంతిదేవుడు తన గుర్రాన్ని ఆ జ్యోతిష్కుల ఇంటి ముందాపి, ఆ చిన్న ఇంటి లోపల దూరాడు.

~~~
~~~

# అధ్యాయము - 32

## బ్రహ్మదేవుని శిరస్సు

**వంతిదేవుడు** రెండేసారి కుడంద్తె జ్యోతిష్కుల ఇంట ప్రవేశించినప్పుడు ఒక తీయని తలపు అతడి మనసులో ఉదయించింది. యువరాకుమారి కుందవైదేవిని మొట్టమొదటిసారిగా చూసింది అక్కడే కద? ఆమె ముఖారవిందాన్ని, ఆశ్చర్యంతో విప్పారిన నల్లని, పెద్ద కనులను కళ్ళార్పకుండ చూస్తూ నిలబడ్డాడు. తేనెలొలికే ఆమె తీయని స్వరాన్ని ప్రప్రథమంగా విన్నదికూడ అక్కడే. ఆ జ్ఞాపకాలన్నీ అతడి మనసులో ఉవ్వెత్తున ఆలల్లాగ లేచాయి. వాటితో అతడి చెవులు ఇంపయ్యాయి; మనసు తుళ్ళింది; ఒడలు పులకరించింది.

జ్యోతిష్కులు అప్పుడే సాయంసంధ్య పూజకు అన్నీ సిద్ధం చేసుకొంటున్నారు. ఇతన్ని చూస్తూనే, "రా, అబ్బాయ్, రా! వాణర్ కులపు వల్లవరయ్యనే కద?" అన్నారు.

"అవునండీ! మీ జోస్యం కాస్త ముందు వెనగ్గా ఉన్నాకూడ మీ జ్ఞాపక శక్తి అమోఘం!" అన్నాడు వంతిదేవుడు.

"తమ్ముడూ! జ్యోతిష శాస్త్రంలో నిష్ణాతులయ్యేందుకు చాల జ్ఞాపకశక్తి అవసరం. గ్రహాలు, నక్షత్రాలు, దశలు, భుక్తులు, యోగాలు - ఇవన్నీ లక్షల విధాల్లో కూడి రావచ్చు. అన్నిటినీ మనసులో ఉంచుకొని, సంవత్సరం, మాసం, దినం, ఘడియ, విఘడియ – ఇవన్నిటినీ గణనలోకి తీసుకొని కద జోస్యం చెప్పాలి! అదలా ఉండనీ. నా జోస్యం 'ముందు వెనగ్గ ఉన్నాకూడ' అన్నావు కద? దారి అర్థమేమి? నేను నీకు చెప్పిందేమీ ఫలించలేదా?"

"అది కూడ మీ జోస్యం ద్వారానే కనిపెట్టలేరా?"

"ఉంది, ఉంది! జోస్యం మూలకంగా కూడ కనిపెట్టవచ్చు; ఊహించికూడ కనిపెట్టవచ్చు. నేను నీకు చెప్పినవి ఫలించేవుండాలి. లేకపోతే నీవు తిరిగి ఈ గుడిసెకు తిరిగి వస్తావా?"

"అవునవును. మీ జోస్యం ఫలించనే ఫలించింది..."

"అలా చెప్పు! ఏ విధంగా ఫలించింది తమ్ముడూ?"

"మీరు చెప్పింది అక్షరాలా ఫలించింది. 'జరిగితే జరగవచ్చు; లేకపోతే లేదు అన్నారు. అలాగే జరిగింది. 'జరిగింది అని నేను చెప్పినా సమస్యే. నన్ను చూసిన వెంటనే అది పరుగు లంకించుకొంది."

"తమ్ముడూ! నీవు భలే తమాషాగా మాట్లాడుతావు!"

"నిజమైన మాట. నేను తమాషాగా, సరదాగా మాట్లాడేవాడినే. దానికి తోడు చాల కోపిష్టిని కూడ."

"ఈ గుడిసె లోపల అడుగుపెట్టేముందు, నీ కోపాన్ని మూటగట్టి వాకిలి బయటే వదిలి పెట్టి రావాలి."

"అలా చేద్దామనే అనుకొన్నాను. కానీ మీ శిష్యుడు మీ ఇంటి వాకిట కనిపించలేదు. కోపం మూటను ఇంటి దిన్నె మీద వదిలిపెట్టి వస్తే, దాన్ని ఎవరైనా కొట్టేసుకొనిపోతే నేనేం చేయను? అందుకే దాన్ని లోపలికి తీసుకొచ్చేశాను. మీ శిష్యుడెక్కడ, జ్యోతిష్కులుగారూ? పోయినసారి నన్ను లోపలికి రాకుండ వాకిలి దగ్గరే అడ్డగించిన వైనం నాకింకా బాగా గుర్తుంది!"

"ఇవాళ ఆశ్వయుజ అమావాస్య కద? అందుకని కొళ్ళిడం నదీతీరానికి వెళ్ళాడు."

"అమావాస్యకు, కొళ్ళిడం నదీతీరానికి ఏం సంబంధం?"

"కొళ్ళిడం నదీతీరాన ఇవాళ కాలాముఖుల మహాసంఘం జరుగుతోంది. నా శిష్యుడు ఆ సంఘానికి చెందినవాడు."

"జోస్యులుగారూ! నేను శైవమతాన్నే వదిలిపెట్టేద్దామనుకొంటున్నాను."

"వదిలేసి...?"

"మీ స్నేహితులు ఆళ్వార్ కట్టియాన్ ఉన్నారు కద...?"

"తిరుమలై గురించి చెబుతున్నావు కాబోలు."

""అవును; ఆయన దగ్గర దీక్ష తీసుకొని, ఒళ్ళంతా నామాలేసుకొని వీరవైష్ణవుడనైపోదామని అనుకొంటున్నాను."

"ఎందుకని?"

"కాలాముఖ శైవులు కొందరిని చూశాను. ఇక్కడకు వచ్చే దారిన కూడ చూశాను. వారిని, వారు ధరించిన, చేతబట్టిన పుర్రెలను చూడగానే నాకు శైవమతాన్ని వదిలిపెట్టేయాలనిపించింది."

"తమ్ముడూ! ఎన్నో యుద్ధాలను చూసిన నీకు పుర్రెల్ని చూస్తే ఎందుకు భయం?"

"భయమేమీ లేదు. ఏవగింపంతే. యుద్ధరంగంలో పగవారిని చంపేందుకు, పుర్రెలను మాలగా ధరించేందుకు ఏం పొంతన?"

"నీ యజమాని ఆదిత్య కరికాలన్ వీరపాండ్యుని తల తెగగొట్టి తీసుకొని వచ్చి ఊరేగించలేదా?"

"ఆయన ఏదో శపథం పూనినందువల్ల అలా చేశారు. తర్వాత ఎంతో విచారించారు. ఆయన కూడ పుర్రెల్ని మాలగా వేసుకోలేదు, చేతబట్టుకొని ఊరూరా తిరగలేదు కద? కాలాముఖులు ఎందుకలా చేస్తున్నారు?"

"జీవితం అనిత్యం అన్న సత్యాన్ని మరిచిపోకూడదనే వారలా చేస్తున్నారు. నీవూ, నేనూ విభూతి రాసుకొంటున్నాం కద, అది మాత్రమేమి? ఈ శరీరం శాశ్వతం కాదు, ఒక రోజు బూడిద కాబోతోంది అన్న నిజాన్ని మరిచిపోకూడదనే కద విభూతి రాసుకొంటున్నాం?"

"మనుష్యదేహం అనిత్యం అన్నది నిజమే. ఇది కాలి బూడిదవుతుంది. శివపరమాత్మ దివ్యశరీరం అలా కాదు కద! పరమ శివుడు ఎందుకు చేత పుర్రె పట్టుకొని ఉన్నాడు?"

"తమ్ముడూ! శివపరమాత్మ చేతిలోని పుర్రె అహంకారాన్ని సూచిస్తుంది. అహంకారాన్ని జయిస్తే ఆనందమయ స్థితిని చేరుకోవచ్చని దాని అర్థం. శివపరమాత్మ పుర్రె చేతబట్టుకొని ఆనంద నాట్యం చేయడం లేదా?"

"పుర్రె ఎలా అహంకారాన్ని సూచిస్తుంది? నాకర్థం కావడం లేదు..."

""నీకు తెలియనివి ఇంకా ఎన్నో ఉన్నాయి, తమ్ముడూ! పుర్రె అహంకారాన్ని ఎలా సూచిస్తుందన్నది మాత్రం ఇప్పుడు చెబుతాను, తెలుసుకో. బ్రహ్మ, విష్ణువు ఒకసారి గర్వించి, 'నేనే గొప్ప, నేనే గొప్ప  అని దెబ్బలాటకు దిగారు. శివపరమాత్మ వారి మధ్య అడ్డొచ్చి, 'నా శిరస్సును ఒకరు, నా పాదాలను ఇంకొకరు కనిపెట్టి చూసి రండి. ఎవరు ముందు చూసి వస్తారో వారే మీ ఇద్దరిలో గొప్పవారు అన్నాడు. మహావిష్ణువు వరాహరూపం దాల్చి, శివుని పాదాలను వెతుక్కొంటూ భూమిని తొలుచుకొంటూ వెళ్ళాడు. బ్రహ్మ పక్షిరూపం దాల్చి ఆకాశాన ఎగిరి వెళ్ళాడు. పెరుమాళ్ళు (విష్ణువు) తిరిగి వచ్చి, శివుని పాదాలను కనిపెట్టలేకపోయానని నిజం ఒప్పుకొన్నాడు. బ్రహ్మ తిరిగి వచ్చి శివుని జఠను చూశానని అబద్ధం చెప్పాడు! అప్పుడు శివపరమాత్మ బ్రహ్మకున్న అయిదు తలల్లో ఒకదాన్ని తెగవేసి శిక్షించాడు. గర్వం వల్లనే బ్రహ్మ అలా దెబ్బలాటకు దిగడమేగాక అబద్ధం కూడ చెప్పినందువల్ల ఆ శివపరమాత్మ చేతనున్న పుర్రె అహంకారాన్ని, గర్వాన్ని కూడ సూచిస్తుంది!"

వంతిదేవుడు దేన్నో గుర్తొచ్చినవాడిలాగ పడి పడీ నవ్వాడు.

"ఏం చూసి అలా నవ్వుతున్నావు తమ్ముడూ?"

"దేన్ని చూసీ నవ్వలేదు. ఒక విషయం గుర్తొచ్చింది. అందువల్ల నవ్వాను."

"అదేం విషయం? రహస్యం కాదు కద?"

"రహస్యమేమి? బ్రహ్మను శిక్షించినట్లు నన్ను కూడ శిక్షించేటట్లయితే, కనీసం పదహారు వేల తలలుండాలి నాకు! అది తలుచుకొనే నవ్వాను."

"అన్ని అబద్ధాలు చెప్పావు కాబోలు!"

"అవును, జ్యోతిష్కులుగారూ! అది నా జాతకవిశేషం లాగుంది. పొన్నియిన్ సెల్వన్ని కలిసిన తర్వాత, ఇక మీదట నిజాన్నే చెప్పాలని తీర్మానించుకొన్నాను. ఆ తర్వాత ఒక ముఖ్యమైన సందర్భంలో నిజం చెప్పాను. అది విన్నవారు నవ్వారు; ఎవరూ నమ్మలేదు!"

"అవును, తమ్ముడూ! కాలమలా చెడిపోయిందిప్పుడు. ఈ రోజుల్లో ప్రజలు అబద్ధాన్నే నమ్మడంలేదు. నిజాన్నెలా నమ్ముతారు?"

"మీ జోస్యం గతికూడ అంతేలాగుంది! పంతులుగారూ! యువరాజు అరుళ్మొళి వర్మ గురించి

మీరు చెప్పింది గుర్తుందా? అకాశంలో ఉత్తరాన ఎప్పుడూ ఒకే చోట స్థిరంగా ఉండి ప్రకాశించే ధ్రువ నక్షత్రంలాంటివారు పొన్నియిన్ సెల్వన్ అని మీరు చెప్పలేదా?"

"చెప్పాను; అందువల్ల ఏమిప్పుడు?"

"ఆయన గురించిన వార్త మీరు వినలేదా?"

"వినకుండ ఎలా ఉండ సాధ్యం? దేశమంతా అదే మాటగా ఉంది కద?"

"ధ్రువ నక్షత్రం సముద్రంలో మునిగిపోయిందని మీరెప్పుడైనా విన్నారా?"

"ధ్రువ నక్షత్రం కడలిలో మునిగిపోదు. కానీ ఆ నిలకడైన చుక్కను ఒక్కోసారి మబ్బులు కూడ కమ్ముకోవచ్చు కద? ఇవాళ కూడ ఉత్తరాన మబ్బులు కమ్మాయి. ఈ రాత్రి నీవెంత ప్రయత్నించినా ధ్రువ నక్షత్రాన్ని చూడలేవు. అందువల్ల ఆ నక్షత్రం లేకుండ పోతుందా?"

"అలాగా చెబుతున్నారు? పొన్నియిన్ సెల్వన్ గురించిన నిజమైన వార్త మీకేమైనా తెలుసా?"

"నాకెలా తెలుస్తుంది? నీవే చివరిగా ఆయనతోబాటు సముద్రంలో దూకావని వినికిడి. తెలిసుంటే నీకే కద తెలిసుండాలి? నిజం విందామని నేనే ఆసక్తితో ఎదురు చూస్తున్నాను."

వంతిదేవుడు మాట మారుద్దామని, "జ్యోతిష్కులుగారూ! తోకచుక్క ఇప్పుడెలా ఉంది?" అని అడిగాడు.

"చాల పొడవుగా, అర్ధరాత్రి తర్వాత కనిపిస్తోంది. ఇకపైన కురుచ కావలసిందే. ధూమకేతువు వల్ల ఏదైనా ఆపద కలిగేటట్లయితే అది అతి శీఘ్రంగా కలగాలి. భగవాన్! రాజ వంశంలో ఎవరికి ఏం జరగబోతోందో ఏమో!" అన్నారు జ్యోతిష్కులు.

వంతిదేవుని మనసు అతివేగంగా అన్ని వైపులా ఆలోచించింది. తంజావూరులో పక్షవాతంతో మంచం పట్టివున్న చక్రవర్తి, నాగపట్టణంలో చలిజ్వరంతో కొట్టుమిట్టాడుతున్న పొన్నియిన్ సెల్వన్, కడంబూర్ మాళిగలో నందినిని కలవబోతున్న ఆదిత్య కరికాలన్, రాజ్యానికాశపడి ప్రజల కోపానికి పాత్రుడైన మధురాంతకుడు, చేత మృత్యు ఖడ్గాన్ని పట్టుకొని మురిసిపోయే నందిని - వీరందరూ అతడి మనోనేత్రం ముందు వరుసగా మెదిలారు.

"అదంతా పోనీ, జ్యోతిష్కులుగారూ! రాజవంశస్థుల సంగతి మనకెందుకు? నేనిప్పుడు ఏ కార్యం మీద వెళుతున్నానో అది ఎలా జరుగుతుంది? అది చెప్పండి!"

"ఇంతకు మునుపు నీకు చెప్పిందే మళ్ళీ ఇప్పుడూ చెప్పవలసివస్తుంది, అబ్బాయీ! నీకెన్నో ఆపదలు ఎదురవుతాయి; వాటన్నిటినీ గెలిచి ముందుకు వెళ్ళడానికి నీకు కావలసిన సహాయాలు కూడ నీకందుతాయి!" అన్నారు జ్యోతిష్కులు.

ఇప్పుడు వాకిట వస్తున్నది విపత్తా, సహాయమా అని ఎంచాడు వంతిదేవుడు. ఎందుకంటే అప్పుడు వాకిట మగవారి గొంతులు, ఆడవారి గొంతులు వినిపించాయి. ఇద్దరూ వాకిలివైపు చూశారు.

మరు నిమిషమే వాణతి, ఆమె పరివారం లోపలికొచ్చారు.

వంతిదేవుడు లేచి నిలబడి గౌరవమర్యాదలతో, “దేవీ! మన్నించాలి! మీరిక్కడికి వస్తారని తెలిసివుంటే నేను వచ్చేవాడినే కాను!” అన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 33

## వాణతి అడిగిన సహాయం

"**అయ్యా**! నాపైన ఎందుకంత కోపం? మీకు నేనేం కీడు చేశాను?" అన్న కొడుంబాళూర్ రాకుమారి దీనస్వరం వంతిదేవుని కదిలించేసింది. నిజానికీ అమ్మాయిమీద తానెందుకు కోపంగానాలన్న ప్రశ్న లేచింది వంతిదేవుని మనసులో. ఒక్క క్షణంపాటు పూంగుళలి అతడి మనోనేత్రం ముందు కనిపించి మరుగైంది. ఆమె కోసం ఈమె పైన కోపం తెచ్చుకోవడం ఏం న్యాయం?

"దేవీ! మన్నించాలి! నేనలాంటి ఉద్దేశంతో ఏమీ చెప్పలేదు. మీరు జ్యోతిష్కులను చూసి వెళ్ళేంతవరకు నేను బయటే వేచివుంటాననే అన్నాను. నాకు తొందరేమీ లేదు. ఇప్పుడు కూడ..."

"మీరు బయటకు వెళ్ళవలసిన అవసరమేమీ లేదు. మీకు తొందరేమీ లేదని తెలిసి సంతోషం. నిజానికి నేను జ్యోతిష్కులను చూడరాలేదు. ఈయన జోస్యంలో నాకేమాత్రం నమ్మకం లేకుండ పోయింది..."

"దేవీ! తమ చిత్తం, నా భాగ్యం! ఒకరోజు నా జోస్యం అబద్ధం కాలేదని మీరే గ్రహిస్తారు. గ్రహించి మీరే నన్ను మెచ్చుకొంటారు!" అన్నారు జ్యోతిష్కులు.

"అప్పుడు చూద్దాం!" అని చెప్పేసి వాణతి వంతిదేవుని వైపు తిరిగి, "అయ్యా! నేను మిమ్మల్ని చూసేందుకే ఇక్కడికి వచ్చాను. దారిలో మీరు గుర్రంపైన వెళుతుండగా చూశాను. ఆగి పరామర్శిస్తారని అనుకొన్నాను. ముభావంగా వెళ్ళిపోయారు! అందుగురించి నేనంతగా ఆశ్చర్యపడలేదు. ఈ అనాధపిల్ల మీద ఎవరికి మాత్రం ఎందుకంత అక్కర ఉంటుంది?" అన్నది.

వంతిదేవునికి కంట నీరు వస్తుందేమోననిపించింది.

"దేవీ! ఇదేం మాట! కొడుంబాళూర్ పరాంతక చిన్న వేళార్ ముద్దుల కుమార్తె, దక్షిణ సైన్యాధిపతి బూది విక్రమకేసరి పెంపుడు కూతురు, పళైయారై యువరాకుమారి అంతరంగ స్నేహితురాలు, - ఇటువంటి మిమ్మల్ని అనాధపిల్లంటే ఎవరు ఒప్పుకొంటారు? దారిలో నిలబడి పరామర్శించడం మర్యాదగా ఉండదని వచ్చేశాను. ఇంకేమీ లేదు. నేను మీకు చేయదగిన కార్యమేదైనా ఉంటే..."

"అవునయ్యా! మీవల్ల నాకు కావలసిన కార్యమొకటుంది. మీనుంచి ఒక ముఖ్యమైన సహాయం కోరేందుకే ఈ ఇంట ప్రవేశించాను."

"చెప్పండి. నాచేత సాధ్యమయ్యే పనైతే..."

"మీరు చేయలేని కార్యమేదైనా ఉందా, ఏమి? లంకాప్రయాణంలో మీకెదురైన ఆపదలు, ఆటంకాలన్నీ కొంతవరకు నేనూ తెలుసుకొన్నాను. నేను కోరే సహాయం తప్పక చేస్తారని ముందు మాటిస్తారా?"

వంతిదేవుడు కాస్త జంకుతూ, "దేవీ! సహాయం ఎటువంటిదని చెబితే మంచిది!" అన్నాడు.

"అవును. మిమ్మల్ని ఏమార్చి మీదగ్గర మాట తీసుకోకూడదు., నిజమే. కాబట్టి అదేం పని అని చెప్పేస్తాను. జ్యోతిష్కులు కూడ విని తెలుసుకోవచ్చు. అందువల్ల ఏం ఫరవాలేదు. నేను బౌద్ధమతం స్వీకరించి, భిక్షుణిగా అయిపోవాలని తీర్మానించాను."

"ఏమేమి!?"

"ఇదేం మాట!"

"కూడనే కూడదు!"

"జరగని కార్యం!"

ఇలా వంతిదేవుడు, జ్యోతిష్కులు సంభ్రమాశ్చర్యాలతో అనగా, అవన్నీ నెమ్మదిగా విన్న తర్వాత వాణతి, "అవును. నేను బౌద్ధ సన్యాసినిని కావాలనుకొంటున్నాను. దానికి మీకెందుకంత ఆక్షేపణ? అందులో తప్పేమి? పురాతన తమిళనాడులో ఎందరో స్త్రీలు సన్యాసం స్వీకరించలేదా? మాధవి కుమార్తె మణిమేఖల సన్యాసం స్వీకరించి దైవత్వం పొందలేదా? నాకంత పెద్ద ఆశలేమీ లేవు. నిష్ప్రయోజనమైన జీవితాన్ని అంతం చేయడానికి ప్రయత్నించాను. అందులో ఓటమి పొందాను. దైవేఛ్ఛ నేనింకా కొంతకాలం సజీవంగా ఉండాలని కాబోలు. అలాగైతే ఈ శేషజీవితాన్ని ఒక బౌద్ధ మఠంలో చేరి జీవకారుణ్య సేవ చేస్తూ గడపాలనుకొంటున్నాను. ఇందుకు మీరు నాకు సహాయం చేసేందుకు వెనకడుగు వేయరు కద?"

వంతిదేవుని మనసులో ఒక చిన్నసందేహం పుట్టింది. అది అతన్ని అదిరిపడేటట్లు చేసింది.

"దేవీ! తమ తీర్మానం న్యాయం కాదు. కానీ దాన్ని చెప్పే అధికారం నాకు లేదు. తమ కుటుంబానికి చెందిన పెద్దలు దాని గురించి మీకు ఆలోచన చెప్పాలి. తమ పెద తండ్రి సేనాధిపతి బూది విక్రమ కేసరి త్వరలోనే తిరిగి రాబోతారని తెలిసింది..."

"అయ్యో! నేనెవరికోసమూ వేచివుండబోను. ఎవరి సహాయమూ అడగబోను. ఇదే నా చివరి నిర్ణయం. మీ సహాయాన్ని కోరుతున్నాను..."

"ఈ విషయంలో నేనే సహాయం చేయగలను, దేవీ?"

"చెబుతాను. నాగపట్టణపు చూడామణి విహారానికి వెళ్ళేందుకు నేను బయలుదేరాను. అక్కడికి వెళ్ళి బౌద్ధ ధర్మ దీక్ష తీసుకొందామని అనుకొన్నాను. తోడుగా మీరు నాతో నాగపట్టణం వరకు రావాలి. అదే నేను కోరుకొనే సహాయం!"

వంతిదేవుడు అదిరిపడ్డాడు. కొడుంబాళూర్ రాకుమారి చాల తెలివైనది, గడుగ్గాయి. తాను, యువరాకుమారి కుందపై మాట్లాడుకొన్న విషయాలు ఈమె చెవిన పడేవుండాలి. తననుంచి పూర్తి వివరాలను లాగేందుకు ప్రయత్నిస్తోంది. నాగపట్టణపు చూడామణి విహారానికి బయలుదేరిందంటే అక్కడ యువరాజును కలిసేందుకే! తానందుకు ఏమాత్రం తావివ్వకూడదు.

“అమ్మణీ! క్షమించాలి. ఇది నాశక్తికి మీరిన కార్యం.”

“ఇదేం వింత? లంకకు వెళ్ళి ఎన్నెన్నో అద్భుతాలను సాధించి వచ్చిన మీకు ఇది అసాధ్యమా?”

“దేవీ! అసాధ్యమైన కార్యం కాదు. కానీ నేను ఈ సమయాన చేబట్టలేని కార్యం. ముఖ్యమంత్రి, యువరాకుమారి నన్ను అత్యవసరంగా కంచికి వెళ్ళమని ఆజ్ఞాపించారు. వారిచ్చిన తాళపత్ర సందేశం తీసుకొని వెళుతున్నాను. అతిముఖ్యమైన రాజకార్యం మీద వెళుతున్నాను. అందుకనే ఇప్పుడు వీలుపడదని అంటున్నాను. ఇంకొక సమయమైతే...”

“అవునవును! ఇష్టం లేకపోతే ఎన్ని కారణాలైనా/సాకులైనా చెప్పవచ్చు. అందులో తప్పులేదు. ఒంటరిగా ప్రయాణం చేయాలనే ఉద్దేశంతోనే బయలుదేరాను. దారిలో కొన్ని చోట్ల కాలాముఖుల గుంపులను చూడగానే కాస్త భయమేసింది. సకల జీవాలను కాపాడే బాధ్యత ఉన్న దేవుడున్నాడు. ఆయనపైన భారం వేసి బయలుదేరుతాను. లౌకిక జీవితాన్ని పరిత్యజించి సన్యాసిగా జీవించడానికి నిశ్చయించుకొన్న ఒక పేదరాలిని ఎవరేం చేసేస్తారు? వెళ్ళి వస్తాను, జ్యోతిష్కులుగారూ!” అని చెప్పి వాణతి బయలుదేరింది.

జ్యోతిష్కులు, “దేవీ! చీకటి పడబోతూంది! అమావాస్య రాత్రి. దానికి తోడు ఈశాన్యాన మబ్బులు కమ్ముకొంటున్నాయి. ఈ పేదవాని గుడిసెలో విడిది చేసి పొద్దున వెళ్ళవచ్చు కదా?” అన్నారు.

“లేదు, జ్యోతిష్కులుగారూ! మన్నించాలి. రాత్రి తిరువారూరుకు వెళ్ళి అక్కడ విడిది చేయాలని నా ఉద్దేశం. ఈయనేమో తోడుగా వచ్చేందుకు వల్లకాదనేశారు. తిరువారూరులో ఎవరైనా నన్నాదుకోరా? నా ప్రాణం గురించి నాకేమీ దిగుల్లేదు.”

వంతిదేవుని చెవిన, జ్యోతిష్కుల చెవిన చివరిగా పడ్డ మాటలివే. వాకిట నిలబడ్డ పల్లకిలోక్కింది వాణతి. పల్లకి బయలుదేరింది.

~

పల్లకి కనుమరుగయ్యేంతవరకు ఇద్దరూ దాన్నే చూస్తూ నిలబడ్డారు.

తర్వాత వంతిదేవుడు, “ఇటీవలి వరకు కొడుంబాళూర్ రాకుమారి చాల భయస్తురాలిగా ఉండేది. యువరాకుమారి చెలికత్తెలు ఆ విషయమై ఆమెను పరిహసించేవారు. తోలుబొమ్మ మొసలిని నదిలో పెట్టి ఆమెను భయపెట్టజూశారు; నేను కూడ ఆ విషయంలో మోసపోయాను. ఇప్పుడీ అమ్మాయికి ఉన్నట్లుండి ఇంత ధైర్యం ఎలా వచ్చింది? ఈమె ఒంటరిగా ప్రయాణించేందుకు బయలుదేరడం ఎంతటి వింత? యువరాకుమారి ఇందుకు ఎలా సమ్మతించారు?” అన్నాడు.

“ఇలా ఉన్నట్లుండి ఆమె మనసు మారడానికి కారణమేమై ఉంటుందంటారు?” అని జ్యోతిష్కులను అడిగాడు.

“ఏదో ఒక ముఖ్యమైన వార్త ఈమె మనసులో ఒక పెద్ద అలజడిని కలిగించివుండాలి.”

“అలా ఏమంత ముఖ్యమైన వార్త ఉండగలదు?”

“ఏల? పొన్నియిన్ సెల్వన్ని సముద్రం తీసుకొని వెళ్ళిపోయిన వార్తే చాలదా? ఈమెకు, యువరాజుకు పెళ్ళి జరగవచ్చన్న మాట ఉండేది కదా?”

ఇలా జ్యోతిష్కులు అన్నప్పుడు, వంతిదేవుడు, 'పొన్నియిన్ సెల్వన్ని సముద్రం పొట్టనబెట్టుకొన్నదన్న వార్తా, లేక ఆయన నాగపట్టణం చూడామణి విహారంలో క్షేమంగా ఉన్నారన్న వార్తా, లేక పూంగుళలి గురించి తాను చెప్పిన సంగతా, - ఏది ఈమెకు ఇంతటి పెద్ద అదిరిపాటును కలిగించిన వార్త?' అని చింతించాడు.

“అవును, జ్యోతిష్కులుగారూ! కొడుంబాళూర్ వంశస్థులు పరంపరగా శైవులు కదా? ఈమెకు ఉన్నట్లుండి బౌద్ధమతం మీద ఎందుకు బుద్ధి మళ్ళింది?”

“పూర్వజన్మ వాసన కావచ్చు  అన్నారు జ్యోతిష్కులు.

“నాగపట్టణపు చూడామణి విహారానికి బయలుదేరడమేల?”

“అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది!”

“మీ జ్యోతిష్య శాస్త్రం ప్రకారం గణించి చెప్పగలరా?”

“తమ్ముడూ! జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఇది ఎలా కనిపెట్టగలం? అది గూఢచర్య శాస్త్రానికి చెందినది.”

“అలాంటి శాస్త్రం కూడ ఉందా?”

“ఎందుకు లేదు? పొయ్యామొళి [=అబద్ధపు మాటల] కవి గారి తిరుక్కురళ్ గురించి నీవు వినలేదా?”

“అలా ఒక గ్రంధం ఉందని విన్నాను.”

“ఆ గ్రంధంలో 'గూఢచారులు  అని ఒక అధ్యాయం ఉంది. అందులో పది పద్యాలున్నాయి.”

“అలాగా? అందులోంచి ఒకట్రెండు మంచి పద్యాలు చెప్పండి!”

“అన్నీ మంచి పద్యాలే. ఇది విను:

<< పద్యం >>

పద్య తాత్పర్యం: రాజు తన కింద ఉడిగం చేసేవారిని, తన స్వంత బంధువులను కూడ నమ్మకూడదట. అలాగే తన పగవారిని కూడ గూఢచారులను నియమించి వారి గురించిన వివరాలను ఆరా తీయాలని అంటున్నారు. ఇంకొక పద్యం విను:

<< పద్యం >>

పద్య తాత్పర్యం: సన్యాసిలాగ వేషం వేసుకొని, చనిపోయిన వాడిలాగ నటించి, పగవారు ఎంత హింసించినా రహస్యాలను బయట పెట్టకుండ, అలిసిపోకుండ పనిచేసేవాడే గూఢచారి అని వళ్ళువర్ చెబుతున్నారు. రాజు ఒక గూఢచారి పనితనాన్ని ఇంకొక గూఢచారిని నియమించి రహస్యంగా

తెలుసుకోవాలని అంటున్నారు. వళ్ళువర్ ఇంకొక పద్యంలో:

<< పద్యం >>

ఈ పద్యాలన్నీ నీవు వినలేదనా అంటున్నావు?”

వంతిదేవునికి భలే ఆశ్చర్యమేసింది. ఇక అవకాశం దొరికిన వెంటనే తిరుక్కురళ్ చదివే తీరాలని తీర్మానించుకొన్నాడు. వెయ్యేళ్లకు మునుపు ఇలా రాజకీయ విషయాల గురించి రాశారంటే వారు ఎంతటి తెలివైనవారు, వివేకవంతులై ఉండాలి?

ఇంతసేపు జ్యోతిష్కులతో మాట్లాడిన తర్వాత వంతిదేవుడు బయలుదేరాడు. “ఇవాళ రాత్రి ఇక్కడే విడిది చేసి పొద్దునే వెళ్ళవచ్చు కద?” అని ఆయన చెప్పినా కూడ, “ఇంకొకసారి మీ అతిథిగా వస్తాను!” అని చెప్పేసి బయల్దేరాడు.

“ఇంకొకసారి ఇక్కడికి వచ్చినప్పుడు నా జోస్యం ఫలించిందని నీవే చెబుతావు!” అన్నారు జ్యోతిష్కులు.

“అయ్యా! మీరు నాకు ఏమీ జోస్యం చెప్పనే లేదే! చెప్పివుంటేనే కద అది ఫలించిందో లేదో చెప్పగలను?” అని చెప్పి నవ్వేసి వంతిదేవుడు తన గుర్రమెక్కి బయల్దేరాడు.

~

జ్యోతిష్కుల ఇంటినుంచి కాస్త దూరం వరకు ఒకటే బాట ఉంది. కాబట్టి పల్లకి వెళ్ళిన దారినే అతడు కూడ వెళ్ళవలసివచ్చింది. తర్వాత ఆ బాట రెండుగా చీలింది. ఒకటి ఉత్తర దిశగా కొళ్ళిడం నదీతీరం వైపు సాగింది. ఇంకొకటి ఆగ్నేయదిశగా తిరువారూర్ వైపు సాగింది. తిరువారూర్ బాటలో చాలదూరాన ఒక పల్లకి వెళుతుండడాన్ని గమనించాడు. వంతిదేవుని మనసు ఒక క్షణం తల్లడిల్లింది. కొడుంబాళూర్ రాకుమారి అడిగిన సహాయం చేయ నిరాకరించవలసి వచ్చింది కద! నిజంగానే ఆమెకు సహాయం కావలసివస్తే ... దారిన ఏదైనా అపాయం ఎదురైతే ... తర్వాత ఆ వార్త తెలిసినప్పుడు తనను తాను క్షమించగలడా? దారితోడు రానని నిరాకరించిన విషయం గురంచి చాల కాలంపాటు పశ్చాత్తాపపడవలసి వస్తుంది కద? కానీ ఏం చేయగలడు? ముఖ్యమంత్రి, యువరాకుమారి వేసిన ఆజ్ఞ తిరుగులేనిది. వేరే కార్యాలలో తానిప్పుడు తల దూర్చకూడదు, దూర్చలేడు. ఇంతకు మునుపు తనకు సంబంధంలేని విషయాల్లో తలదూర్చి తెచ్చుకొన్న ఇబ్బందులు, ఆపదలు చాలు. అదీగాక, ఆళ్వార్ కట్టియాన్ కూడ హెచ్చరించాడు. అయినా కూడ, వాణతిని నాగపట్టణం చూడామణి విహారానికి తీసుకొని వెళ్ళడం కలలో కూడ జరగని పని.

ఇలా నిశ్చయించుకొని వంతిదేవుడు గుర్రాన్ని కొళ్ళిడం నదీతీరం వైపు తిప్పాడు. అదే సమయాన 'కెవ్వు మన్న ఒక ఆర్తనాదం - అతిమెల్లని ఒక ఆడ గొంతు - వినిపించినట్లనిపించింది. అదిరిపడి తిరిగి చూశాడు. పల్లకి కనిపించలేదు. అక్కడి దారి మలుపులోకి తిరిగివుండవచ్చు. అయినాకూడ, వెళ్ళి

చూడవలసిందే అని ఒక్కక్షణంలో నిర్ణయం తీసుకొన్నాడు. అందువల్ల తన కార్యం అంతగా ఆలస్యం కాబోదు.

గుర్రం ముందుకు దూకింది. అతిత్వరలో ఆ దారి మలుపును చేరుకొన్నాడు. అక్కడ అతడు చూసిన దృశ్యం అతడి గుండెను ఆపేస్తుందేమోననిపించింది. ఒక స్త్రీ ఒక చెట్టుకు కట్టబడివుంది. ఆమె నోట ఒక బట్ట కుక్కబడివుంది. చీకటి పడుతుండడం వల్ల అది ఎవరని మొదట సరిగ్గా తెలియలేదు. దగ్గరకు వెళ్ళి చూడగా, వాణతి పల్లకి వెంట వెళ్ళిన సేవకురాలని తెలిసింది. ఆమె మూలుగుతూనే తన కట్లను విప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది. వంతిదేవుడు గుర్రంపైనుంచి ఒక్కదూకున కిందకు దూకి, మొదట ఆమె నోట కుక్కివున్న బట్టను తీసిపడేశాడు. తర్వాత కట్లను కూడ విప్పాడు. ఆ కట్లు గట్టిగా కట్టబడిలేవన్న విషయం అతడు గమనించకపోలేదు.

"అమ్మాయీ! ఏం జరిగింది? తొందరగా చెప్పు! పల్లకి ఎక్కడ? నీ యజమానురాలెక్కడ?" అని ఆదుర్దాతో అడిగాడు.

~

ఆ సేవకురాలు తడబడుతూ సమాధానం చెప్పింది. పల్లకి మలుపు తిరిగినప్పుడు ఉన్నట్లుండి ఏడెనిమిది మంది వారిపైకి పక్కనున్న చెట్లమీదినుంచి దూకారు. వారిలో కొందరి చేతుల్లో పుర్రెలు, శూలాలు కనిపించాయి. ఇద్దరు సేవకురాలి తలమీద ఒక దెబ్బవేసి కిందకు తోశారు. తర్వాత లాక్కొని వెళ్ళి చెట్టుకు కట్టారు. ఇంతలో తక్కిన ఆగంతకులు పల్లకి బోయీలకు భయంకరమైన స్వరంలో ఏదో చెప్పగానే వారు పల్లకిని అడ్డదారిన తీసుకొని పరుగెత్తారు. తక్కినవారు కూడ వారి వెంబడి వెళ్ళారు. 'కెవ్వు మని అరిచింది సేవకురాలే. వాణతి గొంతే వినిపించలేదు, - ఇలా చెప్పి ఆ సేవకురాలు పల్లకి వెళ్ళిన అడ్డదారిని వేలెత్తి చూపించింది.

"అమ్మాయీ! నీవా కుడంద్దై జ్యోతిష్కుల ఇంటికి వెళ్ళి అక్కడే ఉండు! నేను నీ యజమానురాలిని వెతికే ప్రయత్నం చేస్తాను!" అని చెబుతూనే వంతిదేవుడు గుర్రం పైకి లంఘించాడు. గుర్రం రాజబాట నుంచి అడ్డదారిలోకి మళ్ళింది. మిట్టపల్లాలు, అడవి చెట్లు, పుట్టలవీ చూడక అతివేగంగా ముందుకు దూసుకు వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 34

## దివిటీ ఆరిపోయింది

**అమావాస్య** రాత్రి మొదటి జాముకల్లా బాగా చీకటి కమ్ముకొంది. ఉత్తరాన మొదలైన నల్లని మబ్బులు ఇప్పుడు పైకొచ్చి ఆకాశాన్నంతటినీ అలుముకొన్నాయి. ఆకాశంలో ఒక్క చుక్క కూడ మిటకరించడం లేదు. చెట్లు, పుట్టలపైన ఎగురుతున్న మిణుగురు పురుగులు కాస్త వెలుతురునిచ్చాయి. దాని సహాయం తీసుకొని వంతిదేవుడు గుర్రాన్ని ముందుకు నడుపుకొంటూ వెళ్ళాడు. ఎక్కడికి వెళుతున్నాం, అందువల్ల ప్రయోజనమేదైనా ఉంటుందా అన్నది తెలియలేదు. కుందవైదేవి ప్రియస్నేహితురాలికి ఆపదొచ్చింది. ఆమెను కాపాడ ప్రయత్నించడం తన కర్తవ్యం. తర్వాత దేవుడున్నాడు!

ఒక ఘడియ పాటు గుర్రాన్ని పరుగెత్తించినా, పల్లకి జాడ కానరాలేదు. ఒట్టి వెర్రిబాగుల పనిలోకి దిగామా అనిపించింది వంతిదేవునికి. గుర్రాన్ని ఆపాడు. అదే సమయాన దూరాన ఏదో శబ్దం వినిపించింది. పరీక్షగా చూశాడు. గుర్రపు కాలి చప్పుడులాగ తోచింది. అవును, గుర్రమే! ఒక గుర్రమా, లేక చాల గుర్రాలా అని తెలియలేదు. పల్లకిని కాపలా కాస్తూ వెళ్ళే అశ్వవీరులు కావచ్చు. ఇక జాగ్రత్తగా వెళ్ళాలి. ఉన్నట్లుండి ఒక పెద్ద కూటమి మధ్య చిక్కుబడిపోకూడదు. అందువల్ల వాణతిదేవికి కూడ ఉపయోగం లేదు. తన కార్యం కూడ చెడిపోతుంది.

మెల్ల మెల్లగా గుర్రాన్ని నడుపుకొంటూ వెళ్ళాడు. ముందు వెళుతున్నది ఒకే ఒక్క గుర్రమేనని దృఢపరుచుకొన్నాడు. కాసేపటికల్లా ఆ గుర్రం ఒక ఎత్తైన ఒడ్డుపైకెక్కుతున్నట్లు తోచింది. తాను వెన్నంటి వస్తున్న విషయం ముందున్న వారికి తెలియకుండ రహస్యంగా వెంబడించదలచాడు. చుట్టుపక్కల పరీక్షగా చూశాడు. ఒక పాడుబడ్డ మంటపమొకటి సమీపాన కనిపించింది. దాని దగ్గరకు వెళ్ళి ఒక విరిగిపడివున్న గోడ మరుగున గుర్రాన్ని ఆపాడు. ముందుకు వెళ్ళి మిట్టపైకెక్కిన గుర్రాన్ని కళ్ళను చీల్చుకొని ఆ చీకటిలో పరీక్షగా చూడసాగాడు.

"ఎవరక్కడ?" అన్న గొంతు వినిపించి అదిరిపడ్డాడు వంతిదేవుడు. అది తనకు బాగ పరిచయమున్న వ్యక్తి గొంతేనని గ్రహించాడు.

"మహారాజా! నేనే, మీ దాసుడినే!" అన్న బదులు వినిపించింది.

ఒక్క నిమిషంలో ఆ గొంతులు వినిపించిన చోట ఒక దివిటీ వెలుతురు అగుపించింది. చెట్టు మరుగునుంచి చేత దివిటీతో ఒకడు బయటికి వచ్చాడు. దాని వెలుతురులో గుర్రం కనిపించింది. గుర్రం పైన ఒక వ్యక్తి కూర్చొనివుండడం కూడ కనిపించింది. అది మధురాంతకుడని వంతిదేవుడు చూసి గ్రహించాడు.

నేలపైన నిలబడివున్నవాడు దివిటీని పైకెత్తినప్పుడు యువరాజు ఎక్కివున్న గుర్రం

తిరగబడింది. ముంగాళ్ళు పైకెత్తి ఒక్కసారి గిర్రున తిరిగింది. తర్వాత చటుక్కున ముందుకు దూకి పరుగెత్తసాగింది.

ఆ గుర్రం నిలబడ్డ చోటు ఒక వెడల్పైన కాలువ గట్టు. ఆ ఎత్తైన గట్టునుంచి గుర్రం నీటిలోకి దూకింది.

దివిటీ పట్టుకొన్నవాడు "మహారాజా! మహారాజా!" అని అరుస్తూనే గుర్రం వెంబడి కాలువలోకి దూకాడు. దూకినవాడు తడబడి కిందపడ్డాడు. దివిటీ నీటిలో పడి ఆరిపోయింది.

మరుక్షణం మునుపటికన్న పదిరెట్ల గాఢాంధకారం కమ్ముకొంది.

అదే సమయాన సన్నగా వాన తుంపర మొదలైంది.

గాలి వల్ల చెట్లు చేస్తున్న శబ్దానికి, వాన జల్లు శబ్దానికి, కప్పల బెకబెకల శబ్దానికి మధ్య కొందరు మనుషుల ఆర్తనాదాలు, గుర్రాల డెక్కల చప్పుళ్ళు గందరగోళంగా వినిపించాయి.

యువరాజు మధురాంతకులు ధైర్యానికి అంతగా పేరుగాంచినవారు కారని వంతిదేవునికి తెలుసు. మొరాయించి తిరగబడ్డ గుర్రం పైనున్న మధురాంతకులకు ఏం విపత్తు కలుగుతుందోనని వంతిదేవుని మనసు తల్లడిల్లింది. ఆయన్ను మోసుకొంటూనే గతి తప్పి పరుగెత్తవచ్చు; లేక ఆయన్ను కాలువలో పడేసి ఇంకో దిక్కున పారిపోయివుండవచ్చు; లేక కాస్త దూరం ఆయన్ను మోసుకొని వెళ్ళి తర్వాత ఎక్కడైనా పడేసివుండవచ్చు.

దివిటీతో వచ్చిన మనిషి గుర్రాన్ని వెన్నంటి వెళ్ళి ఆయన్ను కాపాడగలడా? వాడే కాలువ ప్రవాహంలో కాలు జారి పడిపోయాడు కద?

ఇప్పుడు తన కర్తవ్యమేమి? వాణతిని వెతుక్కొంటూ వెళ్ళడమా? మధురాంతకులకు సహాయం చేయ వెళ్ళడమా? అన్న పోరాటం అతని మనసులో ఒక నిమిషంపాటు జరిగింది.

వాణతీదేవి వెళ్ళినదారే తెలియడంలేదు. కానీ మధురాంతకులు తన కళ్ళముందే ఆపదకు గురయ్యారు. ఆయనకు సహాయం చేయడమే సులభం. ఆయనను వెతికి పట్టుకొని అపాయమేమీ లేదని రూఢి పరుచుకొంటే, తర్వాత వాణతిని వెతుక్కొంటూ వెళ్ళడం ఉండనే ఉంది! భగవాన్! తనకు సంబంధంలేని విషయాల్లో తల దూర్చనని కాసేపటి క్రితం తీర్మానించుకొని, మరిప్పుడు తాను చేస్తున్నదేమి?

~

మంటపం గోడ మరుగున నిలబెట్టిన గుర్రాన్ని బయటకు తీసుకొని వచ్చాడు వంతిదేవుడు. చీకటిలోను, వాన తుంపరలోను అతని అంతర్నేత్రంతోనే దారి చూసుకొంటూ యువరాజు గుర్రం వెళ్ళిన దిశగా వెళ్ళాడు. తానూ కాలువలోకి దిగాడు. చుట్టుపక్కల బాగా పరికించి చూశాడు. ఏమీ కనిపించలేదు. ఎక్కడో దూరాన 'ఆఆఆ', 'ఓఓఓ', 'ఈఈఈ', 'కట కట కట' అన్నట్లు గుర్తు తెలియని శబ్దాలు వినిపించాయి.

కాలువ గట్టు మీదేమో ముళ్ళ పొదలు, చెట్లు దట్టంగా ఉన్నాయి. వాటి మధ్య వెళుతున్న ఒక

ఇరుకైన కాలిబాట వెంబడి గుర్రాన్ని నడుపుకొంటూ వెళ్ళాడు. పైన వాన, కింద కాలు జారే బురద నేల; ఒక వైపు కాలువ, ఇంకొక వైపు వరి పంట/పైరు; చుట్టూ ముళ్ళ పొదలు.

గుర్రం మెల్లమెల్లగా సాగింది. కాలమేమో ఒక నిమిషం ఒక యుగంలాగ గడుస్తోంది.

తుంపర వానగా పెరగసాగింది!

చీకటి ఇంకా దట్టం కాసాగింది.

వంతిదేవుని మనసు దీర్ఘాలోచనలో మునిగింది.

మధురాంతకులు ఒంటరిగా గుర్రంపైన ఎందుకొచ్చారు? ఎక్కడికి వెళ్ళేందుకు బయల్దేరి వచ్చారు? ఆయనకెదురు వచ్చిన మనిషెవరు?

వాణతిని బందీగా తీసుకొని వెళ్ళినందుకు, దీనికీ ఏమైనా సంబంధం ఉందా?

వాణతి గతి ఇప్పుడేమైవుండవచ్చు?

మనం ఎందుకని ఈ ఊబిలో చిక్కుకొని సతమతమవ్వాలి?

మన పని చూసుకొని మనం మన దారిన పోవచ్చు కద? రాజబాటను వెతికి పట్టుకొని కంచికి వెళ్ళవచ్చు కద?

కానీ ఈ వానాకాలపు చీకటిలో అదెలా సాధ్యం?

ఇవన్నీ మనకు సంబంధంలేనివని ఎలా తీర్మానించుకోవడం?

కడంబూర్ మాళిగలో మనకు సంబంధంలేని సంఘటనలను రహస్యంగా గమనించినందువల్ల తర్వాత ఎంత ఉపయోగానికొచ్చింది?

కానీ ఈ రాత్రి, ఈ చీకటిలో ఈ కాలువ వెంబడి గురి లేకుండ వెళుతుండడంవల్ల ఎలాంటి ప్రయోజనమూ కలగబోదు. పూర్తిగా తడిసిపోవడమే మనకు దొరికే ఫలితం! గుర్రం ఎక్కడైనా జారిపడి కాలు విరిచేసుకొంటే, తన ప్రయాణమే ఆగిపోవచ్చు, లేదా కష్టసాధ్యం కావచ్చు!

గుర్రాన్ని కాలువ గట్టుమీది నుంచి పక్కనున్న బయలు ప్రదేశంలోకి తిప్పాడు. దూరాన ఎత్తైన మిట్టమీద గుర్రం కనిపించిన దిశగా తన గుర్రాన్ని నడిపాడు.

ఆ మిట్టను సమీపించిపప్పుడు అది ఒక నల్లని భూతంలాగ అగుపించింది.

ఇంకొక మెరుపు.

మిట్టపైన గుర్రం నిలబడివుండడం ఒక్క క్షణంపాటు కనిపించింది. గుర్రంపైన మనిషి లేదన్న విషయాన్ని వంతిదేవుడు తెలుసుకొన్నాడు.

ఒక పిడుగు!

పిడుగుకు, మెరుపుకు భయపడో ఏమో ఆ గుర్రం మళ్ళీ గతి తప్పి పరుగెత్తనారంభించింది. దాన్ని వెన్నంటి వెళ్ళడంలో ఇక ప్రయోజనం లేదు.

చుట్టుపక్కలెక్కడైనా కిందపడ్డ మధురాంతకులు కానరావచ్చు.

కాబట్టి వంతిదేవుడు చాలసార్లు పిలిచి చూశాడు. రివ్వురివ్వున వాన చేస్తున్న రీంకారాన్ని మించి పిడుగులాంటి "ఎవరక్కడ?" అన్న వంతిదేవుని స్వరం లేచింది. "ఎవరక్కడ?" అన్న ప్రతిధ్వని మాత్రమే బదులుకు వినవచ్చింది.

~

వర్షం ఇంకా ఉధృతమైంది. ఈదురుగాలి హెూరుమని వీస్తూంది. గాలి వేగంవల్ల వర్షపు ధారలు పక్కనుంచి బలంగా కొడుతున్నాయి. గుర్రం ఒంటిని విదిలించుకొంది. వంతిదేవుని శరీరం కూడ గాలి వల్ల, వాన వల్ల చల్లబడి వణకనారంభించింది.

ఇక అక్కడ నిలబడడంవల్ల ప్రయోజనం లేదు. వంతిదేవుడు గుర్రాన్ని వచ్చిన దారినే తిప్పాడు - తన బుద్ధిహీనత గురించి విచారిస్తూనే వెనుదిరిగాడు. ఇకమీదనైనా ఇటువంటి జోలిమాలిన పనుల్లో తలదూర్చకూడదు. మన పనేమో మనం చూసుకొని వెళ్తుండాలి...

గుర్రం అతని మనసునర్థం చేసుకొని పాడుబడ్డ మంటపం దగ్గరకొచ్చి నిలబడి ఒక్కసారి సకిలించింది. అప్పడే వంతిదేవుడు తన చింతనాలోకం నుంచి ఈ లోకంలోకొచ్చి, గుర్రంపైనుంచి కిందకు దిగాడు. అతడు కట్టుకొన్న బట్టలు పూర్తిగా తడిసిపోయివున్నాయి. వాటిని కాస్త ఆరబెట్టుకోవాలి. తర్వాత ఈ రాత్రి ఈ పాడుబడ్డ మంటపంలో విరిగిపోని చోటేదైనా ఉంటే వెతికి అక్కడ తాను, తన గుర్రం తలదాచుకోవాలి. అందుకోసం అటూ ఇటూ పరికించి చూశాడు.

బట్ట బయలు సీమలో కుండపోతగా కురుస్తున్న వర్షంలో కాలు నిప్పులో కాలితే ఎలా ఉంటుంది? వంతిదేవుడలా ఉలిక్కిపడి దూకవలసివచ్చింది. అందుకు కారణమింకేమీ కాదు - దెయ్యమో, పిశాచో కాదు; ఒక చిన్న బిడ్డ గొంతే!

"అమ్మా! అమ్మా!"

దెయ్యాలు, భూతాలు లేవని ఎలా చెప్పగలం? ఆ సమయాన, ఆ మంటపంలో ఒక బిడ్డ గొంతు వినిపించడం ఎలా సాధ్యం?

అది దెయ్యం/భూతం గొంతు కాదని ఎలా చెప్పగలం?

ఛీఛీ! దెయ్యాలు, భూతాలు లేవు. అదంతా భయభ్రాంతులుగొన్న పిరికివారి కల్పన!

"అమ్మా! అమ్మా! ఊ! ఊ!" ... ఇది ఒక బిడ్డ గొంతే! తల్లి నుంచి విడిపోయి భయంతో ఏడుస్తున్న బిడ్డ గొంతే!

పాడుబడ్డ మంటపంలో ఒక చీకటి కమ్ముకొన్న మూలనుంచి ఆ గొంతు వినవస్తోంది.

"అమ్మా! అమ్మా! ఊ! ఊ!"

ఆ గొంతు వినవచ్చిన చోటుకు దగ్గరగా వెళ్ళి వంతిదేవుడు, "ఎవరక్కడ?" అన్నాడు.

"ఎవరక్కడ?" అని ఆ బిడ్డ స్వరం ప్రతిధ్వనించింది.

"నేనే! నీవెవరివి? చీకటిలో ఏం చేస్తున్నావు? బయటకు రా!"

"బయట వాన పడుతోందే!"

"వాన ఆగిపోయింది. రా!"

"నా అమ్మ ఎక్కడ?"

"అమ్మ నీకు పాలు తీసుకొచ్చేందుకు వెళ్ళింది."

"లేదు; నీవు అబద్ధం చెబుతున్నావు!"

"నీవు బయటకు వస్తావా? నేను లోపలికి రానా?"

"లోపలికొస్తే, నా చేత కత్తివుంది. పొడిచేస్తాను!"

"ఓయబ్బ! పెద్ద వీరాధివీరుడిలాగ ఉన్నావే! బయటకు వచ్చే పొడువు!"

"నీవెవరివి? పులివి కాదు కద?"

"నేను పులిని కాను; గుర్రాన్ని!" అన్నాడు వంతిదేవుడు.

"నీవు అబద్ధం చెబుతున్నావు. గుర్రం మాట్లాడుతుందా?"

"పులైతే మాట్లాడుతుందా?"

"బయటకు వస్తే పులి ఉంటుంది, ఒకవేళ మీదకు దూకేస్తుంది అని చెప్పింది అమ్మ"

"నేను పులిని కాను. నీపైకి దూకనూ దూకను. కాబట్టి భయపడకుండ బయటకు రా!"

"భయమా? నాకేం భయం?" అని చెబుతూనే ఒక చిన్నారి బిడ్డ చీకటి కమ్ముకొన్న ఆ మంటపం నుంచి బయటకు వచ్చింది.

~

ఇంతలోపల వాన బాగా తెరపిచ్చింది. మేఘాలు కాస్త తొలగి నక్షత్రాలు కూడ కనబడసాగాయి.

నక్షత్రాల వెలుతురులో వంతిదేవుడు ఆ బిడ్డను చూశాడు.

సుమారు నాలుగేళ్ళుంటాయా బిడ్డకు.

ఉన్న వెలుతురులో చాల లక్షణమైన బిడ్డ అని గ్రహించాడు వంతిదేవుడు.

నడుమున ఒక పట్టు బట్ట; మెడలో రత్నమాల.

పెద్ద కులం బిడ్డలాగుంది. ఈ బిడ్డను ఇక్కడ ఒంటరిగా వదిలి వెళ్ళిన తల్లి ఎవరు? ఇక్కడికెందుకు వచ్చింది? ఎందుకు బిడ్డను ఒంటరిగా వదిలి వెళ్ళింది?

ఇంతలో బిడ్డ కూడ వంతిదేవుని పరికించి చూసి, "నీవు గుర్రానివి కావు. మనిషిలాగే ఉన్నావు!" అన్నది.

"అదిగో గుర్రం ఉంది చూడు!" అన్నాడు వంతిదేవుడు.

బిడ్డ గుర్రాన్ని చూసింది.

"ఓహో! నాకోసమే తెచ్చావా? పల్లకి వస్తుందని కద చెప్పారు?"

చిన్నారి ఉత్తరం, ప్రశ్న వంతిదేవుని మనసులో ఎన్నెన్నో ఆలోచనలను రేపింది. ఈ బిడ్డ ఎవరు? వీడు ఇలా ఒంటరిగా ఎందుకున్నాడు? ఇంత చిన్న పిల్లాడు ఏమాత్రం భయపడకుండ ఉండడం ఆశ్చర్యం కద? వీడికోసం పల్లకిని పంపిస్తారని ఎవరన్నారు? అది ఎందుకు రాలేదు? వీడిని వదిలి పెట్టి వెళ్ళిన వీడి అమ్మ ఎవరు? ఆమె ఎక్కడకు వెళ్ళింది?

"బిడ్డా? నిన్ను మీ అమ్మ ఇక్కడ ఎందుకు వదిలిపెట్టి వెళ్ళిపోయింది?" అని అడిగాడు వంతిదేవుడు.

"అమ్మ నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోలేదు; నేనే ఆమెను వదిలిపెట్టి వచ్చేశాను!" అన్నాడా చిన్నారి.

"ఎందుకు వదిలిపెట్టి వచ్చేశావు?"

"గుర్రమొకటి పరుగెత్తి వచ్చింది. దాన్ని పట్టుకొని దానిపైన కూర్చొని వద్దామని నేనన్నాను. అమ్మ వద్దంది. నేను అమ్మకు తెలియకుండ గుర్రాన్ని పట్టుకోవడానికి పరుగెత్తి వచ్చాను. ఆ గుర్రమేనా ఇది?"

"కాదు; ఇది వేరే గుర్రం. తర్వాత, ఇక్కడికెలా వచ్చావు?"

"గుర్రం కనిపించలేదు. అమ్మ కూడ కనిపించలేదు. వానెక్కువైంది. అందుకే ఈ మంటపంలోకి వచ్చాను."

"చీకటిలో ఒంటరిగా ఉండేందుకు నీకు భయం లేదా?"

"భయమేమి? రోజు ఇలాగే ఉంటున్నా కద?"

"పులిని చూసి కూడ భయపడవా?"

"అమ్మకే భయం. నాకు భయం లేదు. నేను చేపను. పులిని మింగేస్తాను."

"అరె! చేప పులిని మింగుతుందా?"

"నేను మామూలు చిన్న చేపను కాను! పెద్ద తిమింగలాన్ని! పులి, సింహం, ఏనుగు - అన్నిటినీ మింగేస్తాను...!"

వంతిదేవుని మనసులో ఏవేవో చికాకు పరిచే ఆలోచనలు లేచాయి. పులిని మింగగల చేప విచిత్రమైంది కద? ఇలా ఎవరీ పిల్లాడికి నేర్పారు?

"అదిగో, అక్కడ ఏమా శబ్దం?" అని అడిగాడు పిల్లాడు.

~

వంతిదేవుడు తిరిగి చూశాడు. ఒక గుంపు ఇటువైపే వస్తూంది. గుంపులో కొందరు దివిటీలు పట్టుకొని వస్తున్నారు. వారి మధ్య ఒక పల్లకి కూడ కనిపించింది. అందరూ గాభరాతో పరుగెత్తుకొస్తున్నారు.

వారిలో ఒక అమ్మాయి కూడ ఉన్నట్లు కనిపించింది. "అదిగో!" "ఇదిగో!" "అక్కడ!" "ఇక్కడ!" అని కలవరం నిండిన గొంతులు వినిపించాయి.

గుంపులో ఒకడు పాడుబడ్డ మంటపాన్ని వేలెత్తి చూపించాడు. అంతే! అందరూ మంటపంవైపు పరుగెత్తుకొంటూ వచ్చారు.

"అదిగో వస్తూంది. పల్లకి కూడ వస్తూంది. నాకు పల్లకిలోకెక్కేందుకు ఇష్టం లేదు. నన్ను నీ గుర్రంపైన ఎక్కించుకొని వెళతావా?" అని అడిగాడా చిన్నారి.

ఆ బిడ్డ మాటలు, రూపురేఖలు వంతిదేవుని మనసునాకట్టుకొన్నాయి. వాడిని దగ్గరకు తీసుకొని ఎత్తి ముద్దాడాలనిపించింది. కానీ మనసులో ఏదో అడ్డం వచ్చింది.

"నాకు ఇంకొక అత్యవసరమైన పనివుందే!" అన్నాడు వంతిదేవుడు.

"నీవెక్కడికి వెళుతున్నావు?"

"కంచికి!"

"కంచికా? అక్కడ నా ముఖ్యమైన శత్రువున్నాడు!"

వంతిదేవుడు అదిరిపడ్డాడు. అలా ఆ పిల్లాడి దగ్గర నిలబడ్డం కూడ ప్రమాదమే అనుకొన్నాడు. కానీ గుర్రంపైకెక్కి వెళ్ళేందుకు కూడ అవకాశం లేదు! గుంపు అతిచేరువగా వచ్చేసింది. పరుగెత్తితే సందేహానికి తావిచ్చినట్లవుతుంది. అదీగాక, ఏం జరగబోతోందని తెలుసుకోవాలన్న కుతూహలం కూడ వంతిదేవుని మనసులో బలంగా కలిగింది. కాబట్టి కాస్త పక్కకు జరిగి విరిగిన గోడ మరుగున నిలబడ్డాడు.

"ఇదిగో నేనిక్కడున్నాను!" అని పిల్లాడు ముందుకు వెళ్ళి నిలబడ్డాడు.

వచ్చిన వారిలో ముందు వచ్చింది ఒక స్త్రీ. అమెకు పరుగెత్తి వచ్చినందువల్ల ఊపిరి సలపడం లేదు. దాన్ని ఆమె పట్టించుకోక అమాంతం ముందుకు దూకి బిడ్డను అక్కున చేర్చుకొని, "పాండ్యా! ఇలా చేశావేమి?" అన్నది.

ఆమె తర్వాత వచ్చినవాడు రవిదాసు. అతడు పిల్లాడి పక్కకు వచ్చి నిలబడి, "చక్రవర్తీ! ఇలా మమ్మల్ని భయపెట్టేశారు కదా!" అన్నాడు.

చిన్నారి నవ్వాడు. "అలాగే భయపెడతాను. నేను గుర్రం కావాలని అడిగాను. పల్లకి తెచ్చారేం?" అన్నాడు.

మనకు ఇంత క్రితమే పరిచయమైన సోమన్ శాంభవన్, ఇడుంబన్‌కారి, దేవరాళన్ మొదలైనవారు చిన్నారి చుట్టూ గుమిగూడారు.

"చక్రవర్తీ! ఒక్క గుర్రమేల? పదహారు వేల గుర్రాలను తీసుకొని వస్తాము. ఇవాళ మాత్రం ఈ పల్లకిలో ఎక్కి రండి!" అన్నాడు సోమన్ శాంభవన్.

"ఎక్కను. నేను గుర్రంపైనే ఎక్కి వస్తాను" అని చెప్పి పిల్లాడు గోడ మరుగున ఉన్న గుర్రాన్ని

చూపించాడు.

అప్పుడే గుర్రాన్ని, దాని సమీపాన ఉన్న వంతిదేవుని అందరూ చూశారు.

~

రవిదాసు ముఖాన అప్పుడు ఆశ్చర్యమూ, దిగులూ, క్రోధమూ కలగలిసి అగ్నిజ్వాలలై లేచాయి. రెండడుగులు ముందుకు వేసి, "ఒరే పాపి! నీవిక్కడికెలా వచ్చి చేరావు?" అని అడిగాడు.

"ఒరే పిశాచి! కోడిక్కరైనుంచి నీవిక్కడికెలా వచ్చావు?" అని అడిగాడు వంతిదేవుడు.

రవిదాసు 'హహ్హహ్హ' అని నవ్వాడు. "నీవు నన్ను నిజంగానే పిశాచి అనుకొన్నావా?" అని అడిగాడు.

"కొందరు చచ్చిన తర్వాత దెయ్యమవుతారు. నీవు సజీవంగ ఉన్న పిశాచి!" అన్నాడు వంతిదేవుడు.

అంతలో పిల్లాడు, "అతడితో దెబ్బలాడకు! అతడు నాకు చాల నచ్చాడు. చీకటిలో అతడు నాకు తోడుగా ఉన్నాడు. పులి వస్తే చంపేస్తానని చెప్పాడు. అతడు కూడ మనతో రానీ!" అన్నాడు.

రవిదాసు పిల్లాడి దగ్గరకు వచ్చి, "చక్రవర్తీ! వీడిని తప్పక మనతో తీసుకొని వెళ్ళవచ్చు. తమరు ఈ ఒక్కరోజు పల్లకి ఎక్కండి!" అన్నాడు.

పిల్లాడు అలాగే పల్లకి వైపు నడిచాడు.

రవిదాసు మళ్ళీ వంతిదేవుని దగ్గరకొచ్చి, "ఇప్పుడేం చేయబోతున్నావు?" అని అడిగాడు.

"నీవు కద అది చెప్పవలసింది?"

"మాతో వచ్చేయి! ఇప్పటికే మా రహస్యాలు నీకు చాల తెలుసు. ఇప్పుడు ఇంకొన్ని ముఖ్యమైనవి తెలిసిపోయాయి. నిన్ను వదిలిపెట్టి వెళ్ళలేము. వచ్చేసేయి!" అన్నాడు రవిదాసు.

"నేను మీతో రానంటే..."

"అసాధ్యం/కాని పని. నీవు వీరాధివీరుడవని మాకు తెలుసు. కానీ మేము ఇరవై మందిమి ఉన్నాము. ప్రాణాలతో తప్పించుకోలేవు."

"ప్రాణాలతో తప్పించుకోలేననే కద చెబుతున్నావు?"

"నీవింకా చిన్నవాడివి. జీవితంలో ఏ సుఖాలూ అనుభవించనివాడివి. ఎందుకు వృధాగా ప్రాణాలు పోగుట్టుకొంటావు?"

"వృధాగా ప్రాణాలు ఎవరు పోగొట్టుకొంటారు? మీతో రమ్మంటున్నావు కద? ఎక్కడికి?"

"అలా అడుగు, చెబుతాను. పళువూర్ యువరాణి దగ్గరకే!"

"ఓహో! నేనూ అలాగే అనుకొన్నాను. ఇప్పుడామె ఎక్కడుంది?"

"ఇప్పటికి బహుశ తిరుప్పురంపయన్‌కి వచ్చివుంటారు. నీవొస్తావా, రావా?"

"నేనూ అటువైపే వెళ్ళాలి. దారి చూప ఎవరూ లేరే అనుకొన్నాను. మంచి సమయానికి నీవొచ్చేశావు! వెళదాం రా!" అన్నాడు వంతిదేవుడు.

ఇంతలో పిల్లాడు పల్లకిలో ఎక్కాడు. పల్లకి ముందుకు నడిచింది. దాని చుట్టూ దివిటీలు పట్టుకొని, పలువిధాలైన ఘోషలు చేస్తూ రవిదాసు బృందం వెళ్ళింది/వెళ్ళారు.

వంతిదేవుడు కూడ వారి వెంబడి వెళ్ళాడు. అతని మనసులో అనేకమైన ఆలోచనలు అలల్లాగ లేచాయి. వాణతి గతి ఏమి? తన గతి ఈ రాత్రి ఏం కాబోతోంది? అది కూడ తెలియదు.

~

కడంబూర్ మాళిగలో ఆ రాత్రి రహస్యంగా చూసి తెలుసుకొన్న కుట్ర పన్నాగాలకన్న పది రెట్లు భయంకరమైన కుట్రలను ఈ రాత్రి ప్రత్యక్షంగా చూసి తెలుసుకోబోతున్నామనడంలో సందేహం లేదు. కానీ దాని తర్వాత ఏం జరగబోతోంది? తనను ప్రాణాలతో తప్పించుకొని పారిపోవడానికి వీళ్ళు వదిలిపెడతారా? వీరి పక్షం చేరమని బలవంతం చేస్తారు. వీల్లేదంటే తనను బలిచ్చేందుకే చూస్తారు. ఒకవేళ మళ్ళీ నందిని దయవల్ల...

పళువూర్ రాణి పేరును రవిదాసు ఎత్తిన వెంటనే తాను మెత్తబడి వారి వెంట వెళ్ళేందుకు ఒప్పుకొన్న విషయం గురించి ఒకసారి ఆలోచించి చూశాడు వంతిదేవుడు. తలుచుకొంటే అది తనకే ఆశ్చర్యాన్ని కలిగించింది. 'మాయ' అని, 'మోహం' అని పెద్దలు చెప్పేది దీన్నే కాబోలు. ఆమె ఎంతటి భయంకరమైన కుట్రల్లో దిగివుందన్న విషయం తనకు తెలిసిందే. అయినా కూడ ఆమెను మళ్ళీ కలిసే అవకాశం దొరికితే దాన్ని ఉపయోగించుకోవడానికి తన మనసు ఉత్సాహపడుతూంది. అణచుకోలేని, తనను మించి ఉప్పొంగిన ఆ ఉత్సాహం, తాను ఆలోచించి ఉత్తరం చెప్పేలోపు, తన నోరు 'వస్తున్నాను' అని చెప్పేసింది. కానీ, ఇంకేం దారి? రవిదాసు చెప్పినట్లు ఇరవై మందితో తాను ఒంటరిగా యుద్ధం చేయడం సాధ్యం కాని పని. కాస్త అవకాశం దొరికితే తప్పించుకొని పారిపోవడానికి దారి దొరకొచ్చు. దానికి తోడు ఈ కుట్రదారుల కూటమి గురించి మరిన్ని వివరాలు తెలిసిరావచ్చు.

"కంచికి వెళుతున్నావా? అక్కడే నా ముఖ్య శత్రువున్నాడు!" అని ఆ చిన్నారి అన్నది వంతిదేవునికి తరచూ గుర్తుకు రాసాగింది. ఆ పిల్లాడు ఎవరు? వాడిని వీరందరూ 'చక్రవర్తి' అని పిలవనేల? "ముఖ్య శత్రువు" అని ఆ పిల్లాడు ఎవరిని ఉద్దేశించి అన్నాడు? ఈ ప్రశ్నలన్నింటికీ అతని మనసులో ఉత్తరాలు కూడ మెల్లమెల్లగా గోచరించసాగాయి. ఇంకా ఇంకా ఆలోచిస్తూ పోతుంటే పరిస్థితి ఇంకా భయంకరమైనదిగా తోస్తూంది. భగవాన్! వీటన్నిటికీ ముగింపు ఎప్పుడు? "అతి త్వరలోనే" అని అతని మనసులో ఒక గొంతు చెప్పింది.

ఆ విచిత్రమైన ఊరేగింపు పంట పొలాలు, కాలువలు, బయలుసీమలు, అడవులు, - వీటన్నిటినీ దాటుకొంటూ ఒక్క క్షణం కూడ ఆగకుండ ముందుకు వెళ్లసాగింది. చివరికి వరద వెల్లువతో ఉప్పొంగి

పారుతున్న మణ్ణి నది కూడ దాటి అవతల తిరుప్పురంపయం ఎల్లలను సమీపించింది. పళ్ళిప్పడై చుట్టూ ఏపుగా పెరిగిన అడవిలోపల కూడ దూరి వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 35

## "సమయం ఆసన్నమైంది"

**వందేళ్ళ** క్రితం కట్టబడి, ఇప్పుడు పాడుబడివున్న పళ్ళిప్పడై కోవెలను మనం ఇంతకు మునుపొకసారి చూసివున్నాం. ఆళ్వార్ కట్టియాన్ ఇక్కడ దాక్కొనే రవిదాసు మొదలైనవారి కుట్ర గురించి ఒకింత తెలుసుకొన్నాడు. అదే తావుకు ఇప్పుడు వంతిదేవుడు, రవిదాసు, తక్కినవారు వచ్చి చేరారు.

పాడుబడ్డ పళ్ళిప్పడైలో ఒక భాగాన వంతిదేవుని, అతని గుర్రాన్ని తీసుకొచ్చి నిలిపారు.

"అబ్బాయి! నీవిక్కడే ఉండు! నిన్ను పిలవాల్సిన సమయాన పిలుస్తాము. తప్పించుకొందాం అని కలలో కూడ అనుకోకు! అలవాటున్నవారు తప్ప ఇంకెవరూ ఈ అడవిలోకి రాలేరు, బయటకు వెళ్ళనూ లేరు. అలా బయటకు వెళ్ళేందుకు ప్రయత్నించావో, ప్రాణాలు దక్కవు!" అని హెచ్చరించాడు రవిదాసు.

"అలా నేను దారి వెతుక్కొని తప్పించుకోజూస్తే నీవు మంత్రం వేసి నన్ను చంపేస్తావు! కదూ మాంత్రికా?" అని చెప్పి వంతిదేవుడు నవ్వాడు.

"నవ్వు, నవ్వు! బాగా నవ్వు!" అని రవిదాసు కూడ నవ్వాడు.

అదే సమయాన ఎక్కడో దూరాన ఒక నక్క ఊల వేయసాగింది. అది విని పక్కన ఎక్కడో ఒక గుడ్లగూబ కూసింది.

వంతిదేవుని ఒళ్ళు జలదరించింది. చలి వల్ల కాదు. దట్టమైన ఆ అడవిలోపల ఈదురుగాలి కూడ చొరబడలేదు. అంతెందుకు? అక్కడ వాన కూడ అంతగా పడ్డట్లు కనిపించడంలేదు. నేలపైన అక్కడక్కడ కొన్ని వాన చినుకులు పడి తడిసివుందంతే. గాలి లేనందువల్ల ఉక్కగా ఉంది. అక్కడికి వచ్చి చేరేటప్పుడికి వంతిదేవుని బట్టలు ఇంచుమించు ఆరిపోయాయి. నడుం చుట్టూ కట్టుకొన్న బట్ట మాత్రం ఇంకా తేమగా ఉంది. దాన్ని విప్పి పక్కనున్న బండమీద ఆరవేశాడు. తాను కూడ ఆ బండపైన ఒక మూల కూర్చొని గోడనానుకొన్నాడు. అతడికి కాపలాగా ఒకే ఒక్కడు నిలబడివున్నాడు.

~

కాస్త దూరాన అడవి మధ్యలో ఏర్పడ్డ బయలు ప్రదేశంలో వంతిదేవునితో వచ్చినవారు వర్తులాకారంలో కూర్చొనివున్నారు. పళ్ళిప్పడై లోపలినుంచి ఒక పాత సింహాసనాన్ని తీసుకొచ్చి వేశారు. దానిపైన 'చక్రవర్తి అని పిలవబడ్డ ఆ చిన్నారి పిల్లాడు కూర్చొన్నాడు. దివిటీలలో రెంటిని మాత్రం ఉంచుకొని తక్కినవాటిని ఆర్పేశారు. అలా తక్కిన దివిటీలను ఆర్పినప్పుడు లేచిన పొగ నలువైపులా కమ్ముకొంది.

"రాణి ఇంకా రాలేదేం?" అన్నాడొకడు.

"సమయం, అవకాశం చూసుకొనే కద రావాలి? రెండో జాములోనే నేను కూడ రమ్మన్నాను. అంతవరకు మన రాజవంశ కీర్తి గురించి ఎవరైనా పాటలు పాడండి!" అన్నాడు సోమన్ శాంభవన్.

ఇడుంబన్‌కారి ఢమరుకాన్నొకదాన్ని తీసి మెల్లగా తట్టాడు. దేవరాళన్ ఏదో ఒక పాటను పాడనారంభించాడు.

~

వంతిదేవుడు తాను కూర్చొన్న చోటునుంచే ఇదంతా చూడసాగాడు. 'వళుది  కులం అన్నది పాండ్యరాజుల కులం అని వంతిదేవుడెరుగు. పాట ఏదో ఒక శోకాలాపంగా అతడికి వినిపించింది. అది అతడి మనసులోను ఏదో ఒక శోకపూరితమైన భావం పుట్టించింది. పాటలోని కొన్ని పదాలు అతడి చెవికందాయి. వాటినాధారం చేసుకొని ముందు జరిగిన మహాయుద్ధపు వృత్తాంతాన్ని అతడు గుర్తు చేసుకోగలిగాడు.

అవును; వరగుణ పాండ్యునికి, అపరాజిత పల్లవునికి మధ్య మూడు రోజులపాటు ఘోరయుద్ధం జరిగిందక్కడే. పల్లవునికి తోడుగా గంగై రాజు పృథ్వీరాజు వచ్చాడు. ఆ యుద్ధంలో చనిపోయిన లక్షలకొద్ది సైనికవీరులలాగే ఆ మహావీరుడు కూడ మరణించాడు. దాని జ్ఞాపకార్థం కట్టిన పళ్ళిప్పడైనే ఇప్పుడు కుట్రదారులు తమ సమావేశ స్థలంగా ఉపయోగించుకొంటున్నారు.

గంగైరాజు నేలకొరగగానే పల్లవసైన్యాలు చెదరిపోనారంభించాయి. పాండ్య సైన్యం విజయం పొందడం తథ్యం అని తోచింది. ఈ సమయాన చోళసైన్యాలు పల్లవుల సైన్యాలకు తోడు వచ్చాయి. ఆ దండుకు నాయకత్వం వహించేందుకు మహావీరుడైన, ఒంటిమీద తొంభైయారు పోరుగాయాలను భరించిన విజయాలయ చోళుడు వచ్చాడు. రెండు కాళ్ళనూ ఇంతకు మునుపే యుద్ధంలో కోల్పోయిన ఆ వృద్ధవీరుని నలుగురు వీరులు మోసుకొని వచ్చారు. రెండుచేతులా రెండు పొడవాటి కత్తులను పట్టుకొని ఆ మహావీరుడు పాండ్యసైన్యంలోకి చొరబడ్డాడు. రెండు కత్తులనూ చక్రాకారంలో తిప్పుకొంటూ వెళ్ళాడు. అతడు దూసుకొని వెళ్ళిన చోటల్లా రెండువైపుల పాండ్య సైనికుల నిర్జీవ దేహాలు గుట్టలు గుట్టలుగా పడ్డాయి.

చెదిరిపోయిన పల్లవసైన్యాలు మళ్ళీ తిరిగి రానారంభించారు.

వేవేల ఖడ్గాలు సాయంసంధ్యాసూర్యుని అరుణకిరణాలు సోకి తళతళా మెరిశాయి.

రణ రణ రణార్! - వేవేల శూలాలు ఇంకొక వైపు నుంచి దూసుకొచ్చాయి.

కత్తులు, శూలాలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి.

వేవేల శిరస్సులు నేలకు దొర్లి పడ్డాయి.

వేవేల నిర్జీవ దేహాలు నేలకొరిగాయి.

ఈ ఈ ఈ ఈ ! - గుర్రాలు సకిలిస్తూనే చచ్చిపడ్డాయి.

ఘీ ఘీ! - ఏనుగులు ఘీంకరిస్తూ చచ్చి పడ్డాయి.

రక్తపు వెల్లువలో మృతదేహాలు - తేలాయి.

ఇరవైవేల గద్దలు గిరికీలు కొడుతూ ఆకాశాన్ని మరుగుపరిచాయి.

ముప్పైవేల నక్కలు ఈల వేసుకొంటూ వచ్చి యుద్ధరంగాన్ని చుట్టుముట్టాయి!

"అయ్యో!" అన్న యాభైవేల దీన నాదాలు లేచాయి.

"వదలకు! పట్టుకో! తరుము! కొట్టు! చంపు!"

ఇటువంటి వేవేల కేకలు లేచాయి.

వేవేల జయభేరులు మోగాయి.

ఇరవైవేల శంఖాలు ఘోషించాయి.

"హ! హ! హ!" అని పదహారు వేల దెయ్యాలు వికట్టాటహాసం చేశాయి.

~

వంతిదేవుడు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. నలువైపులా పరికించి చూశాడు. పళ్ళిప్పడై గోడనానుకొని తానలాగే కాసేపు కునుకు తీశాడని గ్రహించాడు. ఆ సగం నిద్రలో తాను కన్న ఆ భయంకరమైన కలను మరొకసారి తలుచుకొన్నాడు. కలా అది? ఢమరుకం శబ్దానికి తగినట్లు దేవరాళన్ పాడిన పాటే అతని మనోనేత్రం ముందు దృశ్యరూపంలో ప్రత్యక్షమైనట్లుంది.

~

ఆ సమయాన దేవరాళన్ పాండ్యవీరుల చేతిలో పల్లవులు, గంగై వీరులు ఓడిపోవడం గురించి పాడుతున్నాడు. వింటున్నవారు పెద్దగా నవ్విన నవ్వులే తనకు దెయ్యాల వికటాట్టహాసంలాగ వినిపించి, తనను సగం నిద్రనుంచి ఉలిక్కిపడి మేలుకొనేటట్లు చేసివుండాలి.

ఢమరుకం శబ్దం ఉన్నట్లుండి ఆగిపోయింది. దేవరాళన్ కూడ పాటను వెంటనే ఆపేశాడు.

కాస్త దూరాన ఒక దివిటీ వెలుతురు కనిపించింది. అది దగ్గరకు రాసాగింది. దాని వెంబడే ఒక పల్లకి వస్తూంది. అది మంటపం సమీపానికి రాగానే, దాన్ని మోస్తున్నవారు దాన్ని కిందకు దింపారు. పల్లకి తెరలు తొలగాయి. లోపలినుంచి ఒక స్త్రీ బయటికొచ్చింది. అదెవరో కాదు - పళువూర్ యువరాణి నందినే. కానీ ఇంతకు మునుపు వంతిదేవుడు ఆమెను చూసిన అన్ని సందర్భాల్లోను సర్వాంగసుందర భూషితురాలైన మోహినిగా ప్రత్యక్షమైంది. ఇప్పుడు తలవిరబోసుకొని ఉగ్ర దుర్గాదేవిలాగ దర్శనమిచ్చింది.

ఆమెను ఈ రూపంలో చూసిన వంతిదేవుని మనసులో ఒక దిగులు పుట్టింది. అది అతని ఒంటిని వణికించింది.

~

నందిని పల్లకినుంచి దిగిన వెంటనే సింహాసనంలో ఆసీనుడైన పిల్లాడిని చూసింది. వాడిని చూస్తూనే వాడివైపు నడిచి వెళ్ళింది.

పిల్లాడు కూడ ఆమెనే కళ్ళార్పకుండ చూస్తున్నాడు. తక్కినవారు వారిద్దరినీ చూస్తున్నారు.

పిల్లాడిని పాడుబడ్డ మంటపానికి వెతుక్కొంటూ వచ్చిన స్త్రీ - వాడి చేత 'అమ్మ  అని పిలవబడ్డ స్త్రీ - సింహాసనం వెనక నిలబడివుంది.

నందిని పిల్లాడి దగ్గరకు రాగానే రెండు చేతులను చాచింది.

పిల్లాడు నందినిని, తన వెనక నిలబడ్డ స్త్రీని మార్చి మార్చి చూశాడు.

"నీవే కద అమ్మ? ఈమె కాదు కద?" అని నందినిని అడిగాడు.

"అవును, కన్నా!"

"ఈమెందుకు నా అమ్మ అని చెప్పకొంటుంది?"

"ఆమె నిన్ను పెంచిన తల్లి!"

"నీవెందుకు నన్ను పెంచలేదు? ఎందుకు నీతో పెట్టుకోలేదు? ఈమె నన్నెందుకు ఎక్కడో కొండ గుహలో దాచిపెట్టింది?"

"కన్నా! నీ తండ్రి కోరికను నెరవేర్చేందుకే ఆయనను చంపినవారిపై పగ తీర్చుకోవాలి!"

"అవును; అది నాకు తెలుసు!" అని చెప్పి పిల్లాడు లేచి నందినిని సమీపించాడు.

నందిని వాడిని తన రెండు చేతులా ఎత్తి హత్తుకొంది. తల నిమిరింది. పిల్లాడు కూడ ఆమెను గట్టిగా పట్టుకొన్నాడు. మళ్ళీ ఆమె తనను విడిచిపెట్టి వెళ్ళకూడదని అలా గట్టిగా పట్టుకొన్నాడు కాబోలు.

కానీ ఆ దృశ్యం చాలసేపు సాగలేదు. నందిని పిల్లాడి చేతులనుంచి బలవంతంగా విడిపించుకొని వాడిని సింహాసనం పైన కూర్చోబెట్టింది. మళ్ళీ పల్లకి దగ్గరకు వెళ్ళింది. దాన్నుంచి మనం ఇంత క్రితం చూసివున్న ఖడ్గాన్ని తీసుకొంది. పల్లకిని మోసుకొని వచ్చినవారిని చూసి ఏదో సంజ్ఞ చేసింది. వారు పల్లకిని తీసుకొని కాస్త దూరంగా వెళ్ళి మరుగ్గా కూర్చొన్నారు.

నందిని మళ్ళీ సింహాసనం దగ్గరకొచ్చి ఆ కత్తిని సింహాసనంపైన అడ్డంగా పెట్టింది.

పిల్లాడు దాన్ని ఎనలేని ఆసక్తితో చూస్తూ " నేను దీన్ని చేతిలోకి తీసుకోవచ్చా?" అని అడిగాడు.

"కాస్త ఓపిక పట్టు కన్నా!" అన్నది నందిని.

తర్వాత రవిదాసు మొదలైనవారిని వరుసక్రమంలో పరికించి చూసింది.

"శపథం చేసినవారు తప్ప ఇక్కడ ఇంకెవరూ లేరు కద?" అని అడిగింది.

"లేరు, దేవీ!" అన్నాడు సోమన్ శాంభవన్.

రవిదాసు వైపు తిరిగి నందిని, "సేనాపతీ..." అని ప్రారంభించింది.

రవిదాసు నవ్వాడు.

"ఈ రోజు మీకు నవ్వులాటగా ఉండవచ్చు. వచ్చే నెల, ఇదే రోజు, ఎలా ఉంటుందో, ఎవరికి తెలుసు!"

"దేవీ! ఆ మంచి రోజు ఎప్పుడొస్తుందా అని మేమంతా ఎదురు చూస్తున్నాము."

"అయ్యా! మనమేమో మంది బలం లేని వాళ్ళం. మన చక్రవర్తి ఇంకా చిన్నబిడ్డ. చోళరాజ్యం చాల పెద్దది, చాల బలమైనదీను. చోళుల సేనాబలం అంతులేనిది. మనం తొందరపడివుంటే కార్యం పూర్తిగా చెడిపోయేదే. ఓపిగ్గా ఉన్నందువల్ల కార్యసిద్ధి కలిగే సమయం ఆసన్నమౌతూంది. రవిదాసుగారూ! మీరు చెప్పవలసింది ఏమైన ఉందా? ఇక్కడున్న తక్కినవారిలో ఎవరైన ఏమైనా చెప్పవలసివుందా?"

రవిదాసు అక్కడున్న వారందరి ముఖాలను వరుసగా చూసుకొంటూ వచ్చాడు. అందరూ మౌనవ్రతం పట్టినట్లు తోచింది.

"దేవీ! మేము చెప్పవలసిందేమీ లేదు. మీరే అంతా చెప్పాలి. శపథం నెరవేరే సమయం దగ్గరైందన్నారు. ఎక్కడ. ఎలా, ఎప్పుడు, ఎవరి మూలంగా నెరవేరబోతోందని తెలియజెప్పి కరుణించాలి!" అన్నాడు.

"అలాగే. అది చెప్పేందుకే నేనిప్పుడు ఇక్కడికి వచ్చాను. అందుకనే మిమ్మల్నందరినీ తప్పకుండ ఇక్కడికి రమ్మని చెప్పాను. మన చక్రవర్తిని కూడ పిలుచుకొని రమ్మని చెప్పాను" అన్నది నందిని.

~

సింహాసనంపైన కూర్చొనివున్న పిల్లాడితో సహా అందరూ నందిననే శ్రద్ధగా చూడసాగారు. ఆమె ఇలా చెప్పసాగింది:

"మీలో కొందరు తొందరపడ్డారు. మనం చేసిన శపథాన్ని నేను మరిచిపోయానేమోనని కూడ సందేహపడ్డారు. ఆ సందేహం నిరాధారమైనది. మరిచిపోకుండ గుర్తుపెట్టుకోవడానికి మీ అందరికన్న నాకే కారణాలధికం. లేదు; నేను మరువలేదు. గత మూడేళ్ళుగా రాత్రింబగళ్ళు నేనింకే విషయం గురించి ఆలోచించడం లేదు. మనం చేసిన శపథం ప్రకారం పగ తీర్చుకోవడానికి తగిన సమయ సందర్భాలు, తంత్రోపాయాల గురించి తప్ప ఇంకే విషయం గురించి కూడ నేనాలోచించడం లేదు; ఎక్కడికి వెళ్ళినా, ఏ కార్యం చేస్తున్నా, ఎవరితో మాట్లాడుతున్నా కూడ మన ధ్యేయం నెరవేరేందుకు దాని వల్ల ఏమైనా ఉపయోగం ఉందా అన్నది తప్ప, ఇంకే ఆలోచనా నాకు లేదు. సమయ సందర్భాలు ఇప్పుడు కలిసి వస్తున్నాయి. చోళ రాజ్యపు చిన్న చిన్నరాజులు, పెద్ద అధికారులు రెండు పక్షాలుగా వేర్పడివున్నారు. పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్ మొదలైనవారు మధురాంతకునికి పట్టం కట్టాలని తీర్మానించివున్నారు. కొడుంబాళూర్ బూది విక్రమకేసరి, తిరుక్కోవలూర్ మలైయమాన్ అందుకు విరుద్ధంగా ఉన్నారు. బూది విక్రమ కేసరి దక్షిణ సైన్యంతో తంజావూరు వైపు వస్తున్నట్లు విన్నాను. తిరుక్కోవలూర్ మలైయమాన్ కూడ సైన్యాన్ని సమీకరించుకొని వస్తున్న విషయం కూడ ఎరుగుదును. రెండు పక్షాల మధ్య ఏ నిమిషమైనా యుద్ధం మొదలు కావచ్చు..."

"దేవీ! అలా యుద్ధం జరగకుండేందుకు మీరు పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్నారని వింటున్నాను.

కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో సమరస సంభాషణ జరగబోతోందని కూడ విన్నాను."

"అవును. ఆ ఏర్పాటు చేసింది కూడ నేనే. కానీ ఎందుకని మీరూహించలేకపోయారా?"

"మావల్ల ఊహించ వీలుకాలేదు, దేవీ! ఒక స్త్రీ మనసు లోతుల్లో ఏముందని కనిపెట్టడం ఆ పరమేశ్వరునికి కూడ సాధ్యం కాదని పెద్దలంటారు. మావల్ల ఎలా సాధ్యమవుతుంది?"

"అది మీ వల్ల సాధ్యం కాని కార్యమే. నేనే చెబుతాను, తెలుసుకోండి. మన శపథం నెరవేరక మునుపే చోళరాజ్యంలో అంతర్యుద్ధాలు మొదలైతే దాని పరిణామం ఎలా ఉంటుందో చెప్పలేము. సుందర చోళుడు ఇంకా ప్రాణాలతో ఉన్నాడు. అనిరుద్ధ బ్రహ్మారాయలొకడున్నాడు. వారు జోక్యం చేసుకొని ఈ రెండు పక్షాలవారిని గద్దించి నోరు మూయిస్తారు. లేక, ఒక పక్షం ఓడిపోయి, రెండవ పక్షం బలం పుంజుకొంటే కూడ మన ధ్యేయం నెరవేరడం అసాధ్యమైపోతుంది. అందుకే ఇప్పడే సంధి సమరసం చేపట్టాను. అయితే, యుద్ధం మొదలయ్యేలోపే మన ధ్యేయాన్ని నెరవేర్చేసుకోవాలి. అలా నెరవేరిన తర్వాత చోళరాజ్యపు చిన్నరాజుల మధ్య ప్రారంభమయ్యే పోరాటానికి ముగింపే ఉండదు. ఇరు పక్షాలవారు సర్వనాశనమయ్యే వరకు అది కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పుడు తెలుస్తూందా... సంది, సమరస సంభాషణల వెనుక కారణం?"

~

ఇది వినగానే అక్కడ సమావేశమైన వారందరి ముఖాల్లోను ఆశ్చర్యమూ, ఉత్సాహమూ అగుపించాయి. పళువూర్ యువరాణి శక్తియుక్తులను గురించి ఒకరితోనొకరు చెప్పకొని ఆశ్చర్యపోయారు. రవిదాసు కూడ ఆశ్చర్యపడకుండ ఉండలేకపోయాడు.

"దేవీ! మీ అపూర్వమైన ముందాలోచనకు ఆశ్చర్యపోతున్నాము. సంధి, సమరస సంభాషణ అంతరార్థం తెలుసుకొన్నాము. కానీ శపథం నెరవేరే రోజు దగ్గరపడిందన్నారు. దాన్ని ఎవరు నెరవేరుస్తారు? ఎలా? ఎప్పుడు?" అని అడిగాడు.

"దానికీ చేర్చే ఈ యుక్తి పన్నాను. సమరస సంభాషణ అన్న నెపం మీద మన ప్రధమ శత్రువును కడంబూర్ మాళిగకు వచ్చేందుకు ఆహ్వానం పంపించడమైంది. వాడక్కడికి తప్పక వస్తాడు. మన శపథాన్ని అక్కడే నెరవేర్చాలి .వీరపాండ్యుని ఆపత్కాల సహాయకులారా! మీ పగ తీరే సమయం దగ్గరకొచ్చేసింది. ఇవాళ శనివారం కద? వచ్చే శనివారం లోపల మన శపథం నెరవేరిపోతుంది...!"

అక్కడ గుమిగూడిన ఇరవైమందీ 'ఆహా' కారాలు చేశారు.

కొందరు లేచి గెంతులేశారు.

ఢమరుకం చేతబట్టినవాడు ఉత్సాహం పట్టలేక దాన్ని రెండుసార్లు వాయించాడు.

చెట్లమీద నిద్రపోతున్న గుడ్లగూబలు మేల్కొని ఉరిమి చూసి వేరే కొమ్మలపైకి దూకాయి.

గబ్బిలాలు టపటపా రెక్కలు కొట్టుకొంటూ ఎగిరి వెళ్ళిపోయాయి.

వంతిదేవుని గుర్రం ఒక్కసారి తన ఒంటిని విదిలించుకొంది.

వంతిదేవుడు కూడ తలెత్తి చూశాడు. నందిని తన చుట్టూ ఉన్నవారితో ఏదో ఉత్సాహోద్వేగాలు పుట్టించే విషయం చెబుతూందని మాత్రమే అతడికి తెలిసింది. ఆమె మాటలేవీ అతడి చెవికందలేదు.

~

రవిదాసు తక్కినవారి ఉత్సాహాన్ని చేయెత్తి సైగ చేసి నిలిపాడు.

"దేవీ! తమ చివరి మాట మాకు ఎనలేని ఉత్సాహాన్నిస్తూంది. మన ప్రధమ శత్రువును చంపి పగ తీర్చుకొనే సమయం ఇంత దగ్గరకొచ్చేసిందని తెలిసి ఆనందిస్తున్నాము. కానీ పగ తీర్చే భాగ్యం, అదృష్టం ఎవ్వరిది?" అని అడిగాడు.

"దానికి మన మధ్య పోటీ ఏర్పడడం సహజమే. అందు గురించి ఎవరికీ మనస్తాపం కలగకూడదనే వీరపాండ్యుల ముద్దుల కుమారుని ఇక్కడికి పిలిపించాను. వీరపాండ్యుల కత్తి కూడ ఇదిగో ఇక్కడే ఉంది. ఈ చిన్నారి తన తండ్రి ఖడ్గాన్ని తాకి మనలో ఎవరికిస్తాడో వారే పగ తీర్చాలి. తక్కినవారు చుట్టుపక్కల సహాయానికి సిద్ధంగా ఉండాలి. ఆ బాధ్యత తీసుకొన్నవారు నెరవేర్చలేకపోతే తక్కినవారు ముందుకు వచ్చి దాన్ని ముగించాలి. కడంబూర్ మాళిగ లోపల నేనుంటాను. ఇడుంబన్‌కారి కోట కాపలవాళ్ళలో ఒకడుగా ఉంటాడు. పగతీర్చే బాధ్యత తీసుకొన్నవారు మాళిగ లోపల ప్రవేశించేందుకు మనం సహాయం చేస్తాము. ఈ ఏర్పాటు మీకందరికీ సమ్మతమే కద?"

ఆపత్కాల సహాయకులు ఒకరినొకరు కుతూహలంతో చూసుకొన్నారు. అందరికీ ఆ ఏర్పాటు నచ్చిందనే తోచింది.

రవిదాసు ఇలా అన్నాడు: "మీరు చెప్పింది మంచి ఏర్పాటే. అందుకు మేమందరమూ సమ్మతిస్తున్నాము. కానీ ఇంకా ఒక విషయం - పగ తీర్చే బాధ్యత ఎవరికి దొరుకుతుందో, వారు చెప్పినట్లు తక్కిన వారందరూ తప్పకుండ వినాలని ఒక నిబంధన పెట్టుకొందాం. చక్రవర్తి ప్రాయానికి వచ్చేంతవరకు పగతీర్చినవారు చెప్పిందే చట్టమని తక్కినవారు ఒప్పుకొని నడుచుకోవాలి!"

ఇది విన్న నందిని ముఖాన చిరునవ్వు విరిసింది.

"నన్ను కూడ చేర్చుకొనే కద చెబుతున్నారు?" అని అడిగింది.

"అవును, దేవీ!" అన్నాడు రవిదాసు.

"సంతోషం. ఇప్పుడు రవిదాసు చెప్పింది కూడ అందరికీ సమ్మతమేనా?" అని నందిని తక్కినవారిని చూసి అడిగింది.

అందరూ ఒకరినొకరు చూసుకొన్నారు. బదులు చెప్పేందుకు జంకారు. కొందరికి అది సమ్మతం కాదని తోచింది.

సోమన్ శాంభవన్, "అదెలా న్యాయమవుతుంది? మనకు అన్నివిధాలా సహాయం చేస్తున్న

దేవిని ఎలా అందరితోబాటు సమానంగా పరిగణించవచ్చు?" అని అడిగాడు.

"నన్ను గురించి దిగులు పడవద్దు. నేను బ్రతికున్నదే వీరపాండ్యుల క్రూర హత్యకు పగ తీర్చుకోవడానికే. దాన్ని నెరవేర్చేవారెవరైనా, వారికి నేను ఎప్పటికీ దాసురాలిగా ఉండేందుకు సిద్ధమే!" అన్నది నందిని.

తర్వాత, ఈ మాటలన్నిటినీ అర్థం చేసుకొని, చేసుకోక వింటున్న పిల్లాడిని చూసి, "నా కన్నా! ఈ వీర ఖడ్గం నీ తండ్రిది. దీన్ని నీ చిన్నారి చేతుల్లో తీసుకొని, ఇక్కడ ఉన్నవారిలో నీకు అధికంగా ఎవరిష్టమో, వారికివ్వు!" అన్నది.

రవిదాసు కాస్త ముందుకొచ్చి, "చక్రవర్తీ! మమ్మల్నందరినీ బాగా చూడండి. మాలో ఎవరు వీరుడు, ధైర్యశాలి అని మీకనిపిస్తుందో అతడికి ఈ పాండ్యకుల వీరఖడ్గాన్ని తాకి ఇవ్వండి!" అన్నాడు.

సింహాసనంపైన ఆసీనులైన చిన్న చక్రవర్తి చుట్టూ పరికించి చూశారు.

అందరూ అణచుకోలేని ఉత్కంఠతోను, ఉత్సుకతతోను, ఆదుర్దాతోను, కలవరపాటుతోను చక్రవర్తినే చూడసాగారు. ప్రతి ఒక్కరి కళ్ళూ "నాకివ్వండి! నాకివ్వండి!" అని బ్రతిమాలే భావాన్ని వ్యక్తపరిచాయి.

రవిదాసుని ముఖమూ, కళ్ళు మాత్రం, "నాకివ్వండి!" అని అధికారపూర్వకంగాను, భయపెట్టేటట్లుగాను ఆజ్ఞాపించాయి.

చిన్నారి అందరినీ రెండుమూడు సార్లు చూసిన తర్వాత, కత్తిని చేత తీసుకొన్నాడు. దాన్ని ఎత్తలేక ఎత్తాడు.

అందరి ఆదుర్దా/ఆందోళన శిఖరాన్నందుకొంది.

పిల్లాడు చటుక్కున నందిని నిలబడ్డ వైపు తిరిగాడు. "అమ్మా! అందరికన్న నాకు నీవే అధికంగా నచ్చావు. నేను పెద్దవాడినయ్యేవరకు నీవే రాజ్యాన్ని ఏలాలి!" అని చెబుతూనే ఖడ్గాన్ని ఆమెకిచ్చాడు.

~~~
~~~

# అధ్యాయము - 36

## చీకటిలో ఒక ఆకారం

**చక్రవర్తి** అని పిలవబడుతున్న ఆ పిల్లాడిచ్చిన ఖడ్గాన్ని తీసుకొంది నందిని. దాన్ని ఎదకు హత్తుకొని నిమిరింది. తర్వాత ఆ పిల్లాడిని కూడ ఎత్తుకొని హత్తుకొంది. ఆమె కళ్ళనుంచి ధారగా కన్నీళ్ళు ప్రవహించసాగాయి.

తక్కినవారు కాసేపు ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డారు.

రవిదాసు మొదట ఆశ్చర్యంనుంచి తేరుకొని ఇలా అన్నాడు:

"దేవీ! చక్రవర్తి మన కోరికను సరిగ్గా అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోక కత్తిని మీకిచ్చేశారు. మళ్ళీ విశదంగా చెప్పి..."

నందిని అతన్ని మధ్యలోనే అడ్డగించి, గద్గద స్వరంతో ఇలా అంది:

"లేదయ్యా, లేదు! చక్రవర్తి సరిగ్గా అర్థం చేసుకొనే కత్తిని నాకిచ్చారు. నా కన్నీళ్ళను చూసి మీరు కలతబారకండి. వీరపాండ్యుల ఘాతుక హత్యకు పగతీర్చే భాగ్యం నాకు లభించింది కద అని ఆనందంతో ఉప్పొంగిన ఆనంద బాష్పలివి!"

"దేవీ! ఆలోచించి చూడండి. మేమింత మంది ఆపత్కాల సహాయకులు ప్రాణాలతో ఉన్నప్పుడు..." అని సోమన్ శాంభవన్ మొదలుపెట్టగా, నందిని అతన్ని అడ్డగించి ఆపింది.

"ఆలోచించే అవసరమే లేదు. ఆ బాధ్యత నాదే. మీకు కూడ పని లేకపోలేదు. మీలో సగం మంది చక్రవర్తిని పంచపాండవుల కొండకు భద్రంగా తీసుకొని వెళ్ళి చేర్చండి. తక్కినవారు కడంబూరుకు రండి. శంబువరయ్యర్ మాళిగ లోపలికి రాగలిగినవారు రండి. తక్కినవారు బయట సిద్ధంగా వేచివుండండి - వేగంగా వెళ్ళగల గుర్రాన్ని సిద్ధం చేసుకొని వేచివుండండి. కార్యం విజయవంతంగా ముగిసిన తర్వాత, వీలైతే అందరూ ప్రాణాలతో తప్పించుకోవాలి కదా?" అన్నది నందిని.

రవిదాసు ముందుకు వచ్చి, "అమ్మణి! ఒక విషయం చెప్పేందుకు మరిచాను. అది చెప్పడానికి అనుమతి కావాలి" అన్నాడు.

"చెప్పండి! త్వరగా చెప్పండి. పళువేట్టరయ్యర్ కొళ్ళిడం నదీతీరంలో జరుగుతున్న కాళాముఖుల సమావేశానికి వెళ్ళివున్నారు. వారు తిరిగి వచ్చేలోపు నేను అంతఃపురానికి వెళ్ళి చేరాలి!" అన్నది.

"మన ప్రధమ శత్రువు ఆదిత్య కరికాలన్ కడంబూర్ శంబువరయ్యర్ మాళిగకు వస్తారన్నది అంత నిశ్చయం కాదు" అన్నడు రవిదాసు.

"ఏ కారణాన్ని ఆధారం చేసుకొని అలా సందేహిస్తున్నారు?" అని అడిగింది నందిని.

"తగిన కారణం ఉండడంవల్లనే ఆ సందేహాన్ని వెలిబుచ్చాను. కడంబూర్ మాళిగకు ఎటువంటి కారణాన కూడ వెళ్ళవద్దని ఆదిత్య కరికాలన్‌కి తాళపత్ర సందేశం వెళుతూంది. పళైయారై యువరాకుమారి, ముఖ్యమంత్రి అనిరుద్ధులు అలా సందేశాన్ని రాసి పంపించారు..."

"ఆ వివరం నాకు తెలియదనా అనుకొంటున్నారు?"

"తెలిసికూడ వాడు కడంబూర్‌కు వస్తాడని ఎదురు చూస్తున్నారా?"

"అవును; తప్పక ఎదురు చూస్తున్నాను. ఆదిత్య కరికాలన్ స్వభావం ఆ పళైయారై ఆడపాముకు తెలియదు. అణ్బిల్ బ్రహ్మరాక్షసునికి కూడ తెలియదు. మాయమంత్ర విద్యల్లో ఆరితేరిన మీకు కూడ తెలియలేదు. ఏ కార్యాన్నైనా చెయ్యవద్దని ఎవరైనా అడ్డగిస్తే, ఆదిత్య కరికాలన్ దాన్నే తప్పక చేసి తీరుతారు. అది నాకు తెలుసు; ఖచ్చితంగా తెలుసు. ఆదిత్య కరికాలన్ అరుళ్మొళి వర్మలాగ తల్లి/అక్క చాటు పిల్లాడు కాదు. మధురాంతకునిలాగ పిరికిపంద కాదు. కడంబూర్‌కు రావద్దని సహోదరి, ముఖ్యమంత్రి సందేశం పంపినందువల్లే తప్పక వచ్చి తీరుతారు!" అన్నది నందిని.

"దేవీ! దాన్ని కూడ మీరు పూర్తిగా నమ్మకండి. వారు పంపిన సందేశం కంచికి వెళ్ళి చేరదు!" అన్నాడు రవిదాసు.

"ఏం చెబుతున్నారయ్యా? కాస్త విడమరచి చెప్పండి!" అన్నది నందిని. ఆమె గొంతులో ఇప్పుడు ఆదుర్దా తోచింది.

"దేవీ! ఆదిత్య కరికాలన్‌కి ఎవరి ద్వారా సందేశం పంపించబడుతోందో తెలుసా?"

"నిర్దుష్టంగా తెలియదు. కానీ ఊహించుకోగలను."

"మంచిది; ఊహించనవసరం లేదు. వాడిని మేము పట్టుకొని ఇక్కడికి తీసుకొచ్చాము. చక్రవర్తి వానకు తలదాచుకొన్న మంటపంలో వాడూ కనిపించాడు. మన రహస్యాలన్నీ వాడికి తెలుసు. వాడిని ముందుకు వెళ్ళనివ్వడం మనకు మనమే సర్వనాశనాన్ని కొని తెచ్చుకొన్నట్లవుతుంది. ఇడుంబన్‌కారీ! ఎక్కడ? ఆ గూఢచారిని ఇక్కడికి తీసుకొని రా!" అన్నాడు రవిదాసు.

ఇడుంబన్‌కారి పళ్ళిప్పడై వైపు వెళ్ళాడు. అతడితోబాటు మరిద్దరు వెళ్ళారు. నందిని వారు వెళ్ళినవైపే పరికించి చూడసాగింది. ఇంతసేపు చిటపటలాడుతున్న ఆమె ముఖంమీద ఇప్పుడు మోహన లాస్యం చిగురించింది.

~

ఇడుంబన్కారి, తోడొచ్చిన ఇద్దరు వంతిదేవుని సమీపించారు. అలిసిపోయి సగం నిద్రలో ఉన్న అతడిపైన అమాంతం దూకారు. వారితో మల్లయుద్ధం చేద్దామా అని ఒక క్షణం ఆలోచించాడు వంతిదేవుడు. తర్వాత ఆ ఆలోచనను విరమించుకొని వారేం చేస్తారో చూద్దామని ఊరుకొన్నాడు. ఒక పెద్ద తాడుతో అతడి

చేతులను వెనక్కి విరిచి కట్టారు. తర్వాత అతని రెండు భుజాలను ఇద్దరూ పట్టుకొని తీసుకొని వెళ్ళి నందిని ముందు నిలబెట్టారు.

వంతిదేవుడు నందినిని చూడగానే చిరునవ్వు నవ్వాడు.

నందిని ముఖంలో ఇప్పుడు ఎటువంటి మార్పూ కనిపించలేదు - ప్రశాంతత నెలకొంది.

“అయ్యా! మళ్ళీ...” అని ప్రారంభించింది.

“అవును, దేవీ! మళ్ళీ వచ్చేశాను! కానీ నాకై నేనే రాలేదు!” అని చెప్పి చుట్టుపక్కలున్న వారిని చూశాడు.

నందిని పక్కనున్న పిల్లాడు, “అమ్మా! ఇతడే నన్ను చీకట్లో పిశాచి మింగేయకుండ కాపాడాడు. ఇతన్ని ఎందుకు తాడుతో కట్టారు?” అని అడిగాడు.

వంతిదేవుడు పిల్లాడిని చూసి, “బిడ్డా! ఊరుకో! పెద్దవాళ్ళు మాట్లాడేటప్పుడు పిల్లలు మధ్య మాటలాడకూడదు. మాట్లాడితే పులి మింగేస్తుంది!” అన్నాడు.

“పులిని నేను మింగేస్తాను!” అన్నాడు పిల్లాడు.

“చేప పులిని మింగుతుందా?” అని అడిగాడు వంతిదేవుడు.

అతని చుట్టూ ఉన్న వారందరి గొంతుల్లోంచి ఒక పెద్ద భయంకరమైన ఉరుము లేచింది. అది వంతిదేవునికే ఒక్కక్షణం ఒళ్ళు జలదరింపజేసింది.

రవిదాసు పెద్దగా, “దేవీ! చూశారా! వీడిని ప్రాణాలతో విడవడం సాధ్యం కాదు. మునుపు రెండుసార్లు మీ కోరిక మేరకు వీడిని ప్రాణాలతో తప్పించుకొని వెళ్ళనిచ్చాము. ఇకమీదట వీడినిలా వదిలిపెట్టలేము!” అన్నాడు.

వంతిదేవుడు, “మంత్రవాదీ! ఇదేమిటిలా అబద్ధాలు చెబుతున్నావు? నీవా నన్ను ప్రాణాలతో వదిలిపెట్టావు? నేను కద నిన్ను తప్పించుకొని వెళ్ళనిచ్చాను? దేవీ! ఈ మంత్రవాదిని కాస్త పరికించి చూసి చెప్పండి! వీడు నిజమైన రవిదాసా? లేక రవిదాసుని పిశాచా?” అన్నాడు.

రవిదాసు భయంకరంగా నవ్వాడు. “అవును; నేను పిశాచాన్నే! ఈ రోజు నీ రక్తాన్ని తాగబోతున్నాను" అన్నాడు.

మళ్ళీ అక్కడున్న వారందరి గొంతుల్లోంచి పెద్ద భయంకరమైన ఉరుము వెలువడింది.

ఇంతలో పిల్లాడు, “అమ్మా! వీడి దగ్గర ఒక మంచి గుర్రముంది. దాన్ని నాకివ్వమని చెప్పండి!” అన్నాడు.

“బిడ్డా! నీవు నాతో వచ్చేసెయి! నా గుర్రంపైన ఎక్కించుకొని తీసుకెళతాను!” అన్నాడు వంతిదేవుడు.

రవిదాసు వంతిదేవుని వైపు ఘోరమైన/భయంకరమైన చూపులు సారిస్తూ, “అరె! నోరు

మూసుకొని ఉండు!" అని చెప్పేసి నందిని వైపు చూసి, "దేవీ! శీఘ్రం ఆజ్ఞాపించండి!" అన్నాడు.

~

నందిని నిదానంగా "ఈయన ఇక్కడికెలా వచ్చారు? ఎప్పుడు వచ్చారు?" అని అడిగింది.

"చక్రవర్తి వానకు తలదాచుకొన్న మంటపంనుంచి వారిని దొంగిలించి తీసుకొని పారిపోజూశాడు. సమయానికి మేము వెళ్ళి అడ్డుపడి పట్టుకొన్నాము. ఒక్కక్షణం ఆలస్యం చేసివుంటే విపరీత పరిణామాలు జరిగివుండేవి!" అన్నాడు రవిదాసు.

నందిని వంతిదేవుని చూసి, "వీరు చెప్పేది నిజమేనా?" అని అడిగింది.

"మీవాళ్ళు నిజం చెప్పేవారా కాదా అన్నది మీకే కద బాగా తెలిసివుండాలి, దేవీ?" అన్నాడు వంతిదేవుడు.

నందిని ముఖారవిందంపైన ఒక చిరునవ్వు మెరిసి మాయమైంది. ఆమె రవిదాసుని చూసి, "మీరందరూ కాస్త దూరంగా వెళ్ళి ఉండండి. నేను వీరితో కొన్ని విషయాలు ఏకాంతంగా మాట్లాడి తెలుసుకోవాలి!" అన్నది.

"దేవీ! ఆలస్యమవుతూంది. అపాయం దగ్గరపడుతోంది. ఈ వేళలో..." అని రవిదాసు చెప్పి ముగించేలోపు, నందిని కఠిన స్వరంతో, "అయ్యా! కాసేపటికి మునుపు మనం చేసుకొన్న ఒప్పందాన్ని, నిబంధనలను గుర్తుచేసుకోండి. బదులు మాట్లాడక అవతలికి వెళ్ళండి. చక్రవర్తిని కూడ అవతలికి తీసుకొని వెళ్ళండి!" అని చెప్పి, పిల్లాడి చెవిలో, "కుమారా! కాస్త వారితో అవతలికి వెళ్ళు! నీకు వీరి దగ్గరినుంచి గుర్రం తీసి ఇస్తాను!" అన్నది.

~

రవిదాసు మొదలైనవారు తర్వాత బదులు మాట్లాడక ఆ పిల్లాడిని కూడ పిలుచుకొని వేగంగా అవతలికి వెళ్ళారు.

~

నందిని వంతిదేవుని మసక దివిటీ వెలుతురులో పరికించి చూసి, "అయ్యా! నాకు, మీకు మధ్య ఏదో ఒక పరస్పర బంధం ఉన్నట్లుంది!" అన్నది.

"అమ్మణీ! అది ఇప్పుడు చాల హానికరమైనదిగా మారింది; చాల గట్టిగా కూడ ఉంది. నా ఒంటిని, చేతులను కూడ చేర్చి కట్టివుంది!" అన్నాడు వంతిదేవుడు.

"మీ తమాషా మాటలను కాసేపాపండి. కావాలని ఇక్కడికి వచ్చారా? కాకతాళీయంగా వచ్చారా?"

"రావాలని రాలేదు; కాకతాళీయంగాను రాలేదు. మీ మనుషులే నన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకొచ్చారు. లేకపోతే ఇప్పటికి కొళ్ళిడం నదీతీరం చేరేవాడిని."

"నన్ను మళ్ళీ చూడవలసిరావడం మీకు కష్టాన్నిస్తున్నట్లు తెలుస్తూంది. నన్ను వదిలి వెళ్ళేందుకు కూడ అంతే కుతూహలమని తెలుస్తూంది."

"మిమ్మల్ని చూడవలసిరావడం వల్ల నాకేమీ కష్టం లేదు, దేవీ! నిజానికి తమనుంచి విడివడి వెళ్ళేందుకే కష్టమనిపిస్తూంది. మీరు అనుమతిస్తే, ఇప్పుడే మిమ్మల్ని ఆ ముసలి పళువేట్టరయ్యర్‌నుంచి, ఈ భయంకర మంత్రవాదినుంచి విడుదల చేసి పిలుచుకొని వెళతాను..."

"ఎక్కడికి తీసుకొని వెళతారు?"

"లంకలో అడవుల మధ్య అనాధలాగ తిరుగాడుతున్న మీ తల్లి వద్దకు తీసుకొని వెళతాను!" అన్నాడు వంతిదేవుడు.

నందిని నిరాశ ధ్వనించేటట్లు పెద్దగా నిట్టూర్చింది.

"నేను కూడ అలా అనాధనై తిరుగాడాలని కోరుకొంటున్నారా? ఒకవేళ అటువంటి కాలం వచ్చినా రావచ్చు. అప్పుడు నా తల్లి దగ్గరకు వెళ్ళేందుకు తప్పక మీ సహాయం తీసుకొంటాను. అంతకు ముందు, నా ధ్యేయం నెరవేరాలి. అది నెరవేరేందుకు మీరు సహాయం చేస్తారా?" అని అడిగింది నందిని.

"అమ్మణీ! తమ మనసులో ఏం ఉందో తెలిస్తేనే కద, అది నెరవేరేందుకు నేను సహాయం చేయడం గురించి నేను చెప్పగలను?" అన్నాడు వంతిదేవుడు.

"నిజమైన ప్రీతి ఉన్నవారు ఇలా మాట్లాడరు. కోరిక ఏమని తెలుసుకోకనే అది నెరవేర్చేందుకు ముందుకు వస్తారు."

"ప్రీతి/ప్రేమ ఉన్నవారు సమయానికి హెచ్చరించి ఆపదలనుంచి కాపాడుతారు. అమ్మణీ! ఈ కిరాతకులు ఏదో ఒక పెద్ద కుట్ర పన్ని మిమ్మల్ని ఒక పెద్ద అపాయకర పరిస్థితిలో ఇరికించారు. వారి పనికి మిమ్మల్ని ఉపయోగించుకోజూస్తున్నారు..."

"మీరు చెబుతున్నది తప్పు! నేనే వీరిని నా కార్యసిద్ధికి ఉపయోగించుకోజూస్తున్నాను! ఇది మీరు అర్థం చేసుకోండి..."

"ఒక చిన్న బిడ్డను ఏ అడవినుంచో తీసుకొని వచ్చి మిమ్మల్ని ఏమార్చజూస్తున్నారు..."

"ఎందుకని తెలుసా?"

"పాండ్య సింహాసనంపైన కూర్చోబెట్టేందుకు..." అన్నాడు వంతిదేవుడు.

"మళ్ళీ పొరబాటుగా అర్థం చేసుకొన్నారు. పాండ్య సింహాసనంపైన కూర్చోబెట్టేందుకు మాత్రమే కాదు! తుంగభద్రనుంచి లంక వరకు విస్తరించివున్న చోళసామ్రాజ్య సింహాసనంపైన అధిష్ఠింపజేసేందుకు!"

"అమ్మమ్మ! ఎవరి సహాయం తీసుకొని ఈ మహాకార్యాన్ని సాధించబోతున్నారు? ఇదిగో చుట్టూ నిలబడ్డారు కద? - ఈ నక్కల గుంపు సహాయంతోనా? చోళ సామ్రాజ్యపు ఇరవై లక్షల వీరాధివీరులున్న మహాసైన్యాన్ని, పగలు చెట్లు, పుట్టల వెనక దాగివుండి, రాత్రి బయటకు వచ్చే ఈ పది, ఇరవై నక్కల

సహాయం తీసుకొని గెలుస్తారా?"

"నేను వీరిని మాత్రం నమ్ముకోవడం లేదు! ఇదిగో, నా చేతనున్న ఖడ్గాన్ని నమ్మాను. దీని సహాయం తీసుకొని నా మనోరథాన్ని నెరవేర్చుకొంటాను."

"దేవీ! ఆ కత్తిని మీరేనాడూ ఉపయోగించబోవడం లేదు. దానికి కావలసిన బలం మీ చేతుల్లో లేదు కూడాను; మీ మనసులోను లేదు!"

"ఎందుకలా అనుకొంటున్నారు?"

"ఏమో... నాకలా అనిపించింది."

"మీరు చెబుతున్నది పూర్తిగా తప్పు అని ఇక్కడే నేను నిరూపించి చూపగలను."

"అలాగైతే నేను భాగ్యశాలినే. మీ దివ్యహస్తాలచేత మరణం పొందేందుకు పెట్టి పుట్టాలి కద?" అని చెప్పి వంతిదేవుడు శిరచ్ఛేదన చేయబడేందుకు సిద్ధమవుతున్నట్లు మెడను వంచి నేలను చూస్తూ నిలబడ్డాడు.

"అదా మీ కోరిక? నా దివ్యహస్తాలతో కిరీటాన్ని మీ శిరస్సుపైన పెట్టించుకోవాలని కోరుకోవడం లేదా?"

వంతిదేవుడు తలెత్తి చూసి, "మీ వశంలో ఉన్న కిరీటాన్ని ఎంతమంది తలలమీద పెడతారు?" అని అడిగాడు వంతిదేవుడు.

"అది నా ఇష్టం. చివరికి ఎవరికి కట్టాలని ఇష్టపడతానో, వారి శిరస్సున పెడతాను."

"అలాగైతే ఈ పిల్లాడి గతేమి?"

"వాడికి పట్టం కట్టడమూ, కట్టకపోవడమూ నా ఇష్టమే కద?"

"మీకెవరికిష్టమైతే వారికి కట్టబెట్టండి. నాకది వద్దు."

"ఎందుకని?"

"నా ఉంగరాల జుట్టు అందాన్ని అందరూ పొగుడుతున్నారు. కిరీటం పెట్టుకొని ఆ అందాన్ని చెడగొట్టుకోవడం నాకిష్టం లేదు."

"చాలు, చాలు! మీరు నిజమని చెప్పనారంభిస్తే అది అబద్ధాల కోటగా ఉంటుంది. నాకు తెలియదా? మీ నిజాన్ని మీదగ్గరే ఉంచుకోండి!" అని నందిని కోపంతో చెప్పేసి, చప్పట్లు తట్టింది. రవిదాసు మొదలైనవారు వెంటనే వారిని సమీపించారు.

~

వంతిదేవుడు తనకు దొరికిన అవకాశాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదని గ్రహించాడు. ఈ రాక్షసి తనని చంపేయమనే ఆజ్ఞాపించబోతూంది. దేవుడా! ఎలాంటి కుక్క చావు! యుద్ధరంగంలో శత్రువులతో పోరాడి వీరమరణం పొందకూడదా? ఇలాగా తాను చావాలని రాసివుంది?

రవిదాసు బృందం దగ్గరకొచ్చి వారిద్దరి చుట్టూ నిలబడ్డారు.

ఎరను సమీపించిన తోడేళ్లలాగ వారు ఉరమసాగారు.

"రాణీ! మీరేం చెప్పినా వీడు దారికి రాడని నాకు తెలుసు. మీరు వెంటనే బయలుదేరండి. మేము వీడిని ఈ పుణ్యస్థలంలో బలిచ్చేసి బయలుదేరుతాం" అన్నాడు రవిదాసు.

"మంత్రవాదీ! జాగ్రత్త! నా కోరిక అది కాదు. మీలో ఎవరూ ఈయనకు ఏ హానీ చేయకూడదు. వీరిని ఎవరైనా తాకితే నేనే ఈ కత్తితో వారిని చంపి ప్రతీకారం తీరుస్తాను!" అని నందిని గర్జించింది.

రవిదాసు మొదలైనవారు అవాక్కై నిలబడ్డారు.

"ఈయన మూలంగా నాకింకా కొన్ని కార్యాలు నెరవేరాలి. తెలిసిందా? నేనిప్పుడే బయల్దేరుతున్నాను. మీరూ బయలుదేరండి. ఈయన తనకిష్టమైన దారిన వెళ్ళనీ. ఎవరూ అడ్డు రాకూడదు!" అన్నది నందిని.

రవిదాసు, "దేవీ! ఒక విన్నపం. మీ చిత్తం ప్రకారమే చేయ సిద్ధంగా ఉన్నాము. కానీ వీడి దగ్గర గుర్రముంది. వీడిని మొదట వెళ్ళనివ్వడం మంచిదా? కాస్త ఆలోచించి చెప్పండి!" అన్నాడు.

"మంచిది; ఈయనను ఆ పళ్ళిప్పడై కోవెల స్తంభానికి కట్టేయండి. కట్లు విప్పుకొని బయలుదేరేందుకు వీరికి కాసేపు పడుతుంది. అంతలోపల మీరు ఈ పళ్ళిప్పడై అడవిని దాటవచ్చు" అన్నది నందిని.

~

వంతిదేవుడు పళ్ళిప్పడై కోవెల స్తంభానికి కట్టబడివున్నాడు. కాస్త దూరాన అతడి గుర్రం ఒక చెట్టుకు కట్టబడివుంది.

నందిని పల్లకెక్కి వెళ్ళిపోయింది.

రవిదాసు బృందం పిల్లాడిని తీసుకొని వేగంగా వెళ్ళిపోయారు. వారితోబాటు వెళ్ళిన దివిటీల వెలుతురు కూడ మెల్లమెల్లగ మసకబారి మరుగైంది.

వంతిదేవుని చుట్టూ చిమ్మ చీకటి కమ్ముకొంది.

కాసేపటి క్రితం అక్కడ చూసిన దృశ్యాలు, జరిగిన సంఘటనలు - అన్నీ కలలాగ అనిపించాయి.

చీకటిలో రాక్షస గబ్బిలాలు తమ వెడల్పాటి రెక్కలను టపటపా కొట్టుకొన్నాయి. గుడ్లగూబలు ఉరిమాయి.

నక్కలు ఘోరంగా ఈలవేయసాగాయి.

ఈల వేస్తూనే అవి దగ్గరకొస్తున్నట్లనిపించింది వంతిదేవునికి.

అడవిలో గుర్తు తెలియని ఆకారాలు తిరుగాడసాగాయి.

కడంబూర్ మాళిగలో అతడానాడు కన్న కల గుర్తుకొచ్చింది.

వేయి నక్కలు తనను చుట్టుముట్టి పీక్కు తినేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనిపించి అతడి ఒళ్ళు గడగడ వణికింది.

గబగబా కట్లను విప్పుకోజూశాడు. అవి అంత సులభంగా తోచలేదు.

వెలుతురుంటే కట్లు విప్పుకోవడం కాస్త సులభమయ్యేది.

కానీ అక్కడ వెలుతురు ఆనవాళ్ళే లేవు - మెరుపు వెలుతురూ లేదు, మిణుగురు పురుగుల వెలుతురు కూడ లేదు.

ఆకాశాన మేఘాలు తొలగి కొన్ని నక్షత్రాలు కనిపిస్తున్నా, వాటి వెలుతురు ఆ దట్టమైన అడవి లోపలికి చొరబడడం లేదు.

ఆః! అదేం శబ్దం?

అడవిలో ఎన్నో రకాల జంతువులు తిరుగాడుతుంటాయి. అందులో విచిత్రమేమి?

కాదు! అది ఒక మనిషి కాలి చప్పుడు లాగుంది!

గుర్రం మెల్లగా సకిలించింది. అడుగులు అటూ ఇటూ వేస్తూ, తొక్కిసలాడుతూ అవస్థ పడసాగింది. ఒకవేళ పులి, గిలి ఏమైనా వస్తూందా, ఏం?

వంతిదేవుడు కట్లు విప్పుకోవడానికి తొందర పడ్డాడు. సాధ్యం కాలేదు.

అదిగో, ఒక ఆకారం. ఆ కారు చీకటిలో ఒక నల్లటి నీడలాంటి ఆకారం. మనుష్యాకారమా? లేక ... ఇంకేం కావచ్చు?

అది ఇంకా దగ్గరికి రాసాగింది.

వంతిదేవుడు తన మనోధైర్యాన్నంతా కూడదీసుకొన్నాడు.

లాగి ఒక్క తన్ను తన్నాడా ఆకారాన్ని.

'కెవ్వు మని కేకవేస్తూ ఆ ఆకారం వెనక్కి జరిగింది.

కాస్త దూరం వెనక్కి వెళ్ళగానే 'ధడేల్మని  ఒక శబ్దం. పళ్ళిప్పడై కోవెల గోడకు వెళ్ళి గుద్దుకొంది కాబోలు ఆ ఆకారం.

తర్వాత ఆ ఆకారం అక్కడే కాసేపు నిలబడింది. పళ్ళిప్పడై గోడకు ఆనుకొని నిలబడినట్లు తోచింది.

చీకటిలో స్పష్టంగా తెలియకపోయినా, ఆ ఆకారం తననే పరీక్షగా చూస్తున్నట్లు వంతిదేవునికి తోచింది.

మళ్ళీ కట్లను విప్పుకోవడానికి ప్రయత్నించాడు. ఆ మంత్రవాది పిశాచాలు ఎంత గట్టిగా వేశారు ముళ్ళని! పోనీ; ఇంకొకసారి ఆ రవిదాసుని చూసినప్పుడు ముళ్ళు వేయడం నేర్పిద్దాం!

ఆ ఆకారం ఉన్న చోటువదిలి పళ్ళిప్పడై కోవెల లోపలికి వెళుతున్నట్లనిపించింది. కాసేపటికల్లా

ఆ కోవెల లోపల గుండ్రాళ్ళు గుద్దుకొంటున్నట్లే కొన్నిసార్లు శబ్దం వినిపించింది.

కోవెల వాకిట వెలుతురు.

అదిగో ఆ ఆకారం చేత ఒక దివిటీ పట్టుకొని బయటకు వస్తోంది.

తనవైపే వస్తూంది.

అది ఒక కాళాముఖ వీరశైవుని ఆకారం. పొడవైన గడ్డం, జడలు, మెడలో పుర్రెల మాల ధరించిన భయంకరమైన ఆకారం.

వంతిదేవుని దగ్గరకొచ్చి దివిటీని ఎత్తి పట్టుకొని ఆ వెలుతురులో అతన్ని పరీక్షగా చూడసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 37

## వేషం బయటపడింది!

**భయంకరమైన** రూపందాల్చిన ఆ కాళాముఖశైవుని అక్కడ, ఆ సమయాన చూడగానే వంతిదేవుడు ఒక్కక్షణం గాభరా పడ్డాడు. తర్వాత అతడి స్వాభావికమైన తెంపరితనం దాన్ని పారదోలేసింది. "ఇతన్ని ఎక్కడో చూసినట్లుందే! ఎక్కడ?" అని ఆలోచించాడు. అవునవును! హరిశ్చంద్ర నదీతీరాన చెట్టు కింద పడుకొని ఉన్నప్పుడు ఇద్దరు కాళాముఖులు దగ్గరకొచ్చి పరికించి చూసి వెళ్ళారు కదా? వారిలో ఇతడొకడు! అంతేనా? ఒక్కసారి మాత్రమే చూసిన ముఖమా ఇది? ఆ తీక్షణ వీక్షణాలున్న ఆ కళ్ళను ఇంకెక్కడా, ఇంతకు మునుపెప్పుడూ చూడలేదా?

ఇంతలో ఆ కాళాముఖుడు వంతిదేవుని చూసి, "హ! హ్హా! హ్హా!" అని నవ్వాడు. ఆ గొంతు - ఎన్నోసార్లు విన్న గొంతులాగుందే?

"అరె! నీవేనా? నీ కోసమేనా ఈ అర్ధరాత్రి ఇంత కష్టపడి వచ్చాను?" అని ఆ కాళాముఖ శైవుడన్నప్పుడు, అతడు కావాలనే గొంతు కాస్త మార్చి మాట్లాడుతున్నట్లనిపించింది.

"మరి, ఎవరి కోసం వచ్చావు?" అని అడిగాడు వంతిదేవుడు.

"యువరాజును వెతుక్కొంటూ వచ్చాను" అన్నాడు కాళాముఖుడు.

"ఏ యువరాజును?"

"నీకెందుకు? నీవెందుకడుగుతున్నావు?"

"నేనూ ఒక యువరాజునే; అందుకే అడుగుతున్నాను."

"యువరాజు ముఖలక్షణాలు చూడు...!"

""నా ముఖలక్షణాలకు ఏం కొరత? మీలాగ మీసాలు, గెడ్డం, జుట్టు పెంచుకొని మెడలో పుర్రెల మాల వేసుకొంటే నా ముఖం లక్షణంగా ఉంటుందా?"

"వేసుకొని చూడు. అప్పుడు తెలుస్తుంది."

"అవన్నీ ఎన్ని రోజుల్లో పెరుగుతాయి?"

"అదేం మహా? ఒక్క రోజులో పెరుగుతాయి. కావాలంటే ఒక్క ఘడియలోనే..."

"అలాగేనని నేనూ అనుకొన్నాను..."

"ఏం అనుకొన్నావు?"

"ఏమీ లేదు. నా కట్లను విప్పు. మీ బృందంలో చేరిపోతాను."

"చాలు, చాలు! నీలాంటి గూఢచారులెవరో మా కూటమిలో ఉన్నారు. అందుకే ఇవాళ మా

మహాసంఘం అలా ముగిసింది..."

"ఎలా ముగిసింది?"

"మహాసంఘానికి యువరాజు రాబోతున్నారు. ఆయన సింహాసనమెక్కగానే మా మహాగురువును రాజగురువుగా నియమించుకొంటారని మాటివ్వబోతారని ఎదురు చూశాను. కానీ యువరాజు రానే లేదు."

"నా కట్లు విప్పు. యువరాజు ఎందుకు రాలేదో చెబుతాను."

"ఏ యువరాజు?"

"ఇంకెవరు? గండరాదిత్యుల కుమారులు మధురాంతకులే!"

"నేనూహించింది సరి!"

"ఏం ఊహించావు?"

"నీవు గూఢచారివని"

"దేన్ని ఆధారంగా చేసుకొని నేను గూఢచారినని అనుకొన్నావు?"

"యువరాజును వెతుక్కొంటూ వచ్చినప్పుడు, ఈ అడవినుంచి కొందరు బయల్దేరడం చూశాను. వారెవరని నాకు తెలుసు. నీవు గూఢచారివని సందేహించే నిన్నిలా కట్టేసివుండాలి. కానీ నిన్ను ప్రాణాలతో ఎందుకు వదిలిపెట్టి వెళ్ళారని తెలియడం లేదు..."

"అది నేను చెబుతాను. నా కట్లు విప్పు!"

"నీవేమీ చెప్పకు. నీ కట్లు నేను విప్పడం కూడ సాధ్యం కాదు. నేను చెప్పినట్లు చేస్తానని ఒప్పుకొంటే..."

"నీవు చెప్పినట్లు నేనేం చేయాలి?"

"నీకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చనని చెప్పి నూటొక్క గుంజీలు తీయాలి!"

"అలాగా సంగతి?" అన్నాడు వంతిదేవుడు.

~

వారి మాటలిలా సాగుతున్నప్పుడు వంతిదేవుని చేతులు ఊరకలేవు. మెల్లమెల్లగా కట్లు విప్పుకోసాగాడు. "నూటొక్క గుంజీలు తీయాలి" అని కాళాముఖుడనేటప్పటికి అన్నికట్లూ విప్పేసుకొన్నాడు. అంతే! ఒక్క దూకుతో కాళాముఖుని పైకి లంఘించి కింద పడదోశాడు. కాళాముఖుడు చేత పట్టుకొన్న దివిటీ కింద పడిపోయింది. కానీ పూర్తిగా ఆరిపోలేదు; కాస్త వెలుతురునివ్వసాగింది.

కిందపడ్డ కాళాముఖుని ఎదపైన వంతిదేవుడు కూర్చొని, అతని గడ్డాన్ని పట్టి లాగాడు. అది వంతిదేవుని చేతికొచ్చేసింది. అదే సమయాన కాళాముఖుడు వంతిదేవుని విదిలించి తోసేసి లేచి నిలబడ్డాడు.

కింద పడి ఆరిపోయే తరుణంలో ఉన్న దివిటీని వంతిదేవుడు తీసి చేత పట్టుకొన్నాడు.

గడ్డమూ, జడా లేని కాళాముఖుని ముఖం సాక్షాత్తు ఆ వీరవైష్ణవుడు ఆళ్వార్ కట్టియాన్ ముఖమని తెలిసింది.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకొని కాసేపు నవ్వుకొన్నారు.

"వైష్ణవులుగారూ! సంబంధంలేని విషయాల్లో తలదూర్చవద్దని నాకు చెప్పారు కదా? మరి మీరు చేసిందేమిటి?" అని అడిగాడు వంతిదేవుడు.

"నీలాగ నేను అపాయంలో చిక్కుకోలేదు కద, తమ్ముడూ? నేనిప్పుడు రాకపోయివుంటే..."

"మీరే నా కట్లను విప్పేవారా?"

"నీవే నీ కట్లను విప్పుకొన్నా కూడ ఈ అడవినుంచి నా సహాయం లేకుండ బయటపడలేవు. నక్కలకు ఎర కావలసిందే."

"నక్కలలా ఉండనీ. కాసేపటి క్రితం ఇక్కడ గుమిగూడిన మంత్రవాది నక్కలను మీరు చూసివుంటే... ఆ నక్కలనుంచి నేను తప్పించుకొన్నదే గొప్ప కార్యం!"

"ఆ మంత్రవాదులు నాకు తెలుసు. మంత్రవాదులు మాత్రం వచ్చారా? ఇంకా ఎవరైనా వచ్చారా?"

"పిల్ల చేప ఒకటొచ్చింది. పులిని మింగేందుకు ఆశపడే విచిత్రమైన చేప అది!"

"ఆహా! చెప్పు, చెప్పు! ఎవరెవరొచ్చారు? ఏం జరిగింది? వివరంగా చెప్పు!"

"మీరీ వేషం ఎందుకు ధరించారు? సాయంకాలం ఎక్కడికి వెళ్ళారు? వెళ్ళిన చోట ఏం జరిగింది? అదంతా చెబితే ఇక్కడ జరిగింది చెబుతాను!"

"నేను చెప్పడానికి ఎక్కువగా ఏమీ లేదు. ఈ రోజు రాత్రి మొదటి జామున కొళ్ళిడం నదీతీరాన కాళాముఖుల మహాసంఘం సమావేశం కాబోతున్నారని విన్నాను. అక్కడ ఏం జరుగుతుందో చూసి తెలుసుకోవడానికే ఈ వేషం వేసుకొని వెళ్ళాను. చూసి వచ్చి కొళ్ళిడం తెప్ప కాలువ దగ్గర నిన్ను కలుద్దామనుకొన్నాను. మహాసంఘం సమావేశమయ్యారు. పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చారు. కాళాముఖుల పెద్ద గురువు కూడ వచ్చారు. కానీ ముఖ్యంగా ఎవరు వస్తారని ఎదురు చూశారో, ఆయన రానేలేదు!"

"యువరాజు మధురాంతకులనే కద వారెదురు చూశారు?"

"అవును. అది నీకెలా తెలుసు?"

"మధురాంతకులు తంజావూరు సింహాసనమెక్కితే, రాజ్య పాలన భలేగా ఉంటుంది!"

"ఎందుకలా అంటున్నావు?"

"ఒక మొరటు గుర్రాన్ని అదుపులోకి తేలేకపోయారు కదా? మరి పళువేట్టరయ్యర్‌లాంటి చిన్న రాజులను, కలహాలు పుట్టించే కాళాముఖ శైవులను, దెబ్బలాటకు దిగే వీరవైష్ణవులను వారెలాఅదుపులో ఉంచగలరు?"

ఆళ్వార్ కట్టియాన్ నవ్వేసి, "నీవొచ్చిన దారిలో మధురాంతకులను చూశావా? ఆయనకేమైంది?" అని అడిగాడు.

~

వంతిదేవుడు తాను మధురాంతకులను వెన్నంటి వచ్చిన విషయం, ఆయన గుర్రం ఉన్నట్లుండి దివిటీని చూసి గతి తప్పి పరుగెత్తిన విషయం, తాను ఆయనను కాస్త దూరం వెతుక్కొంటూ వెళ్ళిన విషయం, చివరిగా మిట్టపైన గుర్రాన్ని మాత్రం చూసిన విషయం వివరించాడు.

"అయ్యో, పాపం! గుర్రం ఆయన్ని ఎక్కడ పడేసిందో, ఏమో! అయన ప్రాణాలకు ఏదైనా ఆపద కలిగిందేమో! అందుకే ఆయన మహాసంఘానికి రాలేదు కాబోలు. మనం మళ్ళీ వెళ్ళి ఆయన్ని వెతుకుదామా?"

"బాగుంది! అందుగురించి మనకేల? మన పని మనం చూసుకొందాం, రా! బయల్దేరు వెంటనే! పొద్దు పొడిచేలోపు మనం కొళ్ళిడం నది తెప్ప కాలువ చేరుకోవాలి!"

"మధురాంతకులు ఏ కాలువలోనో, వరిపొలంలోనో పడి ప్రాణాలు కోల్పోయివుంటే...? అప్పుడు కూడ మనకేల అంటారా?"

"అలాగేం జరగదు. అనిరుద్ధులు అందుకు తగిన జాగ్రత్తలు తీసుకొనేవుంటారు."

"ముఖ్యమంత్రి అనిరుద్ధులా? ఆయనకు దీని గురించి ఏం తెలిసివుంటుంది?"

"అదేం అలా అడుగుతున్నావు? అణ్బిల్ అనిరుద్ధ బ్రహ్మరాయలకు తెలియకుండ ఈ రాజ్యంలో ఏదీ జరగ సాధ్యం లేదు."

"ఓహో! కడంబూర్ మాళిగలో జరిగిన కుట్ర గురించి కూడ ఆయనకు తెలుసా?"

"ఒక విషయాన్ని గుర్తు తెచ్చుకో. వీరనారాయణ పురం తిరునాళ్ళ సమయాన పళువూర్ రాణి పల్లకిని మనమిద్దరం ఒక చెట్టు కింద నిలబడి చూశాం కద?"

"అవును. పల్లకి తెర తొలగిన వెంటనే మీరు కనబరచిన ఆదుర్దా నాకింకా జ్ఞాపకముంది. పళువూర్ రాణికి ఒక తాళపత్రాన్ని ఇవ్వగలవా అని మీరు నన్ను అడిగారు!"

"నీవందుకు 'ఛీఛీ! అదేం పని?' అన్నావు. నేనేదో ప్రేమ సందేశం ఇవ్వదలచాననే నీవు భావించావు. కుట్రదారుల మాటలను విని మోసపోకూడదని మధురాంతకులను హెచ్చరించేందుకే నేను నిన్నా సహాయం కోరాను. ముఖ్యమంత్రి ఆజ్ఞ మేరకు!"

"అప్పుడు పల్లకిలో ఉన్నది మధురాంతకులని నీకు తెలిసిందా?"

"మొదట సందేహించాను. తెర తొలగగానే సందేహం వీడిపోయి రహస్యం తొలగిపోయింది. నీవు చాల మొండివాడివి. ఆ పల్లకిలో ఉన్నది మధురాంతకులని నేను నీకు ఎంత చెప్పినా కూడ, నీవొప్పుకోలేదు కద?"

“మీరు మాత్రం తక్కువ తిన్నారా? ఇవాళ సాయంత్రం ఎక్కడికి వెళ్ళబోతున్నారని చెప్ప నిరాకరించారు కద?”

“చెబితే నీవందులో కూడ తలదూర్చాలని మొండిపట్టు పట్టేవాడివి! ఇప్పటికే ఎంతటి సంకటంలో చిక్కుకొన్నావో చూడు! ఇక మీదనైనా...”

“కాళాముఖుల సంఘానికి మధురాంతకులు వెళ్ళాలనుకొంటున్నారని ముఖ్యమంత్రిగారికి తెలుసా?”

“తెలియకనా నన్ను పంపారు? అదే సమయాన మధురాంతకులు అక్కడికి వెళ్ళి చేరకుండడానికి కూడ ఆయన ఏర్పాట్లు చేసివుంటారు. ఎవరో దివటీ ఎత్తి పట్టుకోగా, దాన్ని చూసి ఆయన గుర్రం వెర్రెత్తినట్లు పరుగెత్తిందన్నావు కద, అదికూడ ఆయన పంపిన మనిషి చేసిన పనే అయివుంటుంది. కిందపడ్డ యువరాజును ఎవరైనా లేపి కాపాడివుంటారు.”

“ఇప్పటికి బహుశ ఆయన పల్లకో, రధమో ఎక్కి తంజావూరుకు వెళుతుంటారు. రా! మనం కూడ మన దారిన వెళదాం!”

“వైష్ణవులుగారూ! నేను రాలేను...”

“అదేమి? నీవొప్పుకొన్న కార్యం గతేమి? కాంచీపురం నుంచి ఆదిత్య కరికాలన్ బయల్దేరేశారని వింటున్నాను. మనం వెంటనే వాయువేగ, మనోవేగాలతో వెళితేనే...”

“ఆదిత్య కరికాలన్‌కి ఇవ్వవలసిన తాళపత్ర సందేశాన్ని మీరే ఇవ్వవచ్చు కద? ఆయన మధురాంతకునిలాగ స్త్రీవేషంలోను రారు; రాత్రి రహస్యంగా ప్రయాణమూ చేయరు...”

“నీవేం చేయబోతున్నావు?”

“నిజానికి నేను ఈ రోజు సాయంకాలం మధురాంతకులను వెన్నంటి బయలుదేరాను. ఇంకొకరి వెంబడి వెళ్ళనారంభించి, మధ్యలో మధురాంతకులను కాకతాళీయంగా చూడడం జరిగింది...”

“నేనొక జోస్యం చెబుతాను. నీవు వెంబడించింది ఒక స్త్రీమణిని అని నేను ఊహిస్తున్నాను.”

“మీరు మాచెడ్డవారు! ఒక రోజు మీ బుర్రను పగలగొట్టే తీరుతాను!”

“అది నీవల్ల కాని పని. ఇప్పటికే నా బుర్రను ఒక కాళాముఖునికి తాకట్టు పెట్టేశాను. అది పోతే పోనీ. నీవు కుడంద్దైనుంచి ఎవరిని వెంబడించి బయల్దేరావు? ఆ స్త్రీ ఎవరు?”

“కొడుంబాళూర్ రాకుమారి కుడంద్దై జ్యోతిష్కుల ఇంటికి వచ్చింది. పల్లకిలో ఎక్కి ఒంటరిగా బయలుదేరింది. నిజానికి చిత్త భ్రమకు లోనైన ఆ అమ్మాయి వెంట నేను బయలుదేరలేదు. ఆమె పల్లకి నేను వెళ్ళవలసిన దారిలో కాస్త దూరం వరకు వెళ్ళింది. ఉన్నట్లుండి కొందరు మనుషులు వచ్చి ఆమె పల్లకిని ముట్టడించారు. తోడు వెళుతున్న దాది అమ్మాయిని ఒక చెట్టుకు కట్టేసి వాణతిని మాత్రం తీసుకొని వెళ్ళారు. వైష్ణవులుగారూ! ఆ అమ్మాయి గతి ఏమైందని తెలుసుకోకుండ నేను మీవెంట రావడానికి నా

మనసొప్పడం లేదు....”

“అ అమ్మాయి గురించి నీకెందుకంత దిగులు?”

“అదేం అలా అడుగుతున్నారు? ఆమె లంకమీద దండెత్తి వెళ్ళిన మహావీరుడు చిన్న వేళార్ కుమార్తె కద? పళైయార్రై యువరాకుమారి మనసు చూరగొన్న సెచ్చెలి కూడాను కద? పైగా, పొన్నియిన్ సెల్వన్‌కి ఆమెనిచ్చి పెళ్ళి చేయాలని ఒక ప్రస్తావన ఉంది కద?”

“అబ్బాయీ! పొన్నియిన్ సెల్వన్ కడలిలో మునిగి చనిపోయారు కద? ఆయన వివాహం గురించి ఇప్పడేం దిగులు?”

“ఆయన చనిపోయారని మీకు ఖచ్చితంగా తెలుసా? అంతా ఊహాగానమే కద?”

“అలాగైతే ఆయన సజీవంగా ఉండవచ్చని నీవనుకొంటున్నావా?”

“వైష్ణవులుగారూ! నా నోరు విప్పి/పెకలించి ఏదైనా రహస్యం రాబట్టుకొందామనే ఉద్దేశముంటే, దాన్ని మరిచిపోండి!”

“సరే! సరే! నీవు చాల మొండివాడివి అన్న విషయం నాకు తెలుసు. కానీ వాణతీదేవి గురించి నీవు దిగులు పడకు. యువరాకుమారికి ఆమె అంటే ప్రాణమని నీకు తెలుసు కద?”

“అందుకే నేను దిగులు పడుతున్నాను. వాణతీదేవికి ఇలా ఒక అపాయంలో చిక్కుకొన్నారన్న విషయం యువరాకుమారికి తెలియకపోవచ్చు కద?”

“ఇవాళ తెలియకపోతే రేపు తెలుస్తుంది!”

“రేపు తెలిసి ఏం ప్రయోజనం? కాళాముఖులు ఈ రాత్రి ఆ కన్యను బలిచ్చేస్తే...?”

“కాళాముఖులు వాణతిని అటకాయించి ఎత్తుకొని వెళ్ళారంటున్నావు?”

“అలాగనే నాకనిపించింది. వాణతి దాది కూడ అలాగే చెప్పింది!”

“అదే నిజమైతే, నీవేమాత్రం దిగులు పడనవసరం లేదు. కొడుంబాళూర్ వంశస్థులు కాళాముఖ శైవ మతానికి చెందినవారు. వాణతీదేవి కొడుంబాళూర్ రాకుమారి అని తెలిస్తే, కాళాముఖులు ఆమెకు రాజోపచారాలు చేస్తారు!”

“ఓహో! ఇది నాకు తెలియకుండ పోయింది కద!”

“అందుకే కాళాముఖులు మధురాంతకులకు వ్యతిరేక పక్షంగా ఉన్నారు...”

“ఈ పుర్రె స్వాములు వ్యతిరేకులైతే అందువల్ల నష్టమేమి?”

“నీకు తెలియదు. ఈ నాడులో పెద్ద కుటుంబాలవారు కాళాముఖ శైవమతానికి చెందినవారు. సైన్యంలో కూడ అలా పలువురున్నారు. అందుకే పెద్ద పళువేట్టరయ్యర్ ఇవాళ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మధురాంతకులకు కాళాముఖుల ఆదరం వెతకజూశారు! అది ఒక గుర్రం చేసిన మొరటు పని వల్ల చెడిపోయింది. నీవు బయల్దేరు, వెళదాం! లేక, నేను బయల్దేరనా?”

వంతిదేవుడు అయిష్టంగా లేచి గుర్రాన్ని చేతబట్టుకొన్నాడు. ఆ దట్టమైన అడవిలో ఒక మనిషి చొరగల దారిని వెతికి పట్టుకొని వారు బయటపడ్డారు.

'అదిగో చూడు!" అని ఆళ్వార్ కట్టియాన్ ఆకాశంవైపు చూపించాడు.

ధూమకేతువనే ఆ తోకచుక్క మునుపటికన్న చాల పొడపై, ఆకాశాన్ని సగం కమ్ముకొంది.

చల్లని ఈదురుగాలి వీయనారంభించింది. వంతిదేవుని ఒళ్ళు జలదరించింది.

దూరాన ఒక ఊరకుక్క దీనస్వరంతో ఏడుపురాగం తీసింది.

~~~
~~~

# అధ్యాయము - 38

## వాణతి గతి!

**సూర్యుడస్తమించి** నలుదిక్కులా చీకటి కమ్ముకొంటున్న వేళ వాణతి పల్లకిలో కుడంద్రై - తిరువారూర్ రాజబాటలో వెళుతూంది. ఆమె మనసు ఆలోచనల్లో మునిగివుంది. నాగపట్టణపు చూడామణి విహారానికి వెళ్ళాలని, అక్కడ చలిజ్వరంతో మంచం పట్టివున్న యువరాజుకు శైత్యోపచారాలు చేయాలని ఆమె మనసు తల్లడిల్లింది. కానీ అది ఎలా సాధ్యం? బౌద్ధ విహారం లోపల తాను ప్రవేశించేందుకు అనుమతిస్తారా? అక్కడ యువరాజును చూడ సాధ్యమవుతుందా? చూసినా ఉపచారాలు చేయనిస్తారా? - అని ఆలోచించినప్పుడు చాల దిగులుగా అనిపించింది. నాగపట్టణానికి ఒంటరిగా ప్రయాణం చేయవలసిన విషయం గురించి ఆలోచించినప్పుడు అధైర్యపడింది. ఆ అధైర్యాన్ని పోగొట్టి తనకు తానే ధైర్యం చెప్పుకోవడానికి ప్రయత్నించింది. ప్రపంచంలో ఏ పెద్ద కార్యం సులభసాధ్యం? ఒక్కొక్కరు తాము చేబట్టిన కార్యాన్ని సాధించేందుకు ఎన్నెన్ని కష్టాలు పడుతున్నారు? ఆ పడవ నడిపే పిల్ల సముద్రంలో ఒంటరిగా పడవ నడుపుకొంటూ వెళ్ళేందుకు ఎంత మనోధైర్యం కలిగివుండాలి? సుడిగాలి, తుఫానులోను, వానలోను, కొండంత అలల మధ్య పడవ నడుపుకొంటూ వెళ్ళి యువరాజును కాపాడి తీసుకొని వచ్చేందుకు ఆమెకు ఎంతటి మనోధైర్యం కావాలి? తాను ఈ చిన్న ప్రయాణం గురించి భయపడడం ఎంతటి పిరికితనం? చూడామణి విహారంలోపలికి వెంటనే వెళ్ళలేకుంటే ఫరవాలేదు. చుట్టుపక్కల ఉండి యువరాజును గురించి తెలుసుకొంటూంటే అదే చాలు. యువరాజును చూడలేకపోయినా ఫరవాలేదు; ఆ పడవ పిల్లనైనా చూడగలిగితే చాలు. అవును; అదే సరి! ఆమెనెలాగైనా కనిపెట్టగలిగితే ఆమె ద్వారానైనా యువరాజును చూడగలిగినా చూడవచ్చు. ఆయనపైన తనకున్న ప్రేమ ఏదో ఒక స్వప్రయోజనాన్ని ఎదురుచూసి పెంచుకొన్నది కాదని ఎలాగైనా నిరూపించి చూపించాలి. ఆ తర్వాత అసువులు బాసినా ఫరవాలేదు; లేక బుద్ధ సంఘంలో చేరి బౌద్ధ భిక్షుణిగా మారిపోయినా ఫరవాలేదు.

మరునాడు ఎంతసేపటికి నాగపట్టణం చేరగలుగుతామని పల్లకి బోయీలను అడిగేందుకు తెరను కాస్త తొలగించి చూసింది. దారి పక్కన ఏపుగా పెరిగిన చెట్ల వెనక ఏవో ఆకారాలు పొంచివున్నట్లనిపించింది. ఇంకాస్త పరీక్షగా చూసింది. వారు వీరశైవ కాళాముఖులని తెలిసింది. అందు గురించి వాణతికి ఏమాత్రం దిగులుగాని, భయంగాని కలగలేదు. ఆమె కొడుంబాళూర్ అంతఃపురంలో పెరిగే రోజుల్లో కాళాముఖులు తరచూ వచ్చేవారు. ఆమె పెదతండ్రిగారిని దర్శించి, వారికి కావలసిన వస్తువులను తీసుకొని వెళ్ళేవారు. కాళాముఖుల పెద్ద గురువే ఒకసారి కొడుంబాళూరుకు వచ్చారు. ఆయనకు ఉపచారాలు, పూజలవీ జరిగాయి. ఆమె పెదనాన్న పెద్ద వేళార్ ఆ కాళాముఖులకు గుళ్ళలో అన్నదానం

కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయించారు. కాబట్టి కాళాముఖులు తనకే హానీ చేయరు. ఒకవేళ సహాయం చేసినా చేయవచ్చు. ఇవాళ వారి మహాసంఘం సమావేశమవుతున్నారని వాణతికి తెలుసు. కాబట్టి ఇవాళ ఉదయం పళైయారైనుంచి కుడంద్దైకి వచ్చేటప్పుడు కూడ కాళాముఖుల గుంపును దారిన చూడడమైంది. అయినా కూడ వీరెందుకు చెట్టు వెనక దాక్కొని నిలబడ్డారు? తనని ఇంకెవరో అనుకొని తనకేమైనా హాని చేయజూస్తారా?

ఇలా ఆమె ఆలోచిస్తుండగానే, అలా దాక్కొనివున్నవారు గబగబా పరుగెత్తి వచ్చి పల్లకిని చుట్టుముట్టారు. అప్పుడు కూడ ఆమె భయపడలేదు. తానెవరని వారికి తెలియజెప్పాలనుకొంది. ఎలా చెప్పాలి అని ఆలోచించేలోపు, పల్లకితో వచ్చిన దాది అమ్మాయిని ఇద్దరు పట్టి చెట్టుకు కట్టేయడాన్ని చూసింది. వెంటనే ఆమెకు తెలియకనే భీతితో కూడిన 'కెవ్వు మన్న కేక ఆమె నోటినుంచి వెలువడింది. పల్లకిని చుట్టుముట్టిన కాళాముఖులలో ఒకడు తన త్రిశూలాన్ని ఆమె ముఖం ముందు ఝళిపిస్తూ, “అమ్మాయి! కేకలేయకు! అరవకుంటే నిన్నేం చేయము. లేకపోతే ఈ శూలంతో పొడిచి చంపేస్తాం!” అన్నాడు.

వాణతికి కాస్త ధైర్యం వచ్చింది. గంభీరంగా మాట్లాడదలచి, “నేనెవరో తెలుసా? కొడుంబాళూర్ వేళార్ కుమార్తెను. నన్ను తాకితే, మీరంతా నిర్మూలమైపోతారు!” అన్నది. ఆమె మనసులో ధైర్యం వచ్చిందిగాని, మాట్లాడేటప్పుడు గొంతు వణికింది. అది విన్న కాళాముఖుడు, “మాకంతా తెలుసు. తెలిసే ఇక్కడ నీకోసం వేచివున్నాము. కాసేపు నిశ్శబ్దంగా ఉండు. లేకపోతే...” అని చెప్పి మళ్ళీ త్రిశూలాన్ని ముందుకు చాచాడు.

అదే సమయాన కొరడాతో 'చుర్రు మని ఎవరినో కొట్టిన శబ్దమూ, 'అయ్యో 'అయ్యో అన్న కేకలు వినిపించాయి. అలా దెబ్బలు తిన్నవారు పల్లకి బోయీలని వాణతి గ్రహించింది. వారిని ఆ కాళాముఖులు కొరడాతో కొట్టివుండాలి!

అందునుంచి వాణతి కోపోద్రిక్తురాలై పల్లకినుంచి దిగాలని ప్రయత్నించింది. అందుకు అవకాశమే చిక్కలేదు. ఎందుకంటే, పల్లకి బోయీలు పల్లకినెత్తుకొని పరుగెత్తనారంభించారు. వారి వెంబడి కాళాముఖులు కూడ పల్లకిని చుట్టుముట్టినట్లు పరుగెత్తి రాసాగారు. పరుగెత్తేటప్పుడు వారు భయంకరంగా అరుస్తూ పరుగెత్తారు. కాబట్టి వాణతి తాను కేకలేయడంవల్ల ప్రయోజనం లేదని గ్రహించింది. పరుగెడుతున్న పల్లకినుంచి కిందకు దూకడం కూడ సులభసాధ్యం కాదు. అలా దూకినా కూడ, ఈ భయంకర మనుష్యుల మధ్యనే కద దూకాలి? వీరు తనని ఎక్కడికి తీసుకొని వెళుతున్నారు, ఎందుకు తీసుకొని వెళుతున్నారో చూద్దామన్న ఆలోచన కూడ మధ్య మధ్య తోచసాగింది.

సుమారు అర్ధ గడియసేపు పరుగెత్తిన తర్వాత చెట్ల మరుగునున్న ఒక దుర్గాదేవి గుడి దగ్గరకు వచ్చి ఆగారు. ఇంతలో బాగా చీకటి ముసురుకొంది. ఒకడు గుడిలోపలికి వెళ్ళి అక్కడ వెలుగుతున్న దీపాన్నొకదాన్ని తీసుకొని వచ్చి వాణతి ముఖానికి ఎత్తి పట్టాడు. కాళాముఖులలో ఒకడు వాణతిని

నిశితంగా చూస్తూ, “అమ్మాయీ! మేమడిగే వివరాలు చెప్పేయి! నిన్నేమీ చేయకుండ విడిచిపెట్టేస్తాము. లేక నీవు ఎక్కడికి వెళ్ళగోరుతున్నావో అక్కడికి భద్రంగా తీసుకొని వెళ్ళి చేరుస్తాము!” అన్నాడు.

వాణతి మనసులో ఇది వరకు తోచని ఒక  సందేహం ఇప్పుడు ఉదయించింది. “నాకేం వివరాలు తెలుసు? నన్నేం అడగబోతున్నారు?” అన్నది.

“అమ్మాయీ! నీవెవరినో ఒకరిని రహస్యంగా కలిసేందుకే ఇలా ఒంటరిగా ప్రయాణం చేస్తున్నావు కద? వారెవరు? ఎవరిని కలిసేందుకు బయలుదేరావు?”

వాణతి సందేహం దృఢపడింది. ఒక్క క్షణంలో ఆమె మనసులో ఒక పెద్ద మార్పు వచ్చింది. ఒక చిన్న శబ్దాన్ని విన్నా కూడ భయపడే ఆడజింక ప్రపంచంలో దేనికీ భయపడని సింహంగా మారింది.

“నేనెవరిని కలిసేందుకు బయలుదేరితే మీకేమి? మీరెవరు అది అడిగేందుకు? నేను చెప్పను!” అని మొండికేసింది.

కాళాముఖుడు నవ్వాడు.

“అది నీవు చెప్పనవసరం లేదు. మాకు తెలుసు. యువరాజు అరుళ్మొళి వర్మను కలిసేందుకే నీవు బయల్దేరావు. ఆయనెక్కడ దాక్కొని వున్నారని చెప్పేసేయి. నిన్నేమీ చేయక వదిలిపెట్టేస్తాము" అన్నాడు.

“మీరేమైనా చేసుకోండి. నానుంచి ఏ వివరాలూ రాబట్టుకోలేరు" అని మొండిగా జవాబిచ్చింది.

“నిన్నేమైనా చేయవచ్చనా అన్నావు? మేము చేయబోతున్నది చెబితే ఇలా జవాబిచ్చేందుకు తెగించవు!”

“ఏం చేయబోతున్నారు? అది కూడ చెప్పండి. నేనూ వింటాను!”

“మొదట నీ అందమైన చేతుల్లో ఒకదాన్ని ఈ దివిటీ జ్వాలలో పెట్టి కాల్చుతాము. తర్వాత ఇంకొక చేతిని కూడ కాల్చుతాము. తర్వాత నీ నల్లటి జుట్టుకు నిప్పంటిస్తాం...”

“అలాగే చేయండి. ఇదిగో నా చేతులు! దివిటీని దగ్గరికి తీసుకొని రండి!”

రాజ్యంలో జరుగుతున్న కుట్రలు వాణతికి ఒకింత తెలిసేవున్నాయి. ఈ దుష్టులు కుట్రదారుల మనుషులై ఉండాలి. యువరాజు ఉన్న చోటు కనిపెట్టజూస్తున్నారు. ఆయనకు హాని చేసే ఉద్దేశంతోనే ఉండాలి. ఆయన రక్షణ కోసం తానింతటి క్రూరహింసలకు లోనుకావలసివస్తే, దాని కన్న గొప్ప భాగ్యమేముంటుంది? - ఇలా ఆలోచించింది కొడుంబాళూర్ రాకుమారి వాణతి. ఆ ఆలోచనే ఆమెకు అంతటి మనోధైర్యాన్నిచ్చింది.

“అమ్మాయీ! ఆలోచించి చూడు! వృధాగా మొండికేయకు. తర్వాత విచారిస్తావు!” అన్నాడు కాళాముఖుడు.

“నన్ను మీరు అణువణువూ కాల్చి, కోసి చంపండి. కానీ నానుంచి మీరు ఏ వివరాలూ

తెలుసుకోలేరు!" అన్నది వాణతి.

"అలాగైతే మా పని మొదలెట్టాల్సిందే! శిష్యా! తీసుకురా ఆ దివిటీని!" అన్నాడూ కాళాముఖుడు.

ఆ సమయాన వాణతి దృష్టి కాస్త దూరాన మళ్ళింది. ఏనుగులు, గుర్రాలు, పల్లకీలు, పదాతివీరులు మొదలైన వారితో కూడిన ఒక పెద్ద ఊరేగింపు వారున్న చోటువైపే రాసాగింది. దేవుని దయవల్ల తనకు ఏదో ఒక ఎదురుచూడని సహాయం వస్తూందని తలచింది.

"జాగ్రత్త! అదిగో చూడండి!" అని వేలెత్తి అటువైపు చూపించింది.

కాళాముఖుడు మళ్ళీ నవ్వాడు.

"వస్తున్నది ఎవరని నీకు తెలుసా?" అని అడిగింది వాణతి.

"ముఖ్యమంత్రి అనిరుద్ధులులాగుంది. నేనిప్పుడు కేకవేస్తే వారికి వినిపిస్తుంది. జాగ్రత్త! నన్ను విడిచిపెట్టి పారిపొండి! లేకపోతే..." అన్నది వాణతి.

"అవునమ్మాయి! వస్తున్నది ముఖ్యమంత్రి అనిరుద్ధులే! వారి ఆజ్ఞమేరకే మేము నిన్ను పట్టుకొచ్చాము!" అన్నాడు కాళాముఖుడు.

ఇప్పుడు మళ్ళీ వాణతి మనసులో దిగులు నిండుకొంది. ఆమెకు తెలియకనే ఆమె గొంతునుంచి భీతి నిండిన కేక ఒకటి వెలువడింది. దాన్ని నొక్కి పెట్టేందుకు తన నోటిని తానే కప్పుకోజూసింది.

~~~
~~~

# అధ్యాయము - 39

## గజేంద్రమోక్షం

**ఇంతసేపూ** వాణతి పల్లకి లోపలే ఉంది. ఇప్పుడు బోయీలు పల్లకిని దింపి నేలమీద పెట్టారు. వాణతి పల్లకినుంచి బయటకు వచ్చి నిలబడింది, సమీపిస్తున్న ఊరేగింపును చూస్తూ. కాళాముఖులు కూడ అదే దిక్కున చూస్తూ మౌనంగా నిలబడ్డారు. నీరు నిండిన కుంటల్లో కప్పల బెకబెకలు, ఈదురుగాలి హెూరు మాత్రమే అప్పుడక్కడ వినిపించిన శబ్దాలు.

పరుగెత్తి తప్పించుకొందామనే ఆలోచనే రాలేదు వాణతికి. అది అసాధ్యమని ఆమె గ్రహించింది. ఈ కాళాముఖుల నుంచి ఏదైనా యుక్తి పన్ని తప్పించుకోవచ్చు. కానీ అణ్బిల్ అనిరుద్ధుల నుంచి తప్పించుకోవడం కలలో కూడ సాధ్యం కాని పని. ఆయన తెలివితేటలు, శక్తియుక్తులు, మంత్రాలోచనాశక్తి జగద్విదితం. అదీగాక, ఆయన చక్రవర్తి దగ్గర చాల పలుకుబడి ఉన్నవారన్నది కూడ అందరికీ తెలిసిందే. పళైయార్రై అంత:పురంలోని స్త్రీలు చోళ సామ్రాజ్యపు అధికారుల గురించి, చిన్నరాజులు, సామంతుల గురించి చాడీలు మాట్లాడుతారు. కానీ అనిరుద్ధుల గురించి ఏమీ మాట్లాడరు. అంత:పురం లోపలి గదుల్లో అంతరంగంగా మాట్లాడినా కూడ ఆయన చెవికి చేరిపోతుందని భయపడేవారు. చక్రవర్తి దేన్ని సహించినా కూడ, తన అంతరంగ ప్రేమాభిమానాలకు పాత్రుడైన ముఖ్యమంత్రి గురించి ఎవరు ఎటువంటి అపనింద గాని, ఒట్టిమాటలుగాని మాట్లాడడాన్ని సహించరని వారందరూ ఎరుగుదురు.

ఇవన్నీ వాణతికి కూడ తెలుసు. యువరాకుమారి కుందవైకి కూడ ఆయన పట్ల మిక్కిలి గౌరవముందని ఆమె ఎరుగును. కాబట్టి వారినుంచి సహాయమూ, రక్షణ దొరుకుతుందని ఎదురు చూసింది. కానీ ఈ కాళాముఖులు దానికి విరుద్ధంగా మాట్లాడగానే, ఆమె మనోధైర్యం సడలిపోయింది. అయన ఈ అనాధపిల్లను ఎందుకు బంధించమని ఆజ్ఞాపించారు...? ఒకవేళ వీరు అబద్ధం చెబుతున్నారో, ఏమో! వస్తున్నది బహుశ పళువేట్టరయ్యరై ఉండవచ్చు. లేక, మధురాంతకులు, ఆయన పరివారం కావచ్చు... ఎవరైనా కానీ, ఒకటి మాత్రం ఖాయం. యువరాజు గురించి తనకు తెలిసిన రహస్య సమాచారాన్ని మాత్రం ఎవరికీ చెప్పకూడదు. అందువల్ల తనకు ఏమైనా సరే! ఇలా నిశ్చయించుకొన్న తర్వాత, సడలిన ఆమె మనోధైర్యం తిరిగి వచ్చింది. రానీ, ఆ వచ్చేవారు ఎవరైనా కానీ. నేను కొడుంబాళూర్ వీర వేళార్ పరంపరలో వచ్చిన దాన్ని అన్న నిజాన్ని నిరూపిస్తాను. కుందవైదేవి అంతరంగ స్నేహితురాలన్నది కూడ చూపిస్తాను.

ఊరేగింపునుంచి ఒక పల్లకి మాత్రం వేరుపడి ముందుకు వచ్చి నిలిచింది. తక్కిన ఏనుగులు, గుర్రాల పరివారమంతా కాస్త దూరాన నిలబడ్డారు.

ముందుకు వచ్చిన పల్లకి వాణతి దగ్గరకు రాగానే కిందకు దించబడింది. దాని లోపలినుంచి

ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు బయటకు వచ్చారు.

ఆయన సైగ చేయగానే పల్లకి బోయీలు, కాళాముఖులు కాస్త దూరాన వెళ్ళి నిలబడ్డారు.

~

అనిరుద్ధులు వాణతిని ఎగాదిగా చూసి, "ఇదేం వింత? నేను చూస్తున్నది కలా, నిజమా? నా ముందు నిలబడ్డది కొడుంబాళూర్ రాకుమారే కదా? లంక యుద్ధంలో వీర స్వర్గం పొందిన పరాంతక చిన్న వేళార్ ప్రియ పుత్రిక వాణతే కదా?" అని అడిగారు.

"అవునయ్యా! నేను చూస్తున్నది కూడ కలే కదా? నా ముందు నిలబడ్డవారు చోళ సామ్రాజ్య ప్రజల భయభక్తి మర్యాదలకు పాత్రులైన ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలే కదా? చక్రవర్తి అంతరంగ అభిమానాన్ని చూరగొన్న ముఖ్యమంత్రిగారే కదా?" అన్నది వాణతి.

"తల్లీ! నేనెవరినని నీవు తెలుసుకొన్నందుకు సంతోషం. అందువల్ల నా పని సులభమవుతుంది. నీకు ఎక్కువ కష్టం ఇవ్వనవసరం రాదు."

"ఆహా! అందుగురించి మీరు దిగులుపడనవసరం లేదు. మీవంటి అమాత్య తిలకం వల్ల నాకు కష్టం కలిగితే నేనది లెక్క చేయను. దాన్ని కష్టంగానే పరిగణించను."

"నీమాటలు నాకు తృప్తినిస్తున్నాయి. నిన్ను అధికంగా కష్టపెట్టే ఉద్దేశం నాకు లేదు. నిన్ను ఒకట్రెండు ప్రశ్నలడగబోతున్నాను. అందుకు సమాధానం చెబితే చాలు. తర్వాత...."

"అయ్యా! మీరు నన్ను ప్రశ్నించే ముందు నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలి..."

"అడుగమ్మా! భయపడకుండ అడుగు. నేను నీ తండ్రిలాంటివాడిని. నిన్ను నా కన్న కూతురిలాగే భావిస్తున్నాను. కొన్నిరోజుల క్రితం నీ పెదతండ్రి సేనాధిపతి బూది విక్రమ కేసరిని మామిడితోపులో చూశాను. నిన్ను నా కూతురిగా ఎంచి చూసుకోవాలని చెప్పారు. అలాగేనని మాటిచ్చాను."

"వందనం, నా తండ్రీ! చిరుప్రాయంలో తండ్రిని కోల్పోయిన నన్ను తన కూతురిగా చూసుకొంటానని చక్రవర్తి మునుపొకసారి మాటిచ్చారు; ఇప్పుడు మీరు కూడ నన్ను తండ్రిగా చూసుకొంటానంటున్నారు. ఇక నాకేం కొరత?"

"నీవు నన్ను అడగదలుచుకొన్నది శీఘ్రంగా అడుగు తల్లీ! ఆకాశంలో నల్లని మబ్బులు ముసురుకొంటున్నాయి. వాన ఎప్పుడైనా రావచ్చు."

"తండ్రీ! బాట వెంబడి పల్లకిలో వెళుతున్న నన్ను కాళాముఖులను పురమాయించి ఆపించి, బంధించి ఇక్కడికి రప్పించింది మీరేనా? ఈ అబల చేతిని దివిటీ జ్వాలలో కాల్చమని చెప్పింది కూడ మీరేనా? ఆ భయంకరమైన మనుషులు మీపైన అలా నింద వేశారు. నేనది నమ్మలేదు..."

"బిడ్డా! నీవు చెప్పింది నిజమే. నేనే వీరినలా ఆజ్ఞాపించాను. అది నేరమైతే అందుకు నేనే

బాధ్యుడిని....”

“ముల్లోకాల్లో పేరుప్రఖ్యాతులు గాంచిన చోళసామ్రాజ్య ముఖ్యమంత్రిగారూ! మీమాట నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ’నేరమైతే  అంటున్నారే! మీరు సకల ధర్మ శాస్త్రాలను, నీతి శాస్త్రాలను చదివినవారు. చోళసామ్రాజ్యపు చట్టాలు పరిపాలించబడేటట్లు చూసే బాధ్యత కలిగినవారు. న్యాయానికి వ్యతిరేకంగా చక్రవర్తే ఏ కార్యమైనా చేస్తే ఆయనను ఖండించి న్యాయపరిపాలన జరిగేటట్లు చూసే హక్కుకలవారు. ఒక కార్యం నేరమా, కాదా అని మీకు తెలియకపోతే, ఇంకెవరికి తెలుస్తుంది? దారిన ఒంటరిగా వెళుతున్న ఒక అబలను అటకాయించి బలవంతంగా ఒక ఏకాంత ప్రదేశానికి తీసుకురావడమూ, ఆమెను చిత్రహింస పెడతామని భయపెట్టడమూ నేరమా కాదా అని మీకు తెలియకపోతే, ఇంకెవరిని అడిగి తెలుసుకోవాలి? సుందర చోళ చక్రవర్తి సామ్రాజ్యంలో రహదారి ప్రయాణంలో ఎటువంటి ఆపదా కలగదని విన్నాను. అందులోను, స్త్రీలకు హాని కలిగించే దుష్టులకు కఠిన దండన విధించబడుతుందని కూడ విన్నాను. అది నేరమా, కాదా అన్న సందేహం మీకు కలగడం విచిత్రమైన, ఆశ్చర్యమైన విషయం కద?”

~

ముఖ్యమంత్రి అనిరుద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యలో రెండుసార్లు అడ్డుపడి మాట్లాడ ప్రయత్నించికూడ ప్రయోజనం లేకపోయింది. ఇప్పడాయన కఠినంగా, “అమ్మాయీ! కాస్త ఓపిక పట్టు! నీ వాక్పరిమనంతటినీ ఇప్పడే చూపించేయకు! ’నేరమా, కాదా  అని నేను సందేహపడేందుకు కారణం లేకపోలేదు. అది నేను నిన్ను అడగబోయే ప్రశ్నలకు నీవిచ్చే సమాధానాలమీద ఆధారపడివుంటుంది. ముఖ్యంగా, ఒక రాజ్యాంగ రహస్యం ఎరిగిన ఒక స్త్రీ నాగపట్టణం రాజబాటలో వెళుతున్నట్లు నేను విన్నాను. ఆ స్త్రీ/అమ్మాయిని అడ్డగించి ఆపమని నేను నా మనుషులను ఆజ్ఞాపించాను. వారు నా ఆజ్ఞను నెవవేర్చారు. ఒకవేళ వారు తప్పేమైనా చేసివుండవచ్చు. రాజకీయ సంబంధమైన ఒక కుట్రలో భాగం వహిస్తున్న ఆ అమ్మాయికి బదులు, కుడంద్తై జ్యోతిష్కుల వద్ద జోస్యం అడిగి తెలుసుకొని తిరిగి వెళుతున్న నిన్ను బంధించి ఉండవచ్చు. కూతురా! నీవే చెప్పు! కుడంద్తైనుంచి పళైయారైకి తిరిగి వెళ్ళడం నీ ఉద్దేశమా? లేక, పల్లకి బోయీలు పొరబాటున నిన్ను నాగపట్టణం వైపు తీసుకు వెళ్ళారా? రాజ్యాంగానికి విరుద్ధంగా కుట్ర చేసిన ఒకడిని రహస్యంగా నాగపట్టణంలో కలిసేందుకు నీవు నాగపట్టణానికి బయలుదేరలేదు కద...? కాదని నీవు చెప్పి నిరూపిస్తే, వీరు చేసింది నేరమే. అందులో నాకూ భాగముంది. ఏమంటావమ్మా! ఇంకా విశదంగానే అడుగుతాను. యువరాజు అరుళ్మొళి వర్మను రహస్యంగా కలిసేందుకు నీవు నాగపట్టణానికి బయల్దేరలేదు కద...?”

రాకుమారి వాణతి దిగ్భ్రాంతి చెందింది. ముఖ్యమంత్రిని కాల్చేయాలన్నంత కోపం వచ్చింది. కానీ ఆ కోపాన్ని బయటకు చూపించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించింది. కల్లాకపటం తెలియని ఆ అమాయకురాలికి ఉన్నట్లుండి లోతుగా ఆలోచించే శక్తి, తంత్రాలోచనా శక్తి పుట్టుకొచ్చాయి. ముఖ్యమంత్రి

ప్రశ్నకు తిన్నగా జవాబివ్వక, “అయ్యా! ఇదేం మాట? యువరాజు అరుళ్మొళి వర్మనా రాజ్యాంగానికి విరుద్ధంగా కుట్ర చేశారని అంటున్నారు? చక్రవర్తి ప్రియపుత్రుని గురించి మీరిలా మాట్లాడడం నేరం కాదా? చోళకులానికి వ్యతిరేకంమైన కుట్ర కాదా? ఆహా! ఇది నేను వెంటనే కుందవైదేవికి చెప్పి తీరాలి!” అన్నది.

“భేష్షుగా చెప్పు, తల్లీ! నా ప్రశ్నకు సమాధానం చెప్పిన తర్వాత ఒక్కక్షణం కూడ ఇక్కడ నీవు ఆలస్యం చేయనవసరం లేదు. నేనే నిన్ను యువరాకుమారి వద్దకు భద్రంగా తీసుకొని వెళ్ళి చేరుస్తాను.”

“తమ ప్రశ్నకు బదులు చెప్పకుంటే....?”

“చెప్పకుంటే అన్న ప్రసక్తే లేదు, తల్లీ! ఈ ముసలాడినుంచి ఎవరూ అంత సులభంగా తప్పించుకోలేరు. నా ప్రశ్నకు బదులు చెప్పి తీరాలి!” అన్నారు అనిరుద్ధ బ్రహ్మరాయలు.

“అయ్యా! సర్వశక్తులున్న ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలుగారూ! ఏ శక్తీ లేని ఈ అబల నుంచి మీరు యువరాజు గురించి ఏమీ తెలుసుకోలేరు. కాసేపటికి మునుపు ఈ యమకింకరులు బయపెట్టినట్లు నా చేతులను దివిటీ జ్వాలలో కాల్చినా ఏమీ చెప్పబోను.”

“కొడుంబాళూర్ వీరవేళార్ వంశంలో పుట్టిన రాజపుత్రీ! నీ మనోధైర్యం చూసి మెచ్చుకొంటున్నాను. కానీ యువరాజు గురించి నీవు ఏ వివరాలూ చెప్పనన్నావు కద, అది సరి కాదు. ఇప్పటికే నీవు కొన్ని వివరాలు చెప్పేశావు. ఇంకా ఒక విషయాన్ని కూడ చెప్పేస్తే, అధికనష్టమేమీ కలగబోదు. నా పని కూడ సులువైపోతుంది...”

~

వాణతి ఇంకోసారి ఉలిక్కిపడింది. నోరుజారి ఏదైనా చెప్పేశామా అని ఆలోచించినప్పుడు ఆమె గుండెనెవరో గట్టిగా నొక్కినట్లనిపించింది. ఒడలంగా వణికింది. 'లేదు, నేనేమీ నోరు జారలేదు. ఈ ముసలాయన నన్ను ఏమార్చేందుకు చూస్తున్నారు  అని తనకు తానే చెప్పకొని కాస్త ధైర్యం తెచ్చుకొంది.

“అయ్యా! వేదాలు పఠించే మీ నోట అబద్ధాలు రావచ్చా? సుందర చోళ చక్రవర్తి ముఖ్యమంత్రి లేనిది ఉన్నట్లు కల్పించి చెప్పవచ్చా? నేను యువరాజు గురించి ఏమీ చెప్పలేదే? నేనేదో చెప్పానంటున్నారు?” అన్నది.

“అలోచించి చూడు, తల్లీ! బాగా ఆలోచించి చూడు! ఒక విషయం గురించి మాట్లాడకనే దాని గురించిన వివరాలు చెప్పేయడం అసాధ్యం అని నీవు భావిస్తే అది తప్పు. నీవు చెప్పక చెప్పిన వివరాలు సూచిస్తాను, విను! యువరాజు అరుళ్మొళి వర్మ సముద్రంలో మునిగి చనిపోయారని లోకమంతా చెప్పకొంటోంది. కుటుంబీకులు, అధికారులు - అందరూ శోకసముద్రంలో మునిగివున్నారు. నీకూ ఆ విషయం తెలుసు. అలా ఉన్నప్పుడు నీవు యువరాజు గురించి ఒక్క వివరమూ చెప్పను అన్నావు. దాన్నుంచి తెలిసేదేమి? యువరాజు చనిపోలేదని నీకు తెలుసని నిర్ధారమయింది. ఆయనను చూసేందుకు నీవు నాగపట్టణానికి వెళుతున్నావని నేనన్నప్పుడు నీవు దాన్ని ఖండించలేదు. 'చనిపోయిన

యువరాజును నేనెలా చూడగలను?' అని నీవడగలేదు. 'నాగపట్టణానికి వెళ్ళడం లేదు, ఇంకోచోటికి వెళుతున్నాను అని నీవనలేదు. కాబట్టి యువరాజు నాగపట్టణంలో సజీవంగా ఉన్నారు అన్న విషయమూ, ఆయనను చూడబోతున్నావు అన్నవిషయాన్ని కూడ ఒప్పేసుకొన్నావు! ఇక నీవు చెప్పవలసిన వివరాలు రెండే రెండున్నాయి: నాగపట్టణంలో యువరాజు ఎక్కడున్నారని నీవు చెప్పాలి; ఆ విషయం నీకెలా తెలిసిందని చెప్పాలి. ఈ రెండు వివరాలు చెప్పిన తర్వాత ఒక్క క్షణం కూడ ఈ ముసలాడితో మాట్లాడనవసరం లేదు. నీవు ఎక్కడికి వెళ్ళాలనిపిస్తే అక్కడికి వెళ్ళవచ్చు."

వాణతి మనసిప్పుడు పూర్తిగా డీలాపడిపోయింది/నిస్సత్తువైపోయింది. ముఖ్యమంత్రి చెప్పిందంతా నిజమని, తనకు తెలియకనే తాను యువరాజును బయటపెట్టేశానని గ్రహించింది. తాను చేసిన ఈ నేరానికి ప్రాయశ్చిత్తముందా? లేనేలేదు! ప్రాణత్యాగం తప్ప ఇక వేరే దారే లేదు!

"అయ్యా! మీరు నా పెదతండ్రి ఆప్తమిత్రులన్నారు. నన్ను మీ కుమార్తెగా ఎంచారు. మిమ్మల్ని ఒకటి కోరుకొంటాను. నేను నాగపట్టణానికి వెళ్ళేందుకూ ఇష్టపడడం లేదు, పళైయారైకి వెళ్ళేందుకు కూడ ఇష్టపడడం లేదు..."

"కొడుంబాళూరుకు వెళ్ళగోరుతున్నావు కాబోలు. అది న్యాయమే. అక్కడికే నిన్ను తీసుకొని వెళ్ళి చేర్పిస్తాను."

"లేదయ్యా! కొడుంబాళూరుకు వెళ్ళేందుకు కూడ ఇష్టపడడం లేదు. ఈ లోకాన్నే వదిలి పరలోకానికి వెళ్ళాలని కోరుకొంటున్నాను. మీ మనుషులకు చెప్పి అదిగో ఆ బలి పీఠంపైన నన్ను బలివ్వమని చెప్పండి. నేను సిద్ధం!" అన్నది.

"తల్లీ! నీ కోరికేమైనా దాన్ని నెరవేరుస్తానని మాటిచ్చాను. నీవు పరలోకానికి వెళ్ళాలని కోరుకొంటే అక్కడికి తప్పక పంపిస్తాను. కానీ దానికి ముందు నా ప్రశ్నలకు జవాబు చెప్పాలి."

"అయ్యా! నన్ను ఊరక ప్రశ్నలతో హింసించకండి. నేనే ప్రశ్నలకూ జవాబివ్వను. నన్ను మీ కుమార్తెగా భావిస్తున్నట్లు మీరు కాసేపటి క్రితం చెప్పింది నిజమే అయితే..."

"కూతురా! అందులో ఏమాత్రం సందేహం వలదు. నిన్ను నా కన్న కూతురిలాగే భావిస్తున్నాను. నీ కుటుంబీకులు నాకు ఎంతో కావలసినవారని బహుశ నీకు తెలియకపోవచ్చు! నీ పెద తండ్రి, నేను నలభైయేళ్ళుగా స్నేహితులం. కానీ రాజకీయ, రాజ్యాంగ విషయాల్లో బంధుత్వం, స్నేహం చూడలేము. ఏల? చక్రవర్తి విషయాన్నే తీసుకో! తన ముద్దుల కుమారుడు రాజ్యాంగానికి విరుద్ధంగా కుట్ర చేశాడు కాబట్టి, అతన్ని చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించలేదా?"

"అయ్యా! పొన్నియిన్ సెల్వన్ గురించా ఇలా మాట్లాడుతున్నారు? ఆయన రాజ్యాంగానికి విరుద్ధంగా ఏం కుట్ర చేశారు?"

"ఓహో! నీకా విషయం తెలియదు కాబోలు. లంక మీద దండెత్తి వెళతానని చెప్పి వెళ్ళారు

పొన్నియిన్ సెల్వన్. అక్కడ మన సైన్యాలు లంక సైన్యాలను ఓడించాయి. ఆ సందర్భాన్ని ఉపయోగించుకొని లంకాసింహాసనాన్ని అధిష్టించాలని చూశారు పొన్నియిన్ సెల్వన్. ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? ఇది తెలిసిన వెంటనే చక్రవర్తి తమ కుమారుని చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞ జారీ చేశారు. యువరాజు ఆ ఆజ్ఞను మీరి కడలిలో కావాలనే దూకి చనిపోయారన్న అసత్య ప్రచారం చేశారు. తర్వాత తీరం చేరి ఎక్కడో దాక్కొనివున్నారు. ఈ వివరాలు నీకు తెలియనందువల్ల ఆయన ఉన్న చోటు చెప్ప నిరాకరించావు కాబోలు. అటువంటి రాజద్రోహిని నీవు దాచిపెట్ట ప్రయత్నిస్తే అది కూడ నేరమవుతుంది. కాబట్టి, చెప్పేయమ్మా!" అన్నారు ముఖ్యమంత్రి.

~

వాణతి ఇదివరకు అదిమి పెట్టిన ఆక్రోశం, ఉద్రేకం ఇప్పుడు వెల్లువలాగ తన్నుకొచ్చాయి. ముఖ్యమంత్రి  పొన్నియిన్ సెల్వన్ని ఇలా దూషించడం, ఆయన మీద ఇలా నిందారోపణ చేయడం ఆమె సహించలేకపోయింది. ఆ సాధుపిల్ల వీరావేశమే రూపందాల్చినట్లు ఇలా గర్జించింది:-

"అయ్యా! మీరు చెప్పిందేదీ నిజం కాదు. యువరాజు మీద లేనిపోని అభాండాలు వేస్తున్నారు. లంకలో మన సైన్యాలు ఓడిపోయే తరుణంలో యువరాజు అక్కడికి వెళ్ళగానే ఉత్సాహం పుంజుకొని పోరాడారు. పొన్నియిన్ సెల్వనే లంకలో మన విజయానికి కారణమని లోకానికంతా తెలిసిన నిజం. ఆయన వీరశౌర్యాలను, సద్గుణాలను చూసి లంక ప్రజలు ఆయనమీద అభిమానంగొన్నారు. పోరులో వెన్నుజూపి పారిపోయిన తమ రాజుకు బదులుగా యువరాజు పొన్నియిన్ సెల్వన్ని తమ రాజుగా/ఏలికగా ఎన్నుకోగోరారు. పొన్నియిన్ సెల్వన్ లంక సింహాసనం తనకు వద్దని నిరాకరించారు. అటువంటి నిజాయితీపరుల మీద మీరిటువంటి నింద మోపుతున్నారు. యువరాజు తమ తండ్రి ఆజ్ఞ అని తెలియగానే తామే లొంగిపోయి తిన్నగా తంజావూరుకు బయలుదేరారు. ఆయన కడలిలో కావాలని దూకలేదు. తమ ప్రాణస్నేహితుని కాపాడేందుకే దూకారు. చక్రవర్తికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన కుట్ర చేయలేదు; ఇటువంటి నిందలను వినేందుకు నా చెవులు ఎంతటి దౌర్భాగ్యాన్ని చేశాయో తెలియదు!"

~

అనిరుద్ధులు మెత్తగా నవ్వుతూనే, "అమ్మాయీ! అరుళ్మొళి వర్మను నీవింతగా వెనకేసుకొని మాట్లాడడాన్ని ఎవరైనా వింటే మీరిద్దరూ ప్రేమికులనుకొంటారు!" అన్నారు.

"అయ్యా! మీరిప్పుడు చెప్పింది సగం నిజం. నేను ఆయనకు మనసిచ్చింది నిజమే. ఈ విషయాన్ని నేను మీనుంచి దాచాలనుకోవడం లేదు. కానీ ఆయన హృదయంలో ఈ అనాధపిల్లకు ఆయన చోటివ్వాలని కోరుకోవడం న్యాయం కాదు. ఆకాశంలో ప్రకాశించే చంద్రునిమీద చకోర పక్షి ప్రేమగొనవచ్చు. కానీ చంద్రునికి ఆ చకోర పక్షి ఉనికే తెలియక పోవచ్చు."

"ఆహా! నా ప్రియస్నేహితుని కుమార్తె ఇంతటి కవితాప్రేమి అని ఇంతవరకు నాకు

తెలియకపోయింది. యువరాకుమారి కుందవై నెచ్చెలివి కద నీవు?" అన్నారు ముఖ్యమంత్రి.

"చాలు, చాలు! తమ పొగడ్తలను నేను వినదలుచుకోలేదు. నన్ను నా దారిన వెళ్ళనివ్వండి. లేదా, మీ మనుషులను పిలిచి ఆజ్ఞాపించండి."

"అమ్మాయీ! కాస్త ఓపిక పట్టు. పొన్నియిన్ సెల్వన్ గురించి నీవు చాల వివరాలు తెలుసుకొని ఉన్నావు. కాబట్టి ఆయన ఇప్పుడు ఉన్న చోటు నీకు తప్పక తెలిసేవుండాలి. అది మాత్రం చెప్పు. నిన్ను వెంటనే నీ పెదతండ్రి వద్దకు చేరుస్తాను. ఆయన లంకనుంచి తిరిగి వస్తున్నారు. ఇప్పటికి మదురై వరకు వచ్చివుంటారు..."

"అయ్యా! మీలాంటి వంచన నిండిన మనుషులతో స్నేహం కలిగినవారు కారు నా పెదతండ్రి. నాకు కన్నవారు, తోబుట్టువులు, బంధువులు ఎవరూ లేరు. యువరాజు గురించి అందరికీ తెలిసిన వివరాలే నాకూ తెలుసు. ఇంకేమీ నానుంచి మీరు తెలుసుకోలేరు. వృధా జాప్యం చేయకండి...."

"జాప్యం చేయకూడదు, నిజమే. పెద్దగా వాన రాబోతున్నట్లుంది..."

"వాన మాత్రమేనా వస్తుంది? మీలాంటి వారున్న చోట ఉరుములు, మెరుపులు, పిడుగులు, ప్రళయం - అన్నీ వస్తాయి."

~

వాణతి మాటతో ఏకీభవిస్తున్నట్లు అదే సమయాన ఆకాశంలో ఒక పెద్ద మెరుపు ఒక మూలనుంచి ఇంకొక మూలకు దూకి మాయమైంది. దాని వెన్వెంటనే బ్రహ్మాండం బద్దలయ్యేటట్లు ఒక పిడుగు పడింది.

"అమ్మాయీ! యువరాజు ఎక్కడున్నారని చెప్పవా?"

"చెప్పను."

"నేనూహించింది నిజమైంది. యువరాజున్న చోటుకు నీవేదో రహస్య సమాచారం తీసుకొని వెళుతున్నావు. నిజమా, కాదా?"

"అయ్యా! వృధా ప్రయాస! మీరడిగే ఏ ప్రశ్నలకూ నేనిక ఉత్తరమివ్వను."

"అలాగైతే రాజ్యాంగ విరుద్ధంగా కుట్ర చేసేవారికి విధించే కఠిన దండన నీకు కూడ ఇవ్వవలసిందే. వేరే దారి లేదు."

"శిక్షను అనుభవించేందుకు నేను సిద్ధంగా ఉన్నానయ్యా! బలిపీఠం మీద నా మెడను పెట్టాలంటే అలాగే చేస్తాను."

"ఛీఛీ! నీవు కొడుంబాళూర్ వేళార్ కుమార్తెవు! నీకు అంతటి అల్పమైన శిక్ష విధించవచ్చా? అదిగో చూడు, ఆ ఏనుగును!"

వాణతి ఆయన వేలెత్తి చూపిన వైపు చూసింది. నల్లటి గుండ్రాయి లాగ ఒక ఏనుగు

నిలబడివుంది. దాని నల్లదనాన్ని బాగా ఎత్తి చూపుతూ రెండు పొడవైన దంతాలు వంపు తిరిగి మెరుస్తున్నాయి.

"అమ్మాయీ! గజేంద్ర మోక్షం గురించి విన్నావు కద? ఏనుగు ఆర్తనాదం విని విష్ణువు పరుగెత్తి వచ్చి దాన్ని కాపాడి మోక్షాన్నిచ్చారు. అందుకు బదులు, ఈ గజేంద్రుడు ఎందరినో ఆ పెరుమాళ్ళు (విష్ణువు) నివసించే వైకుంఠానికి పంపి మోక్షమిచ్చాడు. నీవు ఈ లోకాన్ని వదిలి పరలోకానికి వెళ్ళాలన్నావు కద? నీ కోరికను ఈ ఏనుగు కన్ను మూసి తెరిచే లోపు నెరవేర్చేస్తుంది. అది నిన్ను తన తొండంతో చుట్టి విసిరితే నీవు తిన్నగా మోక్షలోకానికే వెళ్ళి పడతావు!"

ఇలా చెప్పేసి ముఖ్యమంత్రి అనిరుద్ధులు నవ్వారు. ఆ నవ్వు వాణతికి రోమాంచనాన్ని కలిగించింది. ఈ మంత్రి మనిషి కాడు, మనిషి రూపందాల్చిన రాక్షసుడు అనుకొన్నది.

"రాకుమారీ! చివరిసారిగా అడుగుతున్నాను. పొన్నియిన్ సెల్వన్ ఉన్నచోటు చెబుతావా? లేక గజేంద్రుని తొండంవల్ల మోక్షలోకానికి వెళతావా?" అన్న మాటలను విన్న వెంటనే వాణతి మనోధైర్యం తెచ్చుకొంది.

"అయ్యా! గజేంద్రుని నాదగ్గరకు రమ్మంటారా? లేక నేను గజేంద్రుని వద్దకు వెళ్ళనా?" అని గంభీరంగా అడిగింది.

అనిరుద్ధులు చేతితో సైగ చేశారు. దానితోబాటు ఆయన వాణతికి అర్థంకాని భాషలో ఏదో చెప్పారు. ఏనుగు భూమి అదిరేలాగ నడుస్తూ ముందుకు వచ్చి, వాణతి సమీపాన నిలబడింది. పొడవైన తొండంతో వాణతి మృదువైన దేహాన్ని చుట్టి నేలపైనుంచి ఎత్తింది.

~

ఆ కొన్ని క్షణాల్లో వాణతి మనసులో ఎన్నెన్నో ఆలోచనలు ఉవ్వెత్తున అలల్లాగ లేచి మరుగైనాయి. తానా సమయాన అంత ధైర్యంగా ఉండడం తనకే ఆశ్చర్యమేసింది. యువరాకుమారి కుందవై తనను తరచూ భయస్తురాలని, పిరికిపంద అని చెబుతారు కద? వారిప్పుడు ఇక్కడ ఉండి తన ధైర్యాన్ని చూస్తే ఎంత ఆశ్చర్యపడేవారు? వారికి ఎప్పుడైనా ఒకరోజు ఈ సంభవం గురించి తెలియకపోదు. పొన్నియిన్ సెల్వన్ కోసం తాను ధీరత్వంతో ప్రాణత్యాగం చేసిన విషయం తెలుసుకొంటారు. దాన్ని యువరాజుకు చెబుతారు. అప్పుడు యువరాజు తనగురించి ఏమనుకొంటారు? ఆ పడవ నడిపే పిల్లకన్న కొడుంబాళూర్ రాకుమారి ధైర్యశాలి అని అప్పుడైనా గ్రహిస్తారు కద?

ఏనుగు తొండం మెల్లమెల్లగా పైకి లేచింది. దానితోబాటు వాణతికూడ పైకి లేచింది. అవును! ఆ బ్రహ్మరాక్షసుడు చెప్పింది నిజమే. ఈ గజేంద్రుడు నన్ను తిన్నగా మోక్షలోకానికే పంపబోతున్నాడు! మరుక్షణం తనని విసిరేయబోతూంది! ఎంత దూరం వెళ్ళి పడతానో తెలియదు. కానీ కింద పడేటప్పుడు ప్రజ్ఞ ఉండదు. అంతలో ప్రాణం పోయివుంటుంది.

వాణతి ఇప్పుడు ఏనుగు కుంభస్థలం కన్న పైకే వెళ్ళిపోయింది. కళ్ళను గట్టిగా మూసుకొంది. ఏనుగు తన తొండాన్ని తిప్పింది. వాణతిని విసిరివేసేందుకు సిద్ధమైంది. ఆ సమయాన దైవకృప వల్ల వాణతి స్పృహ తప్పింది.

~~~
~~~

# అధ్యాయము - 40

## ఆసై మంగలం

**మన** కథానాయికల్లో ఒకరైన వాణతి తరచూ స్పృహ తప్పి పడడం అలవాటు చేసుకొందన్న విషయం మనకు తెలుసు కద? మరింకొక్కసారి మాత్రం దాన్ని సహించాలని పాఠకులను వేడుకొంటున్నాము. ఎందుకంటే ఆమెకున్న ఈ జబ్బు నయమయ్యే సమయం దగ్గరకొచ్చేసింది.

వాణతికి కాస్త తెలివొచ్చినప్పుడు తాను మెల్లగా ఊగుతున్నట్లు అనిపించింది. తర్వాత ఆకాశవీధిలో ప్రయాణిస్తున్నట్లు తోచింది. 'రిమ్ రిమ్', 'జిమ్ జిమ్' అన్న వాన చినుకుల శబ్దం వినిపించింది. దానికి తోడు చల్లని గాలి వీస్తూంది. అందువల్ల ఆమె ఒళ్ళు కాస్త వణికింది. సరే, సరే మేఘమండలాల గుండా ఆకాశంలోకానికి వెళుతున్నామనుకొంది. చుట్టూ చీకటి కమ్ముకొంది. అప్పుడప్పుడు మెరుపులు మెరిసి మాయమవుతున్నాయి.

ముఖ్యమంత్రి చివరగా గజేంద్రమోక్షం గురించి చెప్పడం, ఏనుగు తొండంతో తనను చుట్టి పైకెత్తడమూ కొద్దికొద్దిగా గుర్తుకు రాసాగాయి. ముఖ్యమంత్రి అనిరుద్ధులు చెప్పినట్లే జరిగింది! భూలోకంలో నా ఆయుష్షు తీరిపోయి, ఇప్పుడు మోక్షలోకానికి వెళుతున్నాను. మోక్షలోకంలో దేవతలను చూస్తాను.

కానీ అందరు దేవతల మధ్య నా మనసుకు నచ్చిన 'వారిని అక్కడ చూడలేను. మనసుకిష్టం లేని అటువంటి మోక్షలోకానికి వెళ్ళి ఏం ప్రయోజనం?

"అరె! ఇదేం ఊగిసలాట? తనని ఇలా ఎగరవేస్తూందేమి? కానీ తల పెట్టుకొన్న చోటు మెత్తగా ఉంది. సుఖంగా ఉంది. తల్లి ఒడిలాగుంది. ఏల? తల్లికన్న తనపైన మిక్కిలి ఆప్యాయత, మమకారంగొన్న యువరాకుమారి కుందవైదేవి ఒడిలాగుంది కద...! ఆఁ! కుందవైదేవి ఇప్పుడు పళైయారైలో ఏం చేస్తున్నారో! నాగురించి సమాచారం వారికి ఇంత లోపల చేరివుంటుందా?

మోక్షలోకానికి ఆకాశవీధిలో మేఘమండలాల గుండా ప్రయాణం చేస్తున్నాను సరే. అయితే ఏ వాహనం మీద ప్రయాణం చేస్తున్నాను? స్వర్గలోక పుష్పక విమానమా ఇది? లేక దేవేంద్రుని ఐరావతమనే ఏనుగా ఇది? అబ్బ! ఏనుగంటేనే భయమేస్తూంది! ఏనుగూ, దాని వంపులు తిరిగిన తొండమూను! - అలా వంపులు తిరిగిన ఆ తొండానికి ఎంత బలం? - గతం గత: ! ఇక దాని గురించి భయమేల? దిగులెందుకు?

కానీ తన తల పెట్టుకొన్న చోటు పట్టులాగ ఇంత మెత్తగా ఉండడానికి కారణమేమి? చుట్టూ చీకటిగా ఉండడం వల్ల ఏమీ తెలియడం లేదు. చేత్తో తడిమి చూద్దాం. నిజానికి పట్టు పానుపు లాగుంది. కాస్త తడిగా కూడ ఉంది.

ఆహా! ఇదేమి? నా కళ్ళనెవరు తాకుతున్నారు? మల్లె పూవులాంటి మృదువైన హస్తం కద ఇది?

"వాణతీ! వాణతీ!"

యువరాకుమారి కుందవైదేవి గొంతు కద ఇది? ఏమీ వింత? ఇదెలా సాధ్యం? అక్క కూడ బహుశ నాతోబాటు స్వర్గానికి వస్తున్నారా?

"వాణతీ! వాణతీ!"

"అక్కా! మీరేనా?"

"నేనే! ఇంకెవరు?"

"మీరు కూడ నాతోబాటు మోక్షలోకానికి వస్తున్నారా?"

"మోక్షలోకానికి వెళ్ళేందుకు ఇంతలో నీకేమిటే తొందర? లోకంపైన ఇప్పటికే విరక్తి పుట్టేసిందా?"

"మరి, మనమెక్కడికి వెళుతున్నాం?"

"ఏమే? అది కూడ మరిచిపోయావా? ఆనై మంగలానికి వెళుతున్నామని తెలియదా?"

"ఏం ఊరు? ఇంకొకసారి చెప్పండి!"

"భలే అడిగావు! ఆనై మంగలానికి వెళుతున్నాం! ఏనుగుమీద వెళుతున్నాం!"

"అయ్యో! ఏనుగా?"

"ఒసే పిచ్చిదానా? నీ ఒళ్ళెందుకే వణుకుతోంది? ఏనుగు పేరు వినగానే నీకు భయం పట్టుకొందా?"

"అక్కా! కాసేపటి క్రితం నేను నిద్రలోకి జారిపోయానా?"

"అవునవును! ఏనుగుమీద అంబారీలో సొగసైన ప్రయాణంలో ఆనందమయంగా నిద్రపోయావు!"

"ఆనందమేమీ లేదక్కా! భయంకరమైన కలగన్నాను!"

"నాకలాగే అనిపించింది. ఏవేవో పలవరిస్తున్నావింతవరకు!"

"ఏమక్కా పలవరించాను?"

"కాళాముఖులన్నావు! బలి అన్నావు! గజేంద్రమోక్షం అన్నావు! ఏనుగు తొండం అన్నావు! తర్వాత ముఖ్యమంత్రి అనిరుద్ధులను, 'పాపి, పగ తీర్చుకొనేశాడు అని తిట్టావు. ఆ బ్రహ్మరాయలకు బాగా కావలసిందే! నీవు నిద్రలో తిట్టిందంతా ఆయన వినివుంటే, ఆయన చాల రోజులు నిద్రపోరు!"

"అదంతా జరిగింది నిజమేనా అక్కా?"

"నిజమైన కలా? అబద్ధమైన కలా? నాకేం తెలుసు? నీవేం కలగన్నావన్నదే నాకు తెలియదు."

"కాళాముఖులు నన్ను బంధించి తీసుకొని వెళ్ళారు. ముఖ్యమంత్రి నన్ను యువరాజు గురించిన రహస్యాలడిగారు. నేను చెప్పనన్నాను. వెంటనే ఏనుగును పిలిపించి నన్ను విసిరివేయమని ఆజ్ఞాపించారు. అప్పుడు నేను కించిత్తు భయపడకుండ ధైర్యంగా ఉన్నానక్కా! మీరు గుర్తుకొచ్చారు. మీరు

లేదే నా ధైర్యాన్ని చూసేందుకు అని."

"పోనీలే; కలలోనైన అంత ధైర్యంగా నడుచుకొన్నావు కద! అదే సంతోషం!"

వాణతి కాసేపు మౌనందాల్చి, తర్వాత, "నేను నమ్మలేకున్నాను!" అన్నది.

"నీవు దేన్ని నమ్మలేకున్నావు?"

"నేను కన్నదంతా కల అని నమ్మలేకున్నాను."

"కొన్నిసార్లు కలలలాగే ఉంటాయి. నిజంగా జరిగినట్లే ఉంటాయి. నేను కూడ చాలసార్లు అలా కలలు కన్నాను."

"అలా ఏం కలలు కన్నారు? చెప్పండేం?"

"ఏల? నా తమ్ముడే తరచూ నా కలల్లో వస్తున్నాడు. వాడు లంకకు వెళ్ళి ఎన్నాళ్లైంది? కానీ రాత్రి కళ్ళు మూసిన వెంటనే తద్రూపంగా నా కళ్ళముందు వచ్చి నిలబడుతున్నాడు..."

"మీరు అదృష్టవంతులక్కా!"

"నా అదృష్టాన్ని నీవొక్కతెవే మెచ్చుకోవాలి. వాడు సముద్రంలో దూకేసిన విషయం విన్నప్పటినుంచి నా మనసు ఎంత తల్లడిల్లిపోతోందో నీకు తెలియదు."

"అలాగైతే అది కూడ ఒక పెద్ద భయంకర స్వప్నం కద? ఆయన కడలిలో మునిగిపోయారన్నది నిజమేనా?"

"అది కూడ ఒక పీడకలైతే ఎంత బాగుండేది? కానీ అది మాత్రం నిజమే, వాణతి! యువరాజు సముద్రంలో దూకింది కళ్ళారా చూసినవారు వచ్చి చెప్పారు కద? దాన్ని నమ్మక ఏం చేయడం?"

"వాణర్ కులవీరులనే కద చెబుతున్నారు? ఆయనే యువరాజుగారి గురించి ఇంకేదో చెప్పలేదా? పడవ నడిపే పిల్ల గురించి, నాగపట్టణం చూడామణి విహారం గురించి ఏదో చెప్పలేదా?"

"ఇదంతా నీవు కలలో చూసివుండాలి. అవును, ఆ పడవ నడిపే పిల్ల పూంగుళలి గురించి, నాగపట్టణం చూడామణి విహారం గురించి నీవు నిద్రలో పలవరించావు! బౌద్ధ భిక్షుణి కాబోతున్నావని కూడ పలవరించావు! ఇంతలో నీకేమిటే ఈ లోకంపైన అంత విరక్తి? ఎందుకు నీవు బౌద్ధ భిక్షుణివి కావాలి?"

"అక్కా! నా మనసు మీకు తెలియదా? ఆయనను కడలి తీసుకొని వెళ్ళిపోయిన తర్వాత నాకీ లోకంలో బతికేందుకింకేముంది? కలగన్నట్లే ఏనుగు తన తొండంతో నన్ను విసిరేసి చంపేసి ఉండకూడదా అనిపిస్తోంది."

"ఒసే పాపి! నీవూ పోతే నా గతేం కావాలి?"

"మీ విషయం వేరక్కా..."

"అవునవును! అరుళ్మొళి మీద నా కన్న నీకే ఆశ ఎక్కువ! కదూ?"

"అక్కా! నేనలా ఏమీ చెప్పరాలేదు. మీలాగ నేను మనోధైర్యం కలదాన్ని కాను. ఆయన

చనిపోయిన తర్వాత....”

“ఛీఛీ! ఏమిలా మాట్లాడుతున్నావు? వాడు చనిపోయాడు అని నీవెందుకు నీ నోట చెప్పాలి? నీకు రూఢిగా తెలుసా? పళువేట్టరయ్యర్లు, పళువూర్ రాణి, అల్లుడు మధురాంతకుడు అలా చెప్పకొని సంబరపడుతున్నారు. నీవూ, నేను అలా ఎందుకు చెప్పాలి, అనుకోవాలి?”

“మరి, ఏమంటున్నారక్కా? ఆయన సుడిగాలి వల్ల కల్లోలితమైన సముద్రంలో పడిపోయిన తర్వాత ... ఇంకేం జరిగేందుకు సాధ్యం? బతికివుంటే ఇన్నాళ్ళకు తిరిగి వచ్చేవారు కద?”

“పిచ్చిదానా? కడలిలో పడిపోతే వాడిని కడలి మింగేసిందని అర్థమా?”

“తీరం చేరివుంటే ఇన్నాళ్ళకు తెలియకుంటుందా?”

“నా తండ్రి కథ నీకు తెలుసా? ఆయన యువప్రాయంలో, చాల నెలలపాటు ఆయన ఉన్నచోటే ఎవరికీ తెలియకుండింది. వెతికి పట్టుకొచ్చి యువరాజు పట్టం కట్టారు. నా తాతగారు అరింజయ చోళులు తక్కోలం యుద్ధం తర్వాత పూర్తిగా మాయమైపోయారు. చాల ఏళ్ళ తర్వాతే ఆయన ఉన్నచోటు తెలిసింది. నేను చెబుతున్నాను, విను వాణతీ! కావేరి మాత నా తమ్ముడిని కాపాడి గట్టెక్కించింది. అలాగే సముద్రరాజు కూడ పొన్నియిన్ సెల్వన్ని కాపాడి తీరం చేర్చివుంటాడు. మన కడలి తీరానికి, లంకాద్వీపానికి మధ్య ఎన్నో చిన్న చిన్న దీవులున్నాయి. ఆ దీవుల్లో ఒకదాంట్లో అరుళ్మొళి తల దాచుకొని ఉండవచ్చు కద? వాడిని వెతికే ప్రయత్నాలింకా ముమ్మరం చేసేందుకు ప్రోత్సాహించేందుకే నేనిప్పడు బయలుదేరాను. నిన్నూ తోడు తీసుకొని. నీకిదంతా జ్ఞాపకమే లేనట్లుంది. అది నీ తప్ప కాదు. యువరాజు గురించిన వార్త విన్నప్పటినుంచి నీ మనసు, బుద్ధి కలతబారిపోయాయి. ఇప్పడే కొద్దికొద్దిగా తేటబారుతోంది.”

వాణతి కాసేపు మౌనందాల్చిన తర్వాత, “అక్కా! మనమేవూరికి వెళుతున్నామని చెప్పారు?” అని అడిగింది.

“ఆనైమంగలం.”

“అదెక్కడుంది?”

“నాగపట్టణం దగ్గర సముద్రతీరాన ఉంది. నీవేదో కలగని పలవరించావే? ఆ చూడామణి విహారానికి ఆనైమంగలం చాల దగ్గర్లోనే ఉంది. నీవు బౌద్ధ భిక్షుణివి కావాలనుకొంటే చాల సౌకర్యంగా ఉంటుంది. కానీ నీవు మణిమేఖలవయ్యేందుకు తొందర పడకు, పొన్నియిన్ సెల్వన్ గురించిన నిర్దుష్టమైన సమాచారం తెలిసిన తర్వాత తీర్మానించుకోవచ్చు!” అని చెప్పేసి కుందవై మెత్తగా నవ్వింది.

“అక్కా! ఇదేమి, మీరిలా నవ్వుతున్నారు? నవ్వేందుకు మీ మనసెలా ఒప్పింది? యువరాజు బతికుంటారని మీకంత నమ్మకమా?”

“నమ్మకం లేకపోతే, నేనికా ఉంటానా, వాణతీ? నేను చూసిన జోస్యాలేవీ వమ్ము కాబోవడం లేదు. నా తమ్ముని చేతిలోవున్న శంఖ చక్ర రేఖలు కూడ అబద్ధం కాబోవు. ఇంతవరకు అన్నీ సరిగానే

జరుగుతూ వస్తున్నాయి."

"ఏం సరిగ్గా జరిగింది ఇంతవరకు? నాకేమీ అర్థం కావడం లేదే?" అన్నది వాణతి.

"నీకెలా తెలియబోతూంది? నీవేమో చిత్త భ్రమ పట్టి తిరుగాడుతున్నావు కద? అరుళ్మొళికి చిరుప్రాయంలో అనేక గండాలెదురవుతాయన్నారు.. అదే ప్రకారం జరుగుతూ వస్తున్నాయి. మరి, మిగిలినవి కూడ జరిగే తీరాలి కద?"

"మిగిలినవి అంటే?"

"ఇప్పటికే నేనెన్నోసార్లు నీకు చెప్పాను. మళ్ళీ చెప్పాలా? మాట్లాడక నిద్రపో! పొద్దున చూసుకొందాం!"

వాణతి మళ్ళీ ఆలోచనలో మునిగి, "రాత్రంతా ఏనుగుమీద ప్రయాణం చేయాలా, అక్కా? ఎందుకు?" అని అడిగింది.

"అది కూడ నీకు గుర్తు లేదా? మనం పగలు ప్రయాణం చేస్తే దారి పొడుగునా ప్రజలు మనల్ని చుట్టుముట్టి ముందుకు పోనివ్వరు. 'పొన్నియిన్ సెల్వన్ ఎక్కడ?', 'చోళనాడు ముద్దుల కుమారుడెక్కడ?' అని అడుగుతారు. పళువేట్టరయ్యర్లపైన నింద మోపుతారు. చక్రవర్తిని కూడ నిందిస్తే నిందించవచ్చు. అదంతా మనమెందుకు వినాలి? నేనే ప్రజల్ని అలా ఎగదోశానని పళువేట్టరయ్యర్లు చెప్పినా చెప్పవచ్చు. ఆ తంటా వద్దనే రాత్రిపూట బయల్దేరాను. ఇదంతా పళైయారైనుంచి బయల్దేరక ముందే నీకు వివరించాను. మళ్ళీ అడుగుతున్నావు. భలే చిత్త భ్రమ నిన్ను పట్టి ఆటలాడిస్తూంది! చూడామణి విహారపు భిక్షువులకు చెప్పి నీ చిత్త భ్రమను పోగొట్టమని అడగడమే దారి! పోతేపోనీ. నీవిప్పుడు నిద్రపో. నాకూ నిద్రొస్తోంది. ఈ ఊగే గుండ్రాయి మీద కూర్చొన్నపళంగానే మనమీ రాత్రి నిద్రపోవాలి" అన్నది యువరాకుమారి.

~

వాణతి ఇంకేమీ మాట్లాడకూడదని తీర్మానించుకొని మౌనందాల్చింది. కానీ ఆమె మనసేమో గందరగోళ స్థితిలో ఉంది. ఆ రోజు జరిగిందంతా ఒక్కొక్కటీ గుర్తు చేసుకొంది. అన్నీ నిజంగా జరిగిన సంభవాలుగానే తోచాయి. నాకు చిత్తభ్రమేమీ లేదు; అక్కే నన్ను పిచ్చిదానిగా చేయజూస్తూంది. ఏనుగు తన తొండంతో తనను చుట్టి పైకెత్తిన తర్వాత ఏం జరిగిందని గుర్తు చేసుకోవడానికి ఎంత ప్రయత్నించినా ఏమీ జ్ఞాపకం రావడంలేదు. ఏం జరిగి ఉండవచ్చు? తన ప్రాణానికే ముప్పు కలిగిన ఆ సమయాన సరిగ్గా అక్క అక్కడికి వచ్చి తనని కాపాడివుండాలి. అక్కను చూసిన వెంటనే ముఖ్యమంత్రి గడగడా వణికివుండాలి. కానీ ఏనుగు తొండం పట్టునుంచి విడిపించడమంటే మాటలా...? ఒక వేళ ఇలా జరిగి ఉంటుందా...? తనను విసిరేసేందుకు తొండంతో చుట్టి పైకెత్తిన ఏనుగేనా ఇది? దాని పైన అంబారీ ఉండడం చీకటిలో కూడ మసక మసగ్గా కనిపించింది. అక్క అందులో ఉండివుండవచ్చు. ఏనుగు తొండంతో తనను దూరంగా విసిరేసే బదులు అంబారీలోకి చేర్చివుండవచ్చు. అలా ఏనుగులు అలవాటు ప్రకారం చేయడాన్ని వాణతి చాలాసార్లు

చూసివుంది. ముఖ్యమంత్రి, యువరాకుమారి కూడబలుక్కొని ఇలా కుట్ర పన్నారా? ఎందుకు? తాను ఒంటరిగా ప్రయాణం చేయకుండ అడ్డగించేందుకే. తన ధైర్యాన్ని పరీక్షించడానికి కూడ యువరాకుమారి ఇలా చేసివుండవచ్చు. ఒకసారి ఇలాగే బొమ్మ మొసలిని తన పక్కన పడేసి పరీక్షించలేదా? ఎలాగైనా ఉండనీ; తానీ రోజు ఒంటరిగా బయల్దేరింది పెద్ద తప్పు. ఇప్పుడు అక్క ఒడిలో తల పెట్టుకొని పడుకొని ఉండడం ఎంత నెమ్మదిగా ఉంది? అక్క మాటలు ఎంత ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇస్తున్నాయి? పొన్నియిన్ సెల్వన్ ఎక్కడో క్షేమంగా ఉన్నారనడంలో సందేహం లేదు. ఇలా అనుకొన్నప్పుడు వాణతి మనసులో నిరాశకు బదులు ఎనలేని ఉత్సాహం పొంగింది.

ఏనుగు గంభీరంగా ముందుకు సాగింది. ఏనుగుపైని అంబారీ అటూఇటూ ఊగసాగింది.

ముందు, వెనుక కాపలా భటులు ఉన్నారు.

వాన సన్న తుంపరగా మారింది. తర్వాత పూర్తిగా నిలిచిపోయింది.

ఆకాశాన మేఘాలు తొలగి, నక్షత్రాలు తొంగి చూడసాగాయి.

వాణతి అంబారీ కప్పుగుండా ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలను చూసింది.

ఆకాశంలో సంచరించే నక్షత్రాలకు, భూలోకంలో నివసించే మానవులకు మధ్య ఏదైనా సంబంధం ఉండగలదా అని ఆలోచించసాగింది.

పొన్నియిన్ సెల్వన్ జన్మ నక్షత్రానికి, తాను పుట్టిన నక్షత్రానికి ఉన్న పొందిక గురించి జ్యోతిష్కులు చెప్పేదాంట్లో ఏమైనా నిజముందా?

తన కడుపున పుట్టబోయే కొడుకు ముల్లోకాలను ఏలబోతాడని జ్యోతిష్కులతో చేరి అక్క కూడ చెప్పడం నిజమేనా? నిజమవుతుందా?

తోకచుక్క కనిపిస్తే ఏదో ఉత్పాతం/ప్రమాదం కలుగుతుందని ప్రజలు చెప్పుకొంటారు కద? అది ఎంతవరకు నిజం?

అలా ఏం ప్రమాదం/ఉత్పాతం జరగబోతూంది?

పొన్నియిన్ సెల్వన్ సముద్రంలో మునిగిపోయిందే ఆ భయంకర సంభవమా?

అక్క నమ్ముతున్నట్లు ఆయన తిరిగి వస్తారా?

అలాగైతే ఇంకేం జరగబోతుంది...?

~

ఇలా చాలసేపు దీర్ఘాలోచన చేసి, తర్వాత మెల్లమెల్లగా నిద్రలోకి జారుకొంది వాణతి.

ఆమె కళ్ళు తెరిచి చూసినప్పుడు పొద్దు పొడిచి బాగా తెల్లవారింది.

పక్షులు ఉదయగీతాలు పాడాయి.

యువరాకుమారి కూడ అప్పడే మేల్కొంటూంది. అంబారీ పట్టు తెరను తొలగించి చూసి, "ఇదిగో

ఆనైమంగలానికి వచ్చేశాం. చోళ మాళిగ వాకిటికే వచ్చేశాం!" అన్నది.

ఇద్దరు రాకుమార్తెలూ ఏనుగుపైనుంచి దిగి మాళిగలోపలికి ప్రవేశించారు. అక్కడ సిద్ధంగా ఉన్న అంత:పుర దాదులు ఇద్దరినీ పిలుచుకొని వెళ్ళి అంత:పురపు అన్ని గదులూ చూపించారు.

చివరిగా మాళిగ మొదటి అంతస్తుకు వచ్చి, దాని ముందరి వసారాలో నిలబడి సముద్రంతో కలిసిపోతున్నట్లున్న కాలువను చూస్తూ నిలబడ్డారు.

"అక్కా! యువరాజును వెతికేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తానన్నారు కదా? ఏం ఏర్పాట్లు చేశారు?" అని అడిగింది వాణతి.

"అవును, వాణతీ! యువరాజును వెతికేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అదిగో చూడు, ఒక పడవ వస్తూంది! అందులో వస్తున్నవారు ఏదైనా వార్త తీసుకొని వస్తూండవచ్చు!" అన్నది కుందవై.

వాణతి తిరిగి చూసింది. సముద్రంలో ఒక చిన్న పడవ ఇటువైపే వస్తూండడం చెట్టు కొమ్మల మధ్యనుంచి కనిపించింది. అందులో ఇద్దరున్నారు.

"అక్కా! ఆ పడవలో వస్తున్నదెవరు?" అని అడిగింది వాణతి.

"పడవ నడుపుతున్నవాడు సేందన్ అముదన్. తంజావూరు పాతాళ చెరసాల నుంచి మనం ఒకరోజు విడుదల చేశాం చూడు, అతడే! కూర్చొనివున్నది పూంగుళలి."

వాణతికి ఒళ్ళు జలదరించింది.

"అక్కా! నేనామెను చూడనిష్టపడడం లేదు. లోపలికి వెళతాను!" అన్నది.

"ఆమెను చూస్తే నీకెందుకంత భయం? ఆమె నిన్ను మింగేస్తుందా, ఏమి? నేను చూసుకొంటాను. నీవు భయపడకు!" అన్నది కుందవై.

పడవ దగ్గరకు రాసాగింది.

~

ఏనుగు తొండానికి చిక్కుకొన్న వాణతి ఎలా బతికింది? ఇందు గురించి ఆమెకు తట్టిన రెండో ఆలోచనే సరైనది. ఏనుగు తొండంతో ఆమెను చుట్టి విసిరేయలేదు. పైకెత్తి అంబారీలో మెత్తగా పెట్టింది. అక్కడ సిద్ధంగా ఉన్న కుందవై అమెను అమాంతం ఎత్తుకొని ఒడిలో వేసుకొంది.

తర్వాత ముఖ్యమంత్రి కూడ తమ పల్లకెక్కారు. "దేవీ! వెళ్ళిరానా? నీ ప్రయాణం సుఖంగా సాగనీ. దాని ముగింపు కూడ తీయగా ఉండనీ!" అన్నారు.

"అయ్యా! మీ సహాయానికి చాల ధన్యవాదాలు!" అన్నది యువరాకుమారి.

"కొడుంబాళూర్ రాకుమారిని పిరికిది అన్నావు కదా? ఆమెలాంటి ధైర్యవంతురాలిని నేను చూడలేదు!"

"ఇంతకు మునుపల్లా అలాగే పిరికిగా ఉండేది. ఇటీవలే ఆమెకు ధైర్యం వచ్చింది."

"అంతా నీ శిక్షణ మూలంగానే. ఆ అమ్మాయి నన్ను ఒక భయంకరమైన రాక్షసుడిగా భావించి ఉంటుంది. పోతే పోనీ. నా గురించి ఎందరో ఎన్నో రకాలుగా అనుకొంటుంటారు. నేను అందు గురించి దిగులు పడను. వెళ్ళి వస్తానమ్మా!"

ఇలా ముఖ్యమంత్రి చెప్పి సెలవు తీసుకోగానే ఆయన పల్లకి, దానితోబాటు నలుగురు వీరులు మాత్రం పడమర వైపు వెళ్ళగా, ఏనుగులు, గుర్రాల పరివారం తూర్పు దిశగా వెళ్ళాయి.

~

ముఖ్యమంత్రి పల్లకి బయలుదేరిన కాసేపటికల్లా వాన పట్టుకొంది. దాన్ని పట్టించుకోక పల్లకి బోయీలు, వీరులు ముందుకు సాగారు.

వాన తగ్గి తుంపర నిలిచే సమయాన పల్లకి ఉన్నట్లుండి ఆగింది.

"ఎందుకు ఆగారు?" అని ముఖ్యమంత్రి అడిగారు.

"స్వామీ! ఆ చెట్టు కింద ఎవరో పడివున్నట్లు కనిపిస్తూంది" అన్నాడు ముందు వెళుతున్న వీరులలో ఒకడు.

ముఖ్యమంత్రి ఆ వీరుడు చూపించిన వైపు పరీక్షగా చూశారు. సరిగ్గా అప్పుడే ఆకాశాన తళుక్కున ఒక మెరుపు మెరిసింది.

"అవును. ఎవరో కింద పడివున్నట్లుంది. దిగి చూస్తాను" అన్నారు ముఖ్యమంత్రి.

పల్లకి నుంచి దిగి చెట్టును సమీపించినప్పుడు ఆ మనిషి మూలుగుతున్న శబ్దం వినిపించింది.

"ఎవరది?" అన్నారు ముఖ్యమంత్రి.

అందుకు బదులుగా, "ముఖ్యమంత్రిలాగుందే!" అన్న హీనమైన స్వరం వినిపించింది.

"అవును. అడుగుతున్నది ముఖ్యమంత్రే. కింద పడివున్నదెవరు?"

"అయ్యా! తెలియడం లేదా? నేనే, మధురాంతకుడిని!"

"యువరాజా! ఇదేం పరిస్థితి? ఇక్కడికెలా వచ్చారు? ఏం జరిగింది?" అది గాభరాగా అడుగుతూనే ముఖ్యమంత్రి మధురాంతకులను లేపి నిలబెట్ట ప్రయత్నించారు.

~~~
~~~

# అధ్యాయము - 41

## మధురాంతకుని కృతజ్ఞత

**ముఖ్యమంత్రి** మధురాంతకుని తాకగానే అతడు కేకలేయనారంభించాడు.

"అయ్యో! అబ్బా! చచ్చాను! నన్ను తాకొద్దు! నా కాళ్ళు! పోయాయి! పోయాయి!" అని అరిచాడు.

అనిరుద్ధులు యువరాజును పైకెత్తే ప్రయత్నాన్ని ఆపి, "యువరాజా! మీకేమైంది? మీ కాళ్ళకేమైంది?" అని దిగులుతో అడిగారు.

"నా కాళ్ళు విరిగిపోయాయి. నడవలేను. నిలబడ్డం కూడ సాధ్యం కాదు!"

ముఖ్యమంత్రి తన సేవకులను చూసి, "పల్లకినిటు తీసుకు రండి!" అని ఆజ్ఞాపించారు.

తర్వాత, "ఈ విపత్తు ఎలా జరిగింది? మీరు వానలో ఒంటరిగా ఇలా పడివుండడానికి కారణమేమి? మీతో వచ్చిన పరివారమెక్కడ? మిమ్మల్నిలా వదిలిపెట్టి పారిపోవడానికి వారెలా తెగించారు? వారికే శిక్ష విధించినా తక్కువే కదా!" అన్నారు.

"ముఖ్యమంత్రిగారూ! ఎవరినీ శిక్షించకండి! నేరమెవరిదీ కాదు. సాయంసమయాన నేనే గుర్రమెక్కి ఒంటరిగా బయలుదేరాను. నదీతీరం వెంబడి వెళుతున్నాను. ఉన్నట్లుండి వర్షం మొదలైంది. ఒక పెద్ద పిడుగుతోబాడు మెరుపులు కూడ మెరిశాయి. గుర్రం బెదిరిపోయి పరుగెత్తనారంభించింది. నేనీ చెట్టుకొమ్మల మధ్య చిక్కుకొని పడిపోయాను. గుర్రం ఎక్కడికి పారిపోయిందో తెలియదు. పడ్డ వేగానికి నా కాళ్ళు విరిగిపోయాయో, ఒట్టి బెణుకు మాత్రమేనా తెలియదు. లేచి నిలబడడానికి కూడ కావడం లేదు. సమయానికి మీరిక్కడికి వచ్చారు!"

"ఏదో మీ తండ్రి గండరాదిత్యులు చేసిన పుణ్యం వల్లనే నేనీ సమయాన యధాలాపంగా ఇక్కడికి రావడం జరిగింది! కాస్త పళ్ళు గిట్ట కరుచుకొని ఓర్చుకోండి. పల్లకిలో మిమ్మల్ని ఎక్కించేస్తాను. తక్కిన వివరాలన్నీ మీరు ఇంటికి చేరిన తర్వాత తెలుసుకొంటాను" అన్నారు అనిరుద్ధులు.

పల్లకి దగ్గరకు రాగానే ముఖ్యమంత్రి యువరాజును మెల్లగ ఎత్తి పల్లకిలోకి చేర్చారు.

బోయీలను పల్లకిని మెల్లగా తీసుకొని వెళ్ళమని చెప్పారు. తాను కూడ దాని పక్కనే నడుస్తూ వెళ్ళారు.

~

కాసేపటికల్లా 'నాధుని కోవెల' అని పిలువబడుతున్న సుందర చోళ చక్రవర్తి కట్టించిన విణ్ణకర్ (=విష్ణు) ఆలయానికి వారు చేరుకొన్నారు. ఆ ఊరి పెరుమాళ్ళ కోవెల దగ్గర ముఖ్యమంత్రి మాళిగ ఉంది.

బోయీలు పల్లకిని మాళిగ లోపలికి తీసుకొని వెళ్ళి ముఖ్యమంత్రిగారి పడక గది దగ్గర దించి, యువరాజును గదిలోని పట్టెమంచం మీద పడుకోబెట్టారు.

ముఖ్యమంత్రి సేవకులను దీపం తీసుకొని రమ్మని, ఆ వెలుతురులో చూడగా, కాళ్ళు విరగలేదని, బెణుకు మాత్రమేనని తెలిసింది.

యువరాజుగొన్న భీతికూడ కాస్త తగ్గింది.

పెరుమాళ్ళ కోవెల నుంచి వచ్చిన ప్రసాదాన్ని ఇద్దరూ ఆరగించారు.

తర్వాత ముఖ్యమంత్రి, "యువరాజా! ఇక ఈ రాత్రి నెమ్మదిగా నిద్రించండి. పొద్దున మీ ఉచితం ప్రకారం చేద్దాం. నేనూ తంజావూరుకే వెళుతున్నాను. నాతో వచ్చేటట్లయితే భద్రంగా తీసుకొని వెళ్ళి చేరుస్తాను" అన్నారు.

"అయ్యా! గతంలో మీరు నాకెంతే కీడు చేశారు. ఈరోజు దానికంతా పరిహారం చేసేశారు! మీరీరోజు చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువను. అందుకు ఎప్పుడూ కృతజ్ఞుడిని. ఒకవేళ ఈ చోళసామ్రాజ్య సింహాసనాన్ని నేనధిష్టించడమే జరిగితే, మిమ్మల్నే ముఖ్యమంత్రిగా నియమిస్తాను!" అన్నాడు మధురాంతకుడు.

అనిరుద్ధులు ఆశ్చర్యకడలిలో మునిగిపోయినట్లు నటించి, "యువరాజా! నేను చోళకులానికి ఋణపడినవాడిని. ఈ కులానికి చెందినవారందరికీ సమయోచిత సలహాలివ్వడం నా కర్తవ్యం. కాబట్టి మీరు నాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పనవసరం లేదు. కానీ నేను మీకేదో కీడు చేశానన్నారు కద? అదే నాకర్థం కావడం లేదు. మీరు కాస్త పెద్ద మనసు చేసి దాన్ని వివరిస్తే అందుకు తగిన ప్రాయశ్చిత్తం చేయవచ్చు!" అన్నారు.

"అయ్యా! అనిరుద్ధులుగారూ! మీరు చాల గట్టివారు, తెలివైనవారు, రాజతంత్ర నిపుణులు కూడ అన్న విషయం లోకవిదితం. కానీ మీ చాతుర్యాన్ని నా దగ్గర చూపకండి. మీరు నాకు చేసిన కీడు ఎంత క్రూరమైనదన్న విషయం నాకు తెలియదనుకోకండి. కానీ మీరీరోజు నాకు చేసిన సహాయాన్ని పెద్దదిగా ఎంచి అదంతా మరిచిపోబోతున్నాను. నా కృతజ్ఞతను మీకు ఎలా చెల్లించాలో చెప్పండి. ఏదైనా ప్రత్యుపకారం చేయదగినది ఉంటే చెప్పండి!"

అనిరుద్ధులు చిరునవ్వు నవ్వి, "అవును, యువరాజా! మీరు కృతజ్ఞత చెల్లించుకోవడానికి ఒక దారివుంది. మిమ్మల్ని ఈ ముసలాడు కోరదగిన, కోరవలసిన వరం ఒకటుంది. ఇక మీదట ఒంటరిగా గుర్రమెక్కి ఎక్కడికీ వెళ్ళకండి. పరివారాలను వెంట తీసుకొని రథంలో ప్రయాణించండి. రోజులు బాగాలేదు. పలు కారణాల వల్ల ప్రజలు కోపంతో ఉన్నారు. ఇవాళ పళైయారైలో చూశారు కద! కాబట్టి తెరిచిన పల్లకిలో ప్రయాణం చేయడం కన్న మూసిన పల్లకిలో ప్రయాణం చేయడం ఇంకా మంచిది. పళువూర్ యువరాణి పల్లకైతే ఇంకా విశేషంగా ఉంటుంది!" అన్నారు.

మధురాంతకుడు అదిరిపడ్డాడు. అతడి ముఖాన మళ్ళీ భయపు ఛాయలు పొడసూపాయి. వెంటనే సంభాళించుకొని, “ముఖ్యమంత్రీ! ఏమన్నారు? పళువూర్ యువరాణి మూసిన పల్లకిలో నన్ను ప్రయాణం చేయమనడంలో మీ ఉద్దేశమేమి? నన్ను అవమానించడం మీ ఉద్దేశమా...?”

“యువరాజా! పళువూర్ యువరాణి పల్లకిలో ప్రయాణించడాన్ని మీరు అవమానంగా భావిస్తారని నాకు తెలియదు. ఎప్పటినుంచి మీకిలాంటి ఆలోచనలు రావడం మొదలైంది? మునుపల్లా మీరు తరచూ అలా వెళ్ళేవారు కద? కడంబూర్ మాళిగకు వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత ఈ మంచి తీర్మానానికి వచ్చివుండాలి...”

మధురాంతకుడు ఇంకా గాభరా పడ్డాడు. అతని ముఖాన భయభ్రాంతులు ఇంకా ఎక్కువగా కమ్ముకొన్నాయి.

"ముఖ్యమంత్రీ! కడంబూర్ మాళిగకు నేను... నేను...” అని ఏదో తడబడుతూ చెప్పనారంభించాడు.

“యువరాజా! కడంబూర్ మాళిగకు జ్యేష్ఠమాసం పద్దెనిమిదో రోజు ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్‌తోబాటు వెళ్ళారు కద? అదే చెబుతున్నాను. అప్పుడు మీరు యువరాణి పల్లకిలో వెళ్ళి తిరిగి వచ్చారు. అది నాకంతగా నచ్చలేదు. పల్లకి ప్రయాణం నావంటి ముసలివాళ్ళకు తగును. మీలాంటి యువకులు ఏనుగుమీదో, గుర్రంపైనో ప్రయాణం చేయడమే ఉచితం. కానీ గుర్రంపైన ప్రయాణం చేసేందుకు తగిన శిక్షణ కావాలి. మీరు కోలుకొన్న తర్వాత నేనే దానికి తగిన ఏర్పాట్లు చేస్తాను...”

“బ్రహ్మరాయలుగారూ! జాగ్రత్త! మళ్ళీ మళ్ళీ నన్ను అవమానపరిచే మాటలంటున్నారు. ఇవాళ ఏదో ఈ అసందర్భ సంఘటన జరిగినందువల్ల నాకు గుర్రపు స్వారీ తెలియనే తెలియదని తీర్మానించినట్లున్నారు. ఏదో ఒకసారి పళువూర్ యువరాణి పల్లకిలో వెళ్ళినందువల్ల ఎప్పుడూ అలాగే వెళ్ళాలంటున్నారు. మీ ప్రాయాన్ని, నేడు మీరు చేసిన సహాయాన్ని ఎంచి సహిస్తున్నాను...”

“యువరాజా! మీ ఓర్పు నాకు చాల సంతోషాన్నిస్తూంది. ’ఓపికగలవారు భూమినేలువారు అన్నది పురాతన సామెత. తమిళదేశపు మహాకవులేమన్నారు?

<< అదే విషయమై ఒక సమయోచితమైన ద్విపద >>

భూమి తనని తవ్వేవారిని ఓపికతో సహిస్తూంది. అంతేనా? వారికి తీయని నీరిచ్చి సహాయంకూడ చేస్తూంది. భూమికున్న ఈ గుణాన్ని భూమినేలాలనుకొనేవారికి కూడ ఉండాలి. నాలాంటి ముసలివాళ్ళు ఏదైన అనుచితంగా మాట్లాడినా కూడ భూమినేలే కోరికవున్న మీరు ఓర్పుతో సహించడమే ఉచితం.”

“అయ్యా! ఏమంటున్నారు? నేనీ చోళసామ్రాజ్యాన్ని ఏలగోరుతున్నానని నింద

మోపుతున్నారా?" అని అడిగాడు మధురాంతకుడు. అతని పెదవులు వణికాయి. కనుబొమలు పైకి లేచాయి. భయం కోపంగాను, ఉక్రోషంగాను మారుతున్నాయని తెలియవచ్చింది.

కానీ ముఖ్యమంత్రేమో ఏమాత్రం కంగారు, గాభరా లేకుండ, నెమ్మదిగా, "యువరాజా? నింద మోపుతున్నానని ఎందుకంటున్నారు? మీరీ చోళసామ్రాజ్యాన్ని ఏలాలనుకొంటే, అది నేరమెలా అవుతుంది? వీరాధివీరులైన విజయాలయ చోళుల వంశంలో పుట్టినవారు మీరు. మహానుభావుడైన శివజ్ఞాని గండరాధిత్యుల కుమారులు మీరు. చోళ సింహాసనాన్ని అధిష్ఠించేందుకు మీకు హక్కుంది. దాన్ని మీరు కోరుకోవడం తప్పెలా అవుతుంది? అది నేరమని, కాబట్టి అందుకోసం రహస్యంగా కుట్రల్లో పాల్గొనాలని ఎవరైనా మీకు దురాలోచన చెబితే, దాన్ని మీరు నమ్మకండి. యువరాజా! ఈ ముసలాడి మాటలను కాస్త శ్రద్ధగా వినండి. తమ కన్నవారి కోరిక ఒక విధంగా ఉండేది. మీరు కూడ దానికి తలవొగ్గి శివభక్తి పరాయణులయ్యారు. ఇప్పుడు మీ మనసు మారింది. దాని గురించి మీమీద నేరం, నింద మోపడానికి ఎవరికీ హక్కు, అధికారం లేదు. మీ హక్కును మీరు బాహాటంగా అడగవచ్చు. చక్రవర్తి వద్దే మీ కోరికను వెలిబుచ్చవచ్చు. అదంతా వదిలేసి, కేవలం కాళాముఖుల కూటమి ఆదరాన్ని కోరేందుకు అమావాస్య రాత్రి చీకటిలో ఒంటరిగా కొళ్ళిడం నదీతీరానికి వెళ్ళనవసరం లేదు. లేక శంబువరయ్యర్ మాళిగలో అర్ధరాత్రి దొంగల ముఠా గుమిగూడినట్లు కుట్ర చేయనవసరం లేదు. ఇలా మీకు ఆలోచనలు, సలహాలు చెబుతున్నవారు మీకు పరమ విరోధులని భావించండి!"

~

మధురాంతకుడు మహదాందోళనలో మునిగిపోయాడు. ముఖ్యమంత్రికి ఇన్ని నిగూఢమైన విషయాలు తెలుసునన్న సంగతి స్ఫురించగానే అతని ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. అదే సమయాన ఒకవైపు భీతి, ఆ భీతి వల్ల కలిగిన ఆవేశం పొంగిరాసాగాయి.

"అయ్యా! మీకివన్నీ ఎలా తెలిశాయి? ఏ ద్రోహి నాతో స్నేహంగా ఉంటున్నట్లు నటిస్తూ మీ దగ్గరకొచ్చి ఈ రహస్య విషయాలను బయటపెడుతున్నాడు?" అని అడిగాడు.

"మీరు దాన్ని తెలుసుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ఈ విశాలదేశమంతటా నాకు కళ్ళున్నాయి, చెవులూ ఉన్నాయి. నాకు తెలియకుండ ఏదీ జరగడం సాధ్యం కాదు..."

"అలాగైతే చక్రవర్తికి కూడ ఇవన్నీ తెలుసా?" అని మధురాంతకుడడిగాడు.

"లేదు; ఆయనకు తెలియదు. నా కళ్ళు, చెవులు తెలియజేసే రహస్యాలెన్నో నా మనసులోనే పదిలమై ఉండిపోతాయి. అవసరం, అగత్యం వస్తే తప్ప అవి బయటకు రానే రా...."

"అవునవును! మీ మనసులో ఎన్నెన్నో భయంకరమైన రహస్యాలు పాతిపెట్టబడివున్నాయి. అవన్నీ బయటకువస్తే ఈ చోళసామ్రాజ్యమే గడగడలాడిపోదా!" అన్నాడు మధురాంతకుడు. ఇప్పడతని గొంతులో కపటం, వంచన ధ్వనించాయి.

ముఖ్యమంత్రి అది గమనించినా కూడ, గమనించనట్లు ఇలా ముందుకు చెప్పారు:- "చక్రవర్తి నాకు ఆప్త స్నేహితుడు. కానీ ఆయనకు తెలియని రహస్యాలు కూడ నాకు తెలుసు. సుందర చోళులు చాల పెద్ద జబ్బుతో మంచం పట్టివున్నారు. పలుకారణాలవల్ల ఇప్పటికే ఆయన మనసు చాల గాయపడివుంది. చిన్నరాజుల కుట్ర గురించి ఆయనకు చెప్పి ఆయన మనసును మరింత నొప్పించడం నాకిష్టం లేదు. దానికి అవసరమూ రాలేదు. యువరాజా! మీ కార్యాలకు సంబంధించినంత వరకు నేను చక్రవర్తికి ఏమీ చెప్పనని మీరు నమ్మవచ్చు!"

"అయ్యా! అణ్బిల్ అనిరుద్ధులుగారూ! ఈ పేద మధురాంతకుని మీద మీకు ఉన్నట్లుండి అభిమానం కలగడానికి కారణమేమి?" అని చెప్పి మధురాంతకుడు హేళనగా నవ్వాడు.

"యువరాజా! మీపట్ల నాకు ఉన్నట్లుండి అభిమానం పుట్టుకురాలేదు. సుందర చోళుల కుమారుల మీద అభిమానమున్నట్లే మీపట్లకూడ ఎప్పడూ అభిమానంగొన్నాను. దాన్ని చూపించుకోవడానికి ఇంతవరకు నాకు తగిన సందర్భం రాలేదు..."

"ఈరోజు ఆ సందర్భం వచ్చింది. ఎలా? నేను గుర్రంమీదినుంచి కిందపడి కాళ్ళు విరగగొట్టుకొన్నందువల్ల. కానీ కొన్ని రోజులకు మునుపైతే నన్ను ఆ చెట్టుకిందే గొంతు పిసికి చంపేసి తిరిగి వచ్చేవారు..."

"నారాయణ! నారాయణ! ఏం మాటలివి యువరాజా?"

"అయ్యా! నాకు ఏమీ తెలియదనుకోకండి. ఏం చెప్పినా నమ్మే అమాయకుడిని అనుకోకండి. నేను నా తల్లి గర్భంలో ఉన్నప్పడే నాకు వ్యతిరేకంగా కుట్ర చేయనారంభించారు. నేను పుట్టగానే నన్ను చంపేందుకు/చంపించేందుకు ఏర్పాట్లు చేశారు. అదిగో, మీ ముఖంమీద ఆశ్చర్యసూచనలు నాకు కనిపిస్తున్నాయి. అదంతా నాకెలా తెలుసని ఆశ్చర్యపడుతున్నారు కద? ఈ చోళదేశపు భయంకర రహస్యాలు ఎరిగినవారు మీరు మాత్రమేనని గర్వించకండి!"

అనిరుద్ధుల ముఖంమీద ఇప్పడు నిజంగానే విచిత్రమైన మార్పులు గోచరించాయి. క్షణానికొక భావం కనిపించి మాయంకాసాగింది. చివరిగా (రాని) చిరునవ్వును తెప్పించుకొని, "అవును, యువరాజా! నేనలా అహంకారం కలిగివుండేవాడిని. ఇప్పడు గర్వభంగమైంది. మీరు పుట్టగానే శిశుహత్యకు ఏర్పాటు జరిగివుంటే మీరెలా బతికి బయటపడ్డారు? ఆ రహస్యం కూడ తెలియజేస్తే కృతార్థుడనవుతాను!" అన్నారు.

"నాకు ఎంతమటుకు తెలుసో చూద్దామని పరిశోధిస్తున్నారు, కాబోలు! మంచిది; చెబుతాను, వినండి. మీరు ఏర్పాటు చేసిన మనుషులు పుట్టిన బిడ్డ ఆడా, మగా అని కూడ చూడకుండ తొందరపడి తీసుకొని వెళ్ళారు. ఆడబిడ్డ అని తెలిసిన వెంటనే మీదగ్గరకొచ్చి చెప్పారు. బతికిపోనీ అని మీరు ఆ ఆడబిడ్డను ఒక కోవెల పూజారికిచ్చి పెంచమని చెప్పారు. ఆడబిడ్డ పుట్టిన అరఘడియకు నేను పుట్టాను. అది మీరు ఎదురు చూడలేదు. నా జాతక ఫలంకూడ బాగుంది. కాబట్టి నేను బతికిపోయాను. మీ ప్రయత్నం

విఫలమైందని తెలిసిన తర్వాత కూడ నేను సింహాసనమెక్కకుండ చేసేందుకు మీరు ఎన్నో కుట్రలు పన్నారు. నన్ను శివభక్తునిగా, అంటే ఒక పిచ్చివాడిగా, పెంచాలని ప్రయత్నించారు. అదీ విఫలమైంది. నేను మీరు కోరుకొన్నట్లు పూర్తి పెర్రిబాగులవాడిని కాలేదు! అయ్యా! ముఖ్యమంత్రిగారూ! ఎందుకిలా స్తంభించిపోయారు? ఇవన్నీ నిజంకావని బల్లగుద్ది వాదించరేం?"

ముఖ్యమంత్రి నిజంగానే స్తంభించి కూర్చొండిపోయారు. మాట్లాడేందుకు ఒకింత శక్తిని కూడదీసుకొని, "యువరాజా! మీకిన్ని వివరాలు తెలిసివున్నప్పుడు, కాదని వాదించడంలో ప్రయోజనమేముంది?" అన్నారు.

"అవును, అది నిష్ప్రయోజనమే! నామీద మీకు ఉన్నట్లుండి ఇంత ప్రీతి, ఆప్యాయత పుట్టుకురావడానికి కారణం నాకు తెలుసు. అదిత్య కరికాలన్ మీకిష్టం లేదు. అరుళ్మొళి వర్మను చోళసింహసనంమీద కూర్చోబెట్టడమే మీ ఉద్దేశం. వాడిని కడలి తీసుకొని వెళ్ళిపోయినందువల్ల నాపైన ఆప్యాయతగొన్నారిప్పుడు! అయినా కూడ ఒకటి చెబుతున్నాను. మునుపు మీరు నాకు చేసిన చేటంతా మరిచిపోవాలని తీర్మానించాను. ఈరోజు మీరు నాకు చేసిన సహాయానికి కృతజ్ఞత కూడ చెల్లించుకొంటాను. ఈరోజునుంచి మీరు నా పక్షాన ఉండడానికి ఒప్పకొంటే, మిమ్మల్నే నా ముఖ్యమంత్రిగా నియమించగోరుతున్నాను!" అన్నాడు మధురాంతకుడు.

"యువరాజా! మీమాటలు నాకు చాల సంతోషాన్నిస్తున్నాయి!" అన్నారు ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మారాయలు.

~~~
~~~

# అధ్యాయము - 42

## జ్వరం నయమైంది

**నాగాపట్టణపు** చూడామణి విహారంలో ఆచార్య భిక్షువు గది పక్కనున్న గదిలో కొయ్య మంచంపైన పొన్నియిన్ సెల్వన్. మూడురోజులు అతన్ని తీవ్రజ్వరం కాల్చిమాడ్చేసింది. ఇంచుమించు ఆ మూడురోజులు స్పృహలేకుండనే పడివున్నాడు. ఆరోజుల్లో అతన్ని భిక్షువులు కంటికి రెప్పగా చూసుకొన్నారు. వేళ తప్పకుండ ఔషధాలు ఇచ్చి చూసుకొన్నారు. తరచూ నోట నీరు పోస్తూ జ్వరాన్ని తగ్గించుకొంటూ వచ్చారు.

మధ్యమధ్య కాస్త స్పృహ వచ్చినప్పుడు తానెక్కడున్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. తన ముందున్న గోడపైని చిత్రం అతన్ని ఆకట్టుకొంది. ఆ చిత్రంలో దేవతలు, గంధర్వులు, యక్షులు చిత్రించబడివున్నారు. వారిలో పలువులు మధుర సంగీతవాద్యాలను వాయిస్తున్నారు. కొందరు వింజామరలు వీస్తున్నారు, మరి కొందరు గొడుగులు పట్టుకొన్నారు. ఇంకొందరు రంగురంగుల పూలున్న పళ్ళాలతో నిలబడ్డారు. ఈ దృశ్యం చాల సజీవంగా కనిపించింది. దేవతల ఆకారాలన్నీ సజీవంగా ఉన్నట్లు కనిపించాయి. ఆ చిత్రాన్ని తరచూ చూడగా, చూడగా పొన్నియిన్ సెల్వన్ తాను దేవలోకానికే వచ్చేసినట్లు భావించాడు. తానెలా స్వర్గలోకానికి వచ్చి చేరానా అని ఆలోచించాడు. దట్టమైన మొగలి పొదలు, ఆ పొదల్లో పూచిన బంగారు వన్నె మొగలి పూలు ఇరుపైపులా నిండిన నది లేదా కాలువ వెంబడి తాను ఈ లోకానికి వచ్చి చేరివుండాలి. ఆ కాలువ దారి గురించి గుర్తు తెచ్చుకొన్నప్పుడు ఆ మొగలిపూల సువాసనను ఆఘ్రాణించినట్లు కూడ గుర్తుకొచ్చింది. తనను ఒక పడవలో ఎక్కించుకొని ఒక దేవకుమారుడు, ఒక దేవకన్య తనను ఆ కాలువ గుండా తీసుకొని వచ్చి ఈ దేవలోకానికి చేర్చారని కూడ చూచాయగా గుర్తుకొచ్చింది. దేవకుమారుడు శివభక్తుడిలాగ ఉన్నాడు. ఇంపైన దైవగీతాలను అతడు పాడాడు. దేవకన్య ఏం చేసింది? ఆమె పాడలేదు. ఆమె అప్పుడప్పుడు ఒకట్రెండు మాటలాడిందంతే. అదే దేవగానంలాగనిపించింది. ఆసక్తి, ఆప్యాయత నిండిన కళ్ళతో తనను అప్పుడప్పుడు చూసేది. ఆ ఇద్దరూ ఇప్పుడెక్కడ?

ఆకాశలోకంలో దేవతలు, యక్షులు, కిన్నెరలకు మాత్రమేగాక, ముఖ్యంగా బౌద్ధ భిక్షువులకు కూడ తావుంటుంది కాబోలు! వారే దేవలోకపు అమృతకలశాన్ని కాపాడేవారు కాబోలు! తరచూ ఒక బౌద్ధ భిక్షువు తన దగ్గరికొస్తున్నారు. తన నోట కాస్త అమృతాన్ని పోసి వెళుతున్నారు. దేవలోకంలో తక్కిన వసతులెలా ఉన్నాకూడ, దాహం మాత్రం అధికంగానే ఉంది. ఈ బౌద్ధ భిక్షువు ఆ అమృతాన్ని ఇంకాస్త ఎక్కువగా పోసి వెళ్ళకూడదా? దేవలోకంలో కూడ ఎందుకీ పిసినారి బుద్ధి?

ఒకవేళ అమృతాన్ని ఒకేసారి అధికంగా ఆరగించకూడదు కాబోలు! ఇది అమృతమా? లేక, మధుపానమా? - ఛీఛీ! భిక్షువులు మధువును చేతితో కూడ తాకరు కద? తనకు పోస్తారా? లేకపోతే తనకెందుకలా మైకం కమ్ముకొస్తూంది? అమృతపానం చేసిన వెంటనే తానెందుకిలా స్పృహ కోల్పోతున్నాడు...?

~

మూడురోజులిలా పొన్నియిన్ సెల్వన్ దేవ/ఆకాశలోకంలోను, ప్రజ్ఞారహితమైన శూన్యలోకంలోను గడిపిన తర్వాత, నాలుగో దినం ఉదయాన పూర్తి స్పృహ వచ్చి నిద్రనుంచి లేచినవాడిలాగ మేల్కొన్నాడు. శరీరం బలహీనంగా ఉన్నప్పటికీ, మనసు తేటగా ఉంది. ఎదురుగా గోడపైనున్న ఆకారాలు చిత్రాలు మాత్రమేనని గ్రహించాడు. ఆ దేవ, యక్ష, కిన్నెరగణాలు అక్కడ తనను స్వాగతించేందుకు నిలబడలేదని, దేవలోకానికి విజయం చేసిన బుద్ధభగవానుని స్వాగతిస్తున్నారని గ్రహించాడు. ఇంకొక చిత్రంలో మేఘాలు చుట్టుకొన్న ఆకాశవీధిలో బుద్ధభగవానుడు తేలివస్తున్న చిత్రాన్ని గీచివుండడాన్ని చూశాడు. తానొక బుద్ధవిహారంలో పడుకొనివున్నాడని కూడ గ్రహించాడు. ఎక్కడ, ఏ విహారం అని ఆలోచించినప్పుడు తాను లంక నుంచి ప్రయాణం మొదలు పెట్టినప్పటినుంచి జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా గుర్తొచ్చాయి. తాను, వంతిదేవుడు ఉవ్వెత్తున అలలు లేచిన సముద్రంలో అలిసిపోయేవరకు ఈదుతూ వచ్చిన విషయం గుర్తుకొచ్చింది. తర్వాతేం జరిగిందో గుర్తుకు రాలేదు.

ఆ సమయాన బౌద్ధ భిక్షువు ఒకరు ఆ గదిలోపలికొచ్చారు. అలవాటు ప్రకారం చేత అమృత భాండంతో వచ్చారు! యువరాజు దగ్గరకు రాగానే భిక్షువు అతన్ని పరీక్షగా చూశారు. యువరాజు చేయి చాచి గిన్నెను తీసుకొని అందులో ఉన్నదేమని చూశాడు. అది దేవలోకపు అమృతభాండం కాదని దృఢపరుచుకొన్నాడు. ఔషధం, లేక ఔషధం కలిపిన పాలని గ్రహించాడు. భిక్షువును చూసి, "స్వామీ! ఈ చోటేది? మీరెవరు? ఎన్నాళ్ళుగా నేనిలా పడుకొని ఉన్నాను?" అని అడిగాడు.

భిక్షువు అందుకు బదులేమీ చెప్పక తిరిగి వెళ్ళిపోయాడు ఆయన పక్కగదికి వెళ్ళి, "ఆచార్యా! జ్వరం బాగా తగ్గిపోయింది. స్పృహ పూర్తిగా వచ్చేసింది!" అనడం యువరాజు చెవిన పడింది.

~

కాసెపటికల్లా వయసు మళ్ళిన భిక్షువు ఒకరు పొన్నియిన్ సెల్వన్ ఉన్న గదిలోకొచ్చారు. యువరాజు మంచం దగ్గరకొచ్చి ఆయన కూడ యువరాజును పరీక్షగా చూశారు. తర్వాత విప్పారిన ముఖంతో, "పొన్నియిన్ సెల్వా! మీరున్న చోటు నాగపట్టణపు చూడామణి విహారం. తీవ్రమైన తాప జ్వరంతో మీరిక్కడికొచ్చి మూడు రోజులు గడిచాయి. తమకు ఈ సేవ చేసేందుకు మేము చాల భాగ్యం చేసినవారం!" అన్నారు.

"నేనూ భాగ్యశాలినే. ఈ చూడామణి విహారానికి వచ్చి చూడాలని చాల ఆసక్తి పడేవాడిని.

ఎప్పుడో ఈ నగరపు నదీ ముఖద్వారానికి వెళ్ళేటప్పుడు బయటి నుంచి చూశాను. దైవాధీనంగా నేనే ఇక్కడికి వచ్చి, కొన్నాళ్ళు ఇక్కడ గడిపేటట్లు జరిగింది. స్వామీ! నేనిక్కడికెలా వచ్చాను? చెప్పగలరా?" అని అరుళ్మొళి వర్మ అడిగాడు.

"యువరాజా! మొదట మీ చేతనున్న ఔషధాన్ని స్వీకరించండి. నాకు తెలిసిన వివరాలను చెబుతాను!" అన్నారు భిక్షువు.

యువరాజు ఔషధాన్ని ఆరగించి, "స్వామీ! ఇది ఔషధం కాదు, దేవామృతం. నా విషయంలో మీరు చాల శ్రద్ధ తీసుకొని నాకు చికిత్స చేశారు. కానీ నేనిందుకు కృతజ్ఞత తెలియజేయబోవడం లేదు!" అన్నాడు.

ఆచార్య భిక్షువు చిరునవ్వుతో, "యువరాజా! మీరు కృతజ్ఞతలు తెలియజేయవలసిన అవసరమూ లేదు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి వైద్యం చేయడం పరమ ధర్మమని బుద్ధ భగవానుడు చెప్పాడు. జబ్బు పడ్డ ప్రాణులకు కూడ చికిత్స చేయాలని బౌద్ధ ధర్మం చెబుతూంది. మీకు చికిత్స చేసినందులో విశేషమేమీ లేదు. చోళకులానికి నేను చాల ఋణపడివున్నాను. తమ తండ్రి సుందర చోళులు, తమ అక్కగారు కుందవై యువరాకుమారి బౌద్ధ ధర్మానికి ఎంతో ఆదరణ చూపి, సేవలు చేశారు. తమరు లంకలోని అనురాధపురంలో విరిగిపడ్డ బౌద్ధ విహారాలను పునర్నిర్మించేందుకు చేసిన ఏర్పాట్లు మాకు తెలిసినవే! అలా ఉన్నప్పుడు, మేము చేసిన ఈ చిన్న సహాయం కోసం మీనుంచి కృతజ్ఞతలు ఎదురు చూడడం లేదు..."

"ఆచార్యా! కృతజ్ఞత చెల్లించడం గురించి నేనా అర్థంతో చెప్పలేదు. నాకు ఎటువంటి తీవ్ర జ్వరం వచ్చిందో నేను గ్రహించాను. లంకలో ఈ జ్వరంవల్ల పీడించబడ్డవారి గతిని కళ్ళార చూశాను. నిజానికి నేనిప్పటికే ఆకాశలోకానికి చేరివుండాలి. అక్కడ దేవతలు, యక్షులు, కిన్నెరలు నన్ను స్వాగతించి ఉపచారాలు చేయవచ్చు కదా? దాన్ని మీరు చెడగొట్టేశారు! ఆకాశలోకం వాకిలి వరకు వెళ్ళిన నన్ను మళ్ళీ ఈ దు:ఖమయలోకానికి తీసుకొని వచ్చేశారు. అందుకే మీరు నాకు మేలు చేశారని భావించడం లేదు. అందుకే నేను మీకు కృతజ్ఞతలు చెల్లించనని చెప్పాను!"

ఆచార్య భిక్షువు ముఖం ఆనందంతో విప్పారింది.

"పొన్నియిన్ సెల్వ! మీరు ఆకాశలోకానికి వెళ్ళే సమయం ఆసన్నమైనప్పుడు దేవేంద్రుడు, తక్కిన దేవతలు విమానాలలో వచ్చి దేవ దుందుభి మ్రోగిస్తూ, పుష్పవర్షం కురిపిస్తూ తీసుకొని వెళతారు. కానీ ఆ సమయం ఇంకా చాల దూరాన ఉంది. ఆ భూలోకంలో మీరు చేయవలసిన మహాకార్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి! వాటిని ముగించే కద ఆకాశలోకానికి వెళ్ళడం గురించి ఆలోచించాలి?" అన్నారు.

~

ఇంతవరకు పడుకొనివున్న పొన్నియిన్ సెల్వన్ లేచి కూర్చొన్నాడు. అతని దివ్యముఖంలో అపూర్వమైన కళ తొణికిసలాడింది. అతని విశాలనేత్రాలనుంచి మెరుపుల్లాంటి కాంతి పుంజాలు తరంగాలుగా వెలువడి ఆ గదిని జ్యోతిర్మయం చేశాయి.

"ఆచార్యా! మీరు చెబుతున్నది నిజం. ఈ భూలోకంలో నేను కొన్ని కార్యాలను సాధించగోరుతున్నాను. మహాకార్యాలు కొన్ని చేసి ముగించగోరుతున్నాను. ఈ చూడామణి విహారాన్ని ఒకసారి బయటినుంచి చూశాను. అనురాధపురంలో ఉన్న స్తూపాలను, విహారాలను చూశాను. అక్కడున్న అభయగిరి విహారంలాగ ఈ విహారాన్ని పెద్దదిగ పునర్నిర్మించబోతున్నాను. అనురాధపురంలోని బుద్ధ విహారంలో ఉన్న శిల్పాలవంటి పెద్ద పెద్ద శిల్పాలను ఇక్కడ కూడ నిర్మించబోతున్నాను. ఇంకా, ఈ చోళసామ్రాజ్యంలోని శివాలయాలను పునర్నిర్మించబోతున్నాను. లంకలోవున్న విహారాలను చూసిన తర్వాత ఈ చోళదేశంలోని ఆలయాలను చూస్తే, నా మనసు, శరీరం కూడ కుంగిపోతున్నాయి. ఆకాశాన్నంటే గోపురాలున్న పెద్ద ఆలయాన్ని తంజావూరులో నిర్మించబోతున్నాను. అందుకు తగినట్లు మహాదేవుల శిల్పాన్ని నిర్మించబోతున్నాను. ఈ చోళదేశంలో బౌద్ధ స్తూపాలు, ఆలయ గోపురాలు ఒకదానితోనొకటి పోటీ పడబోతున్నాయి. వేవేల సంవత్సరాల తర్వాత పుట్టబోయే సంతతులు వాటిని చూసి భ్రమించిపోబోతున్నారు...!"

ఇలా ఆవేశంతో మాట్లాడిన తర్వాత యువరాజు ఒంట్లో చాలినంత బలం లేనందువల్ల మంచంలో ఒరిగాడు. వెంటనే ఆచార్య భిక్షువు అతని భుజాలను పట్టుకొని, అతని తల మంచం కోడుకు కొట్టుకోకుండ మెత్తగా పడుకోబెట్టారు. తల నిమిరి, "యువరాజా! మీరు తలుచుకొన్న మహాకార్యాలనన్నింటినీ కాల క్రమేణా సాధిస్తారు. మొదట మీరు పూర్తిగా కోలుకోవాలి. విశ్రాంతి తీసుకొండి!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 43

## నంది మంటపం

**మరునాడు** ప్రాతకాలం ప్రధాన భిక్షువు మళ్ళీ పొన్నియిన్ సెల్వన్ని చూడడానికి వచ్చారు. ఆయనను అనేక ప్రశ్నలడగాలని పొన్నియిన్ సెల్వన్ తహతహలాడుతున్నాడు. చిన్న భిక్షువును అడిగి తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. "అయ్యా! అన్నీ గురుదేవులు వివరిస్తారు!" అన్న ఒక్క ఉత్తరమే మళ్ళీ మళ్ళీ వచ్చింది.

గురుదేవులు వచ్చిన వెంటనే, "యువరాజా! ఇప్పుడు మీ దేహస్థితి ఎలా ఉంది?" అని అడిగారు.

"అయ్యా! నా ఒళ్ళు చాల ఇబ్బంది పెడుతోంది. 'ఎందుకు సోమరిగా పడుకొన్నావు? లేచి గుర్రమెక్కి పరుగెత్తు! నదిలోకి దూకి ఈదు! ఏనుగుతో దెబ్బలాడు! ఊరకే పడుకోక!' అంటూంది. కడుపు కూడ చాల చురుగ్గా పనిచేస్తోంది. చిన్న భిక్షువు తెచ్చి ఇచ్చిన ఆహారం చాలనే లేదు. ఆచార్యా! ఇన్నాళ్ళు నేను తీవ్ర జ్వరంతో పీడించబడి, తెలివితప్పి పడివున్నానని నమ్మలేకపోతున్నాను. మీ ఔషధం అద్భుతంగా పనిచేసింది!" అన్నాడు పొన్నియిన్ సెల్వన్.

"అయ్యా! దేహం చెప్పే మాటలను పెద్దగా తీసుకోకూడదు. జ్వరం తగ్గగానే అలాగే అనిపిస్తుంది. కాస్త అశ్రద్ధగా ఉండి, రెండవసారి జ్వరం వస్తే చాల అపాయం!"

"ఆచార్యా! నా ప్రాణానికి రాగల అపాయం గురించి నేనంతగా భయపడడం లేదు..."

"మీరు దిగులుపడడం లేదు, సరే! ఈ చోళదేశంలోని కోట్యాది ప్రజలు గత నాలుగైదు రోజులుగా ఎంతగా దిగులుపడుతున్నారో, తెలుసా? దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. చిన్నబిడ్డలనుంచి, వయోవృద్ధులవరకు అందరూ కన్నీరుమున్నీరవుతున్నారు....."

"అయ్యా! మీరు చెబుతున్నదేమీ నాకర్థం కావడంలేదు. ప్రజలెందుకలా విచారిస్తున్నారు? ఒకవేళ నాకు ఈ జ్వరం నయం కాదన్న భయమా? చూడామణి విహారంలో మీరు నాకు చికిత్స చేస్తున్నారని తెలిసినప్పుడు ప్రజలెందుకు దిగులుపడాలి?"

"యువరాజా! మీకు జ్వరమని, మీరు చూడామణి విహారంలో ఉన్నారని ప్రజలకు తెలియదు. ఈ నగరప్రజలకు తెలిస్తే ఈ విహారం ఇంత ప్రశాంతంగా ఉంటుందా? ప్రాకారం గోడలను విరగగొట్టేసి, ప్రజలందరూ మిమ్మల్ని చూసేందుకు ఇక్కడికి వచ్చేయరా? ఆరోజు ఉదయం మీరు కడలిలో మునిగిపోయినట్లు వార్త వచ్చినప్పుడు ఈ నగరప్రజలు లేపిన గగ్గోలు మీరు వినివుంటే ... అంతెందుకు? ఈ విహారంలోనే ఆనాడు కన్నీరు విడవనివారు లేరు కద?"

~

పొన్నియిన్ సెల్వన్ మంచంలో లేచి కూర్చొని, “గురుదేవా! ఇదేమిటిలా చెబుతున్నారు? నేను కడలిలో మునిగిపోయినట్లు వార్త వచ్చిందా? ఎప్పుడు వచ్చింది? ఎవరు అటువంటి భయంకరమైన వార్తను తీసుకొచ్చారు? ఎందుకని?” అని అడిగారు.

“ఎవరు తీసుకొచ్చారో, తెలియదు! ఒక రోజు ఉదయం ఆ వార్త ఈ నగరమంతటా వ్యాపించింది. తమను లంకనుంచి కోడిక్కరైకి తీసుకొస్తున్న ఓడ సుడిగాలిలో చిక్కుకొని మునిగిపోయిందని అందరూ చెప్పుకొన్నారు. కోడిక్కరై తీరం వెంబడి ధనాధికారి ఎంతగా వెతికించినా తమ శరీరం కూడ కనిపించలేదు. కాబట్టి మీరు సముద్రంలో మునిగిపోయారని గట్టిగా వార్త పాకిపోయింది. అది విని నేను కూడ ఈ విహారం వాకిట నిలబడి విచారిస్తుండగా, ఒక భిక్షువు వచ్చి, ఒక రోగిని ఎక్కించుకొని ఒక పడవ విహారం వెనుక భాగాన కాలువలో వేచివుందని చెప్పారు. నేను వెంటనే వచ్చి చూడగా, పడవలో ఉన్న రోగి మీరేనని గ్రహించాను. తర్వాత మూడు రోజులపాటు చికిత్స చేస్తూ వచ్చాను. నిన్నే మీకు తెలివి వచ్చింది.”

“ఆచార్యా! నన్ను పడవలో తీసుకొచ్చినవారెవరు? చెప్పగలరా?”

“”ఒక యువకుడు, ఒక యువతి పడవ నడుపుకొని వచ్చారు.”

“అవునవును; నాకు కూడ కలలో చూసినట్లు గుర్తుకొస్తోంది. వారిద్దరు ఎవరో తెలుసా? యువకుడు వాణర్ కులవీరుడు వంతిదేవుడా?”

“కాదయ్యా! అతడు తన పేరు సేందన్ అముదని అని చెప్పాడు. మిక్కిలి శివభక్తి కలిగినవాడని తోచింది. అమ్మాయి పేరు నేను తెలుసుకోలేదే! దేహదారుఢ్యం, మనోధైర్యం కలది...”

“అమె ఎవరో నేనూహించుకోగలను.. పడవ నడిపే పూంగుళలి; త్యాగ విడంగర్ కుమార్తె. వారు నన్నిక్కడికి ఎందుకు తీసుకొని వచ్చారో తెలియరాలేదా?”

“లేదు, యువరాజా! నేనా విషయం గురించి వారిని అడగనూ లేదు...”

“నేనిక్కడ భద్రంగా ఉన్నానని ఎవరికీ తెలియజేయలేదా?”

“లేదయ్యా! ఎవరికీ చెప్పవద్దని తమని ఇక్కడికి తీసుకొని వచ్చినవారు చెప్పారు. మీ దేహపరిస్థితిని ముఖ్యంగా పరిగణించి ఎవరికీ చెప్పకుండడమే మంచిదని నేనూ భావించాను...”

“ఆచార్యా! ఇందులో ఏదో కుట్ర ఉంది. నన్ను చెరపట్టి తీసుకొని రమ్మని నా తండ్రి - ముమ్మడి చోళమహారాజు - ఆజ్ఞాపించారు. దాని ప్రకారం నేను లంకనుంచి బయలుదేరాను. మధ్య ఏవేవో సంభవాలు జరిగాయి. చక్రవర్తి ఆజ్ఞకు విరుద్ధంగా నేను ఇలా నడుచుకొన్నానని నింద మోపేందుకే ఇలా కుట్ర పన్నబడినట్లు అనిపిస్తోంది. నేను సముద్రంలో మునిగిపోయినట్లు కూడ కథ కట్టి ప్రచారం చేసివుండాలి. గురుదేవా! మీరు నన్నీ చూడామణి విహారంలోకి స్వీకరించిందే ఒక రాజద్రోహమైన కార్యం. ఇంకా మీరు నన్ను ఇక్కడ దాచి పెట్టుకోవడం పెద్ద నేరమవుతుంది. వెంటనే నన్ను తంజావూరుకు పంపించేయండి...”

"యువరాజా! మీకు ఆశ్రయమిచ్చినందుకు నాకు రాజదండన విధించబడితే దాన్ని సంతోషంగా స్వీకరిస్తాను. దానివల్ల ఈ చూడామణి విహారాన్ని పడగొట్టి నేలమట్టం చేసినా అభ్యంతరం లేదు..."

"మీ ఆప్యాయతానురాగాలు నాకు చాల సంతోషాన్నిస్తున్నాయి, గురుదేవా! కానీ నన్ను తీసుకొని వచ్చినవారిని ఏమీ విచారించకుండ ఎలా నన్ను లోపలికి తీసుకొన్నారు?"

"విచారించవలసిన అవసరమేమి? తీవ్రజ్వరంతో వచ్చిన మిమ్మల్ని ఆహ్వానించి చికిత్స చేయడం కన్న నావంటి భిక్షువులకు ఇంకే ఉన్నతమైన కర్తవ్యం ఉంది? అదీగాక, తమ అక్కగారు కుందవైదేవి మీరు కొన్నాళ్ళిక్కడికి వచ్చి ఉండే ఉద్దేశం ఉందని ఇప్పటికే నాకు తెలియజేశారు..."

"ఓహో, అలాగా? యువరాకుమారేనా అలా చెప్పి పంపారు? ఎప్పుడు?"

"మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చేందుకు కొన్నాళ్ళకు మునుపు సేందన్ అముదన్ కూడ యువరాకుమారి కోరిక అదేనని చెప్పాడు."

"ఆచార్యా! నన్ను తీసుకొని వచ్చినవారిద్దరూ వెంటనే తిరిగి వెళ్ళిపోయారా? వారిని వెతికి కనిపెట్ట సాధ్యమా? వారిని కలిసి నేను కొన్ని వివరాలు తెలుసుకోవాలి?"

"అయ్యా! గాభరా పడకండి. వారిద్దరూ ఇంకా ఈ నగరంలోనే ఉన్నారు. ప్రతిదినమూ వచ్చి మీ ఆరోగ్యం గురించి విచారించి తెలుసుకొంటున్నారు. ఇవాళేమో ఇంకా రాలేదు..."

~

ఆ సమయాన చిన్న భిక్షువు వచ్చి ఆచార్య భిక్షువును చూసి ఏదో సైగ చేశారు. ఆచార్య భిక్షువు, "ఇదిగో, ఇప్పుడే వచ్చేస్తాను!" అని చెప్పి బయటకు వెళ్ళారు. ఆయన కాసేపటికల్లా తిరిగి రాగానే యువరాజు అరుళ్మొళి వర్మ ఆదుర్దా మరింత ఎక్కువైంది.

"ఆచార్యా! ఇక నేనిక్కడ మరొక్క క్షణం కూడ ఆలస్యం చేయలేను. చక్రవర్తి ఆజ్ఞను ధిక్కరించి నేనిక్కడికి వచ్చి దాక్కొన్నానన్న నిందను నేను మోయదలుచుకోలేదు. నావల్ల ఈ పురాతన చూడామణి విహారానికి ఎటువంటి హాని కలగడం కూడ నాకిష్టం లేదు" అన్నాడు యువరాజు.

పెద్ద భిక్షువు విప్పారిన ముఖంతో, "యువరాజా! నిజానికి నేను కూడ అటువంటి పెద్ద బాధ్యతను మోయలేను. మీ కోరికకు విరుద్ధంగా మిమ్మల్ని ఒక్క క్షణం కూడ ఇక్కడ ఉంచుకోగోరుకోవడం లేదు. ఈ క్షణమే మీరు బయలుదేరవచ్చు. కాలువలో పడవ సిద్ధంగా ఉంది!" అన్నారు.

"ఎక్కడికి వెళ్ళేందుకు?"

"అది మీరు తీర్మానించవలసిన విషయం. మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చిన ఇద్దరూ తమను తీసుకొని వెళ్ళడానికి వచ్చివున్నారు."

యువరాజు కాస్త జంకాడు. ఆచార్య భిక్షువు ముఖంమీద ఒక మర్మపూరితమైన లాస్యం విప్పారడం గమనించి, "ఇందులో ఇంకేదైనా కుట్ర దాగివుండడం సాధ్యమా?" అని ఆశ్చర్యపడ్డాడు.

“వారిద్దరూ తిరిగి వచ్చారా? ఎందుకని చెప్పలేదా?”

“చెప్పారు. ఈ విహారంనుంచి ఒక ఘడియ దూరంలో కాలువ గట్టున ఒక నంది మంటపం ఉంది. అక్కడ మిమ్మల్ని చూసేందుకు ఇద్దరు స్త్రీమణులు వచ్చి వేచివున్నారు...”

యువరాజు తొందర తొందరగా మంచంనుంచి లేచి, “ఆచార్యా! నన్ను వెంటనే పడవ దగ్గరకు పిలుచుకొని వెళ్ళండి! ఇంత ఆలస్యం అయింది కదా!” అన్నాడు.

~

ఆచార్య భిక్షువు యువరాజుకు చేయూతనిచ్చి కాలువ గట్టు వరకు పిలుచుకొని వెళ్ళారు. కానీ యువరాజు నడకలో నాలుగురోజులుగా తీవ్రజ్వరం వల్ల పీడించబడ్డ ఆనవాళ్ళేమీ కనిపించలేదు. నిటారుగా బలమైన అడుగులు వేస్తూ గంభీరంగా నడిచి వస్తున్న యువరాజును చూసి సేందన్ అముదన్, పూంగుళలి ముఖాలు విప్పారాయి.

అరుళ్మొళి వర్మ పడవలోకెక్కి కూర్చోగానే ఆచార్య భిక్షువు అతన్ని చూసి, “అయ్యా! తమకు సేవ చేసేందుకు ఏదైనా అవకాశం లభిస్తే ఈ విహారంలోని అందరు భిక్షువులు దాన్ని మహాభాగ్యంగా భావిస్తాము. మీరు మళ్ళీ ఇక్కడికి వచ్చి ఒక వారం రోజులుండి బలం తెచ్చుకోవడం మంచిది!” అన్నారు.

“గురుదేవా! నేను తిరిగి ఇక్కడికి వస్తాననే నాకూ అనిపిస్తూంది. లేకపోతే, ఇలా తక్కిన భిక్షువుల వద్ద సెలవు తీసుకోకుండ తొందరగా బయలుదేరేవాడిని కాను!” అన్నాడు యువరాజు.

పడవ కదలనారంభించగానే సేందన్ అముదన్, పూంగుళలి ఇద్దరిని మార్చి మార్చి చూస్తూ, “ఈ కాలువగుండా మీరు నన్ను తీసుకొని వచ్చినప్పుడు మీరు దేవలోకవాసులని, స్వర్గానికి మీరు నన్ను తీసుకొని వెళుతున్నారని అనుకొన్నాను. నన్ను ఏమార్చేశారు. సన్యాసి మఠానికి తీసుకొని వచ్చి చేర్చారు. పోతే పోనీ. సముద్రంలో ఈది ఈది అలిసిపోయి తెలివి తప్పిన తర్వాత జరిగినదంతా మీరు చెప్పగా వినాలి. దానికి ముందు, నంది మంటపంలో నాకోసం ఎదురు చూస్తున్నవారెవరని చెప్పండి!” అన్నాడు యువరాజు.

ఇద్దరినీ చూసి అడిగినప్పటికీ, పూంగుళలి నోరు మెదపలేదు. చివరికి సేందన్ అముదనే జవాబిచ్చాడు. యువరాకుమారి కుందవైదేవి, కొడుంబాళూర్ రాకుమారి ఆనైమంగలానికి వచ్చారని, అక్కడి నుంచి నంది మంటపానికి వచ్చి వేచివున్నారని తెలియజేశాడు.

“ఆహా! / అయినదానికీ, కానిదానికీ / ఉన్నదానికీ లేనిదానికీ/ మూర్ఛపడిపోయే ఆ అమ్మాయిని యువరాకుమారి ఇక్కడికి కూడ ఎందుకు పిలుచుకొని వచ్చింది?”

“అయ్యా! తమిళనాడు స్త్రీలకిప్పుడొ జ్వరం పట్టుకొంది. పవిత్రమైన శైవమతాన్ని వదిలి బౌద్ధమతం స్వీకరించి భిక్షుణిలు కావాలని మాట్లాడుకొంటున్నారు అన్నాడు సేందన్ అముదన్.

“అలా ఎవరెవరు మాట్లాడుకొంటున్నారు?”

“కొడుంబాళూర్ రాకుమారి అలా అంటున్నారట. ఇదిగో ఈ స్త్రీమణి కూడ అలా అంటూంది!”

“ఇద్దరే కద, అముదా! అందువల్ల శైవమతానికి నష్టం రాబోదు! లంకలో భిక్షుణిలు సన్యాస, తపోజీవనాన్ని కొనసాగించే అనేక మఠాలను నేనెరుగుదును. కావాలంటే నేనే వారిని పిలుచుకొని వెళ్ళి అక్కడ చేర్చేస్తాను! అని పొన్నియిన్ సెల్వన్ చెప్పగానే, సేందన్ అముదన్ నవ్వాడు.

తర్వాత, కడలినుంచి యువరాజు, వంతిదేవుడు తీరం చేరినప్పటినుంచి జరిగిన సంఘటనలన్నీ సేందన్ అముదన్ తనకు తెలిసినంతవరకు వివరించాడు. పొన్నియిన్ సెల్వన్ అదంతా ఆసక్తితో విన్నారు. అదే సమయాన తన జ్ఞాపకాలతో పోల్చి చూసుకొన్నారు.

“అదిగో నంది మంటపం!” అని పూంగుళలి చెప్పగానే యువరాజు ఆమె చూపించిన దిశగా చూశారు.

~~~
~~~

# అధ్యాయము - 44

## నంది ప్రవర్ధమానం

**అప్పుడు** పడవ వెళుతున్న చోట రెండువైపులా కాలువ గట్లు ఎత్తుగా ఉన్నాయి. పూంగుళలి చూపించిన చోట కాలువ వోరగా మెట్లున్న నంది మంటపం ఒకటి కనిపించింది. మెట్లు ముగిసి, మంటపం మొదలయ్యే చోట రెండువైపుల రెండు నంది విగ్రహాలున్నాయి. అమోఘ శిల్పకళానైపుణ్యంతో చెక్కబడి జీవకళ ఉట్టిపడుతున్న ఆ నంది భగవానుని శిల్పాలను రోజంతా చూస్తూ కాలం గడపవచ్చు. ఈ శిల్పాల ప్రాముఖ్యత మూలంగానే ఆ మంటపానికి 'నంది మంటపం' అన్న పేరు వచ్చింది. ప్రతి ఏడాది వసంతోత్సవ సమయంలో కారోణపు కాయారోహణ స్వామి, నీలాయతాక్ష అమ్మవారు ఆ మంటపానికి విజయం చేసి కొలువుదీరడం ఆనవాయితీ. అప్పుడు ప్రజలు తండోపతండాలుగా అక్కడికి వచ్చి చేరుతారు. ఉత్సవం చూసుకొని, వెన్నెల విందారగించి తిరిగి వెళతారు. నగరంనుంచి కాస్త దూరంగా ఉండడం వల్ల మామూలు రోజుల్లో ప్రజలంతగా రారు.

పడవ మంటపాన్ని సమీపించింది. మంటపంలో ఉన్న ఇద్దరు స్త్రీమణులను చూసిన తర్వాత యువరాజు దృష్టి ఇంకేవైపూ మళ్ళలేదు; అతని శ్రద్ధ కూడ ఇంకెటువైపూ మళ్ళలేదు. పడవ దగ్గరికి రాగానే యువరాకుమారి కుందవై మెట్లు దిగి కింది మెట్టుకు వచ్చింది. వాణతేమో మంటపంలోనే ఒక స్తంభం వెనక సగం దాక్కొన్నట్లు నిలబడింది.

పడవ మెట్ల వద్దకు వచ్చి ఆగింది. యువరాజు దిగేందుకు, పడవలోనుంచి సేందన్ అముదన్, మెట్లపైన నిలబడ్డ వైనం యువరాకుమారి సహాయం చేశారు.

సేందన్ అముదన్, పూంగుళలి పడవను వెనక్కు నడుపుకొంటూ వెళ్ళి కాస్త దూరాన నిలిపారు.

"తమ్ముడూ! ఎంత చిక్కిపోయావు?" అని కుందవై అన్నప్పుడు, ఆమె గొంతు జీరవోయింది.

పొన్నియిన్ సెల్వన్, "నా ఒంటి బలహీనత అలా ఉండనీ, అక్కా! నీ ముఖమెందుకు వాడిపోయివుంది? నన్ను చూడగానే నీ ముఖం తామరలాగ వికసిస్తుంది కదా? ఇవాళెందుకు నీ ముఖాన్ని మేఘం కప్పేసింది? నీ కళ్ళెందుకు కలతబారాయి? నీ మనస్సును గాయపరిచి, వేదన కలిగించే సంఘటనలెన్నో జరిగివుండాలి. లేకపోతే నాకు అంత అత్యవసరమైన తాళపత్ర సందేశం రాసి పంపించేదానివి కావు!" అన్నాడు.

"అవును, తమ్ముడూ! ఎన్నో అత్యవసరమైన విషయాలు నీకు చెప్పాలి; అడగాలి. లంకారాజ్యపు కనకపు సింహాసనాన్ని త్రోసిపుచ్చిన దానకర్ణా! ఈ నల్లరాతి సింహాసనంపైన కాసేపు కూర్చో!" అన్నది కుందవై.

~

పొన్నియిన్ సెల్వన్ కూర్చొనే ముందు అక్కగారి పాదాలను తాకి కళ్ళకద్దుకొన్నాడు. కుందవై అతడి తల నిమిరి, నుదుటిని చుంబించింది. ఆమె కళ్ళలో మళ్ళీ కన్నీళ్ళుబికాయి.

ఇద్దరూ కూర్చొన్న తర్వాత కుందవై, “తమ్ముడూ! ఈ రోజు నేను నిన్నిక్కడికి రప్పించే ఉండకూడదు. చూడామణి విహారపు ఆచార్యులు నీవు పూర్తిగా కోలుకొన్నావని సందేశం పంపించారు. అది సరి కాదు; జ్వరం నిన్ను పూర్తిగా మాడ్చేసింది. కానీ నిన్ను చూడకుండ ఉండలేకపోయాను. ఆనైమంగలానికి వచ్చిన తర్వాత ఒక్కొక్క క్షణమూ ఒక్కొక్క యుగంలాగ గడుస్తూంది!” అన్నది.

“అక్కా! నన్నిక్కడికి రప్పించినందుకు దిగులు పడకు. నీవుగనక పడవ పంపించివుండకపోతే నేనే పళైయారైకి బయలుదేరేవాడిని. అతి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పుడు కూడ నీవు పంపిన తాళపత్ర సందేశమే నా మనస్సును వేధించేది. ఆ తాళపత్రాన్ని ఒకరి ద్వారా పంపించావు కద? ఆ వాణర్ కులవీరుడు వంతిదేవునిలాంటి ధీరుని నేనింత వరకు చూడలేదు. ఆయన్ను నేనెన్నో విధాల పరీక్షించి చూశాను. అన్నిటా గెలిచాడు. ఆయనిప్పుడెక్కడ, అక్కా?”

కుందవై ముఖచంద్రుని కప్పిన మేఘం కాస్త తొలగింది. కెంపు పెదవులను విప్పి ముత్యాల పలువరుస తళుక్కుమనేలా చిరునవ్వు నవ్వి, “ఆయన గురించి ఇప్పుడెందుకు దిగులు? మాట్లాడవలసిన విషయాలింకెన్నో ఉన్నాయి!” అన్నది.

“అదేమక్కా, అలా అంటున్నావు? ఆయన నీకసంతృప్తి కలిగేలా నడుచుకొన్నారా?”

“లేదు, లేదు! నేనెందుకు అసంతృప్తిగొనాలి? నిన్ను పిలుచుకొని వచ్చి చేరుస్తానని మాటిచ్చారు. ఆమాట నిలబెట్టుకొన్నారు...”

“అందుకోసం ఆయన చేసిన మంత్రతంత్రాలు, పన్నాగాలు తలుచుకొంటే ఆశ్చర్యమేస్తుంది. ఆయనెక్కడక్కా? నీవిక్కడికి వచ్చావని తెలిసిన వెంటనే ఆయన కూడ నీతోబాటు వస్తారనుకొన్నాను. ఆయనకు బదులు ఉన్నదానికీ, లేనిదానికి మూర్ఛబోయే ఈ అమ్మాయి కద వచ్చింది?”

“ఈమె ఎంత ధైర్యశాలి అయిపోయిందని నీకు తెలియదు, తమ్ముడూ! నిన్న ముఖ్యమంత్రిగారి ఏనుగు దీన్ని తన తొండంతో ఎత్తి విసిరింది. పైన అంబారీలో కూర్చొన్న నా ఒడిలోకే విసిరింది. కానీ అది ఆమెకు తెలియదు! అప్పుడు ఎంత ధైర్యం కనబరిచిందో నీవు చూసివుంటే....”

“చాలు! నీ చెలికత్తె పొగడ్తలాపు. నా మిత్రుని గురించి చెప్పు!”

“ఆయన గురించి ఏం చెప్పను? ఆయన వచ్చిన కార్యం ముగిసింది. తిరిగి ఆయన యజమాని ఆదిత్య కరికాలన్ వద్దకు వెళ్ళిపోయారు.”

“అయితే ఆయన ఇచ్చిన మాట తప్పారు. ఇక కంచికి తిరిగి వెళ్ళనని, చోళదేశంలోనే ఉండిపోతానని చెప్పారే?”

"అదెలా సాధ్యం? చోళనాడులో ఆయన ఏం చేయాలి? ఇక్కడున్న వారి గతే రేపేమవుతుందో తెలియని పరిస్థితి. ఆయనమీద నీకంత ప్రీతి ఉంటే, చక్రవర్తికి తెలియజేసి ఆయన పూర్వీకులు ఏలిన చిన్న రాజ్యాన్ని ఆయనకు తిరిగి ఇప్పించు!"

"ఆ చిన్నరాజ్యాన్ని తీసుకొని ఆ మహావీరుడేం చేస్తారక్కా?

"అందరు చిన్నరాజులు ఏం చేస్తారో ఆయనా అదే చేస్తారు! నీవేమో లంకారాజ్యం వద్దని చెప్పేశావు; అలా ఆయన కూడ రాజ్యం వద్దంటారనుకొంటున్నావా?"

యువరాజు చిన్నగా నవ్వి, "అక్కా! లంకారాజ్యం వద్దని పక్కన సాక్ష్యాలుంచుకొనే చెప్పాను. కానీ నాపైన నింద మోపి, నన్ను చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని తండ్రిగారు ఆజ్ఞాపించారు..."

"తమ్ముడూ! నీవు లంకారాజ్య సింహాసనాన్ని స్వీకరించివుంటే ఆ ఆజ్ఞ పుట్టేది కాదు! నీవు స్వతంత్ర రాజువయ్యేవాడివి. అప్పుడు నిన్ను ఎవరు చెరపట్టి బంధించగలరు?"

"తండ్రి కోరికకు విరుద్ధంగా నేనలా నడుచుకొనివుండాలా?"

"పొన్నియిన్ సెల్వా! నీవు లంకారాజ్యాన్ని ఒప్పుకొనివుంటే నాన్నగారు చాల సంతోషించేవారు. మిగిలిన చోళసామ్రాజ్యాన్ని అన్నకు, మధురాంతకునికి భాగం వేసి పంపకం చేసేసి నెమ్మదిగా ఉండేవారు. ఇప్పుడూ అందుకే ప్రయత్నాలు జరుగుతున్నాయి, తమ్ముడూ! కొళ్ళిడం నదికి ఉత్తరాన ఉన్నదంతా ఒక రాజ్యంగాను, దక్షిణంగా ఉన్నదంతా ఇంకొక రాజ్యంగాను విభజించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నీవు వస్తే నాన్నగారికి సహాయంగా ఉంటావని ఆయన నమ్మకం. ముందు నీకు చెప్పి పంపించినప్పుడు నీవు రాలేదు. కాబట్టి ఈసారి నిన్ను చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించారు. లంకారాజ్యాన్ని నీవు తిరస్కరించావని చక్రవర్తికి బాగా తెలుసు..."

"రాజ్యాన్ని విభజించడానికి నేనెప్పుడూ సహకరించను. దానికన్న పెద్ద నేరం ఇంకేదీ లేదు. దానికి బదులు చిన్నాన్న మధురాంతకునికే పూర్తి రాజ్యాన్ని ఇచ్చేద్దాం."

"అలాగైతే నీవు, ముఖ్యమంత్రి ఒకే అభిప్రాయం కలిగివున్నారు."

"అవును. ముఖ్యమంత్రి కూడ అలాగే చెప్పారు. ఆయన లంకకు వచ్చిందే ఆ విషయం గురించి నాతో మాట్లాడేందుకే. అక్కా! లంకారాజ్యాన్ని వద్దని నిరాకరించిన నిజమైన కారణం చెప్పనా?"

"నాకు చెప్పక ఇంకెవరికి చెబుతావు, తమ్ముడూ!"

"అవును. నా అంతరంగ విషయాలు చెప్పుకోవడానికి ఇంకెవరూ లేరు. లంకకు వెళ్ళేముందు ఆ రాజ్యం గురించి చాల గొప్పగా అనుకొన్నాను. అక్కడికి వెళ్ళిన తర్వాతే తెలిసింది అదెంత చిన్న రాజ్యమని. గుర్రం పైన, లేదా ఏనుగెక్కి బయలుదేరితే ఒక్క రోజులో ఆ దేశం పశ్చిమ తీరం నుంచి తూర్పు సముద్రతీరానికి వెళ్ళి చేరవచ్చు."

"చోళనాడు కూడ దాని కన్న పెద్దదా, తమ్ముడూ? ఈ నాడును అలా గుర్రమెక్కి ఒక్క రోజులో

దాటలేవా?"

"చోళనాడు కూడ చిన్నదే. కాబట్టి చోళరాజ్య కిరీటాన్ని నాకెవరైనా ఇచ్చినా వద్దంటాను. ఈ పుణ్యభూమి తమిళనాడును చోళనాడు, పాండ్యనాడు, చేరనాడు అని విభజించారే, వారు చాల పెద్ద తప్పు చేశారు. అందుకే తమిళనాడులో వీరాధివీరులు పుట్టినా ఈ తమిళనాడు శోభిల్లలేదు. ఉత్తరదేశంలో చంద్రగుప్తుడు, అశోకుడు, సముద్రగుప్తుడు, విక్రమాదిత్యుడు, హర్షవర్ధనుడు.. ఇలా ఎందరో మహా చక్రవర్తులు ఉదయించి మహాసామ్రాజ్యాలను ఏలారు. తమిళనాడులో అలా ఎవరైనా పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించి ఏలారా? కంచి పల్లవకులంలో మహేంద్ర చక్రవర్తి, మహామల్లు ఉదయించి విరాజిల్లారు. తర్వాత ఆ కులంకూడ క్షీణించిపోయింది. అక్కా! నేను రాజ్యమేలేటట్లయితే, ఇలాంటి చిన్న రాజ్యాలనేలను. లంకనుంచి గంగ వరకు విస్తరించి నెలకొన్న సామ్రాజ్యాన్నేలుతాను. మలక్కా (మలేషియా) దీవి నుంచి శావక ద్వీపం వరకు సుదూర దేశాలలో పులిజెండా ఎగురుతుంది. మహాచోళ సామ్రాజ్య సింహాసనంపైన కూర్చొని రాజ్యమేలుతాను....! నన్ను ఒట్టి పిచ్చివాడనుకొంటున్నావు కద?"

"లేదు, అరుళ్మొళీ! నాలాగ గాలిమేడలు కట్టేందుకు నీవు తోడు దొరికావు కద అని సంతోషపడుతున్నాను. నీవు పిచ్చివాడివైతే, నేను నీకన్న పెద్ద పిచ్చిదాన్ని. మన తాతగారు పరాంతక చక్రవర్తి అలా ఎన్నో కలలుగన్నారని ఎరుగుదును. ఆయన కాలంలో అది పూర్తిగ నెరవేరలేదు. కానీ నా జీవితకాలంలో దాన్ని చూడబోతున్నాను. చోళసామ్రాజ్యం లంకనుంచి గంగ వరకు, మలై దీవినుంచి శావక ద్వీపం వరకు విస్తరించడాన్ని చూసే తీరుతాను. నా ఈ ధ్యేయం మన అన్న ఆదిత్య కరికాలన్ వల్ల నెరవేరుతుందని ఒకప్పుడు నమ్మాను. ఆ నమ్మకం నాకిప్పుడు లేదు. ఆయన మహావీరుడు. కానీ మనసును కట్టుబాటు చేసే సంయమనం అతడికి లేదు. కాబట్టి అతడు పెద్ద పెద్ద కార్యాలను సాధించలేడు. నా మనోరథం నీవల్లనే నెరవేరుతుందని నమ్ముతున్నాను. ఒకవేళ అది కూడ జరగకపోవచ్చు. అందువల్ల కూడ నేను నిరాశపడను. నీవల్ల సాధ్యం కాకపోతే నీ పిల్లలు సాధిస్తారని దృఢంగా నమ్ముతున్నాను. నీకు పుట్టబోయే కుమారుని నేనే పుట్టినప్పటినుంచి పెంచుతాను. వాడిని ఈ లోకం ఇంతవరకు చూసి ఎరుగని మహావీరునిగా తీర్చి దిద్దుతాను. వాడిని మహోన్నతాశయాలతో అద్భుతకార్యాలను సాధించగల పురుషసింహంగా సిద్ధం చేస్తాను..."

"అక్కా! నీవు నాకన్న పెద్ద పిచ్చిదానివి అన్నది నిజం. నాకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశమే లేదు. అలాంటప్పుడు నాకు పుట్టబోయే కొడుకు గురించి మాట్లాడుతున్నావు! నీవు ప్రేమతో పెంచుతున్న చెలికత్తెలలో ఎవరికైన అటువంటి ఉద్దేశముంటే, నన్ను పెళ్ళి చేసుకొని మణిమకుటం ధరించి సింహాసనమెక్కే ఆశవుంటే, అది ఏనాడూ జరగదని ఇప్పుడే చెప్పేసెయి!" అని పొన్నియిన్ సెల్వన్ అన్నప్పుడు అతని చూపులు ఒక్క క్షణం మంటపంలో ఒక స్తంభం మరుగున నిలబడ్డ వాణతివైపు మళ్ళాయి. మరు క్షణం ఇటు తిరిగినప్పుడు నంది విగ్రహం వైపు మళ్ళాయి.

"అక్కా! ఒక పని చేయి. లంకారాజ్యం చిన్నదైనా, దాన్ని పూర్వకాలంలో ఏలిన రాజులు మహాపురుషులు. పెద్ద మనసు కలిగినవారు. వారు పెద్ద పెద్ద ప్రణాళికలు వేసుకొని పెద్ద పెద్ద కార్యాలు సాధించారు. ఇటుకలు పేర్చి ఆకాశాన్నంటే బౌద్ధ విహారాలు కట్టించారు. వేయి, రెండువేల గదులున్న బౌద్ధవిహారాలను కట్టించారు. పదహారు వేల స్తంభాలున్న మంటపాలను కట్టించారు. బుద్ధ భగవానుడు ఎంతటి మహోన్నతుడని చూడగానే తెలుసుకోవడానికి, అదిగో ఆ కొబ్బరి చెట్టంత ఎత్తైన బుద్ధ విగ్రహాన్ని నిర్మించారు. అక్కా! ఇదిగో, మన ముందున్న నంది విగ్రహాన్ని చూడు! ఎంత చిన్నదిగా ఉంది! ఆపాద మస్తకం అనంత రూపుడైన మహాదేవుని వాహనం ఇంత చిన్నదిగానా ఉంటుంది? కైలాసంలో మహాదేవుని పరివారాలేమో భూతగణాలు. ఆ భూతగణాలు తరచూ వచ్చి ఇబ్బంది కలిగించకుండ కైలాసం వాకిట కాపలా కాసేవారు నందిదేవులు. ఆయన ఇంత చిన్న రూపందాల్చివుంటే భూతగణాలను ఎలా అడ్డుపడి ఆపగలరు? అదిగో చూడక్కా! నా కళ్ళముందు నంది విగ్రహం పెరుగుతోంది. పెరిగి, పెరిగి పెద్దదవుతోంది. బ్రహ్మాండ రూపందాల్చి ఈ మంటపం కప్పును తాకుతోంది. పైకప్పు ఇప్పుడు ఎగిరిపోయింది. నంది భగవానుడు ఆకాశాన్నంటుతూ నిలబడ్డారు! భూతగణాలు వస్తున్నారు. నంది భగవానుని చూసి భయభక్తులతో నిలబడి శివుని దర్శనం కోసం అనుమతి కోరుతున్నారు! నంది భగవానుడు అంత పెద్దవారైతే, శివపరమాత్మ ఆలయం ఇంకెంత పెద్దదిగా ఉండాలి? దక్షిణ మేరువు అన్నంతగా ఆకాశాన్నంటే గోపురాన్ని కట్టవద్దా? అందుకు తగిన ప్రాకారాలుండాలి కద? ఇప్పుడు చోళనాడులో ఉన్న శివాలయాలు అగస్త్యముని కొలువయ్యేందుకు మాత్రమే తగును. శివపరమాత్మకు తగవు. నాకు రాజ్యమూ వద్దు, ఏమీ వద్దు. చోళసింహాసనంపైన ఎవరు కూర్చొన్నా కూడ, ఆలయ కైంకర్యం చేసే అధికారిగా నియమించమని కోరుకొంటాను..."

"తమ్ముడూ! మనిద్దరిలో ఎవరికి ఎక్కువ పిచ్చి అని తేల్చేందుకు పోటీ ఏర్పాటు చేయవలసిందే. ప్రస్తుతం ఈ చోళనాడును పెద్ద అపాయం కమ్ముకొంది. అంతర శత్రువుల వల్లను, బాహ్య శత్రువుల వల్లను, స్నేహితుల్లాగ నటించే పగవారి వల్లను అపాయం రాబోతూంది. కొంతకాలంగ నేను తరచూ ఒక భయంకరమైన కలగంటున్నాను. మెరుపులాగ కాంతులీనే ఒక మారణఖడ్గం నా అంతర్నేత్రం ముందు కనిపిస్తూంది. అది ఎవరిమీదో పడబోతూంది. అది ఎవరని తెలియడం లేదు. చోళకులానికి చెందిన వారెవరైనా ఆ మారణ ఖడ్గానికి బలి కాబోతారా, లేక ఈ చోళ సామ్రాజ్యాన్నే అది రెండుగా చీల్చి నాశనం చేయబోతూందా అని తెలియడం లేదు. నీవు, నేను బాగ ఆలోచించి అటువంటి అపాయం ఈ చోళనాడుకు కలగకుండ ఆపాలి!" అన్నది యువరాకుమారి.

"అవునక్కా! వల్లవరయ్యన్ చెప్పిన వివరాలను బట్టి నాకు కూడ అలాగే అనిపిస్తూంది. చోళరాజ్యానికి ముఖ్యమైన అపాయం ఎవరివల్ల రాబోతూందని నీవెరుగుదువు కద?" అన్నాడు యువరాజు.

"పళువూర్ యువరాణి నందినినే కద నీవు సూచిస్తున్నావు, తమ్ముడూ?"

"అవునక్కా! ఆమె ఎవరని కూడ నీపెరుగుదువు కద?"

"వంతిదేవులు చెప్పిన వివరాలనుంచి అది కూడ తెలుసుకొన్నాను. అందుకే ఇంత హడావుడిగా నిన్ను చూసేందుకు వచ్చాను!" అన్నది కుందవై.

~~~
~~~

# అధ్యాయము - 45

## వాణతికి అపాయం!

"**అక్కా**! అయిదేళ్ళ ప్రాయంలో నేను కావేరి నదిలో పడిపోయిన సంఘటన గుర్తుంది కద? కావేరిమాత నన్ను కాపాడి పడవలో పెట్టేసి మాయమైన విషయం గుర్తుందా?" అని అరుళ్మొళి వర్మ అడిగాడు.

"ఇదేం మాట, తమ్ముడూ? అది నేనెలా మరిచిపోగలను? నీకు 'పొన్నియిన్ సెల్వన్' అన్న పేరొచ్చిందే ఆ సంఘటన మూలంగానే కదా?" అన్నది కుందవై.

"నన్ను కాపాడిన కావేరితల్లిని నేను లంకలో చూశానక్కా! ఏం, మాట్లాడకున్నావే? నీకు ఆశ్చర్యంగా లేదా?"

"ఆశ్చర్యం లేదు, తమ్ముడూ! కానీ చాల కుతూహలంగా ఉంది. ఆమె గురించి అన్ని వివరాలూ చెప్పు!"

"ఒక్కరోజులో, ఒక్కసారిగా చెప్పలేను. ముఖ్యమైన వివరాలు మాత్రం చెబుతాను. కావేరి నదినుంచి నన్ను కాపాడడం మాత్రమే కాదు; లంకలో నన్ను చాలసార్లు కాపాడింది. నా ప్రాణం కాపాడింది పెద్ద విషయం కాదక్కా! ఎంతో మంది కాకతాళీయంగా ఇతరుల ప్రాణాలను కాపాడుతున్నారు. ఆమె నాపైనగొన్న ప్రేమ, మమకారం ఉంది చూశావూ, దానికి ఏడేడు లోకాల్లో సాటిలేదు. అంతెందుకు? నీకు నాకున్న ప్రేమ, మమకారం కూడ ఆమె ప్రేమ తర్వాతే అని చెప్పాలి!"

"అది చెప్పేందుకు నీవు జంకనవసరం లేదు. నాకు నీమీద ఉన్న ప్రీతి అంత ఉన్నతమైనది కాదు; స్వార్థంతో కూడుకొన్నది. నిజం చెబుతున్నాను, తమ్ముడూ! నాకీ చోళసామ్రాజ్య సంక్షేమమే ప్రధానం. అందుకు నీవు ఉపయోగపడతావనే నీపై నేనింత ప్రీతిగొన్నాను. అందుకు నీవు అడ్డు వస్తావనిపిస్తే ఆ నాప్రేమ అయిష్టంగా మారిపోవచ్చు. కానీ ఆ మూగవనిత అనురాగం అటువంటిది కాదు. మన తండ్రిపైన ఇరవైయేళ్ళ కన్న ఎక్కువకాలంగా పొంగి పొర్లుతున్న ప్రేమను నీపైన కురిపిస్తోంది. అందుకు పధ్నాలుగు లోకాలూ సాటిరావు!"

"నీకదెలా తెలిసిందక్కా?"

"దేన్ని గురించి అడుగుతున్నావు, తమ్ముడూ?"

"ఆమె మన పెద్దమ్మ అన్న విషయం."

"తండ్రి చెప్పిన వివరాలు, వంతిదేవులు చెప్పిన వివరాలు బేరీజు వేసుకొని ఊహించుకోగలిగాను, తమ్ముడూ! ఆమె నిన్ను తన స్వంత కొడుకుగా భావిస్తోందా? లేక చక్రవర్తి కుమారునిగా భావిస్తోందా?"

"అటువంటి భేదభావం నా మనసులోను ఉదయించలేదు; ఆమె మనసులోను ఎప్పుడూ కలిగినట్లనిపించలేదు. నీవెందుకలా వేరు చేసి మాట్లాడుతున్నావు?"

"తమ్ముడూ! ఆ మూగవనిత ఆసీనురాలు కావలసిన సింహాసనం పైన మన తల్లి కొలువైవుంది. అది తెలిసికూడ ఆమె నీపైన అంతటి మమత, అనురాగం కలిగివుండడం విశేషమే కదా?"

"నేను ఆమె కడుపున పుట్టని కుమారుడని ఆమెకు తెలిసేవుండాలి. వయసు తేడా తెలియకుండ పోతుందా? ఆమె మాట్లాడలేని మూగది; మనసులోని మాట చెప్పలేదు. ఏవో చిత్రాలను చూపించగా, ఎంత తెలుసుకోవడానికి సాధ్యమో, అంత వరకు తెలుసుకొన్నాను. నాపైన ఆమెకున్న ప్రేమ అలావుండనీ. మన తండ్రిపైన ఆమెకు ఎంత ప్రేమ, అనురాగం ఉండాలని తలుచుకొంటే నా మనసు కరిగిపోతూంది. అక్కా! నాప్రాయంలో నాన్న నాలాగ ఉండేవారా?"

""లేదు, తమ్ముడూ, లేదు! నీ వయసులో నాన్నగారు మన్మధుడికి దీటుగా సుందర రూపంతో విరాజిల్లేవారు. మన చోళకులం వీరత్వానికి పేరుగాంచినదేగాని, అందానికి కాదు. మన తాతగారైన అరింజయులు అందానికి పేరుగాంచిన వైదుంబరాయ కులంలో పుట్టిన కల్యాణిని పెళ్ళాడారు. అప్పుడు మన నానమ్మ కల్యాణి అపరంజి బొమ్మలాంటి బంగారు మేనుతో, పూర్ణచంద్రుని వంటి సుందర ముఖారవిందంతో విరాజిల్లేది. ఇప్పుడు అంత వయసైన పిమ్మటకూడ నానమ్మ ఇంకా ఎంత అందంగా ఉందో నీకు తెలుసు. అందువల్ల మన నాన్నగారు కూడ అంతే అందంగా ఉండేవారు; సుందర చోళులు అన్న పేరు పొందారు. మనం మన తల్లినిగొని పుట్టాము. తిరుక్కోవలూర్ మలైయమాన్ వంశంలో పుట్టినవారు అందాన్ని అయిష్టపడేవారు; అందం వీరత్వానికి శత్రువు అని భావించేవారు..."

"అందానికి, వీరత్వానికి ఏం సంబంధం ఉందో నాకు తెలియదు. కానీ, అందానికి, ప్రీతికి సంబంధం లేదని ఎరుగుదును. లేకపోతే..."

"లేకపోతే ఈ పిల్ల వాణతి స్తంభం చాటునుంచి ఎందుకు కళ్ళార్పకుండ చూస్తోంది? అదిగో, ఆ పడవలో సేందన్ అముదన్ పూంగుళలిని కళ్ళార్పకుండ ఎందుకు చూస్తున్నాడు?"

యువరాజు చిరునవ్వుతో, "అక్కా! నీవు ఇక్కడినుంచి ఇంకెక్కడికో వెళ్ళిపోయావు! నా పెదతల్లి నాపైనగొన్న ప్రేమ గురించి చెప్పాను. అదలా ఉండనీ. ఈ ప్రపంచంలో ఒకరి ప్రతిరూపంలాగ ఇంకొకరు ఉండడం సాధ్యమా, అక్కా?"

"ఎందుకు సాధ్యం కాదు? కవల పిల్లలైతే అది సాధ్యం. లేక, తల్లి, కూతురు ఒక ప్రాయంలో అచ్చం ఒక్కలాగే ఉండడం సాధ్యం. ఇదిగాక, బ్రహ్మ చేసిన సృష్టిలో ఒకరికొకరు రక్తసంబంధం లేనివారు కూడ ఒకరినొకరు పోలివుండడం చాల అరుదుగా సాధ్యం."

"పళువూర్ యువరాణి, నేను లంకలో చూసిన మన పెద్దమ్మ ఒకేలాగున్నారని వంతిదేవులు చెప్పింది నిజం కావడం సాధ్యమా? నందిని చిన్నపిల్లగా ఉన్నప్పుడు మాత్రమే చూశాను. పళువూర్ రాణైన

తర్వాత చూడలేదు. నీకేమనిపిస్తూంది?"

"నేను పళువూర్ రాణిని చూశానుగాని, మన పెద్దమ్మను చూడలేదు. కానీ వంతిదేవులు చెప్పింది నిజమే అయివుండాలి. మన తండ్రి చెప్పిన వృత్తాంతంనుంచి అది తెలుసుకొన్నాను, తమ్ముడూ!"

"నాన్నగారే నీకు చెప్పారా? ఏం చెప్పారు? ఎప్పుడు?"

"కొన్నాళ్ళ క్రితం నేను, వాణతి తంజావూరుకు వెళ్ళాము. అప్పుడు తన యుక్తవయసులో జరిగిన సంఘటనలు చెప్పారు. లంకకు సమీపాన ఉన్న ఒక దీవిలో తాను దాక్కొన్న విషయం, ఆ దీవిలో ఒక మూగపిల్ల తనపైన చూపిన ప్రేమ గురించి చెప్పారు. పరాంతక చక్రవర్తి మనుషులు తనను ఆ దీవిలో వెతికిపట్టి పిలుచుకొని వచ్చిన విషయాన్ని వివరించారు. తనకు యువరాజు పట్టం కట్టిన రోజు అంతఃపురం వాకిట గుమిగూడిన జనంలో ఆమెను చూశారట. మరుక్షణం ఆమె మాయమైపోయిందట. ఆమెను వెతికి పిలుచుకొని రమ్మని ముఖ్యమంత్రి అనిరుద్ధులనే పంపారట. కానీ ఆమె దీపస్తంభం పైనుంచి సముద్రంలోకి దూకి మునిగిపోయిందని ముఖ్యమంత్రి తిరిగివచ్చి చెప్పారట. ఈ సంఘటన మన తండ్రి మనసును గత ఇరవైనాలుగేళ్ళుగా వేధిస్తూంది అని గ్రహించాను. ఆమె చనిపోయిందనే మన తండ్రి భావిస్తున్నారు. తమ వల్ల, తాము చేసిన నేరం వల్ల ఆమె ఆత్మహత్య చేసుకొందని ఆయన భావిస్తున్నారు. తమ్ముడూ! చోళసామ్రాజ్యం గురించిన మన గాలిమేడలన్నీ ఒక పక్క ఉంచు. నీవు, నేను చేరి మన తండ్రికి తీర్చవలసిన బాధ్యత ఒకటుంది. నీవెలాగైనా లంకనుంచి ఆ మహిళామణిని తంజావూరుకు పిలుచుకొని రావాలి. తండ్రికి ఆమె చనిపోలేదు, బతికేవుంది అని ప్రత్యక్షంగా నిరూపించి చూపించాలి. లేకపోతే మన తండ్రికి ఈ జన్మలోను మనశ్శాంతి లేదు, వచ్చే జన్మలోను ఉండదు!"

"అక్కా! ఇటీవల నేను రెండుమూడుసార్లు మరణద్వారం వరకు వెళ్ళి తిరిగివచ్చాను. అప్పుడల్లా నా మనసులో ఏం తోచేదో తెలుసా? పెద్దమ్మను నాన్న దగ్గరకు తీసుకొని వెళ్ళి చేర్చేలోపే నేను చనిపోతానా అన్న దిగులే. అక్కా! ఆ మహాతల్లిని తలుచుకొంటే నా మనసు కుమిలిపోతోంది. నోరుంటే మనసులోని కొరతలను, వేదనలను మాటల ద్వారా వెలిబుచ్చి పంచుకోవచ్చు, నెమ్మదిగొనవచ్చు. చెవులుంటే ఎదుటివారి ఓదార్పు మాటలతో ఊరటగొనవచ్చు. అవి రెండూ లేని ఆమె పరిస్థితిని ఊహించి చూడు! మనసులో పొంగుతున్న మమతానురాగాలను, వేదనలను, కొరతలను - అన్నిటినీ అదిమిపెట్టుకోవాలి. అందులోను మన పెద్దమ్మలాగ ఆశాభంగానికి గురైన వారి మనఃస్థితి గురించి చెప్పాలా? ఆమె పిచ్చిదానిలాగ లంకలోని అడవుల్లో తిరుగాడుతుండడంలో ఆశ్చర్యమేమి? అదంతా తలుచుకొంటే నా గుండె పేలిపోతుందేమోననిపిస్తుంది. ఆమెను ఎలాగైనా పిలుచుకొని వచ్చి నాన్న దగ్గరకు చేర్చేయాలన్న కోరిక బలంగా కలుగుతోంది. కానీ మన నాన్న కూడ అలా కోరుకొంటున్నారా, అక్కా?"

"నాన్న కోరుకొన్నా, లేకపోయినా మన కర్తవ్యం అది, తమ్ముడూ! చనిపోయినవారి ఆత్మ వచ్చి ఆయనను బాధిస్తున్నట్లు రాత్రుల్లో ఆయన అరుస్తున్నారు. అందువల్లే ఆయన కోలుకోవడం లేదు."

"ఇది నీకెలా తెలిసిందక్కా? ఇది కూడ నాన్నగారు చెప్పారా?"

"నాన్నగారు చెప్పారు; నా స్నేహితురాలు వాణతి కూడ చెప్పింది."

"వాణతి చెప్పిందా? ఆమెకు, దీనికి ఏం సంబంధం? అక్కా! నీవామెకు చెప్పావా, ఏమి?"

"లేదు, లేదు! తంజావూరు అంతఃపురంలో ఒక రాత్రి జరిగిన సంఘటనను ఆమె మాటల్లోనే చెప్పమంటాను. అయినాకూడ నీవు చాల చెడ్డవాడివి, తమ్ముడూ! చోళవంశ సంప్రదాయాన్నే మరిచిపోయావే! ఆమెతో ఒక్కమాట కూడ మాట్లాడలేదు; సౌఖ్యమా అని విచారించను కూడ లేదు! మహావీరులైన చిన్నవేళార్ కుమార్తెకు నీవు చేసే మర్యాద ఇదేనా? చాల బాగుంది!"

"అక్కా! వాణతిని చూసుకోవడానికి నీవున్నప్పుడు దిగులేల? సౌఖ్యమా అని నేను విచారించనేల?"

"చాల ఒప్పే; కాస్త నోరు మూసుకో! వాణతీ! ఇలా రా! నిన్ను యువరాజు చూడాలట!" అన్నది కుందవై.

వాణతి స్తంభం చాటునుంచి ఇవతలికి వచ్చి, యువరాజును చూసీ చూడనట్లు నిలబడి, "అక్కా! ఎందుకు కల్పించి చెబుతున్నారు? మీ తమ్ముడు నన్ను చూడగోరడం లేదు. ఆయన చూపులన్నీ అదిగో ఆ కాలువలో ఉన్న పడవపైనే ఉన్నాయి. తొందరగా తిరిగి వెళ్ళాలి కాబోలు!" అని పట్టువంటి మృదువైన స్వరంతో అన్నది. పడవలోవున్న పూంగుళలిని ఎంచి పడవను సూచించింది కాబోలు!

యువరాజు నవ్వుతూనే, "అక్కా! నీ చెలికత్తెకు మాట్లాడడం వచ్చునే! మన కుటుంబానికి చెందిన మూగవాళ్ళతోబాటు ఈమె కూడ మూగదేమోనని భయపడ్డాను!" అన్నాడు.

"అక్కా! ఈయనను చూస్తుంటే నాకే మాటలు రావడం లేదు. నాకు నేనే మూగదాన్నయిపోయానా అని భయం వేస్తూంది!" అన్నది వాణతి.

"అది చాల మంచిది. కోడిక్కరైలో ఒకడున్నాడు - పూంగుళలి అన్న. తక్కినవారి దగ్గర గట్టిగా మాట్లాడుతాడు. కానీ పెళ్ళాం ముందు మాత్రం మూగవాడైపోతాడు. అందువల్ల వాడిని ఊరివారు మూగవాడనే పరిగణిస్తున్నారు!" అన్నాడు యువరాజు.

"ఈ కొడుంబాళూర్ పిల్ల కాస్త అలాంటిదే. మునుపల్లా ఈమెను కాసేపు మాట్లాడకుండ ఉండమంటే ఊరుకొనేది కాదు. మాట్లాడేందుకు మొదలుపెడితే ఆపేదేకాదు. నీవు మొట్టమొదటిసారిగా లంకకు వెళ్ళావు చూడు, అప్పటినుంచి ఈమె మాట తగ్గిపోయింది. ఒంటరిగా కూర్చొని ఏదో ఆలోచిస్తూంటుంది. అది పోతే పోనీ. వాణతీ! ఆ రోజు రాత్రి తంజావూరు అంతఃపురంలో జరిగిందంతా యువరాజుకు వివరంగా చెప్పు!" అన్నది కుందవై.

"కొడుంబాళూర్ రాకుమారి కూర్చొని చెప్పనీ, అక్కా! ఈమె ఇంతసేపు ఇలా నిలబడ్డం తెలిస్తే ఆమె పెదనాన్న కరిగిపోతారు. దక్షిణ సేనాధిపతి నన్ను చూసినప్పుడల్లాఈమె గురించి విచారిస్తారు. నీవే

ఈమె గురించి ఏమీ చెప్పి పంపించలేదు. కాబట్టి ఆయనకు బదులు చెప్పలేక ఇబ్బంద పడేవాడిని" అన్నాడు యువరాజు.

"వంతిదేవుల చేత ఈమె గురించి వివరంగా చెప్పి పంపాను కద? ఆయన నీకేమీ చెప్పలేదా?"

"ఆయన చెప్పేవుంటారక్కా! ఈయన చెవిన ఏమీ పడివుండదు. ఇంకేవో విషయాలమీద ధ్యాసగొనివుంటారు!" అన్నది వాణతి.

"అదీ నిజమే; నీ పత్రం చూసిన తర్వాత నాకింకే విషయంపైనా మనసు మళ్ళలేదు. ఈ జ్వరం తర్వాత నా చెవులుకూడ కాస్త మందగించాయి. నీ చెలికత్తెను కాస్త పెద్దగా మాట్లాడమను!" అన్నాడు అరుళ్మొళి.

తర్వాత, వాణతి తంజావూరు అంత:పురంలో, కుందవై దుర్గాదేవి ఆలయానికి వెళ్ళిన తర్వాత, ఒంటరిగా పైమేడ మీద పచార్లు చేయడానికి వెళ్ళిన విషయం, చక్రవర్తి ఆర్తనాదం వినిపించిన విషయం, ఆ చోటికి తాను వెళ్ళి కిందికి తొంగి చూడగా అక్కడ తాను చూసిన దృశ్యం గురించి చెప్పింది. మధ్యమధ్య తలెత్తి యువరాజు ముఖాన్ని నేరుగా చూడ ప్రయత్నించినప్పుడు అలాగే మైమరచి నిలబడిపోయేది. యువరాకుమారి అలాంటప్పుడు ఆమెను కుదిపి మళ్ళీ మాట కొనసాగించేలా చేయవలసి వచ్చింది.

అదంతా ఆసక్తితో వింటున్న యువరాజు చివరిగా అక్కగారిని చూసి, "అక్కా! నీ చెలికత్తె ఒక ముఖ్యమైన సంఘటనను విడిచిపెట్టేసినట్లుందే! ఇంతా చూసి, విన్న తర్వాత ఈమె మూర్ఛిల్లివుండాలి కద?" అన్నాడు.

కుందవై నవ్వింది; వాణతి సిగ్గుతో తలవంచుకొంది.

కుందవై ప్రేమ నిండిన కళ్ళతో వాణతిని చూస్తూ, "వాణతీ! నీవు కాసేపు కాలువ గట్టు వెంబడి నడిచేసి రా; లేకపోతే మన పరివారమున్న చోటికి వెళ్ళి ఉండు. అరుళ్మొళి ఇంకొన్నాళ్ళు ఇక్కడే ఉంటాడు. మళ్ళీ చూడవచ్చు!" అన్నది.

"అలాగే అక్కా! కాసేపు నడిచేసి వస్తాను!" అని చెప్పేసి వాణతి తుళ్ళుతూ, గెంతుతూ వెళ్ళిపోయింది.

వికసించిన ముఖంతోను, విప్పారిన కళ్ళతోను ఆమె వెళ్ళడాన్ని చూస్తూన్న అరుళ్మొళి వర్మ, ఆమె కనుమరుగైన వెంటనే అక్కగారివైపు తిరిగాడు.

"అక్కా! నాన్నగారి పలవరింతలకు కారణం నాకిప్పుడు తెలుస్తోంది. కానీ ఆయన చూసిన దృశ్యం గురించి నీ అభిప్రాయమేమి? ఆయన ముందు కనిపించిన దృశ్యం ఏమైవుంటుంది? తండ్రి చిత్తభ్రమా? అలాగైతే నీ స్నేహితురాలికి  కూడ ఆ భ్రమ ఎలా కలిగివుండ సాధ్యం?"

"తండ్రి చూసింది భ్రమ కాదు; వాణతి చూసింది కూడ మాయ కాదు. నాన్న కళ్ళ ముందు జరిగింది నడిరాత్రి నాటకం. అందులో ముఖ్యపాత్రను నటించింది నందిని. దాన్ని నేనిప్పుడే ఊహించి

తెలుసుకొన్నాను. వంతిదేవులు, నీవు చెప్పిన వివరాలు విన్న తర్వాత అది రూఢి అయ్యింది..."

"ఆ నాటకానికి కారణమేమి? పళువూర్ రాణి అలా ఎందుకు చేయాలక్కా?"

"నందినికి తన పుట్టుక గురించి సందేహం ఉంది. చక్రవర్తి తనను చూసి మునుపొకసారి మూర్ఛిల్లిన విషయం ఆమె ఎరుగును. దాని తర్వాత ఆమె తండ్రి ఎదుటికి రానేలేదు! ఇలా ఒక నాటకం జరిపితే నిజం తెలుసుకోవచ్చునని చేసింది..."

"తెలిసివుంటుందా, అక్కా?"

"అది నేనెరుగను. నందిని మనసులో ఏముందో ఆమెను సృష్టించిన బ్రహ్మదేవుడు కూడ తెలుసుకోలేడు. పళువేట్టరయ్యర్ ఆమె చేతిలో పడే పాట్లు తలుచుకొంటే నాకు చాల జాలేస్తుంది, తమ్ముడూ! కాసేపటి క్రితం అందం గురించి మాట్లాడుకొన్నాం కద? స్త్రీలలో అందగత్తె అంటే నందినే. మనమంతా ఆమె కాలి ధూళికి కూడ సాటి కాము. నందిని ముందు ఎంతటి పురుషులైనా దాసోహం కావలసిందే. పళువేట్టరయ్యర్, మధురాంతకుడు, తిరుమలై, గందమారన్, చివరిగా పార్థిబేంద్రుడు! ఆమె అందానికి భయపడి ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ అటువైపు వెళ్ళడమే లేదు. ఆదిత్య కరికాలన్ అందుకే తంజావూరుకు రావడం లేదు. తమ్ముడూ! నందిని అందానికి దాసోహమనక, ఆమె చేత ఓడిపోక గెలుపొందిన పురుషులు ఒకే ఒక్కరే...!"

"వాణర్ కులవీరునే కద సూచిస్తున్నావు?"

"అవును! ఆయనే! అందుకే ఆయనను కంచికి ఆదిత్య కరికాలన్ వద్దకు పంపానిప్పుడు."

"ఎందుకు?"

"పళువూర్ రాణి కడంబూర్ శంబువరయ్యర్ మాళిగకు రమ్మని మన అన్నగారికి సందేశం పంపింది. వారు కలవకుండ అడ్డుపడేందుకు వంతిదేవులను పంపించాను. అలా కలిసినా, ఎలాంటి విపరీతమూ జరగకుండ కాపాడేందుకు పంపాను. కరికాలన్‌కి నందిని మన అక్క అని తెలియదు. నందిని మన సంబంధాన్ని తెలుసుకొందా లేదా అని కూడ నేనెరుగను."

"ఆమె మన అక్క అన్నది నిశ్చయమా, అక్కా?"

"అందులో సందేహమేమి? తమ్ముడూ! నేనా విషయాన్ని తెలుసుకొన్న తర్వాత నా మనసును పూర్తిగా మార్చేసుకొన్నాను. మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు నేను నందినిని ఏవగించుకొనేదాన్ని; అవమానించేదాన్ని. ఆమె అందం చూసి అసూయపడేదాన్ని. అప్పుడు నీవు, కరికాలన్ ఆమెతో మాట్లాడకూడదని కట్టడి చేశాను. ఆమె పాండ్యదేశానికి వెళ్ళిపోయిన తర్వాత కూడ నేను ఆమెపైగొన్న ఈర్ష్య, అసూయ, ఏవగింపు అలాగే నిలిచాయి. పళువూర్ ముసలాయనను పెళ్ళిచేసుకొని తిరిగి వచ్చిన తర్వాత ఎన్నోసార్లు ఆమెను పరిహసించి అవమానించాను. దానికంతా ప్రాయశ్చిత్తం చేసుకోవాలని తీర్మానించుకొన్నాను."

"ఎలా అక్కా? ఏం ప్రాయశ్చిత్తం?"

"మరొకసారి ఆమెను చూసినప్పుడు ఆమె కాళ్లమీద పడి నేను చేసిన తప్పులన్నిటినీ క్షమించగోరుతాను. అందుకు ఏ దండన/శిక్ష విధించినా భరిస్తాను."

"దాన్ని నేను అడ్డగిస్తాను. నీవే నేరమూ చేయలేదు. నీవు ఎవరినీ క్షమాపణ కోరనవసరం లేదు. ఈ పధ్నాలుగు లోకాల్లో నీకు శిక్ష విధించగలిగినవారు ఎవరూ లేరు. నీవు పళువూర్ రాణి నందినిని చూసి అసూయ పడలేదు. ఆమే నిన్ను చూసి ఈర్ష్యపడింది. ఆమే నిన్ను అయిష్టపడింది...."

"తమ్ముడూ! లంకలో పిచ్చిదానిలాగ తిరుగాడుతున్న మన పెద్దమ్మను చూసి నీవు కుమిలిపోయావని చెప్పావు. అంతఃపురంలో సకల సుఖభోగాలతో జీవించవలసిన నందిని జీవితంలో ఎలాంటి కష్టాలు పడిందన్న విషయం తలుచుకొన్నప్పుడు నా గుండె పేలిపోతుందనిపిస్తుంది. ఎవరో, ఎప్పుడో చేసిన తప్పుకు, నాకన్న ముందు పుట్టిన మన అక్క ఈ ముసలాడు పళువేట్టరయ్యర్ని పెళ్ళాడవలసి వచ్చింది..."

"అక్కా! ఇదంతా ఎలా జరిగివుండవచ్చని నీకేమైనా తోస్తూందా? మన పెద్దమ్మ చనిపోయిందని నాన్న అనుకోవడానికి కారణమేమి? నందిని అనాధలాగ ఎక్కడో, ఎవరింట్లోనో పెరిగి, ఈ స్థితికి రావడానికి కారణమేమి?"

"దాని గురించే నేను రాత్రింబగళ్ళు ఆలోచిస్తున్నాను. కానీ ఇంకా నిర్దుష్టంగా కనిపెట్టలేకపోతున్నాను. ఆ రహస్యాలు తెలిసినవారు మనకు తెలిసి ఇద్దరున్నారు. మన బామ్మ శెంబియన్ మహాదేవికి ఏవో కొన్ని రహస్యాలు తెలుసు. ముఖ్యమంత్రి అనిరుద్ధులకు అన్ని రహస్యాలూ తెలిసినట్లుంది. ఆ ఇద్దరినుంచి మనమేమీ రాబట్టలేము. అనిరుద్ధుల శిష్యుడు ఆళ్వార్ కట్టియాన్‌కి కొంతవరకు తెలిసేవుండాలి. అతడు గురువును మించిన శిష్యుడు; నోరు తెరవడు. తమ్ముడూ! అదంతా కనిపెట్టేందుకు ఇప్పుడు అవశ్యకత కూడ లేదు. నందిని వల్ల మన కులానికి విపరీతమైన అపాయమూ, అపకీర్తి కలగకుండ అడ్డుకోవడమే తక్షణ కర్తవ్యం. వంతిదేవులు చెప్పారు, పళువూర్ రాణి చేప చిహ్నం పొదిగిన, మెరుపులాగ మెరిసే ఒక ఖడ్గాన్నుంచుకొని పూజ చేస్తూందని. అది విన్నప్పటినుంచి నా మనసు మనసులో లేదు. తాను పుట్టిన కులం చోళకులం అని తెలియక పళువూర్ రాణి ఏదైనా చేయకూడని కార్యం చేసేస్తుందేమోనని దిగులుగా ఉంది..."

"పళువూర్ రాణికి అంతా చెప్పేస్తే...?"

"అందువల్ల ఏం ప్రయోజనముంటుందో తెలియదు. మనపైన ఆమె కోపం ఎక్కువ కావచ్చు కూడాను. కానీ మన కర్తవ్యాన్ని మనం నెరవేర్చవలసిందే!"

"అందుకు నీవు వంతిదేవులను పంపించింది సబబుగానే ఉంది. కానీ నాన్నగారికి కూడ తెలియజేయాలి కద? ఆయనెందుకు దైహిక అనారోగ్యం చాలదని మానసిక వేదన కూడ అనుభవించాలి?

మనం వెంటనే తంజావూరుకు బయల్దేరవచ్చు కదా?”

“కూడనే కూడదు, తమ్ముడూ! రెండురోజుల్లో నేను తంజావూరుకు బయల్దేరుతాను. కానీ నీవు మాత్రం ఈ చూడామణి విహారంలోనే ఇంకొంత కాలం ఉండాలి.”

“ఎందుకలా అంటున్నావు? తండ్రి ఆజ్ఞను మీరి నన్ను ఇక్కడే ఇంకా దాక్కొని కాలం వెళ్ళబుచ్చమంటున్నావా?”

“అవును; నీవిప్పుడు తంజావూరుకు వస్తే దేశమంతా అల్లకల్లోలమవుతుంది. ప్రజలు మధురాంతకుని మీద, పళువేట్టరయ్యర్ల మీద చాల కోపంగొని ఉన్నారు. నిన్ను చెరపట్టి బంధించి తీసుకొని రమ్మన్నందుకు చక్రవర్తిమీద కూడ కోపంగా ఉన్నారు. నిన్నిప్పుడు చూస్తే ప్రజల ఆవేశం పొంగి వరదలై పారుతుంది. దాని పరిణామాలెలా ఉంటాయో తెలియదు. నీకు వెంటనే పట్టం కట్టాలని కేకలేసినా వేయవచ్చు. తంజావూరు కోటను, అంతఃపురాన్ని చుట్టుముడతారు. ఇప్పటికే గాయపడ్డ మనసుతో బాధపడుతున్న తండ్రిగారి మనసు ఇంకా గాయపడుతుంది. తమ్ముడూ! రాజ్యానికి అపాయం మూడిందని నిన్ను నేను వెంటనే తిరిగి రమ్మని తాళపత్ర సందేశం రాసి పంపించాను. అదే కారణం వల్ల నీవిప్పుడు లంకకు తిరిగి వెళ్ళిపోతే మంచిదని అనుకొంటున్నాను...”

“అక్కా! అది ఏనాడూ జరగని పని. మన తండ్రిని చూడకుండ నేను తిరిగి వెళ్ళను. తంజావూరుకు నేను రహస్యంగా రావడం మంచిదని తోస్తే అలాగే చేస్తాను. కానీ నేను చక్రవర్తిని చూసే తీరాలి, ఆయనకు నన్ను కాపాడిన కావేరి తల్లి ఎవరని చెప్పాలి.”

“అదంతా నేనే సందర్భం చూసుకొని చెప్పేస్తాను. నీవు వచ్చే తీరాలా?”

“ప్రత్యక్షంగా చూసిన నేనే చెబితే నాన్నగారికి పూర్తి నమ్మకం ఏర్పడుతుంది; నా మనసుకూడ కుదుటపడుతుంది. పెద్దమ్మను పిలుచుకొని రావడానికి అనుమతి కూడ తీసుకొంటాను...”

“అరుళ్మొళి! నీ ఇష్టానికి నేనడ్డురాను. కానీ ఇంకా ఒకవారంపాటు చూడామణి విహారంలో ఉండు. నేను ముందు తంజావూరుకు వెళతాను. నీవు వచ్చిన విషయాన్ని తండ్రికి తెలియజేస్తాను. తమ్ముడూ! నేను నిన్నువెతుక్కొని ఇక్కడికి వచ్చింది నిన్ను చూసేందుకు మాత్రమే కాదు; నేను నిన్ను ఒక వరం కోరాలి. అది నెరవేర్చేస్తే తర్వాత నిన్ను ఇబ్బంది పెట్టను. అపాయాలకు భయపడి దాక్కొని ఉండమని కూడ చెప్పను. మగవాళ్ళు అపాయాలకు జంకకూడదు. వీర, శౌర్య పరాక్రమాలలో సాటిలేని మేటివని నీవు పేరు తెచ్చుకోవాలని కోరుకొంటున్నాను. అదే నా ఆశ. కానీ నీవు మళ్ళీ అపాయాలనెదుర్కొనే ముందు నా కోరికను నెరవేర్చాలి...”

“అక్కా! ఎందుకింత పెద్ద పీఠిక/ఉపోద్ఘాతం? నేనెప్పుడైనా నీ కోరికను నిరాకరించానా?”

“లేదు. ఆ నమ్మకంతోనే ఇప్పుడు అడుగుతున్నాను. ఆదిత్య కరికాలన్ ఇంకా పెళ్ళి చేసుకోలేదు; పెళ్ళి చేసుకొంటాడని కూడ అనిపించడం లేదు. సుందర చోళ చక్రవర్తి వంశం నీమూలంగానే

వర్ధిల్లాలి. ఈ ఒక్క విషయంలో నా కోరికను నీవు నెరవేర్చాలి...”

“నీ కోరికను నెరవేర్చడానికి నేనొప్పుకొంటే, నాకు నచ్చిన అమ్మాయిని నేను పెళ్ళాడేందుకు సమ్మతిస్తావు కదూ?”

“ఇదేం ఇలా అడుగుతున్నావు? ఇరవైయేళ్ళుగా మన కోరికలు మారలేదు. ఇందులో మాత్రం ఎందుకు ప్రత్యేకంగా అనుమతి కోరుతున్నావు?”

“అక్కా! అందుకు కారణముంది. నేను పెళ్ళాడే అమ్మాయి నా పగటి కలలు నెరవేరేందుకు తోడుగా ఉండాలి కద?”

“తమ్ముడూ! నీ పగటి కలలను ఒక అమ్మాయి సహాయంతోనా నెరవేర్చుకోజూస్తున్నావు?” అన్నది కుందవై.

ఆ సమయాన, “అయ్యో! అయ్యో! అక్కా! అక్కా!” అన్న ఆర్తనాదం వినవచ్చింది. అది వాణతి చేసిన ఆర్తనాదమే.

~~~
~~~

# అధ్యాయము - 46

## వాణతి నవ్వింది

నంది మంటపంలో యువరాజు, కుందవైదేవి కూర్చొని మాట్లాడుతుండగా వాణతి స్తంభం చాటున నిలబడి వింటున్నప్పుడు, కాలువలోని పడవలో పూంగుళలి, సేందన్ అముదన్ మధ్య ఒక ముఖ్యమైన సంభాషణ కొనసాగుతూంది.

“అముదా! నిన్ను నేనొక నిజాన్ని అడగబోతున్నాను. నిజమైన ఉత్తరం ఇస్తావా?” అన్నది పూంగుళలి.

“నిజం తప్ప నా నోట ఇంకేమీ రాదు. పూంగుళలీ! అందువల్లనే నేను ఎవరినీ చూడక, మాట్లాడకున్నాను" అన్నాడు సేందన్.

“కొంతమంది నోట నిజమనేదే రాదు. యువరాజుకు తాళపత్రం తీసుకొని లంకకు వెళ్ళాడే, ఆ వంతిదేవుడు అలాంటివాడే.”

“అయినాకూడ అతడు చాల మంచివాడు. అతడు ఎవరిని చెరిపేందుకూ అబద్ధాలు చెప్పలేదు.”

“నిన్ను గురించి అతడొకటి చెప్పాడు. అది నిజమా, అబద్ధమా అని తెలుసుకోగోరుతున్నాను.”

“అతడు నా గురించి నిజం కానిదేదీ చెప్పనవసరం లేదు. అయినా కూడ, అతడేం చెప్పాడో చెప్పు!”

“నీవు నన్ను చాల పొగుడుతూ మాట్లాడావని చెప్పాడు.”

“అది పూర్తిగా నిజం.”

“నీవు నాపై ఆశగొన్నావని చెప్పాడు. నీవు నన్నుపెళ్ళాడగోరుతున్నావని చెప్పాడు...”

“అతడు నిజంగా అలా అన్నాడా?”

“అవును, అముదా!”

“అతడికి నా కృతజ్ఞతలు చెప్పకోవాలి.”

“ఎందుకని?”

“నేనే నా మనసు విప్పి నీకు చెప్పేవాడిని కాను; నాకంత ధైర్యం లేదు. నాకోసం నీ దగ్గర రాయబారం చేశాడు కదా? అందుకని అతడికి కృతజ్ఞత చెప్పకోవాలి.”

“అలాగైతే అతడు చెప్పింది నిజమేనా?”

“నిజమే, పూంగుళలీ! అందులో సందేహం లేదు.”

“నీకు నామీద ఎందుకాశ పుట్టింది, అముదా?”

"ప్రేమ కలిగేందుకు కారణం చెప్ప సాధ్యమా?"

"ఆలోచించి చెప్పు. ఏదైనా ఒక కారణం ఉండకపోతుందా?"

"ప్రేమ ఎందుకు పుడుతుంది, ఎలా పుడుతుంది అని ఇంతవరకు ఎవరూ కనిపెట్టలేదు, పూంగుళలీ!"

"ఒకరినొకరి అందాన్ని చూసి ఆశపడడం లేదా?"

"అందం చూసి ఆశపడడం ఉంది; మోహించడమూ ఉంది. కానీ అది నిజమైన ప్రేమ అని చెప్పలేము. అది కలకాలం ఉండదు. కాసేపటి క్రితం వంతిదేవుని గురించి చెప్పావు కద? అతడికి నన్ను చూడగానే స్నేహభావం కలిగింది. అతని కోసం నా ప్రాణమైనా ఇచ్చేందుకు నేను సిద్ధం. నా అందం చూసా అతడు నాపట్ల స్నేహభావంగొన్నాడు?"

"కానీ నీ స్నేహితుడు నా అందాన్ని చాల, చాల గొప్పగా వర్ణించాడు కద?"

"నీ అందాన్ని వర్ణించాడు. కానీ నీపై ఆశగొనలేదు. పళువూర్ రాణి గురించి వందరెట్లు గొప్పగా వర్ణించాడు. ఆమె పైన కూడ అతడికి ఆశగాని, ప్రేమగాని లేదు."

"అందుకు కారణం నాకు తెలుసు."

"ఏమది?"

"అదిగో యువరాజుతో మాట్లాడుతున్న యువరాకుమారి మీదే ఆ వీరుని మనసు నిలిచింది. అదే కారణం."

"దీన్నుంచే అందానికి, ప్రేమకు సంబంధం లేదని తెలుస్తోంది కద?"

"అదెలా సాధ్యం? యువరాకుమారి కన్న నేను అందగత్తెనంటున్నావా?"

"అందులో సందేహమేమి, పూంగుళలీ! పళైయార్రై యువరాకుమారి కన్న, అదిగో ఆ స్తంభం వెనుక నిలబడ్డ కొడుంబాళూర్ రాకుమారి కన్న నీవు ఎన్నో రెట్లు అందగత్తెవి. మోహిని అవతారమని పలువురు పొగడే పళువూర్ యువరాణి అందం కూడ నీ అందానికి సాటి రాదు. ఇటువంటి దేవతా సౌందర్యమే నాకిప్పుడు శత్రువైంది. అందుకనే నా మనసులో పొంగి పొర్లే ప్రేమను నీ ముందు వ్యక్తపరచలేకపోయాను. దేవలోకంలోని దేవతలు, భూలోకంలోని రాజాధిరాజులు వరించగల సౌందర్యవతివైన నీవు నాకెక్కడ దొరకబోతున్నావు అన్న భీతి నా మనసులో గూడు కట్టుకొంది."

పూంగుళలి కాసేపు దీర్ఘాలోచనలో మునిగిన తర్వాత, "అముదా! నీపైన నాకు ఆశ లేదు అని నేనంటే నీవేం చేస్తావు?" అని అడిగింది.

"కొన్ని రోజులు ఓపిగ్గా ఉంటాను. నీ మనసు మారుతుందేమోనని చూస్తాను."

"అదెలా మారుతుంది?"

"మనుషుల మనసు విచిత్రమైనది. కొన్నిసార్లు మన మనసు లోతుల్లోని ఆలోచనలు మనకే

తెలియదు. పలు కారణాల వల్ల మనసు భ్రమలో మునిగివుంటుంది. భ్రమ తొలగిన తర్వాత నిజం మనసుకు తెలిసి వస్తుంది..."

"సరే; ఓపిక పట్టి చూస్తావు. అప్పటికీ నా మనసు మారకపోతే....?"

"నీపైన నేను పెంచుకొన్న ఆశను పోగొట్టుకోజూస్తాను..."

"అది వీలవుతుందా?"

"ప్రయత్నిస్తే వీలవుతుంది. మనసును దేవుని పైన మళ్ళిస్తే సాధ్యమవుతుంది. మన పెద్దలు అలా భగవంతునిపైన భక్తిగొనే మనసును కట్టుబాటు చేసుకొన్నారు..."

"అముదా! నీకు నాపైనున్నది నిజమైన ప్రేమ అని నాకనిపించడం లేదు."

"ఎందుకలా అంటున్నావు? నిజమైన ప్రేమకు గుర్తులేవి/ఆనవాళ్ళేవి?"

"నీకు నాపైన నిజమైన ప్రేమ ఉంటే, నేను నిన్ను తిరస్కరించిన వెంటనే నన్ను చంపేయాలనిపించాలి. నేను ఇంకెవరిమీదనైనా ప్రేమగొనివుంటే వారిని కూడ చంపాలనిపించాలి నీకు."

"పూంగుళలీ! నాకు నీపైనున్న ప్రేమ సాత్విక గుణం కలిగిన ప్రేమ. నీవు చెబుతున్నది అసురగుణం కలిగిన ఆశ. పైశాచిక గుణం కలిగిందని కూడ చెప్పవచ్చు."

"దైవత్వాన్నీ నేనెరుగను;  పైశాచికాన్నీ నేనెరుగను. మనుష్య స్వభావం మాత్రమే నేనెరుగుదును. ప్రేమ వల్ల సుఖం కలగాలి. అందుకు బదులు దు:ఖం కలిగితే ఎందుకు సహించాలి? మనం ఒకరిని ప్రేమిస్తే, వారందుకు బదులుగా మనకు ద్రోహం చేస్తే ఎందుకు సహించాలి? పగ తీర్చుకోవడమే కద మానవ స్వభావం?"

"లెదు, పూంగుళలి! పగ తీర్చుకోవడం మనుష్య స్వభావం కాదు. అది రాక్షస స్వభావం. మనకు ఒకరిపైన ప్రేమ కలిగితే, అది నిజమైన ప్రేమైతే, వారి సంతోషం మనకూ సంతోషాన్నివ్వాలి. వారు మనని తిరస్కరిస్తే, అది మొదట కాస్త వేదననిస్తుంది, నిజమే. దాన్ని ఓర్చుకొని బదులుగా మంచి చేస్తే, తర్వాత మనకు పది రెట్లు సంతోషాన్నిస్తుంది...."

"నీవు చెబుతున్నది మనుష్య స్వభావమే కాదు. అది మనుషులకు సాధ్యమయ్యే పనే కాదు. వంతిదేవునితోబాటు ఒక వైద్యకుమారుడు వచ్చాడు. వాడు నన్ను చూసిన వెంటనే నాపై ఆశగొన్నాడు. అది నెరవేరదని తెలిసిన వెంటనే, వాడి ఆశ నెరవేరడానికి అడ్డుగా నిలిచినట్లు వాడికి తోచిన వంతిదేవుని పళువేట్టరయ్యర్ మనుషులకు పట్టివ్వడానికి ప్రయత్నించాడు. నన్ను కూడ వాడు చంపేసేందుకు ప్రయత్నించి ఉండేవాడే...."

"అలాగైతే వాడు మనుష్యజాతికి చెందినవాడు కాడు. క్రూరమైన అసురజాతికి చెందినవాడు."

"అదిగో, ఆ కొడుంబాళూర్ రాకుమారి తన మనసును పొన్నియిన్ సెల్వన్‌కి ఇచ్చేసింది. ఆయన ఆమెను అంగీకరించకపోతే ఆమె ఏం చేస్తుంది? తప్పకుండ పొన్నియిన్ సెల్వన్‌కి విషమిచ్చి

చంపజూస్తుంది. ఆయన మనసును ఇంకే అమ్మాయయినా ఆకట్టుకొందని తెలిస్తే ఆమెను కూడ చంపజూస్తుంది....”

“అలా ఏనాడూ జరుగుతుందని నేననుకోను, పూంగుళలీ! సాత్విక గుణమే రూపుదాల్చిన వాణతి అలా చేయ ప్రయత్నించదు...”

“కావచ్చు; కానీ నేనైతే అలాగే చేయ ప్రయత్నించేదాన్ని.”

“నిన్ను దైవం మన్నించి కాపాడాలని ప్రార్థిస్తాను.”

“దేవుడేమిటి నన్ను మన్నించడం? నేనే దేవుడిని మన్నించాలి!”

“నీ దైవాపచారాన్ని కూడ దేవుడు మన్నిస్తాడు!”

“అముదా! నీవు ఉత్తముడివి. నా పెద్దత్త గుణాన్ని పుణికి పుచ్చుకొని పుట్టావు....”

“అదేమిటి? ఉన్నట్లుండి ఏదో ఒక కొత్త విషయం చెబుతున్నావే?”

“నా పెద్దత్త చనిపోయిందని మన కుటుంబమంతా చెబుతున్నారు కదా?”

“ఎవరి గురించి చెబుతున్నావు? నా తల్లికి, నీ తండ్రికి తోడబుట్టిన మొదటి సహోదరి గురించేనా?”

“అవును, ఆమె నిజంగా చనిపోలేదు.”

“నేనూ అలాగే చూచాయగా విన్నాను...”

“ఆమె లంకలో ఇప్పుడు కూడ పిచ్చిదానిలాగ తిరుగాడుతోంది....”

“కుటుంబ శాపానికి ఎవరేం చేయగలరు?”

“ఆమె ఇప్పుడు పిచ్చిదానిలాగ తిరుగాడుతుండడానికి కుటుంబశాపం మాత్రమే కారణం కాదు. చోళకులానికి చెందిన ఒకరి నమ్మకద్రోహమే అందుకు కారణం.”

“ఏమేమి?”

“లేత వయసులో నా అత్త లంకకు దగ్గరున్న ఒక దీవిలో నివసించేది. ఆమెను చోళ రాజకుమారుడొకడు ప్రేమించినట్లు నటించాడు. ఆమె నమ్మేసింది. తర్వాత ఆ రాజకుమారుడు యువరాజు పట్టం కట్టుకొన్న వెంటనే ఆమెను తిరస్కరించేశాడు.”

“ఇదంతా నీకెలా తెలిసింది, పూంగుళలీ?”

“నా మూగ అత్త సైగ భాష మూలంగానే తెలుసుకొన్నాను. ఇంకొక విషయం కూడ చెబుతాను, విను! కొన్ని రోజుల క్రితం పాండ్య దేశస్థులు కొందరు ఇక్కడికి వచ్చారు. నా అత్తను వంచించి మోసం చేసిన చోళ వంశస్థుల మీద పగ తీర్చుకోవడానికి నా సహాయం కోరారు. అప్పుడే నా అత్త కథ తెలుసుకొన్న నా రక్తం ఉడికింది. వారితో చేరిపోవాలనే తీర్మానించుకొన్నాను. కానీ అప్పుడు నా పెద్దత్త మనసు పోకడ తెలుసుకొని నా మనసు కూడ మార్చేసుకొన్నాను. ఆమె తనకు ద్రోహం చేసినవాడిని మన్నించడమేగాక,

అతనికి ఇంకొక భార్యవల్ల కలిగిన కుమారుని చాలసార్లు కాపాడిందని తెలుసుకొన్నాను. తర్వాత పాండ్య దేశస్థులతో చేరే ఉద్దేశాన్నే మార్చేసుకొన్నాను. నీవు చెబుతున్నట్లు, నా అత్త ప్రేమ దైవప్రేమే. కానీ నా అత్తలాగ నేనుండను…"

"మరి, ఏం చేస్తావు?"

"నన్ను ఏ రాజకుమారుడైనా ప్రేమించి, తర్వాత మోసం చేస్తే వాడి పైన పగ తీర్చుకొంటాను. వాడినీ చంపుతాను; వాడి మనసును నానుంచి అపహరించిన దాన్ని కూడ చంపుతాను. తర్వాత కత్తితో పొడుచుకొని నేనూ చచ్చిపోతాను!"

"భగవాన్! ఎంతటి భయంకరమైన మాటలు మాట్లాడుతున్నావు!"

"అముదా! రెండేళ్ళుగా నా మనసులో రేగుతున్నా దావానలాన్ని నీవెరుగవు. అందువల్ల ఇలాంటి సాత్విక ఉపదేశం చేస్తున్నావు."

"నీ అత్తకు లేని కోపాగ్ని నీకెందుకు?"

"అది నా అత్త సంగతి; ఇది నా విషయం!"

"నీ విషయమా? నిజంగానా, పూంగుళలీ? కాస్త నిదానంగా ఆలోచించి చెప్పు!"

"అవునముదా! నా శరీరం నుంచి కాస్త రక్తాన్ని, ఆ వాణతి శరీరం నుంచి కాస్త రక్తాన్ని తీసుకొని పోల్చి చూస్తే, ఏదైనా తేడా కనిపిస్తుందా?"

"ఏ మాత్రం తేడా ఉండదు!"

"ఆమె ఏ విషయంలోనైనా నాకన్న మిన్నా? బుద్ధిలో, రూపంలో?"

"దేనిలోను నీకన్న మిన్న కాదు; నీవు అలల కడలిలో పెరిగినదానివి. ఆమె అంతఃపురంలో పెరిగింది. నీవు అడవి మృగాలను ఒట్టి చేతులతోనే చంపగలవు; సుడిగాలి వీస్తున్నప్పుడు కూడ సముద్రంలో పడవ నడుపుతావు. కడలిలో మునిగిపోతున్నవారికి చేయూతనిచ్చి కాపాడుతావు! వాణతేమో కడలి అలలను చూస్తేనే భయపడుతుంది; ఇంటి పిల్లిని చూసి భయంతో కేకలేస్తుంది; ఏదైనా దుర్వార్త వింటే మూర్ఛపోతుంది!"

"అలా ఉన్నప్పుడు యువరాకుమారి నన్నెందుకు చులకనగా చూస్తుంది? వాణతిని అంత ముదిగారం చేయనేల?"

"పూంగుళలి! నీవు యువరాకుమారి మీద నిష్కారణంగా నింద మోపుతున్నావు. వారికి వాణతి చిరకాల స్నేహితురాలు. నీవు ఆమెకు ఇప్పుడే కద పరిచయమైనావు? యువరాజును కడలిలో మునిగిపోకుండ కాపాడినందుకు ఎంతగానో కృతజ్ఞతలు చెప్పకోలేదా?"

"హుఁ! ఆ అంతఃపుర మహారాణి కృతజ్ఞతలు ఎవరిక్కావాలి? అముదా! యువరాజును మళ్ళీ పడవలో బౌద్ధ విహారానికి తీసుకొని వెళ్ళి చేర్చాలంటే, నీవు మాత్రం వెళ్ళు! నేను వస్తే, ఒకవేళ కావాలనే

పడవను బోల్తా కొట్టించేస్తానేమో..."

"నీవాలా ఎన్నడూ చేయవు, పూంగుళలీ! యువరాజేం నేరం చేశారు, ఆయనెక్కిన పడవను తలకిందులు చేసేందుకు?"

"అముదా! నాకు పిచ్చి పట్టింది. నా చిత్తం/మనసు నా స్వాధీనంలో లేదు. నా అత్తకు వీరి తండ్రి చేసిన ద్రోహాన్ని తలుచుకొని, పడవను ముంచేస్తానేమో. నీవే పడవను నడుపుకొని వెళ్ళు!"

"అలాగే. నేనే యువరాజును తీసుకొని వెళ్ళి విడిచిపెట్టి వస్తాను. నీవేం చేస్తావు?"

"నేను వాణతి వెన్నంటి వెళ్ళి, దాని తలపైన ఒక పెద్ద రాతిబండను పడేస్తాను!"

~

ఇలా చెబుతూనే పూంగుళలి వంగి కాలువ గట్టునున్న ఒక చిన్న గుండ్రాయిని చేతికి తీసుకొంది. ఆ సమయాన కాలువ పక్కన దట్టంగా పెరిగిన కొబ్బరి తోపునుంచి గంభీరమైన రాజ వృషభమొకటి బయటకు వచ్చింది. అది చూసిన పూంగుళలి తన కోపాన్ని దానిపైన చూపదలచి గుండ్రాయిని దానిమీదికి విసిరింది.

ఆ రాయి వృషభరాజు నెత్తికి తగిలింది.

ఆ వృషభం ఒక్కసారి ఒంటిని విదిలించుకొంది. రాయి వచ్చిన దిశగా గుచ్చి చూసింది.

"అయ్యో! పూంగుళలీ! ఇదేం పని? పశువు పైన రాయి విసరవచ్చా?" అన్నాడు సేందన్ అముదన్.

"విసిరితేనేమి?"

"నోరులేని జీవి కద? దానికి తనని కాపాడుకోవడం కూడ తెలియదు కద?"

"నా కుటుంబంలో నోరులేని మూగది ఒకతె ఉండేది! ఆమె మనసును గాయపరచిన వారిని ఏం చేయాలి? ఆమె తనని తాను కాపాడుకోలేకుండపోయినందువల్లనే కద రాకుమారుడొకడు ఆమెను వంచించి ఆమె జీవితాన్ని పాడు చేశాడు?"

"నీ అత్తకు ఎవరో చేసిన కీడుకు పాపం ఈ వృషభం మీద నీ కోపాన్నెందుకు చూపించాలి?"

"ఈ పశువేమీ అలాంటి కిరాతక ప్రాణికాదు. దీనికి (పదునైన) కొమ్ములున్నాయి. తనమీదికి వచ్చేవారిని తన కొమ్ములతో కుమ్మగలదు. చెవిటిది, మూగది అయిన ఒక లోకం తెలియని పిల్ల ఏం చేయగలదు? నా పట్ల ఏ రాకుమారుడైనా అలా నడుచుకొంటే నేనంత సులభంగా వదిలిపెట్టను!"

"సులభంగా వదిలిపెట్టవు! కోడెగిత్త మీద రాయి విసురుతావు! అది కూడ పడవలో కూర్చొని! ఆ వృషభం ఇక్కడికొచ్చి నిన్ను కుమ్మలేనట్లు!"

"నన్ను కుమ్మలేకపోతే ఇంకెవరినైనా కుమ్మనీ!"

"నీకెవరిపైనో ఉన్న కోపాన్ని ఈ పశువుపైన చూపించడమెందుకు?"

వీరి సంభాషణను ఆ వృషభమేమో అర్థంచేసుకోలేకపోయింది. కానీ పూంగుళలి చెప్పినట్లే ఇంచుమించు చేసేసింది.

కాలువలో దిగి పడవలో ఉన్న పూంగుళలి మీద తన కోపాన్ని చూపలేకపోయింది. వెనుదిరిగి దూకుతూ పరుగెత్తింది. ఆ సమయాన వాణతి కొబ్బరితోపు అవతలివైపున్న పల్లకి దిశగా ఒంటరిగా నడిచి వెళుతూంది. ఆమె మనసు కుతూహలంతోను, ఉత్సాహంతోను తుళ్ళిపడుతూంది. ఎదురుగా వేగంగా వస్తున్న వృషభాన్ని చూడగానే మొదట ఆమె కుతూహలం అధికమైంది. కానీ అది తలవంచి కొమ్ములను ముందుకు చాచి తోకను పైకెత్తి తనవైపే రావడం చూడగానే భయపడిపోయింది. కాలువ గట్టువైపు తిరిగి రావడం తప్ప వేరే దారి లేదు. నంది మంటపానికి సమీపాన కాలువ తీరానికి వచ్చేసింది. తర్వాత ముందుకు వెళ్ళలేకపోయింది. ఎందుకంటే, గట్టునుంచి కాలువ చాల పల్లంలో ఉంది. గట్టు వెంబడి నంది మంటపానికి వద్దామని వెనుదిరిగింది. అప్పటికి వృషభం ఆమెకు చాల దగ్గరగా వచ్చేసింది. వెనక్కి వెనక్కి జరిగి కాలువలో పడిపోవడం తప్ప వేరే దారే లేదు. అప్పుడే, “అయ్యో! అయ్యో! అక్కా! అక్కా!” అని ఆమె కేకలేసింది.

వాణతి ఆర్తనాదమే కుందవైదేవికి, పొన్నియిన్ సెల్వన్‌కి వినిపించింది.

~

వారిద్దరూ అదిరిపడి వాణతి ఆర్తనాదం వినవచ్చిన దిశగా చూశారు. వారున్న నంది మంటపానికి సమీపాన కాలువ గట్టు ఎత్తుగా ఉన్న చోటున వాణతి కనిపించింది. ఆమె వెన్ను కాలువ వైపుంది. ఆమె తనకెదురుగా ఒక భయంకరమైన వస్తువునో, దృశ్యాన్నో చూస్తున్నట్లు అనిపించింది. ఆమెకు అంతగా భీతిగొల్పినదేమని వెంటనే తెలిసిపోయింది. “అంబా!” అని పెద్దగా అరుస్తూ ఆమెకెదురుగా వృషభరాజం కనిపించింది.

వాణతి ఇంకొక్క అడుగు వెనకేస్తే కాలువలో పడిపోతుంది. వెనక్కి జరగడం తప్ప ఆమెకింకేమీ దారిలేదు. ఇదంతా అరుళ్మొళి వర్మ చూసిన తక్షణమే గ్రహించాడు. వెంటనే నంది మంటపం మెట్లపైనుంచి కాలువలోకి మెరుపులాగ దూకాడు. వాణతి కాలువగట్టు పైనుంచి పడేందుకు, అరుళ్మొళి పరుగెత్తి వెళ్ళి అక్కడకు వెళ్ళి చేరడానికి సరిగ్గా సరిపోయింది. వాణతి తలకిందులుగా కాలువలో పడిపోకుండ రెండు చేతులు చాచి ఆమెను పట్టుకొన్నాడు.

వాణతికి కలగబోయిన అపాయాన్ని తలుచుకొని కుందవైదేవి మనసు తల్లడిల్లిపోయింది. మరుక్షణం అరుళ్మొళి ఆమెను తన చేతులు చాచి కాపాడింది చూడగానే ఆనందసముద్రంలో మునిగిపోయింది.

~

ఖడ్గ, శూల విన్యాసాలతో వజ్రాయుధంలాగ గట్టిపడ్డ చేతుల్లో వాడిపోయిన తీగలాగ ఉన్న

వాణతిని ఎత్తుకొని అరుళ్మొళి వర్మ కుందవై దగ్గరకొచ్చాడు.

"అక్కా! ఇదిగో, నీ చెలికత్తెను తీసుకో! కొడుంబాళూర్ వీరవేళార్ కులంలో ఈ పిల్ల ఎలా పుట్టిందో తెలియదు!" అన్నాడు.

"తమ్ముడూ! ఇదేం పని చేశావు? పెళ్ళికాని పిల్లను నీవెలా తాకవచ్చు?" అన్నది కుందవై.

"భగవాన్! ఇదొక నేరమా? మరి, ఈమె కాలువలో తలకిందులుగా పడి మునిగిపోయివుండాలంటున్నావా? మంచివేళగా ఈమెకు నేను నా చేతుల్లోకి తీసుకొని కాపాడిన విషయం తెలియదు. పడేటప్పుడే మూర్ఛిల్లిపోయింది! ఇదిగో, పట్టుకో!" అన్నాడు అరుళ్మొళి.

వాణతి గలగలమని నవ్వింది. నవ్వుతూనే అతని చేతులనుంచి విడిపించుకొని నేలమీదికి దూకింది.

"ఒసే దొంగా! నీవు స్పృహలోనే ఉన్నావా?" అన్నది కుందవై.

"కళ్ళుమూసుకొని మూర్ఛపోయినట్లు ఎందుకు నటించిందో అడుగక్కా!" అన్నాడు పొన్నియిన్ సెల్వన్.

"నేనేమీ నటించలేదక్కా! ఈయన నన్ను ముట్టగానే నాకు సిగ్గొచ్చేసింది. అందుకే సిగ్గుతో కళ్ళుమూసుకొన్నాను!" అన్నది వాణతి.

"అది నాకెలా తెలుసు? మూర్ఛపోవడం నీ స్నేహితురాలికి అలవాటు కద?"

"ఇకమీదట నేను మూర్ఛపోను; అలా పడిపోయినా ఈయన ఉన్నచోట పడిపోనక్కా! ఈ రోజు నేను వీరికి చేసిన సహాయం ఎన్నటికీ మరువకుండనీ!" అన్నది వాణతి.

"ఏమేమి! ఈమె నాకు సహాయం చేసిందా? భలేవుందే!" అన్నాడు అరుళ్మొళి వర్మ.

కుందవై కూడ కాస్త ఆశ్చర్యంతో వాణతిని చూసి, "ఏమే అంటున్నావు? నా తమ్ముడు నీకు చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువనంటున్నావా?" అన్నది.

"లేదు, లేదక్కా! నేనే మీ తమ్ముడికి పెద్ద ఉపకారం చేశాను. అందుకు ఆయన నాకు ఎన్నటికీ కృతజ్ఞులైవుండాలి!"

"నేను ఈమె కాలువలో పడిపోకుండ కాపాడినందుకు నేనే ఈమెకు కృతజ్ఞత చెప్పుకోవాలా? నీ స్నేహితురాలికి ఏమైనా పిచ్చి పట్టిందా, అక్కా?" అన్నాడు పొన్నియిన్ సెల్వన్.

"నా చిత్తం సరిగానే ఉంది. ఈయనకే మనసు సరిగా లేదు. అర్థమయ్యేలా చెబుతాను. ఈయన చిన్నప్పుడు కావేరి నదిలో పడిపోయారని, ఒక స్త్రీ ఈయనను నదిలో మునిగిపోకుండ ఎత్తి కాపాడిందని మీరు చెప్పారు. మళ్ళీ ఈయన సముద్రంలో పడి ఉక్కిరిబిక్కిరైపోయారు. అక్కడకూడ ఒక పడవ నడిపే పిల్ల వచ్చి ఈయనను కాపాడింది. ఇలా స్త్రీలవల్ల కాపాడబడడమే ఈయనకు అలవాటైపోయింది. ఆ అపకీర్తి మాసిపోయేందుకు నేను ఈయనకు సహాయం చేశాను. కాలువలో పడబోయిన ఒక అమ్మాయిని ఈయన

కాపాడారన్న పేరు ఈయనకు వచ్చేటట్లు సహాయం చేశాను కద? అందుకే ఈయన నాపట్ల ఎన్నటికీ కృతజ్ఞులై ఉండాలి కద?”

ఇలా చెప్పి వాణతి మళ్ళీ నవ్వింది. అది విన్న కుందవై కూడ నవ్వింది. పొన్నియిన్ సెల్వన్ కూడ నవ్వాపుకోలేక నవ్వేశాడు.

వారు ముగ్గురూ అలా నవ్విన నవ్వుల శబ్దం నంది మంటపాన్ని దాటి, ఆకాశాన్నంటి ప్రతిధ్వనించింది.

పడవలో ఉన్నవారి చెవిన కూడ ఆ నవ్వుల శబ్దం పడింది. “అముదా! ఆ ముగ్గురు పిచ్చివాళ్ళు నవ్వడం విన్నావా?” అని చెప్పేసి పూంగుళలి కూడ నవ్వింది.

కొబ్బరితోటలో నివసిస్తున్న పక్షులు కూడ కిలకిలా నవ్వాయి.

ఇంతసేపూ కాలువ గట్టుమీద గంభీరంగా నిలబడ్డ కోడెగిత్త కూడ ఒక హుంకారం చేసి నవ్వేసి వెళ్ళింది.

కడలి అలలు గంభీరంగా నవ్వాయి.

కడలి మీదుగా వీస్తున్న చల్లగాలి కూడ మెత్తగా నవ్వింది.

~~~

[ఇంతటితో 'పొన్నియిన్ సెల్వన్  మూడవ భాగం సమాప్తం]
~~~